# మార్క్స్, ఎంగెల్స్



# పారిస్ కమ్యూన్ గురించి

సకల దేశాల కార్మికులారా, ఏకంకండి!

# మార్క్స
# ఎంగెల్స

---

# పారిస్
# కమ్యూన్
# గురించి

"ప్రగతి" ప్రచురణాలయం
మాస్కో, 1979

అనువాదం: విడమర్తి ఉమారాజేశ్వరరావు

**К. Маркс и Ф. Энгельс**

**О ПАРИЖСКОЙ КОММУНЕ**

*На языке телугу*

307.7
C 9407
2240
03/01/2020

© తెలుగు అనువాదం "ప్రగతి" ప్రచురణాలయం 1979

సోవియట్ యూనియన్‌లో ముద్రింపబడింది

МЭ $\frac{10101-097}{016(01)-79}$ 804—79 0101010000



కార్ల్ మార్క్స్



ఫ్రెడరిక్ ఎంగెల్స్

# విషయసూచిక

పీఠిక . . . . . . . . . . . . . . . . 9

మొదటి భాగం

కార్ల్ మార్క్స్

ఫ్రాన్సులో అంతర్యుద్ధం.

ఫ్రెడరిక్ ఎంగెల్స్. ఉపోద్ఘాతం . . . . . . . . . . 23

కార్ల్ మార్క్స్. ఫ్రెంచి-ప్రష్యన్ యుద్ధంపై ఇంటర్నేషనల్ వర్కింగ్ మెన్స్ అసోసియేషన్ జనరల్ కౌన్సిలు మొదటి విజ్ఞప్తి . . . 38

కార్ల్ మార్క్స్. ఫ్రెంచి-ప్రష్యన్ యుద్ధంపై ఇంటర్నేషనల్ వర్కింగ్ మెన్స్ అసోసియేషన్ జనరల్ కౌన్సిలు రెండవ విజ్ఞప్తి . . . 44

కార్ల్ మార్క్స్. ఫ్రాన్సులో అంతర్యుద్ధం . . . . . . . . . 53

I. . . . . . . . . . . . . . . . 53

II. . . . . . . . . . . . . . . . 66

III. . . . . . . . . . . . . . . . 75

IV. . . . . . . . . . . . . . . . 94

వ్యాఖ్యలు . . . . . . . . . . . . . 110

I. . . . . . . . . . . . . . . 110

II. . . . . . . . . . . . . . . 112

కార్ల్ మార్క్స్. "ఫ్రాన్సులో అంతర్యుద్ధం" సంక్షిప్త పాఠాలు . . 115

"ఫ్రాన్సులో అంతర్యుద్ధం" మొదటి సంక్షిప్త పాఠం . . . . 115

రక్షణ ప్రభుత్వం . . . . . . . . . . . . . . . . 115

కమ్యూన్ . . . . . . . . . . . . . . . . . . 159

1. కార్మికవర్గం కోసం చర్యలు . . . . . . . . 159
2. కార్మికవర్గం కోసం చర్యలు, కాని ఎక్కువ భాగం మధ్యతరగతులకు . . . . . . . . . . . . 161
3. సాధారణ చర్యలు . . . . . . . . . . . . 162
4. ప్రజాభద్రతా చర్యలు . . . . . . . . . . 164
5. ఆర్థిక చర్యలు . . . . . . . . . . . . 167

కమ్యూన్ . . . . . . . . . . . . . . . . . . 168

కమ్యూన్ ప్రాదుర్భావం, కేంద్ర కమిటీ . . . . . . . 168

కమ్యూన్ స్వభావం . . . . . . . . . . . . . . 172

రైతాంగం . . . . . . . . . . . . . . . . . 181

రిపబ్లికన్ యూనియన్ (లీగు) . . . . . . . . . . 185

ఇతరుల శ్రమపై జీవించని అన్ని సామాజిక వర్గాల ప్రతినిధిగా కమ్యూన్ విప్లవం . . . . . . . . . . 186

రిపబ్లిక్ బాహాటంగా గుర్తింపబడిన సాంఘిక రిపబ్లిక్‌గా మాత్రమే సాధ్యం . . . . . . . . . . . . . 187

కమ్యూన్ (సాంఘిక చర్యలు) . . . . . . . . . . 189

"భూస్వాముల సభ" వికేంద్రీకరణ ఆకాంక్షలూ, కమ్యూనూ . . 194

ఖండికలు . . . . . . . . . . . . . . . . . 200

"ఫ్రాన్సులో అంతర్యుద్ధం" రెండవ సంక్షిప్త పాఠం . . . . . . 211

1) రక్షణ ప్రభుత్వం. పారిస్ ప్రతినిధులుగా ట్రోషూ, ఫ్రావ్, పికార్డ్, ఫెర్రీలు . . . . . . . . . . . 211
2) త్యేర్. దుఫార్. పుయ్యే-కర్ట్యే . . . . . . . . 216
3) "భూస్వాముల సభ" . . . . . . . . . . . 220
5) అంతర్యుద్ధారంభం. మార్చి 18 నాటి విప్లవం. క్లెమాన్ టొమా. లెకాంట్. వెండొమ్ చౌకు సంఘర్షణ . . . . . 223
6) కమ్యూన్ . . . . . . . . . . . . . . 233
7) ముగింపు . . . . . . . . . . . . . . 240

ఖండికలు . . . . . . . . . . . . . . . . 243

రెండవ భాగం

## ఉపన్యాసాలు, వ్యాసాలు, పత్రాలు


జాతీయ రక్షణ ప్రభుత్వంపై మార్క్స్ ఉపన్యాసపు రికార్డు. 1871 జనవరి 17 నాటి జనరల్ కౌన్సిలు సమావేశపు మినిట్స్ నుండి. 259

పారిస్‌లో మార్చి 18 నాటి విప్లవంపై ఎంగెల్సు ఉపన్యాసపు రికార్డు. 1871 మార్చి 21 నాటి జనరల్ కౌన్సిలు సమావేశపు మినిట్స్ నుండి . 261

కార్ల్ మార్క్స్. "The Times" పత్రిక సంపాదకునికి . . . . 263

పారిస్ కమ్యూన్‌పై ఎంగెల్సు ఉపన్యాసపు రికార్డు. 1871 ఏప్రిల్ 11 నాటి జనరల్ కౌన్సిలు సమావేశపు మినిట్స్ నుండి . . . . . 265

పారిస్ కమ్యూన్‌పై మార్క్స్ ఉపన్యాసపు రికార్డు. 1871 ఏప్రిల్ 25 నాటి జనరల్ కౌన్సిలు మినిట్స్ నుండి . . . . . . . 267

ఫ్రెడరిక్ ఎంగెల్స్. ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్స్ అసోసియేషన్ నుండి టొలేన్‌ను బహిష్కరిస్తూ జనరల్ కౌన్సిల్ తీర్మానం . . . . . 270

పారిస్ కమ్యూన్‌పై ఎంగెల్సు ఉపన్యాసపు రికార్డు. 1871 మే 9 నాటి జనరల్ కౌన్సిలు సమావేశపు మినిట్స్ నుండి . . . . . . . 271

పారిస్ కమ్యూన్‌పై మార్క్స్ ఉపన్యాసపు రికార్డు. 1871 మే 23 నాటి జనరల్ కౌన్సిలు సమావేశపు మినిట్స్ నుండి . . . . . . . 273

ఇంటర్నేషనల్‌ని గురించీ, పారిస్ కమ్యూన్‌ని గురించీ బూర్జువా పత్రికలు వ్యాపింపచేసిన అబద్ధాలకు వ్యతిరేకంగా - మార్క్స్ చేసిన ఉపన్యాస సంగ్రహం. 1871 జూన్ 6 నాటి జనరల్ కౌన్సిలు సమావేశపు వార్తాపత్రిక రిపోర్టు నుండి . . . . . . . . . . . 275

కార్ల్ మార్క్స్. "The Times" సంపాదకుని ఉద్దేశించి జనరల్ కౌన్సిల్ చేసిన ప్రకటన . . . . . . . . . . . 277

కార్ల్ మార్క్స్. "The Standard" సంపాదకునికి జనరల్ కౌన్సిల్ లేఖ . . . . . . . . . . . . . . . 279

ఫ్రెడరిక్ ఎంగెల్స్. హోలియోక్ లేఖపై జనరల్ కౌన్సిల్ ప్రకటన . . 280

ఫ్రెడరిక్ ఎంగెల్స్. "The Spectator," "The Examiner" సంపాదకులకు జనరల్ కౌన్సిల్ లేఖ . . . . . . . . . . 282

కార్ల్ మార్క్స్. "The Daily News" సంపాదకునికి . . . . . . 283

ఫ్రెడరిక్ ఎంగెల్స్. హోలియోక్, ల్రాక్రాఫ్ట్‌ల లేఖలపై జనరల్ కౌన్సిల్ ప్రకటన . . . . . . . . . . . . . . . . 285

ఫ్రెడరిక్ ఎంగెల్స్. "ఫ్రాన్సులో అంతర్యుద్ధం" అనే విజ్ఞప్తి, ఇంగ్లీషు పత్రికలూ . . . . . . . . . . . . . . . . 287

"The World" విలేకరితో మార్క్సు గోష్ఠి రికార్డు . . . . . 289

కార్ల్ మార్క్స్. పారిస్‌లోని అమెరికా రాయబారి మిస్టర్ వాష్‌బర్న్ . . 292

ఫ్రెడరిక్ ఎంగెల్స్. "The Times" సంపాదకునికి . . . . . 298

కార్ల్ మార్క్స్. "La Vérité" వార్తాపత్రికా సంపాదకునికి . . . 300

ఫ్రెడరిక్ ఎంగెల్స్. కార్మికవర్గ రాజకీయ కార్యాచరణపై ఉపన్యాసం. 1871 సెప్టెంబరు 21న లండన్‌లో జరిగిన ఇంటర్నేషనల్‌యొక్క మహాసభలో ఉపన్యాసపు సొంత రికార్డు . . . . . . . . 302

జర్మనీ బ్రిటన్లలో ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్స్ అసోసియేషన్ పరిస్థితిపై మార్క్సు ఉపన్యాసపు రికార్డు. 1871 సెప్టెంబరు 22న లండన్‌లో జరిగిన ఇంటర్నేషనల్ సభయొక్క మినిట్స్ నుండి . . . 303

కార్ల్ మార్క్స్. ఇంటర్నేషనల్ ఏడవ వార్షికోత్సవంపై చేసిన ఉపన్యాసం. 1871 సెప్టెంబరు 25న లండన్‌లో జరిగిన వార్షికోత్సవ సభలో చేసిన ఉపన్యాసం. విలేకరి చేసిన రికార్డు . . . . . . . . 304

కార్ల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఎంగెల్స్. ఇంటర్నేషనల్‌లో కల్పిత చీలికలు. . . 305

కార్ల్ మార్క్స్. పారిస్ కమ్యూన్ వార్షికోత్సవ సందర్భంలో జరిగిన సభ తీర్మానాలు . . . . . . . . . . . . . . . . 307

కార్ల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఎంగెల్స్. 1872లో వెలువడిన "కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక"యొక్క జర్మన్ కూర్పుకు పీఠిక (కొంత భాగం) . . 308

కార్ల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఎంగెల్స్. పారిస్ కమ్యూన్ వార్షికోత్సవ సందర్భంగా 1881 మార్చి 21న జరిగిన స్లావోనిక్ సమావేశాధ్యక్షునికి 309

ఫ్రెడరిక్ ఎంగెల్స్. పారిస్ కమ్యూన్ వార్షికోత్సవంపై . . . . . 311

ఫ్రెడరిక్ ఎంగెల్స్. పారిస్ కమ్యూన్ 21వ వార్షికోత్సవ సందర్భంగా ఫ్రెంచి కార్మికులకు సందేశం . . . . . . . . . . . . 313

ఫ్రెడరిక్ ఎంగెల్స్. పారిస్ కమ్యూన్ 23వ వార్షికోత్సవ సందర్భంగా ఫ్రెంచి వర్కర్స్ పార్టీ జాతీయ సమితికి . . . . . . 315

మూడవ భాగం

లేఖలు

పాల్ లఫార్గ్‌కి మార్క్స్, మార్చి 23, 1871 . . . . . . 319
విల్‌హెల్మ్ లీబ్‌క్నెహ్ట్‌కి మార్క్స్, ఏప్రిల్ 6, 1871 . . . . 321
లుడ్విగ్ కూగెల్‌మన్‌కి మార్క్స్, ఏప్రిల్ 12, 1871 . . . . 322
లుడ్విగ్ కూగెల్‌మన్‌కి మార్క్స్, ఏప్రిల్ 17, 1871 . . . . 323
లియో ఫ్రాంకెల్‌కి మార్క్స్, ఏప్రిల్ 26 ప్రాంతంలో, 1871 . . 324
లియో ఫ్రాంకెల్, లూయీ ఎజేన్ వార్లెన్‌లకు మార్క్స్, మే 13, 1871 326
ఎడ్వర్డ్ స్పెన్సర్ బీజ్‌లికి మార్క్స్, జూన్ 12, 1871 . . . . 327
విల్‌హెల్మ్ లీబ్‌క్నెహ్ట్‌కి ఎంగెల్స్, జూన్ 22, 1871 . . . . . 329
ఫ్రెడెరిక్ బోల్టెకి మార్క్స్, ఆగస్టు 25, 1871 . . . . . 329
ఎలిజబెత్ ఎంగెల్సుకి ఎంగెల్స్, అక్టోబరు 21, 1871 . . . . 330
కార్లో టెర్జాగికి ఎంగెల్స్ [రెండో పాఠం], జనవరి 14–[15], 1872 331
ఫ్రీడ్రిహ్ అడోల్ఫ్ సోర్గెకి ఎంగెల్స్, సెప్టెంబరు 12–[17], 1874 331
ఎఫ్. దొమెలా-న్యూవెన్‌హాయిస్‌కు మార్క్స్, ఫిబ్రవరి 22, 1881 . . 332
ఆగుస్ట్ బేబెల్‌కు ఎంగెల్స్, అక్టోబరు 29, 1884 . . . . . 333

వివరణలు, పేర్ల సూచి

వివరణలు . . . . . . . . . . . . . . . 337
పేర్ల సూచి . . . . . . . . . . . . . . . 392

# పీఠిక

1871 మార్చి 18న, పారిస్ కార్మికులు బూర్జువా పాలకులను నగరం నుండి వెళ్లగొట్టి, అధికారాన్ని తమ చేతుల్లోకి తీసుకున్నారు. ఎన్నడూ మరువరాని ఉజ్వల విజయమది. మరో పది రోజుల తర్వాత, మార్చి 28న, ప్రపంచపు తొలి శ్రామిక రాజ్యమైన పారిస్ కమ్యూన్‌ను వాళ్ళు నెలకొల్పారు. పూర్తిగా ఒక కొత్త రకమైన రాజ్యమది. ప్రజలకోసం, ప్రజలచేత పాలింపబడే రాజ్యమది. శ్రామిక ప్రజల ప్రయోజనాల కోసం, అన్నిటికన్న ముఖ్యంగా కార్మికవర్గ ప్రయోజనాల కోసం సాంఘిక, రాజకీయ చర్యలన్నింటినీ తీసుకున్న రాజ్యం అది.

కమ్యూన్ 72 రోజులపాటు నిలిచి, ఆంతరిక, బాహ్య అభివృద్ధినిరోధక శక్తుల దాడులను వీరోచితంగా ప్రతిఘటించిన మీదట కూలిపోయింది. అయితేనేం, దాని అనుభవం, గుణపాఠాలూ, ప్రపంచ విప్లవోద్యమంపై మహత్తరమైన ప్రభావం నెరపాయి. "సోషలిస్టు విప్లవ కర్తవ్యాలను ఖచ్చితంగా ఎలా ముందుకుతేవాలో యూరపియన్ శ్రామిక వర్గానికి కమ్యూన్ నేర్పింది" అని రాశాడు లెనిన్ (Collected Works, Vol. 13, 477వ పేజి). ఆటు తర్వాత ఆయన యిలా రాశాడు: "పారిస్‌లో మ్రోగిన ఫిరంగి మ్రోత, శ్రామికవర్గంలోని మిక్కిలి వెనకబడ్డ సెక్షన్లను, వాటి గాఢ నిద్రనుండి మేల్కొలిపింది. విప్లవ సోషలిస్టు ప్రచార విస్తృతికి ప్రతిచోటా ఊపునూ, ఉరవడినీ యిచ్చింది" (Collected Works, Vol. 17, 143వ పేజి).

పారిస్‌లోని విప్లవం ప్రపంచమంతటా హర్షామోద ప్రతిస్పందననూ, శక్తివంతమైన అంతర్జాతీయ సంఘీభావ ఉద్యమాన్నీ రేకెత్తించింది. 1871 వసంత వేసవి రుతువుల్లో, కమ్యూన్‌ను బలపరుస్తూను, దాని అణచివేతదార్లు సాగించిన క్రూర కృత్యాలకు వ్యతిరేకంగాను, కమ్యూన్ కాందిశీకులకు తోడ్పాటుకుగాను బ్రిటన్, జర్మనీ, బెల్జియం, అమెరికాల్లోను, తదితర దేశాల్లోను బహిరంగసభలూ, ప్రదర్శనలూ జరి

గాయి. ఈ ఉద్యమాన్ని శాస్త్రీయ కమ్యూనిస్టు సిద్ధాంత సంస్థాపకులైన కార్ల్ మార్క్స్ ఫ్రెడరిక్ ఎంగెల్సుల నాయకత్వాన గల, ప్రపంచపు తొలి ప్రజా విప్లవ శ్రామికవర్గ సంఘమైన ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్స్ అసోసియేషన్ — మొదటి ఇంటర్నేషనల్ — నిర్వహించింది.

మార్క్స్ ఎంగెల్సులు పారిస్‌లోని పరిణామాలను సునిశితంగా పరిశీలిస్తూ, కమ్యూన్ నాయకులతో సన్నిహిత సంబంధాలు పెట్టుకొని, వారికి అన్ని రకాల తోడ్పాటునూ యిచ్చారు. కమ్యూన్ కూలిపోయినప్పుడు విదేశాలకు తప్పించుకు పోయిన కమ్యూనార్డుల సహాయార్థం ఒక ఉద్యమాన్ని లేవదీశారు.

మార్క్స్ ఎంగెల్సులు తమ రచనల్లోను, లేఖల్లోను పారిస్ కమ్యూన్‌కు సంబంధించిన ఘటనలను సవివరంగా విశ్లేషించారు. శ్రామికవర్గ నియంతృత్వంకోసం ప్రపంచ చరిత్రలో జరిగిన తొలి ప్రయత్నం కావడమే దాని అంతస్సారమని విశదీకరించారు.

* * *

మార్క్స్ ఎంగెల్సులు పారిస్ కమ్యూనుపై రాసిన ప్రధాన రచనలన్నీ — వ్యాసాలు, విజ్ఞప్తులు, కార్మికోద్యమానికి సంబంధించిన అధికారిక పత్రాలు, ఉపన్యాసాలు, వివిధ పత్రికల్లో వెలువడిన ప్రకటనలు, లేఖలు — ఈ సంపుటిలో ఉన్నాయి.

ఈ రచనలు మూడు భాగాల క్రింద విభజింపబడ్డాయి.

మొదటి భాగంలో, రాజ్యం, విప్లవం, శ్రామికవర్గ నియంతృత్వాలపై శాస్త్రీయ కమ్యూనిజానికి సంబంధించిన ప్రధాన రచనల్లో ఒకటైన "ఫ్రాన్సులో అంతర్యుద్ధం," దానికి సంబంధించి మార్క్స్ ఎంగెల్సుల తదితర రచనలూ ఉన్నాయి.

"ఫ్రాన్సులో అంతర్యుద్ధాని"కి ముందు 1870లో మార్క్స్ ఫ్రెంచి-ప్రష్యన్ యుద్ధంపై మొదటి ఇంటర్నేషనల్‌యొక్క జనరల్ కౌన్సిలు మొదటి, రెండవ విజ్ఞప్తులను రాశాడు. వాటిలో సైనికతత్వం పట్ల, యుద్ధం పట్ల కార్మికవర్గపు వైఖరి విషయంలో మార్క్సిజం స్థాపకుల దృక్పథం వివరింపబడింది. దురాక్రమణ పర యుద్ధాలకు వ్యతిరేకంగాను, శ్రామికవర్గ అంతర్జాతీయతా సూత్రాల అమలుకు అనుకూలంగాను మార్క్స్ ఎంగెల్సులు సాగించిన రాజీలేని పోరాటాన్ని యీ రెండు పత్రాలూ విశదీకరిస్తాయి.

తమ స్వార్థపర రాజవంశ ప్రయోజనాలను ముందుకు తీసుకెళ్లేందుకోసం యుద్ధాన్ని రెచ్చగొట్టిన రాచరిక ప్రష్యా, బోనపార్టిస్టు ఫ్రాన్సు పాలకుల అభివృద్ధినిరోధక పథకాలను మొదటి విజ్ఞప్తి బహిర్గతం చేసింది. జాతీయ దురహంకారమూ, యుద్ధోన్మాదమూ విచ్చలవిడిగా విహారం చేస్తున్న వాతావరణంలో "ఫ్రాన్సు జర్మనీ దేశాల

కార్మికులు ఒకరికి మరొకరు శాంతి సద్భావ సందేశాలు" పంపుకోవడానికి (ఈ సంపుటిలో 43వ పేజి చూడండి) హృదయపూర్వకంగా స్వాగతం పలికి, మరింత ఎక్కువ అంతర్జాతీయ సహకారాన్ని అలవరచుకోవలసిందిగా కార్మికవర్గాన్ని మార్క్స్ ప్రోత్సహించాడు. ఆయన యిలా రాశాడు: "...ఆర్థిక కడగండ్లతో, రాజకీయ అపస్మారక స్థితిలో సతమతమైన పాత సమాజానికి విరుద్ధంగా ఒకానొక నూతన సమాజం ఆవిర్భవిస్తుంది. దాని జాతీయ పాలకుడు ప్రతి చోటా ఒక్కటే — శ్రమే! — కనుక, దాని అంతర్జాతీయ నియమం శాంతి అయివుంటుంది" (43వ పేజి).

యుద్ధ స్వభావం మార్పు పొందిన తర్వాత రెండవ విజ్ఞప్తి రచింపబడింది — రెండవ సామ్రాజ్యం కూలిపోయిన దరిమిలా, ఫ్రాన్సుకు సంబంధించినంతవరకు అది విముక్తి యుద్ధమైంది, జర్మనీకి సంబంధించినంతవరకు అది దురాక్రమణపర యుద్ధమైంది. యుద్ధపు మొదటి దశలో తన ఐక్యత కోసం పోరాడిన జర్మనీ, యిప్పుడు ఫ్రెంచి భూభాగాలను ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తోంది. చారిత్రకంగా చూసినా, వ్యూహాత్మకంగా చూసినా ఆల్సేస్ లొరేయిన్ను తన రాజ్యంలో కలపివేయాలన్న డిమాండు అసంబద్ధమైనదని వాదించి, మరింత ముందుకెళ్ళి, కార్మికవర్గపు అంతర్జాతీయ కర్తవ్యాన్ని మార్క్స్ పునరుద్ఘాటించాడు. బూర్జువావర్గపు దురాక్రమణపర విధానాన్ని ప్రతిఘటించడమే ఆ కర్తవ్యమన్నాడు. లేకుంటే, "ఘోరమైన యీ ప్రస్తుత యుద్ధం, మరింత మారణ అంతర్జాతీయ యుద్ధాలకు దారితీసినదవుతుంది. ప్రతి దేశంలోనూ కార్మికులపై యుద్ధప్రభువుల, భూస్వాముల, పెట్టుబడిదారుల పునర్విజయానికి దారి తీస్తుంది" (52వ పేజి) అని ఆయన హెచ్చరించాడు. దరిమిలా యీ జోస్యాన్ని చరిత్ర పూర్తిగా రుజువుచేసింది.

ఫ్రాన్సులో తదుపరి విప్లవ ఘటనలను, అప్పట్లో ఇంటర్నేషనల్ అవలంబించిన ఎత్తుగడలను అర్థం చేసుకోవడానికి రెండవ విజ్ఞప్తిలో ఫ్రాన్సులో పరిస్థితికి సంబంధించి మార్క్స్ యిచ్చిన వివరణలూ, ఫ్రెంచి శ్రామికవర్గ కర్తవ్యాలకు సంబంధించి యిచ్చిన నిర్వచనా అతి ముఖ్యమైనవి. అభివృద్ధినిరోధక శక్తులు బలంగా వున్నాయని, రాచరిక పునరుద్ధరణ ప్రమాదం ఉందని గుర్తించిన మార్క్స్, ఫ్రెంచి కార్మికులు మరో తిరుగుబాటు చెయ్యాలని ప్రయత్నించడం "గత్యంతరంలేని అవివేక చర్య" అవుతుందని చెప్పి, తాము సంపాదించుకున్న రిపబ్లికన్ స్వేచ్ఛలను తమ సొంత వర్గ సంస్థను సునంఘటితం చేసుకోవడానికి వినియోగించుకోవలసిందిగా వారికి సలహా యిచ్చాడు. లెనిన్ యిలా రాశాడు: "1870 సెప్టెంబరు 9న ఇంటర్నేషనల్ చేసిన సుప్రసిద్ధ విజ్ఞప్తిలో అకాల తిరుగుబాటుకి వ్యతిరేకంగా ఫ్రెంచి శ్రామిక వర్గాన్ని మార్క్స్ హెచ్చరించాడు. కాని, ఎప్పుడైతే తిరుగుబాటు జరిగిపోయిందో (1871)

'స్వర్గాన్ని ముట్టడించిన' జన సామాన్యపు విప్లవ చొరవను మార్క్సు సముత్సాహంగా సమర్థించాడు" (Vol. 21, 78వ పేజి).

ఇంటర్నేషనల్ జనరల్ కౌన్సిలు విజ్ఞప్తిని — "ఫ్రాన్సులో అంతర్యుద్ధాన్ని" — కమ్యూన్ చివరి రోజుల్లో వెర్సేల్స్ సైనిక దళాలకు వ్యతిరేకంగా రక్తప్లావిత పోరాటాలు జరుగుతున్న సమయంలో మార్క్సు రచించాడు. చాల సంవత్సరాల తర్వాత ఎంగెల్సు యీ విషయాన్ని గురించి యిలా జ్ఞాపకం చేశాడు: "మే 28న, బెల్‌విల్ కొండ చరియలపై జరిగిన పోరాటంలో, తమకన్న శక్తివంతమైన బలగాలతో పోరాడుతూ కమ్యూనుకు చెందిన చివరి యోధులు నేలకొరిగారు. అటు తదుపరి రెండే రోజుల తర్వాత, మే 30న, జనరల్ కౌన్సిలు నుద్దేశించి మార్క్సు తన రచన ఒకటి చదివివినిపించాడు. అందులో పారిస్ కమ్యూన్ చారిత్రక ప్రాధాన్యాన్ని గురించి క్లుప్తము, పటిష్ఠమైన పదాల్లో ఆయన అభివర్ణించాడు. ఈ విషయంపై వెలువడిన విస్తృతమైన సాహిత్య మంతటిలోనూ మరెక్కడా, ఎన్నడూ సాధింపబడని నైశిత్యాన్నీ, అంతకన్న మిన్నగా యాదార్థ్యాన్నీ అందులో ఆయన సాధించాడు" (24—25వ పేజీలు).

"ఫ్రాన్సులో అంతర్యుద్ధం," ఫ్రెంచి-ప్రష్యన్ యుద్ధంపై రెండు విజ్ఞప్తులూ "గ్రంథకర్తయొక్క గణనీయమైన ప్రతిభకు విశిష్టమైన ఉదాహరణలు. మహత్తర చారిత్రక ఘటనల స్వభావాన్నీ, అంతరార్థాన్నీ, తప్పనిసరి పర్యవసానాలనూ అవగతం చేసుకోవడంలో, అందునా, యీ ఘటనలు మన కళ్లముందు యింకా జరుగుతున్నప్పుడు, లేక, యిప్పుడిప్పుడే జరిగినప్పుడు, యివి తోడ్పడతాయి. గ్రంథకర్తకు గల ప్రతిభ తొలిసారిగా 'లూయీ బోనపార్ట్‌యొక్క బ్రూమేర్ పద్దెనిమిదవ తేదీ'లో రుజువైంది" అన్నాడు ఎంగెల్సు (23వ పేజి).

కమ్యూన్ ఆవిర్భావానికి గల చారిత్రక పరిస్థితులను, కారణాలను విశ్లేషించి "దేశీ శత్రువు" అయిన విప్లవ శ్రామికవర్గాన్ని అణచేసేందుకు గాను విదేశ ఆక్రమణదారుకు లొంగిపోయిన ఫ్రెంచి బూర్జువావర్గపు "జాతీయ విద్రోహాన్ని" మార్క్సు బహిర్గతం చేశాడు.

సోషలిస్టు విప్లవం బూర్జువా రాజ్యయంత్రాన్ని మూలమట్టంగా నాశనం చేసి, ఓ కొత్త తరహా రాజ్యాన్ని నెలకొల్పాలని తను "లూయీ బోనపార్ట్‌యొక్క బ్రూమేర్ పద్దెనిమిదవ తేదీ"లో చెప్పిన మాట సరైనదని కమ్యూన్ అనుభవానికి సంబంధించిన అధ్యయనం మార్క్సుకు రుజువును సమకూర్చింది. "ఈ నిర్ధారణ రాజ్యానికి సంబంధించిన మార్క్సిస్టు సిద్ధాంతంలో ప్రధానమైన, మౌలికమైన అంశం" అని లెనిన్ చెప్పాడు (వి. ఐ. లెనిన్ "ఏరిన రచనలు," రెండవ భాగం, రెండవ ముద్రణ, 167వ పేజి). "ఫ్రాన్సులో అంతర్యుద్ధం"లో, కమ్యూన్, శ్రామికవర్గ నియంతృత్వ

రాజ్య రూపంగా ఉన్నదనీ, "శ్రమయొక్క ఆర్థిక విముక్తిని సాధించడానికి వీలుగా చిట్టచివరకు కనుగొనబడిన రాజకీయ రూపమది" (82వ పేజి) అనీ మార్క్స్ నిరూపించాడు.

కమ్యూన్ చేపట్టిన సాంఘిక చర్యలను మార్క్స్ సునిశితంగా పరిశీలించి, అది ఆచరణలో కార్మికవర్గ ప్రభుత్వంగా ఉన్నదని అందుకు ఖచ్చితమైన ఉదాహరణలిచ్చాడు. తద్వారా, పారిస్ విప్లవవాదులు కేవలం మ్యునిసిపల్ స్వేచ్ఛల కోసమూ, కమ్యూనల్ ఫెడరలిజం కోసమూ పోరాడేవారు మాత్రమేనని పరిగణించేవారి ఉద్ఘాటనలను ఖండించాడు. కమ్యూన్ నికరమైన జాతీయ సమైక్యతను సాధించిందనీ, శ్రామికవర్గ నియంతృత్వం క్రింద కేంద్రీకృత రాజ్య ప్రాముఖ్యాన్ని రుజువు చేసిందనీ మార్క్స్ ఉద్ఘాటించాడు.

పారిస్‌లో జరిగిన విప్లవ ఘటనలను ఎంతో శ్రద్ధగా అధ్యయనం చేసిన తర్వాత, విశేషమైన యదార్థ సమాచారం ఆధారంగా మార్క్స్ యీ నిర్ధారణలన్నీ చేశాడు. లెనిన్ యిలా రాశాడు: "మార్క్స్ 'కొత్త' సమాజాన్ని కల్పించాడనే, లేదా సృష్టించాడనే అర్థంలో, ఆయనలో ఊహాస్వర్గతత్వపు ఛాయ కూడా లేదు. పాత సమాజం నుండి కొత్త సమాజపు పుట్టుకనూ, దానినుండి దీనికి జరిగే పరివర్తనయొక్క రూపాలనూ సహజ చారిత్రక ప్రక్రియగా ఆయన అధ్యయనం చేశాడు. ఆయన సామూహిక కార్మికవర్గ ఉద్యమంయొక్క వాస్తవ అనుభవాన్ని పరిశీలించి, దానినుండి ఆచరణాత్మకమైన గుణపాఠాలను లాగడానికి ప్రయత్నించాడు" (వి. ఐ. లెనిన్, "ఏరిన రచనలు," రెండవ భాగం, రెండవ ముద్రణ, 136వ పేజి).

విప్లవంలో శ్రామికవర్గపు మిత్రులెవరన్న సమస్యను గురించి మార్క్స్ విపులంగా చర్చించాడు. కమ్యూన్‌యొక్క సాంఘిక, రాజకీయ చర్యలను, దాని విధాన నిర్ణాయక పత్రాలను విశ్లేషించాడు. శ్రామికవర్గ రాజ్యం ఒక్క కార్మికవర్గ ప్రయోజనాల కోసమే కాకుండా, రైతాంగంయొక్క, పట్టణవాస పెటీబూర్జువా వర్గంయొక్క ప్రయోజనాల కోసం కూడా పనిచేసిందని ఆయన నిరూపించాడు.

కమ్యూన్ కార్యకలాపాల సారస్వభావాలను గురించీ, కమ్యూనార్డుల వీరోచిత పోరాట ప్రాముఖ్యాన్ని గురించీ అన్ని దేశాల కార్మికవర్గానికీ ఒక అవగాహన నిచ్చే నిర్దిష్ట లక్ష్యంతోనే మార్క్స్ యీ రచన చేశాడు. తన యీ కర్తవ్యాన్ని ఆయన నిశ్చితంగా నెరవేర్చాడనడానికి ఒక సూచన దాని ప్రజారంజకత్వం. ఒక్క 1871లోనే అది 11 భాషల్లో 30 ముద్రణలు పొందింది. ప్రపంచంలోని నాగరిక దేశాలన్నింటిలోనూ అది ప్రచురించబడిన కారణంగా పారిస్‌లో జరిగిన ఘటనలను దేశ దేశాల కార్మికవర్గం ఒకే దృక్కోణంలో చూడగలిగింది.

ఈ సంపుటిలోని మొదటి భాగంలో ఈ పుస్తకపు తొలి చిత్తు ప్రతులైన "ఫ్రాన్సులో అంతర్యుద్ధ"పు మొదటి, రెండవ సంక్షిప్త పాఠాలు కూడా చేర్చబడ్డాయి. "ఫ్రాన్సులో అంతర్యుద్ధం"కి అనుబంధంగా వుండి, దాన్ని వివరించే సమాచారం వీటిలో వుంది. తుది ప్రతిని మరింత క్లుప్తీకరించి, దానికి విజ్ఞప్తి స్వభావాన్ని సమకూర్చేందుకు గాను, మార్క్స్ తన తొలి ప్రతులను క్లుప్తీకరించి, వాటినుండి కొన్ని విషయాలను వదిలేశాడు.

ఈ చిత్తు ప్రతులలో కమ్యూన్‌యొక్క సాంఘికార్థిక చర్యలకు సంబంధించిన మరింత వివరమైన వ్యాఖ్యానముంది. కమ్యూన్‌కి ముందరి దశలోని విప్లవోద్యమ స్వభావ వివరణ వుంది. రాజ్యాధికార కేంద్రీకరణ సమస్యకు, రైతాంగం పట్ల, పట్టణ పెటీబూర్జువా వర్గం పట్ల కమ్యూన్ విధానానికి సంబంధించిన మరింత విపుల పరిశీలన వుంది. పారిస్ కమ్యూన్‌యొక్క మహత్తర చారిత్రక ప్రాధాన్యాన్ని నిరూపించి, దాని చర్యలన్నింటి యొక్క ఖచ్చితము, వాస్తవికమైన అంచనాను మార్క్స్ యిచ్చాడు. తొలి ప్రతులలో, కమ్యూన్ పతనాన్ని త్వరితంచేసిన పారిస్‌లోని విప్లవ ప్రభుత్వ పొరపాట్లను ఆయా పరిస్థితుల దృష్ట్యా ఆయన విశ్లేషించాడు. శ్రామికవర్గం తర్వాత చెయ్యబోయే విప్లవ పోరాటానికి యివి గుణపాఠాలుగా ఉండాలని ఆయన గట్టిగా హితవు చెప్పాడు.

విప్లవ ప్రతిఘాతకుల పట్ల మెతకదనం చూపినందుకూ, వారికి వ్యతిరేకంగా దృఢమైన చర్యలను తీసుకోవడంలో విఫలమైనందుకూ కమ్యూనార్డులను మార్క్స్ విమర్శించాడు. శ్రామికవర్గ అధికారం సుసంఘటితంగా, సుదృఢంగా ఉండాలనీ, ప్రతిఘాత విప్లవాన్ని అణచివేసేందుకు అవసరమైన అన్ని సాధనాలనూ వినియోగించాలనీ ఆయన నొక్కిచెప్పాడు. కార్మికవర్గం జాతీయ స్థాయిలో తన అధికారాన్ని నెలకొల్పిన తర్వాత కూడా అడపాదడపా జరిగే "బానిస యజమానుల చెదురుమదురు తిరుగుబాట్ల" ప్రమాదం ఎదురవుతూ వుంటుందని హెచ్చరించాడు. సాధ్యమైన అన్ని విధాలుగానూ శ్రామికవర్గ రాజ్యాన్ని పటిష్ఠం చేసుకోవాల్సిన అవసరాన్ని ఆయన నొక్కిచెప్పాడు.

శ్రామికవర్గం దోపిడి రాజ్యయంత్రాన్ని నాశనం చెయ్యాల్సిన అవసరంపై సంక్షిప్త పాఠంలో ఉన్న మరింత విపులమైన ప్రతిపాదనలు "ఫ్రాన్సులో అంతర్యుద్ధం"కి విలువైన అనుబంధం. తొలి సంక్షిప్త పాఠంలో శ్రామికవర్గ నియంతృత్వం క్రింద వర్గ పోరాటానికి సంబంధించి మార్క్స్ సూత్రీకరించిన భావం విశిష్ట ప్రాధాన్యం కలిగినది. ఆయన యిలా రాశాడు: "ఏ వర్గ పోరాటం ద్వారా అయితే కార్మికవర్గం అన్ని వర్గాల రద్దు కోసమూ కృషి చేస్తుందో, తద్వారా అన్ని రకాల వర్గపాలనల రద్దు కోసమూ కృషి చేస్తుందో, ఆ వర్గ పోరాటాన్ని కమ్యూన్ అంతం చేయదు." అయితే, "కమ్యూన్ ఆ వర్గ పోరాటం తన వివిధ దశలగుండా అత్యంత హేతుబద్ధమూ, మానవీయమూ అయిన పద్ధతిలో సాగేందుకు అవసరమైన హేతుబద్ధమైన సాధనాన్ని కల్పి

స్తుంది" (180వ పేజి). ఈ ప్రతిపాదనను వివరిస్తూ, పెట్టుబడిదారీ సమాజం నుండి సోషలిస్టు సమాజానికి పురోగమించే క్రమంలో, శ్రామికవర్గ నియంతృత్వం బృహత్తరమైన ఆర్థిక, రాజకీయ కృషికి సంబంధించి నిర్వహించాల్సిన కొన్ని పథకాలను మార్క్స్ సూచించాడు. భావనిర్భరమైన యీ సిద్ధాంత సూత్రీకరణలో, అప్పటికే బీజ రూపంలో పెట్టుబడిదారీ విధానం నుండి సోషలిజానికి పరివర్తన దశకూ, యీ దశకు సంబంధించిన రాజ్య రూపంగా శ్రామికవర్గ నియంతృత్వానికీ సంబంధించిన సిద్ధాంత మూలాంశాలు యిమిడి వున్నాయి. 1875లో ఆయన యీ సిద్ధాంతాన్ని తన "గోథా కార్యక్రమ విమర్శ"లో ప్రతిపాదించాడు.

శ్రామికవర్గ రాజ్యానికి ఒక నమూనాగా, పారిస్ కమ్యూన్ గురించి మార్క్స్ చేసిన నిర్ధారణలను లెనిన్ పూర్తిగా వినియోగించుకున్నాడు. నూతన సామ్రాజ్యవాద యుగంలో, రాజ్యానికీ, శ్రామికవర్గ నియంతృత్వానికీ సంబంధించిన మార్క్సిస్టు సిద్ధాంతాన్ని మరింతగా వివరించే క్రమంలో, శ్రామికవర్గ రాజ్యానికి సంబంధించిన సోవియట్ రూపాన్ని ఆయన కనుగొన్నాడు, శ్రామికవర్గ నియంతృత్వ రాజ్య రూపంగా సోవియట్ల రిపబ్లిక్‌కి సంబంధించిన సుసమన్వత సమీకృత సిద్ధాంతాన్నొకదాన్ని సృష్టించాడు. అణచివేసే రాజ్యయంత్రాన్ని నాశనం చేసి, దాని స్థానంలో పారిస్ కమ్యూన్ తరహా రాజ్యాన్ని నెలకొల్పాలన్న మార్క్స్ భావాన్ని లెనిన్ సమర్థించాడు. రెండవ ఇంటర్నేషనల్‌కు చెందిన అవకాశవాదులూ, రివిజనిస్టులూ ఆ భావంపైనే దాడి చేసి, దాన్ని వక్రీకరించి, పట్టించుకోకుండా దాటవేస్తున్న తరుణంలో లెనిన్ దాన్ని బలపరచాడు. తన "రాజ్యమూ, విప్లవమూ"లో యీ దాడులెందుకు జరుగుతున్నాయో లెనిన్ నిరూపించాడు: రాజ్యానికి సంబంధించిన మార్క్స్ విప్లవ సిద్ధాంత సారమంతా ఆయన ప్రతిపాదించిన యీ భావంలో యిమిడి వుండటమే అందుకు కారణం.

పారిస్ కమ్యూన్ 20వ వార్షికోత్సవ సందర్భంగా 1891లో "ఫ్రాన్సులో అంతర్యుద్ధం"యొక్క ప్రత్యేక ముద్రణను ఎంగెల్సు తయారు చేస్తూ, దానికి పీఠికగా, ఫ్రెంచి-ప్రష్యన్ యుద్ధంపై రెండు విజ్ఞప్తులను చేర్చి, ఆ మొత్తం వరుస గ్రంథాలకు ఒక ప్రత్యేక ఉపోద్ఘాతం రాశాడు. ఈ ప్రస్తుత సంపుటి దానితోనే ప్రారంభమైంది. పారిస్ కమ్యూన్‌యొక్క యుగ ప్రవర్తక ప్రాధాన్యాన్నీ, దాని అనుభవాన్నీ సైద్ధాంతికంగా సమీక్షించి రాజ్యానికీ, సోషలిస్టు విప్లవానికీ, శ్రామికవర్గ నియంతృత్వానికీ సంబంధించిన సిద్ధాంతానికి మార్క్స్ సమకూర్చిన మహత్తర సంపదనూ ఎంగెల్సు వివరించాడు. కమ్యూన్ కార్యకలాపాలకు సంబంధించి మార్క్స్ చేసిన ప్రౌఢమైన వివరణను ఎంగెల్సు విపులీకరించాడు. రాజ్యాధికారాన్ని వశం చేసుకున్న శ్రామికవర్గానికి మార్గదర్శకత్వం వహించేందుకు సైద్ధాంతికంగా పరిపక్వమైన విప్లవ శ్రామికవర్గ పార్టీ ఆవశ్యకతను

నొక్కిచెప్పేందుకు గాను, కమ్యూన్‌లో బ్లాంకిస్టుల, ప్రూడనిస్టుల పొరపాట్లపై విమ ర్శను ఎంగెల్సు ముందుకు తెచ్చాడు. తదుపరి రెండు దశాబ్దాల కాలంలో కార్మికవర్గ పోరాట క్రమంలో సంపాదించిన అనుభవ సూత్రీకరణతో దాన్ని విస్తరించి, "కమ్యూను గుణపాఠాల అసాధారణంగా కన్నులకు కట్టేనట్లున్న సారాంశాన్ని" ఆయన యిచ్చాడని, లెనిన్ చెప్పాడు (వి. ఐ. లెనిన్ "ఏరిన రచనలు," రెండవ భాగం, రెండవ ముద్రణ, 212వ పేజి). జర్మనీలో బూర్జువావర్గంలోనే కాకుండా, ఊగిసలాడే సోషల్-డెమోక్రటిక్ శక్తుల్లో సైతం విస్తృతంగా వ్యాపించియున్న "రాజ్యం పట్ల ఆరాధనా భావానికి" వ్యతిరేకంగా ఎంగెల్సు గట్టిగా విరుచుకుపడ్డాడు. బూర్జువా రాజ్యయంత్రాంగం పీడక స్వభావం కలిగినదనీ, దాన్ని నాశనం చెయ్యడం అవసరమనీ మార్క్సు చేసిన నిర్ధారణ ప్రాధా న్యాన్ని ఎంగెల్సు గుర్తించి, ఆ విషయమై యింకా యిలా రాశాడు: "...రాజ్యమంటే ఒక వర్గం మరొక వర్గాన్ని అణచడానికి వినియోగించుకొనే యంత్రాంగం తప్ప వేరేమీ కాదు, అది రాజరికంలోనైనా అంతే, ప్రజాస్వామిక రిపబ్లిక్‌లోనైనా అంతే" (37వ పేజి). తన యీ సాధారణీకరణము బలపరచుకునేందుకు గాను ఎంగెల్సు అమెరికాలోని రిపబ్లికన్ రాజ్యాన్నీ, రెండు పార్టీల విధానాన్నీ ఉదహరించాడు. అమెరికాలో "రాజకీయ చట్టా వ్యాపారుల రెండు పెద్ద ముఠాలున్నాయి. అవి ఒక దాని తర్వాత మరొకటి రాజ్యా ధికారాన్ని హస్తగతం చేసుకుని, అత్యంత అవినీతికరమైన సాధనాలతో, అత్యంత అవినీ తికరమైన ఫలితాల కోసం, దాన్ని దుర్వినియోగం చేస్తాయి" అని ఎంగెల్సు పేర్కొన్నాడు (36వ పేజి).

బూర్జువా రాజ్యయంత్రాంగాన్ని పెట్టుబడిదారీ విధానం శాంతియుతంగా సోష లిజంగా పెంపొందడానికి అనువుగా వినియోగించుకోవాలన్న సంస్కరణవాద సిద్ధాంతాలను ఎంగెల్సు తిరస్కరించి, శ్రామికవర్గ నియంతృత్వాన్ని బలపరచాడు. పీడక వర్గాల రాజ్యానికి పూర్తిగా భిన్నమైన నూతన శ్రామికవర్గ రాజ్యాన్ని కార్మికవర్గం నెలకొల్పు కోవాలని చెప్పాడు. జర్మన్ సోషల్-డెమోక్రట్లలోని అవకాశవాద శక్తులను ఉద్దేశించి చేసిన యీ క్రింది వాక్యాలతో ఆయన ఉపోద్ఘాతం ముగిసింది: "ఇటీవల, సోషల్-డెమో క్రటిక్ అల్పబుద్ధులు 'శ్రామికవర్గ నియంతృత్వం' అన్న పదాలు విని మరోమారు చచ్చేటంత భయంతో హడిలిపోతున్నారు. అయ్యా, పెద్ద మనుషులారా, యింతకీ మీరు ఈ శ్రామికవర్గ నియంతృత్వం ఎలా ఉంటుందో తెలుసుకోదలుచుకున్నారా? అయితే పారిస్ కమ్యూన్‌ని చూడండి. అదే శ్రామికవర్గ నియంతృత్వమంటే" (37వ పేజి).

కమ్యూనిజంలో రాజ్యం అంతరించిపోవడం గురించి మార్క్సు, తనూ సూత్రీకరించిన సిద్ధాంతాన్ని, అటు తరువాత ఎంగెల్సు మరింతగా అభివృద్ధిచేసి, కార్మిక వర్గానికి తన నియంతృత్వాన్ని శాశ్వతంగా నెలకొల్పే సంకల్పం లేదనీ, "నూతన, స్వేచ్ఛా

యుత సాంఘిక పరిస్థితుల్లో పెరిగిన ఒక తరం, రాజ్యానికి సంబంధించిన పనికి మాలిన సామానంతటినీ చెత్త కుప్పపై విసిరెయ్య గలిగేదాకా మాత్రమే" (37వ పేజి) నూతన సోషలిస్టు తరహా రాజ్యం అస్తిత్వంలో ఉంటుందనీ చెప్పాడు.

ఈ సంపుటిలోని రెండవ భాగంలో ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్స్ అసోసియేషన్ జనరల్ కౌన్సిలు సమావేశాల్లో మార్క్స్ ఎంగెల్సులు చేసిన ఉపన్యాసాలూ, పారిస్ కమ్యూనుపై చేసిన పలు ఉద్ఘాటనలూ, రాసిన వ్యాసాలూ ఉన్నాయి. పారిస్ ఘటనలపై తాము చేసిన పలు సమీక్షల్లో, మార్క్స్ ఎంగెల్సులు వెర్సేల్స్ ప్రతిఘాత విప్లవాన్ని బహిర్గతం చేశారు. విప్లవోద్యమ నూతన యుగానికి కమ్యూన్ నాంది ప్రస్తావన చేసిందని వారు వక్కాణించి చెప్పారు. 1871 మే 23వ కౌన్సిలు సమావేశంలో మార్క్స్ చెప్పిన యీ క్రింది మాటలు ఎంతటి యదార్థాలో చరిత్ర పూర్తిగా నిరూపించింది. "కార్మిక వర్గం విముక్తమయ్యే దాకా అవి (కమ్యూన్ సూత్రాలు) పదేపదే ముందుకొస్తాయి" (273వ పేజి).

1872లో వెలువడిన "కమ్యూనిస్టు ప్రణాళిక" జర్మన్ ముద్రణకు తాము రాసిన పీఠికలోను, "పారిస్ కమ్యూన్ వార్షికోత్సవ సందర్భంలో జరిగిన సమావేశ తీర్మానా"ల్లోను, కమ్యూనంటే కార్మికవర్గం చేతుల్లోకి — కేవలం కొద్ది కాలం పాటే అయినా — రాజకీయాధికారపు బదలాయింపని మార్క్స్ ఎంగెల్సులు చెప్పారు. "1871 మార్చి 18వ ప్రారంభింపబడిన మహత్తర ఉద్యమాన్ని, మానవజాతిని వర్గ సమాజం నుండి శాశ్వతంగా విముక్తం చేసే మహత్తర సాంఘిక విప్లవ ఉషోదయంగా" (307వ పేజి) తాము పరిగణిస్తున్నట్లు వారు చెప్పారు.

పారిస్ కమ్యూన్ అనుభవం ఆధారంగా, మార్క్స్ ఎంగెల్సులు అరాజకవాదులతో రాజీలేని పోరాటం చేసి, శ్రామికవర్గ రాజకీయ పార్టీ ఆవశ్యకతను గురించి వాదించారు. 1871 సెప్టెంబరు 21వ లండనులో జరిగిన మొదటి ఇంటర్నేషనల్ మహాసభలో కార్మికవర్గ రాజకీయ కార్యాచరణపై ఎంగెల్సు ఒక ఉపన్యాసం చేశాడు. ఆ ఉపన్యాసాన్ని ఆయనే రికార్డు చేశాడు. ఆ ఉపన్యాసంలో అరాజకవాదాన్ని వ్యతిరేకించిన పోరాటం ప్రతిబింబితమైంది (302వ పేజి).

కమ్యూన్ మొదటి ఇంటర్నేషనల్ లోపల నిశితమైన సైద్ధాంతిక పోరాటాన్ని రేకెత్తించింది. కార్మికవర్గోద్యమపు అవకాశవాద నాయకులు పారిస్‌లో శ్రామికవర్గ విప్లవానికి ఆవిష్కృతమైన మహత్తరావకాశాన్ని చూసి బెంబేలుపడ్డారు. శ్రామికవర్గ నియంతృత్వాన్ని నెలకొల్పి, విప్లవ పంథాలో సమాజాన్ని మార్చడానికి కమ్యూన్ చేపట్టిన ఆచరణాత్మక చర్యలను వారు తిరస్కరించారు. (తొలెన్ వంటి) కొందరు సంస్కరణవాదులు బాహాటంగా కార్మికవర్గ ఉద్యమానికి ద్రోహం చేశారు. అడ్జర్, ల్రకాఫ్ట్ వంటి బ్రిటిష్

ట్రేడ్‌యూనియన్లకు చెందిన యితర మితవాద నాయకులు మార్క్సు రచించిన "ఫ్రాన్సులో అంతర్యుద్ధం"ను బహిరంగంగా విమర్శించారు. అంటే, మార్క్సు చేసిన విప్లవాత్మక నిర్ధారణలను తిరస్కరించడం తప్ప వేరేమీ కాదు. జనరల్ కౌన్సిలుచేత ప్రచురింప బడిన మార్క్సు ఎంగెల్సులు రచించిన పలు సిద్ధాంత పత్రాల్లో యీ పార్టీ విద్రోహులు మనిశితంగా విమర్శింపబడ్డారు.

ఇంటర్నేషనల్‌పైనా, పారిస్ కమ్యూన్‌పైనా 1871 వసంత, వేసవి కాలాల్లో పెట్టుబడిదారీ పత్రికల్లో ముందెన్నడూ లేనంతటి అబద్ధాలూ, అభాండాలూ ప్రచారంలో పెట్టబడ్డాయి. ఇంటర్నేషనల్‌కి (హోలియోక్, బ్రెడ్లో, మజ్జీనీ వంటి) బూర్జువా ప్రజాస్వామికవాదులు, అభివృద్ధి నిరోధక పత్రిక "Times"తో సహా గొంతు కలిపారు. ఈ సంపుటిలోని రెండవ భాగంలో బూర్జువా పత్రికల రాతలను తూర్పారబడుతూ మార్క్సు ఎంగెల్సులు రాసిన రచనలున్నాయి. వీటిలో వారిద్దరూ, ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్స్ అసోసియేషన్ ప్రోత్సహించిన కుట్ర ఫలితమే పారిస్ కమ్యూన్ అన్న వాళ్ల అసత్య వాదనను ఖండించారు. 1871 జూలై 3న, మార్క్సు "The World" అనే అమెరికన్ పత్రికకు ఒక ఇంటర్వ్యూ యిచ్చాడు. అందులో ఆయన యీ ఆరోపణలన్నింటినీ పరాస్తం చేశాడు. ఆయన యిలా అన్నాడు: "పారిస్‌లో తిరుగుబాటు పారిస్ కార్మికులచేత చెయ్యబడింది. వాళ్లలో మిక్కిలి సమర్థులు తప్పని సరిగా ఆ తిరుగుబాటుకి నాయకులూ, నిర్వాహకులూ అయ్యుంటారు కదా. కాని కార్మికులలో మిక్కిలి సమర్థులు ఇంటర్నేషనల్ అసోసియేషన్ సభ్యులు కూడా అవడం తటస్థించింది" (291వ పేజి).

చాలా సంవత్సరాల తర్వాత, 1880, 1890 దశకాల్లో మార్క్సు ఎంగెల్సులు రచించిన సిద్ధాంత పత్రాలు ("పారిస్ కమ్యూన్ వార్షికోత్సవ సందర్భంగా 1881 మార్చి 21న జరిగిన స్లావోనిక్ సమావేశాధ్యక్షునికి," "పారిస్ కమ్యూన్ వార్షికోత్సవంపై" మొదలైనవి) కూడా ఈ సంపుటిలోని రెండవ భాగంలో చేర్చబడ్డాయి. వీటిని బట్టి, 1871 తదుపరి సంవత్సరాలన్నింట్లోనూ, మార్క్సు ఎంగెల్సులు విప్లవ కార్మికుల్లో ప్రపంచపు తొలి శ్రామికవర్గ విప్లవ సంప్రదాయాలను విస్తరింప చేస్తూ, దాని సారాన్ని వివరిస్తూనే ఉన్నారని బోధపడుతుంది. తర్వాతి సంవత్సరాల్లో కార్మిక వర్గోద్యమానికి కమ్యూన్ ప్రాధాన్యాన్ని యీ రచనలు స్పష్టంగా నిరూపిస్తాయి. 1881 మార్చిలో, మార్క్సు ఎంగెల్సులు యిలా రాశారు: "పాత ప్రపంచానికి చెందిన ప్రభుత్వాలు, రూపుమాసిపోయిందని విశ్వసించిన కమ్యూన్, సజీవంగా వుంది. అది ముందెన్నటికన్న యీనాడు మరింత బలీయంగా వుంది" (245వ పేజి).

మూడవ భాగంలో పారిస్ కమ్యూనుకు సంబంధించిన మార్క్స్ ఎంగెల్సుల లేఖలున్నాయి.

వాటిలో, మార్క్స్ తన స్నేహితుడూ, ఇంటర్నేషనల్ సభ్యుడూ అయిన లుడ్విగ్ కూగెల్‌మన్‌కి రాసిన ప్రసిద్ధ లేఖలున్నాయి. వాటిలో ఆయన "స్వర్గాన్ని ముట్టడించి"న కమ్యూనార్డుల వీరోచిత సాహసకృత్యాల సమగ్ర అంచనా ఉంది. పారిస్‌లోని ప్రజానీకం ప్రదర్శించిన విప్లవ చొరవ పట్ల హృదయపూర్వకమైన స్వాగతముంది. అంతర్జాతీయ కార్మికవర్గోద్యమం మరింతగా అభివృద్ధి చెందడంలో కమ్యూన్ ప్రాధాన్యాన్ని గురించి యీ క్రింది నిర్ధారణను ఒక లేఖలో ఆయన యిలా సూత్రీకరించాడు: "పారిస్‌లోని పోరాటంతో, పెట్టుబడిదారీ వర్గానికీ, దాని రాజ్యానికీ వ్యతిరేకంగా కార్మికవర్గం చేసే పోరాటం ఓ కొత్త దశలో ప్రవేశించింది. తక్షణ ఫలితం ఏమైనప్పటికీ, ప్రపంచ ప్రాముఖ్యం కలిగిన ఒక వినూత్న విభిన్న మార్గం లభించింది" (259వ పేజి).

1874 సెప్టెంబరు 12–17 తేదీల్లో ఫ్రీడిహ్ అడాల్ఫ్ సోర్గెకీ, 1881 ఫిబ్రవరి 22న ఎఫ్. డోమెలా-న్యూవెన్‌హాయ్స్‌కీ, 1884 అక్టోబరు 29న ఔగుస్ట్ బేబెల్‌కీ తను రాసిన లేఖల్లో, అంతర్జాతీయ కార్మికవర్గోద్యమానికి కమ్యూన్ ప్రాముఖ్యాన్ని కూడా ఎంగెల్సు పరిశీలించాడు. మార్క్స్ ఎంగెల్సులకూ, కమ్యూనుకూ మధ్య గల సంబంధాన్ని బయటపెట్టే లేఖలు అనేకం వున్నాయి. కమ్యూన్ పట్ల మార్క్స్‌ది "ఆచరణాత్మక సలహాదారు వైఖరి, ప్రజాసామాన్యపు పోరాటంలో భాగస్వామి వైఖరి" (Vol. 12, 110వ పేజి) అన్న లెనిన్ మాటలకు కొత్త రుజువును సమకూర్చే లేఖలవి. వీరోచితమైన పారిస్ కమ్యూన్‌పై బురద జల్లేందుకు ప్రయత్నించిన కిరాయి రచయితల మూకకు వ్యతిరేకంగా మార్క్సిజం సిద్ధాంత సంస్థాపకులు నిర్వహించిన సాహసిక పోరాటాన్ని గురించి తెలియజేసే లేఖలు కూడా పాఠకులకు విశేషాసక్తి జనకంగా ఉంటాయి.

* * *

ఈ సంపుటిలోని రచనలన్నీ కూడా మూలాల నుండి గాని, తొలి ముద్రణల నుండి గాని అనువదింపబడ్డాయి. ఈ సంపుటికి సంపాదక వివరణలు, పేర్ల సూచి, కూడా చేర్చబడ్డాయి.

# మొదటి భాగం

# కార్ల్ మార్క్స

# ఫ్రాన్సులో అంతర్యుద్ధం[1]

# ఫ్రెడరిక్ ఎంగెల్స్

## ఉపోద్ఘాతం[2]

“ఫ్రాన్సులో అంతర్యుద్ధం” అనే ఇంటర్నేషనల్ జనరల్ కౌన్సిలు విజ్ఞప్తిని కొత్త ముద్రణ కోసం తయారు చెయ్యాల్సిందిగా నన్ను కోరుతారని గాని, దానికి నన్నొక ఉపోద్ఘాతం రాయమంటారని గాని నేను అనుకోలేదు. కాగా, నేనిప్పుడిక్కడ అత్యంత ముఖ్యమైన అంశాలను కొద్దిగా ప్రస్తావించడం మాత్రమే చెయ్యగలను.

పైన పేర్కొనబడిన పెద్ద గ్రంథానికి, ఫ్రెంచి-ప్రష్యన్ యుద్ధంపై జనరల్ కౌన్సిలు చేసిన రెండు సంక్షిప్త విజ్ఞప్తులను ఉపోద్ఘాత ప్రాయంగా జత చేస్తున్నాను. మొదటి విషయమేమిటంటే, వీటిలో రెండవది “అంతర్యుద్ధం”లో పేర్కొనబడింది. మొదటిది లేకుండా దీన్ని పూర్తిగా అర్థం చేసుకోవడం కష్టం. అంతే కాకుండా, మార్క్స్ చేతనే రచింపబడిన యీ రెండు విజ్ఞప్తులూ “అంతర్యుద్ధం”కి సరిదీటుగా, గ్రంథకర్తయొక్క గణనీయమైన ప్రతిభకు విశిష్టమైన ఉదాహరణలు. మహత్తర చారిత్రక ఘటనల స్వభావాన్నీ, అంతరార్థాన్నీ, తప్పనిసరి పర్యవసానాలనూ అవగతం చేసుకోవడంలో, అందునా, యీ ఘటనలు మన కళ్ల ముందు యింకా జరుగుతున్నప్పుడు, లేక, యిప్పుడిప్పుడే జరిగినప్పుడు, యివి తోడ్పడతాయి. గ్రంథకర్తకు గల యీ ప్రతిభ తొలిసారిగా ఆయన “లూయీ బోనపార్ట్ బ్రూమేర్ పద్దెనిమిదవ తేదీ”[3]లో రుజువైంది. చివరి సంగతేమిటంటే, మార్క్స్ జోస్యం చెప్పినట్టుగా ఈ ఘటనల ఫలితంగా వచ్చే పర్యవసానాలను మనం జర్మనీలో యీనాడింకా సహించాల్సి వస్తోంది.

మొదటి విజ్ఞప్తిలో చెప్పినదంతా జరగలేదా?: లూయీ బోనపార్ట్‌కి వ్యతిరేకంగా జర్మనీ జరిపే ఆత్మరక్షణ యుద్ధం, ఫ్రెంచి ప్రజలకు వ్యతిరేకంగా ఆక్రమణ యుద్ధంగా దిగజారినట్లయితే, విముక్తి యుద్ధం[4] అనబడేదాని తర్వాత జర్మనీకి వాటిల్లిన దురదృష్టాలన్నీ మరింత తీవ్రంగా పునరావృతమై యుండేవి కాదా? మరో ఇరవై ఏళ్ల బిస్మార్క్ పాలనకు మనం గురి కాలేదా? ప్రజావక్తలని ప్రాసిక్యూషన్ల స్థానంలో సోషలిస్టులను

హింసించే సోషలిస్టు వ్యతిరేక చట్టం[6] అమల్లోకి రావడం, వెనకటిలాగే పోలీసుల నిరంకుశ ప్రవర్తన, చట్టానికి సరిగా వెనకటి మాదిరి విభ్రాంతికర భాష్యాలనే చెప్పడం – మనం చూడలేదా?

ఆల్సేస్-లొరైన్ ఆక్రమణ "ఫ్రాన్సును రష్యా చేతుల్లోకి నెడుతుంది," ఈ ఆక్రమణ తదుపరి జర్మనీ రష్యాకు బాహాటంగా బానిస అయినా కావాలి, లేకుంటే కొద్ది విరామం తర్వాత ఓ కొత్త యుద్ధానికి, అందునా, "స్లావ్, రోమన్ జాతుల సంయుక్త శక్తికి వ్యతిరేకంగా జాతి యుద్ధానికి"* సన్నద్ధమైనా కావాల్సి వుంటుందన్న జోస్యం అక్షరాలా రుజువు కాలేదా? ఫ్రెంచి రాష్ట్రాల ఆక్రమణ జర్మనీని రష్యా చేతుల్లోకి నెట్టలేదా? బిస్మార్కు పూర్తిగా యిరవై ఏళ్ల పాటు వృధాగా జారు చక్రవర్తి కృపాకటాక్ష వీక్షణాల కోసం పాకులాడలేదా? తను "యూరప్‌లో అగ్ర రాజ్యం" అయ్యేందుకు ముందు, చిన్నారి ప్రష్యాగా ఉన్న తరుణంలోనైనా "పవిత్ర రష్యా" పాదాల ముందు చెయ్యనవసరంలేని చెప్పరాని నీచపు సేవలు ప్రష్యా చెయ్యలేదా? ఈ నాటికీ ఏ రోజుకారోజు యుద్ధం విరుచుకు పడే ఉపద్రవం మన నెత్తిపై కరాళ నృత్యం చెయ్యడంలేదా? యుద్ధం ఆరంభమైన మొదటి రోజుననే, రాజులు కుదుర్చుకున్న శాసనబద్ధమైన ఒడంబడికలన్నీ తుక్కు దూగరలా ఎగిరిపోయేవా? ఆ యుద్ధాన్ని గురించి ఎవరికైనా తెలిసిందేమిటి? దాని పర్యవసాన మెలా ఉంటుందో బొత్తిగా తెలియక పోవడమే దాన్ని గురించి ఖచ్చితంగా తెలిసిన అంశం. ఒకటిన్నర, లేక, రెండు కోట్లమంది సాయుధ సైనికులు యావత్తు యూరపునీ వినాశానికి గురిచేసే జాతుల యుద్ధంగా ఉంటుందది. అది యింకా చెలరేగలేదంటే అందుకు దాని తుది ఫలితమెలా వుంటుందో, సైనిక రాజ్యాల్లో మిక్కిలి పెద్దది సైతం ఊహించజాలక వెనక్కి తగ్గడమే కదా అందుకు కారణం?

ఇప్పుడు దాదాపుగా విస్మరింపబడిన యీ రెండు విజ్ఞప్తులూ, 1870లో అంతర్జాతీయ కార్మికవర్గ విధానపు దూర దృష్టికి ఉజ్వల తార్కాణాలు. అందుకనే, జర్మన్ కార్మికులకు వాటిని అందుబాటులోకి తేవడం మరింత ఎక్కువగా మన విధి అవుతోంది.

పై గుణవిశేషాలు యీ రెండు విజ్ఞప్తులకూ ఎంతగా వర్తిస్తాయో "ఫ్రాన్సులో అంతర్యుద్ధం"కి కూడా అంతగానే వర్తిస్తాయి. మే 28వ, బెల్‌విల్[7] కొండచరియలపై జరిగిన పోరాటంలో, తమకన్న శక్తివంతమైన బలగాలతో పోరాడుతూ కమ్యూనుకు చెందిన చివరి యోధులు నేలకొరిగారు. ఆటు తదుపరి రెండే రోజుల తర్వాత, మే 30న, జనరల్ కౌన్సిలు నుద్దేశించి మార్క్సు తన రచన ఒకటి చదివివినిపించాడు. అందులో పారిస్ కమ్యూన్ చారిత్రక ప్రాధాన్యాన్ని గురించి క్లుప్తము, పటిష్టమైన

* 49–50వ పేజీలు చూడండి. – సం.

పదాల్లో ఆయన అభివర్ణించాడు. ఈ అంశంపై వెలువడిన విస్తృతమైన సాహిత్యమంతటిలోనూ మరెక్కడా, ఎన్నడూ సాధించబడని వైశిత్యాన్ని, అంతకన్న మిన్నగా యాదార్థ్యాన్ని అందులో ఆయన సాధించాడు.

1789 దరిమిలా ఫ్రాన్సు సాధించిన ఆర్థిక రాజకీయాభివృద్ధి ధర్మమా అని, గత యాభై సంవత్సరాలుగా పారిస్‌కి ఎటువంటి ప్రత్యేక పరిస్థితి ఒనగూడిందంటే, అక్కడ ఏ విప్లవం జరిగినా కూడా, అది శ్రామికవర్గ స్వభావాన్ని సంతరించుకోక తప్పని స్థితి ఏర్పడింది. అంటే, తన రక్తం చిందించి విజయం సాధించిన శ్రామికవర్గం, విజయానంతరం తన సొంత డిమాండ్లను ముందు పెట్టక తప్పని పరిస్థితి అన్నమాట. ఆ డిమాండ్లు కొద్దో గొప్పో అస్పష్టంగా, ఆ మాటకొస్తే కొంత గజిబిజిగా కూడా ఉన్న మాట నిజమే అయినా, ఆ ప్రత్యేక దశలో పారిస్ కార్మికులు చేరుకున్న అభివృద్ధి దశకు అవి అనుగుణంగా ఉన్నాయి. అయితే కొనకు వాటి సారాంశం మాత్రం పెట్టుబడిదారులకూ కార్మికులకూ మధ్య వర్గ శత్రుత్వం రద్దు కావాలన్నదే. అయితే, దీన్ని సాధించడం ఎలాగన్నది మాత్రం ఎవరికీ తెలియదు. కాని, ఎంత అస్పష్టంగా పాదగబడినా కూడా, ఆ డిమాండే, అప్పట్లో అమల్లో వున్న సామాజిక వ్యవస్థకి ఎసరు పెట్టేదిగా ఉంది. ఆ డిమాండును ముందుకు తీసుకువచ్చిన కార్మికులు అప్పటికింకా సాయుధులై ఉన్నారు. కాగా, రాజ్యాధినేతలుగా ఉన్న బూర్జువావర్గానికి, కార్మికులను నిరాయుధులను చెయ్యడమే ప్రథమ విధిగా తయారైంది. అందుకనే, కార్మికులు విజయం పొందిన ప్రతి విప్లవం తర్వాతా ఓ కొత్త పోరాటం జరుగుతూ వచ్చింది, అది కార్మికుల పరాజయంతో ముగుస్తూ వచ్చింది.

తొలి సారిగా 1848లో యిది జరిగింది. పార్లమెంటరీ ప్రతిపక్షానికి చెందిన లిబరల్ బూర్జువాలు, తమ పార్టీ ఆధిపత్యాన్ని నికరం చేసుకునేందుకు గాను ఓటింగు హక్కుకు సంబంధించిన సంస్కరణల సాధన కోసం విందులు చేశారు. ప్రభుత్వంతో తాము చేసే పోరాటంలో, అంతకంతకు యిరుకున పడి, ప్రజల సానుభూతి సాధనకు గాను, బూర్జువా, పెటీబూర్జువావర్గాలకు చెందిన రాడికల్, రిపబ్లికన్ శ్రేణులకు అగ్రేసరత్వాన్ని వదలాల్సి వచ్చింది. అయితే వీటి వెనక విప్లవకర కార్మికులు నిలబడ్డారు. 1830 దరిమిలా, బూర్జువాలు, రిపబ్లికన్లు సైతం ఊహించని దానికన్న, వీరు ఎక్కువ స్వేచ్ఛ సంపాదించుకున్నారు. ప్రభుత్వానికీ ప్రతిపక్షానికీ మధ్య సంక్షోభం ఏర్పడిన తరుణంలో, కార్మికులు వీధి పోరాటం ప్రారంభించారు. లూయీ ఫిలిప్ అదృశ్యమయ్యాడు, అతనితో బాటే ఓటింగు పద్ధతి సంస్కరణ ఐపులేకుండా పోయింది. దాని స్థానంలో రిపబ్లిక్ ఆవిర్భవించింది. విజయులైన కార్మికులే "సోషల్" రిపబ్లిక్కుగా నామకరణం చేసిన రిపబ్లిక్ అది. అయితే, ఈ సోషల్ రిపబ్లిక్ స్వరూప స్వభావాలేమిటన్న విషయంలో మాత్రం

ఏమిటో, ఏవిధంగా కార్మికులకు స్వయంగా స్పష్టమైన అవగాహన లేదు. కానైతే వారికి స్వయం ఆయుధాలున్నాయి, రాజ్యంలో వాళ్లొక శక్తి. కాగా, రాజ్యంపై అదుపు కలిగివున్న బూర్జువా అధికృతులు, తమ కాళ్ళ క్రింద గట్టి పట్టులాంటిది దొరికించుకోగానే, కార్మికులను నిరాయుధుల్ని చెయ్యడమే తమ తొలి లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రత్యక్ష వాగ్దాన భంగం ద్వారా, బహిరంగ తిరస్కారం ద్వారా, నిరుద్యోగులను సుదూర ప్రాంతానికి వెళ్ళగొట్టే ప్రయత్నం ద్వారా, కార్మికులను 1848 జూన్‌లో తిరుగుబాటుకు[8] పెట్టడం ద్వారా యిది జరిగింది. తమకు నిశ్చితమైన బలాధిక్యత ఉండేలా ప్రభుత్వం జాగ్రత్త తీసుకుంది. ఐదు రోజుల వీరోచిత పోరాటం తర్వాత కార్మికులు ఓడిపోయారు. అటు తర్వాత ఎటువంటి రక్షణలేని ఖైదీల ఊచకోత జరిగి రక్తం ఏరులై పారింది. రోమన్ రిపబ్లిక్ పతనానికి దారితీసిన అంతర్యుద్ధం రోజుల తర్వాత యిటువంటి రక్తపాతం మరెన్నడూ జరిగి వుండలేదు. బూర్జువావర్గానికి వ్యతిరేకంగా శ్రామికవర్గం ఒక ప్రత్యేక వర్గంగా, తన సొంత ప్రయోజనాల కోసం, సొంత డిమాండ్లతో నిలబడ సాహసించినపుడు, బూర్జువావర్గం ప్రతీకారం కోసం ఎంతటి ఉన్మత్త క్రౌర్యానికి పాల్పడుతుందో ప్రదర్శితం కావడం అదే మొదటి సారి. కానైతే, 1871లో బూర్జువావర్గం ప్రదర్శించిన ఉన్మాదోన్మాదంతో పోలిస్తే 1848 కేవలం పిల్లల ఆటతో సమానమైనది మాత్రమే వుంటుంది.

శిక్ష ఇక వెన్నంటే ముట్టింది. శ్రామికవర్గం ఫ్రాన్సును పాలించగలిగే స్థితిలో లేదంటే, బూర్జువావర్గమూ యిక ఎంత మాత్రమూ పాలించలేని స్థితికి చేరుకుంది. కనీసం ఆ దశలో, దానిలో ఎక్కువ భాగం యింకా రాచరిక పాలనకు అనుకూలంగా మొగ్గి వుండి, మూడు రాజవంశ పార్టీలుగా,[9] నాల్గవ పార్టీ అయిన రిపబ్లికన్ పార్టీగా చీలి వున్న తరుణంలో అది పాలన సాగించే స్థితిలో లేదు. దానిలో అంతర్గతంగా వున్న చీలికల కారణంగా, సాహసికుడైన లూయీ బోనపార్ట్ అధికార స్థానాలు — సైన్యం, పోలీసు బలగం, పరిపాలనా యంత్రాంగం — అన్నింటినీ వశం చేసుకోగలిగాడు. 1851 డిసెంబరు 2న,[10] బూర్జువావర్గపు చిట్టచివరి బలీయ దుర్గమైన జాతీయ అసెంబ్లీని అతను ధ్వంసం చెయ్యగలిగాడు. రెండవ సామ్రాజ్యం ఆరంభమైంది — రాజకీయ, ఆర్థిక దుస్సాహసికుల ముఠా దోపిడీకి ఫ్రాన్సు గురి అయింది. కానైతే అదే సమయంలో, లూయీ ఫిలిప్ సంకుచిత, పిరికి పాలనలో, కేవలం బడా బూర్జువావర్గంలోని ఒక చిన్న సెక్షను ఆధిపత్యంలో వున్నపుడు సాధ్యం కాని స్థాయిలో పారిశ్రామికాభివృద్ధి కూడా సాధ్యమైంది. ఒక వంక బూర్జువాలను కార్మికుల నుండి, మరో వంక కార్మికులను బూర్జువాల నుండి కాపాడుతాననే సాకుతో లూయీ బోనపార్ట్ పెట్టుబడిదారుల నుండి రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకున్నారు. అయితే అందుకు బదులుగా అతని

పెద్ద పట్టణాల్లోనూ, పారిశ్రామిక కార్మికులలోనూ ప్రోత్సహించింది – ఒక్క మాటలో చెప్పాలంటే, మొత్తం బూర్జువావర్గం, యింతకు మునుపెన్నడూ కనీవిని ఎరుగని మేరకు పెరిగి, వర్ధిల్లింది. ఇంతకన్నా ఎక్కువగానే అంతర్గతంగానూ, పారిశ్రామిక రంగ తమనూ, రాజాస్థానం యొక్క యోగ్య వైభవం, ఈ పండుగ అంతటిలోనూ తమ వాటా పెద్ద పెద్ద శాతాల స్వాహాచేయడం వచ్చు మాట కూడా వినమే.

అయితే రెండవ సామ్రాజ్యం, ఫ్రెంచి జాతీయ దురహంకారానికి, 1814లో కోల్పోయిన మొదటి సామ్రాజ్యపు ఎల్లలను, కనీసం మొదటి రిపబ్లిక్ నాటి ఎల్లలను, పునరుద్ధరించాలన్న డిమాండుకు చిహ్నంగా నిలిచింది. పాత రాజరిక సరిహద్దుల్లోనూ, ఇంకానీ, 1815లో మరింతగా కత్తిరించబడ్డ సరిహద్దుల్లోనూ ఫ్రెంచి సామ్రాజ్యాన్ని పరిరక్షించడం – యిటువంటిదిక ఎంత మాత్రమూ సాధ్యం కాదేదు. దానితో అప్పుడప్పుడు యుద్ధాలూ, సరిహద్దుల విస్తరణా ఆవశ్యకత ఏర్పడింది. అయితే ఫ్రెంచి జాతీయ దురహంకారుల దృష్టిలో, రైన్ నదియొక్క పశ్చిమ ఎడమ గట్టుకు విస్తరణ అంత దీటుగా మరేదీ ఆకర్షించలేకపోయింది. రైన్ ఒడ్డున లభించే ఒక్క చదరపు మైలు ప్రాంతం, ఆల్ప్స్ పర్వతాల్లోనో, మరో చోటనో లభించే పది చదరపు మైళ్ల ప్రాంతంకన్నా వారికి ఘనంగా కనిపించింది. రైన్ నది ఎడమ గట్టును, అంతా ఒక్క సారి గానో, ముక్క ముక్కలు గానో తిరిగి పొందాలన్న డిమాండు ముందుకు రావడంతో, రెండవ సామ్రాజ్యానికి యిక మిగిలింది ఎప్పుడన్నా సమస్య మాత్రమే. ఆ తరుణం 1866 నాటి ఆస్ట్రియా-ప్రష్యా యుద్ధం[11]తో రానే వచ్చింది. బిస్మార్క్ నుండి ఆశించుకున్న "భూభాగ పరిహారం" దక్కకపోవడంతోను, తమ స్వయంగా అనుసరించిన పరమ కిరాత, వంకరటింకర విధానం మూలంగాను, యిప్పుడిక యుద్ధం తప్ప వేరేదీ మార్గాంతరం మిగల్లేదు. 1870లో ప్రారంభమైన ఆ యుద్ధం అతన్ని మొదట సెడాన్‌కూ, అక్కడి నుండి విల్‌హెల్మ్స్‌హోహె[12]కి తరిమింది.

తదుపరి పర్యవసానం 1870 సెప్టెంబరు 4 నాటి పారిస్ విప్లవం. సామ్రాజ్యం పేకమేడలా కూలిపోయింది. ఇప్పుడిక రిపబ్లిక్ తిరిగి ప్రకటించబడింది. అయితే శత్రువు సింహద్వారం దగ్గర నిలుచున్నాడు. సామ్రాజ్య సేనలు మెట్జ్ దగ్గర ఘోరంగా ముట్టడించబడైనా వున్నాయి, లేక జర్మనీలో బందీగా పట్టుకోబడైనా వున్నాయి. అటువంటి అత్యవసర పరిస్థితిలో స్థానిక శాసన సభకు చెందిన పారిస్ సభ్యులను "జాతీయ రక్షణ ప్రభుత్వం"గా ఏర్పడడానికి ప్రజలు అనుమతించారు. ఇది బహు తేలికగా ఆమోదించబడింది, ఎందుకంటే, రక్షణ ప్రయోజనాల కోసం, ఆయుధాలు చేత ధరించగల పారిస్ వాసులందరూ నేషనల్ గార్డ్ (జాతీయ రక్షక దళం)లో చేరి, సాయుధులయ్యారు. అటువంటి వారిలో యిప్పుడిక కార్మికులదే అత్యధిక సంఖ్యాక

బలం. అయితే అతి త్వరలోనే బూర్జువాలు అధిక సంఖ్యలో గల ప్రభుత్వానికీ సాయుధ శ్రామికవర్గానికీ మధ్య వైరుధ్యం బహిరంగ ఘర్షణగా బయటపడింది. అక్టోబరు 31న, సాయుధ కార్మిక బెటాలియన్లు నగర పాలక కార్యాలయం చుట్టుముట్టి, ప్రభుత్వ సభ్యుల్లో కొందరిని వశపరచుకున్నాయి. విద్రోహం, ప్రభుత్వం చేసిన వాగ్దానాలను ప్రత్యక్షంగా భంగపరచడం, కొన్ని పెటీబూర్జువా బెటాలియన్లు ఐక్యం చేసుకోవడం కారణంగా వారు మళ్లీ విడుదల చెయ్యబడ్డారు. విదేశీ సైనిక బలాల ముట్టడిలో ఉన్న నగరంలో అంతర్యుద్ధం చెలరేగకుండా చూసేందుకు గాను, పాత ప్రభుత్వం అధికారంలో వదిలెయ్యబడింది.

చిట్టచివరకు, 1871 జనవరి 28న క్షుద్బాధిత పారిస్ నగరం లొంగిపోయింది. అయితే, యుద్ధ చరిత్రలోనే అపూర్వమైన గౌరవాలతో అది లొంగింది. కోటలు శత్రువుకు వశం చెయ్యబడ్డాయి. నగర ప్రాకారం నుండి ఫిరంగులు తొలగింపబడ్డాయి. సైనిక రెజిమెంట్ల ఆయుధాలూ, మొబైల్ గార్డు ఆయుధాలూ శత్రువుకు అప్పగింపబడ్డాయి. వారు సైతం యుద్ధ ఖైదీలుగా పరిగణింపబడ్డారు. కానైతే నేషనల్ గార్డ్ మాత్రం తన ఆయుధాలనూ, ఫిరంగులనూ అట్టే పెట్టుకొని, విజేతలతో కేవలం యుద్ధ విరామ సంధి మాత్రమే చేసుకుంది. విజేతలు పారిస్ నగరంలో విజయోత్సాహంతో ప్రవేశించడానికి సాహసించలేకపోయారు. పారిస్‌లో ఒక మూలను మాత్రమే వాళ్లు ఆక్రమించుకొన సాహసించగలిగారు. అదైనా పబ్లిక్ పార్కులతో కూడిన ప్రాంతం మాత్రమే. దాన్ని సైతం వాళ్లు కొద్ది రోజులు మాత్రమే ఆక్రమించుకోగలిగారు! ఆ కొద్ది కాలంలో, 131 రోజుల పాటు పారిస్ ముట్టడిని సాగించిన వాళ్లే, సాయుధులైన పారిస్ కార్మికులచేత ముట్టడింపబడ్డారు. విదేశీ విజేతలకు దత్తం చెయ్యబడిన మూల ప్రాంతపు యిరుకు సరిహద్దులను ఏ "ప్రష్యన్" కూడా ఉల్లంఘించకుండా పారిస్ కార్మికులు వెయ్యి కళ్లతో కావలి కాశారు. సామ్రాజ్యపు సైన్యాలన్నీ ఏ విదేశీ సేన ముందైతే తమ ఆయుధాలను క్రింద పెట్టాయో అటువంటి విదేశీ సైన్యపు గౌరవాన్ని పారిస్ కార్మికులు చూరగొన్నారు. విప్లవాలయంపై ఏ ప్రష్యన్ యుంకర్లు[13] అయితే పగ తీర్చుకోవాలని వచ్చారో, వాళ్లే సగౌరవంగా నిలబడి, సరిగా అదే సాయుధ విప్లవానికి సెల్యూట్ చెయ్యాల్సిన పరిస్థితిలో పడ్డారు!

యుద్ధం సాగుతున్నంత కాలం, యుద్ధాన్ని తీవ్రంగా సాగించాలని డిమాండు చెయ్యడానికి మాత్రమే పారిస్ కార్మికులు తమను తాము పరిమితం చేసుకున్నారు. కాని యిప్పుడు, పారిస్ లొంగిపోయిన దరిమిలా శాంతిసంధి చేసుకున్న[14] తర్వాత, యిప్పుడిక కొత్త ప్రభుత్వపు సర్వాధిపతి అయిన థ్యేర్, పారిస్ కార్మికుల చేతుల్లో ఆయుధాలున్నంత కాలమూ, ఆస్తిపర వర్గాల — బడా భూస్వాముల, పెట్టుబడిదారుల — పాలనకు

ఎదురయ్యే నిరంతర ప్రమాదాన్ని గుర్తించక తప్పలేదు. వాళ్లని నిరాయుధులను చెయ్యడానికి ప్రయత్నించడమే అతను తీసుకున్న తొలి చర్య. నేషనల్ గార్డ్సుకి చెందిన ఫిరంగులను వశం చేసుకోవలసిందన్న ఆజ్ఞలతో, మార్చి 18న, అతను సైనిక దళాలను పంపాడు. పారిస్ ముట్టడి కాలంలో, ప్రజల విరాళాలతో నిర్మింపబడిన ఫిరంగులవి. చేసిన ఆ ప్రయత్నం విఫలమైంది. పారిస్ ఏకోన్ముఖంగా ప్రతిఘటనకు పూనుకొంది. పారిస్‌కీ, వెర్సేల్స్‌లో బైఠాయించిన ఫ్రెంచి ప్రభుత్వానికీ మధ్య యుద్ధం ప్రకటింపబడింది. మార్చి 26న పారిస్ కమ్యూన్ ఎన్నుకోబడింది. మార్చి 28న అది ప్రకటింపబడింది. అప్పటి దాకా ప్రభుత్వాన్ని కొనసాగించిన నేషనల్ గార్డ్సు కేంద్ర కమిటీ, మొదట రోసిపోయిన పారిస్ "నైతిక పోలీసు"ను రద్దు చేస్తూ డిక్రీని జారీచేసిన తర్వాత, కమ్యూనుకు తన రాజీనామాను సమర్పించింది. మార్చి 30న, నిర్బంధంగా సైన్యంలో చేర్చుకోవడాన్నీ, స్థాయీ సైన్యాన్నీ రద్దు చేసి, నేషనల్ గార్డ్సు మాత్రమే ఏకైక సాయుధ బలగంగా ఉండాలనీ, ఆయుధాలు చేత ధరించే శక్తి కలిగిన పౌరులందరూ అందులో చేర్చుకోబడాలని కమ్యూన్ ఆజ్ఞ జారీ చేసింది. నివాస గృహాలన్నింటికీ 1870 అక్టోబరు నుండి 1871 ఏప్రిల్ దాకా అద్దెలన్నింటినీ రద్దుచేసింది. అంతకు ముందే చెల్లించిన మొత్తాలు భవిష్యత్తులో అద్దెచెల్లింపుల మింజావలె పరిచూడబడతాయని స్పష్టం చేసింది. మ్యునిసిపల్ ఋణ కార్యాలయంలో తాకట్టు పెట్టబడిన వస్తువుల అమ్మకాలన్నింటినీ నిలిపివేసింది. అదే రోజున కమ్యూన్‌కి ఎన్నుకోబడిన విదేశీయుల పదవులు ధృవీకరింపబడ్డాయి. "కమ్యూన్ పతాకం ప్రపంచ రిపబ్లిక్ పతాకం" కావడమే యిందుకు కారణం. ఏప్రిల్ 1న, ఏ ఒక్క కమ్యూన్ ఉద్యోగియొక్క జీతమూ, అట్లాగే దాని సభ్యులయొక్క జీతమూ కూడా 6 000 ఫ్రాంకులను (4 800 మార్కులను) మించి ఉండరాదని నిర్ణయింపబడింది. ఆ మరుసటి రోజున, చర్చిని రాజ్యం నుండి విడదీస్తూ, మత ప్రయోజనాల కోసం ప్రభుత్వ చెల్లింపులన్నింటినీ రద్దు చేస్తూనూ, అంతే కాకుండా యావత్తు చర్చి ఆస్తినీ జాతీయ ఆస్తిగా మారుస్తూ కమ్యూన్ శాసనం జారీ చేసింది. తత్ఫలితంగా ఏప్రిల్ 8న, స్కూళ్ల నుండి మతపరమైన యావత్తు గుర్తులను, చిత్రాలను, మూఢ ప్రవచనాలనూ, ప్రార్థనలనూ — ఒక్క మాటలో, "వ్యక్తియొక్క అంతరాత్మ పరిధికి సంబంధించిన ప్రతిదాన్నీ" — తొలగించాలన్న ఆజ్ఞ జారీ చెయ్యబడింది, క్రమంగా అది అమలు జరపబడింది. 5న, రోజు రోజూ నిర్బంధిత కమ్యూన్ యోధులు వెర్సేల్స్ దళాల చేతుల్లో కాల్పులకు గురి అవుతున్నదానికి జవాబుగా, బందీలను ఖైదు చేసి హామీగా పెట్టుకోవాలన్న శాసనం జారీ చెయ్యబడింది. అయితే అదెన్నడూ అమలు జరగలేదు. 6న, నేషనల్ గార్డ్సుకి చెందిన 137వ బెటాలియను

గిలటిన్‌ని* బయటకు తెచ్చి, ప్రజల హర్షాతిరేకం మధ్య, దాన్ని బహిరంగంగా తగల బెట్టింది. 12న, నెపోలియన్‌చేత, 1809 యుద్ధానంతరం వశం చేసుకోబడిన ఫిరంగులను కరిగించి పోతపోసి వెండోమ్ చౌకులో నెలకొల్పబడిన విజయ స్తంభాన్ని, జాతీయ దురహంకార చిహ్నంగా, జాతీయ ద్వేషాన్ని రెచ్చగొట్టేదిగా పరిగణించి, పెరికి వెయ్యాలని కమ్యూన్ నిర్ణయించింది. ఈ నిర్ణయం మే 16న అమలు జరప బడింది. ఏప్రిల్ 16న, యజమానులచేత మూసివెయ్యబడిన ఫాక్టరీల జాబితా తయారు చెయ్యాలనీ, వాటిలో పూర్వం పనిచేస్తూ ఉండిన కార్మికులతో వాటిని నడిపేందుకు గాను ప్లానులు తయారు చెయ్యాలనీ, వారిని సహకార సంఘాల్లో సంఘటితులను చెయ్యాలనీ, ఈ సహకార సంఘాలన్నింటినీ కలిపి ఒక బృహత్ యూనియనుగా ఏర్పాటు చేసే ప్లానులు తయారు చెయ్యాలనీ కమ్యూన్ ఆజ్ఞ జారీ చేసింది. 20న, బేకర్లు రాత్రి పూట పని చెయ్యడాన్ని రద్దు చేసింది. అలాగే ఎంప్లాయిమెంటు ఆఫీసులను కూడా అది రద్దు చేసింది. రెండవ సామ్రాజ్య కాలం నుండి అవి, పోలీసులచేత నియమింప బడిన దగుల్బాజీల — మొదటి రకం శ్రామిక దోపిడీదారుల — గుత్త సంస్థలుగా నిర్వ హింపబడుతూ వచ్చాయి. అటువంటి ఆ ఆఫీసులను కమ్యూన్ పారిస్‌కు చెందిన యిరవై పేటలకు బదిలీ చేసింది. ఏప్రిల్ 30న, అది తాకట్టు కొట్లను మూసివెయ్యాలని ఆజ్ఞాపించింది. కార్మికులను అవి ప్రైవేటు దోపిడీకి గురిచేస్తున్నాయి కనుకను, కార్మి కులు శ్రమ పరికరాలు కలిగి యుండే హక్కుకు, వారి రుణ వసతి హక్కుకూ అవి భంగం కలిగిస్తున్నాయి కనుకను వాటిని మూసివెయ్యాలని ఆజ్ఞాపించింది. మే 5న, 16వ లూయీని ఉరితీసినందుకు ప్రాయశ్చిత్త సూచకంగా నిర్మింపబడిన ఛాపెల్‌ను నేలమట్టం చెయ్యాలని అది ఆజ్ఞాపించింది.

విదేశీ దండయాత్రికులకు వ్యతిరేకంగా జరిగే పోరాటం కారణంగా వెనక్కు నెట్టబడిన పారిస్ ఉద్యమంయొక్క వర్గ స్వభావం, ఆవిధంగా మార్చి 18 తర్వాత, మునిశితంగాను, సుస్పష్టంగాను ముందుకొచ్చింది. దాదాపుగా ఒక్క కార్మికులో లేక గుర్తింపు పొందిన వారి ప్రతినిధులో మాత్రమే కమ్యూన్‌లో నాయకత్వ స్థానంలో ఉన్నందున, దాని ఉత్తరువులు ఖచ్చితమైన శ్రామికవర్గ స్వభావం కలిగివున్నాయి. ఈ ఉత్తరువులు, రిపబ్లికన్ బూర్జువావర్గం కేవలం పిరికితనం కొద్దీ జారీ చెయ్య డంలో విఫలమైన సంస్కరణలను శాసనాలుగా మార్చాయి. ఈ శాసనాలు కార్మికవర్గ స్వేచ్ఛాయుత కార్యకలాపాలకు అవసరమైన ప్రాతిపదికను — మతం, రాజ్యానికి సంబం ధించని, పూర్తిగా వ్యక్తిగతమైన విషయం వంటి వాటిని — కల్పించాయి. కమ్యూన్ కార్మిక

* గిలటిన్: మరణశిక్షితుల శిరచ్ఛేదంచేసే యంత్రం. అది డాక్టర్ గిలటెన్ ప్రతిపాదన మేరకు 18వ శతాబ్దాంతంలో ఫ్రెంచి బూర్జువా విప్లవ కాలంలో ప్రవేశపెట్టబడింది. — సం.

వర్గ ప్రత్యక్ష ప్రయోజనాలకు అనుగుణమైన శాసనాలు జారీ చేసి, కొంత మేరకు పాత సామాజిక వ్యవస్థను గట్టిగా దెబ్బతీసింది. అయితే ముట్టడిలో వున్న నగరంలో, మహా అయితే వీటన్నింటి అమలునూ ఆరంభించడం మాత్రమే సాధ్యం అయింది. మే మాసారంభం నుంచి, వెర్సేల్స్ ప్రభుత్వం నానాటికీ అధిక సంఖ్యలో సమీకరిస్తున్న సేనలకు వ్యతిరేకంగా పోరాటం జరపడంలోనే వారి శక్తులన్నీ వినియోగమయ్యాయి.

ఏప్రిల్ 7న, పారిస్ పశ్చిమ రంగంలో, నెయ్ల్లీ వద్ద వెర్సేల్స్ సేనలు సీన్ నదిపై గల వంతెనను ఆక్రమించుకున్నాయి. మరో వంక, దక్షిణ రంగంలో 11న చేసిన దాడిలో, అవి జనరల్ ఏడ్ చేతిలో తీవ్ర నష్టాలతో తిప్పి కొట్టబడ్డాయి. పారిస్‌ని ప్రష్యన్లు బొంబార్డు చేసినప్పుడు పవిత్ర స్థలంపై అదేదో అతిక్రమణ అన్నట్లు గగ్గోలు పెట్టిన వాళ్లే యిప్పుడు పారిస్‌ని నిరంతరాయంగా బొంబార్డు చేశారు. సరిగా వీళ్లే మళ్లీ సెడాన్, మెట్స్[15]లలో ఖైదీలుగా పట్టుకోబడిన ఫ్రెంచి సైనికులను, వాళ్లు పారిస్‌ను పునరాక్రమించి తమకు అప్పగించేందుకు గాను, వెంటనే తిరిగి యివ్వాల్సిందిగా ప్రష్యన్ ప్రభుత్వాన్ని బతిమాలి భంగపోతున్నారు. మే ఆరంభం నుండి, యీ సేనలు క్రమంగా తిరిగి రావడంతో వెర్సేల్స్ సేనలకు ఖచ్చితమైన బలాధిక్యత లభించింది. ఇది త్వరలోనే రుజువైంది. పారిస్‌లో హామీ బందీలుగా తాము అట్టే పెట్టిన పారిస్ ఆర్చిబిషప్పునూ,* యింకా పలువురు యితర ప్రీస్టుల (మత బోధకుల)నూ, కమ్యూన్‌కు రెండు మార్లు ఎన్నుకోబడి, క్లెయిర్ వాక్స్‌లో ఖైదీగా వున్న ఒకే ఒక్క వ్యక్తి బ్లాంకికి బదులుగా విడుదల చేస్తామన్న కమ్యూన్ ప్రతిపాదనపై జరుగుతున్న సంప్రతింపులను ఏప్రిల్ 23న త్యేర్ త్రుంచి వెయ్యడమే యిందుకు నిదర్శనం. త్యేర్ మాటల ధోరణిలో వచ్చిన మార్పును బట్టి కూడా యిది స్పష్టమైంది. అంతకు ముందు దాకా అమీ తుమీ తేల్చకుండా వాయిదాలు వేస్తూ సందిగ్ధంగా వ్యవహరిస్తూండిన వాడల్లా యిప్పుడొక్క మారు అకస్మాత్తుగా తలబిరుసుగా, పొగరుబోతులా, బెదిరిస్తూ మొరటుగా మాట్లాడ నారంభించాడు. వెర్సేల్స్ బలగాలు మే 3న, దక్షిణ రంగంలోని ములెన్ సాకే కోట లోపలి ప్రాకారాన్నీ, 9న, ఫిరంగి కాల్పులతో పూర్తిగా శిధిలమై పోయిన ఇస్సీ కోటనూ, 14న వాన్వ్ కోటనూ పట్టుకున్నాయి. పశ్చిమ రంగంలో పలు గ్రామాలనూ, నగర ప్రాకారం దాకా విస్తరించియున్న భవనాలనూ ఆక్రమించుకొంటూ వెర్సేల్స్ బలాలు పురోగమిస్తూ పురోగమిస్తూ చివరకు ప్రధాన రక్షణ స్థావరాలను చేరుకున్నాయి. 21న, కొందరి ద్రోహం ధర్మమా అనీ, అక్కడ నిలపబడిన నేషనల్ గార్డుల అజాగ్రత్త పర్యవసానంగానూ అవి నగరంలోకి చొచ్చుకు వెళ్లడంతో సఫలమయ్యాయి. ఉత్తర,

---

* దార్బోన్ దార్బువా. — సం.

తూర్పు కోటలను ఆక్రమించుకొని వున్న ప్రష్యన్లు, నగరానికి ఉత్తరాన గల భూభాగంమీదుగా వెర్సేల్స్ సేనలు ముందుకెళ్లేందుకు అనుమతించారు. యుద్ధవిరామ సంధి మేరకు వెర్సేల్స్ సేనల ప్రవేశానికి నిషిద్ధమైన ప్రాంతం కనుక సహజంగానే అటునుంచి దాడి ఎదురవుతుందని పారిస్‌వాసులు తలపోయనందున అటుప్రక్క రక్షణ ఏర్పాట్లు అంత పటిష్ఠంగా చెయ్యలేదు. వెర్సేల్స్ సేనలు ఆ దిశనుంచి విస్తృత పరిధిలో ముందుకు త్రోసుకొచ్చాయి. దీని ఫలితంగా, పారిస్ పశ్చిమార్ధ భాగంలోను, నగరం యొక్క సిసలైన విలాస ప్రాంతంలో బలహీనమైన ప్రతిఘటన మాత్రమే ఏర్పాటు చెయ్యబడింది. లోపలికి చొరుచుకొస్తున్న సేనలు తూర్పు అర్ధ భాగాన్ని, కార్మికులు నివసించే నగర ప్రాంతాన్ని సమీపిస్తున్న కొద్దీ ప్రతిఘటన మరింత పటిష్ఠమై, మరింత పట్టుదలతో సాగింది. ఎనిమిది రోజుల పోరాటం తర్వాత మాత్రమే కమ్యూన్ తుది పరిరక్షకులు, బెల్‌విల్, మెనిల్‌మొంటాంట్ పర్వతాలపై నేలకొరిగారు. అంతకు ముందు వారం రోజులుగా జోరుగా సాగుతున్న, రక్షణలేని స్త్రీపురుష బాలాదుల ఊచకోత, అప్పుడిక తారస్థాయికి చేరుకుంది. తుపాకుల మారణ హోమానికి విరామమే లేకపోయింది. పరాజితులు వందలాది సంఖ్యలో మరతుపాకి కాల్పులకు మడిశారు. పేర్ లషేజ్ గోరీ దొడ్డి ప్రక్కన గల "ఫెడరల్సు కుడ్యం"* వద్ద జరిగిన తుది మూకహత్యాకాండ తారస్థాయికి చేరుకుంది. శ్రామికవర్గం తన హక్కుల కోసం లేచి నిలబడగానే పాలకవర్గం ఎంతటి ఉన్మత్త ఘాతుక కాండకు పూనుకొనగలదో అన్నదానికి మూక భాషలోనే అయినా తిరుగులేని రుజువుగా భాసిల్లే ఆ కుడ్యం యీనాటికీ నిలిచే వుంది. కమ్యూన్ కోసం పోరాడిన వారందరి మూక హత్యాకాండ అసాధ్యమని ఎప్పుడైతే తేలిపోయిందో, అప్పుడిక సామూహిక అరెస్టులు, ఖైదీల శ్రేణుల్లోంచి ఓ వరసా వావీ లేకుండా ఎవరో కొందర్ని బయటకులాగి కాల్చెయ్యడం, మిగిలిన వారందర్నీ పెద్దపెద్ద శిబిరాల్లోకి తరలించడం, కోర్టు మార్షల్ చెయ్యడం సాగిపోయాయి. పారిస్ నగర ఈశాన్య అర్ధభాగాన్ని చుట్టుముట్టి వున్న ప్రష్యన్ సేనలకు, పలాయితులనెవర్నీ తప్పించుకుపోనివ్వ వద్దని ఆజ్ఞలు జారీచెయ్యబడ్డాయి. కానైతే, సుప్రీం కమాండ్ ఆజ్ఞలకన్న మానవత్వ విధులనే సైనికులు పాటించినప్పుడు, సైన్యాధికారులు చూసీ చూడనట్లు ఊరుకునేవారు. అత్యంత మానవత్వంతో వ్యవహరించి, నిస్సందేహంగా కమ్యూన్ కోసం పోరాడినవారేనని తెలుస్తున్నా కూడా అటువంటి వారిని పలువురిని తప్పించుకుపోనిచ్చిన సాక్సనీ సైనిక దళం ప్రత్యేక గౌరవానికి పాత్రమైనది.

* * *

---

*ఇప్పుడది "కమ్యూనార్డుల కుడ్యం"గా పిలవబడుతోంది. — సం.

ఈనాడు, యిరవై ఏళ్ల తర్వాత, 1871 నాటి పారిస్ కమ్యూన్ కార్యకలాపాల వంకా, దాని చారిత్రక ప్రాధాన్యంవంకా వెనక్కి తిరిగి చూసినప్పుడు, "ఫ్రాన్సులో అంతర్యుద్ధం"లో యివ్వబడిన వివరణకు మరికొన్ని వివరాలు చేర్చడం అవసరమని మనకి తోస్తుంది.

పారిస్ కమ్యూన్ సభ్యులు రెండు విభాగాలుగా విడివడ్డారు. వారిలో అధిక సంఖ్యాకులు బ్లాంకిస్టులు. నేషనల్ గార్డు కేంద్ర కమిటీలో కూడా వారికే ప్రాబల్యం వుంది. మైనారిటీ పక్షానికి చెందిన వారు ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్స్ అసోసియేషన్[16] సభ్యులు. వీరు ప్రధానంగా ప్రూడన్ సోషలిస్టు ధోరణి అనుయాయులు. బ్లాంకిస్టుల్లో అత్యధిక సంఖ్యాకులు అప్పట్లో విప్లవ, శ్రామికవర్గ సహజ జ్ఞానం కారణంగానే సోషలిస్టులు. వారిలో కొద్దిమంది మాత్రమే, జర్మన్ శాస్త్రీయ సోషలిజంతో పరిచయం కలిగిన వైయాన్ ద్వారా సిద్ధాంతపరమైన అధికతర స్పష్టతను సంపాదించుకున్నారు. కాగా, ఆర్థిక రంగంలో చెయ్యాల్సిందెంతో—ఈనాడు మన అభిప్రాయం ప్రకారం కమ్యూన్ చేసి ఉండాల్సినది—చెయ్యలేదంటే మనం అర్థం చేసుకోవచ్చు. బ్యాంక్ ఆఫ్ ఫ్రాన్సు ద్వారాల వెలుపల, భక్తిపూర్వకమైన భయంతో వారు నిలిచి పోవడమే నిస్సందేహంగా బొత్తిగా అర్థం కాని విషయం. ఇది కూడా రాజకీయంగా తీవ్రమైన పొరపాటే. ఆ బ్యాంకే కనుక కమ్యూన్ చేతుల్లో ఉన్న వాడు, పదివేల మంది కుదువ బందీలున్న దానికన్న ఎక్కువ ప్రయోజనం కలిగి ఉండును. అదే జరిగిన వాడు, యావత్తు ఫ్రెంచి బూర్జువావర్గమూ, కమ్యూన్‌తో శాంతి సంధి చేసుకోవలసిందిగా వెర్సేల్స్ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చియుండేది. ఐనా కూడా, బ్లాంకిస్టులు, ప్రూడనిస్టులతో కూడిన కమ్యూన్ చేసిన పనుల్లో చాలవరకు సరైనవి కావడమే మరింత అబ్బురమైన విషయం. సహజం గానే, కమ్యూన్ జారీ చేసిన ఆర్థిక శాసనాలకు, వాటి మంచి చెడులకు, ప్రూడనిస్టులే ప్రధానంగా బాధ్యులు, అలాగే బ్లాంకిస్టులు దాని రాజకీయ మంచి చెడులకు బాధ్యులు. ఈ రెండు గ్రూపుల విషయంలో కూడా, చరిత్ర విడ్డూరంగానే వ్యవహరించింది. సిద్ధాంతజడులు అందల మెక్కినప్పుడు మామూలుగా జరిగే విధంగానే, తమ తమ సిద్ధాంత ధోరణులు నిర్దేశించిన దానికి ఆచరణలో యీ రెండు బృందాలూ కూడా భిన్నంగానే వ్యవహరించాయి.

చిన్నకారు రైతుల, చేతివృత్తి నిపుణుల సోషలిస్టు అయిన ప్రూడన్ కార్మిక సంఘాన్ని పరమ ద్వేష దృష్టితో చూశాడు. దాన్ని గురించి చెప్తూ, దానిలో మంచికన్న చెడే ఎక్కువుందన్నాడు. అది సహజ సిద్ధంగానే పసలేనిదన్నాడు. అంతే కాకుండా, కార్మికుని స్వేచ్ఛకు అది శృంఖలం కాబట్టి అది హానికరమైనది కూడా అన్నాడు. అది నిష్ఫలమూ, భారదాయకమూ అయిన శుష్క కీడివాదమన్నాడు. కార్మికుని స్వేచ్ఛకే కాకుండా, శ్రమ సక్రమ వినియోగానికి కూడా అది వ్యతిరేకమన్నాడు. దాని ప్రయోజనాలకన్న

దుష్ప్రయోజనాలే వేగంగా ఎక్కువవుతున్నాయన్నాడు. దానితో పోలిస్తే, పోటీ, శ్రమ విభజన, సొంత ఆస్తులే ప్రయోజనకరమైన ఆర్థిక శక్తులన్నాడు. ప్రూడన్ అన్న దాన్నిబట్టి – భారీ పరిశ్రమలు, రైల్వేలవంటి పెద్ద సంస్థలవంటి అసాధారణ సందర్భాల్లో మాత్రమే కార్మిక సంఘం సముచితమైనదన్నాడు. ("విప్లవానికి సంబంధించిన సాధారణ భావం," 3వ స్కెచ్ చూడండి.[17])

1871 నాటికే, కళాత్మక చేతివృత్తుల కేంద్రమైన పారిస్‌లో సైతం, భారీ పరిశ్రమ ఎంత సాధారణ విషయంగా మారిందంటే, కమ్యూన్ జారీ చేసిన అత్యంత ముఖ్యమైన శాసనం మేరకు భారీ పరిశ్రమకు, కార్ఖానాకు సైతం, సంబంధించిన సంఘమొకటి ఏర్పాటు చెయ్యబడింది. ప్రతి ఒక్క ఫాక్టరీలోనూ కార్మిక సంఘం ప్రాతిపదికపై ఉత్పత్తి సాగాలని నిర్దేశించడం మాత్రమే కాకుండా, ఆ శాసనం, యీ సంఘాలన్నింటినీ ఓ పెద్ద యూనియనులో సమైక్యం చెయ్యాలని కూడా చెప్పింది. మార్క్సు "అంతర్యుద్ధం"లో సరిగా చెప్పినట్లు, చివరకు, ఈ సంఘం కమ్యూనిజానికి దారితీసి వుండాల్సింది. అంటే, ప్రూడన్ సిద్ధాంతానికి పరమ విరుద్ధంగా జరగడమన్న మాట. అందుకే, కమ్యూన్ ప్రూడన్ సోషలిస్టు ధోరణికి సమాధి అయింది. ఈనాడు, ఈ ఆలోచనా ధోరణి, ఫ్రెంచి కార్మికుల మండి మాయమైంది. ఇక్కడ, పొసిబిలిస్టుల[18]లోను, అలాగే "మార్క్సిస్టుల"లోను మార్క్సు సిద్ధాంతమే యీనాడు ఎదురులేని ప్రాబల్యం కలిగివుంది. "రాడికల్" బూర్జువావర్గంలో మాత్రమే యీ నాడింకా ప్రూడనిస్టులున్నారు.

బ్లాంకీస్టుల గతి సైతం యింతకన్న మెరుగ్గా ఏమీ లేదు. కుట్ర ధోరణిలో వృద్ధి చెంది, సహజంగా ఆ పద్ధతిలో వుండే కఠోర క్రమశిక్షణచేత ఘటితులై, కొద్దిమందే అయినా కృతనిశ్చయులైన, సుసంఘటితులైన వ్యక్తులు, అనువైన తరుణంలో రాజ్యాధికారాన్ని వశం చేసుకోగలగడమే కాకుండా, మహత్తరము, నిర్దాక్షిణ్యము అయిన శక్తిస్తోమతల ప్రదర్శన ద్వారా, ప్రజా బాహుళ్యాన్ని విప్లవంలోకి నెట్టుకొచ్చి, వాళ్లను యీ చిన్న నాయక బృందం చుట్టూ నిలపడంలో విజయులయ్యే దాకా, అధికారాన్ని నిలుపుకోగలరని, బ్లాంకీస్టులు భావించారు. ఈ పద్ధతిలో నూతన విప్లవ ప్రభుత్వం చేతుల్లో తిరుగులేని నియంతృత్వాధికార సర్వస్వ కేంద్రీకరణ జరిగే అవకాశముందంటారు. మరైతే, బ్లాంకీస్టులు అధిక సంఖ్యలో వున్న కమ్యూన్, వాస్తవానికి ఏం చేసింది? పారిస్ కమ్యూనుతో కలిసి, ఫ్రెంచి కమ్యూనులన్నిటి స్వేచ్ఛా సమాఖ్యను ఏర్పాటు చెయ్యాల్సిందిగా, రాష్ట్రాల్లోని ఫ్రెంచి వారందరికీ కమ్యూన్ విజ్ఞప్తి చేసింది. అలా చేసినాడు వాస్తవానికి, అది జాతిచే తొలి సారిగా ఏర్పాటు చేసుకున్న జాతీయ సంఘం అయ్యుండేది. 1798లో నెపోలియన్ చేత సృష్టించబడి, ఆనాటి నుండి ప్రతి ఒక్క

కొత్త ప్రభుత్వం చేతా వాంఛిత సాధనంగా పరిగ్రహింపబడి, దాని ప్రత్యర్థులకు వ్యతిరేకంగా ఏదైతే వాడబడుతూ వచ్చిందో, పూర్వపు కేంద్రీకృత ప్రభుత్వానికి చెందిన—సైన్యం, రాజకీయ పోలీసు, బుర్రాక్రసీతో కూడిన పీడనాధికారమేదైతే వుందో, సరిగా ఆ పీడనాధికారమే, యింతకు ముందే పారిస్‌లో కూలిపోయినట్లు, ప్రతిచోటా కూలిపోవాల్సివుంది.

కార్మికవర్గం ఒక్క సారి అధికారంలోకి వచ్చిందంటే, అప్పుడిక అది, పాత రాజ్యాంగయంత్రంతో వ్యవహారం సాగించలేదన్న వాస్తవాన్ని, ఆదిలోనే తప్పనిసరిగా గుర్తించాలి. అప్పుడే సాధించుకున్న తన ఆధిపత్యాన్ని మళ్లీ పోగొట్టుకోకుండా ఉండాలంటే, ఈ కార్మికవర్గం, ఒకవంక, యింతకు ముందు తనకే వ్యతిరేకంగా వాడబడిన పాత నిర్బంధ యంత్రాంగాన్ని తొలగించి వెయ్యాలి. మరో వంక, తన డిప్యూటీలు, తన అధికారుల విషయంలో జాగ్రత్త తీసుకొని, వాళ్లందరూ కూడా, ఎటువంటి మినహాయింపూ లేకుండా, ఏ క్షణంలోనైనా వెనక్కి పిలిపించబడగలరని ప్రకటించాలి. ఇంతకు పూర్వపు రాజ్యంయొక్క స్వభావసిద్ధ గుణం ఏమిటి? సమాజం, తన ఉమ్మడి ప్రయోజనాలను కాపాడేందు కోసం, మొట్టమొదట్లో సామాన్యమైన శ్రమవిభజన ద్వారా, తన సొంత అంగాలను సృష్టించుకొంది. అయితే, తమ అగ్రభాగాన రాజ్యాధికారాన్ని కలిగిన యీ అంగాలు, కాలక్రమేణా, తమ ప్రత్యేక ప్రయోజనాల సాధనను దృష్టిలో పెట్టుకొని, సమాజపు సేవకుల స్థానం నుండి సమాజపు యజమానుల స్థానానికి పరివర్తన చెందాయి. దీన్ని, ఉదాహరణకు, మనం వంశపారంపర్య రాజరికంలోనే కాకుండా, దానితో సమానంగానే ప్రజాస్వామిక రిపబ్లిక్ విషయంలో కూడా చూడవచ్చు. ఖచ్చితంగా ఉత్తర అమెరికాలో వున్నంతగా మరెక్కడా "రాజకీయవాదులు," జాతిలో మరింత ప్రత్యేకమైన ప్రబలమైన విభాగంగా కనిపించరు. అక్కడ రెండు ప్రధాన పార్టీలున్నాయి. వాటిలో ఒకటి తర్వాత మరొకటి అధికారంలోకి వస్తూ వుంటుంది. అలా అధికారంలోకి వచ్చే పార్టీ కూడా రాజకీయాలను వ్యాపారంగా మార్చే వ్యక్తులచేత అదుపు చెయ్యబడుతుంది. వాళ్లే కేంద్ర శాసనసభల్లోనూ, వివిధ రాష్ట్రాల శాసనసభల్లోనూ సీట్ల విషయంలో ఎత్తుపై ఎత్తులేస్తూ వుంటారు, తమ పార్టీ కోసం ప్రచారం చెయ్యడం ద్వారా జీవితం గడుపుతారు, అది గెలిచినప్పుడు ఉన్నత పదవులతో బహూకరింపబడతారు. సహింపరానిదిగా తయారైన యీ శృంఖలాన్ని వదిలించుకోవడానికి ముప్పదేళ్లుగా అమెరికన్లు ఎలా ప్రయత్నిస్తున్నారో బాగా తెలిసిన విషయమే. అయినా కూడా వారు అంతకంతకు మరింత లోతుగా అవినీతి అనే బురదలో కూరుకు పోతూనే వున్నారు. ఆదిలో, సమాజపు సాధనంగా ఉద్దేశింపబడిన ఈ రాజ్యాధికారం, సమాజం నుండి విడివడే యీ క్రమం అమెరికాలోనే మనం విస్పష్టంగా చూడగలం. ఇక్కడ రాజవంశం

లేదు, ప్రభువర్గం లేదు, రెడ్ ఇండియన్లపై కాపలా కాస్తున్న కొద్దిమంది తప్ప స్థాయీ సైన్యం లేదు, పెర్మనెంటు ఉద్యోగాలు, లేకపోతే పెన్షన్ హక్కులు గల బ్యూరాక్రసీ లేదు. అయినా కూడా, మనకిక్కడ రాజకీయ చట్టా వ్యాపారుల రెండు పెద్ద ముఠాలు కనిపిస్తాయి. అవి ఒక దాని తర్వాత మరొకటి రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకుని, అత్యంత అవినీతికరమైన సాధనాలతో, అత్యంత అవినీతికరమైన ఫలితాల కోసం, దాన్ని దుర్వినియోగం చేస్తాయి. వీళ్ల పైకేమో ఆడంబరంగా జాతి సేవకులుగా నటిస్తారు, వాస్తవానికేమో దానిపై పెత్తనం చలాయించి, దాన్ని దోచుకుంటారు. అటువంటి రాజకీయవేత్తల యీ రెండు బృహత్ బృందాలకూ వ్యతిరేకంగా జాతి మొత్తం శక్తిహీనంగా తయారైంది.

రాజ్యమూ, రాజ్యాంగాలూ సమాజ సేవకుల దశ నుండి సమాజ యజమానుల దశకు పరివర్తన చెందడానికి వ్యతిరేకంగా — యింతకు పూర్వపు రాజ్యాలన్నింటిలోనూ యీ పరివర్తన తప్పనిసరిగా ఉండేది — కమ్యూన్ రెండు నిర్దుష్టమైన సాధనాలు వాడింది. మొదటిది, అది అన్ని ఉద్యోగాలనూ — అవి పరిపాలనకు, న్యాయశాఖకు, విద్యకు వేటికి సంబంధించినవైనా — అందుకు సంబంధించిన వారందరి చేతా సార్వజనీన ఓటింగు ప్రాతిపదికపై ఎంపిక ద్వారా నింపింది. అలా ఎన్నుకున్న వారిని ఎప్పుడంటే అప్పుడు వెనక్కి పిలిచే హక్కు కూడా వారికి కల్పించబడింది. రెండవది, అది అధికారులందరికీ, చిన్న, పెద్ద తారతమ్యం లేకుండా, యితర కార్మికులు పొందే వేతనాలను మాత్రమే చెల్లించింది. ఏ ఒక్క వ్యక్తికీ కూడా కమ్యూన్ 6000 ఫ్రాంకులకన్న ఎక్కువ జీతం చెల్లించలేదు. ఆయా ప్రాతినిధ్య సంస్థల ప్రతినిధులకు అనువర్తించే ఆజ్ఞలను జోడించడంతో బాటు, ఈవిధంగా పదవీకాంక్షనూ, ఉన్నత స్థానాల వేటనూ నిరోధించేందుకు పటిష్ఠమైన అవరోధాలు కల్పింపబడ్డాయి.

పూర్వపు రాజ్యాధికారాన్ని యిలా ఛిన్నాభిన్నం చెయ్యడమూ (sprengung), దాని స్థానంలో ఓ కొత్త, నిజమైన ప్రజాస్వామిక రాజ్యాధికారాన్ని నెలకొల్పడమూ "అంతర్యుద్ధం" మూడవ భాగంలో సవివరంగా వర్ణింపబడింది. కానైతే, యిక్కడ మరో మారు, దానికి సంబంధించిన కొన్ని లక్షణాలను గురించి క్లుప్తంగా చెప్పుకోవడం అవసరం. ఎందుకంటే, ప్రత్యేకించి జర్మనీలో రాజ్యం పట్ల గల మూఢ నమ్మకం తత్వశాస్త్రం నుండి బూర్జువావర్గంయొక్క, చివరకు పలువురు కార్మికులయొక్క సాధారణ చైతన్యంలోకి చొప్పించబడింది. తాత్విక భావన మేరకు, రాజ్యం అంటే "భావ సిద్ధి", లేక, భువిపై దైవ రాజ్యం, తాత్విక భాషలోకి అనువదిస్తే, శాశ్వత సత్యధర్మాలు సిద్ధి పొందిన, లేక సిద్ధి పొందాల్సిన రంగం. దీన్నుండే రాజ్యం పట్లా, దానికి సంబంధించిన ప్రతి ఒక దాని పట్లా ఆరాధనా భావం జనిస్తోంది, ప్రజలు తమ బాల్యం నుంచీ

కూడా యావత్తు సమాజానికీ ఉమ్మడిగా ఉండే వ్యవహారాలూ, ప్రయోజనాలూ గతంలో వలె తప్ప, అంటే రాజ్యం ద్వారానూ, పెద్ద జీతాలు మేసే దాని అధికారుల ద్వారానూ తప్ప కాపాడబడటం సాధ్యంకాదని ఊహించడానికి అలవాటుపడిన కారణంగానే యీ ఆరాధనా భావం ప్రజల మనసుల్లో తేలికగా నాటుకుంటోంది. వంశపారంపర్య రాజరికం పట్ల విశ్వాసాన్ని విసర్జించి, ప్రజాస్వామిక రిపబ్లిక్కును పూర్తిగా బలపరచిన ప్పుడు, తాము అసాధారణమైన ముందడుగు వేసినట్లు ప్రజలు భావించారు. అయితే నిజానికి, రాజ్యమంటే ఒక వర్గం మరొక వర్గాన్ని అణచడానికి వినియోగించుకొనే యంత్రాంగం తప్ప వేరేమీ కాదు, అది రాజరికంలోనైనా అంతే, ప్రజాస్వామిక రిప బ్లిక్‌లోనైనా అంతే. మహా అయితే వర్గాధిపత్యం కోసం తను చేసిన వీరోచిత పోరాటా నంతరం, శ్రామికవర్గం వారసత్వంగా పొందే చెడుగే రాజ్యమంటే. కమ్యూన్ లాగే గెలిచిన శ్రామికవర్గం రాజ్యానికి సంబంధించిన నికృష్ట అంశాలన్నింటినీ సాధ్యమైనంత ఎక్కువగా వెన్వెంటనే చెలిగి పారెయ్యాలి. నూతన, స్వేచ్ఛాయుత సాంఘిక పరిస్థితుల్లో పెరిగిన ఒక తరం, రాజ్యానికి సంబంధించిన పనికిమాలిన సామానంతటినీ చెత్త కుప్పపై విసిరెయ్య గలిగే దాకా యిది తప్పదు.

ఇటీవల, సోషల్-డెమోక్రటిక్ అల్పబుద్ధులు[19] "శ్రామికవర్గ నియంతృత్వం" అన్న పదాలు విని మరోమారు చచ్చేటంత భయంతో హడిలిపోతున్నారు. అయ్యా, పెద్ద మనుషులారా, యింతకీ మీరు ఈ శ్రామికవర్గ నియంతృత్వం ఎలా ఉంటుందో తెలుసుకో దలుచుకున్నారా? అయితే పారిస్ కమ్యూన్‌ని చూడండి. అదే శ్రామికవర్గ నియంతృత్వమంటే.

లండన్, పారిస్ కమ్యూన్
ఇరవైయవ వార్షికోత్సవం సందర్భంగా
1891, మార్చి 18

"Die Neue Zeit"లో
ప్రచురణ: బైండు 2,
నంబరు 28, 1890–91,
అది కాక
Marx "Der Bürgerkrieg
in Frankreich," Berlin, 1891 పుస్తకంలో

# కార్ల్ మార్క్స్

## ఫ్రెంచి-ప్రష్యన్ యుద్ధంపై ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్స్ అసోసియేషన్ జనరల్ కౌన్సిలు మొదటి విజ్ఞప్తి[20]

### యూరపు, అమెరికాలలోని ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్స్ అసోసియేషన్ సభ్యులకు

1864 నవంబరు నాటి, ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్స్ అసోసియేషన్ ప్రారంభక విధాన ప్రకటనలో మేమిలా చెప్పాం: "కార్మికవర్గంయొక్క విముక్తి కావాలంటే కార్మికుల మధ్య స్నేహ పూర్వకమైన ఏకీభావం అవసరం. కాగా, ఘాతుక విదేశాంగ విధానాన్ని కొనసాగిస్తూ, జాతుల దురభిప్రాయాలను రెచ్చగొడుతూ, కొల్లగొట్టుకొనే యుద్ధాల్లో ప్రజల రక్తాన్ని చిందించి, సంపదను దుర్వ్యయంచేస్తే ఆ మహత్తర లక్ష్యాన్ని వాళ్ళు ఎలా సాధించగలుగుతారు?" ఇంటర్నేషనల్ లక్ష్యమైన విదేశాంగ విధానాన్ని మేమీ క్రింది మాటల్లో నిర్వచించాం: "వ్యక్తుల మధ్య సంబంధాలలో ఏ సరళమైన నైతిక నియమాలూ, ధర్మ సూత్రాలూ పాటింపబడాలో, జాతుల మధ్య పరస్పర సంబంధాల్లో కూడా అవే అత్యున్నత నియమాలూ, సూత్రాలూ పరిరక్షింపబడాలి."[21]

ఫ్రాన్సులో వర్గాల మధ్య యుద్ధాన్ని వినియోగించుకొని అధికారాన్ని వశంచేసుకుని, మధ్య మధ్య విదేశాల్లో యుద్ధాలతో దాన్ని పొడిగించుకున్న లూయీ బోనపార్ట్ ఆది నుంచీ కూడా ఇంటర్నేషనల్‌ను ప్రమాదకరమైన శత్రువుగా పరిగణించాడంటే ఆశ్చర్యమేమీ లేదు. జనవాక్యసేకరణ (ప్లెబిస్సైట్)[22]కు ముందు, ఫ్రాన్సు అంతటా, పారిస్, లియాన్, రువాన్, మార్సేల్, బ్రెస్ట్, మొదలైన చోట్ల వున్న ఇంటర్నేషనల్ వర్కింగ్ మెన్స్ అసోసియేషన్ కార్యనిర్వాహక కమిటీల సభ్యులపై దాడులు చెయ్యాల్సిందిగా అతడు ఆజ్ఞాపించాడు. ఇంటర్నేషనల్ తన హత్యకు కుట్ర చేస్తున్న ఒక రహస్య సంఘమన్న సాకుతో అతనీ పనికి పూనుకొన్నాడు. ఇది పరమ అసందర్భమైన అవకతవక సాకు అన్న విషయాన్ని అతని సొంత న్యాయాధిపతులే త్వరలో బహిర్గతం చేశారు. ఇంటర్నేషనల్ యొక్క ఫ్రెంచి శాఖలు చేసిన అసలు నేరమేమిటట? జనవాక్యసేకరణలో ఓట్లు

వేసి పాల్గొనడమంటే, యింట నిరంకుశత్వానికీ, బయట యుద్ధాలకీ అనుకూలంగా ఓటు వెయ్యడం తప్ప వేరేమీ కాదని అవి ఫ్రెంచి ప్రజలకు బాహాటంగా గట్టిగా నొక్కి చెప్పాయి. ఫ్రాన్సులోని పెద్ద పట్టణాలన్నింటిలోనూ, పారిశ్రామిక కేంద్రాలన్నింటిలోనూ కార్మికవర్గం జనవాక్యసేకరణను తిరస్కరించేందుకు ఏకోన్ముఖంగా లేచిందంటే, నిజానికి ఆ ఘనత వాటిదే. దురదృష్టవశాత్తూ గ్రామీణ ప్రాంతాల్లో అజ్ఞానానిది పైచేయిగా వుంది. స్టాక్ ఎక్స్చేంజీలు, మంత్రి మండలులు, పాలకవర్గాలు, యూరప్ పత్రికలూ జనవాక్యసేకరణను ఫ్రెంచి కార్మికవర్గంపై ఫ్రెంచి చక్రవర్తి ఘనవిజయంగా అభి వర్ణించాయి. ఒక వ్యక్తి హత్యకుకాక, జాతుల హత్యకు అదొక సంకేతమైంది.

1870 జూలైలో జరిగిన సైనిక కుట్ర,[23] 1851 డిసెంబరులో అధికారాన్ని హస్తగతం చేసుకోవడానికై జరిగిన రాజకీయ కుట్రకు[10] సవరింపబడిన మరో రూపం తప్ప వేరేమీ కాదు. మొదట్లో యిదంతా శుద్ధ అసంగతంగా కనిపించడంతో, ఫ్రాన్సు దీని వాస్తవిక ప్రాముఖ్యాన్ని గుర్తించలేదు. యుద్ధాన్ని గురించి మంత్రి వర్గం చెప్తున్న మాటలు కేవలం స్టాక్ ఎక్స్చేంజీ కుతంత్రం అని నిరసించిన డిప్యూటీ* మాటలనే ఫ్రాన్సు విశ్వసించింది. చివరకు జూలై 15న, శాసన సభలో యుద్ధం విషయం అధికారికంగా ప్రకటింపబడినప్పుడు, ప్రాథమిక సబ్సిడీలకు అనుకూలంగా ఓటు వెయ్యడానికి యావత్తు ప్రతిపక్షమూ తిరస్కరించింది, తియేర్ సైతం దాన్ని "హేయమైనది"గా తెగడాడు. పారిస్‌కు చెందిన స్వతంత్ర వార్తాపత్రికలన్నీ దాన్ని ఖండించాయి. మరో అద్భుతమైన విషయమేమిటంటే, వివిధ రాష్ట్రాలకు చెందిన పత్రికలు సైతం ఏకగ్రీవంగా యుద్ధ ప్రకటనను ఖండించాయి.

ఈలోగా, ఇంటర్నేషనల్‌కు చెందిన పారిస్ సభ్యులు తిరిగి తమ ప్రచారం ప్రారంభించారు. జూలై 12 నాటి "Réveil"[24] పత్రికలో వారు "సకల జాతుల కార్మికులకు" అనే తమ ప్రణాళికను ప్రకటించారు. దాని నుండి మేమీ క్రింది భాగాన్ని ఉటంకిస్తున్నాం:

> "యూరప్‌లో బలాబలాల సమతూకం సాకుతో, జాతీయ గౌరవ ప్రతిష్ఠల సాకుతో, ప్రపంచ శాంతికి రాజకీయ దురాశాపరుల కారణంగా మరోసారి ప్రమాదం వాటిల్లింది. ఫ్రెంచి, జర్మన్, స్పానిష్ కార్మికులారా! యుద్ధానికి వ్యతిరేకంగా మన నిరసనను మనమంతా ముక్తకంఠంతో చాటుదాం!... ఇతరులమీద ఆధిక్యత కోసమో, ఒక రాజవంశం కోసమో యుద్ధం అన్నది, కార్మికుల దృష్టిలో ఘాతుకమైన అసంగతం తప్ప

---

* జూల్ ఫ్రావ్. — సం.

వేరేమీ కాదు. రక్తం చిందించే విషయంలో తమను తాము మినహాయించుకొని, జనసామాన్యపు కడగండ్లలో లాభార్జనకు కొత్త అవకాశాలు వెతుక్కొనే వారి యుద్ధ ప్రకటనల పట్ల శాంతినీ, శ్రమనూ, స్వేచ్ఛనూ ప్రేమించే మనం మన నిరసనను వ్యక్తం చేస్తాం!... జర్మన్ సోదరులారా! మనలో చీలిక, రైన్ నది కిరువంకలా నిరంకుశత్వం పూర్తిగా విజయం పొందడానికి మాత్రమే దారితీస్తుంది.... సకల దేశాల కార్మికులారా! మన ఉమ్మడి కృషి ఫలితం ప్రస్తుతానికి ఏమైనప్పటికీ, ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్స్ అసోసియేషన్ సభ్యులమైన మేము, యే సరిహద్దులూ గుర్తించని మేము, చెరగని సంఘీభావ సూచకంగా, ఫ్రెంచి కార్మికుల శుభాకాంక్షలను, అభివందనాలను మీకు అందజేస్తున్నాం."

మా పారిస్ శాఖయొక్క యీ ప్రణాళిక తర్వాత, యిటువంటివే అనేక ఫ్రెంచి విజ్ఞప్తులు వెలువడ్డాయి. వాటిలోంచి జూలై 22న "Marseillaise"[24] పత్రికలో ప్రకటింపబడిన నెయ్‌ల్లి-సర్-సీన్ ప్రకటనను మాత్రమే మేమిక్కడ ఉటంకించగలం:

"ఈ యుద్ధం న్యాయమైనదా? — కాదు! ఈ యుద్ధం జాతీయమైనదా? — కాదు! ఇది కేవలం రాజవంశానికి సంబంధించినది మాత్రమే. మానవత్వం పేర, ప్రజాస్వామ్యం పేర, ఫ్రాన్సు వాస్తవ ప్రయోజనాల పేర, యుద్ధానికి వ్యతిరేకంగా ఇంటర్నేషనల్ నిరసనకు మేము సంపూర్తిగా, గట్టిగా కట్టుబడి వున్నాం."

ఒక విచిత్రమైన సంఘటన ద్వారా త్వరలోనే స్పష్టమైనట్లు, యీ నిరసనలు ఫ్రెంచి కార్మికుల వాస్తవ భావాలను వ్యక్తం చేశాయి. ఆదిలో లూయీ బోనపార్ట్ అధ్యక్షతన ఏర్పాటు చెయ్యబడిన డిసెంబరు 10వ ముఠా[25] కార్మికుల దుస్తులలో, యుద్ధ జ్వరాన్ని రెచ్చగొట్టే ప్రదర్శన సాగించేందుకు పారిస్ వీధుల్లో విచ్చలవిడిగా వదలబడినప్పుడు, కార్మిక పేటలకు చెందిన నిజమైన శ్రమజీవులు శాంతికి అనుకూలంగా బ్రహ్మాండమైన ప్రదర్శనలు ప్రారంభించారు. దానితో, పోలీసు శాఖ అత్యున్నతాధికారి అయిన పియెత్రీ, అసలైన పారిస్ వాసులు తమలో యిమిడి వున్న దేశభక్తి భావాలనూ, తమలో అతివేలంగా వున్న యుద్ధోత్సాహాన్నీ యితోధికంగా ప్రదర్శించారన్న సాకుతో, వీధి ప్రదర్శనలన్నింటికీ వెన్వెంటనే స్వస్తి పలకడం వివేకవంతమైన పనిగా భావించాడు.

ప్రష్యాతో లూయీ బోనపార్ట్ యుద్ధపు సంఘటనలు ఏమైనప్పటికీ, రెండవ సామ్రాజ్యపు చావుబాజా పారిస్‌లో యిప్పటికే మ్రోగింది. అది, అవహేళనగా, ఆభాసగా

ఎలా ఆరంభమైందో అలాగే అంతమవుతుంది. అయితే, మనమిక్కడ ఒక విషయాన్ని మరచిపోరాదు. యూరప్ రాజ్యాల ప్రభుత్వాలూ, పాలకవర్గాలే పద్దెనిమిదేళ్లపాటు పునరుద్ధరిత సామ్రాజ్య మనే క్రూర ప్రహసనాన్ని లూయీ బోనపార్ట్ ఆడటాన్ని సాధ్యం చేశాయన్నదే ఆ విశేషం.

జర్మన్ పక్షానికి సంబంధించినంతవరకు, ఈ యుద్ధం ఆత్మరక్షణ యుద్ధం. అయితే, తనను తాను రక్షించుకోవాల్సిన అవశ్యకతను జర్మనీకి కల్పించిందెవరు? జర్మనీపై యుద్ధం సాగించగలిగిన శక్తి లూయీ బోనపార్ట్‌కి కల్పించిన దెవరు? ప్రష్యా! తన దేశంలో జనసామాన్యపు వ్యతిరేకతను అణచివేసేందుకూ, హోహెన్‌జోలెర్న్ రాజవంశానికి జర్మనీని కట్టబెట్టగలిగేందుకూ వీలుగా అదే లూయీ బోనపార్ట్‌తో కుట్ర చేసినది మరె వరూ కాదు, బిస్మార్క్. సడోవా యుద్ధంలో[26] విజయానికి బదులు అపజయమే సంభవించి యుంటే, ప్రష్యా మిత్రులుగా ఫ్రెంచి సైనిక దళాలు జర్మనీని తుడిచిపెట్టి వుండేవి. తన విజయానంతరం, స్వతంత్ర జర్మనీని అస్వతంత్ర ఫ్రాన్సుకి పోటీ పెట్టాలని ప్రష్యా క్షణకాలమైనా కలగన్నదా? అందుకు సరిగా భిన్నంగా జరిగింది. తన పాత వ్యవస్థలో సహజసిద్ధంగా ఉన్న సొగసులన్నింటినీ జాగ్రత్తగా కాపాడుతూనే రెండవ సామ్రాజ్యానికి చెందిన సకల జిత్తులనూ, దాని నిసలైన నిరంకుశత్వాన్నీ, దాని కుహనా ప్రజాస్వామికతత్వాన్నీ, దాని రాజకీయ మాయాజాలాన్నీ, దాని ఆర్థిక నీచ స్వార్థ వ్యవహారాలనూ, దాని అపరిమిత వాగాడంబరాన్నీ, నీచపు గారడీ పనులనూ అది సంతరించు కుంది. అంతదాకా రైన్ నదికి ఒక ప్రక్కనే విలసిల్లిన బోనపార్టిస్టు పాలనకు కృత్రిమ ప్రతిరూపం అవతలి ప్రక్కన కూడా తయారైంది. అటువంటి పరిస్థితుల పర్యవసానం యుద్ధం కాక మరేమవుతుంది?

జర్మన్ కార్మికవర్గం ప్రస్తుత యుద్ధాన్ని ఖచ్చితమైన దాని ఆత్మరక్షణ స్వభావాన్ని కోల్పోనిచ్చి, దాన్ని ఫ్రెంచి ప్రజలకు వ్యతిరేకమైన యుద్ధంగా దిగజారనిస్తే విజయమైనా పరాజయమైనా దానికి సమానంగానే వినాశకరంగా పరిణమిస్తుంది. జర్మనీ స్వాతంత్ర్య యుద్ధానంతరం దానికి దాపురించిన కడగండ్లన్నీ మరింత ముమ్మరంగా తిరిగి సంభవిస్తాయి.

అయితే, ఇంటర్నేషనల్ సూత్రాలు జర్మన్ కార్మికవర్గంలో అత్యంత విస్తృతంగా వ్యాపించి బాగా లోతుగా వేరూనుకొని ఉన్నాయి కాబట్టి, అటువంటి దుష్పరిణామం సంభవిస్తుందని భయపడనక్కర్లేదు. ఫ్రెంచి కార్మికుల వాణి జర్మనీనుండి తిరిగి ప్రతిధ్వనించింది. బ్రున్స్‌విక్‌లో జూలై 16న జరిగిన కార్మికుల బహిరంగ సమావేశం పారిస్ ప్రణాళికతో తన పూర్తి ఏకీభావాన్ని ప్రకటించింది, ఫ్రాన్సు పట్ల జాతీయ

శ(తుభావాన్ని ఏహ్యాభావంతో (త్రోసిపుచ్చింది. తన తీర్మానాన్ని యీ (కింది మాటలతో ముగించింది:

"మేము అన్ని యుద్ధాలకూ శ(తువులం, అయితే, అన్నిటికన్న ఎక్కువగా, రాజవంశ(కమ పరిరక్షణ కోసం జరిగే యుద్ధాలకు మరింత బద్ధ వ్యతిరేకులం.... (ప్రగాఢమైన దుఃఖవిచారాలతో, గత్యంతరంలేని చెడుగుగా, మేమీ ఆత్మరక్షణ యుద్ధాన్ని సహించాల్సి వస్తోంది. కానైతే, యిదే సమయంలో, శాంతి యుద్ధాల సమస్యపై తుది నిర్ణయాధికారాన్ని ఆయా (ప్రజలకే చెందింపచేస్తూ, వారి భవితవ్యాలకు వారినే యజమానులను చేస్తూ యిటువంటి బృహత్తర సాంఘిక దురదృష్టం తిరిగి సంభవించడాన్ని అసాధ్యం చెయ్యమని, యావత్తు జర్మన్ కార్మికవర్గానికీ మేము విజ్ఞప్తి చేస్తున్నాం."

50,000 మంది సాక్సన్ కార్మికులకు (ప్రాతినిధ్యం వహించే (ప్రతినిధుల సమావేశం ఒకటి హెమ్నిట్స్‌లో జరిగింది. అది ఏక(గీవంగా యీ (కింది తీర్మానాన్ని ఆమోదించింది:

"జర్మన్ (ప్రజాస్వామ్యం పేరిట, (ప్రత్యేకించి సోషల్-డెమో(క్రటిక్ పార్టీగా ఏర్పడిన కార్మికుల పేరిట, మేమీ (ప్రస్తుత యుద్ధం కేవలం రాజవంశ పరిరక్షక యుద్ధమని (ప్రకటిస్తున్నాం.... (ఫ్రెంచి కార్మికులు మా వంక చాపిన సౌహార్ద్ర హస్తాన్ని అందుకొనేందుకు మేము సంతోషిస్తున్నాం.... 'సకలదేశాల కార్మికులారా, ఏకం కండి!' అన్న ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్స్ అసోసియేషన్ నినాదం గుర్తున్న మేము, సకల దేశాల కార్మికులూ మా మి(త్రులనీ, సకల దేశాల నిరంకుశులూ మా శ(తువులనీ ఎన్నడూ మరచిపోము."

ఇంటర్నేషనల్ యొక్క బెర్లిన్ శాఖ కూడా పారిస్ (ప్రణాళికకు యిలా జవాబిచ్చింది:

"మేము, మనసా, కర్మణా మీ నిరసనతో ఏకీభవిస్తున్నాం.... యుద్ధ భేరీ భాంకారాలు గాని, ఫిరంగి(మోతలు గాని, విజయం గాని, పరాజయం గాని, సకల దేశాల (శ్రామిక సంతాన మంతటినీ సమైక్యం చేసే ఉమ్మడి కృషి నుండి మమ్మల్ని మరల్చజాలవని మేము యిందు మూలంగా (ప్రమాణం చేస్తున్నాం."

ఇది యిలాగే వుండుగాక!

ఆత్మహత్యా సదృశమైన యీ పోరాట భూమికలో కారునల్లని రష్యా స్వరూపం ముందు కొస్తోంది. మాస్కోవైట్ (ప్రభుత్వం సరిగా తన కీలకమైన రైల్వే లైన్లను

అప్పుడే పూర్తి చేసిన తరుణంలో, అప్పటికప్పుడే ఫ్రాన్ దిశగా తన సైన్యాలను చేర వేస్తున్న తరుణంలో ఈ యుద్ధానికి సంకేతమివ్వబడటం ముంచుకురాబోతున్న ముప్పుకే సంకేతం. బోనపార్టిస్టు దురాక్రమణకు వ్యతిరేకంగా ఆత్మరక్షణ యుద్ధంలో జర్మన్లకి ఏకొంచెమైనా సానుభూతి లభించే అవకాశముంటే, ప్రష్యన్ ప్రభుత్వాన్ని కోసక్కుల సహాయాన్ని అర్థించనివ్వడం ద్వారా, లేక పొందనివ్వడం ద్వారా దాన్ని కాస్తా వెంటనే అది కోల్పోతుంది. వాళ్లొక విషయం గుర్తుపెట్టుకోవడం అవసరం. మొదటి నెపోలియన్‌కి వ్యతిరేకంగా తమ విముక్తి యుద్ధానంతరం,[4] జర్మనీ కొన్ని తరాలపాటు జారు పాదాల ముందు సాగిలపడివుంది.

ఇంగ్లీషు కార్మికవర్గం ఫ్రెంచి, జర్మన్ కార్మికుల దిశగా తన సంఘీభావ హస్తాన్ని చాస్తున్నది. ముంచుకురాబోతున్న ఘాతుక యుద్ధం ఏ మలుపు తిరిగినా, సకల దేశాల కార్మికుల పొత్తు చిట్టచివరకు యుద్ధాన్ని నిర్మూలిస్తుందని వారు గాఢంగా భావిస్తున్నారు. ఒక వంక అధికారికంగా ఫ్రాన్సు జర్మనీలు భ్రాతృ హత్యా సదృశమైన పోరాటంలోకి దూకబోతూంటే, ఫ్రాన్సు జర్మనీ దేశాల కార్మికులు ఒకరికి మరొకరు శాంతి సద్భావ సందేశాలు పంపుకొంటున్నారు. గత చరిత్రలో ఎక్కడా సాటిలేని యీ మహత్తర వాస్తవం ఉజ్వలతరమైన భవిష్యత్తుకు నాంది పలుకుతోంది. ఆర్థిక కడగండ్లతో, రాజకీయ అపస్మారక స్థితితో సతమతమైన పాత సమాజానికి విరుద్ధంగా ఒకానొక నూతన సమాజం ఆవిర్భవిస్తోందనీ, దాని జాతీయ పాలకుడు ప్రతి చోటా ఒక్కటే – శ్రమే! – కనుక, దాని అంతర్జాతీయ నియమం శాంతి అయివుంటుందనీ అది రుజువు చేస్తోంది. ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్స్ అసోసియేషనే ఆ నూతన సమాజానికి మార్గదర్శి.

ఆఫీసు: హై హల్‌బోర్న్, డబ్లియు.సి.,
1870, జూలై 23

1870 జూలై 19–23 తేదీల మధ్య
కార్ల్ మార్క్స్ చేత రచింపబడింది

ఇంగ్లీషులో కరపత్రంగా
1870 జూలైలో ప్రచురింపబడింది.
జర్మన్, ఫ్రెంచి, రష్యన్ భాషల్లో కరపత్రాల
రూపంలోను, పత్రికల్లోనూ 1870 ఆగస్టు–
సెప్టెంబరు మాసాల్లో ప్రచురింపబడింది

# కార్ల్ మార్క్స్

# ఫ్రెంచి-ప్రష్యన్ యుద్ధంపై ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్స్ అసోసియేషన్ జనరల్ కౌన్సిలు రెండవ విజ్ఞప్తి[27]

## యూరపు, అమెరికాలలోని ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్స్ అసోసియేషన్ సభ్యులకు

జూలై 23వ తేదీనాటి మా మొదటి విజ్ఞప్తిలో మేమిలా చెప్పాం: "రెండవ సామ్రాజ్యపు చావుబాజా పారిస్‌లో యిప్పటికే మ్రోగింది. అది, అవహేళనగా, ఆభాసగా ఎలా ఆరంభమైందో అలాగే అంతమవుతుంది. అయితే, మనమిక్కడ ఒక విషయాన్ని మరచి పోరాదు. యూరప్ రాజ్యాల ప్రభుత్వాలూ, పాలకవర్గాలే పద్దెనిమిదేళ్లపాటు పునరుద్ధరిత సామ్రాజ్యమనే క్రూర ప్రహసనాన్ని లూయీ బోనపార్ట్ ఆడటాన్ని సాధ్యం చేశాయన్నదే ఆ విశేషం."*

ఈవిధంగా, యుద్ధ చర్యలింకా వాస్తవంగా ప్రారంభం కాక ముందే, బోనపార్టిస్టు బుడగని గతానికి చెందిన విషయంగా మనం పరిగణించాం.

రెండవ సామ్రాజ్యపు పజీవత్వాన్ని గురించి మనం పొరపాటు పడనట్లే జర్మన్ యుద్ధం "ఖచ్చితమైన తన ఆత్మరక్షణ స్వభావాన్ని కోల్పోయి, ఫ్రెంచి ప్రజలకు వ్యతిరేకమైన యుద్ధంగా దిగజారే"** ప్రమాదం ఉందని భయపడినప్పుడు కూడా మనం పొరపడలేదు. నిజానికి, ఆత్మరక్షణ యుద్ధం లూయీ బోనపార్ట్ లొంగుబాటుతో, సెడాన్ లొంగుబాటుతో,[12] పారిస్‌లో రిపబ్లిక్ ప్రకటింపబడటంతోనే ముగిసింది. అయితే, యీ ఘటనలకు ఎంతో ముందుగానే, సామ్రాజ్యవాద సేనల పరమ వికృష్టత వెల్లడి అవగానే, ప్రష్యన్ సైనిక ముఠా ఈ యుద్ధాన్ని దురాక్రమణ యుద్ధంగా మార్చడానికి నిశ్చయించింది. అయితే అందుకు వాళ్ల కొక వికృతమైన ఆటంకం ఎదురైంది –

---

* 40–41వ పేజీలు చూడండి. – సం.

** 41వ పేజి చూడండి. – సం.

యుద్ధారంభంలో విల్‌హెల్మ్ రాజా స్వయంగా చేసిన ప్రకటనలే ఆ ఆటంకం. అతగాడు సింహాసనం నుండి ఉత్తర జర్మన్ రైహ్‌స్టాగ్ [పార్లమెంటు]ను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో, తను ఫ్రెంచి చక్రవర్తిపైననే యుద్ధం చేస్తాను కాని, ఫ్రెంచి ప్రజలపై కాదని ప్రకటించాడు. ఆగస్టు 11న, ఫ్రెంచి జాతిని ఉద్దేశించి అతనొక ప్రణాళికను జారీ చేశాడు. అందులో అతగాడు యిలా అన్నాడు:

> "ఫ్రెంచి ప్రజలతో, యింతకు ముందూ యిప్పుడూ కూడా శాంతియుతంగా బతకాలని కోరిన, కోరుకుంటున్న జర్మన్ జాతిపై, నెపోలియన్ చక్రవర్తి నేలమీదుగా, సముద్రంమీదుగా దాడి చేసిన కారణంగా, అతని దురాక్రమణను తిప్పి కొట్టడానికి గాను నేను జర్మన్ సేనల ఆధిపత్యాన్ని స్వీకరించాను. అంతే కాదు, సైనిక ఘటనల కారణంగా, ఫ్రాన్సు సరిహద్దులను నేను దాటాల్సి కూడా వచ్చింది."

"దురాక్రమణను తిప్పికొట్టడానికే" తను జర్మన్ సైన్యాధిపత్యాన్ని స్వీకరించానన్న ప్రకటన ద్వారా, యుద్ధపు ఆత్మరక్షణ స్వభావాన్ని నొక్కిచెప్పడంతో సరిపెట్టుకోకుండా, తను కేవలం ఫ్రాన్సు సరిహద్దులను "సైనిక ఘటనల కారణంగానే దాటాల్సి వచ్చిందని" కూడా అతను జోడించాడు. ఆత్మరక్షణ యుద్ధమే అయినా, "సైనిక ఘటనల" మూలంగా దాడి చర్యలకు పాల్పడక తప్పదు కదా మరి.

ఈవిధంగా, పవిత్రుడైన యీ రాజాగారు ఫ్రాన్సు ముందూ, యావత్తు ప్రపంచం ముందూ ఖచ్చితమైన ఆత్మరక్షణ యుద్ధం అన్న ప్రమాణంపై నిలబడ్డాడు. పాపం, మరి, అలాంటి పవిత్రమైన ప్రమాణం మంచి యిప్పుడతన్ని విముక్తుని చెయ్యడమెలా? అందుకని, అయిష్టంగా, జర్మన్ జాతియొక్క తిరుగులేని ఆజ్ఞను ఆయనగారు పాలిస్తున్నట్లు హొంగుదారులు నాటకమాడాల్సి వచ్చింది. అంతే, వాళ్లు వెంటనే, ప్రొఫెసర్లు, పెట్టుబడిదారులు, ఆల్డర్‌మెన్, పత్రికారచయితలతో కూడిన జర్మన్ లిబరల్ బూర్జువావర్గానికి సైగ చేశారు. 1846 మండి 1870 దాకా పౌర స్వేచ్ఛ కోసం జరిగిన తన పోరాటంలో సాటిలేని రీతిలో ఊగిసలాటను, అసమర్థతనూ, పిరికితనాన్నీ ప్రదర్శిస్తూ వచ్చిన ఆ బూర్జువావర్గం, యూరపియన్ రంగాన్ని వెనకేసుకు రావడానికి, జర్మన్ దేశభక్తి ముసుగులో సింహనాదంచేస్తూ సంతోషంగా ముందుకొచ్చింది. ప్రష్యన్ ప్రభుత్వం లోపాయికారీగా ఏ పథకాలనైతే వేసుకుందో, సరిగా అవే పథకాలను దానిచేత ఒప్పించినట్లు వ్యవహరించి, జర్మన్ బూర్జువావర్గం, తన పౌరస్వేచ్ఛా రక్షకుని వేషం ధరించింది. లూయీ బోనపార్ట్ దోషితత్వం పట్ల చిరకాలంగా తనకు గల, దాదాపుగా మత విశ్వాసం వంటి దానికిప్పుడది ప్రాయశ్చిత్తం చేసుకొని ఫ్రెంచి

రిపబ్లిక్కుని విచ్ఛిన్నం చెయ్యాలని గావుకేకలు పెట్టింది. ధైర్యశాలురైన ఆ దేశభక్తుల ప్రత్యేక వాదన లేమిటో మనమొక క్షణ కాలం చూదాం!

ఆల్సేస్, లొరైన్‌ల ప్రజలు జర్మన్ ఆలింగనం కోసం ఆత్రంగా ఎదురు తెన్నులు చూస్తున్నారని నమ్మించేందుకు వాళ్ళు సాహసించలేరు. పైగా, సరిగా అందుకు తల క్రిందులుగా వుంది పరిస్థితి. వారి ఫ్రెంచి దేశభక్తిని శిక్షించేందుకుగాను, తన రక్షణకు విడిగా ఒక దుర్గాన్ని కలిగిన స్ట్రాస్‌బుర్గ్ అనే పట్టణంపై, ఆరు రోజుల పాటు నిర్హేతుకంగా, ఘాతుకంగా "జర్మన్" ఫిరంగుల ద్వారా బాంబార్డు చేసి, దానికి నిప్పుపెట్టి, రక్షణలేని ఆ పట్టణ వాసుల్లో పలువురిని సంహరించారు! అయితే నేం, ఆ రాష్ట్రాల భూభాగం ఒక నాడు, పూర్వపు జర్మన్ సామ్రాజ్యానికి చెందినది.[28] అందుచేత, ఆ భూభాగాన్నీ, దానిపై పెరిగిన జనాన్నీ కాలదోషం పట్టిపోయినా తిరుగులేని జర్మన్ ఆస్తిగా వశంచేసుకోవాలి. యూరప్ పటాన్ని పూర్వపు రాజవంశావళికి అనుగుణంగా తిరిగి తీర్చి దిద్దాలంటే, బ్రాండెన్‌బుర్గ్ ఎలెక్టార్ [ప్రభువు], ప్రష్యన్ వలసలను కలిగివున్నా కూడా, ఒక నాడు పోలిష్ రిపబ్లిక్‌కు కప్పంచెల్లించే సామంత ప్రభువుగా[29] ఉండేవాడన్న సంగతి మరవరాదు.

అయితే, మరింత విజ్ఞులైన దేశభక్తులు మాత్రం, ఆల్సేస్, జర్మన్ భాష మాట్లాడే లొరైన్ ప్రాంతాలు, ఫ్రెంచి దురాక్రమణకు వ్యతిరేకంగా "భౌతిక హామీ"గా కావాలంటున్నారు. హేయమైన యీ వాదన పలువురు ధైర్యహీనులను కంగారుపెట్టిన కారణంగా దీన్ని మరింత సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం మనకి ఏర్పడుతోంది.

రైన్ ఎదుటి గట్టుతో పోలిస్తే ఆల్సేస్ ఉనికి, బేసిల్ గెర్మెర్‌‌స్‌హైమ్‌లకు మధ్యగా స్ట్రాస్‌బుర్గ్ వంటి పెద్ద దుర్గం ఉండటం, దక్షిణ జర్మనీ నుండి ఫ్రాన్సుపై దాడి చెయ్యడానికి కొన్ని యిబ్బందులు కల్పిస్తూండగా, అందుకు భిన్నంగా దక్షిణ జర్మనీపై ఫ్రాన్సు దాడి చెయ్యడానికి మిక్కిలి అనుకూల పరిస్థితి ఉంది. ఆల్సేస్, జర్మన్ భాష మాట్లాడే లొరైన్ ప్రాంతాలను కలుపు కోవడంవల్ల దక్షిణ జర్మనీకి మరింత బలమైన సరిహద్దు ఏర్పడే మాటా నిజమే. అప్పుడిక దక్షిణ జర్మనీకి తన దీర్ఘ సరిహద్దులో ఉన్న వోస్గెస్ పర్వతపు అత్యున్నత శిఖరంపైనా, తన ఉత్తర కనుమల రక్షణకు అనువైన దుర్గాలపైనా ప్రాజాపత్యం ఏర్పడుతుంది. దీనికితోడు మెట్స్‌ని కూడా కలుపుకుంటే, జర్మనీపై సైనిక దాడులు చేసేందుకు వీలైన రెండు ప్రధానమైన సైనిక స్థావరాలను ఫ్రాన్సు తాత్కాలికంగా కోల్పోతుంది. అయితే అంత మాత్రాన, అది వాన్సీలోనో, లేక వెర్డెన్‌లోనో కొత్త స్థావరాన్ని నిర్మించుకోవడానికి యిది అటంకం కాబోదు. కోబ్లెంట్స్, మైన్‌త్స్, గెర్మెర్‌స్‌హైమ్, రస్టాట్, ఉల్మ్‌లను — ఫ్రాన్సుకి వ్యతిరేకంగా వినియోగించుకోగల సైనిక స్థావరాలే యివన్నీ, ఈ యుద్ధంలో ధారాళంగా వినియోగించుకోబడినవే కూడా

యివన్నీ — కలిగియున్న జర్మనీ, ఫ్రాన్సు స్ట్రాస్‌బుర్గ్, మెట్స్ దుర్గాలను కలిగి వుండటాన్ని, ఏ కొంచెమో ప్రాముఖ్యం కలిగిన కేవలం రెండే రెండు దుర్గాలను కలిగి వుండటానికి ఏ ముఖం పెట్టుకుని అభ్యంతరం చెప్పగలదు? పైగా, దక్షిణ జర్మనీ, ఉత్తర జర్మనీ నుండి భిన్నమైన రాజ్యమైనప్పుడే దక్షిణ జర్మనీకి స్ట్రాస్‌బుర్గ్ నుండి ప్రమాదం ఏర్పడుతుంది. 1792–95 మధ్య దక్షిణ జర్మనీపై ఆ దిశ నుంచి ఎన్నడూ దాడి జరగలేదు. ఫ్రెంచి విప్లవానికి వ్యతిరేకంగా జరిగిన యుద్ధంలో ప్రష్యా కూడ భాగస్వామి కావడమే యిందుకు కారణం. కాని, ఎప్పుడైతే ప్రష్యా తనకు తానుగా 1795లో శాంతి సంధి చేసుకొని, దక్షిణాన్ని దాని ఖర్మానికి దాన్ని వదిలేసిందో, ఆ వెంటనే స్ట్రాస్‌బుర్గ్ స్థావరం నుండి దక్షిణ జర్మనీపై దాడులు ప్రారంభమయ్యాయి. ఆ దాడులు 1809 దాకా కొనసాగాయి. అసలు విషయమేమిటంటే, సమైక్య జర్మనీ, తన సేనలన్నిటినీ, ప్రస్తుత యుద్ధంలో యిది జరిగినట్లు, ప్రస్తుత సార్‌లూయీ, లండావ్‌ల మధ్య కూడగట్టుకుని, మైన్‌ట్స్ మెట్స్‌ల మధ్య రోడ్డుపై వాటిని ముందుకు నడిపితే, లేక ఎదుటి దాడిని ఎదుర్కొంటే స్ట్రాస్‌బుర్గ్ నుండి గాని, ఆల్సేస్‌లోని ఏ ఫ్రెంచి సైన్యం నుండి గాని ఎదురయ్యే ప్రమాదాన్ని తిప్పికొట్టగలదు. జర్మన్ సైనిక దళాల్లో అధిక భాగం అక్కడ కేంద్రీకరింపబడి ఉండగా స్ట్రాస్‌బుర్గ్ నుండి దక్షిణ జర్మనీపైకి పురోగమించే ఏ ఫ్రెంచి సైన్యాన్నైనా చుట్టుముట్టడం, ప్రధాన సైన్యంతో దాని సంబంధాలను తెగకొట్టడం కష్ట సాధ్యమైన పనేమీ కాదు. పోతే, ప్రస్తుత దండయాత్ర ఏమైనా రుజావుచేసిందంటే ఫ్రాన్సుపై జర్మనీ నుండి దాడి చెయ్యడం సుగమ మన్నదే అది.

కాని, నిజం చెప్పకోవాలంటే, జాతుల సరిహద్దులను నిర్ణయించడానికి, సైనిక కారణాలనే సూత్రంగా పరిగణించడం అసంగతమూ, అసందర్భమూ అయిన విషయం కాదా? ఈ సూత్రమే కనక వర్తించేట్లయితే, వెనీషియా, మించో సరిహద్దు రేఖలు యీనాటికీ ఆస్ట్రియాకే చెందుతాయి. బెర్లిన్‌కి నైరుతి దిశ నుంచి వున్న దాడి ప్రమాదంకన్న, పారిస్‌కి ఈశాన్య దిశ నుంచి దాడి ప్రమాదం నిస్సంశయంగా ఎక్కువగా ఉన్నది కనుక, రైన్ సరిహద్దు రేఖ ఫ్రాన్సుకే చెందాల్సి వుంటుంది. సైనిక ప్రయోజనాల చేతనే సరిహద్దులు నిర్ణయింపబడాలంటే, డిమాండ్లకు అంతే వుండదు. ఎందుకంటే, ప్రతి సైనిక సరిహద్దు రేఖలోనూ ఏదో ఒక లోపం ఉండనే ఉంటుంది. సరిహద్దు బయట వున్న మరింత భూభాగాన్ని ఆక్రమించుకొని, దాన్ని మెరుగొనర్చుకొనే అవకాశమెప్పుడూ ఉంటూనే ఉంటుంది. పైగా, ఈ సరిహద్దులన్నవి విజేతలు విజితులపై రుద్దేవై యుంటాయి కనుకను, తత్పర్యవసానంగాను కొత్త యుద్ధాల బీజాలు కలిగి వుంటాయి. కనుక, ఇవే యిక న్యాయమైన తుది సరిహద్దులంటూ అంతిమంగా నిర్ణయించడమన్నది సాధ్యం కాదు.

చరిత్ర యావత్తూ మనకి తెలియజెప్పే గుణపాఠం యిదే. జాతుల విషయంలోనూ, అలాగే, వ్యక్తుల విషయంలో కూడా యిదంతే. దాడి అవకాశం వాళ్లకి లేకుండా చెయ్యాలంటే వాళ్లకిగల రక్షణ సాధనాలను తొలగించాలి. వాటిని తగ్గిస్తేనే సరిపోదు, వాటి గొంతు నులిమెయ్యాలి. ఒకానొక జాతి జీవశక్తిని విచ్ఛిన్నం చేసేందుకు గాను ఏ విజేత అయినా సరైన "భౌతిక హామీలు" తీసుకున్నాడంటే, అది టిల్సిట్ శాంతి సంధి[30] ద్వారా మొదటి నెపోలియనేనని చెప్పాలి. దాన్ని ప్రష్యాకీ, మిగిలిన జర్మనీకీ వ్యతిరేకంగా అతను అమలు జరిపిన తీరు కూడా గమనార్హమైనదే. అయితేనేం, మరికొన్ని సంవత్సరాల తర్వాత, బ్రహ్మాండమైన అతని బలాన్ని జర్మన్ ప్రజలు బురిగిపోయిన వెదురు బొంగును విరిచినట్లు విరిచేశారు. మొదటి నెపోలియను ప్రష్యా నుండి గుంజుకున్న "భౌతిక హామీ"తో పోలిస్తే ప్రష్యా యీనాడు, ఫ్రాన్సుపై రుద్దాలని, రుద్దకలనవి పగటి కలలు గంటున్న "భౌతిక హామీలు" ఏపాటి? ఫలితం తక్కువ వినాశకరంగా ఏమీ ఉండదు. ఫ్రాన్సు నుండి ఎన్ని చదరపు మైళ్ల భూభాగాన్ని ఆక్రమించుకున్నారన్న దాన్నిబట్టి కాకుండా, 19వ శతాబ్దపు ఉత్తరార్ధంలో దురాక్రమణ విధాన పునరుద్ధరణ నేర తీవ్రతను బట్టి చరిత్ర తన దండన ప్రమాణాన్ని నిర్ణయిస్తుంది!

అయితే, ట్యుటానిక్[31] దేశభక్తికి వకాలతుదారులు జర్మన్లను ఫ్రెంచి వారితో కలిపి ఒకే గాటన కట్టి గందరగోళం చెయ్యరాదంటారు. మాకు కావలసింది భద్రతే గాని, కీర్తి కాదు. జర్మన్లు స్వతస్సిద్ధంగా శాంతికాములైన ప్రజలు. జాగరూకతతో కూడిన వారి పరిరక్షణలో, ఆక్రమణ సైతం భవిష్యత్తులో యుద్ధ పరిస్థితి నుంచి శాశ్వత శాంతి ప్రమాణంగా మారుతుంది. 18వ శతాబ్దపు విప్లవాన్ని సన్నీలతో అణచివేసేందుకు గాను 1792లో ఫ్రాన్సుపై దండెత్తినది, జర్మన్లు కాదనుకోండి. ఇటలీని లోబరుచుకొని, హంగరీని పీడించి, పోలండును విచ్ఛిన్నం చేసి, తమ చేతులను పంకిలం చేసుకున్నది జర్మన్లు కాదు. వారి ప్రస్తుత సైనిక వ్యవస్థ, యావత్తు వయోజన పురుష జనాభానూ రెండు భాగాలుగా విభజిస్తుంది — ఒకటేమో కొలువు చేస్తున్న స్థాయీ సైన్యం, మరొకటి రిజర్వులో వున్న స్థాయీ సైన్యం. ఈ రెండూ కూడా సమానంగానే దైవదత్తాధికారంచేత పాలకులైన వారికి పరమ విధేయాలే. అటువంటి వ్యవస్థ అన్నమాట, శాంతిని నిలవడానికి "భౌతిక హామీ," నాగరికతయొక్క చరమ లక్ష్యమూను! మిగతా అన్ని చోట్ల లాగే, జర్మనీలోనూ, అధికారంలో ఉన్నవారి వంది మాగధులు కపటమైన ఆత్మస్తవమనే ధూపంతో ప్రజాభిప్రాయాన్ని విషాక్తం చేస్తారు.

మెట్స్, స్ట్రాస్‌బర్గ్‌లలోని ఫ్రెంచి దుర్గాలను చూసినంత మాత్రాననే భగ్గున మండి పడుతున్నట్లు నటించే ఆ జర్మన్ దేశభక్తులకు, వార్సా, మోడ్లిన్, ఇవాన్‌గొరోద్‌లలోని మాస్కోవైట్ విస్తృత దుర్గ శ్రేణివల్ల ప్రమాదమేమీ కనిపించడంలేదు. బోనపార్టిస్టు

దాడి దారుణాల పట్ల ఒక మూల కుటిల సంతుష్టితో చూస్తూ, మరో వంక నిరంకుశ ప్రభు రక్షణ అనే దౌర్భాగ్యం పట్ల చూసీ చూడనట్లు ఊరుకుంటారు.

1865లో లూయీ బోనపార్ట్ బిస్మార్కుల మధ్య పరస్పర వాగ్దానాలు జరిగినట్లే, 1870లో గోర్చకోవ్ బిస్మార్కుల మధ్య పరస్పర వాగ్దానాలు జరిగాయి.[32] 1866 నాటి యుద్ధంతో ఆస్ట్రియా ప్రష్యాలు రెండూ కూడా అలసిపోతాయనీ, జర్మనీ విషయంలో తను తీర్పరిగా వుంటాననీ లూయీ బోనపార్ట్ భ్రమించినట్లే, 1870 నాటి యుద్ధంతో జర్మనీ ఫ్రాన్సులు రెండూ అలసిపోయి, పశ్చిమ యూరప్ విషయంలో తను తిరుగులేని తీర్పరిగా వుంటానని అలెగ్జాండ్ర్ భ్రమించాడు. ఉత్తర జర్మన్ యూనియన్[33] తన ఉనికికి భంగకరమైనదని రెండవ సామ్రాజ్యం అనుకున్నట్లే, ప్రష్యా నాయకత్వానగల జర్మన్ సామ్రాజ్యపు ఉనికి తనకు ప్రమాదకరమని నిరంకుశ రష్యా అనుకొని ఉండాలి. పాత రాజకీయ వ్యవస్థ నియమమే అంత. ఈ వ్యవస్థ పరిధిలో ఒక రాజ్యపు లాభం మరో రాజ్యపు నష్టం. యూరపుపై జారుకుగల సార్వభౌమ ప్రభావానికి జర్మనీపై అతనికి సంప్రదాయసిద్ధంగా ఉంటూ వచ్చిన పట్టే మూలం. రష్యాలోనే రాజరికపు కుదుళ్లను కదల్చివేసే సాంఘిక శక్తులు అగ్ని పర్వతాల్లా లేస్తూంటే అటువంటి విదేశీ ప్రతిష్ఠను కోల్పోవడాన్ని జారు సహించగలడా? 1866 యుద్ధానంతరం బోనపార్టిస్టు పత్రికలు వాడిన భాషను మాస్కోవైట్ పత్రికలు అప్పుడే పునశ్చరణ చేస్తున్నాయి. ఫ్రాన్సుని రష్యా కౌగిలిలోకి నెట్టడం ద్వారా జర్మనీకి స్వేచ్ఛా శాంతులు లభిస్తాయని ట్యూటానిక్ దేశభక్తులు నిజంగానే విశ్వసిస్తున్నారా? తనకి వున్న ఆయుధ సంపదా, గెలుపు పట్ల ధీమా, రాజవంశ కుట్రలే ఫ్రాన్సును విచ్ఛిన్నం చెయ్యడానికి జర్మనీని వడిపేట్లయితే, అప్పుడిక దాని ముందు రెండే రెండు మార్గాంతరాలుంటాయి. అప్పుడది ఏది ఏమైనా సరే రష్యన్ ఆక్రమణ విధానానికి <u>ప్రకటిత</u> సాధనమైనా కావాలి, లేకపోతే, కొద్ది విరామానంతరం, తిరిగి మరో "ఆత్మరక్షణ" యుద్ధానికైనా సన్నద్ధం కావాలి. ఆ యుద్ధం నవావిష్కృత మతారపు "స్థానిక" యుద్ధంగా మాత్రం ఉండబోదు. అది <u>జాతి యుద్ధంగా</u> – స్లావ్, రోమన్ జాతుల సంయుక్త శక్తికి వ్యతిరేక యుద్ధంగా ఉంటుంది.

జర్మన్ కార్మికవర్గం యుద్ధాన్ని నివారించలేక, జర్మన్ స్వాతంత్ర్య యుద్ధంగా, ఫ్రాన్సునూ, యూరప్‌నూ రెండవ సామ్రాజ్యమనే పీడకల నుండి విముక్తంచేసే యుద్ధంగా దాన్ని కృతనిశ్చయంతో బలపరచింది. గ్రామీణ శ్రమజీవులతోబాటు జర్మన్ కార్మికులే, అర్ధాకలితో బ్రతుకుతున్న తమ కుటుంబాలను వెనకవిడిచి, వీరోచితమైన సైన్యంలో జీవ కేంద్రం అయ్యారు. విదేశాల్లో యుద్ధాల వల్ల దిగవాసిల్లిపోయిన వారు, స్వదేశంలో దుర్భర దైన్యం కారణంగా మరింత దిగవాసిల్లిపోతారు. మరి వారి

ప్పుడు, "హామీలు" డిమాండు చెయ్యడానికి ముందుకొస్తున్నారు. తాము చేసిన మహత్తర త్యాగాలు వమ్ముకావన్న హామీ కోరుతున్నారు. తాము స్వేచ్ఛను సాధించుకున్నామన్న హామీని వాంఛిస్తున్నారు. సామ్రాజ్యవాద సేనలపై సాధించిన విజయం, 1815లో లాగ, జర్మన్ ప్రజల పరాజయంగా[34] మార్చబడదన్న హామీని డిమాండు చేస్తున్నారు. ఈ హామీలలో మొట్టమొదటి హామీగా, ఫ్రాన్సుకు గౌరవప్రదమైన శాంతినీ, ఫ్రెంచి రిపబ్లిక్ గుర్తింపునూ వారు డిమాండు చేస్తున్నారు.

జర్మన్ సోషల్-డెమోక్రటిక్ వర్క్‌మెన్స్ పార్టీ కేంద్ర కమిటీ, యీ హామీల విషయంలో గట్టిగా నొక్కివక్కాణిస్తూ, సెప్టెంబరు 5న ఒక ప్రణాళిక జారీ చేసింది.

> "ఆల్సేస్, లొరైన్‌ల ఆక్రమణను మేము నిరసిస్తున్నాం. జర్మన్ కార్మికవర్గం తరపున మాట్లాడుతున్నామన్న చైతన్యంతో మేమీ పని చేస్తున్నాం. ఫ్రాన్సు జర్మనీల ఉమ్మడి ప్రయోజనాల దృష్ట్యా, శాంతి స్వేచ్ఛా ప్రయోజనాల దృష్ట్యా, ప్రాచ్య బర్బరత్వానికి వ్యతిరేకంగా పాశ్చాత్య నాగరికత ప్రయోజనాల దృష్ట్యా, జర్మన్ కార్మికులు ఆల్సేస్ లొరైన్‌ల ఆక్రమణను సహించబోరు.... అంతర్జాతీయ శ్రామికవర్గపు ఉమ్మడి లక్ష్యం కోసం, అన్ని దేశాల్లోని మా తోటికార్మికుల సరసన మేము నమ్మకంగా నిలబడతాం!"

దురదృష్టవశాత్తూ, వారి సత్వర విజయం సాధ్యమని మనం ఆశించలేం. శాంతి కాలంలోనే ఫ్రెంచి కార్మికులు దురాక్రమణపరుని నిరోధించడంలో విఫలమైనప్పుడు, ఆయుధాల కోలాహలం మధ్య జర్మన్ కార్మికులు విజేతని నిరోధించగలగడం సంభవమా? లూయీ బోనపార్ట్‌ను సర్వసామాన్య నేరస్తునిలా ఫ్రెంచి రిపబ్లిక్‌కి అప్పగించాలని జర్మన్ కార్మికుల ప్రణాళిక డిమాండు చేస్తోంది. వారి పాలకులేమో తద్విరుద్ధంగా, ఫ్రాన్సును నాశనం చెయ్యగల అత్యుత్తమ వ్యక్తిగా అతగాడినే తుయిలెరీపై[35] ప్రతిష్ఠించేందుకు గట్టిగా ప్రయత్నిస్తున్నారు. ఏదేమైనా, జర్మన్ బూర్జువావర్గంలాగ, జర్మన్ కార్మికవర్గం మెతక నరుకుతో తయారుకాలేదన్న సంగతిని చరిత్ర రుజువు చేస్తుంది. అది తన విధిని నెరవేరుస్తుంది.

దాని లాగే, ఫ్రాన్సులో రిపబ్లిక్ ఆవిర్భావానికి మనం స్వాగతం పలుకుతున్నాం. కానైతే, అదే సమయంలో మనకు కొన్ని అనుమానాలున్నాయి, అవి ఆధారరహితమైనవని రుజువవుతాయని ఆశిస్తున్నాం. ఆ రిపబ్లిక్ సింహాసనాన్ని కూలద్రోయ్యలేదు, ఖాళీ అయిన దాని స్థానాన్ని తీసుకుందంతే. ఆ రిపబ్లిక్, సాంఘిక విజయంగా కాకుండా, జాతీయ రక్షణ చర్యగా మాత్రమే ప్రకటింపబడింది. అది, ఒక తాత్కాలిక ప్రభుత్వం చేతుల్లో ఉంది. ఒక పక్క రోసిపోయిన ఆర్లియనిస్టులతోనూ,* మరో పక్క బూర్జువా

రిపబ్లికన్లతోనూ — వీరిలో కొందరిపై 1848 జూన్ నాటి తిరుగుబాటుకు[8] సంబంధించిన మాయని మచ్చ ఉంది — కూడిన ప్రభుత్వం యిది. ఆ ప్రభుత్వ సభ్యుల మధ్య జరిగిన పనివిభజన అవకతవకగా కనిపించక మానదు. ఆర్లియనిస్టులు సైనిక, పోలీసు స్థావరాలను ఆక్రమించుకోగా, కబుర్ల శాఖలు ప్రకటిత రిపబ్లికన్ల పాలబడ్డాయి. ఈ ప్రభుత్వంయొక్క తొలి చర్యలు కొన్నింటిని పరిశీలించినట్లయితే, సామ్రాజ్యం నుండి దానికి వారసత్వంగా లభించినది కేవలం శిథిలాలే కాదనీ, కార్మికవర్గం పట్ల భీతి కూడా దానికి సంక్రమించిందనీ స్పష్టమవుతుంది. తీక్ష్ణమైన పదజాలంలో రిపబ్లిక్ నుండి స్పష్టంగా అసాధ్యమైనది డిమాండ్ చెయ్యబడ్డదంటే, "సుసాధ్య" ప్రభుత్వం కోసం రంగం తయారుచేసే ప్రయత్నం కాక మరేమిటది? రిపబ్లిక్‌కి సంబంధించిన కొందరు బూర్జువా పాలకులు, రిపబ్లిక్ కేవలం ఒక మధ్యంతర వ్యవహారంగా మాత్రమే ఉండాలనీ, ఆర్లియనిస్టు అధికార పునరుద్ధరణకు యిదొక వారధిగా మాత్రమే ఉండాలనీ భావించలేదా?

ఈవిధంగా ఫ్రెంచి కార్మికవర్గం అత్యంత కష్టమైన పరిస్థితుల్లో వుంది. శత్రువు దాదాపుగా పారిస్ కవాటాలను తడుతున్న తరుణంలో, ప్రస్తుత సంక్షోభంలో, కొత్త ప్రభుత్వాన్ని కూల్చదోసే ఏ ప్రయత్నం చేసినా కూడా, అది దుస్సాహసికమైన వెర్రిపనే అవుతుంది. ఫ్రెంచి కార్మికులు పౌరులుగా తమ విధులను నిర్వర్తించాలి. అయితే అదే సమయంలో, ఫ్రెంచి రైతులు మొదటి సామ్రాజ్యానికి చెందిన జాతీయ స్మృతి చిహ్నాలతో భ్రమలకు లోనైనట్లుగా, 1792 నాటి జాతీయ స్మృతి చిహ్నాలతో భ్రమలకు గురి కాకుండా వారు చూసుకోవాల్సి ఉంది. వాళ్లు చెయ్యాల్సినది గతాన్ని పునరావృతం చెయ్యడం కాదు, భవిష్యత్తును నిర్మించుకోవాలి. తమ సొంత వర్గాన్ని సంఘటిత పరచేందుకు రిపబ్లికన్ స్వేచ్ఛావకాశాలను వారు నెమ్మదిగా పట్టుదలగా ఉపయోగించుకోవాలి. దానితో వారికి ఫ్రాన్సు పునరుద్ధరణకు, మన ఉమ్మడి లక్ష్యమైన — శ్రమ విమోచనకీ అవసరమైన నూత్న మహా శక్తులు ఒనగూడుతాయి. వారి శక్తి యుక్తులపైనా, వివేకంపైననే రిపబ్లిక్ భవితవ్యం ఆధారపడివుంది.

ఫ్రెంచి రిపబ్లిక్‌ను గుర్తించడానికి తమ ప్రభుత్వపు అయిష్టతను, బయట నుండి వచ్చిన ప్రయోజనకరమైన ఒత్తిడి ద్వారా, అధిగమించడానికి ఇంగ్లీషు కార్మికులు యిప్పటికప్పుడే చర్యలు తీసుకున్నారు.[36] బ్రిటిష్ ప్రభుత్వపు ప్రస్తుత తాత్సారం బహుశా, 1792 నాటి జాకొబిన్ వ్యతిరేక యుద్ధానికీ, అధికారాన్ని హస్తగతం చేసుకోవడానికి జరిగిన కుట్రను[10] బలపరచడంలో తను పూర్వం ప్రదర్శించిన అసభ్యమైన తొందరపాటుకు ప్రాయశ్చిత్తం చేసుకోవడానికే ఉద్దేశింపబడి యుండవచ్చు. ఇంగ్లీషు పత్రికలు కొన్ని సిగ్గుమాలి కోరుతున్న ఫ్రాన్సు విచ్ఛిత్తిని, తన సర్వ శక్తులా విరోధించా

ల్సిందిగా తమ ప్రభుత్వంపై ఇంగ్లీషు కార్మికులు ఒత్తిడి కూడా చేస్తున్నారు. ఇరవై సంవత్సరాలుగా లూయీ బోనపార్ట్‌ను యూరప్ భాగ్య విధాతగా ఆరాధించిన పత్రికలు కూడా సరిగా యివే. బానిస యజమానుల తిరుగుబాటు[37] పట్ల ఉన్మత్తావేశంతో హర్షం ప్రకటించినవీ యివే పత్రికలు. అప్పటి లాగే, యిప్పుడు కూడా, అవి బానిస యజమానికే ఊడిగం చేస్తున్నాయి.

ప్రతి ఒక్క దేశంలోని ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్స్ అసోసియేషన్ శాఖలూ కార్మికవర్గాన్ని కార్యాచరణకు పురికొల్పాలి. కార్మికులు తమ బాధ్యతను విసర్జిస్తే, వాళ్ళ అకర్మణ్యతలో మునిగి ఉండిపోతే, ఘోరమైన యీ ప్రస్తుత యుద్ధం, మరింత మారణ అంతర్జాతీయ యుద్ధాలకు దారితీసినదవుతుంది. ప్రతి దేశంలోనూ కార్మికులపై యుద్ధప్రభువుల, భూస్వాముల, పెట్టుబడిదారుల పునర్విజయానికి అది దారితీస్తుంది.

Vive la République!*

ఆఫీసు: 256, హై హాల్‌బోర్న్,
లండన్, డబ్లియు. సి.,
1870 సెప్టెంబరు 9.

1870 సెప్టెంబరు 6–9 తేదీల మధ్య
కార్ల్ మార్క్సుచే రచింపబడింది

ఇంగ్లీషు భాషలో 1870 సెప్టెంబరు
11–13 తేదీల మధ్య కరపత్రంగాను,
1870 సెప్టెంబరు – డిసెంబరు
మాసాల మధ్య జర్మన్ భాషలో
కరపత్రంగాను, జర్మన్, ఫ్రెంచి
పత్రికల్లోను ప్రచురింపబడింది

---

* రిపబ్లిక్ వర్ధిల్లుగాక. – సం.

# కార్ల్ మార్క్స్

# ఫ్రాన్సులో అంతర్యుద్ధం[1]

## ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్స్ అసోసియేషన్ జనరల్ కౌన్సిలు విజ్ఞప్తి

### యూరపు, అమెరికాలలోని అసోసియేషన్ సభ్యులందరికీ

## I

1870 సెప్టెంబరు 4వ తేదీన, పారిస్ కార్మికులు రిపబ్లిక్‌ను ప్రకటించారు. దాదాపు వెన్వెంటనే ఫ్రాన్సు అంతటా రిపబ్లిక్ పట్ల ఏకగ్రీవంగా హర్షామోదాలు వ్యక్తమయ్యాయి. సరిగా అటువంటి సమయంలో, రాజకీయవేత్త థ్యేర్, జనరల్ ట్రోషూల నాయకత్వాన అధికారదాహంగల బారిస్టర్ల కుట్ర ముఠా ఒకటి నగర పాలక కార్యాలయాన్ని ఆక్రమించుకుంది. అప్పట్లో వాళ్ల బుర్రలు, ఫ్రాన్సుయొక్క చారిత్రక సంక్షోభ దశలన్నింట్లోనూ దానికి పారిస్ మాత్రమే ప్రాతినిధ్యం వహించాలన్న మూఢ విశ్వాసంతో నిండి ఉన్నాయి. తాము హస్తగతం చేసుకున్న ఫ్రాన్సు గవర్నర్ల పదవులను చట్టబద్ధం చేసుకోవడానికి, పారిస్ ప్రతినిధులుగా కాలదోషం పట్టిపోయిన తమ ఎన్నికల పత్రాలను చూపుతేనే చాలని వాళ్లు భ్రమించారు. ఈ మనుషులు అధికారానికి వచ్చిన అయిదు రోజుల అనంతరం, గత యుద్ధంపై మా రెండవ విజ్ఞప్తిలో, వాళ్లెలాంటి వ్యక్తులో మీకు మేము చెప్పాం.* అయితే, విభ్రాంతి గొలిపే గందరగోళం, కార్మికవర్గపు నిజమైన నాయకులింకా బోనపార్టిస్టు జైళ్లలో నిర్బంధింపబడి వుండటం, ప్రష్యన్లు ఓ మూల పారిస్‌పైకి దండెత్తి వస్తూండటం, ఈ కారణాలన్నింటి మూలంగా, ఈ ముఠా పదవీ స్వీకారాన్ని పారిస్ సహించింది. అధికారం, జాతీయ రక్షణకు మాత్రమే వినియోగింపబడాలన్న ఖచ్చితమైన షరతుపైననే అది అందుకు అంగీకరించింది. పారిస్ కార్మికులను సాయుధం చేసి, వాళ్లను వాస్తవమైన సైనిక బలగంగా సంఘటితం చేసి, వాళ్లకు యుద్ధ క్రమంలోనే శిక్షణ కరపక పోయినట్లయితే పారిస్ రక్షణ సాధ్యం

---

* 50–51 పేజీలు చూడండి. — సం.

కాదని వేరే చెప్పనక్కర్లేదు కదా. కాని పారిస్‌ను సాయుధం చెయ్యడమంటే విప్లవాన్ని సాయుధం చెయ్యడమే. ప్రష్యన్ దురాక్రమణదారుపై పారిస్ విజయం సాధించి వుంటే అది, ఫ్రెంచి పెట్టుబడిదారులపైనా, వారి ప్రభుత్వ పరభాగ్యోప జీవులపైనా ఫ్రెంచి కార్మికుని విజయమై యుండేది. జాతీయ విధి బాధ్యతలకూ వర్గ ప్రయోజనాలకూ మధ్య ఎన్నుకోవలసి వచ్చినప్పుడు జాతీయ రక్షణ ప్రభుత్వం జాతీయ బాధ్యతా పరిత్యాగానికి క్షణకాలం కూడా తటపటాయించలేదు.

వాళ్ళు తీసుకున్న మొదటి చర్య త్యేర్‌ను యూరప్ రాజాస్థానాలన్నింటి చుట్టూ చాంద్రాయణానికి పంపడం. రిపబ్లిక్ స్థానంలో రాజును మార్చుకొనే షరతుపై, మధ్య వర్తిత్వం మీరు నెరపుతారా మీరు నెరపుతారా అంటూ అర్థించడమే ఈ యాత్ర పరమోద్దేశం. ఆక్రమణ ప్రారంభమై నాలుగు మాసాలు గడిచాక, లొంగుబాటుకు సంబంధించిన మొదటి సూచన చేసేందుకిక తరుణం ఆసన్నమైందని వాళ్ళు అనుకున్నప్పుడు, జూల్ ఫ్రావ్, యింకా తన యితర సహచరుల సమక్షంలో, సమావేశమైన పారిస్ మేయర్ల ముందు ట్రొషూ యిలా అన్నాడు:

> "సెప్టెంబరు 4వ తేదీ సాయంత్రమే, నా సహచరులు నన్నడిగిన మొట్టమొదటి ప్రశ్న యిదీ: పారిస్ ప్రష్యన్ సైన్యపు ముట్టడిని తట్టుకొని నిలబడే అవకాశం ఏమైనా ఉందా? లేదు అని చెప్పడానికి నేను ఎంత మాత్రమూ సంకోచించలేదు. ఇప్పుడిక్కడ వున్న నా సహచరులు కొందరు, నా మాటల్లోని వాస్తవాన్నీ, నా అభిప్రాయంలోని దృఢత్వాన్నీ ఆమోదిస్తారని తలుస్తాను. నేను సరిగా యిదే మాటల్లో వాళ్ళకి ప్రస్తుత పరిస్థితుల్లో ప్రష్యన్ సైన్యపు ముట్టడిని తట్టుకొని నిలబడాలన్న పారిస్ ప్రయత్నం కేవలం వెర్రితనమే అవుతుందని చెప్పాను. నిస్సందేహంగా అది వీరోచితమైన వెర్రితనం అవుతుంది, అంత మాత్రమే, అని కూడా నేను చెప్పాను.... ఘటనలు" (ఆయన ఆధ్వర్యంలో జరిగినవే) "నా జోస్యం సరైనదని రుజువుచేశాయి."

ట్రొషూ యిచ్చిన యీ ముచ్చటైన చిన్న ఉపన్యాసాన్ని, ఆ సమావేశానికి హాజరైన మేయర్లలో ఒకడైన ఎమ్. కోర్బన్ తర్వాత ప్రచురించాడు.

ఈవిధంగా, రిపబ్లిక్ ప్రకటింపబడిన నాటి సాయంత్రమే, పారిస్ లొంగుబాటే ట్రొషూ "పథకం" అన్న సంగతి, అతని సహచరులకు తెలుసు. జాతీయ రక్షణ అన్నది, త్యేర్, ఫ్రావ్ ప్రభృతుల వ్యక్తిగత పాలనకు ఒక సాకు మాత్రమే కాక అంతకన్న ఎక్కువే అయినట్లయితే, సెప్టెంబరు 4 నడమంత్రపు ప్రభువులు 5నవే అధికార పరిత్యాగం చేసి యుండేవాళ్ళు, పారిస్ ప్రజలను ట్రొషూ "పథకం"లో ప్రవేశపెట్టి

యుండేవాళ్లు, వాళ్లని వెన్వెంటనే లొంగిపొమ్మని చెప్పి యుండేవాళ్లు, లేక, తమ భవిత వ్యాన్ని తమ చేతుల్లోకి తీసుకొమ్మని విజ్ఞప్తి చేసి యుండేవాళ్లు. దీనికి మారుగా, ఆ పరువు మాలిన వంచకులు, వీరోచితమైన పారిస్ యౌద్ధ్యాన్ని, కరువు కాటకాలతో, పగిలిన తలలతో కూడిన క్రమ పరిపాలనతో పొడిగించడానికీ, యీలోగా ఆడంబర పదజాలంతో కూడిన ప్రకటనలతో, "పారిస్ గవర్నరైన" ట్రొషూ "చచ్చినా లొంగిపోడు" అనీ, విదేశాంగ మంత్రి జూల్ ఫ్రావ్ "మన భూభాగంలో ఒక్క అంగుళం జాగాను గాని, మన దుర్గాల్లో ఒక్క రాయిని గాని పరులకు దత్తం చెయ్యడనీ" బుకాయిస్తూ పారిస్ ప్రజలను బురిడీ కొట్టించేందుకే కృతనిశ్చయులయ్యారు. గంబెట్టాకు తను రాసిన ఒక లేఖలో, అదే జూల్ ఫ్రావ్ పారిస్‌ను తాము "రక్షిస్తున్నది" ప్రష్యన్ సైనికుల నుండి కాదనీ, పారిస్ కార్మికుల నుండే అనీ ఒప్పుకున్నాడు. పారిస్ ముట్టడి ప్రతిఘటన కొనసాగి నంత కాలమూ, ట్రొషూ చేత తెలివిగా పారిస్ సైన్యాధిపత్యం అప్పగించబడిన బోనపార్టిస్ట్ కసాయి మూకలు, తాము రాసుకున్న గుప్తలేఖలలో, రక్షణ ప్రహసనం పట్ల పరస్పరం సుగ్రాహ్యమైన అసభ్యమైన పరిహాసాలు దొర్లిస్తూనే వున్నారు. (ఉదాహరణకు, కమ్యూన్‌యొక్క "Journal Officiel"[38]చే ప్రచురింపబడిన పారిస్ రక్షణ సైన్యానికి చెందిన ఫిరంగి దళం సుప్రీమ్ కమాండరూ గ్రాండ్ క్రాస్ ఆఫ్ ది లీజియన్ ఆఫ్ ఆనర్ బిరుదాంకితుడూ అయిన అల్ఫోన్స్* సిమొన్ గియో ఫిరంగి దళం జనరల్ అయిన సుసాన్‌కి రాసిన లేఖ చూడండి.) చిట్టచివరకు 1871 జనవరి 28న, యీ కాపట్యపు ముసుగు విసర్జింపబడింది. పారిస్ లొంగుబాటు విషయంలో జాతీయ రక్షణ ప్రభుత్వం, పరమనైచ్యానికి దిగజారేవాళ్లకి విలక్షణమైన వీరత్వంతో ముందుకొచ్చింది. అది బిస్మార్కు ఖైదీలతో ఏర్పడ్డ ఫ్రాన్సు ప్రభుత్వంగా ముందుకొచ్చింది. ఇటువంటి హీనమైన పాత్రను అంగీకరించడానికి సెడాన్‌లో లూయీ బోనపార్ట్ సైతం సంకోచించాడు. మార్చి 18 నాటి ఘటనల తదుపరి, పిక్క బలం చూపి వెర్సేల్స్‌కి తాము పలాయనం చిత్తగించినప్పుడు, capitulards (లొంగుబాటుదారులు) తమ దేశ ద్రోహానికి సంబంధించిన సాక్ష్య పత్రాలు పారిస్ చేతుల్లో దిగవిడిచారు. రాష్ట్రాలను ద్దేశించి జారీ చేసిన ప్రకటనలో కమ్యూన్ చెప్పినట్లు, ఆ సాక్ష్యాధారాలను నాశనం చేసేందుకు గాను:

> "పారిస్‌ను శిథిలాల గుట్టగా చేసి, రక్త సముద్రంలో ముంచెత్తడానికైనా వాళ్లు వెనకాడరు."[39]

---

*అడాల్ఫ్ అని వుండాలి. — సం.

అటువంటి ముగింపుకి తొందర పడుతున్నారంటే, రక్షణ ప్రభుత్వానికి చెందిన కొందరు ప్రముఖ సభ్యులకు, పైవే కాకుండా, మిక్కిలి విద్యూరమైన సొంతకారణాలు కూడా ఉన్నాయి.

యుద్ధ విరమణ ఒప్పందం కుదిరిన తర్వాత కొద్ది కాలానికి, జాతీయ అసెంబ్లీకి పారిస్ ప్రతినిధుల్లో ఒకడైన మిల్యేర్ (జూల్ ఫ్రావ్ ప్రత్యేక ఆజ్ఞ మేరకు యిటీవల కాల్చివెయ్యబడ్డ వ్యక్తి), న్యాయ స్థాన సంబంధమైన పలు ప్రామాణిక పత్రాలను ప్రచురించాడు. జూల్ ఫ్రావ్, అల్జీయర్స్‌లోని ఒక త్రాగుబోతు భార్యతో అక్రమ సంబంధం పెట్టుకొని అనేక సంవత్సరాల కాలంలో దఫదఫాలుగా దుస్సాహసంతో దొంగ పత్రాలు సృష్టించి, తన వ్యభిచారం ద్వారా కలిగిన బిడ్డల పేర, పెద్ద వారసత్వాన్ని కాజేశాడు, తద్వారా ఆతగాడు ధనికుడయ్యాడు, చట్టబద్ధమైన వారసులు కోర్టులో వేసిన దావాలో, బోనపార్టిస్ట్ కోర్టుల కుమ్మక్కుతో, తన నేరం బయటపడకుండా తప్పించుకున్నాడు. ఎంత బుకాయించి కూడా, చట్టానికి సంబంధించిన యీ శుష్క పత్రాల పట్టు నుండి విడిపించుకోవడం సాధ్యం కాక, జూల్ ఫ్రావ్, తన జీవితంలో మొట్టమొదటి సారిగా, తన నోరు సంబాళించుకుని, అంతర్యుద్ధపు రాక కోసం చల్లగా ఎదురు చూశాడు. అది ప్రారంభం కావడంతోనే యిక ఉన్మత్తావేశంతో పారిస్ ప్రజలను కుటుంబం, మతం, ఆస్తి భద్రతలు పట్టని, బందిఖానా నుంచి పారిపోయివచ్చిన ఖైదీల గుంపు అంటూ తెగడ నారంభించాడు. ఈ కూట పత్రాల సృష్టికర్త, సెప్టెంబరు 4న అలా అధికారంలోకి వచ్చీ రాగానే సానుభూతితో పిక్, టైఫేర్ అనే ఫోర్జరీ నేరస్తులను విడుదల చేశాడు. "Étendard"[40] కుంభకోణంలో, సామ్రాజ్యం క్రింద సైతం ఫోర్జరీ నేరానికి శిక్షింపబడిన ప్రబుద్ధులు వీళ్లిద్దరూ. ఈ యిద్దరిలో ఒకడైన టైఫేర్, కమ్యూన్ రోజుల్లో పారిస్‌కి రావడానికి సాహసించినప్పుడు, అతగాడు వెంటనే తిరిగి జైల్లోకి నెట్టబడ్డాడు. అప్పుడు జూల్ ఫ్రావ్ జాతీయ అసెంబ్లీ వేదిక నుంచి మాట్లాడుతూ, పారిస్ తన జైలుపక్షులందరినీ విడిచిపెట్టేస్తోందంటూ గోలపెట్టాడు!

జాతీయ రక్షణ ప్రభుత్వపు జో మిల్లర్* అనదగిన ఆ ఎర్నెస్ట్ పికార్డ్, సామ్రాజ్యపు హోంమంత్రి కావాలని నానా తంటాలూ పడి విఫలుడై, రిపబ్లిక్ ప్రభుత్వంలో తనను తాను ఆర్థిక మంత్రిగా నియమించుకున్నాడు. ఇతగాడు, పారిస్ స్టాక్ ఎక్స్చేంజి

---

* 1871, 1891 నాటి జర్మన్ ముద్రణల్లో యీ పేరు కార్ల్ ఫోగ్ట్‌గాను, 1871 నాటి ఫ్రెంచి ముద్రణలో ఫాల్‌స్టాఫ్‌గాను యివ్వబడింది. (ఫాల్‌స్టాఫ్ — షేక్స్‌పియర్ నాటకాలు "విండ్సర్‌లోని విలాసవతులు," "నాల్గవ హెన్రీ"లలో ఒక పాత్ర, భీరువు, విదూషకుడు, త్రాగుబోతు.) — సం.

నుండి మోసగాడుగా బహిష్కరింపబడిన ఆర్థర్ పికార్డ్ అనే వ్యక్తికి సోదరుడు. (1867 జూలై 31వ తేదీ గల పోలీసు ప్రిఫెక్ట్ నివేదిక చూడండి.) పాల్రెస్ట్ రోడ్డు, నంబరు 5లోని Société Générale[41] శాఖల్లో ఒక దానికి మేనేజరుగా ఉండగా, తను ఒప్పుకున్న దాన్నిబట్టే ఈ ఆర్థరు పికార్డ్ 3,00,000 ఫ్రాంకులను కైంకర్యం చేశాడు (1868 డిసెంబరు 11 నాటి పోలీసు ప్రిఫెక్టర్ నివేదిక చూడండి). అటువంటి ఘనుడైన ఆర్థరు పికార్డ్‌ని, ఎర్నెస్ట్ పికార్డ్, "Electeur libre"[42] అనే తన పత్రికకి సంపాదకుడుగా నియమించాడు. ఈ ఆర్థిక మంత్రిత్వ శాఖ పత్రికలో వెలువడే అధికారికమైన అబద్ధాల మూలంగా సామాన్య స్టాక్ ఎక్స్చేంజి చుట్టూ వ్యాపారస్తులు తప్పుదారి పట్టింపబడుతూండగా, ఆర్థరు మాత్రం ఫ్రెంచి సైన్యపు పరాజయాల నుండి లాభాలు పొందేందుకుగాను ఆర్థిక మంత్రిత్వ శాఖ కార్యాలయానికీ, స్టాక్ ఎక్స్చేంజికీ మధ్య అనులో కండెలా పరుగులు తీస్తూండేవాడు. ఈ అపూర్వ సహోదరుల మధ్య ఆర్థిక వ్యవహారాలపై సాగిన ఉత్తరప్రత్యుత్తరాల కట్ట యావత్తూ కమ్యూన్ చేతుల్లో పడింది.

సెప్టెంబరు 4వ తేదీకి ముందు చేతిలో చిల్లర పెన్నీ కూడా లేని జూల్ ఫ్రెరీ అనే బారిష్టరు, ముట్టడి కాలంలో పారిస్ మేయరుగా, కరువు నుండి పెద్ద సంపదను కూడబెట్టడంలో సఫలుడయ్యాడు. తన దుష్పరిపాలనకి గాను జవాబు చెప్పకోవలసిన రోజు వస్తే అతను శిక్షను ఎదుర్కోక తప్పదు.

మరి, యిలాంటి ఈ మనుషులకు, పారిస్ శిధిలాల్లో మాత్రమే టికెట్-ఆఫ్-లీవ్ (పెరోలుపై విడుదల సర్టిఫికేట్లు)* దొరకడం సాధ్యమవుతుంది. బిస్మార్క్‌కి కావలసినది సరిగా అటువంటి బాపతు మనుషులే. తిమ్మిని బమ్మిని, బమ్మిని తిమ్మిని చెయ్యడం ద్వారా యింత దాకా ప్రభుత్వానికి రహస్యంగా నాయకత్వం వహిస్తూ వున్న థేయర్, యిప్పుడు దాని అధినాయకుడయ్యాడు. సామాన్య నేరస్తులు (టికెట్-ఆఫ్-లీవ్‌మెన్) అతని మంత్రులయ్యారు.

అటువంటి వికారాకారుడైన మరుగుజ్జు, థేయర్, ఫ్రెంచి బూర్జువావర్గాన్ని దాదాపుగా

---

* ఇంగ్లండులో సామాన్య నేరస్తులు, తమ శిక్షా కాలంలో అధిక భాగాన్ని గడిపిన తర్వాత, తరచుగా పెరోలుపై విడుదల చెయ్యబడుతూ వుంటారు. అయినా, వాళ్లని పోలీసు నిఘాలో అట్టిపెడతారు. అలా వదిలేటప్పుడు వాళ్లకి టికెట్-ఆఫ్-లీవ్ అంటూ ఒక సర్టిఫికేట్ యిస్తారు. అటువంటి సర్టిఫికేట్లు కలిగివున్న వారిని టికెట్-ఆఫ్-లీవ్‌మెన్ అంటారు. (1871 నాటి జర్మన్ ముద్రణకు ఎంగెల్సు యిచ్చిన వ్యాఖ్య.)

అర్ధశతాబ్దం పాటు సమ్మోహితం చేశాడంటే, తమ సొంతవర్గ అవినీతికి అతను అత్యంత సంపూర్ణ మేధో వ్యక్తీకరణ కావడమే అందుకు కారణం. అతను రాజకీయవేత్త అయ్యేందుకు ముందే చరిత్రకర్తగా అబద్ధాలాడగల అపూర్వ శక్తులు తనకున్నట్లు రుజువు చేసుకున్నాడు. అతని సామాజిక కార్యకలాపాల వివరాలను పరిశీలిస్తే అవి ఫ్రాన్సు దురదృష్టాల జాబితాగా తేలుతాయి. 1830కి ముందు రిపబ్లికన్లతో కలిసి మెలసి వున్న త్యేర్, తన పోషకుడైన లఫిట్‌కు ద్రోహం చేసి, మతగురువులకు వ్యతిరేకంగా మూకలను రెచ్చగొట్టడం ద్వారా రాజాగారి కృపాకటాక్షాన్ని సంపాదించుకొని, లూయీ ఫిలిప్ క్రింద మంత్రి పదవిలో ప్రవేశించాడు. ఈ కొట్లాటల్లో సెయింట్ జెర్మేన్ లసెరువా చర్చి, ఆర్చిబిషప్ భవనమూ లూటీ చెయ్యబడ్డాయి. అంతేకాక రాజానుగ్రహం కోసం అతను డచెస్ డి బెర్రీపై మంత్రిగా వేగువనిచేశాడు, జైల్లో ఆమెకు మగమంత్రసానిగా పనిచేశాడు.[43] ట్రాన్స్‌నానెన్ రోడ్డులో రిపబ్లికన్ల ఊచకోతకు, అటుతర్వాత పత్రికలకు, సమావేశ స్వాతంత్ర్యానికి వ్యతిరేకంగా వచ్చిన రోసిపోయిన సెప్టెంబరు చట్టాలకు అతనిదే బాధ్యత.[44] 1840 మార్చిలో, ప్రధాన మంత్రిగా పునర్దర్శన మిచ్చి, పారిస్‌ను ముద్రిండం చేసే తన పథకంతో[45] అతను ఫ్రాన్సును ఆశ్చర్యచకితం చేశాడు. ఈ పథకం, పారిస్ స్వేచ్ఛకు వ్యతిరేకమైన ఘాతుకమైన కుట్ర అని నిరసించిన రిపబ్లికన్లకు, ప్రతినిధుల సభ వేదిక నుండి అతనిలా జవాబిచ్చాడు:

> "ఏమిటేమిటి! చుట్టూ కోటలు కడితే స్వేచ్ఛకు భంగం కలుగు తుందనుకోవడం విడ్డూరంగా లేదూ? మొదటి విషయం ఏమిటంటే, ఏ ప్రభుత్వమైనా ఏదో ఒక రోజున పారిస్‌ను బొంబార్డు చేయడం ద్వారా తనను తాను నిలబెట్టుకోవాలని చూస్తుందనుకోవడం ద్వారా మీరు ప్రభుత్వంపై అభాండాలు వేస్తున్నారు.... అయితే, అటువంటి ప్రభుత్వం ముందరికన్న తన విజయం తర్వాతనే శతాధికంగా దుస్సాధ్యమవుతుంది."

అంతకుముందు యీ దుర్గాలను ప్రస్తావ్యన్లకు లోబరచిన ఆ ప్రభుత్వమే తప్ప, నిజానికి, మరే ప్రభుత్వమూ ఎన్నడూ పారిస్‌ను దుర్గాల నుండి బొంబార్డు చేయ సాహసించి ఉండేది కాదు.

1848 జనవరిలో బాంబు రాజా పాలెర్మోపై దాడికి ప్రయత్నించినప్పుడు,[46] అప్పటికి చాలా కాలంగా మంత్రి పదవిలో లేని త్యేర్, ప్రతినిధుల సభలో మళ్లీ లేచి యిలా అన్నాడు:

> "అయ్యా పెద్దలారా, పాలెర్మోలో జరుగుతున్న దేమిటో మీకు తెలుసు. 48 గంటలపాటు ఒక పెద్ద పట్టణం ఫిరంగులతో బొంబార్డు చెయ్యబడింది.

ఈ వార్త విన్నప్పుడు మీరందరూ భయకంపితులవుతారు'' (పార్లమెంటరీ అర్థంలో). "ఈ బొంబార్డుమెంటు చేస్తున్నదెవరు? విదేశీ శత్రువు తన యుద్ధ హక్కులు వినియోగించి యీ బొంబార్డుమెంటు చేస్తున్నాడా? లేదండి, దాని సొంత ప్రభుత్వమే యీ పని చేస్తోంది. ఎందుకట? ఎందుకంటే, దురదృష్టవంతమైన ఆ పట్టణం తన హక్కులను డిమాండు చేసింది. ఔను, అలా తన హక్కులను డిమాండు చేసినందుకు గాను, అది 48 గంటల బొంబార్డుమెంటుకు గురైంది.... యూరప్ ప్రజాభిప్రాయానికై నన్ను విజ్ఞప్తి చెయ్యనివ్వండి. జాగరితమైన యూరప్‌లో బహుశా అత్యున్నతమైన వేదిక నుండి, అటువంటి కృత్యాలకు వ్యతిరేకంగా కొన్ని కోపోద్రిక్త నిరసన పదాలను'' (పదాలు మాత్రమే సుమా!) "ప్రతిధ్వనింపచేస్తే, మానవాళికి సేవ చేసినదవుతుంది.... తన మాతృదేశానికి సేవలు చేసిన'' (త్యేర్ అటువంటి పాపపు పనులెన్నడూ చెయ్యలేదు!) "రీజెంట్ ఎస్పర్టెరో, ఒక తిరుగుబాటును అణచివేసేందుకు గాను బార్సిలోనాను బొంబార్డు చేయించ దలచినప్పుడు ప్రపంచపు నలు మూలల నుండీ సర్వత్రా ఆగ్రహం ప్రకటింపబడింది."

పద్దెనిమిది మాసాల తర్వాత, రోమ్‌పై ఫ్రెంచి సైన్యం బొంబార్డుమెంటును[47] తీవ్రంగా బలపరచిన వాళ్లలో త్యేర్ ఒకడు. నిజానికి, బాంబు రాజా చేసిన తప్పిదమల్లా, అతడు తన బొంబార్డుమెంటును కేవలం నలభై ఎనిమిది గంటలకు పరిమితం చెయ్యడంలోనే ఉందేమోనన్నట్లు కనిపిస్తుంది.

ఫిబ్రవరి విప్లవానికి కొద్ది రోజుల ముందు, గిజో ధర్మమా అని పదవికీ, అన్యాయార్జనకూ తను చాలా కాలంగా దూరమైనందుకు చిర్రుబుర్రు లాడుతూ, ప్రజల్లో రాబోతున్న కల్లోలాన్ని పసిగట్టిన త్యేర్, Mirabeau-mouche* అనే ఎగతాళి పేరును తనకు సంపాదించి పెట్టిన కుహనా వీరశూర శైలిలో ప్రతినిధుల సభలో యిలా ప్రకటించాడు:

"ఒక్క ఫ్రాన్సులోనే కాదు, యూరప్‌లో కూడా నేను విప్లవ పార్టీకి చెందినవాడిని. విప్లవ ప్రభుత్వం మితవాద వ్యక్తుల చేతుల్లో ఉండాలని నేను కోరుకుంటున్నాను.... కాని, ఒకవేళ అది ఉద్వేగపరుల చేతుల్లో, చివరకు రాడికల్స్ చేతుల్లో పడినా కూడా, నేను నా కర్తవ్యాన్ని విడిచి పెట్టను. నేను సదా విప్లవ పార్టీకే చెంది వుంటాను.''

---

* మిరబో పోరిగ. — సం.

ఫిబ్రవరి విప్లవం వచ్చింది. ఈ మరుగుజ్జు ఉవ్విళ్లూరినట్లు, గిజో మంత్రివర్గం స్థానంలో త్యేర్ మంత్రివర్గాన్ని పెట్టేందుకు బదులు, అది, లూయీ ఫిలిప్‌ని త్రోసివేసి రిపబ్లిక్‌ని నెలకొల్పింది. ప్రజా విజయపు తొలి రోజున అతను, జాగ్రత్తగా దాక్కున్నాడు. కార్మికులకు తన పట్ల వున్న హేయ భావం వాళ్ల పగకూ తనకూ మధ్య అడ్డు తెరగా ఉందన్న సంగతిని విస్మరించాడు. అప్పటికీ, కల్పిత వ్యంగ్య కథలుగా చెప్పుకొనే తన ధైర్యంతో, జూన్ మూకుమ్మడి హత్యాకాండలు[8] తన బాపతువారి కార్యాచరణకు మార్గాన్ని సుగమం చేసే దాకా అతను బహిరంగ వేదికల పట్ల భయంతో వైదొలగుతూనే వచ్చాడు. ఆటు తర్వాత "పార్టీ ఆఫ్ ఆర్డర్"[48]కీ, దాని పార్లమెంటరీ రిపబ్లిక్‌కీ అతగాడు ప్రముఖ సైద్ధాంతిక నాయకుడు అయ్యాడు. పాత ప్రభుత్వం పోయి కొత్తది ఏర్పడని అనామక సంధి కాలం అది. పాలకవర్గానికి చెందిన పోటీ ముఠాలన్నీ కలసి ప్రజలను అణచివెయ్యడానికి కుట్ర చేస్తూ, ఒకదానికి వ్యతిరేకంగా మరొకటి, తన సొంత రాజరిక పునరుద్ధరణ కోసం కుట్ర చేసిన కాలం అది. త్యేర్ అప్పుడు కూడా యిప్పటి లాగే, రిపబ్లిక్‌ను సంఘటిత పరచడానికి రిపబ్లికన్లు మాత్రమే ఏకైక అవరోధమని ఆరోపించాడు. "నిన్ను నేను హత మారుస్తాను, అయితే అది నీ మేలు కోసమే" అని డాన్ కార్లోస్* నుద్దేశించి ఉరితీసేవాడన్నట్లు అప్పుడు కూడా యిప్పటి లాగే, రిపబ్లిక్ నుద్దేశించి, అతను మాట్లాడాడు. అప్పటి లాగే యిప్పుడు, తన విజయానంతర దినాన: "L'Empire est fait" — సామ్రాజ్యం సమగ్ర సంపూర్ణమైంది అని అతను హుంకరించాల్సి వుంటుంది. కావలసిన స్వేచ్ఛల గురించి తన కపట ప్రవచనాలేమైనప్పటికీ, తనను బురిడీ కొట్టించి, పార్లమెంటరిజాన్ని కాలితో తన్ని పారేసిన లూయీ బోనపార్ట్ పట్ల వ్యక్తిగతంగా తనకెంత కక్ష ఉన్నప్పటికీ — పార్లమెంటరిజంలాంటి కృత్రిమ వాతావరణం బయట తను శూన్యంలోకి జారిపోతానన్న స్పృహ ఈ మరుగుజ్జుకు ఉండనే ఉంది — ఫ్రెంచి సేనలచేత రోమ్ ఆక్రమణ నుండి ప్రష్యాతో యుద్ధం దాకా — రెండవ సామ్రాజ్యపు అప్రతిష్ఠ పనులన్నింటిలోనూ యితని చెయ్యి వుంది. జర్మన్ ఐక్యత పట్ల తనకుగల తీరని నిరసన భావన కారణంగా దీన్ని తాను రెచ్చగొట్టాడు. ప్రష్యన్ నిరంకుశత్వమనే ముసుగుగా కాక, జర్మన్ అనైక్యత విషయంలో ఫ్రాన్సుకుగల స్వార్థపరమైన హక్కుపై అతిక్రమణ అని చిత్రించాడు. తన మరుగుజ్జు చేతులతో, యూరపుపై, మొదటి నెపోలియన్ కత్తిని ఝళిపించడమంటే సరదా కలిగిన, చరిత్రకు సంబంధించిన

---

* డాన్ కార్లోస్ — స్పెయిన్‌కి చెందిన రెండవ ఫిలిప్ కొడుకు (1545–68), అనేక సాహిత్య గ్రంథాల్లో ఆదర్శ వ్యక్తిగా చిత్రించబడిన పాత్ర; తన తండ్రిని వ్యతిరేకించినందుకు గాను హింసించబడ్డాడు, జైల్లో మృతి చెందాడు. — సం.

తన రచనలలో నెపోలియన్ బూట్లు తుడిచేవాడుగా తయారైన అతగాని విదేశాంగ విధాన మెప్పుడూ కూడా ఫ్రాన్సు తలవంపులకే దారితీసింది. 1840 నాటి లండన్ కన్వెన్షన్[49] 1871 నాటి పారిస్ లొంగుబాటు, పోతే యిప్పటి అంతర్యుద్ధం వీటన్నింటిలోనూ కూడా జరిగినదిదే. ప్రస్తుత అంతర్యుద్ధంలో, బిస్మార్క్ ప్రత్యేకానుమతితో, పారిస్‌కి వ్యతిరేకంగా, సెడాన్,[12] మెట్స్[15]లలోని ఖైదీలను యితగాడు ఉసికొలుపుతున్నాడు. ఏ యెండకు ఆ గొడుగు పట్టడంలో ప్రజ్ఞావంతుడు, ఆశయాలను అవలీలగా మార్చుకోగలవాడే అయినప్పటికీ, యితగాడు, తన జీవిత కాలమంతా కూడా బూజుపట్టిన మిక్కిలి పాత కార్యక్రమానికే కట్టుబడివున్నాడు. ఆధునిక సమాజపు ప్రగాఢ భావప్రవంతులెప్పుడూ కూడా అతనికి వెలిగానే ఉన్నాయని వేరే చెప్పనక్కర్లేదు. అతని మేధస్సుకు గల జవ జీవాలన్నీ అతని నాలుకలోకి పలాయనం చిత్తగించాయేమో, కళ్ళెదుట అత్యంత విస్పష్టంగా కనిపించే మార్పులు సైతం అతని బుర్రకి ఎక్కవు. ఈవిధంగా పాత ఫ్రెంచి రక్షిత వ్యవస్థ నుండి ఏ మాత్రం వైదొలగినా కూడా, అపచారంగా పరిగణించి, విధివిరామం లేకుండా అతను దుమ్మెత్తి పోశాడు. లూయీ ఫిలిప్ క్రింద మంత్రిగా ఉండగా రైల్వేలు శుద్ధ మరీచిక అంటూ నిరసించాడు. లూయీ బోనపార్ట్ క్రింద ప్రతిపక్షంలో ఉన్నప్పుడు, బులిగి పోయిన ఫ్రెంచి సైనిక వ్యవస్థను సంస్కరించేందుకు జరిగిన ప్రతి ప్రయత్నాన్నీ మహాపచారమని తిట్టిపోశాడు. సుదీర్ఘమైన తన రాజకీయ జీవితమంతట్లోనూ అతను ఎన్నడూ ఒక్కగానొక్క – చివరకు పినరంత కూడా – ఆచరణలో పనికొచ్చే పని చేసిన పాపాన పోలేదు. త్యేర్‌లో అవిచ్ఛిన్నంగా వస్తున్న విషయమేదైనా ఒకటి ఉందంటే, సంపద పట్ల వ్యామోహమూ, దాన్ని ఉత్పత్తి చేసే మనుషుల పట్ల ద్వేషమే అది. లూయీ ఫిలిప్ క్రింద తన తొలి మంత్రి పదవిని స్వీకరించిన నాడు జాబ్* లాగా నిరుపేద అయిన త్యేర్, లక్షాధికారిగా దాన్ని విడిచిపెట్టాడు. అదే రాజు క్రింద అతని తుది మంత్రిత్వం (1840 మార్చి 1 నాటిది)లో, అతను ప్రతినిధుల సభలో ప్రభుత్వ ధనాపహరణ నేరానికై తీవ్రమైన ఆరోపణలకు గురి చెయ్యబడ్డాడు. దానికి అతను చెప్పుకున్న సంజాయిషీ కన్నీళ్ళు పెట్టుకోవడమే. జూల్ ఫ్రావ్ లాగా, మరే యితర మొసలి లాగా ధారాళంగా కన్నీరు కార్చడంలో యితగాడు నేర్పరి. ముంచుకొస్తున్న ఆర్థిక వినాశం నుండి ఫ్రాన్సును కాపాడేందుకు బోర్డోలో అతను తీసుకున్న తొలి చర్య ఏమిటంటే, ఏటా తనకు 30 లక్షలు దఖలు పడే ఏర్పాటు. "పొదుపైన రిపబ్లిక్" కిది పరాకాష్ఠ. దీనినెన్నడో 1869లోనే తన పారిస్ వోటర్లకు అతను చవి చూపించాడు. 1830 నాటి ప్రతినిధుల సభలో

---

* జాబ్ (బైబిలు) – చిరకాలం కష్టాలు సహించిన పేదవాని ప్రతిరూపం, అతని ఓర్మికీ, వినమ్రతకీ దేవుడు అతనికి వరమిచ్చినట్లు కథనం. – సం.

అతని మాజీ సహచరుల్లో ఒకడూ, పెట్టుబడిదారే అయినా కూడా, పారిస్ కమ్యూన్‌కి అంకితమైన సభ్యుడూ అయిన బెలే, తర్వాత ఒక కరపత్రంలో త్యేర్ నుద్దేశించి యిలా రాశాడు:

> "శ్రమను పెట్టుబడికి బానిసను చెయ్యడమే మీ విధానానికెప్పుడూ మూలాధారంగా ఉంటూ వచ్చింది. పారిస్ నగరపాలక కార్యాలయంలో శ్రమ రిపబ్లిక్ నెలకొన్న రోజు నుండీ కూడా 'వీళ్ల నేరస్తులు!' అంటూ గొంతెత్తి ఫ్రాన్సుకు అరచిచెప్పడం మీరు మానలేదు."

చిల్లర మల్లర ప్రభుత్వ వంచనలో అందెవేసిన చెయ్యి, కూట సాక్ష్యంలోను, దేశ ద్రోహంలోనూ కళాకారుడూ, చిల్లర మల్లర కుట్రలూ కుహకాల్లో, నీచమైన ఎత్తుగడల్లో, పార్లమెంటరీ పార్టీ పోరాటాలకు సంబంధించిన హేయమైన విశ్వాస ఘాతుకత్వాల్లో మహా నిపుణుడు; పదవిలో లేనప్పుడు విప్లవాన్ని రెచ్చగొట్టడానికెన్నడూ సంకోచించక, రాజ్యానికి కర్ణధారిగా ఉన్నప్పుడు దాన్ని రక్తపు టేర్లలో ముంచడానికి వెనుదియ్యనివాడు; భావాల స్థానంలో వర్గ దురభిప్రాయాలూ, హృదయం స్థానంలో స్వాతిశయమూ కలవాడు, అతని ప్రజా జీవితమెంత క్షుద్రమైనదో అతని వ్యక్తిగత జీవిత మంత హేయమైనది — యిప్పుడు ఫ్రెంచి మాల్లా పాత్ర వహిస్తున్నప్పుడు సైతం, తన చర్యల గర్హనీయత స్థానంలో పరిహాసాస్పదమైన ఆడంబర ప్రదర్శనోత్సుకతను విడువలేనివాడు — త్యేర్.

పారిస్ లొంగుబాటు, ప్రష్యాకి ఒక్క పారిస్‌నే కాకుండా, యావత్తు ఫ్రాన్సుని కట్టబెట్టడంతో, శత్రువుతో చిరకాలంగా జరిగిన దేశ ద్రోహకర కుట్రలు ఒక కొలిక్కి వచ్చాయి. ఈ కుట్రలు యిప్పటివి కావు. త్రొషూ స్వయంగా చెప్పినట్లు, సెప్టెంబరు 4వ తేదీన అధికారాన్ని హస్తగతం చేసుకొన్నవాళ్ల అదే రోజున ప్రారంభించిన కుట్రలివి. మరో వంక, రిపబ్లిక్‌కీ, పారిస్‌కీ వ్యతిరేకంగా, ప్రష్యా తోడ్పాటులో, వాళ్లిప్పుడు సాగించాల్సి వున్న అంతర్యుద్ధానికి యీ లొంగుబాటు నాంది పలికింది. లొంగుబాటుకు సంబంధించిన షరతుల్లోనే యీ ఉచ్చు అమర్చబడింది. అప్పటికీ, దేశంలో మూడో వంతుకు పైగా శత్రువు చేతుల్లో ఉంది. రాష్ట్రాల నుండి రాజధాని వేరుచెయ్యబడింది. సమాచార, రహదారీ సౌకర్యాలన్నీ విచ్ఛిన్నం చెయ్యబడ్డాయి. అటువంటి పరిస్థితుల్లో, సన్నాహాలకు తగినంత వ్యవధి కల్పించబడితే గాని, ఫ్రాన్సుకి సరైన ప్రతినిధులను ఎన్నుకోవడం సాధ్యం కాదు. దీన్ని దృష్టిలో పెట్టుకొనే, లొంగుబాటు ఒప్పందం, జాతీయ అసెంబ్లీ ఎనిమిది రోజుల్లోగా ఎన్నుకోబడాలని నిర్దేశించింది. అలా జరిగిన నాడు, ఫ్రాన్సులో పలు ప్రాంతాలకు, రాబోయే ఎన్నికల వార్త సరిగా ఎన్నికల నాటికి ముందు మాత్రమే చేరుతుంది.

పైగా, యీ అసెంబ్లీ, లొంగుబాటు ఒప్పందంలో స్పష్టంగా పేర్కొనబడ్డ ఒక షరతు మేరకు, శాంతి యుద్ధాల సమస్యపై నిర్ణయం తీసుకొనేందుకు, దరిమిలా శాంతి సంధి కుదుర్చుకొనేందుకూ మాత్రమే ఉద్దేశింపబడింది. యుద్ధవిరమణ ఒడంబడిక షరతులు యుద్ధపు కొనసాగింపును అసాధ్యం చేశాయనీ, బిస్మార్కుచేత రుద్దబడిన శాంతిని మంజూరు చెయ్యడానికి ఫ్రాన్సులోని అధములే బాగా తగినవారనీ ఫ్రెంచి జనాభా అనుకోకుండా ఉండజాలదు కదా. అయితే, యీ ముందు జాగ్రత్తలతో తృప్తి చెంద కుండా, యుద్ధవిరమణ రహస్యమింకా పారిస్‌కి తెలియజేయక ముందే, త్యేర్, రాష్ట్రాల్లో ఎన్నికల ప్రచారయాత్ర ప్రారంభించాడు. ఆర్లియనిస్టులతో[49] కలిసి, అప్పట్లో అధికారంలోకి రావడం అసాధ్యమైన బోనపార్టిస్టుల స్థానం వహించాల్సిన, లెజిటిమిస్టుల పార్టీని[9] పునరుజ్జీవింప చెయ్యడమే త్యేర్ చేసిన యాత్రా లక్ష్యం. ఆధునిక ఫ్రాన్సు ప్రభుత్వంగా పనికి రాని, కాగా, ప్రత్యర్థులుగా తుచ్ఛమైన లెజిటిమిస్టులంటే అతనికి భయంలేదు. ఏ పార్టీ కార్యాచరణ, సాక్షాత్తు త్యేర్ మాటల్లోనే (1833 జనవరి 5 నాటి ప్రతినిధుల సభ),

> "ఎల్లప్పుడూ విదేశీ దాడీ, అంతర్యుద్ధమూ, అరాచకత్వమూ అనే మూడు వనరులకు పరిమితమై వుందో"

ఆ పార్టీకన్న, ప్రతీఘాత విప్లవానికి మరింత మంచి సాధనంగా పనికొచ్చే మరో పార్టీ ఏం వుంటుంది? తమ చిరకాల వాంఛితమైన, వేల సంవత్సరాల గత చరిత్ర పునరావృతమవుతుందని లెజిటిమిస్టులు నిజంగానే విశ్వసించారు. ఫ్రాన్సుపై విదేశీ దాడి పదఘట్టనలు, సామ్రాజ్య పతనం, బోనపార్ట్ నిర్బంధం; అటు తర్వాత తామే అక్కడున్నారు. చరిత్రచక్రం వెనక్కి తిరిగి 1816 నాటి "chambre introuvable"[50] దగ్గర ఆగింది. 1848–51 మధ్య రిపబ్లిక్ జాతీయ అసెంబ్లీలలో విద్యావంతులు, సుశిక్షితులైన పార్లమెంటరీ ప్రముఖులు తమకు ప్రాతినిధ్యం వహించారు. ఇప్పుడలా కాదు, పార్టీకి చెందిన సామాన్య సభ్యులు — ఫ్రాన్సుకి చెందిన పుర్సొన్యాక్* లందరూ ముందుకొచ్చారు.

ఈ "భూస్వాముల సభ"[51] బోర్డోలో సమావేశం కాగానే, పార్లమెంటరీ చర్చ అనే తంతు సైతం లేకుండా, శాంతి సన్నాహక షరతులకు వెన్వెంటనే ఆమోదం

---

* పుర్సొన్యాక్ — 17 శతాబ్దపు సుప్రసిద్ధ ఫ్రెంచి రచయిత మొల్యేర్ "శ్రీమాన్ పుర్సొన్యాక్" అనే వినోదాత్మక నాటకంలో ప్రధాన పాత్ర, పల్లెటూళ్లలో వుండే అమత్సాహపరుడూ, అజ్ఞానీ అయిన ప్రభువుకు ప్రతిరూపం. — సం.

తెలపాలని త్యేర్ వాళ్లకి స్పష్టంచేశాడు. ఆ షరతుపై మాత్రమే, రిపబ్లిక్‌కీ, దాని బలీయ దుర్గమైన పారిస్‌కీ వ్యతిరేకంగా, తాము యుద్ధం ప్రారంభించడానికి ప్రష్యా అనుమతిస్తుందని అతను చెప్పాడు. నిజానికి, ప్రతీఘాత విప్లవానికి చేజార విడుచు కునే టైము లేదు. రెండవ సామ్రాజ్యం జాతీయ రుణాన్ని రెట్టింపుకి పైగా పెంచింది, పెద్ద పట్టణాలన్నింటినీ విపరీతమైన ప్రాంతీయ రుణాలలో ముంచింది. యుద్ధం ఆ రుణాలను విపరీతంగా పెంచేసి, జాతి వనరులన్నింటినీ నిర్దాక్షిణ్యంగా కొల్లగొట్టింది. ఈ వినాశం సరి పోదేమోనన్నట్లు, ప్రష్యన్ షైలాక్* ఉన్నాడు. తన సైనికుల్లో 5 లక్షల మందిని ఫ్రెంచి భూభాగంపై ఉంచాడు. వారిని పోషించాల్సినది ఫ్రాన్సేననీ, 500 కోట్లు నష్టపరిహారం చెల్లించాలనీ, చెల్లింపబడని వాయిదాలపై 5 శాతం వడ్డీ చెల్లించాలన్న గొంతెమ్మ షరతులున్నాయి. ఈ మొత్తాన్ని ఎవరు చెల్లించాలి? ఏ యుద్ధానికి తామే కారణభూతులో, ఆ యుద్ధపు ఖర్చులను, జాతి సంపద సృష్టి కర్తలపై నెట్ట గలగాలంటే, రిపబ్లిక్‌ను హింసాత్మకంగా కూలద్రొయ్యడమొక్కటే జాతి సంపదను భుక్తం చేసుకున్న వారికి మార్గం. ఆవిధంగా, ఫ్రాన్సు అపార వినాశం, దాడిదారుల కళ్లముందే, వారి ప్రాపకంలోనే, విదేశీ యుద్ధంలో అంతర్యుద్ధాన్ని — బానిస యజమానుల విప్లవాన్ని — చొప్పించేందుకు భూస్వాములు, పెట్టుబడిదారుల యీ దేశభక్తియుత ప్రతినిధులను ప్రోత్సహించింది.

ఈ కుట్ర మార్గంలో ఓ పెద్ద అవరోధం నిలిచి వుంది — అది పారిస్. పారిస్‌ని నిరాయుధం చెయ్యడమే విజయానికి తొలి షరతు. అందుకనే, తన ఆయుధాలను అప్పగించాల్సిందిగా పారిస్‌కి త్యేర్ ఆజ్ఞలు జారీ చేశాడు. అటు తర్వాత, పారిస్‌లో ఆవేశకావేశాలు పెరగడానికి దారితీసిన చాలా ఘటనలు జరిగాయి. "భూస్వాముల సభ" రిపబ్లికన్ వ్యతిరేక ఉన్మత్త ప్రదర్శనలు నిర్వహించింది. రిపబ్లిక్‌యొక్క చట్టబద్ధమైన హోదా విషయంలో త్యేర్ స్వయంగా రెచ్చగొట్టే ధర్మ ప్రవచనాలు చేశాడు. పారిస్ శిరచ్ఛేదం చేస్తాననీ, దాని రాజధాని హోదాను తొలగిస్తాననీ బెదిరించాడు. ఆర్లియనిస్టులు రాయబారులుగా నియమించబడ్డారు. బకాయి పడిన వాణిజ్య వస్తులకు, యిళ్ల అద్దెలకు సంబంధించిన దుఫార్ చట్టాలు[62] పారిస్ వాణిజ్య, పరిశ్రమల వినాశానికి దారితీశాయి. ఎక్కడ ఏ చిన్న ప్రచురణ వెలువడినా, దాని ప్రతి కాపీపైనా, పుయ్యే-కర్ట్యే, రెండు సెంటైమ్‌ల పన్ను విధించాడు. బ్లాంకీ, ఫ్లోరెన్సకు మరణశిక్ష విధింపబడింది. రిపబ్లికన్ పత్రికలు నిషేధింపబడ్డాయి. జాతీయ అసెంబ్లీ వెర్సేల్స్‌కి బదిలీ చెయ్యబడింది. పలికావొచేత ప్రకటింప

* షైలాక్ — షేక్స్‌పియర్ వినోదాత్మక నాటకం "వెనిస్ వర్తకుడు"లోని ఒక పాత్ర, దురాశా పాతకుడైన వడ్డీవ్యాపారి ప్రతిరూపం. — సం.



పారిస్ నగర పాలకకార్యాలయంలో 1871 మార్చి 28న కమ్యూన్ ప్రకటింపబడిన
దృశ్యం

బడి, సెప్టెంబరు 4న ముగిసిన ముట్టడి స్థితి పొడిగింపబడింది. డిసెం[బిమార్[53] వినువా పారిస్ గవర్నరుగా, సామ్రాజ్యవాద సాయుధ పోలీసు భటుడు అయిన వలంటేన్ పోలీసు ప్రిఫెక్టుగా, జెస్యూట్ జనరల్ అయిన ఒరేల్ డి పలడీన్ నేషనల్ గార్డుకి కమాండర్ ఇన్ ఛీఫ్‌గా నియమింపబడ్డారు.

త్యేర్‌కీ, జాతీయ రక్షణ ప్రభుత్వానికి చెందిన ఆయన తైనాతీలకీ, మేమిప్పుడొక ప్రశ్నవెయ్యాల్సి ఉంది. తన ఆర్థిక మంత్రి వరేణ్యుడైన పుయ్యే-కర్ట్యే ద్వారా, త్యేర్ 200 కోట్ల రుణం తీసుకున్నట్లు తెలిసింది. మరి, యిది నిజమా, కాదా, —

1. దీనిలో త్యేర్, జూల్ ఫ్రావ్, ఎర్నెస్ట్ పికార్డ్, పుయ్యే-కర్ట్యే, జూల్ సిమొన్‌లకు సొంత లాభానికి కొన్ని కోట్ల డబ్బు ముట్టేలా ఈ వ్యవహారం జరిగిందా లేదా? పోతే —

2. పారిస్‌ను "తశ్శాంతి" పరచిన తర్వాత గాని యీ సొమ్ము చెల్లింపబడదు, ఔనా?[54]

ఏది ఏమైనా, త్యేర్, జూల్ ఫ్రావ్‌లు బోర్డో అసెంబ్లీలో మెజారిటీ పేర, పిగ్గుమాలి ప్రష్యన్ సేనలచేత పారిస్ ఆక్రమణను అర్థించారంటే, యీ వ్యవహారంలో, పెద్ద తికమకే ఏదో ఉండి ఉండాలి. జర్మనీకి తిరిగి వెళ్లిన బిస్మార్క్, ఫ్రాంక్‌ఫర్ట్‌కి చెందిన తన ఆరాధకులైన అల్పబుద్ధుల సమావేశంలో యీ విషయాన్ని ఎద్దేవాగా, ఎక సక్కెంగా, బహిరంగంగా బయటపెట్టిన దాన్నిబట్టి, యిది బిస్మార్క్ కిలాడీ కాదని తేలుతోంది.

## II

విప్లవ ప్రతీఘాత కుట్ర మార్గంలో సాయుధ పారిస్ మాత్రమే గట్టి అవరోధం. అందుకని, పారిస్‌ని నిరాయుధం చెయ్యాలి. ఈ అంశంపై బోర్డో అసెంబ్లీ నిర్మొగమాటంగా తన అభిప్రాయం వ్యక్తంచేసింది. దాని "భూస్వాముల సభ" ప్రతినిధుల యొక్క ఆడంబర పదజాలంతో కూడిన అరుపులు వినిపించని వాళ్లకు, ఏ కాస్త అనుమానమైనా మిగిలి వుంటే, త్యేర్ పారిస్‌ను, డిసెంబ్రిసూర్ వినువా, బోనపార్టిస్టు జెండార్మ్ వలంటేన్, జెస్యూట్ జనరల్ ఒరేల్ డి పలడీన్ అనే త్రిమూర్తుల సున్నితమైన దయాదాక్షిణ్యాలకు అప్పగించడమన్నది, దాన్ని తొలగించి వుండాలి. అయితే, పారిస్ నిరాయుధీకరణ నిజలక్ష్యాన్ని అవమానకరంగా ప్రదర్శిస్తూ, కుట్రదారులు, పారిస్‌ను దాని ఆయుధాలను క్రింద పెట్టమంటూ, అందుకు వారు చెప్పిన సాకు మాత్రం సుస్పష్టంగా కనిపించే పరమ సిగ్గుమాలిన అబద్ధాల్లో ఒకటి. పారిస్ నేషనల్ గార్డు యొక్క ఫిరంగులు ప్రభుత్వానికి చెందినవనీ, కాగా వాటిని ప్రభుత్వానికే తిరిగి యిచ్చెయ్యాలనీ, సెలవిచ్చాడు త్యేర్. కాని యదార్థం యిదీ: బిస్మార్కు బందీలు, ఫ్రాన్సు లొంగుబాటు పత్రంపై సంతకం పెట్టినా, పారిస్‌ను లొంగదీసుకొనేందు కోసం, ప్రత్యేకించి తమకు అనేక రక్షణలను కేటాయించుకున్నారు. అలా వారు లొంగిపోయిన మొట్టమొదటి రోజు నుండీ కూడా, పారిస్ తన జాగ్రత్తలో తానుంది. నేషనల్ గార్డులు తమను తాము పునస్సంఘటితం చేసుకున్నారు. పాత బోనపార్టిస్టు దళాలలో కొన్ని శకలాలను మినహాయించి, తాము యావన్మందీ కలిసి ఎన్నుకొన్న కేంద్ర కమిటీకి నేషనల్ గార్డు పూర్తి అదుపు బాధ్యతను అప్పగించారు. ప్రష్యన్లు పారిస్‌లో ప్రవేశించబోయేందుకు ముందే, సరిగా ప్రష్యన్లు ఆక్రమించుకోబోయే తావుల్లోనే లొంగుబాటుదారులు ద్రోహబుద్ధితో వదిలేసిన ఫిరంగులనూ మిట్రల్యూజ్‌లనూ* మాంమార్టర్,

* చిన్న మిసిలీలను విసిరే మరతుపాకులు. — సం.

బెల్‌విల్, లా విలెట్‌లకు తరలించేందుకు కేంద్ర కమిటీ చర్యలు తీసుకుంది. నేషనల్ గార్డు వేసుకున్న చందా మొత్తం ద్వారా ఆ ఫిరంగులు సమకూర్చబడ్డాయి. జనవరి 28వ తేదీ నాటి లొంగుబాటు పత్రంలో అవి నేషనల్ గార్డుకి చెందిన సొంత ఆస్తిగా అధికారికంగా గుర్తింపబడ్డాయి. అదే పేర, ప్రభుత్వానికి చెందిన ఆయుధాలన్నీ విజేతకి అప్పగింపబడినప్పుడు, అవి మినహాయింపబడ్డాయి. పారిస్‌కి వ్యతిరేకంగా యుద్ధాన్ని ప్రారంభించేందుకు త్యేర్‌కి మరే వంకా దొరక్క, నేషనల్ గార్డుకి చెందిన ఫిరంగులు ప్రభుత్వ ఆస్తి అన్న పచ్చి అబద్ధానికి తెగబడ్డాడు!

నేషనల్ గార్డు ఫిరంగులను పట్టుకోవడంలో ఉద్దేశం, పారిస్ సాధారణ నిరాయుధీకరణకు, తద్వారా సెప్టెంబరు 4వ తేదీ విప్లవ నిరాయుధీకరణకు పూర్వరంగం మాత్రమే నన్న విషయం స్పష్టం. కానైతే ఆ విప్లవం, ఫ్రాన్సులో చట్టబద్ధమైన హోదా సంతరించుకుంది. రిపబ్లికూ, దాని చర్యలూ విజేతచేత, లొంగుబాటు పత్రంలో గుర్తింపు పొందాయి. లొంగుబాటు తదనంతరం, అది విదేశీ ప్రభుత్వాలన్నింటిచేతా గుర్తింపబడింది, దాని పేరనే జాతీయ అసెంబ్లీ సమావేశ పరచబడింది. బోర్డోలో సమావేశమైన జాతీయ అసెంబ్లీకీ, దాని కార్యవర్గానికీ, చట్టబద్ధమైన హోదా కల్పించిన దేదైనా ఉందా అంటే, అది ఒక్క సెప్టెంబరు 4వ తేదీ నాటి పారిస్ కార్మికుల విప్లవం మాత్రమే. అదే లేకుంటే, ప్రష్యన్ పాలన క్రింద కాక, ఫ్రెంచి పాలన క్రింద, సార్వజనిక ఓటింగు పద్ధతిలో 1869లో ఎన్నుకోబడి, విప్లవంచేత బలవంతంగా చెదరగొట్టి వెయ్యబడిన శాసనసభకు జాతీయ అసెంబ్లీ వెన్వెంటనే చోటు చెయ్యాల్సి వచ్చేది. త్యేరూ, అతని ముఠా, కయ్యేన[55] యాత్ర చెయ్యకుండా ఉండగలగాలంటే, లూయీ బోనపార్ట్ సంతకాలున్న భద్రతా పత్రాల కోసం లోబడాల్సి వచ్చేది. ప్రష్యాతో శాంతిసంధిని ఆమోదించే అధికారాన్ని పొందిన జాతీయ అసెంబ్లీ, విప్లవ ఘటనలలో ఒకటి మాత్రమే. దాన్ని ప్రారంభించి, దాని కోసం దారుణమైన కరువు బాధలతోబాటు అయిదు నెలల ముట్టడిని అనుభవించి, ట్రొషూ పథకాన్ని నమ్మిచేసి, రాష్ట్రల్లో పట్టు విడవని ఆత్మరక్షణ యుద్ధానికి సుదీర్ఘ ప్రతిఘటనను ప్రాతిపదికగా చేసుకున్న సాయుధ పారిసే యిప్పటికీ ఆ విప్లవానికి అసలైన ప్రతిరూపం. అటువంటి పారిస్ ముందు యీనాడు రెండేరెండు ప్రత్యామ్నాయాలున్నాయి. ఒకటి, తిరుగబడిన బోర్డో బానిస యజమానుల అప్రతిష్ఠాకరమైన ఆజ్ఞలు శిరసావహించి, తన ఆయుధాలను క్రింద పెట్టి, సెప్టెంబరు 4 నాటి తన విప్లవం కేవలం లూయీ బోనపార్ట్ నుండి అతని రాచరిక ప్రత్యర్థులకు పట్టే అధికారపు బదిలీ మాత్రమే తప్ప మరేమీ కాదని అంగీకరించడం. రెండు, ఫ్రాన్సు కోసం ఆత్మత్యాగం చేసే వీరుడుగా ముందుకు రావడం, రెండవ సామ్రాజ్యం సృష్టించిన రాజకీయ, సాంఘిక పరిస్థితులను (అది శ్రద్ధాసక్తులతో పరమ నికృష్ట స్థితికి దిగ

జార్చిన పరిస్థితులను) విప్లవాత్మకంగా తొలగించి, వినాశంనుంచి ఫ్రాన్సును కాపాడి, దాని పునరుజ్జీవనాన్ని సాధ్యం చెయ్యడం. అయిదు మాసాల కరువు కాటకాలతో చివికి జీర్ణమైన పారిస్, త్రుటి కాలం సైతం సంకోచించలేదు. ఫ్రెంచి కుట్రదారులకు వ్యతిరేకంగా ప్రతిఘటన క్రమంలో ఎదురయ్యే విపత్తులన్నింటినీ, ఒకవంక ప్రష్యన్ ఫిరంగులు తన సొంత దుర్గాలనుంచే ఉరిమి చూస్తున్నా కూడా, ఎదుర్కోవడానికి, పారిస్ వీరోచితమైన నిర్ణయం తీసుకుంది. అంతర్యుద్ధంలోకి పారిస్‌ను నెట్టడం పట్ల తనకు గల అయిష్టతతో, జాతీయ అసెంబ్లీ ఒక మూల రెచ్చగొట్టే చర్యలు ఎన్ని చేస్తున్నా, కార్యనిర్వాహకవర్గం ఎన్ని అధికారాలను అక్రమంగా కైవసం చేసుకున్నా, పారిస్ లోపలా, చుట్టూనూ, విపత్కరమైన సేనల కేంద్రీకరణ ఎంతగా జరుగుతున్నా కూడా, కేంద్ర కమిటీ కేవలం దెబ్బ కాచుకొనే ధోరణినే కొనసాగించింది.

అప్పుడు త్యేర్ అంతర్యుద్ధాన్ని ప్రారంభించాడు. అతను వినువా నాయకత్వాన పలువురు పోలీసులతో కూడిన దళాన్నొకదాన్నీ, స్థాయీ సైన్యానికి చెందిన కొన్ని రెజిమెంట్లనూ చీకటి మాటున మాంమార్త్‌ర్‌పై ఆకస్మిక దాడికి పంపి, అక్కడ వున్న నేషనల్ గార్డుకి చెందిన ఫిరంగులను పట్టుకోవడానికి ప్రయత్నించాడు. నేషనల్ గార్డు ప్రతిఘటన మూలంగాను, సైనికుల ప్రజల మధ్య ప్రదర్శితమైన సౌభ్రాతృత్వ సౌహార్దాల మూలంగాను ఆ ప్రయత్నమెలా విఫలమైందో బాగా తెలిసిన విషయమే. ఒరేల్ డి పలడీన్ విజయానికి సంబంధించిన సమాచార పత్రికను ముందే అచ్చువేసుకొని కూర్చున్నాడు. తన రాజకీయ కుట్రకి సంబంధించిన చర్యల వివరాలతో కూడిన ప్రకటనను త్యేర్ సిద్ధం చేసుకుకూర్చున్నాడు. అలాంటిది, నేషనల్ గార్డుకి దాని ఆయుధాలను విడిచిపెట్టేందుకు తాము ఉదారంగా చేసిన నిర్ణయాన్ని తెలియజేస్తూ, యిప్పుడిక, నేషనల్ గార్డులు, తిరుగుబాటుదారులను అణచివెయ్యడంలో ప్రభుత్వంతో సహకరించాలంటూ త్యేర్ విజ్ఞప్తులు చెయ్యాల్సి వచ్చింది. 3,00,000 మంది నేషనల్ గార్డుల్లోనూ కేవలం 300 మంది మాత్రమే, తమకే వ్యతిరేకంగా తనతో కలసిరమ్మని అల్పుడైన త్యేర్ చేసిన విజ్ఞప్తిని పాటించారు. మార్చి 18 నాటి మహత్తరమైన కార్మిక విప్లవానికి పారిస్‌పై తిరుగులేని అధికారం లభించింది. కేంద్ర కమిటీయే ఆ విప్లవ తాత్కాలిక ప్రభుత్వమైంది. తానిటీవల సృష్టించ ప్రయత్నించిన రాజకీయ యుద్ధతంత్ర సంబంధమైన ఘటనలు యదార్థమా లేక, సుదూర గతానికి సంబంధించిన తన కలలా అని యూరప్ క్షణకాలం విస్తుపోయింది.

సాధారణంగా విప్లవాలలో, అంతకన్న ఎక్కువగా "ఉన్నత తరగతుల" ప్రతిఘాత విప్లవాలలో హింసాత్మక చర్యలు కొల్లలుగా ఉంటాయి. అటువంటిది, జనరల్ లెకాంట్, జనరల్ క్లెమాన్ టొమాల ఉరితీత, వెండొమ్ చౌకు సంఘర్షణ తప్ప విప్లవ ప్రతికూలురు

వేలెత్తి చూపగల దౌర్జన్య ఘటనలే జరగకపోవడం గమనార్హం. మార్చి 18కి పారిస్‌లో వెర్సేల్స్ సేనల ప్రవేశానికీ మధ్య శ్రామికవర్గ విప్లవ క్రమంలో దౌర్జన్య చర్యలే లేవు.

మాంమార్టర్‌పై చీకటి మాటున జరిగిన దాడి ప్రయత్నంలో బోనపార్టిస్టు సైన్యాధికారుల్లో ఒకడైన జనరల్ లెకాంట్, పిగాల్ చౌకులోని నిరాయుధ ప్రజా సమూహంపై కాల్పులు సాగించమని 81వ సైనిక రెజిమెంటుకి నాలుగు సార్లు ఆజ్ఞలు ఇచ్చాడు. వారా ఆజ్ఞలను ధిక్కరించేసరికి వారిని తీవ్రంగా తూలనాడాడు. స్త్రీలనూ, బాలబాలికలనూ కాల్చిచంపేందుకు బదులు, అతని సైనికులు, అతగాడినే కాల్చి చంపారు. కార్మికవర్గ శత్రువుల శిక్షణలో సైనికుల్లో చిరకాలంగా స్థిరంగా పాతుకు పోయిన అలవాట్లు, యీ సైనికులు పక్షాలు మారిన మరుక్షణమే మారిపోవు కదా. ఆ సైనికులే క్లెమాన్ టొమాను కాల్చి చంపారు.

అసంతృప్తజీవియైన మాజీ క్వార్టర్-మాస్టర్-సార్జెంట్ అయిన "జనరల్" క్లెమాన్ టొమా, లూయీ ఫిలిప్ పాలన చివరి కాలంలో, రిపబ్లికన్ వార్తాపత్రిక అయిన "National"[56] కార్యాలయంలో చేరాడు. దానిలో అతనికి రెండు రకాల బాధ్యతలుండేవి. ఒకటి, నిజానికి పెద్ద బాధ్యతంటూలేని ప్రధాన సంపాదకునిగా (gérant résponsable) ఉద్యోగం, మరోటి, ఆ జగడాల మారి పత్రిక తరపున కుస్తీలు పట్టే వస్తాదు పని. ఫిబ్రవరి విప్లవానంతరం,[57] "National"కి చెందిన వ్యక్తులు అధికారంలో తిష్ఠవెయ్యడంతో, సరిగా జూన్ ఊచకోతకి[8] ముందు, యీ పాత క్వార్టర్-మాస్టర్-సార్జెంటుని జనరల్‌గా మార్చారు. ఆ ఊచకోతకి ఘాతుకమైన కుట్రలు పన్నిన వాళ్ళలోను, వాటిని అత్యంత పాశవికంగా అమలుజరిపిన వాళ్ళలోను జూల్ ఫ్రావ్ లాస్తే యితగాడూ ఒకడు. అటుదరిమిలా చాలా కాలంపాటు అతనూ, అతని జనరల్‌గిరీ పత్తా లేకుండా పోయి, ఎప్పుడో 1870 నవంబరు 1న మళ్ళీ అతను పైకొచ్చాడు. రక్షణ ప్రభుత్వం నగర పాలక కార్యాలయంలో పట్టుబడి, బ్లాంకీ, ఫ్లోరెన్సులకూ, తదితర కార్మికవర్గ ప్రతినిధులకూ తాము అక్రమంగా హస్తగతం చేసుకున్న అధికారాన్ని పారిస్ స్వేచ్ఛగా ఎన్నుకొనే కమ్యూన్‌కి అప్పగిస్తామని ప్రమాణపూర్వక వాగ్దానం చేసినది సరిగా అంతకు ముందు రోజునే.[58] తమ వాగ్దానాన్ని నిలబెట్టుకోవడానికి బదులు, బోనపార్ట్‌కి చెందిన కార్సికన్ల స్థానంలో ట్రొషూకు చెందిన బ్రెటన్లను[59] ఎగతోలారు. ఒక్క జనరల్ టమిజ్యే మాత్రం, అటువంటి ద్రోహపూరితమైన పనితో తన పేరు ప్రతిష్ఠలు మలినంచేసుకో రాదని, నేషనల్ గార్డు ఛీఫ్ కమాండరు పదవికి రాజీనామా యిచ్చాడు. ఆయన స్థానంలో క్లెమాన్ టొమా మళ్ళీ అప్పుడు ఓ జనరల్ అయ్యాడు. అతని పదవీ కాలమంతటిలోనూ, ప్రష్యన్లపైన కాక, పారిస్ నేషనల్ గార్డుపైననే అతను యుద్ధంచేశాడు. నేషనల్ గార్డు సాధారణ ఆయుధీకరణను అతను అడ్డుకొట్టాడు. బూర్జువా సైనిక

బెటాలియన్లను కార్మిక బెటాలియన్ల పైకి ఉసిగొల్పాడు. ట్రొమో "పథకానికి" ప్రతి కూలురైన ఆఫీసర్లను ఏరిపారేశాడు. పిరికితనమనే మచ్చ మోపి, ఏ శ్రామికవర్గ బెటాలియన్ల వీరత్వమైతే, వారి చిరకాల పరమ శత్రువులకు సైతం యిప్పుడు విభ్రాంతి కొలిపిందో, వాటినే భీరుత్వం ప్రదర్శించాయన్న బురద పూసి రద్దుచేశాడు. పారిస్ శ్రామికవర్గానికి వ్యక్తిగత శత్రువుగా, 1848 జూన్ ఊచకోతలో తన ప్రాధాన్యాన్ని తిరిగి సంపాదించుకున్నందుకు క్లెమాన్ టొమా మహా గర్వించాడు. మార్చి 18కి కొద్ది రోజుల ముందే, "పారిస్ canaille*కి చెందిన la fine fleur [మేలు భాగం]ని హతమార్చడానికి" తన సొంత పథకమొకదాన్ని, యుద్ధ మంత్రి లెఫ్లోకి అతను సమర్పించాడు. కానైతే వినువా తీవ్ర పరాజయం పొందిన తర్వాత, కార్యరంగంలో యితగాడు, ఔత్సాహిక వేగు హోదా వరించకుండా ఉండలేకపోయాడు. వేల్సు యువరాణి తన లండన్ ప్రవేశ దినాన త్రొక్కిసలాటలో నలిగిపోయిన ప్రజల చావుకెంత బాధ్యురాలో, క్లెమాన్ టొమా, లెకాంట్ల చావుకు కేంద్ర కమిటీ, పారిస్ కార్మికులూ అంతే బాధ్యులు.

వెండొమ్ చౌకులో నిరాయుధులైన పౌరుల మూకుమ్మడి హత్యాకాండ అన్నదొక కట్టుకథ. త్యేరూ, "భూస్వాముల సభా" యీ అంశాన్నెప్పుడూ దాటవేస్తూ వచ్చారు. దీనికి సంబంధించిన దుష్ప్రచార బాధ్యతను యూరపియన్ కిరాయి పత్రికా రచయితలకే కేటాయించారు. "వ్యవస్థ సంరక్షకులు" పారిస్‌కి చెందిన ప్రగతి నిరోధకులు మార్చి 18 నాటి విజయం పట్ల భయకంపితులయ్యారు. చిట్టచివరకు ముంచుకొస్తున్న ప్రజల పగ సాధింపుకు సూచికగా వాళ్లకది కనిపించింది. 1848 జూన్ రోజులకూ 1871 జనవరి 22కీ[60] మధ్య తమ చేతులతో హతమార్చబడిన నిర్భాగ్యుల దయ్యాలిప్పుడు వాళ్ల కళ్ల ముందు పైకి లేస్తున్నాయి. అయినా వాళ్లకి కలిగినది భయాతిరేకం మాత్రమే. పోలీసులను నిరాయుధం చేసి, కొట్లలో బంధించి యుండాల్సింది. అలా చేసేందుకు బదులు, వాళ్ల సురక్షితంగా వెర్సేల్స్‌కి పారిపోవడానికి వీలుగా పారిస్ కవాటాలు బార్లా తెరవబడ్డాయి. "వ్యవస్థ సంరక్షకులు" నిరపాయంగా విడిచిపెట్టబడటమే కాకుండా, వాళ్ల తిరిగి సంఘటితులై, పారిస్ నడిబొడ్డులోనే వున్న అనేక కీలకమైన స్థావరాలను నిరాటంకంగా ఆక్రమించుకోవడానికి సైతం వాళ్లకి అవకాశమివ్వబడింది. కేంద్ర కమిటీ ప్రదర్శించిన యీ మెతకతనానికి, సాయుధ కార్మికుల యీ ఔదార్యానికి – "పార్టీ ఆఫ్ ఆర్డర్" అలవాట్లకు విలక్షణము విభిన్నమైన యీ లక్షణాలకు – బుద్ధిపూర్వకమైన బలహీనతకు లక్షణాలుగా ఎదుటి పక్షం వక్రభాష్యం

* మూక. – సం.

చెప్పింది. అందుకే అది, నిరాయుధ ప్రదర్శన మాటున, వినువా తన ఫిరంగులతోనూ, మిత్రలియ్యూజ్‌లతోనూ సాధించజాలని దాన్ని సాధించాలని, అకటావికటపు పథకమొకటి వేసి, దాన్ని అమలు జరపాలని ప్రయత్నించింది. మార్చి 22వ తేదీన, సంపన్న విలాస ప్రాంతాల నుండి, "పెద్ద మనుషుల" దొమ్మీ మూక ఒకటి బయల్దేరింది. దానిలో సంపన్న రంగేళీ యువకులున్నారు. గుంపుకి అగ్రభాగాన, సామ్రాజ్యానికి చెందిన రోసిపోయిన — హెక్కరెన్, క్యోట్లగాన్, ఆంరీ డి పేన్ వంటి భ్రష్టాచారులున్నారు. శాంతియుత ప్రదర్శన అనే పిరికితనపు ముసుగులో, ఈ నీచపు మూక, బందిపోటు దొంగలు వాడే ఆయుధాలను రహస్యంగా ధరించి, బారులుతీరి మార్చింగుకి పూనుకొని, త్రోవలో తమ కెదురైన చెదరియున్న నేషనల్ గార్డ్సుకు చెందిన గస్తీ సైనికులను, కావలాదారులను హింసించి, నిరాయుధులను చేశారు. డిలాపే రోడ్డు నుండి బయట కొస్తూ, "కేంద్ర కమిటీ నశించాలి! హంతకులు నశించాలి! జాతీయ అసెంబ్లీ వర్ధిల్లాలి!" అని కేకలేస్తూ అక్కడ బారుతీరిన సైనిక శ్రేణి మధ్య నుంచి చొచ్చుకుపోయి, తద్వారా వెండొమ్ చౌకులో వున్న నేషనల్ గార్డ్ కేంద్ర కార్యాలయంపై పడి, దాన్ని ఆక్రమించుకుందామని ప్రయత్నించారు. వాళ్ల పిస్టల్ కాల్పులకు బదులుగా, మామూలుగా ముమ్మారు జరిగే sommations (ఇంగ్లీష్ దొమ్మీ చట్టానికి ఫ్రెంచిలో సమానమైన పదం)[61] వల్లించబడ్డాయి. అవి నిష్ఫలమని తేలినప్పుడు, నేషనల్ గార్డ్ జనరల్* కాల్పులకు ఆజ్ఞ యిచ్చాడు. ఒక్క విడత కాల్పులు సాగాయో లేదో దాంభికులైన యీ విదూషకులు పరుగు లంకించుకున్నారు. పాపం వీళ్లు, జెరికో గోడలపై జోషువా భేరీ నాదాలు పని చేసినట్లు,** కేవలం తమ "గౌరవనీయతా" ప్రదర్శన పారిస్ విప్లవంపై పనిచేసి తాము కోరిన ఫలితమిస్తుందని ఆశించారు. పలాయనం చిత్తగించిన వీళ్లు యిద్దరు నేషనల్ గార్డులను చంపి, తొమ్మిదిమందిని తీవ్రంగా గాయపరచారు (వీరిలో కేంద్ర కమిటీ సభ్యుడు కూడా ఒకడున్నాడు***). వాళ్ళు ఈ వీరోచిత కృత్యం జరిపిన స్థలమంతటా రివాల్వర్లు, బాకులు, క్రూర కత్తులు, వాళ్ల "శాంతియుత" ప్రదర్శనయొక్క "నిరాయుధ" స్వభావానికి రుజావుగా, చెల్లాచెదరుగా పడివున్నాయి, రోమ్‌పై ఫ్రెంచి సేనలు జరిపిన దుర్మార్గపు దాడికి[47] నిరసనగా, 1849 జూన్ 13న నేషనల్ గార్డ్ నిజంగా శాంతియుతమైన ప్రదర్శన జరిపినప్పుడు, యీ నిరాయుధ ప్రజలపై అన్ని వేపుల

---

* బెర్జెరే. — సం.

** జోషువా (యెహోషువా బెన్ నున్) (బైబిలు) — పవిత్ర తూర్యనాదాలతోను, తన సైనిక యోధుల అరుపులతోను జెరికో కుడ్యాలను కూల్చివేసిన వీరుడు. — సం.

*** మల్‌జార్నాల్. — సం.

మంచీ తన సైనికుల్ని ఎగతోలి, వాళ్లని కాల్పించినందుకూ, కత్తులతో తెగనరికినందుకూ, తమ గుర్రాల గిట్టల క్రింద నలగ త్రొక్కినందుకూ గాను "పార్టీ ఆఫ్ ఆర్డర్"కి ఆ నాటి జనరల్ అయిన షంగర్న్యేపైన జాతీయ అసెంబ్లీ, ప్రత్యేకించి త్యేర్ ప్రశంసల వర్షం కురిపించారు. అప్పుడు పారిస్‌లో ముట్టడి స్థితి ప్రకటించబడింది. డుఫార్ జాతీయ అసెంబ్లీలో ఆదరాబాదరా కొత్త నిర్బంధ శాసనాలను ప్యాస్ చేయించాడు. కొత్త అరెస్టులు, కొత్త ప్రవాసశిక్షలు — యిలా మళ్లీ దౌర్జన్యం తాండవించింది. కాని "అధోశ్రేణి జనం" అలాంటి సందర్భాలలో మరొక విధంగా వ్యవహరిస్తారు. 1871 నాటి కేంద్ర కమిటీ "శాంతియుత ప్రదర్శన" వీరుల విషయం బొత్తిగా పట్టించుకోకుండా విడిచి పెట్టేసింది; దానితో రెండేరెండు రోజుల్లో వాళ్లు అడ్మిరల్ సెస్సే నాయకత్వంలో సాయుధ ప్రదర్శనకు బలాన్ని కూడదీసుకోగలిగారు. అది వెర్సేల్స్‌కు వాళ్ల ప్రసిద్ధి కెక్కిన పలాయనంతో ముగిసింది. మాంమార్టర్‌పై దొంగచాటుగా దెబ్బతీసేందుకు చేసిన ప్రయత్నంతో త్యేర్ ప్రారంభించిన అంతర్యుద్ధాన్ని కొనసాగించడం పట్ల తనకుగల వైముఖ్యంతో, కేంద్ర కమిటీ అప్పుడు వినాశకరమైన పొరపాటు చేసింది. అప్పట్లో పూర్తిగా నిరాధారంగా వున్న వెర్సేల్స్‌పై దాడి చేసి, త్యేర్‌యొక్కా, అతని "భూస్వాముల సభ"యొక్కా కుట్రలను వెన్వెంటనే తుదముట్టించి యుండాల్సిన కేంద్ర కమిటీ అలా చెయ్యలేదు. అందుకు బదులు, కమ్యూన్ ఎన్నికల రోజైన మార్చి 26న, "పార్టీ ఆఫ్ ఆర్డర్‌కి" బేలట్‌పెట్టె ద్వారా మరోసారి తన బలాన్ని పరీక్షించుకొనే అవకాశం కల్పించింది. ఆనాడు, పారిస్ మేయరాల్టీ భవనాల్లో, "పార్టీ ఆఫ్ ఆర్డర్" వాళ్లు మహోదారులైన తమ విజేతలతో నుతిమెత్తని తియ్యని రాజీ మాటలు పలికి, లోలోపల మాత్రం, కాలక్రమేణా వీళ్లని రూపుమాపాలని గట్టి ప్రమాణాలు చేసుకున్నారు.

ఇప్పుడిక నాణానికి రెండోపక్క చూద్దాం. త్యేర్, పారిస్‌కి వ్యతిరేకంగా ఏప్రిల్ మొదట్లో తన రెండవ దాడిని ప్రారంభించాడు. వెర్సేల్స్‌కి తీసుకురాబడిన పారిస్ ఖైదీల తొలి బృందం నీచమైన క్రౌర్యాలకు గురి చెయ్యబడింది. ఆ దమనకాండ సాగినంత సేపూ ఎర్నెస్ట్ పికార్డ్ తన లాగు జేబుల్లో చేతులు పెట్టుకొని, అటూ యిటూ పచారు చేస్తూ ఖైదీలను ఎకసక్కెం చేశాడు. త్యేర్, ఫాగ్రేల సతీమణులు, తమ గౌరవనీయ (?) చెలికత్తెల మధ్య నిలబడి, బాల్కనీ నుంచీ, వెర్సేల్స్ మూక చేసే సిగ్గుచేటైన దౌర్జన్యాలను అభినందించారు. పట్టుబడిన స్థాయీ సైన్యానికి చెందిన సైనికులను మిక్కిలి క్రూరంగా చిత్రవధ చేశారు. మన మిత్రుడు, కొలిమి పనివాడు అయిన జనరల్ డ్యువాల్‌ను ఏవిధమైన విచారణా లేకుండా కాల్చి చంపారు. రెండవ సామ్రాజ్యపు ఉన్మత్త విలాసతాండవాల్లో సిగ్గుమాలిన తన ప్రదర్శనల ద్వారా రోసిపోయిన తన భార్యకు ఉంపుడుకాడైన గాలిఫే, నేషనల్ గార్డుల చిన్న బృందాన్నొక దాన్ని,

దాని కెప్టెను, లెఫ్టినెంట్లతోబాటు ఆకస్మికంగా తన జవాన్లు పట్టుకొని, వాళ్లను నిరాయుధులను చెయ్యగా, తను వాళ్ల హత్యకు ఆజ్ఞలు జారీ చేశానని సగర్వంగా ప్రకటించుకున్నాడు. పొరుబోతు వినువా, కమ్యూనార్డుల శ్రేణుల్లో చేరిన స్థాయీ సైన్యానికి చెందిన ప్రతి ఒక్క సైనికుణ్ణీ కాల్చి పారెయ్యాల్సిందిగా యిచ్చిన సాధారణ ఆజ్ఞకుగాను, గ్రాండ్ క్రాస్ ఆఫ్ ది లీజియన్ ఆఫ్ ఆనర్ని బహూకరించి అతగాడిని త్యేర్ సత్కరించాడు. 1870 అక్టోబరు 31న, జాతీయ రక్షణ ప్రభుత్వ సభ్యుల తలలు ఎగిరిపోకుండా కాపాడిన, పర్మాక్రమౌదార్యాది సద్గుణ గరిష్ఠుడైన ఫ్లొరెన్సును[63] విశ్వాసఘాతుక బుద్ధితో కసాయివానిలా తుండతుండాలుగా నరికిన ఘనకార్యానికిగాను డెమరే అనే పోలీసుని సత్కరించారు. ఫ్లొరెన్సు హత్యకి సంబంధించిన "ప్రోత్సాహకరమైన వివరాలను," త్యేర్, జాతీయ అసెంబ్లీలో విజయోత్సాహంతో సాగదీసి మరీ వర్ణించి చెప్పాడు. పార్లమెంటరీ రంగంలో సాటిలేనివాడి నన్న మిడిసిపాటుతో, తామర్లేన్ పాత్ర నిర్వహించడానికి అవకాశం లభించిన అంగుష్ఠమాత్రుడు త్యేర్, తన వైచ్యానికి వ్యతిరేకంగా తిరుగబడిన వారికి, నాగరిక యుద్ధకాండలో లభించే ప్రతి హక్కునూ, చివరకు క్షతగాత్రులకు ప్రాథమిక చికిత్స చేసే కేంద్రాలపట్ల తాటస్థ్య నియమాన్ని సైతం తిరస్కరించాడు. వోల్టేర్ తన "కాండిడ్" గ్రంథంలో ఎన్నడో ఊహించిన[63] కోతికన్న — కొంత కాలంపాటు తనలోని పులిబుద్ధులు స్వేచ్ఛగా స్వైరవిహారం చెయ్యడానికి అవకాశం లభించిన కోతికన్న — మించిన భయంకర జీవి మరొకటుండదు. (35వ పేజిలోని వ్యాఖ్య చూడండి.*)

ఏప్రిల్ 7న కమ్యూన్ ఒక ఉత్తరువు జారీ చేసింది. అందులో ప్రతీకారచర్యలు తీసుకోవాలని ఆజ్ఞ జారీ చేసింది. "వెర్సేల్స్ బందిపోట్లు నరమాంస భక్షకులతో సమానంగా చేస్తున్న క్రూర కృత్యాలకు వ్యతిరేకంగా పారిస్‌ను కాపాడటం, కంటికి కన్ను, పంటికి పన్నుగా దెబ్బకి దెబ్బ తియ్యాల్సిందిగా డిమాండు చెయ్యడం" తన విధిగా పరిగణిస్తున్నట్లు స్పష్టం చేసింది.[64] అయినా, ఖైదీల పట్ల తన పాశవిక ప్రవర్తనను త్యేర్ విరమించుకోలేదు. పైగా, తన సమాచార పత్రాల్లో వాళ్ల నిలా తూలనాడ నారంభించాడు: "హీనమైన ప్రజాస్వామ్యానికి చెందిన యింతకన్న హీనమైన ముఖాకృతులు విజాయితీపరుల వ్యథిత దృక్కులకు మరెన్నడూ ఎదురై యుండవు" — ఆ విజాయితీపరులు ఎలాంటి వారంటే, సాక్షాత్తూ త్యేర్ లాంటివారు, మంత్రి పదవుల్లో వున్న బందిపోటుల ముఠా! అయినా కూడా, ఖైదీల మరణశిక్ష అమలు మరి కొంతకాలం వాయిదా వెయ్యబడింది. త్యేరూ, అతని జనరల్సూ — డిసెంబర్ కుట్ర[10] వీరులు — ఎప్పుడైతే ప్రతీకార చర్య

---

* 110–112వ పేజీలు చూడండి. — సం.

లకు సంబంధించి కమ్యూన్ జారీ చేసిన ఉత్తరువు పట్ల బెదరింపు మాత్రమేనని గ్రహించారో, పారిస్‌లో నేషనల్ గార్డుల మారువేషాల్లో పట్టుబడ్డ తమ సాయుధ సైనిక గూఢచారులూ, బాంబులతో బాటు పట్టుబడిన పోలీసులూ సైతం విడిచిపెట్టెయ్యబడ్డారని గ్రహించారో – అప్పుడిక ఖైదీల మూకుమ్మడి కాల్చివేత తిరిగి ప్రారంభింపబడి, చివరికంటా నిరాటంకంగా కొనసాగింది. నేషనల్ గార్డులు పరుగెత్తుకెళ్లి తల దాచుకున్న యిళ్లను సాయుధ పోలీసులు చుట్టుముట్టి, పెట్రోలుతో ముంచెత్తి (ఈ యుద్ధంలో యిలా జరగడానికి యిదే మొదలు), తర్వాత వాటికి నిప్పంటించారు. నల్లగా కాలి బొగ్గయిపోయిన శవాలను టెర్న్ పేటలోని పత్రికలకు చెందిన ప్రాథమిక చికిత్స దళం యాంబ్యులెన్సు తీసుకొచ్చింది. నలుగురు నేషనల్ గార్డులు ఒక అశ్విక సైనిక దళానికి బెల్ ఎపిన్ దగ్గర ఏప్రిల్ 25న లొంగిపోయారు. వాళ్లు ఒకరి తర్వాత మరొకరు, గాలిఫే బాపతు ఒక కెప్టెను చేత కాల్చివెయ్యబడ్డారు. వారి నలుగురిలో చనిపోయాడని వదిలెయ్యబడిన షెఫేర్ అనే వ్యక్తి, పారిస్ ఓట్ పోస్టు*ల్లో ఒకదాని దగ్గరకు దేక్కుంటూ చేరుకున్నాడు. తర్వాత అతనీ ఘటన గురించి కమ్యూన్ నియమించిన కమిషన్‌కి వాఙ్మూలమిచ్చాడు. ఈ కమిషన్ నివేదికపై టొలేన్, యుద్ధ మంత్రిని ప్రశ్నించినప్పుడు, "భూస్వాముల సభ" వాళ్లు అరిచి పెడబొబ్బలుపెట్టి, అతని స్వరం వినపడకుండా చేసి, లెఫ్లో జవాబివ్వకుండా అడ్డుకున్నారు. దాని ఘన కార్యాలను గురించి చెప్తే, వాళ్ల "యశోదీప్తమైన" సైన్యానికి అవమానం కదా మరి. ములెన్ సాకేలో నిద్రిస్తున్న కమ్యూనార్డులపై ఆకస్మిక దాడి జరిపి బయనెట్లతో పొడిచి చంపిన ఘటనను గురించీ, క్లమార్‌లో జరిగిన మూకుమ్మడి కాల్పులను గురించీ, త్యేర్ సమాచార పత్రాలు వివరించిన నిర్లక్ష్య ధోరణి, అంతగా సున్నితత్వం లేని లండన్ "Times"[65] పత్రికకు సైతం విభ్రాంతి కొలిపాయి. అయితే యీనాడు, పారిస్‌ను బొంబార్డు చేసినవాళ్లూ, విదేశీ దాడి రక్షణలో బానిస యజమానుల తిరుగుబాటును రెచ్చగొట్టినవాళ్లూ చేసిన కేవలం ప్రాథమికమైన ఘాతుకాలను తిరిగి లెక్కించాలన్న ప్రయత్నం సైతం హాస్యాస్పదంగా ఉండక మానదు. ఇన్ని భయానక కృత్యాల మధ్య, తన మరుగుజ్జు భుజస్కంధాలపై పడిన మహత్తర బాధ్యతను గురించి పార్లమెంటులో తను నిత్యమూ చేసే ప్రలాపాలనూ, విలాపాలనూ మరచిపోయి, తన సమాచార పత్రాల్లో, l'Assemblée siège paisiblement (అసెంబ్లీ శాంతియుత వాతావరణంలో సమావేశమవుతోంది) అని గప్పాలు కొడుతున్నాడు. ఒక మారు డిసెంబరిస్టు జనరల్సుతోను, మరో మారు జర్మన్ రాజకుమారులతోను నిత్యమూ విందులూ వినోదాలూ, త్రాగుడూ తందనాలూ సాగిస్తూ, లెకాంట్, క్లెమాన్ టొమాల ప్రేతాల కారణంగా సైతం తన తిండిపుష్టి తగ్గలేదని రుజువు చేస్తున్నాడు.

---

* ముఖ్య సేనకు కొద్ది దూరంలో కొద్దిమంది సిపాయిలనుంచే చోటు. – సం.

## III

మార్చి 18వ తేదీ వేకువ ఝామున "Vive la Commune!"* అన్న మేఘ గర్జలవంటి కేకలతో పారిస్ మేల్కొంది. బూర్జువా మనస్సులను యింతగా కల్లోలితం చేసే ఆ కమ్యూన్, ఆ బ్రహ్మరాక్షసి ఏమిటి?

> మార్చి 18 నాటి తన ప్రణాళికలో కేంద్ర కమిటీ యిలా పేర్కొంది: "పారిస్ శ్రామికులు, పాలకవర్గాల వైఫల్యాలను, విద్రోహాలను చూసి, సామాజిక వ్యవహారాల నిర్దేశకత్వాన్ని తమ చేతుల్లోకి తీసుకొని, పరిస్థితిని కాపాడాల్సిన క్షణం ఆసన్నమైందని గ్రహించారు.... రాజకీయాధికారాన్ని హస్తగతం చేసుకొని, తమ భవితవ్యాల కర్తృత్వాన్ని తామే వహించడమన్నది తమ సగర్వమైన విధియనీ, తిరుగులేని తమ హక్కనీ వారు గ్రహించారు."

కానైతే కార్మికవర్గం, తయారై సిద్ధంగా వున్న రాజ్యయంత్రాన్ని కేవలం యిలా పట్టుకొని, అలా తన సొంత ప్రయోజనాల కోసం వాడుకోజాలదు.

స్థాయీ సైన్యం, పోలీసులు, బ్యూరాక్రసీ, మతగురువులూ, న్యాయాధికారి వర్గమూ అనే సార్వత్రికమైన అంగాలతో క్రమబద్ధము, క్రమానుగతమైన శ్రమ విభజనాంగాలతో కూడిన కేంద్రీకృత రాజ్యాధికారం, తిరుగులేని రాజరికపు రోజుల్లో ఆరంభమై, అప్పుడే ఉద్భవిస్తున్న బూర్జువా సమాజానికి, ఫ్యూడలిజానికి వ్యతిరేకంగా అది జరిపే పోరాటాల్లో మహా శక్తివంతమైన ఆయుధంగా ఉపయోగపడింది. అప్పటికీ దాని అభివృద్ధికి మధ్య యుగాల నాటి అన్ని రకాల పనికిమాలిన అవశేషాలూ — ఫ్యూడల్ ప్రభువులకుండే ప్రత్యేక హక్కులు, స్థానికంగా ఉండే ప్రత్యేక సౌకర్యాలు, మ్యునిసిపల్, గిల్డు గుత్త

* "కమ్యూన్ వర్ధిల్లాలి!" — సం.

సంస్థలు, రాష్ట్రీయ రాజ్యాంగాల వంటివెన్నో – గుది బండలుగా తయారయ్యాయి. పద్దెనిమిదవ శతాబ్దం నాటి ఫ్రెంచి విప్లవమనే బ్రహ్మాండమైన చీపురు పాత కాలాల నాటి యీ అవశేషాలన్నింటినీ తుడిచిపెట్టింది. తద్వారా అదే కాలంలో, ఆధునికమైన ఫ్రాన్సుకు వ్యతిరేకంగా పాత అర్ధ ఫ్యూడల్ యూరప్ జరిపిన సంయుక్త యుద్ధాల ఫలితంగానే ఉద్భవించిన మొదటి సామ్రాజ్యం క్రింద నిర్మితమైన ఆధునిక రాజ్య భవనపు ఉపరినిర్మాణానికి గల తుది అవరోధాలయొక్క సాంఘిక పునాదిని అది తొలగించింది. తదుపరి పాలనల్లో, పార్లమెంటరీ అదుపులో – అంటే, ఆస్తిపర వర్గాల ప్రత్యక్ష అదుపులో – పెట్టబడిన ప్రభుత్వం, బృహత్తరమైన జాతీయ రుణాలకూ, కృంగదీసే పన్నులకూ నెలవు కావడమే కాకుండా; పదవికి, అన్యాయార్జనకు, ప్రాపకానికి సంబంధించిన బలవత్తర వ్యామోహాలతో, ప్రత్యర్థి కూటాలకూ, పాలకవర్గాలకు చెందిన సాహసికులకూ మధ్య వివాద కారణం కావడమే కాకుండా; సమాజంలో వచ్చిన ఆర్థిక మార్పులతో బాటే దాని రాజకీయ స్వభావం కూడా మారిపోయింది. ఆధునిక పరిశ్రమ ప్రగతి ఏ వేగంతోనైతే పెట్టుబడికీ, శ్రమకీ మధ్య వర్గ శత్రుత్వాన్ని పెంపొందించి, విస్తృతంచేసి, తీవ్రతరం చేసిందో, అదే వేగంతో రాజ్యాధికారం, శ్రమపై పెట్టుబడి యొక్క జాతీయాధికార స్వభావాన్ని, సాంఘిక బానిసత్వం కోసం నిర్మితమైన సామాజిక బలప్రయోగ స్వభావాన్ని, వర్గ పరిపాలనకొక ఇంజనువంటి స్వభావాన్ని సంతరించుకుంది. ప్రతి విప్లవమూ వర్గపోరాటంలో ప్రగతిశీల దశను గడిచిన తర్వాత, రాజ్యాధికారపు నికరమైన పీడక స్వభావం అంతకంతకు స్ఫుటంగా బయటికొస్తుంది. భూస్వాముల నుండి పెట్టుబడిదారులకు అధికారపు బదిలీకి కారణమైన 1830 నాటి విప్లవం, దాన్ని కార్మికవర్గానికి మరింత దూరంగా ఉండే శత్రువు నుండి మరింత సన్నిహితంగా ఉండే ప్రత్యక్ష శత్రువు దగ్గరకు మార్చింది. ఫిబ్రవరి విప్లవం[57] పేర రాజ్యాధికారాన్ని తీసుకున్న బూర్జువా రిపబ్లికన్లు, దాన్ని జూన్ ఊచకోత కోసం వినియోగించారు. అలా చెయ్యడంలో వాళ్ల ఉద్దేశం, "సోషల్" రిపబ్లిక్ అంటే తమ సాంఘిక బానిసత్వాన్ని సుస్థిరంచేసే రిపబ్లిక్ అని కార్మికవర్గానికి విశ్వాసం కలిగించడం, బూర్జువా, భూస్వామ్య వర్గంలోని రాజరిక భావాలు కలిగిన అధిక సంఖ్యాకులకు, ప్రభుత్వ బాధ్యతలనూ, ప్రతిఫలాలనూ భద్రంగా బూర్జువా "రిపబ్లికన్ల" చేతుల్లో వదలవచ్చునన్న విశ్వాసం కలిగించడమే. అయితే, తమ ఒకేఒక వీరోచితమైన జూన్ సాహసకార్యం తర్వాత, బూర్జువా రిపబ్లికన్లు, ముందు నుండి "పార్టీ ఆఫ్ ఆర్డర్" – ఉత్పాదక వర్గాలకు వ్యతిరేకంగా యిప్పుడు బాహాటంగా ముందుకొచ్చిన దోపిడి వర్గానికి చెందిన అన్ని శత్రు కూటాలూ, ముఠాలూ కలిసి ఏర్పాటు చేసుకున్న కలగాపులగం – వెనక్కి తగ్గాల్సి వచ్చింది. జాయింట్ స్టాక్ కంపెనీ వంటి వాళ్ల మిశ్రమ ప్రభుత్వానికి సరైన రూపమే లూయీ బోనపార్ట్

అధ్యక్షుడుగా ఏర్పడిన పార్లమెంటరీ రిపబ్లిక్. వాళ్లది, వర్గ హింసాకాండకీ, "నీచపు మూక"ను బుద్ధిపూర్వకంగా అవమానించడానికీ కట్టుబడిన పాలన. త్యేర్ చెప్పినట్లు, పార్లమెంటరీ రిపబ్లిక్ "వాళ్లను" (పాలకవర్గానికి చెందిన వివిధ విభాగాలను) "అతి తక్కువగానే చీల్చింది" కాని, ఆ వర్గానికీ, వాళ్ల చెదురుమదురు శ్రేణులకూ బయటున్న యావత్తు సమాజానికీ మధ్య మాత్రం పెద్ద అఘాతాన్ని కల్పించింది. పూర్వపు పాలనల్లో, వాళ్ల మధ్య వాళ్లకే ఉండే విభేదాల కారణంగా ఏర్పడ్డ నిర్బంధాలు రాజ్యాధికారాన్ని కొంత అదుపులో పెడుతూండేవి. అలాంటిది, దాని ఐక్యత కారణంగా అవి కాస్తా తొలగిపోయాయి. ముంచుకొస్తున్న శ్రామికవర్గ తిరుగుబాటు వెల్లువ దృష్ట్యా, ఐక్యమైన పాలకవర్గం రాజ్యాధికారాన్ని నిర్దాక్షిణ్యంగా, నరభసంగా, శ్రమకు వ్యతిరేకంగా పెట్టుబడియొక్క జాతీయ యుద్ధ — నిర్వాహక పరికరంగా వినియోగించింది. ఉత్పత్తి చేసే ప్రజాసామాన్యానికి వ్యతిరేకంగా తాము నిరంతరాయంగా జరిపే దండయాత్ర క్రమంలో, కార్యనిర్వాహక శాఖకు వరుసగా అంతకంతకు ఎక్కువ నిర్బంధాధికారాలను కట్టబెట్టాల్సి వచ్చింది. అయితే, అదే సమయంలో, తమ సొంత పార్లమెంటరీ దుర్గమైన జాతీయ అసెంబ్లీకి, కార్యనిర్వాహక శాఖకి వ్యతిరేకంగా ఉన్న రక్షణ సాధనాలన్నింటినీ, ఒకటొకటే పాలకవర్గం వదులుకోవాల్సి కూడా వచ్చింది. లూయీ బోనపార్ట్ రూపంలో వున్న కార్యనిర్వాహక శాఖ వాళ్లకు దేవిడిమన్నా చెప్పింది. "పార్టీ ఆఫ్ ఆర్డర్" రిపబ్లిక్‌యొక్క సహజ సంతానమే రెండవ సామ్రాజ్యం.

అధికార కైవసానికై చేసిన కుట్రయే[10] జనన ధృవీకరణ పత్రంగా, సార్వజనిక ఓటింగు హక్కే అనుమతి పత్రంగా, కరవాలమే రాజదండంగా అవతరించిన ఆ సామ్రాజ్యం, పెట్టుబడికీ శ్రమకీ మధ్య జరిగే పోరాటంలో ప్రత్యక్ష భాగస్వామ్యంలేని ఉత్పత్తిదారుల పెద్ద సమూహమైన రైతాంగంపై తను ఆధారపడతానని చెప్పుకుంది. పార్లమెంటరిజాన్నీ, దానితో బాటే, ఆస్తిపరవర్గాలకు ప్రభుత్వపు బహిరంగ లొంగుబాటునూ భగ్నం చెయ్యడం ద్వారా కార్మికవర్గాన్ని కాపాడతానంది. కార్మికవర్గంపై వాటి ఆర్థిక సార్వభౌమాధికారాన్ని నిలబెట్టడం ద్వారా ఆస్తిపరవర్గాలను రక్షిస్తానంది. చివరకు, జాతీయాభ్యున్నతి పునరుద్ధరణ అనే మృగ తృష్ణ పేర అన్ని వర్గాలనూ సమైక్యం చేస్తానని చెప్పుకుంది. నిజానికి, బూర్జువావర్గం అప్పటికే పరాజితమై, కార్మికవర్గమింకా జాతిని పాలించగల కౌశల్యాన్ని సంపాదించుకోని ఆ తరుణంలో ఏర్పడటానికి అవకాశం ఉన్న ప్రభుత్వ రూపం అదొక్కటే. సమాజాన్ని కాపాడిన ప్రభుత్వంగా అది ప్రపంచ వ్యాపితంగా మన్ననలు పొందింది. దాని పాలనలో, రాజకీయ బరువు బాధ్యతల నుండి విముక్తమైన బూర్జువా సమాజం, తాను సైతం ఆశించనంతటి అభివృద్ధి స్థాయిని అందుకుంది. దాని పరిశ్రమలూ, వాణిజ్యమూ బ్రహ్మాండ

మైన ప్రమాణాలకు విస్తరించాయి. ఆర్థిక చట్బా వ్యాపారం జాతీయ, ప్రాంతీయ వివక్షలేని సామూహిక విందువిలాసాలు జరుపుకుంది. ప్రజా సామాన్యపు దైన్య హైన్యాలకు కళ్లు మిరుమిట్లు గొలిపి విమోహితులను చేసే నికృష్ట విలాసమయ జీవితాల సిగ్గు మాలిన ప్రదర్శనను పోటీ పెట్టింది. కళ్ల ఎదుట సమాజంకన్న ఉన్నతంగా పెరిగి పోతున్న రాజ్యాధికారం, అదే సమాజానికి చెందిన మిక్కిలి అప్రతిష్ఠాకరమైనదిగా, దాని అవినీతికర కార్యాలన్నింటికీ నెలవుగా తయారైంది. అదీ, అది కాపాడిన సమాజమూ ఎంతగా కుళ్లిపోయాయో, ఆ రాజ్యాధికార సార్వభౌమ స్థానాన్ని పారిస్ నుండి బెర్లిన్‌కి మార్చాలని ఆతృతగా సంకల్పించుకున్న ప్రష్యా బయనెట్ ఝళిపించే సరికి బయటపడింది. నవజాత బూర్జువా సమాజం, ఫ్యూడలిజం నుంచి తన సొంత విముక్తి కోసం పెంపొందించ నారంభించిన రాజ్యాధికారం, పూర్తిగా పెరిగిన బూర్జువా సమాజంచేత పెట్టుబడికి శ్రమను బానిసను చెయ్యడానికి సాధనంగా మార్చబడింది. అటువంటి రాజ్యాధికారపు అత్యంత నీతి నియమరహితమైన తుది స్వరూపమే సామ్రాజ్యవాదం.

సామ్రాజ్యానికి ప్రత్యక్ష విరుద్ధమైనది కమ్యూన్. పారిస్ శ్రామికవర్గం "సోషల్ రిపబ్లిక్" అన్న నినాదంతో ఫిబ్రవరి విప్లవానికి నాందీ ప్రస్తావన చేసింది. అటువంటి రిపబ్లిక్ వర్గపరిపాలనయొక్క రాజరిక రూపాన్ని మాత్రమే కాకుండా, వర్గ పరిపాలనవే తొలగించాలన్న అస్పష్టమైన కోర్కెను ఆ నినాదం వ్యక్తీకరించింది. ఆ రిపబ్లిక్ యొక్క నిర్దిష్ట రూపమే కమ్యూన్.

పాత ప్రభుత్వాధికారపు కేంద్ర స్థానమూ, అదే సమయంలో, ఫ్రెంచి కార్మిక వర్గపు సాంఘిక దుర్గమూ కూడా అయిన పారిస్, సామ్రాజ్యం తమకు వారసత్వంగా వదిలేసిన ఆ పాత ప్రభుత్వాధికారాన్ని పునరుద్ధరించాలనీ, శాశ్వతంగా స్థిరపరచాలనీ త్యేరూ, "భూస్వాముల సభా" చేసిన ప్రయత్నానికి వ్యతిరేకంగా సాయుధ తిరుగుబాటు చేసింది. ముట్టడి కారణంగా, సైన్యాన్ని వదలించుకొని, దాని స్థానంలో అత్యధిక భాగం కార్మికులతో కూడిన నేషనల్ గార్డును పెట్టుకున్న కారణంగానే పారిస్ ప్రతిఘటించగలిగింది. ఈ వాస్తవాన్నిప్పుడు ఒక వ్యవస్థగా మార్చుకోవాల్సి వుంది. అందుకే, కమ్యూన్ మొదటి శాసనం, స్థాయీ సైన్యాన్ని రద్దుచేసి, దాని స్థానంలో సాయుధ ప్రజలను పెట్టడం.

పారిస్ నగరపు వివిధ వార్డుల్లో సార్వజనిక ఓటింగు పద్ధతిలో ఎన్నుకోబడిన మునిసిపల్ కౌన్సిలర్లతో కమ్యూన్ ఏర్పాటు చెయ్యబడింది. ఆ కౌన్సిలర్లు తక్కువ కాలం పాటు బాధ్యులుగా ఉంటారు, పదవి నుండి ఎప్పుడైనా దింపబడతారు. సహజంగానే, కమ్యూన్ సభ్యుల్లో అధిక సంఖ్యాకులు శ్రమజీవులు, లేక కార్మికవర్గపు ఆమోదిత ప్రతినిధులు. కమ్యూన్, పార్లమెంటరీ సంస్థగా కాకుండా, కార్యాచరణ

సంస్థగా, ఏక కాలంలో కార్యనిర్వాహక, శాసన నిర్మాణ సభగా ఉండాలి. పోలీసు శాఖను కేంద్ర ప్రభుత్వపు పరికరంగా కొనసాగకుండా చేసి, దానికి గల రాజకీయ విధి నిర్వహణాధికారాలను వెన్వెంటనే లాగివేశారు. దాన్ని కమ్యూన్‌కే బాధ్యత వహించే పరికరంగా, ఎప్పుడైనా దింపబడగలదిగా మార్చారు. ఇతర పరిపాలనా శాఖలన్నింటికీ చెందిన ఉద్యోగులందరి విషయంలో కూడా యిదే ఏర్పాటు జరిగింది. కమ్యూన్ సభ్యులు మొదలుకొని క్రింది దాకా, శ్రమజీవుల వేతనాలకు ప్రభుత్వోద్యోగం చెయ్యాలి. ప్రభుత్వ ఉన్నత అధికార్ల అధిక సౌకర్యాలూ, ప్రాతినిధ్యపు అలవెన్సులూ ఆ అధికార్లతోబాటు మాయమయ్యాయి. ప్రభుత్వ పదవులన్నవి, కేంద్ర ప్రభుత్వ గులాముల ప్రైవేటు ఆస్తిగా ఉండే పద్ధతికి స్వస్తి చెప్పబడింది. ఒక్క మునిసిపల్ పరిపాలనే కాకుండా, ఇప్పటివరకు రాజ్యం చేతుల్లో వున్న యావత్తు చొరవా కూడా కమ్యూన్ చేతులకు అప్పగించబడింది.

పాత ప్రభుత్వపు భౌతిక బలప్రయోగ పరికరాలైన స్థాయీ సైన్యాన్నీ, పోలీసు శాఖనూ తొలగించుకున్న తర్వాత, కమ్యూన్ వెంటనే ఆత్మిక పీడన పరికరమైన, "మతగురువుల అధికారాన్ని," బద్దలు చేయడానికి పూనుకుంది. అందుకుగాను చర్చిలకుగల ఆస్తి హక్కులన్నింటినీ రద్దుచేసి, వాటికిగల ప్రత్యేకాధికార ప్రతిపత్తిని తొలగించింది. మతబోధకులు తిరిగి పౌర జీవితంలోకి పంపబడ్డారు. అక్కడ వారు, పూర్వపు క్రీస్తు శిష్యుల మాదిరిగా మత విశ్వాసపరుల దయాధర్మభిక్షలపై బ్రతుకులు వెళ్లమార్చాల్సివచ్చింది. మొత్తం విద్యా సంస్థలన్నింటిలోనూ ప్రజలకు ఉచిత ప్రవేశం కల్పించబడింది. విద్యా సంస్థల్లో చర్చియొక్క, ప్రభుత్వంయొక్క జోక్యానికి పూర్తిగా స్వస్తి చెప్పబడింది. ఆవిధంగా, విద్య అందరి అందుబాటులోకి తేబడటమే కాకుండా, వర్గ వైమనస్యమూ, ప్రభుత్వ బలప్రయోగమూ విధించిన శృంఖలాల నుండి విజ్ఞాన శాస్త్రమే విముక్తం చెయ్యబడింది.

న్యాయశాఖ ఉద్యోగులు, వారికిగల కుహనా స్వాతంత్ర్యాన్ని కోల్పోయారు. ఇంతకు పూర్వపు ప్రభుత్వాలన్నింటికీ వాళ్ల నికృష్ట దాస్యానికి ముసుగుగా మాత్రమే ఆ స్వాతంత్ర్యం వుంటూ వచ్చింది. వాటి పట్లనే వాళ్ళ బాధ్యతా ప్రమాణాలూ తీసుకున్నారు, వాటిని భంగపరచనూ భంగపరచారు. మిగిలిన ప్రజా సేవకుల్లాగే మాజిస్ట్రేట్లూ, జడ్జీలూ కూడా ఎన్నుకోబడాలి, ప్రజలకు బాధ్యులుగా ఉండాలి, వారిని క్రిందికి దించే అధికారముండాలి.

ఫ్రాన్సులోని పెద్ద పారిశ్రామిక కేంద్రాలన్నింటికీ పారిస్ కమ్యూన్ ఒక నమూనాగా ఉండాలని వేరే చెప్పనక్కర్లేదు. కమ్యూనల్ వ్యవస్థ పారిస్‌లోనూ, మాధ్యమిక కేంద్రాలలోనూ నెలకొల్పబడినట్లైతే పాత కేంద్రీకృత ప్రభుత్వం రాష్ట్రాల్లో సైతం

తొలగిపోయి, ఉత్పత్తిదారుల స్వయంపాలనకు చోటు చెయ్యాల్సి వచ్చేది. కమ్యూన్ తయారు చేసిన జాతీయ నిర్మాణానికి సంబంధించిన ఒక ముసాయిదా మేరకు (దాన్ని అభివృద్ధి చేసేందుకు కమ్యూనుకు వ్యవధి లేకపోయింది), గ్రామీణ ప్రాంతంలోని అతి చిన్న కుగ్రామంలో సైతం కమ్యూన్ మాదిరి రాజకీయ ప్రతిరూపం ఏర్పడాలి, గ్రామీణ జిల్లాల్లో వున్న స్థాయీ సైన్యపు స్థానంలో, అతికొద్ది కాలమే పనిలో వుండే జాతీయ మిలీషియా* ఏర్పడాలి. అన్ని జిల్లాల గ్రామీణ కమ్యూన్లూ తమ ఉమ్మడి వ్యవహారాలను, కేంద్ర పట్టణంలో ప్రతినిధుల అసెంబ్లీల ద్వారా నిర్వహించుకోవాలి. ఈ జిల్లా అసెంబ్లీలు తిరిగి, పారిస్‌లోని జాతీయ ప్రతినిధివర్గానికి ప్రతినిధులను పంపాలి. ఏ ప్రతినిధి అయినా ఎప్పుడైనా వెనక్కి ఉపసంహరించబడగలగాలి. ప్రతినిధులు తమ నియోజకవర్గ ప్రజల mandat impératif (లాంఛనప్రాయమైన ఆదేశాల)కు కట్టుబడివుండాలి. అప్పటికీ ముఖ్యమైన కొన్ని విధులు కేంద్ర ప్రభుత్వానికి మిగిలి వుంటాయి. బుద్ధిపూర్వకంగా దుష్ప్రచారం జరుగుతున్నట్లు, వాటిని రద్దు చేయకూడదు. కమ్యూన్‌కి సంబంధించిన, కాగా, విధిగా బాధ్యతాయుతమైన అధికారులచేతనే అవి నిర్వహింపబడాలి. జాతి ఐక్యత విచ్ఛిన్నం కారాదు. తద్భిన్నంగా అది, కమ్యూనల్ వ్యవస్థ ద్వారా సంఘటితం కావాలి. ఏ రాజ్యాధికారమైతే అటువంటి ఐక్యతకు తనే ప్రతిరూపమన్నట్లుగా, జాతి నుండి స్వతంత్రమైనదిగా, దానికన్న ఉన్నతమైనదిగా వ్యవహరిస్తూ వచ్చిందో, నిజానికేదైతే జాతికి పరభాగ్యోపజీవియైన అవాంఛితమైన కంతి వంటిదో, అటువంటి రాజ్యాధికారాన్ని రూపుమాపడం ద్వారానే జాతి ఐక్యత వాస్తవ రూపం దాల్చాలి. పాత ప్రభుత్వాధికారంయొక్క కేవల పీడక అంగాలను తొలగించడంతోబాటు, దాని న్యాయమైన విధులు, సమాజంపైననే అతీత ప్రాముఖ్యాన్ని హస్తగతం చేసుకున్న అధికార యంత్రాంగంనుండి గుంజాకోబడిన విధులు, సమాజానికి బాధ్యత వహించే అధికారులకు బదలాయించబడాలి. మూడేళ్లకో, ఆరేళ్లకో ఒక మారు పాలకవర్గానికి చెందిన ఏ సభ్యుడు పార్లమెంటులో ప్రజలకు దుష్ప్రాతినిధ్యం వహించాలో నిర్ణయించడానికి బదులు సార్వజనిక ఓటింగు హక్కు కమ్యూన్లలో సంఘటిత పరచబడిన ప్రజలకు వినియోగపడాలి; తన వ్యాపారంలోకి పనివాళ్లనూ, మేనేజర్లనూ ఎంపిక చేసుకోవడానికి, వ్యక్తిగత ఓటింగు హక్కు ప్రతి ఒక్క వ్యాపారస్తునికీ ఎలా వినియోగపడుతోందో అలాగే అది ఉపయోగపడాలి. వ్యాపార విషయాల్లో, వ్యక్తులకులాగే కంపెనీలకు, సరైన స్థానంలో సరైన వ్యక్తిని ఎలా పెట్టాలో మామూలుగా తెలిసివుంటుంది. ఒక సారెప్పుడైనా యీ విషయంలో పొరపాటు చేస్తే, దాన్ని దిద్దుకోవడం కూడా వాటికి తెలిసివుంటుందన్న సంగతి

---

* పౌరసైన్యం. — సం.

మనందరికీ బాగా తెలిసినదే. మరో విషయమేమిటంటే, సార్వజనిక ఓటింగు పద్ధతిని రద్దు చేసి, దాని స్థానంలో క్రమానుగత అధికార ప్రదాన పద్ధతిని hierarchic investiture ప్రవేశపెట్టడం[66]కన్న కమ్యూన్ ఆదర్శాలకు భిన్నమైనది మరొకటుండబోదు.

పూర్తిగా కొత్త చారిత్రక రూపాలు పాత, రూపుమాసిపోయిన సాంఘిక జీవిత రూపాలతో సాధారణంగా పొరపాటుగా సరిపోల్చబడుతూ వుంటాయి. ఇది కొత్త రూపాల దురదృష్టమని చెప్పాల్సి వుంటుంది. అదే విధంగా, ఆధునిక రాజ్యాధికారాన్ని ధ్వంసంచేసిన ఈ కొత్త కమ్యూన్ కూడా, మధ్యయుగాల నాటి కమ్యూన్ల పునస్సృష్టిగా తప్పుగా వ్యాఖ్యానించబడింది. ఆనాటి కమ్యూన్లు ఆ రాజ్యాధికారానికన్న ముందొచ్చి, తర్వాత, దానికే మూలాధారమయ్యాయి. — కమ్యూనల్ వ్యవస్థ, మాంటెస్క్యూ, జిరోండిస్టులూ[67] కలలు కన్నట్లుగా, సమాఖ్యగా విడి పోయేందుకు చిన్న రాజ్యాల సమాఖ్యగా వికేంద్రీకరణ ప్రయత్నమన్నట్లు పొరపాటుగా వ్యాఖ్యానించబడింది. ఆ నాడు పెద్ద జాతుల ఐక్యత అన్నది రాజకీయ బలప్రయోగం ద్వారా సాధించబడితే, యీ నాడది సాంఘిక ఉత్పత్తియొక్క శక్తివంతమైన అంశమైందన్న సంగతి గమనార్హం. — రాజ్యాధికారానికి వ్యతిరేకంగా కమ్యూన్ శత్రు వైరుధ్యం, అతి కేంద్రీకరణకు వ్యతిరేకంగా పూర్వం జరిగిన పోరాటానికి విస్తృత రూపంగా పొరపాటుగా వ్యాఖ్యానించబడింది. ఫ్రాన్సులో లాగ, బూర్జువా తరహా ప్రభుత్వంయొక్క సాంప్రదాయిక అభివృద్ధిని, నిర్దిష్టమైన చారిత్రక పరిస్థితులు నివారించి యుండవచ్చు. ఇంగ్లండులో మాదిరిగా, అవే, అవినీతికి ఆలవాలమైన చర్చిల ద్వారా, లాభార్జనపరులైన కౌన్సిలర్ల ద్వారా, పట్టణాల్లో పేదరిక చట్టపు మహోగ్ర సంరక్షకుల ద్వారా, గ్రామీణ ప్రాంతాల్లో వాస్తవంగా వంశపారంపర్యపు హక్కు కలిగిన మేజిస్ట్రేట్ల ద్వారా ఘనమైన యీ కేంద్ర రాజ్యాంగశాఖలకు సంపూర్ణత్వం సిద్ధిస్తూ ఉండవచ్చు. ఇంత కాలమూ పరభాగ్యోపజీవిలాగ సమాజంమీద పడి బ్రతుకుతూ, దాని స్వేచ్ఛాయుత కదలికకు గుదిబండగా తయారైన రాజ్యం స్వాయత్తం చేసుకున్న శక్తులన్నింటినీ కమ్యూనల్ వ్యవస్థ, సమాజానికి తిరిగి సమకూర్చి వుండేది. ఈ ఒక్క చర్యతోనే అది ఫ్రాన్సు పునరుజ్జీవనానికి నాంది పలికి వుండేది. — రాష్ట్రాల్లోని ఫ్రెంచి బూర్జువావర్గం, లూయీ ఫిలిప్ పాలనలో గ్రామసీమపై తనకు లంభించిన పాలన, లూయీ నెపోలియన్ క్రింద, పట్టణాలపై గ్రామీణ ప్రాంత పాలన పేర తిరగతోడబడిన తన పాలన, కమ్యూన్‌లో తిరిగి తనకు లభిస్తుందని ఆశించింది. నిజానికి, కమ్యూనల్ వ్యవస్థ గ్రామీణ ఉత్పత్తిదారులను, వారి జిల్లాల కేంద్ర పట్టణాలయొక్క మేధోపరమైన నాయకత్వంలోకి తెచ్చి, వారి ప్రయోజనాలకు కార్మిక ప్రజలను సహజమైన ధర్మ కర్తలుగా చేసింది. —

కమ్యూన్ అస్తిత్వమే, మామూలు క్రమంలో, స్థానిక మునిసిపల్ స్వపరిపాలనకు హామీ కల్పించింది. అయితే, ఇప్పుడది రద్దుచెయ్యబడిన రాజ్యాధికారానికి ప్రతిగా ఉండదు. యుద్ధాలకు సంబంధించిన ఎత్తుగడలలో, కుట్రలలో నిమగ్నుడుకాని సమయాల్లో, తన పాత వృత్తి అయిన పత్రికారచనలో "Kladderatsch" [బెర్లిన్ "Punch"][68]కి వ్యాసాలు రాస్తూ) గడిపే బిస్మార్కుకే యిటువంటివి తట్టడం సాధ్యం. 1791 నాటి పాత ఫ్రెంచి మ్యునిసిపల్ అష్టావక్ర నిర్మాణంతోను, ప్రష్యన్ రాజ్యంలో పోలీసు యంత్రాంగంలో పట్టణ ప్రభుత్వాలను ద్వితీయ ప్రాధాన్యం కలిగిన మరలుగా దిగజార్చిన ప్రష్యన్ మునిసిపల్ రాజ్యాంగంతోను పారిస్ కమ్యూన్ ఆశయాలను సరిపోల్చడం బిస్మార్కువంటి మేధావికే చెల్లు.

విపరీతమైన ఖర్చుకి కారణాలైనవి — స్థాయీ సైన్యం, రాజ్య నిర్వహణోన్నతోద్యోగులకిచ్చే విపరీతమైన జీతాలు — ఈ రెండింటినీ రద్దుచెయ్యడం ద్వారా కమ్యూన్ మితవ్యయంతో కూడిన ప్రభుత్వం అన్న బూర్జువా విప్లవాల ఆకర్షణీయ నినాదాన్ని, వాస్తవం చేసింది. కనీసం యూరప్‌లోనైనా, సహజంగా పెద్ద భారంగా, వర్గపాలనకొక ముసుగుగా ఉంటూ వచ్చిన రాజరికపు అస్తిత్వం రద్దుకావడమే కమ్యూన్ అస్తిత్వంలోకి రావడమంటే. నిజమైన ప్రజాస్వామిక సంస్థల ప్రాతిపదికను కమ్యూన్ రిపబ్లిక్‌కు సమకూర్చింది. కానైతే మితవ్యయంతో కూడిన ప్రభుత్వం గాని, "నిజమైన రిపబ్లిక్" గాని కమ్యూన్ అంతిమాశయం కాదు. అవి, కేవలం దానిని అనుసరించి యుండేవి మాత్రమే.

కమ్యూన్, సవాలక్ష భాష్యాలకు గురి అయ్యింది. ఈ భాష్యాలలో తమకు అనుకూలమైన ప్రయోజనాలెన్నో వ్యక్తం చెయ్యబడ్డాయి. దీనినిబట్టి, పూర్వపు ప్రభుత్వ రూపాలన్నీ నిస్సంశయంగా పీడక ప్రభుత్వాలు కాగా, కమ్యూన్ వెసులుబాటుతో కూడిన బహుళ విస్తరిత రాజకీయ రూపమని స్పష్టమవుతోంది. దాని అసలు రహస్యం యేమిటంటే, అది ప్రధానంగా కార్మికవర్గ ప్రభుత్వం. దోపిడి వర్గానికి వ్యతిరేకంగా ఉత్పాదక వర్గం జరిపిన పోరాట ఫలితంగా ఉద్భవించిన ప్రభుత్వమది, శ్రమయొక్క ఆర్థిక విముక్తిని సాధించడానికి వీలుగా చిట్టచివరకు కనుగొనబడిన రాజకీయ రూపమది.

ఈ చివరి షరతుపైన తప్ప, కమ్యూనల్ వ్యవస్థ అసంభవమూ, భ్రాంతి మాత్రమూ అయ్యుండేది. ఉత్పత్తిదారుల రాజకీయ పాలన వాళ్ల సాంఘిక బానిసత్వపు కొనసాగింపుతో కలసి మనజాలదు. అందుకని, వర్గాల అస్తిత్వమూ, తత్ఫలితంగా వర్గ పాలనా, ఏ ఆర్థిక పునాదులపైనైతే ఆధారపడతాయో, వాటిని నిర్మూలించడానికి కమ్యూన్ ఒక సాధనంగా వినియోగపడాలి. శ్రమ విముక్తమైనప్పుడు ప్రతి మనిషీ శ్రమజీవి

అవుతాడు, ఉత్పాదక శ్రమ అన్నది ఏదో ఒక వర్గానికి చెందిన గుణవిశేషంగా ఉండటం నిలిచిపోతుంది.

ఇదొక విచిత్రమైన వాస్తవం. శ్రమ విమోచనని గురించి గత అరవై సంవత్సరాలుగా పెద్ద పెద్ద మాటలు వినిపించాయి, గంపెడంత సాహిత్యం వెలువడింది. కాని ఎక్కడైనా శ్రామిక జనం, యీ అంశాన్ని కృత నిశ్చయంతో తన చేతుల్లోకి తీసుకుంటే, అప్పుడిక, పెట్టుబడీ, వేతనాల బానిసత్వమూ (భూస్వామి యిప్పుడిక పెట్టుబడిదారుకు గైరుహాజరు భాగస్వామి) అన్న రెండు ధ్రువాలు కలిగిన ప్రస్తుత సమాజపు బాకాలు వెన్వెంటనే దాన్ని వెనకేసుకొచ్చే పదజాలాన్ని ముందుకు తెస్తారు. ఆ పదజాలం చూస్తే, పెట్టుబడిదారీ సమాజమింకా కన్యాత్వపు పరిశుద్ధ అమాయకత్వంలోనే ఉందన్నట్లూ, దాని శత్రువైరుధ్యాలింకా ముదరనట్లూ, దాని పట్ల భ్రాంతి భ్రమలింకా బ్రద్దలు కానట్లూ, దానికి సంబంధించిన నీతిబాహ్య వాస్తవాలింకా బట్టబయలు కానట్లే వుంటాయి. సర్వ నాగరికతకూ ప్రాతిపదిక అయిన ఆస్తిని కమ్యూన్ రద్దుచెయ్య నెంచుకట్టింది అని వాళ్ళు విస్మయాన్ని ప్రకటిస్తున్నారు! పెద్ద మనుషులారా, ఔను నిజమే, పలువురి శ్రమను కొద్దిమంది సంపదగా చేసే ఆ వర్గ ఆస్తిని రద్దు చెయ్యాలనే కమ్యూన్ సంకల్పించింది. ఆస్తిహర్తల ఆస్తిహరణం చేయడమే దాని లక్ష్యం. ఈ నాడు ప్రధానంగా శ్రమను బానిసగా చేసుకొనడానికీ, దోచుకోవడానికీ సాధనాలుగా వున్న భూమి, పెట్టుబడి వంటి ఉత్పత్తి సాధనాలను, స్వేచ్ఛాయుత, సంయుక్త శ్రమకు కేవలం పరికరాలుగా పరివర్తన చెయ్యడం ద్వారా, వ్యక్తిగత ఆస్తిని, అది నిజం చెయ్యాలనుకుంటోంది. — అయితే, యిదే కమ్యూనిజం, "అసాధ్యమైన" కమ్యూనిజం! కాని, ప్రస్తుత వ్యవస్థను కొనసాగించడంలోని అసాధ్యతను గ్రహించగలిగినంతటి తెలివితేటలు కలిగిన పాలకవర్గాల సభ్యులు — అలాంటి వాళ్ళు చాలమందే వున్నారు — ఎవరూ అడక్కుండా పెట్టకుండానే ముందుకొచ్చి, సహకార ఉత్పత్తిని గురించి గొంతెత్తి ప్రవచనాలు చేస్తున్నారు. సహకారోత్పత్తి అన్నది బూటకంగానూ, ఉచ్చుగానే ఉండిపోకుండా ఉండి, పెట్టుబడిదారీ వ్యవస్థను అది వెళ్ళేస్తే, సమైక్య సహకార సంఘాలు ఉమ్మడి పథకం మేరకు జాతీయోత్పత్తిని క్రమబద్ధం చేసి, తద్వారా దాన్ని తమ అదుపులోకి తీసుకొంటే, పెట్టుబడిదారీ ఉత్పత్తికి పీడ వంటి నిరంతర అరాజకానికీ, దఫదఫాలుగా దాపురించే సంక్షోభాలకీ స్వస్తిచెప్పడమే జరిగితే — అయ్యా పెద్దమనుషులారా, అప్పుడది కమ్యూనిజం కాక, "సాధ్యమైన" కమ్యూనిజం కాక మరేమవుతుంది?

కార్మికవర్గం కమ్యూన్ నుండి అద్భుతాలు ఆశించలేదు. Par décret du peuple* ప్రవేశపెట్టేందుకు వాళ్లకి ఊహాస్వర్గ పథకాలు సంసిద్ధంగా లేవు. తమ సొంత విమోచనను సాధించుకొనేందుకు, దానితో బాటు, ఏ ఉన్నత సామాజిక రూపం దిశగా నైతే ప్రస్తుత సమాజం, తన సొంత ఆర్థిక అభివృద్ధి ద్వారా ఎదురులేని రీతిలో ముందు కెడుతోందో, అటువంటి సామాజిక రూపాన్ని సాధించుకొనేందుకూ, తాము సుదీర్ఘ పోరాటాలను, పలు చారిత్రక క్రమాలనూ గడిచి, పరిస్థితులనూ, మనుషులనూ మార్చాల్సి ఉంటుందని వాళ్లకి తెలుసు. కూలిపోతున్న పాత బూర్జువా సమాజ గర్భంలోనే ఉన్న నవ సమాజ శక్తులను విముక్తం చేయడం వినా వాళ్లు సాధించాల్సిన ఆదర్శాలు వేరే లేవు. తన చారిత్రక కర్తవ్యానికి సంబంధించిన పూర్తి చైతన్యంతో, దానికి తగినట్లుగా వ్యవహరించాలన్న వీరోచితమైన దృఢ సంకల్పంతో, కులీనుల గుణగానం చేస్తూండే మర్యాదస్తులైన వ్రాయసగాళ్ల మొరటు నిందా దూషణ తిరస్కారాల పట్ల, అదే పనిగా తమ అజ్ఞాన జనితమైన విస్పార భావాలను, ఒంటెత్తు ధోరణి పిచ్చి భావాలను, శాస్త్రీయంగా వాటికి తిరుగేలేదన్న ధోరణిలో, దైవవాణిలా జోస్యం చెప్పే తీరులో, మంచిని కోరే హితవరుల్లా ఉపదేశాలు చేసే బూర్జువా పిడివాద స్తోత్రకారుల పట్లా తిరస్కార భావంతో కార్మికవర్గం నవ్వుకోగలదు.

పారిస్ కమ్యూన్ విప్లవ నిర్వహణను తన చేతుల్లోకి తీసుకున్నప్పుడు, సాధారణ కార్మిక జనం మొట్టమొదటి సారిగా తమకన్న "సహజంగా అధికులైన వారి"యొక్క ప్రభుత్వాధికార నిర్వహణ ప్రత్యేక హక్కును అతిక్రమించ సాహసించినప్పుడు, సాటిలేని క్లిష్ట పరిస్థితుల్లో తమ పనిని నిరాడంబరంగా, మనస్సాక్షిగా, సమర్థంగా నిర్వహించినప్పుడు—అందునా, ఉన్నతమైన శాస్త్రీయ అంచనా ప్రకారం,** ఏ రాజధాని నగర స్కూలు బోర్డు కార్యదర్శి అయినా తెచ్చుకొనే కనీస జీతంలో అయిదో వంతు మొత్తం కన్న మించని జీతాలతో నిర్వహించినప్పుడు,—నగర పాలక కార్యాలయంపై రెపరెప మంటూ ఎగిరే శ్రామిక రిపబ్లిక్ చిహ్నమైన ఎర్ర జెండాను చూసి పాత ప్రపంచం కోపంతో ఘూర్ణిల్లింది.

అయితేనేం, కార్మికవర్గం, సామాజిక చొరవ చూపే సామర్థ్యం కలిగిన ఏకైక వర్గమని, ఒక్క సంపన్న పెట్టుబడిదారులు మినహాగా, పారిస్‌లోని అత్యధిక సంఖ్యాక మధ్యతరగతి వారిచేత—షాపుల యజమానులు, చేతిపనివాళ్లు, వ్యాపారస్తులచేత—బాహాటంగా అంగీకరింపబడిన తొలి విప్లవం యిదే. మధ్యతరగతుల మధ్యనే—రుణ

*ప్రజల శాసనం ద్వారా.—సం.

**ప్రొఫెసర్ హక్స్లే. [1871 నాటి జర్మన్ ముద్రణకు వ్యాఖ్య.]—సం.

దాతలూ, రుణగ్రహీతల అక్కౌంట్ల విషయంలో — నిత్యం నిరంతరాయంగా తలెత్తే తగవులను, బహునేర్పుగా బుద్ధి సూక్ష్మతతో పరిష్కరించి, కమ్యూన్ వారిని కాపాడింది.[69] మధ్యతరగతిలో అదే భాగం కార్మికుల జూన్ తిరుగుబాటును[8] అణచివెయ్యడంలో తోడ్పడిన వెంటనే, వారిని ఆనాటి రాజ్యాంగసభ రుణదాతల దయాదాక్షిణ్యాలకు వదిలేసింది.[70] అయితే వాళ్ళిప్పుడు కార్మికవర్గం చుట్టూ చేరుతున్నారంటే, వాళ్లను యిందుకు పురికొల్పిన కారణం యిదొక్కటే కాదు. తమ ముందు, ఒకే ఒక్క ప్రత్యామ్నాయం — కమ్యూనా, లేక సామ్రాజ్యమా (అది ఏ పేర తిరిగి ప్రత్యక్షమైనా) — అన్నది మాత్రమే వున్నట్లు వాళ్ళు గ్రహించారు. ప్రజా సంపదను ధూళిదుమ్మరం చెయ్యడం ద్వారా, పెద్ద ఎత్తున ఆర్థిక మోసాలను ప్రోత్సహించడం ద్వారా, కృతకంగా త్వరిత మొనర్చబడిన పెట్టుబడి కేంద్రీకరణకు ప్రాపులివ్వడం ద్వారా, పర్యవసానంగా మధ్యతరగతిలో పేర్కొన్న భాగాన్ని నిరాస్తిపరులను చేయడం ద్వారా, సామ్రాజ్యం వాళ్లను ఆర్థికంగా నాశనం చేసింది. రాజకీయంగా వాళ్లను అణచివేసింది. తన త్రాగుబోతు విందులతో వినోదాలతో అది వాళ్లను నైతికంగా విభ్రాంత మొనర్చింది. వాళ్ల బిడ్డల విద్యను frères ignorantins[71]కి అప్పగించడం ద్వారా వారి వోల్టేరియనిజాన్ని అది అవమానపరచింది. వాళ్లను వినాశకరమైన యుద్ధంలోకి తలక్రిందులుగా నెట్టడం ద్వారా, ఫ్రెంచివారుగా వాళ్ల జాతీయ భావాన్ని గాయపరచింది. అది చేసిన సర్వనాశనానికి సరైన ప్రతికారం ఒక్కటే మిగిలింది — అది సామ్రాజ్యాన్ని రూపుమాపడం. నిజానికి, పారిస్ నుండి ఉన్నత బోనపార్టిస్టు, పెట్టుబడిదారీ bohème* తరలిపోయిన తర్వాత, నిజమైన మధ్యతరగతి పార్టీ ఆఫ్ ఆర్డర్ "రిపబ్లికన్ యూనియన్"[72] పేర బయటకొచ్చి, కమ్యూన్ సభ్యులుగా చేరి, బుద్ధిపూర్వకంగా దాన్ని గురించి త్యేర్ చేసే వక్ర భాష్యానికి వ్యతిరేకంగా దాన్ని బలపరచ పూనుకుంది. మధ్యతరగతిలోని యీ విభాగం ప్రస్తుత క్లిష్ట పరీక్షను తట్టుకొని నిలబడుతుందో నిలబడదో కాలం నిరూపించాలి.

"తన విజయమే వారి ఏకైక ఆశ" అని కమ్యూన్ రైతులకు చెప్పడం పూర్తిగా సరైనది. వెర్సేల్స్‌లో పొదగబడి, పెన్నికి లైను చొప్పున రాసి బతికే యూరపియన్ ప్రఖ్యాత రచయితలు ప్రతిధ్వనించే అబద్ధాలన్నింటిలోనూ పరమ ఘోరమైన దేమిటంటే, "భూస్వాముల సభ" ఫ్రెంచి రైతులకు ప్రాతినిధ్యం వహించిందనడం. ఫ్రెంచి రైతుల దగ్గర్నుంచి 1815 తర్వాత, కోట్లాది ఫ్రాంకుల నష్టపరిహారాన్ని గోళ్లూడగొట్టి వసూలుచేసిన వాళ్ల పట్ల ఫ్రెంచి రైతులకు ఎంతటి గొప్ప ప్రేమ ఉంటుందో ఊహించుకోవాల్సిందే మరి![73] ఐదా భూస్వాముల అస్తిత్వమే, ఫ్రెంచి రైతు దృష్టిలో, తను

* ముఠా. — సం.

1789లో సాధించుకున్న విజయాలపై దుర్రాక్రమణ. 1848లో బూర్జువావర్గం ఫ్రెంచి రైతు భూములపై ఫ్రాంకులో 45 సెంట్ల చొప్పున అదనపు పన్ను భారాన్ని మోపింది. అయితే అప్పుడది విప్లవం పేర అలా చేసింది. ఇప్పుడది ప్రష్యన్లకు చెల్లించాల్సిన 500 కోట్ల ఫ్రాంకుల నష్టపరిహార భారాన్ని రైతుల భుజాలపైకి నెట్టేందుకుగాను, విప్లవానికి వ్యతిరేకంగా అంతర్యుద్ధాన్ని రెచ్చగొట్టింది. కమ్యూన్ యిందుకు భిన్నంగా, తన తొలి ప్రకటనల్లో ఒకదానిలో, యుద్ధానికి నిజమైన కారకులెవరో వాళ్లే దానికయ్యే ఖర్చు భరించాలని స్పష్టం చేసింది. కమ్యూన్, రైతాంగాన్ని రక్తపు పన్ను నుండి విముక్తం చేసి యుండేది, వాళ్ల కది మిత వ్యయంతో కూడిన ప్రభుత్వాన్నిచ్చి యుండేది, నోటరీ,* ప్లీడరు, ఎగ్జిక్యూటర్‌లను,** రైతుల రక్తం జలగల్లా పీల్చే తదితర కోర్టు అధికారులను, తమచేత ఎన్నుకోబడి, తమకే బాధ్యులుగా వ్యవహరించే కమ్యూన్ ఉద్యోగులుగా మార్చి యుండేది. గ్రామీణ పోలీసుల, జెండార్మీ, ప్రిఫెక్ట్‌ల*** నిరంకుశత్వం నుండి వాళ్లనది విముక్తం చేసియుండేది. వాళ్లను మందబుద్ధులుగా తయారుచేసే మతబోధకుని స్థానంలో బుద్ధివికాసం తెచ్చే ఉపాధ్యాయుని ప్రవేశపెట్టేది. ఫ్రెంచి రైతు, అన్నింటికన్న ముఖ్యంగా లెక్కాచారానికి ప్రాముఖ్యమిచ్చే మనిషి. మతబోధకుని కిచ్చే డబ్బును పన్నులు వసూలు చేసే వాళ్ల నిర్బంధంగా వసూలు చెయ్యడం కాకుండా, ప్రజల మతవిశ్వాసం మేరకు వారు ఇచ్ఛికంగా యిచ్చే మొత్తాలతో అతను సరిపెట్టుకోవడం అత్యంత సముచితంగా ఉంటుంది అని ఫ్రెంచి రైతు భావిస్తాడు. కమ్యూన్ పాలన — ఆ పాలన ఒక్కటి మాత్రమే — ఫ్రెంచి రైతాంగానికి లభింపజేసిన తక్షణ సౌకర్యాలివి. అందుకని, కమ్యూన్ మాత్రమే రైతుల ప్రయోజనాలకు అనుగుణంగా పరిష్కరించ గలిగిన, విధిగా పరిష్కరించాల్సి వచ్చిన మరింత సంక్లిష్టమే గాని సజీవమైన సమస్యలను గురించి — తన కమతాన్ని భూతంలా పట్టుక్కూర్చునే తనఖా బాకీ గురించీ, రోజురోజుకూ పెరుగుతున్న prolétariat foncier (గ్రామీణ శ్రామికవర్గం) గురించీ, ఆధునిక వ్యవసాయమూ, పెట్టుబడిదారీ వ్యవసాయ పోటీ పెరుగుతున్న కారణంగానే, ఆ కమతం కాస్తా తన చేతుల్లోంచి మరింత త్వరగా ఊడిపోయే ప్రమాదం గురించీ — యిక్కడ వివరించడం పూర్తిగా అనావశ్యకమే అవుతుంది.

ఫ్రెంచి రైతు లూయీ బోనపార్ట్‌ను రిపబ్లిక్ అధ్యక్షుడుగా ఎన్నుకున్నాడు.

---

* కోర్టుల్లో దస్తావేజులపై ముద్రవేసి ధృవీకరించే అధికారి. — సం.

** అమీనా. — సం.

*** ఫ్రాన్సులోని రాష్ట్రాల (డిస్ట్రిక్టుల) అధికారులు. — సం.

కానీ, పార్టీ ఆఫ్ ఆర్డర్ సామ్రాజ్యాన్ని సృష్టించింది. ఫ్రెంచి రైతు, తను నిజంగా ఏమి కోరుకుంటాడో, అతను 1849, 1850లలో – ప్రభుత్వ ప్రిఫెక్టుకి తన మేయర్‌నీ, ప్రభుత్వ మతబోధకునికి తన ఉపాధ్యాయునీ పోటీగా నిలపడం ద్వారా, ప్రభుత్వ జెండార్మ్‌కి తానే పోటీగా నిలబడటం ద్వారా – చూపనారంభించాడు. 1850 జనవరి, ఫిబ్రవరి మాసాల్లో పార్టీ ఆఫ్ ఆర్డర్ జారీచేసిన చట్టాలన్నీ కూడా రైతుకి బద్ధ వ్యతిరేకమైన నిర్బంధ చర్యలే. మహా విప్లవమూ, తనకి దాని వలన లభించిన సకల ప్రయోజనాలూ అతని దృష్టిలో నెపోలియన్‌లో మూర్తీభవించి ఉన్నాయేమో, అందుకని ఫ్రెంచి రైతు బోనపార్టిస్టుగా ఉంటూ వచ్చాడు. ఈ భ్రాంతి రెండవ సామ్రాజ్యం క్రింద త్వరితంగా విచ్ఛిన్నమై పోయింది. "భూస్వాముల సభకు" స్వతః సిద్ధంగా ప్రతికూలమై గతానికి చెందిన యీ దురభిప్రాయం, రైతాంగపు సజీవ ప్రయోజనాలనూ, సత్వరావసరాలనూ సంతృప్తిపరచే కమ్యూన్ పట్ల గల ఆకర్షణను ఎలా తట్టుకో గలదు?

కమ్యూన్ పాలనలో వున్న పారిస్‌తో రాష్ట్రాలకు స్వేచ్ఛాయుతమైన సాంగత్యం ఏర్పడితే – నిజానికిదే వాళ్ల ప్రధానమైన భయం – మూడే మూడు మాసాల్లో రైతుల సాధారణ తిరుగుబాటు వస్తుందన్న సంగతి "భూస్వాముల సభ"కి బాగా తెలుసు. అందుకని, ఆ అంటుజాడ్య వ్యాప్తిని నిరోధించేందు కోసమే పారిస్ చుట్టూ పోలీసు వలయాన్ని నెలకొల్పాలని వాళ్ళు ఆతృత చూపారు.

ఈవిధంగా, కమ్యూన్ ఫ్రెంచి సమాజంలోని ఆరోగ్యకర అంశాలన్నింటికీ నిజమైన ప్రతినిధే కాకుండా, ఆ కారణంగానే అది నిజమైన జాతీయ ప్రభుత్వం కూడా అయింది. కార్మికుల ప్రభుత్వంగా, శ్రమ విమోచనాన్ని ధైర్యంగా బలపరచేదిగా ఉండటంతో బాటు అదే సమయంలో అది సుదృఢమైన అంతర్జాతీయ స్వభావం కూడా కలిగివుంది. రెండు ఫ్రెంచి రాష్ట్రాలను జర్మనీలో కలుపుకున్న ప్రష్యన్ సైన్యానికి కనుచూపు మేరలో, కమ్యూన్, ప్రపంచ శ్రామిక ప్రజలందరినీ ఫ్రాన్సుకు జతచేసుకుంది.

రెండవ సామ్రాజ్యం, దేశదేశాలకు చెందిన మోసకారులకు, పోకిరీలకు నెలవుగా వుంది. అక్కడ సాగే త్రాగుబోతు విందు విలాస వినోదాల్లోను, ఫ్రెంచి ప్రజల దోపిడి లోను పాల్గొనేందుకు నీతిమాలిన వాళ్ళు అన్ని దేశాల నుంచీ అక్కడకు ఎగబడుతూండే వారు. అంతెందుకు యీ నిముషాన సైతం త్యేర్‌కి కుడి భుజంవంటి వాడు నీచుడైన వలాషియన్ గనెస్కో, ఎడమ భుజంవంటి వాడు రష్యన్ గూఢచారి మర్కోవ్‌స్కీ. ఒక అమర లక్ష్య సాధనలో ప్రాణాలను బలిదానం చేసే మహత్తర గౌరవం కోసం విదేశీయులందరినీ కమ్యూన్ రానిచ్చింది. తమ ద్రోహ ఫలితంగా ఓటమికి దారితీసిన విదేశీ యుద్ధానికీ, విదేశీ ఆక్రమణదారుతో తమ కుట్ర ద్వారా రెచ్చగొట్టబడిన అంత

ర్యుద్ధానికీ మధ్యకాలంలో, ఫ్రాన్సులోని జర్మన్లపై పోలీసు దమనకాండను ఏర్పాటు చెయ్యడం ద్వారా తమ దేశభక్తిని ప్రదర్శించేందుకు బూర్జువావర్గానికి విరామం దొరికింది. కమ్యూన్ ఒక జర్మన్ కార్మికుణ్ణి* తన కార్మికమంత్రిని చేసుకుంది. త్యేరూ, బూర్జువావర్గమూ, రెండవ సామ్రాజ్యమూ పైకి సానుభూతిని ఒలకబోస్తూ పోలెండు నెప్పుడూ మోకొడుతూ, ఆచరణలో మాత్రం దాన్ని మోసగిస్తూ, రష్యాకు అనుకూలంగా నీచంగా వ్యవహరిస్తూండేవారు. కమ్యూన్ పోలెండు వీర పుత్రులను** పారిస్ రక్షకుల అగ్రస్థానంలో నిలిపి గౌరవించింది. తాను చైతన్యంతో ప్రారంభిస్తున్న నూతన చారిత్రక శకానికి స్పష్టమైన సూచనగా, ఒక వంక అక్రమణదారులైన ప్రష్యన్ల కళ్లముందు, మరో వంక బోనపార్టిస్టు జనరల్సుచేత నడపబడే బోనపార్టిస్టు సైన్యం కళ్లముందు, సైనిక విజయానికి చిహ్నమైన బ్రహ్మాండమైన వెండోమ్ స్తంభాన్ని కమ్యూన్ కూల్చివేసింది.[74]

కమ్యూన్ చేపట్టిన మహత్తర సాంఘిక చర్య అది అస్తిత్వంలో ఉండి పని చెయ్యడమే. అది తీసుకున్న ఆయా చర్యలు ప్రజల కోసం ప్రజలయొక్క ప్రభుత్వ ధోరణిని మాత్రమే సూచించాయి. బేకర్ల***చేత రాత్రిపూట పనిచేయించడం రద్దుచెయ్యడం; యజమానులు తమ దగ్గర పని చేసే కార్మికులపై రకరకాల సాకుతో జుల్మానాలు వేసి (యీ క్రమంలో యజమాని తనే శాసనకర్తగా, జడ్జిగా, తీర్పును అమలుజరిపే ఎగ్జిక్యూటరుగా వ్యవహరించడమే కాకుండా, పైగా ఆ జుల్మానా మొత్తాన్ని కాజేస్తాడు) వేతనాల్లోంచి వాటిని విరగ కొయ్యడంపై నిషేధం విధించడం — యివన్నీ అలాంటి చర్యలే. కమ్యూన్ చేపట్టిన చర్యల్లో యీ రకానికే చెందినది మరొకటుంది. అది, ఆయా పెట్టుబడిదారులు తప్పించుకు పారిపోయినందువల్ల, లేక, పని బందు చేసినందువల్ల మూతపడిన అన్ని కర్మాగారాలను, ఫాక్టరీలను నష్టపరిహారం చెల్లించే షరతుపై వశం చేసుకొని కార్మిక సంఘాలకు వశం చెయ్యడం.

విచక్షణకూ, పొదుపుకీ పేరొందిన కమ్యూన్ చేపట్టిన ఆర్థిక చర్యలు చుట్టు ముట్టడింపబడిన పట్టణ పరిస్థితికి అనుగుణంగా మాత్రమే ఉండగలుగుతాయి. ఓస్‌మన్ పోషణలో, పెద్ద పెద్ద ఆర్థిక కంపెనీలూ, కంట్రాక్టర్లూ పారిస్ నగరాన్ని భారీ ఎత్తున దోచుకున్నారు. దీనితో పోలిస్తే, ఆర్లియన్స్ కుటుంబానికి వ్యతిరేకంగా లూయీ నెపోలియన్‌కి ఉన్నదానికంటె, యీ కంపెనీల, కంట్రాక్టర్ల అస్తులను

---

* లెయో ఫ్రాంకెల్. — సం.

** జె. దొంబ్రోవ్‌స్కీ, డబ్లియు. వ్రుబ్లేవ్‌స్కీ. — సం.

*** నాన్ రొట్టెలు తయారుచేసే కార్మికులు. — సం.

జప్తు చేసి వశం చేసుకోవడానికి కమ్యూన్‌కే ఎంతో ఎక్కువ హక్కుండేది. హోహెన్ జోలెర్న్, ఇంగ్లీషు ప్రభు కుటుంబీకులు — వీళ్ళిద్దరూ కూడా చర్చిలను దోచుకొని తమ ఎస్టేట్లను పెంచుకొన్న వాళ్ళే — చర్చిల నుండి కేవలం 8,000 ఫ్రాంకులను కమ్యూన్ స్వాధీనం చేసుకున్న మాత్రాన పరమ దిగ్భ్రాంతులై పోయారు.

వెర్సేల్స్ ప్రభుత్వం, ధైర్యాన్నీ బలాన్నీ కాస్త పుంజుకోగానే కమ్యూన్‌కి వ్యతిరేకంగా అత్యంత హింసాత్మక పద్ధతులను అవలంబించింది; ఫ్రాన్సు అంతటా స్వేచ్ఛాభిప్రాయ ప్రకటనను అణచివేసింది. చివరకు పెద్ద పట్టణాల నుంచి వచ్చిన ప్రతినిధుల సమావేశాలను సైతం నిషేధించింది. వెర్సేల్స్‌లోనూ, ఫ్రాన్సులోని యితర ప్రాంతాల్లోనూ రెండవ సామ్రాజ్యం నాటి గూఢచారి చర్యలను మించిన వాటిని అమలు పరిచింది. తన జెండార్మ్‌లచేత పారిస్‌లో అచ్చయిన పత్రికలన్నింటినీ తగలబెట్టించి, పారిస్ నుండి బయటకూ బయట నుండి పారిస్‌కూ వచ్చే ఉత్తరప్రత్యుత్తరాలన్నింటినీ సెన్సారు చేయించింది. జాతీయ అసెంబ్లీలో పారిస్‌కి అనుకూలంగా లోగొంతులో ఏ చిన్న మాట మాట్లాడాలన్న ప్రయత్నం జరిగినా, 1816 నాటి Chambre introuvable[60]ని కూడా మించిపోయిన పద్ధతిలో కేకలూ పెడబొబ్బలూ పెట్టి వినిపించకుండా చేసే ప్రయత్నం జరిగింది. బయట వెర్సేల్స్ ఆటవిక యుద్ధకాండ సాగుతోంది. పారిస్‌లో అవినీతి పనులకూ, కుట్రలకూ అది ప్రయత్నిస్తోంది. అటువంటి పరిస్థితుల్లో కమ్యూన్, ప్రగాఢ శాంతియుత దశలో మాదిరిగా, మర్యాదలన్నీ పాటించి, ఉదారంగా వ్యవహరించడం దానియందుంచిన విశ్వాసానికి అది సిగ్గుపడదగిన విధంగా ద్రోహం చెయ్యడమై యుండేది కాదా? కమ్యూన్ ప్రభుత్వం సైతం త్యేర్ ప్రభుత్వం బాపతుదే అయ్యుంటే, వెర్సేల్స్‌లో కమ్యూన్ పత్రికలను నిషేధించిన దానికన్న, పారిస్‌లోని పార్టీ ఆఫ్ ఆర్డర్‌కి చెందిన పత్రికలను నిషేధించడానికి యింతకన్న మంచి అదను మరొకటుండేది కాదు.

ఫ్రాన్సు ఎదుర్కొంటున్న సమస్యలకు ఒకేఒక్క ముక్తి మార్గముంది, అది తిరిగి చర్చి వంకకు మళ్ళడమే అని "భూస్వాముల సభ" ప్రకటించిందో లేదో, వెన్వెంటనే ఆస్తిక భావాలు లేని కమ్యూన్, పిక్‌పుస్ సన్యాసినుల మఠానికీ, సెయింట్ లారెంట్ చర్చికీ సంబంధించిన నిగూఢ రహస్యాలను బయటపెట్టింది.[75] యుద్ధాల్లో ఓడిపోవడంలో, లొంగుబాటు పత్రాలపై సంతకాలు పెట్టడంలో, విల్‌హెల్మ్‌హోయెలో సిగరెట్లు చుట్టుకుంటూ కూర్చోవడంలో నైపుణ్యానికి గాను బోనపార్టిస్టు జనరల్సుకి త్యేర్ గ్రాండ్ క్రాస్ పతకాలు బహూకరిస్తూండగా, కమ్యూన్, తద్భిన్నంగా, తమ విధులను నిర్లక్ష్యం చేశారని అనుమానించదగిన తన జనరల్సును బర్తరఫ్ చేసి అరెస్టు చెయ్యడం, త్యేర్‌ని ఎకసక్కెం చేసినట్లే కదా. దొంగ పేరు పెట్టుకొని తనలో దూరిన తన

సభ్యుడి నొకడిని* కమ్యూన్ తన నుంచి బహిష్కరించి అతడిని అరెస్టు చేసింది (మామూలు దివాళాకోరు పనికి అతడిని లయోన్‌లో ఆరు రోజులపాటు ఖైదులో పెట్టింది). తద్భిన్నంగా, ఫోర్జరీ నేరస్థుడైన జూల్ ఫ్రావ్ యిప్పటికీ ఫ్రాన్సు విదేశంగ వ్యవహారాల మంత్రిగా కొనసాగుతున్నాడు, బిస్మార్కుకి ఫ్రాన్సు నింకా విక్రయిస్తూనే ఉన్నాడు, ఆదర్శప్రాయమైన బెల్జియం ప్రభుత్వానికింకా ఆర్డర్లు జారీ చేస్తూనే ఉన్నాడు. అటువంటి ఫ్రావ్‌ని కమ్యూన్ చర్య, కావాలని అవమానపరచడం కాక మరేమిటి? కానైతే, పాత ప్రభుత్వాలన్నీ చేసినట్టు కమ్యూన్ మాత్రం, తను లోపరహితమైన దాన్నన్నట్లు నటించలేదు. తన చేతలను, మాటలను అది ప్రకటించింది, తన లోటు పాట్లన్నింటినీ ప్రజాసామాన్యం ఎదుట పెట్టి, వారి విమర్శలను ఆహ్వానించింది.

ప్రతి విప్లవంలోనూ దాని అసలైన ప్రతినిధుల సరసన, అందుకు భిన్నమైన తరహా వ్యక్తులు లోపలికి చొరబడుతూ వుంటారు. వాళ్లలో కొందరు గత విప్లవాలకు చెంది యీనాటికీ మిగిలినవాళ్లు, పాత విప్లవాలకు భక్తులు. వాళ్లకి ప్రస్తుత ఉద్యమ పరిజ్ఞానం ఉండదు. కానైతే, పదిమందికీ తెలిసివున్న వారి నిజాయితీ, ధైర్య సాహసాల కారణంగా ప్రజల్లో వారికి గల పలుకుబడి యింకా నిలిచివుంటుంది. లేకుంటే, సాంప్రదాయికంగా వాళ్లకి ఉంటూ వచ్చిన పలుకుబడి యింకా కొనసాగుతూ వుంటుంది. మరో రకం వాళ్లుంటారు. వాళ్లు ఉట్టినే అరుస్తూ, పెడబొబ్బలు పెడుతూ ఉంటారు. ఏడాది తర్వాత ఏడాది, ఆనాడు పదవిలో వున్న ప్రభుత్వాన్ని పాతపడి అరిగిపోయిన తిట్లనే తిడుతూ వుంటారు. ఉన్నత తరహా విప్లవవాదులన్న కీర్తిని పొందుతారు వీళ్లు. మార్చి 18 తర్వాత కూడా అటువంటి వ్యక్తులు కొందరు ముందుకు వచ్చారు. కొన్ని సందర్భాల్లో వాళ్లు అత్యంత ప్రముఖ పాత్ర వహించగలిగారు. ఆ బాపతు వ్యక్తులు పూర్వపు ప్రతి విప్లవ పూర్ణ పురోగతిని ఏవిధంగా అయితే నిరోధించారో, సరిగా వీళ్లు కూడా అలాగే, తమ శక్తి కొలదీ, కార్మికవర్గంయొక్క నిజమైన కార్యాచరణకు అవరోధం కల్పించారు. ఇలాంటి వాళ్లు తప్పనిసరి కీడు. కాలక్రమేణా మాత్రమే వీళ్లని వదిలించుకోవడం సాధ్యం. కానైతే, కమ్యూన్‌కి అటువంటి కాలవ్యవధి లభ్యం కాలేదు.

కమ్యూన్ పారిస్‌లో సాధించిన మార్పు నిజంగా అద్భుతమైనది! రెండవ సామ్రాజ్యం నాటి కృత్రిమశోభతో విమోహితం చేసే పారిస్ చిన్నెలే బొత్తిగా మిగల్లేదు. బ్రిటిష్ భూస్వాములకు, ఐరిష్ ఆబ్సెంటీస్టులకు,[76] అమెరికన్ మాజీ బానిస యజమానులకు, నకిలీ వ్యక్తులకు, రష్యన్ మాజీ భూదాసుల యజమానులకు, వలాషియన్ ప్రభు

---

* బ్లాంషే. — సం.

కుటుంబీకులకు పారిస్ యిప్పుడిక ఎంత మాత్రమూ కూడలి స్థానంగా లేదు. శవ పరీక్షా కేంద్రాల వద్ద ఒక్క శవం కూడా కనపడటం లేదు, రాత్రి వేళల్లో కన్నపు దొంగతనాలు జరగడంలేదు, దాదాపుగా దోపిడీలు జరగడమే లేదు. నిజానికి, 1848 ఫిబ్రవరి రోజుల తర్వాత పారిస్ వీధులు మొదటి సారిగా యిప్పుడే, అందునా ఏ పోలీసు బందోబస్తూ లేకుండా, సురక్షితంగా ఉన్నాయి.

> కమ్యూన్ సభ్యుడొకడు యిలా అన్నాడు: "హత్యలు, దొంగతనాలు, వ్యక్తులపై దాడులు — వాటిని గురించి మాకిప్పుడు వినరావడమే లేదు; పోలీసులు బహుశా వెర్సేల్స్‌కి తమతోబాటే తమ కన్సర్వేటివ్ మిత్రులందర్నీ లాక్కుపోయారో ఏమో మరి."

**వేశ్యలు తమ సంరక్షకుల — కుటుంబం, మతం, అన్నిటికన్న ముఖ్యంగా ఆస్తి** వ్యవస్థల పరిరక్షకుల — జాడను మళ్ళీ పసిపట్టారు. వాళ్ల స్థానంలో తిరిగి సిసలైన పారిస్ స్త్రీలు — పురాతన కాలపు స్త్రీలలాగే వీరత్వం, ఉన్నత భావాలు, కర్తవ్య నిష్ఠ కలిగిన స్త్రీలు — తిరిగి ముందుకొచ్చారు. కష్టించి పనిచేసే, గాఢంగా ఆలోచించే, పోరాటం సలిపే, రక్తమోడ్చే పారిస్ — నూత్న సమాజాన్ని నిర్మిస్తున్న పారిస్, తన సింహద్వారాల ముందు పొంచి యున్న నరమాంస భక్షకుల సంగతి దాదాపుగా విస్మరించిన పారిస్ — తను చూపుతున్న చారిత్రక చొరవ పట్ల మహోత్సాహంతో సంతోష పారవశ్యంలో ఉంది!

పారిస్‌లోని ఈ నూత్న ప్రపంచం వెర్సేల్స్‌లోని పాత ప్రపంచానికి ముఖాముఖిగా నిలిచింది. చూడండి — మురమారి మూలపడిన పాలనలన్నింటి ప్రేతాలు. జాతి కళేబరంపైన పడి పీక్కుతినేందుకు ఆతురత చూపే లెజిటిమిస్టులు, ఆర్లియనిస్టులు, వీళ్ల కొక తోకలాగ రిపబ్లికన్లు, జాతీయ అసెంబ్లీలో తమ హాజరు ద్వారా బానిస యజమానుల తిరుగుబాటును మంజూరు చేస్తూ, తమ పార్లమెంటరీ రిపబ్లిక్ పోషణ కోసం, ఛాందస విదూషకుని తమ నాయకుడుగా చేసుకొని, అతగాని అతిశయదాక్షిణ్యంపై ఆధారపడుతూ, తమ ఘాతుక సమావేశాలను జె డి పామ్‌లో జరుపుకోవడం ద్వారా 1789ని వికృతంగా అనుకరిస్తున్నారు వీళ్ళు.* ఈ అసెంబ్లీ, ఫ్రాన్సులో గతించిన దానంతటికీ ప్రతినిధి. లూయీ బోనపార్ట్ జనరల్సు కత్తులతో లభించే మద్దతు

---

* జె డి పామ్ 1789 నాటి జాతీయ అసెంబ్లీ తన ప్రసిద్ధ నిర్ణయాలు చేసిన చోటైన టెన్నిస్ కోర్టు.[77] (1871 నాటి జర్మన్ ముద్రణకి ఎంగెల్సు వ్యాఖ్య.)

తప్ప దీనికి ఊపిరి పోసేది మరొకటేదీ లేదు. పారిస్ పూర్ణసత్యమైతే, వెర్సేల్స్ సర్వం మిథ్య. త్యేర్ నోట వెలువడినది ఆ మిథ్యే.

సిన్-ఎట్-ఉవాజ్‌కి చెందిన మేయర్ల ప్రతినిధివర్గానికి త్యేర్ చెప్పిందేమిటో చిత్తగించండి:

> "మీరు నా మాటమీద ఆధారపడవచ్చు, నేను నా మాట ఎన్నడూ తప్పలేదు!"

అసెంబ్లీకే ఆయన ఇలా చెప్పాడు: "అది ఫ్రాన్సులో ముందెన్నడూ లేని మిక్కిలి ఉదారమైన, పరమ స్వేచ్ఛాయుతంగా ఎన్నుకోబడిన అసెంబ్లీ;" తన అస్త్రవ్యస్తపు సైనికుల గుంపుకి ఇలా చెప్పాడు: "మన సైన్యం ప్రపంచ మంతటి ప్రశంసలూ పొందింది, ఫ్రాన్సు చరిత్రలోనే ఎన్నడూ లేనంతటి మిక్కిలి శ్రేష్ఠమైన సైన్యం ఇది;" పారిస్‌పై తను బొంబార్డు చేశానన్నమాట మిథ్య అని రాష్ట్రాలకు చెప్పాడు:

> "ఎక్కడైనా ఏమైనా ఫిరంగి కాల్పులు వినిపించాయంటే, అవి వెర్సేల్స్ సైన్యం కాల్చినవి కావు. తమ ముఖాలైనా చూప సాహసించని కొద్దిమంది తిరుగుబాటుదారులు తామింకా పోరాటం సాగిస్తూనే ఉన్నామని జనాన్ని నమ్మించే ప్రయత్నంలో కాల్చిన కాల్పులు తప్ప అవి వేరేమీ కాదు."

రాష్ట్రాలకు యింకా యిలా చెప్పాడు:

> "వెర్సేల్స్ ఫిరంగి దళం పారిస్‌పై ఫిరంగులే కాలుస్తుందిగాని దానిని బొంబార్డు చెయ్యదు."

వెర్సేల్స్ సేనలకు ఆపాదింపబడిన కాల్చివేతలు, పగసాధింపు చర్యలు (!) అన్నీ కేవలం మిథ్య అని అతను, పారిస్ ఆర్చిబిషప్‌కి చెప్పాడు. పారిస్‌కేమో, "తనని అణచివేసే నికృష్టమైన నిరంకుశుల నుండి దాన్ని విముక్తం చెయ్యడానికి" మాత్రమే తాను ఆరాటపడుతున్నాననీ, నిజానికి, కమ్యూన్‌కి చెందిన పారిస్ "పిడికెడుమంది నేరస్తులు తప్ప" వేరేమీ కాదనీ చెప్పాడు.

త్యేర్ పారిస్, "అలగా మూక"కి చెందిన నిజమైన పారిస్ కాదు. అది పారిస్ ప్రేతం మాత్రమే, francs-fileurs[78] పారిస్, పార్కులతో, విశాలమైన వీధులతో నిండిన పారిస్, మగ, ఆడ — ధనిక, పెట్టుబడిదారీ, పకిలీ, సోమరి పారిస్. ఇవాళది తైనాతీలతో, దగుల్బాజీలతో సాహిత్య భ్రష్టాచారులతో బిలబిలలాడుతోంది. ఇవాళు దాని వేశ్యలు వెర్సేల్స్, సెయింట్-డెనీ, రుయే, సెయింట్ జెర్మేన్‌లలో ఉన్నారు.

అంతర్యుద్ధాన్నొక కులాసా వ్యాపకంగా పరిగణిస్తున్నారు. జరుగుతున్న యుద్ధం కేసి దూరదర్శిని యంత్రాల్లో తిలకిస్తూ, ఫిరంగి మోతలను లెక్కిస్తూ, పోర్ట్ సెయింట్ మార్టిన్ నాటకశాలలోని ప్రదర్శన కన్న యిది చాలా మిన్నగా సాగుతున్న దంటూ తమ పరువు పైనా, తమ ఉంపుడుకత్తెల పరువు పైనా ఒట్లు వేస్తున్నారు. నేల కూలినవాళ్ళు నిజంగా చనిపోయారు, క్షతగాత్రుల మూల్గులు నటన కాదు, యివన్నీ కూడా అక్షరాలా చారిత్రక యదార్థాలు.

కోబ్లెంజ్ ప్రవాస కేంద్రం డి కలోన్[79] ఫ్రాన్సు అయినట్లుగానే థ్యేర్ పారిస్ యిదీ.

## IV

ప్రష్యన్లచేత ఆక్రమింప చెయ్యడం ద్వారా పారిస్‌ను అణచివెయ్యడానికి బానిస యజమానులు చేసిన మొదటి కుట్ర ప్రయత్నం బిస్మార్కు తిరస్కృతితో భగ్నమైంది. మార్చి 18 నాటి రెండో ప్రయత్నం, సైన్యం చిత్తుగా ఓడిపోవడంతోను, ప్రభుత్వం వెర్సేల్స్‌కి పలాయనం చిత్తగించడంతోను ముగిసింది. అలా పోతూ పోతూ ప్రభుత్వం యావత్తు పాలన యంత్రాంగాన్నీ ఎక్కడికక్కడ విడిపడి తన అడుగు జాడల్లో రావలసిందిగా ఆజ్ఞలు జారీచేసింది. పారిస్‌తో శాంతి సంప్రతింపుల మాటున, దానికి వ్యతిరేకంగా యుద్ధానికి సన్నద్ధం కావడానికి త్యేర్ వ్యవధి సంపాదించుకున్నాడు. కాని, సైన్యం ఎక్కడ దొరుకుతుంది? స్థాయీ సైన్యపు రెజిమెంట్ల అవశేషాలు సంఖ్యలో తక్కువగా, ఆధారపడ తగనివిగా ఉన్నాయి. వెర్సేల్స్‌కి నేషనల్ గార్డులతోను, వలంటీర్లతోను తోడ్పాటు నివ్వాల్సిందిగా రాష్ట్రాలకు అతను హుటాహుటిగా విజ్ఞప్తి చేశాడు, కాని దానిని రాష్ట్రాలు నిష్కర్షగా తిరస్కరించాయి. ఒక్క బ్రెటాన్ మాత్రమే కొద్దిమంది షువాన్లను[80] పంపింది. శ్వేత పతాకం క్రింద, వారిలో ప్రతి ఒక్కడూ తెల్లని గుడ్డతో తయారైన క్రీస్తు గుండె గుర్తును తన రొమ్ముపై ధరించి, "Vive le Roi!" ("రాజు వర్ధిల్లాలి!") అని నినాదాలిస్తూ పోరాడాడు. ఈవిధంగా, త్యేర్, ఆదరాబాదరా నావికులు, ఓడ సిపాయిలు, పోపుకి చెందిన జువావ్‌లు[80] వలంటీన్ జెండార్మ్లు, పియెట్రీ పోలీసులు, mouchard*లతో కూడిన ఓ కలగాపులగపు మూకను సమకూర్చుకోవలసిన పరిస్థితిలో పడ్డాడు. అంతర్యుద్ధం ఆరకుండా చూసేందుకూ, వెర్సేల్స్ ప్రభుత్వాన్ని ప్రష్యాపై పూర్తిగా ఆధారపడేలా చేసేందుకూ సరిగా తగినంత మందిని మాత్రమే బోనపార్ట్ సైన్యపు యుద్ధ ఖైదీలను దఫదఫా

---

* వేగులు. — సం.

లుగా బిస్మార్క్ పంపియుండకపోతే, ఈ సైన్యపు మూక బొత్తిగా కొరగాకుండా పోయివుండేది. ఈ యుద్ధంలో వెర్సేల్స్ పోలీసులు వెర్సేల్స్ సైన్యాన్ని కాపలా కాయాల్సి వచ్చింది. జెండార్మీలు, దానిని తమ వెంట తీసుకెళ్లడానికి అతి ప్రమాదకర స్థానాలన్నింటిలోనూ ఎదురొడ్డి నిలవాల్సి వచ్చింది. లొంగిన దుర్గాలైనా జయింపబడినవి కావు, కొన్నవి మాత్రమే. కమ్యూనార్డులు ప్రదర్శించిన వీరత్వం, తన వ్యూహరచనా నైపుణ్యం గాని, తనకు అందుబాటులో వున్న బయనెట్లు గాని పారిస్ ప్రతిఘటనను భగ్నం చెయ్య జాలవన్న సంగతిని త్యేర్‌కు స్పష్టపరచింది.

ఈలోగా, రాష్ట్రాలతో అతని సంబంధాలు అంతకంతకు క్లిష్టతరమయ్యాయి. త్యేర్‌నూ, అతని "భూస్వాముల సభనూ" సంతోషపరచగల ప్రోత్సాహక వాక్యం ఒక్కటి కూడా రాలేదు. అందుకు భిన్నంగా జరిగింది. రిపబ్లిక్‌ను నిర్ద్వంద్వంగా గుర్తించే ప్రాతిపదికపై పారిస్‌తో సఖ్యత కుదుర్చుకోవాలనీ, కమ్యూన్ హక్కులను ఆమోదించాలనీ, అధికారం అంతరించిన జాతీయ అసెంబ్లీని రద్దు చెయ్యాలనీ డిమాండు చేస్తూ రాయబారాలూ, విజ్ఞాపనలూ నాలుగు మూలల్నుంచీ ఎడతెగకుండా వచ్చాయి. వాటి ధోరణి అయినా గౌరవ పురస్సరంగా ఎంతమాత్రం లేదు. అవెంత అధిక సంఖ్యలో వచ్చాయంటే, త్యేర్ న్యాయశాఖా మంత్రి అయిన డుఫార్, పబ్లిక్ ప్రాసిక్యూటర్లను ఉద్దేశించి ఏప్రిల్ 23న ఒక సర్క్యులర్ పంపుతూ, "రాజీని కోరే నివాదాన్ని" నేరంగా పరిగణించాలని ఆజ్ఞాపించాడు! పారిస్‌కు వ్యతిరేకంగా తన దండయాత్ర సఫల మవుతుందన్న ఆశ కాస్తా సన్నగిలినమీదట, త్యేర్ తన ఎత్తుగడలను మార్చాలని నిర్ణయించుకున్నాడు. జాతీయ అసెంబ్లీపై తనచే రుద్దబడిన కొత్త మునిసిపల్ చట్టం ప్రాతిపదికపై, ఏప్రిల్ 30న, దేశమంతటా మునిసిపల్ ఎన్నికలు జరగాలని త్యేర్ ఆజ్ఞ జారీ చేశాడు. ఇటు తన ప్రిఫెక్టుల కుట్రలూ కుతంత్రాల ద్వారా, అటు పోలీసుల అదలింపుల ద్వారా రాష్ట్రాల తీర్పుతో, జాతీయ అసెంబ్లీకి ఎన్నడూ లేని నైతిక శక్తిని దానికి కల్పించ వచ్చుననీ, పారిస్‌పై గెలుపుకి అవసరమైన భౌతిక శక్తిని చివరకు రాష్ట్రాలనుండి పొందవచ్చుననీ అతడు గట్టిగా ఆశించాడు.

తన సొంత సమాచార పత్రాలలో ఆకాశానికెత్తబడిన పారిస్‌పై బందిపోటు యుద్ధం, ఫ్రాన్సు అంతటా భయోత్పాదక పాలనను నెలకొల్పడానికి అతని మంత్రులు చేసిన ప్రయత్నం, ఈ రెండింటితోబాటు, అది మంచీ కూడా సఖ్యత కోసం సంప్రతింపులన్న నాటకమాడటానికి త్యేర్ అద్భుత ప్రదర్శించాడు. దీని ద్వారా అతను అనేక ప్రయోజనాలు సాధించాలని ఆశించాడు. రాష్ట్రాలను బోల్తా కొట్టించడం, పారిస్ లోని మధ్యతరగతి బాపతుకి కళ్లు కప్పడం, వీటన్నింటికన్న ముఖ్యంగా, జాతీయ

అసెంబ్లీలో తాము రిపబ్లికన్లమని బాహాటంగా చెప్పుకొనే వాళ్ళ తైర్‌లో విశ్వాసం మాటున, పారిస్‌కి వ్యతిరేకంగా తమ ద్రోహాన్ని కప్పి పుచ్చుకునేందుకు అవకాశం కల్పించడం — ఈ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొనే తైర్ తన రాజీ ప్రయత్నాల నాటకాన్ని ఆడాడు. మార్చి 21న, అప్పటికింకా సైన్యం లేని స్థితిలో, జాతీయ అసెంబ్లీ నుద్దేశించి అతనిలా అన్నాడు:

"ఏదేలా జరిగినా కూడా, పారిస్‌కి నేను సైన్యం పంపను."

మార్చి 27న అతను మళ్లీ యిలా అన్నాడు:

"నేను పదవిని స్వీకరించినప్పుడు రిపబ్లిక్ గట్టి వాస్తవంగా వుంది, దాన్ని కొనసాగించడానికి నేను దృఢ నిశ్చయంతో ఉన్నాను."

నిజానికి, రిపబ్లిక్ పేర, లయోన్, మార్సెల్స్‌ల్లో విప్లవాన్ని అతను అణచివేశాడు;[81] వెర్సేల్స్‌లో "రిపబ్లిక్" పదం సైతం వినపడకుండా "భూస్వాముల సభ" ముంచెత్తి వేసింది. ఈ వీరకృత్యం తర్వాత, "గట్టి వాస్తవాన్ని" అతను పట్టి ఊహా మాత్రపు వాస్తవంగా దిగజార్చాడు. జాగ్రత్త కోసం, బోర్డో నుండి దూరంగా ఉండాల్సిందిగా ఆర్లియన్స్ రాజకుమారులను బయటికి పంపించాడు. అలాంటిది వాళ్లకిప్పుడు, చట్టానికి పూర్తి విరుద్ధంగా, డ్రోలో కుట్ర చెయ్యడానికి అవకాశం దొరికింది. పారిస్ నుండి, రాష్ట్రాల నుండి వచ్చిన ప్రతినిధులతో అతను అంతులేని భేటీలు జరిపాడు. ఆయా సమయ సందర్భాలను బట్టి, అతని ధోరణీ, సరళీ ఎప్పటికప్పుడు మారిపోతూ ఉండినా కూడా,

"లెకాంట్, క్లెమాన్ టొమాల హత్యతో సంబంధమున్న బహు కొద్ది మంది నేరస్తులకు,"

ప్రతీకారాన్ని పరిమితం చెయ్యాలన్న పరిధిని దాటలేదు. అయితే, దీనికి పూర్వరంగంలో అవగాహన ఒకటుంది. 1830లో తైర్ లూయీ ఫిలిప్ విషయంలో చేసినట్లుగావే, యిప్పుడు ఏర్పడటానికి అవకాశమున్న రిపబ్లిక్కుల్లో అతడిని అత్యుత్తమ రిపబ్లిక్‌గా పారిసూ, ఫ్రాన్సూ గుర్తించాలన్నదే అది. ఈ రాయితీలను సైతం, జాతీయ అసెంబ్లీలో సీటుపై తన మంత్రుల ద్వారా అధికారికంగా వ్యాఖ్యానాలు చేయించడం ద్వారా, అనుమానాస్పదంగా తయారు చెయ్యడానికి జాగ్రత్త తీసుకోవడమే కాకుండా, అతను డుఫోర్‌కి కూడా పని కల్పించాడు. పాత ఆర్లియనిస్టు లాయరైన ఈ డుఫోర్, యిప్పుడీ 1871లో తైర్ క్రింద ఎలాగైతే న్యాయాధిపతో, అలాగే 1839లో

లూయీ ఫిలిప్ క్రిందా, 1849లో లూయీ బోనపార్ట్ అధ్యక్షత క్రిందా కూడా ముట్టడి స్థితిలోనే న్యాయాధిపతిగా పనిచేశాడు. మంత్రి పదవిలో లేనప్పుడు యితగాడు పారిస్ పెట్టుబడిదారుల తరఫున న్యాయస్థానాల్లో వాదించడం ద్వారా చాలా సంపాదించాడు. తను సృష్టించిన చట్టాలకు వ్యతిరేకంగా తానే వాదించడం ద్వారా రాజకీయంగా కూడా అతనెంతో లబ్ధి పొందాడు. ఇప్పుడిక అతను జాతీయ అసెంబ్లీలో పలు నిర్బంధ శాసనాలను హడావిడిగా ఆమోదింప చేశాడు. పారిస్ పతనానంతరం, ఫ్రాన్సులో మిగిలివున్న రిపబ్లికన్ స్వేచ్ఛావశేషాలను[82] సమూలంగా నాశనం చెయ్యడమే ఆ చట్టాం పరమోద్దేశం. అతని దృష్టిలో, కోర్టు మార్షల్‌కి సంబంధించిన అతి మందకొడి క్రమాన్ని కుదించడం ద్వారాను,[83] దేశ బహిష్కారానికి సంబంధించి కొత్తగా రూపొందించబడిన నిర్దాక్షిణ్యమైన రాక్షస శాసనం ద్వారాను ముందుముందు పారిస్ గతి ఎలా ఉండబోతోందో అతను చవిచూపించాడు. 1848 నాటి విప్లవం రాజకీయ నేరాలకు మరణ శిక్షను రద్దుచేసి, దాని స్థానంలో దేశబహిష్కార శిక్షను ప్రవేశపెట్టింది. లూయీ బోనపార్ట్ సైతం, కనీసం బాహాటంగా అయినా, గిలటిన్ పద్ధతిని తిరిగి నెలకొల్పడానికి సాహసించలేదు. పారిస్ వాసులు తిరుగుబాటుదారులు కారు హంతకులు అని సూచన ప్రాయంగా అనడానికి సైతం యింకా సాహసాన్ని పుంజుకోని "భూస్వాముల సభ," పారిస్‌పై తను ముందుముందు తీసుకోబోయే ప్రతీకారానికీ, దుఫార్ కొత్త దేశ బహిష్కారశాసనానికీ పరిమితం కావలసి వచ్చింది. ఈ పరిస్థితులన్నింటి కారణంగా, తను ఉద్దేశించినట్లుగా, పాతనే నెమరేసుకునే "భూస్వాముల సభ," థ్యేర్‌యొక్క యీ నాటకాన్ని గాని, దానికి సంబంధించిన దగా, కాపట్యాలను గాని, పాచివేత ఎత్తుగడను గాని సరిగా అర్థం చేసుకోక, కోపంతో పెడబొబ్బలు పెట్టక పోయి వుంటే, థ్యేర్, సంప్రతింపుల నాటకాన్ని కొనసాగించలేకపోయి వుండును.

ఏప్రిల్ 30న జరగబోయే మునిసిపల్ ఎన్నికల దృష్ట్యా, ఏప్రిల్ 27న, థ్యేర్ గొప్ప సఖ్యతా సంప్రతింపుల నాటకమొకదాన్ని ఆడాడు. జాతీయ అసెంబ్లీ వేదికపై మంచి భావగర్భితమైన చతురవాక్యధార మధ్య అతనిలా ప్రకటించాడు:

> "పారిస్‌దే తప్పు, రిపబ్లిక్‌కి వ్యతిరేకంగా మరో కుట్ర ఏదీ లేదు. ఫ్రెంచి రక్తపాతాన్ని తప్పనిసరి చేస్తున్నదదే. నేనీ విషయాన్ని మళ్లీ మళ్లీ స్పష్టంచేస్తున్నాను. ఆయుధాలు పట్టుకున్న వారి చేతుల నుండి ఆ అపవిత్ర ఆయుధాలు విసర్జింపబడితే, అప్పుడిక, పిడికెడు మంది నేరస్థులను మాత్రం మినహాయించి, ఒక శాంతి సంధి ద్వారా దండన కార్యక్రమం వెన్వెంటనే నిలుపు చెయ్యబడుతుంది."

ఉద్రేకంతో అద్దుతగిలే "భూస్వాముల సభ"కు అతనిలా జవాబిచ్చాడు:

"అయ్యా పెద్దలారా, నేను చెప్పిందేమన్నా పొరపాటేమో, చెప్పమని మిమ్మల్ని అర్థిస్తున్నాను. వేరన్నులు పిడికెడు మందే ఉన్నారన్న వాస్తవాన్ని నేను పేర్కొన్నాను. అది మీకు నిజంగానే విచారకరంగా ఉందా? క్లెమాన్ టొమా, లెకాంట్ అనే జనరల్‌ల రక్తాన్ని చిందించగలిగినవాళ్లు బహు సక్పత్తుగా మాత్రమే ఉండటం, మన దురదృష్టాల మధ్య ఒక అదృష్టమే కాదా?"

పార్లమెంటులో తను చేసే ప్రసంగాలు సమ్మోహనాస్త్రాల్లా పని చేస్తాయని గప్పాలు కొట్టే త్యేర్ మాటలను ఫ్రాన్సు పెడచెవిని పెట్టింది. ఫ్రాన్సులో అప్పటి కింకా మిగిలివున్న 35 వేల కమ్యూన్లు ఎన్నుకున్న 7 లక్షలమంది మునిసిపల్ కౌన్సిలర్లలోను లెజిటిమిస్టులకు, ఆర్లియనిస్టులకు,[9] బోనపార్టిస్టులకు కలిసి 8000కు మించి స్థానాలు లభ్యం కాలేదు. ఆటు తర్వాత జరిగిన ఉప ఎన్నికల ఫలితాలు త్యేర్ ప్రభుత్వానికి యింతకన్న ప్రతికూలంగా ఉన్నాయి. ఈవిధంగా, రాష్ట్రాల నుండి అత్యవసరమైన భౌతిక బలాన్ని చేకూర్చుకోవడానికి బదులు, జాతీయ అసెంబ్లీ, తన కింతకు ముందున్న నైతిక బలాన్ని పైతం, దేశంలో సార్వజనిక ఓటింగు ద్వారా అభివ్యక్తమైన ప్రజాభిప్రాయాన్నిబట్టి, కోల్పోయింది. ఈ భంగపాటు చాలదా అన్నట్లు, ఫ్రాన్సులోని అన్ని నగరాల్లోనూ ఎన్నికైన మునిసిపాలిటీలు, వెర్సేల్స్‌లో అక్రమంగా తిష్ఠవేసిన అసెంబ్లీ స్థానంలో బోర్డోలో పోటీ అసెంబ్లీ పెడతామని బెదిరించాయి.

చిట్టచివరకి అప్పుడిక, బిస్మార్కుకి, నిర్ణయాత్మక చర్య కోసం చాల కాలంగా ఎదురుచూస్తున్న తరుణం చిక్కింది. తుది శాంతి ఒప్పందం కోసం, సర్వాధికారాలూ కలిగిన ప్రతినిధులను ఫ్రాంక్‌ఫుర్ట్‌కు పంపాల్సిందిగా త్యేర్‌కి బిస్మార్కు గట్టిగా వర్తమానం చేశాడు. తన యజమాని పిలుపును త్యేర్ పరమ విధేయతతో అందుకొని, తనకు విశ్వాసపాత్రుడైన జూల్ ఫ్రావ్‌కి పుయ్యే-కర్ట్యేని సహాయకుడుగా యిచ్చి బిస్మార్కు దగ్గరకి పంపించాడు. పుయ్యే-కర్ట్యే రువాన్‌కి చెందిన ఒక "ప్రసిద్ధ" నూలు పారిశ్రామికుడు. రెండవ సామ్రాజ్యానికి పరమ విధేయుడైన భక్తుడు. తన సొంత వృత్తి ప్రయోజనాలకు భంగకరంగా ఉండే ఇంగ్లండులో చేసుకోబడిన వాణిజ్య ఒప్పందాన్ని[84] మినహాయిస్తే రెండవ సామ్రాజ్యంలో అతనికెన్నడూ మరెటువంటి దోషమూ కనిపించలేదు. త్యేర్ ఆర్థిక మంత్రిగా బోర్డోలో ప్రతిష్ఠించబడ్డాడో లేదో వెంటనే, ఆ దగుల్బాజీ ఒప్పందాన్ని అతను నిరసించాడు. దాదాపుగా దాన్ని రద్దుచేస్తానన్న సూచన చేశాడు. (బిస్మార్కు ఒకడున్నాడన్న సంగతిని పరిగణనలోకి తీసుకోని కారణంగా)

ఫలించకపోయినా, ఆల్సేస్‌కి వ్యతిరేకంగా పాత రక్షణ సుంకాలను తిరిగి వెంటనే అమలు పరచాలని ప్రయత్నించేటంతటి దుస్సాహసానికి దిగాడు. అందుకు యింతకు పూర్వపు అంతర్జాతీయ ఒప్పందాలేవీ ఆటంకం కావని అతను చెప్పాడు. రువాన్‌లో వేతనాలు తగ్గించేసేందుకు ప్రతిఘాత విప్లవాన్ని సాధనంగా ఎంచిన యీ వ్యక్తి, ఫ్రాన్సులో తన సరుకుల ధరలు పెరిగేందుకోసం ఫ్రెంచి రాష్ట్రాల అప్పగింతను సాధనంగా ఎంచిన యీ ప్రబుద్ధుడు కాక, జూల్ ఫావ్ర్ తుది మహా విద్రోహ చర్యలో అతనికి సహాయకుడుగా త్యేర్ ఎంచుకోగల సముచిత వ్యక్తి మరొక డెవడుంటాడు?

ఈ మహా దొడ్డరాయబారులిద్దరూ ఫ్రాంక్‌ఫుర్ట్‌లో దిగీ దిగగానే, దాష్టీకపు బిస్మార్క్, "సామ్రాజ్య పునరుద్ధరణమా, లేకుంటే, నేను పెట్టిన శాంతి షరతులకు బేషరతుగా ఒప్పుకోవడమా" అన్న ఆజ్ఞాపూర్వక ప్రత్యామ్నాయాన్ని వాళ్ల ముందు పెట్టాడు! దానిలో యీ క్రింది షరతులు కూడా ఉన్నాయి: యుద్ధ నష్ట పరిహారపు చెల్లింపు వాయిదా విరామాలను తగ్గించాలి. ఫ్రాన్సులో పరిస్థితి మెరుగు పడిందని బిస్మార్క్‌కి తృప్తి కలిగేదాకా పారిస్ దుర్గాల్లో ప్రష్యన్ సేనల బైఠాయింపు కొనసాగాలి. అంటే, ఫ్రెంచి ఆంతరంగిక వ్యవహారాలలో అత్యున్నత తీర్పుకర్తగా ప్రష్యా గుర్తింపబడటంతప్ప యిది వేరేమీ కాదు! ఇందుకు బదులుగా, పారిస్‌ను సమూలంగా నాశనం చేసేందుకుగాను, నిర్బంధంలో వున్న బోనపార్టిస్ట్ సైన్యాన్ని విచ్చలవిడిగా వదిలేందుకూ, విల్‌హెల్మ్ చక్రవర్తి సేనల ప్రత్యక్ష తోడ్పాటును దానికి అందించేందుకూ బిస్మార్క్ సంసిద్ధతను వ్యక్తంచేశాడు. పారిస్‌ను "తక్శాంతి పరచిన" తర్వాతనే నష్టపరిహారపు మొదటి వాయిదా చెల్లించవచ్చునని కూడా అతను మాట యిచ్చాడు. త్యేరూ, అతని రాయబారులూ అటువంటి ఆకర్షణీయమైన ఎరను ఆతృతగా మింగారని వేరే చెప్పనక్కరలేదు. శాంతి సంధిపై వాళ్లు మే 10న సంతకాలు పెట్టారు, జాతీయ అసెంబ్లీచేత 18న దాన్ని ధ్రువీకరింపచేసుకున్నారు.

శాంతి సంధి కుదుర్చుకోవడానికీ బోనపార్టిస్టు ఖైదీల రాకకీ మధ్య విరామకాలంలో, తన సఖ్యతా సంప్రతింపుల ప్రహసనాన్ని కొనసాగించాల్సిన అవసరం మరింతగా ఉన్నట్లు త్యేర్ భావించాడు. పారిస్ ఊచకోత కోసం జరుగుతున్న సన్నాహాల పట్ల రిపబ్లికన్ తైనాతీలు చూసీ చూడనట్లు కళ్లు మిటకరించేందుకు యిది చాలా అవసరమని అతడు భావించాడు. తర్వాత ఎప్పుడో మే 8న మధ్యతరగతి మధ్యవర్తుల రాయబారవర్గ మొకటి తనను కలిసినప్పుడు, దానికి అతనిలా జవాబిచ్చాడు:

> "తిరుగుబాటుదార్లు లొంగిపోయేందుకు నిశ్చయించుకున్నప్పుడల్లా, జనరల్సు క్లెమాన్ టొమా, లెకాంట్‌ల హంతకులను మినహాయించి మిగిలిన వారందరికీ, ఒక వారంలో పారిస్ గేట్లు బార్లా తెరవబడతాయి."

మరికొద్ది రోజుల తర్వాత, యీ వాగ్దానాల విషయంలో "భూస్వాముల సభ" నుండి తీవ్రమైన ప్రశ్నలు ఎదురైనప్పుడు, ఏరకమైన వివరణలివ్వడానికీ అతను అంగీకరించలేదు. అయితే గమనార్హమైన యీ క్రింది సూచనను చేశాడు:

> "అయ్యా మీకో విషయం చెప్పదలచుకున్నాను. మీలో ఓర్పులేని వాళ్ళూ, మరీ తొందరపాటు బాపతు వాళ్ళూ ఉన్నారు. వాళ్లకి మరో ఎనిమిది రోజుల వ్యవధి అవసరం; ఎనిమిది రోజుల అనంతరం యిక ప్రమాదం యేమీ ఉండబోదు, అప్పుడిక కర్తవ్యం వాళ్ల ధైర్యానికీ, వాళ్ల శక్తి యుక్తులకీ తగిన మోతాదులో ఉంటుంది."

తానింకా త్వరలోనే పారిస్‌లో ప్రవేశించగలనని మెక్ మహన్ ఎప్పుడైతే తనకు హామీ యిచ్చాడో అప్పుడిక జాతీయ అసెంబ్లీలో థేయర్ ఇలా ప్రకటించాడు:

> "చేతుల్లో శాసనాలతో నేను పారిస్‌లో ప్రవేశిస్తాను, సైనికుల ప్రాణాలను బలిచేసి, బహిరంగ స్మారక చిహ్నాలను రూపుమాపిన దౌర్భాగ్యుల నుండి పూర్తి ప్రాయశ్చిత్త పరిహారాన్ని డిమాండ్ చేస్తాను."

నిర్ణయాత్మక క్షణం ఆసన్నమైనప్పుడు, జాతీయ అసెంబ్లీకి అతను "నేను నిర్దాక్షిణ్యంగా ఉంటాను!" అనీ, పారిస్‌కి – దానికి రోజులు మూడాయనీ చెప్పాడు. తన బోనపార్టిస్టు బందిపోట్లకు, పారిస్‌పై తమ తృప్తి కొద్దీ వాళ్ళ పగతీర్చుకోవడానికి వాళ్లకి ప్రభుత్వపు లైసెన్సు ఉందని చెప్పాడు. చిట్టచివరకు, విద్రోహ కారణంగా, మే 21న జనరల్ దుయేకి పారిస్ గేట్లు తెరువబడినప్పుడు, తన పఖ్యాతా సంప్రతింపుల ప్రహసన "లక్ష్యాన్ని" యిన్ని రోజులూ అవగాహన చేసుకొన తిరస్కరిస్తున్న "భూస్వాముల సభకు," థేయర్ మే 22న బయటపెట్టాడు.

> "నేను మీకు కొద్ది రోజుల వెనక, మనం మన "లక్ష్యాన్ని" సమీపిస్తున్నట్లు చెప్పివున్నాను. మనమీనాడు ఆ లక్ష్యాన్ని చేరుకున్నామని నేను చెప్తున్నాను. భద్రతా, న్యాయమూ, నాగరికతల విజయం ఈనాడు సాధింపబడింది!"

ఔను, అది విజయమే. బూర్జువా వ్యవస్థకు చెందిన బానిసలూ, ఒళ్ళు విరక్కొట్టుకొని పాటుపడేవాళ్ళూ తమ యజమానులకు వ్యతిరేకంగా తిరుగబడినప్పుడల్లా బూర్జువా వ్యవస్థకు సంబంధించిన నాగరికతా న్యాయాలు ఘోరంగా బయటపడుతుంటాయి.

అప్పుడా నాగరికతా న్యాయాలు నగ్నమైన ఆటవికత్వంగా, అడ్డు అదుపుల్లేని చట్ట రహితమైన పగ సాధింపుగా బయటపడతాయి. దోపిడీదారునికీ ఉత్పత్తిదారునికీ మధ్య జరిగే వర్గపోరాటంలోని ప్రతి ఒక్క సంక్షోభమూ యీ అంశాన్ని మరింత స్పష్టంగా కొట్టవచ్చినట్లు ప్రదర్శిస్తుంది. 1848 జూన్ నాటి బూర్జువావర్గపు ఘాతుకాలు 1871 నాటి వర్ణనాతీతమైన ఘోరాల ముందు వెలవెలబోతాయి. పారిస్ వాసులు — పురుషులు, స్త్రీలు, పిల్లలు — ఆత్మత్యాగ పూరితమైన వీరత్వాన్ని ప్రదర్శించి, వెర్సేల్స్ సైన్యం ప్రవేశానంతరం ఎనిమిది రోజుల పాటు పోరాటం జరిపిన తీరు వారి లక్ష్యపు మహత్వాన్ని ఎంతగా ప్రదర్శించిందో, సైనికుల అత్యాచారాలు, వారు ఏ నాగరికత యొక్క కిరాయి మద్దతుదార్లో, ఆ నాగరికతయొక్క అంతస్సారభూతమైన లక్షణాన్ని బహిర్గతం చేశాయి. ఏమి గొప్ప నాగరికత అని చెప్పుకోవాలి, తను జరిపిన పోరాటా నంతరం గుట్టలుగా పడిన శవాలను తొలగించడ మెలా గన్నదే దానికొక పెద్ద సమస్య అయిపోయింది!

త్యేర్‌యొక్క, వేటకుక్కలవంటి అతని అనుచరులయొక్క రాక్షస ప్రవర్తనకు పోలిక వెతకాలంటే మనం వెనకటి సూల్లా కాలానికీ, మొదటి, రెండవ రోమన్ మూర్తిత్రయాల కాలానికీ వెళ్లాల్సి వుంటుంది.** అదే రకపు నిర్దాక్షిణ్యమైన మూకు మ్మడి ఊచకోత; హత్యాకాండ క్రమంలో అదే మాదిరిగా వయోభేదం కాని, స్త్రీ పురుష భేదం కాని పాటించకపోవడం; అదే రకంగా ఖైదీలను నానా హింసలకూ గురిచెయ్యడం; అదే పద్ధతి బహిష్కారాలు, అయితే యీ మారు, మొత్తం వర్గాన్నే బహిష్కరించడం; రహస్య జీవితం గడుపుతున్న ఏ ఒక్క నాయకుడూ తప్పించుకు పోకుండా, వాళ్లను వేటాడటం; రాజకీయ, వ్యక్తిగత శత్రువులకు వ్యతిరేకంగా కూపీలివ్వడం; ఈ కలహంతో బొత్తిగా సంబంధంలేని వాళ్లను పాశవికంగా హత్య చేసే విషయంలో అదే రీతి నిర్లక్ష్యమూ మనకి కనిపిస్తాయి. అయితే, వాళ్లకీ వీళ్లకీ మధ్య ఒక్కటే భేదం వుంది: రోమన్లకి మూకుమ్మడిగా కాల్చివేయడానికి మిత్ర ల్యూజ్‌లు లేవు, "వాళ్ల చేతుల్లో శాసనమూ" లేదు, వాళ్ల పెదవులపై "నాగరికతా" నినాదమూ లేదు.

ఆ ఘోరాల తర్వాత, వాళ్ల పత్రికలచేతనే వర్ణింపబడిన బూర్జువా నాగరికత యొక్క మరింత బీభత్సమైన మరో పార్శ్వాన్ని చూడండి!

ఒక లండన్ టోరీ పత్రిక పారిస్ విలేకరి యిలా రాశాడు:

> "దూరాన, చెదురుమదురుగా కాల్పులింకా వినిపిస్తూనే ఉన్నాయి. పేర్ లషేస్ గోరీల మధ్య చావుకు ఎదురుచూస్తూ మూలుగుతూ కనిపించే

ఆలనా పాలనా లేని క్షతగాత్రులైన దౌర్భాగ్యులు మరణిస్తున్నారు. 6000 మంది తిరుగుబాటుదారులు సొరంగ మార్గాల పద్మవ్యూహంలో చిక్కుకొని పైకి రాలేక దారితెన్నూ తెలియక భయభ్రాంతులై వేదనతో నిరాశోపహతులై తిరుగుతున్నారు. వీధుల్లో తరమబడుతున్న దౌర్భాగ్యులు డజన్ల సంఖ్యలో మిట్రల్యూజ్‌ల పాలబడుతున్నారు. ఇక్కడిలా వుండగా మరోవంక, హోటళ్లన్నీ భంగుతాగే వాళ్లతో, బిలియర్డ్స్, పాచికలు ఆడేవాళ్లతో నిండివున్నాయి. వేశ్యలు వీధులవెంట, పార్కులవెంట స్వైర విహారం చేస్తున్నారు. ఫేషన్లకు నిలయమైన రెస్టారెంట్లలోని ప్రత్యేకమైన గదుల్లోంచి త్రాగుబోతుతందనాలు రాత్రి నిశ్శబ్దాన్ని భంగం చేస్తున్నాయి."

కమ్యూన్‌చేత నిషేధింపబడిన వెర్సేల్స్ పత్రిక "Journal de Paris"లో[86] ఎడ్వర్డ్ హెర్వే ఇలా రాశాడు:

"పారిస్ జనాభా (!) నిన్నటి దినం తన సంతోషాన్ని ప్రకటించిన తీరు నిజంగా చాలా హేయంగా కానవచ్చింది. కాలం గడిచిన కొద్దీ అది యింకా దిగజారిపోతుందని మేము భయపడుతున్నాం. పారిస్‌కి యీవాడు తిరణాల వాతావరణం వచ్చింది; నిజానికిది ఎంతో అసందర్భంగా వుంది. Parisiens de la décadence*గా మనం పరిగణింపబడకుండా ఉండాలంటే, ఈ రకమైన వ్యవహారం అంతం కావాలి."

ఆటుతర్వాత అతను టాసిటస్ రచన నుండి యీ భాగాన్ని ఉదహరించాడు:

"అయితేనేం, ఆ భయంకర పోరాటపు మరునటి ఉదయం, పోరాటమింకా పూర్తిగా ముగియక ముందే, రోమ్ — నైచ్యంలో, అవినీతిలో మునిగి తేలుతున్న రోమ్ — దాని శరీరాన్ని నాశనం చేసి, ఆత్మను కలుషితం చేస్తున్న ఇంద్రియలాలసత్వమనే లోతైన బురదలోకి తిరిగి దిగజారింది. Alibi proelia et vulnera, alibi balnea popinaeque (ఇటు చూస్తే పోరాటాలూ, గాయాలూ, అటు చూస్తే జలక్రీడలూ, విందు వినోదాలూ)."

---

* పతన దశకి చెందిన పారిస్ వాసులు. — సం.

హెర్వే యిక్కడ మరచిపోయింది ఒకేఒక విషయం. "పారిస్ జవాభా" అని అతను చెప్పినది త్యేర్‌కి చెందిన పారిస్ జవాభా — వెర్సేల్స్, సెయింట్ డెనీ, రుయేే, సెయింట్ జెర్మేన్‌ల నుండి గుంపులుగా తిరిగి వస్తున్న francs-fileurs[78] — యిది నిజంగానే "క్షీణమాన" పారిస్.

మరింత మెరుగైన వనసమాజం కోసం నిస్వార్థంగా పోరాడుతున్న యోధులపై తను సాధించిన రక్తప్లావిత విజయాలన్నింటిలోనూ, శ్రమను బానిసగా చేసుకోవడంపై ఆధారపడిన ఆ మహా పాపిష్టి నాగరికత, తన పాతపడిన వాళ్ల మూలుగులను, ప్రపంచ వ్యాపితంగా ప్రతిధ్వనించే అభాండాల కోలాహలంలో ముంచెత్తుతుంది. శాంతియుతులైన శ్రమజీవుల కమ్యూన్‌కి చెందిన పారిస్, "భద్రత"కు చెందిన వేటకుక్కల్లాంటి రక్తపిపాసులచేత అకస్మాత్తుగా పిశాచగణ సమవాకారంలా మార్చివెయ్యబడింది. మహత్తరమైన యీ మార్పు, అన్ని దేశాల బూర్జువా బుర్రలకీ తెలియజేస్తున్న దేమిటి? ఏముంది, కమ్యూన్, నాగరికతకు వ్యతిరేకంగా చేసిన కుట్ర అని! పారిస్ ప్రజలు కమ్యూన్ కోసం, ఉత్సాహంగా ప్రాణాలర్పిస్తారు. చరిత్రకెక్కిన ఏ పోరాటమూ అలాంటి నిస్వార్థత ఎరగదు. దీని అర్థం ఏమిటి? ఏముంది, కమ్యూన్, కొద్దిమంది నేరస్తులచేత అధికారాక్రమణేగాని, ప్రజాసామాన్యపు సొంత ప్రభుత్వం కాదు! పారిస్ మహిళలు బారికేడ్ల (వీధి అవరోధాల) వద్దా, ఉరికంబాలపైనా సంతోషంగా తమ ప్రాణాలు విడుస్తారు. దీని అర్థం ఏమిటి? ఏముంది, కమ్యూన్ భూతం వాళ్లని మెగేరా, హెకటా* ల్లాగా మార్చేసింది! పారిస్ కమ్యూన్ ఎదురు లేని పాలన సాగించిన రెండు నెలల కాలంలో దాని మితప్రవర్తన పారిస్ నగర పరిరక్షణ కాలంలో ప్రదర్శింపబడిన వీరత్వానికి మాత్రమే దీటైనది. దీని అర్థం ఏమిటి? ఏముంది, నెలల తరబడిగా కమ్యూన్ మితవ్యవహార, మానవత్వాల ముసుగులో జాగ్రత్తగా నక్కింది, దాని రాక్షస ప్రవృత్తులూ, రక్తదాహమూ దాని నేరవు కాలంలో విచ్చలవిడిగా బయటపడ్డాయి!

శ్రమజీవుల పారిస్, తన వీరోచిత ఆత్మహనన క్రమంలో, ఆ మంటల్లో భవనాలనూ, స్మారక చిహ్నాలనూ ముంచెత్తింది. శ్రామికవర్గ సజీవ శరీరాన్ని శకల శకలాలుగా

---

* మెగేరా (గ్రీక్ పౌరాణికం) — పగకి సంబంధించిన ముగ్గురు దేవతల్లో ఒకతె, క్రోధమాయలకు సాకార మూర్తి; అలంకారికంగా వాడబడింది — ద్వేషబుద్ధి గల దుస్స్వభావి.

హెకటా (గ్రీక్ పౌరాణికం) — మూడు తలలు, మూడు శరీరాలు కలిగిన వెన్నెల దేవత; పాతాళ లోకంలోని రాక్షసులకూ, భూతాలకూ ఉంపుడుకత్తె, పాపకృత్యాలకూ, సమ్మోహన విద్యకూ పోషకురాలు. — సం.

పీకివేస్తూ, దాని పాలకులు, చెక్కుచెదరని తమ శిల్ప సంశోభితమైన నివాసభవనాల్లోకి విజయోత్సాహంతో తిరిగి రాగలమని యింకెంతమాత్రమూ ఆశించరాదు. వెర్సేల్స్ ప్రభుత్వం "దహనకాండ!" అని పెడబొబ్బలు పెట్టి, మారుమూలనున్న కుగ్రామాల్లో సైతం వున్న తన తాబేదారుల చెవుల్లో యీ తిరుమంత్రాన్ని ఊదుతుంది: "ప్రతిచోటా వున్న నా శత్రువులను దహనకాండను వృత్తిగా స్వీకరించిన వారుగా అనుమానించి వేటాడండి." పోరాటానంతరం మూకుమ్మడిగా జరిగిన ఊచకోతను పట్టించుకోని ప్రపంచమంతటా గల బూర్జువావర్గం ఇటుక, సున్నాల నష్టం పట్ల విభ్రాంతి భీతులను ప్రకటిస్తుంది!

ప్రభుత్వాలు తమ నౌకా దళాలకు, "చంపు, తగలపెట్టు, నాశనం చెయ్యి" అంటూ అధికారికంగా అనుమతి ఇస్తే, అదీ దహనకాండకి అనుమతేనా? బ్రిటిష్ సేనలు, వాషింగ్టన్‌లోని కాపిటల్‌కీ,* చైనా చక్రవర్తి వేసవి భవనానికీ, బుద్ధిపూర్వకంగా నిప్పుపెట్టాయి,[87] మరి, అదీ దహనకాండేనా? ప్రష్యన్లు, సైనిక కారణాల కోసం కాకుండా, కేవలం కక్ష సాధించేందుకోసం, పెట్రోలు సహాయంతో షటోడెన్ వంటి పట్టణాలనూ, లెక్కలేనన్ని గ్రామాలనూ కాల్చిపారేశారు; అదీ దహనకాండేనా? త్యేర్, ప్రజలున్న యిళ్లను మాత్రమే తను తగలపెట్టాలని కోరుతున్నట్లు చెప్పి, ఆ సాకుపై ఆరు వారాలపాటు పారిస్‌పై ఫిరంగులతో బొంబార్డు చేయించాడు, మరి అది దహనకాండ కాదా? — యుద్ధంలో, ఏ యితర ఆయుధంలాగే అగ్ని కూడా న్యాక్రమమైన ఆయుధమే. శత్రువుల చేతుల్లో ఉన్న యిళ్లను దహించడానికి, వాటిని బొంబార్డు చేస్తారు. అలాగే, వాటిని రక్షించుకొంటున్నవాళ్లు, అక్కడి నుండి వెనక్కు తప్పుకోవాల్సి వచ్చినప్పుడు, దాడిదారులు ఆ యిళ్లను ఉపయోగించుకోవడానికి వీల్లేకుండా, వాళ్లే వాటిని తగలపెడతారు. యుద్ధంలో ఏ రెగ్యులర్ సైన్యానికి ముందున్న యిళ్ల కర్మమైనా యెప్పుడూ తగలపెట్టబడటమే. కానైతే, బానిసలు బానిసయజమానులకు వ్యతిరేకంగా చేసే యుద్ధంలో మాత్రం — చరిత్రలో యిదొక్కటే న్యాయబద్ధమైన యుద్ధం — యీ సూత్రం ఎంత మాత్రం వర్తించరాదు! కమ్యూన్ అగ్నిని కేవలం రక్షణ కోసం మాత్రమే వాడింది. ఆ సుదీర్ఘమైన తిన్నని వీధులపై ఓన్మన్ ఫిరంగి కాల్పులు సాగించగా వెర్సేల్స్ సేనలు ముందుకు రాకుండా నిరోధించేందుకు కమ్యూనార్డులు అగ్నిని వాడారు. వెర్సేల్స్ వాళ్లు తమ పురోగమన క్రమంలో ఫిరంగి గుళ్లను వాడగా, కమ్యూనార్డులు తిరోగమనంలో తమపై దాడి జరగకుండా చూసుకునేందుకు అగ్నిని వాడారు. కమ్యూనార్డుల దహనకాండ మూలంగా ఎన్ని భవనాలు దగ్ధమయ్యాయో

* అమెరికన్ కాంగ్రెస్ సమావేశమయ్యే భవనం. — సం.

వెర్సేల్స్ వాళ్ళ ఫిరంగి గుళ్ళ మూలంగా కనీసం అన్ని భవనాలైనా నాశనం చేయబడ్డాయి. ఏ భవనాలు రక్షణదారుల చేతుల్లో తగలబడ్డాయి, ఏవి దాడిదారుల చేతుల్లో తగలబడ్డా యన్నది యిప్పటికీ వివాదాంశమే. వెర్సేల్స్ సేనలు ఖైదీల మూకుమ్మడి హత్యలు ప్రారంభించా కనే రక్షణదారులు దహనకాండకు పూనుకొన్నారు. – పైగా, కమ్యూన్, చాలా కాలం క్రితమే, బాహాటంగా ఈ విషయమై తెలియపరచింది: ప్రమాదం ముంచుకొచ్చేట్ల యితే, తాను పారిస్ శిథిలాల క్రింద కూరుకుపోయి అయినా సరే, పారిస్‌ని రెండవ మాస్కో చేస్తానని[88] అది స్పష్టంచేసి వుంది. జాతీయ రక్షణ ప్రభుత్వం కూడా యీ మాటైతే అంది గాని అది తన దేశద్రోహానికి ముసుగుగా మాత్రమే యిలా అంది. ఇందుకోసం, ట్రొషూ వాళ్లకు పెట్రోలియం చూసిపెట్టాడు. తన శత్రువులకు పారిస్ ప్రజల ప్రాణాల సంగతి బొత్తిగా పట్టలేదనీ, వాళ్లకి ఎక్కువగా పట్టినది తమ భవనాల సంగతి మాత్రమేననీ కమ్యూన్‌కి తెలుసు. మరోవంక, త్యేర్, వాళ్లకి, తన కక్ష సాధింపు చర్యల విషయంలో మినహాయింపులేమీ ఉండవని ముందుగానే స్పష్టం చేశాడు. ఒక ప్రక్క తన సైన్యాన్ని సంసిద్ధం చేసుకొని, మరో ప్రక్క ప్రష్యన్ల ఉచ్చు బిగించగానే, అతనిలా ప్రకటించాడు: "నేను నిర్దాక్షిణ్యంగా ఉంటాను! ప్రాయశ్చిత్తం పూర్తిగా జరుగుతుంది! న్యాయం బహుకఠినంగా ఉంటుంది!" పారిస్ కార్మికుల చర్యలు విధ్వంస కాండే అయితే, అది ఆత్మరక్షణ స్థానంలో వున్నవారు నిరాశా నిస్పృహల్లో చేసిన విధ్వంసకాండ. అంతేగాని, వెనక, క్రిస్టియనేతర విగ్రహారాధకులయొక్క నిస్సందేహంగా అమూల్యమైన కళాఖండాలను క్రిస్టియన్లు విధ్వంసం చేసినట్లు, విజేతలు విజయోన్మా దంతో చేసిన విధ్వంసకాండ కాదు. కాని అది కూడా సక్రమమైనదేనని చరిత్రకారుడు పరిగణించాడు. ఎందుచేతనంటే ఉద్భవిస్తున్న నవ సమాజానికీ, కూలిపోతున్న పాత సమాజానికీ మధ్య జరిగిన బ్రహ్మాండమైన పోరాటంతో పోలిస్తే, అది విధ్వంసకాండ అనుకున్నా అనివార్యమైన స్వల్ప అంశం మాత్రమే. వినోదయాత్రికులకు యింపు గొలిపే పారిస్ కోసం చారిత్రాత్మక పారిస్ నగరాన్ని నేలమట్టం చేసిన ఓస్‌మన్ విధ్వంస కాండ బాపతు అంతకన్న కాదిది!

అయితే, పారిస్ ఆర్చిబిషప్ నాయకత్వానగల అరవై నాలుగుమంది హామీ బందీలను కమ్యూన్ హతమార్చింది కదా, దాని సంగతేమిటి! బూర్జువావర్గమూ, దాని సైన్యమూ, 1848 జూన్‌లో, యుద్ధకాండ నుంచి చాలకాలంగా కనుమరుగైన ఒక ఆచారాన్ని – రక్షణలేని తమ ఖైదీలను కాల్చిచంపడాన్ని – పునరుద్ధరించాయి. ఈ పాశవికమైన ఆచారం, కొద్దిగానో, గొప్పగానో, ప్రజా తిరుగుబాట్లను అణచే క్రమంలో యూరప్, ఇండియాలలోని పీడకులచేత విధిగా పాటింపబడుతూ వచ్చింది. తద్వారా అదంతా నిజమైన "నాగరికత ప్రగతి"గా నిరూపితమైంది కూడా! మరో వంక, ప్రాన్సులో

ప్రష్యన్ల, హామీ బందీలను పట్టుకొనే ఆచారాన్ని పునరుద్ధరించారు — ఈ ఆచారం మేరకు అమాయకులైన ప్రజలు తమ ప్రాణాలతో యితరులు చేసిన పనులకు జవాబు చెప్పుకోవాల్సి వుంటుంది. మన మింతకు ముందు చూసినట్లుగా, త్యేర్, పారిస్‌తో యుద్ధ ఆరంభం నుంచీ కూడా కమ్యూన్‌కి చెందిన ఖైదీలను కాల్చి వేసే మానవీయ మైన అలవాటును అమలుజరిపితే, వాళ్ల ప్రాణాలను కాపాడుకొనేందుకుగాను, కమ్యూన్, విధిగా ప్రష్యన్ పద్ధతిలో హామీ బందీలను పట్టుకొనేందుకు పూనుకోవాల్సి వచ్చింది. వెర్సేల్స్ వాళ్ల ఖైదీలను, వరుసగా కాల్చేస్తూ వున్న కారణంగా, కమ్యూన్ పట్టుకున్న హామీ బందీల ప్రాణాలకు పదేపదే ప్రమాద పరిస్థితిని వెర్సేల్సు చేజేతులా కల్పించు కుంది. మెక్ మహన్ ప్రిటోరియన్ను,[89] పారిస్‌లో తమ ప్రవేశోత్సవ సందర్భంగా జరిపిన జనసంహారకాండ తర్వాత, వాళ్లనిక మన్నించడమెలా? బూర్జువా ప్రభుత్వాల జంకు గొంకుల్లేని క్రౌర్యంపై గల తుది అదుపు — హామీ బందీలను పట్టుకోవడం — పైతం బూటకం కావలసిందేనా? ఆర్చిబిషప్ దార్బువాని నిజంగా హత్యచేసినది త్యేరేనని చెప్పాల్సి వుంటుంది. అప్పట్లో త్యేర్ చేతుల్లో వున్న, ఒక్క బ్లాంకీని విడిచిపెడితే, అందుకు బదులుగా, ఆర్చిబిషప్‌నీ, యింకెందరో మతబోధకులనూ వదులుతామని కమ్యూన్ పదేపదే స్పష్టంచేసింది. త్యేర్ ససేమిరా అందుకు అంగీకరించలేదు. బ్లాంకీని వదిలి పెడితే కమ్యూన్‌కి తను ఒక ముఖ్య నాయకుడి విచ్చినట్లవుతుందన్న సంగతీ, ఆర్చిబి షప్ చనిపోతేనే తన ప్రయోజనం ఎక్కువగా సాధింపబడుతుందన్న సంగతీ అతనికి తెలుసు. త్యేర్, కవేన్యాక్, ఆదర్శాన్ని పాటించాడు. 1848 జూన్‌లో, కవేన్యాక్, అతని సైనికులూ, తిరుగుబాటుదారులు ఆర్చిబిషప్ అఫ్రేని హత్య చేసేశారంటూ నిందారోపణ చేసి ఎంత అల్లరీ ఆగం చేశారు! ఆర్చిబిషప్‌ని "పార్టీ ఆఫ్ ఆర్డర్"[48] సైనికులే హతమార్చారన్న సంగతి వాళ్లకి బాగా తెలుసు. అప్పుడా తావులోవున్న ఆర్చిబిషప్‌యొక్క ఉపమతాధిపతి జక్మే, ఆవెంటనే యిచ్చిన సాక్ష్యంలో యీ విషయాన్ని స్పష్టంచేశాడు.

పార్టీ ఆఫ్ ఆర్డర్, తను చేసే విశృంఖల హత్యాకాండతోబాటే, తమ క్రూర కృత్యాలకు గురైనవారిని గురించి అభాండాల పరంపర కురిపించడంలో కూడా ఎన్నడూ విఫలం కాదు. దీన్నిబట్టి ఈ నాటి బూర్జువా, పాతకాలపు ఫ్యూడల్ ప్రభువులకు తననే సిసలైన వారసుడుగా పరిగణించుకుంటున్నట్లు బోధపడుతుంది. ఆనాటి ఫ్యూడల్ ప్రభువు సామాన్యునికి వ్యతిరేకంగా తన చేతుల్లో ఉన్న ప్రతి ఆయుధమూ న్యాకమ మైనదేననీ, సామాన్యుని చేతిలో ఏ మాదిరి ఆయుధమున్నా కూడా నేరమేననీ పరిగ ణించేవాడు.

విదేశీ ఆక్రమణదారు పోషకత్వం క్రింద సాగించే అంతర్యుద్ధం ద్వారా విప్లవాన్ని

అణచివేసేందుకు పాలకవర్గం చేసిన కుట్ర — సెప్టెంబరు 4వ తేదీ నుండి సెయింట్ క్లౌ గేటు ద్వారా మెక్ మహన్ ప్రిటోరియన్సు* ప్రవేశందాకా మేము వివరించిన కుట్ర — పారిస్ మారణకాండతో ఒక కొలిక్కి వచ్చింది. 1849 నాటి ప్రష్యన్ chambre introuvable [90]లో తనింకా సామాన్యమైన భూస్వామిగా వున్న కాలంలోనే, మొత్తంగా మహా నగరాల సాధారణ విధ్వంసం కోసం తపనపడ్డ బిస్మార్కుకు, యిప్పుడీ పారిస్ శిథిలాల్లో, తన కల పండేందుకు తొలి సూచన కనిపించిందో ఏమో, ఉబ్బి తబ్బిబ్బవుతున్నాడు. పారిస్ శ్రామికవర్గపు శవాలను చూసి అతను మురుస్తున్నాడు. అతని దృష్టిలో యిది కేవలం విప్లవ నిర్మూలన కాదు, ఫ్రాన్సు వినాశనం కూడా. ఫ్రాన్సుకి నిజానికిప్పుడు శిరచ్ఛేద సత్కారం జరిగింది, అదీ ఫ్రెంచి ప్రభుత్వం చేతిలోనే. పరాజయాలు ఎరగని రాజకీయవేత్తలందరికీ సామాన్యంగా ఉండే అషామాషీ పైపై జ్ఞానం తోనే బిస్మార్కు సైతం మహత్తరమైన యీ చారిత్రక సంఘటన పైపై అంచులను మాత్రమే దర్శించాడు. ఏ విజేత అయినా, జెండార్మ్‌గా మారటమే కాకుండా, ఆక్ర మించుకోబడిన ప్రభుత్వంయొక్క కిరాయి హంతకునిగా మారి తన విజయోత్సవం జరుపుకోవడమన్నది చరిత్రలో యింతకు ముందు ఎవరైనా, ఎన్నడైనా విన్నారా? కన్నారా? ప్రష్యాకీ పారిస్ కమ్యూన్‌కీ మధ్య యుద్ధం లేదు. తద్విరుద్ధంగా, కమ్యూన్, శాంతికి సంబంధించిన ప్రాథమిక షరతులకు అంగీకరించింది. ప్రష్యా, తన తాటస్థ్యాన్ని ప్రకటించింది. ఈవిధంగా ప్రష్యా యుద్ధంలో కక్షిదారు కాదు. ప్రష్యా ఒక హంతకుని పాత్ర, అందునా, ఎటువంటి ప్రమాదాన్నీ ఎదుర్కోవడం లేదు కాబట్టి, ఒక పిరికి హంతకుని పాత్ర వహించింది. పారిస్ పతనం కావడంతోనే, కిరాయి హంతకుల కిచ్చేట్లు, తనకు 50 కోట్ల ఫ్రాంకులు చెల్లించాలని ముందు షరతు విధించింది కాబట్టి, అది కిరాయి హంతకుని పాత్ర వహించింది. ఆవిధంగా, చిట్టచివరకు, ధర్మ, నీతి నిష్ఠా గరిష్ఠమైన జర్మనీ చేతుల్లో నాస్తిక, పోకిరి ఫ్రాన్సుకి విధినిర్ణీత దండన నిజ స్వభావం బైటపడింది! పాత ప్రపంచానికి చెందిన లాయర్ల అవగాహన మేరకు సైతం అంతర్జాతీయ ధర్మశాస్త్ర అతిక్రమణలో దీనికి సాటి వచ్చేది మరొకటి లేదు. యూరప్ "నాగరిక" ప్రభుత్వాలు, సెయింట్ పీటర్స్‌బుర్గ్ మంత్రివర్గానికి కేవలం పనిముట్టయిన దుర్మార్గపు ప్రష్యన్ ప్రభుత్వాన్ని జాతుల మధ్య నుంచి వెలివేసి ఉండాల్సింది. అవి, అలా చెయ్యక పోగా, పారిస్ చుట్టూ వున్న రెండు సైనిక వలయాలనూ దాటి బయటపడిన కొద్ది మంది నిర్భాగ్యులనూ వెర్సేల్స్‌లోని హంతకుని చేతికి అప్పగించాల్సిన అవసరం లేదా అంటూ ప్రష్యన్ ప్రభుత్వాన్ని రెచ్చగొట్టాయి!

---

* 89వ వివరణ చూడండి. — సం.

ఆధునిక కాలంలో జరిగిన యుద్ధాల్లోకెల్ల మిక్కిలి భయంకరమైన యుద్ధానంతరం, గెలిచినవాళ్ళూ, ఓడినవాళ్ళూ కూడా శ్రామికవర్గాన్ని ఉమ్మడిగా ఊచకోత కోసేందుకు సహకరించుకోవడం – అన్న సాటిలేని యీ ఘటన, బిస్మార్కు భ్రమపడినట్లు, పైకెగసి వస్తున్న నవ సమాజపు పూర్తి అణచివేతను కాక, బూర్జువా సమాజం కూలి పోవడాన్నే సూచిస్తోంది. పాత సమాజం యీనాటికీ చెయ్యగల అత్యున్నత వీరోచిత కృషి అల్లా జాతీయ యుద్ధం మాత్రమే. వర్గాలమధ్య పోరాటాన్ని వాయిదా వెయ్యడానికీ, ఆ వర్గపోరాటం అంతర్యుద్ధంగా ప్రజ్వలించగానే దాన్ని కాస్తా వాయిదా వేయడానికీ అది పైతం కేవలం ప్రభుత్వం ఆడే బూటకనాటకం మాత్రమేనని తేలిపోయింది. వర్గపాలన యికనెంత మాత్రమూ జాతీయవాద ముసుగులో దాగొన లేకుండా ఉంది. శ్రామికవర్గానికి వ్యతిరేకంగా జాతీయ ప్రభుత్వాలన్నీ ఒక్కటే.

1871 విట్-సన్‌డే* తర్వాత, ఫ్రెంచి కార్మికులకూ, వాళ్ల శ్రమ ఉత్పాదితాన్ని సొంతపరచుకొనే వాళ్లకీ మధ్య, శాంతి గాని, తాత్కాలిక పోరాట విరమణగాని సాధ్యం కాదు. కిరాయి సైన్యపు ఇనప చేతులు రెండు వర్గాలనూ ఉమ్మడి పీడన క్రింద కొంత కాలం అణచివుంచ వచ్చు. కానైతే, ఆ పోరాటం విధిగా మరలమరల, మరింత తీవ్రమైన రూపంలో ప్రజ్వరిల్లక తప్పదు – చిట్టచివరకు ఉత్పాదితాన్ని సొంతపరచుకునే కొద్ది మందా, లేక, అత్యధిక సంఖ్యాకులైన శ్రామిక జనమా ఎవరు గెలుస్తారన్న విషయంలో సందేహం ఎంతమాత్రం ఉండజాలదు. ఫ్రెంచి కార్మికులు, ఆధునిక శ్రామికవర్గపు పురోగామి దళం మాత్రమే.

పారిస్‌కు ముందు, వర్గ పాలనయొక్క అంతర్జాతీయ స్వభావానికి కితాబిచ్చిన యూరపియన్ ప్రభుత్వాలు, పెట్టుబడియొక్క అంతర్జాతీయ కుట్రకి వ్యతిరేకంగా శ్రమయొక్క అంతర్జాతీయ ప్రత్యర్థి సంఘమైన ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్స్ అసోసియేషన్‌ని యీ ఘోరాలన్నింటికీ మూలకారణంగా దుయ్యబట్టాయి. శ్రమ విమోచన దారుగా పైకి నటిస్తూ, శ్రమపై నియంతగా వ్యవహరిస్తోందని, దానిని త్యేర్ నిరసించాడు. ఫ్రెంచి ఇంటర్నేషనల్ సభ్యులకీ విదేశాల్లోని ఇంటర్నేషనల్ సభ్యులకీ మధ్య గల సంబంధా లన్నింటినీ త్రెంచి వెయ్యాలని పికార్డ్ ఆజ్ఞ యిచ్చాడు. త్యేర్‌యొక్క 1835 నాటి సహచరుడు, అతనిచే భద్రంగా కాపాడబడుతూ వచ్చిన పీనుగ వంటి కౌంట్ జొబేర్, దీన్ని ఏరి పారెయ్యడమన్నది అన్ని నాగరిక ప్రభుత్వాల ప్రధాన కర్తవ్యమన్నాడు. "భూస్వాముల సభ" దానికి వ్యతిరేకంగా అరిచి పెడబొబ్బలు పెడుతుంది. యావత్తు

* విట్-సన్‌డే – యూరపియన్ దేశాలలో వేసవి కాలంలో వచ్చే ఒక పండుగ. – సం.

యూరపియన్ పత్రికలూ ఆ బృంద గానంలో కలుస్తాయి. మన అసోసియేషన్‌తో ఏ సంబంధం లేని గౌరవనీయుడైన ఒక ఫ్రెంచి రచయిత* యిలా అన్నాడు:

> "నేషనల్ గార్డు కేంద్ర కమిటీ సభ్యులూ, కమ్యూన్ సభ్యుల్లో అధిక సంఖ్యాకులూ ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్స్ అసోసియేషన్‌యొక్క అత్యంత క్రియాశీలమైన, తెలివైన, శక్తివంతులైన బుద్ధిశాలురు; ...వాళ్లు పూర్తిగా నిజాయితీపరులు, చిత్తశుద్ధి గలవారు, తెలివైనవారు, కర్తవ్య నిష్ఠాపరులు, పరిశుద్ధులు, మొండిపట్టుదల — ఆ మాటయొక్క <u>మంచి</u> అర్థంలో — కలవారు."

పోలీసు భావపూరితమైన బూర్జువా మనస్సు, సహజంగానే, ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్స్ అసోసియేషన్ రహస్య కుట్ర సంస్థలా పని చేస్తుందనీ, దాని కేంద్ర సంస్థ, మధ్యమధ్య, వివిధ దేశాల్లో తిరుగుబాట్లు జరగాలని ఆదేశాలు జారీ చేస్తుందనీ భావిస్తుంది. వాస్తవానికి, మా అసోసియేషన్, నాగరిక ప్రపంచానికి చెందిన వివిధ దేశాల్లోని అత్యంత పురోగాములైన శ్రామిక జనం మధ్య అంతర్జాతీయ బంధం తప్ప వేరేమీ కాదు. ఎక్కడైనా, ఏ రూపంలోనైనా, ఏ పరిస్థితుల్లోనైనా వర్గ పోరాటం తలెత్తితే మా అసోసియేషన్ సభ్యులు ముందు శ్రేణిలో నిలబడట మన్నది పరమ సహజమైన విషయం. అసోసియేషన్ పెరిగే నేల ఆధునిక సమాజమే. ఎంతగా ఊచకోతకు పూనుకొన్నా దాన్ని నిర్మూలించడం సాధ్యం కాదు. దాన్ని రూపుమాపాలంటే, ప్రభుత్వాలు శ్రమపై పెట్టుబడి నిరంకుశత్వాన్ని — తమ పరభాగ్యోప జీవన అస్తిత్వానికి మూలమైనదాన్ని రూపుమాపాలి.

తన కమ్యూన్‌తోబాటు, కార్మికుల పారిస్, ఒకానొక నూతన సమాజానికి ఉజ్వల వైతాళికుడుగా సదా సంస్మరింపబడుతుంది. దాని మృతవీరులు, కార్మికవర్గపు సువిశాల హృదయంలో ఆరాధ్యులుగా ప్రతిష్ఠింపబడ్డారు. దాని ఊరితీతదారులను చరిత్ర యింతకు ముందే శాశ్వతంగా శిలువవేసింది. వాళ్ల మతబోధకులు ఎన్ని ప్రార్థనలూ, జపతపాలూ జరిపినా వాళ్లను అందులోంచి విముక్తులను చెయ్యజాలరు.

256, హై హాల్‌బోర్న్,
లండన్, డబ్లియు. సి., మే 30,
1871

---

* అతడు రొబినే అయి ఉండాలి. — సం.

# వ్యాఖ్యలు

## I

"ఖైదీల బారు ఊరిహ్ అవెన్యూలో ఆపు చెయ్యబడింది. రోడ్డుకి ఎదురుగా వున్న కాలిబాటపై నాలుగైదు వరుసలుగా ఖైదీలు నిలబెట్టబడ్డారు. జనరల్ మార్క్విస్ డి గాలిఫే, అతని సహచరులూ గుర్రాలమీద నుంచి దిగి, ఎడమ పక్క నుంచి ఖైదీ బారుల ఇన్స్పెక్షను ప్రారంభించారు. జనరల్ మెల్లగా నడుస్తూ, ఖైదీలను పరిశీలనగా చూస్తూ, మధ్యమధ్య ఒకడి భుజం తడుతూనో లేక వెనక వరుసలోంచి వెలపలకి రమ్మంటూనో ముందుకు సాగాడు. అనేక సందర్భాల్లో, యింక ఎటువంటి మాటామంతీ లేకుండానే, ఆ విధంగా ఎంపిక చెయ్యబడిన వ్యక్తిని రోడ్డు మధ్యకి నడిపించుకెళ్లేవారు. త్వరలోనే అక్కడొక చిన్న బారు తయారైంది.... పొరపడేందుకు యిక్కడ బోలెడంత అవకాశముందన్న సంగతి స్పష్టం. గుర్రంపై అధిష్ఠించి వున్న ఒక ఆఫీసరు జనరల్ గాలిఫేకి, ఏదో ఒక ప్రత్యేక నేరం చేశారంటూ ఒక పురుషుడినీ, ఒక స్త్రీనీ చూపించాడు. ఆ స్త్రీ బారులోంచి ముందుకొచ్చి, మోకాళ్లపై వంగి, చేతులు జాపి, తను అమాయకురాలినంటూ ఆవేశంతో చెప్పకుంది. జనరల్ గాలిఫే కొంచెం సేపు ఊరుకున్నాడు, ఆటు తర్వాత నిర్లిప్తంగా జాలీ, దయవంటివేమీ లేకుండా 'మేడమ్, పారిస్‌లోని అన్ని నాటకశాలలనూ సందర్శించాను, మీ నటన నామీద పని చెయ్యదు' ('ce n'est pas la peine de jouer la comédie') అన్నాడు.... ఆ రోజున ఎవడైనా తన పక్క వానికన్న కంటికి నదరుగా మరింత పొడుగ్గా కనిపించినా, మరింత మురికోడుతూ కనిపించినా, మరికాస్త శుభ్రంగా కనిపించినా, మరింత వయస్కుడుగానో, మరింత వికారంగానో కనిపించినా ఆ రోజున వాడికి కీడుమూడినట్లే. ప్రత్యేకించి ఒక వ్యక్తి విష

యం నాకు మరింత కొట్టొచ్చినట్లు కనిపించింది. అతను చేసుకున్న పాపమల్లా అతని ముక్కు నలిగి వుండటమే. దానితో అతనికి ఈ యిహలోక బాధల నుంచి తొందరగా విముక్తి లభించింది.... ఆవిధంగా ఓ వందమందిని ఎంపిక చేసి, వాళ్లని కాల్చివెయ్యడానికి ఒక దళాన్ని దిగవిడిచి, బారు ముందుకు సాగిపోయింది. మరి కొద్ది క్షణాల తర్వాత వెనక నుంచి మాకు కాల్పులు ప్రారం భంకావడం విన్పించింది. ఆ కాల్పులు ఓ పావుగంటకి పైగా సాగాయి. ఆ శబ్దం మరేమీ కాదు, ఏ విచారణా లేకుండా క్షణాల్లో శిక్ష విధింపబడిన దౌర్భాగ్యుల మరణదండన అమలు మాత్రమే అది." — పారిస్ విలేకరి "Daily News,"[91] జూన్ 8వ తేదీ.

"రెండవ సామ్రాజ్యపు ఉన్మత్త విలాసతాండవాల్లో సిగ్గుమాలిన తన ప్రదర్శనల ద్వారా రోసిపోయిన తన భార్యకు ఉంపుడుకాడైన" ఈ గాలిఫే, యుద్ధకాలంలో ఫ్రెంచి "ఎన్సైన్ పిస్టల్"* అనే ఎగతాళి పేరుతో చలామణి అయ్యాడు.

"అభూత కల్పనలతో ఆసక్తి రేకెత్తించేదిగా కాక, కుదురైన పత్రికగా పేరొందిన "Temps"[92] సరిగా కాల్చబడని వ్యక్తులను గురించీ, కొన ఊపిరి యింకా పోకుండానే పూడ్చిపెట్టబడిన వ్యక్తులను గురించీ భయంకర మైన వార్తనొక దాన్ని ప్రచురించింది. సెయింట్ జాక్-లా-బుష్ చుట్టు వున్న పార్కులో పలువురు పూడ్చిపెట్టబడ్డారు. వారిలో కొందరు మరీ పైపైన కప్పెట్టబడ్డారు. పగటిపూట, రద్దీగా ఉండే వీధుల్లో రొద మూలంగా ఏమీ వినబడలేదు గాని, రాత్రి నిశ్శబ్దంలో చుట్టుపక్కల యిండ్లలో నివసించే వాళ్లకి దూరాన సన్నని మూల్గులతో నిద్రా భంగమైంది. ఉద యంపూట పిడికిలి బిగించిన హస్తం మట్టిలోంచి పైకి పొడుచుకొచ్చి కనిపించింది. దీని పర్యవసానంగా, పూడ్చిన వారిని పైకి తవ్వి తియ్యాలని ఆజ్ఞ ఇచ్చారు. వారిలో పలువురు సజీవంగానే పూడ్చిపెట్టబడ్డారనడంలో నాకు ఎటువంటి సందేహమూ లేదు. ఒక కేసు విషయంలో నేను ప్రమా ణంగా చెప్పగలను. వెండొమ్ చౌకులోని ఒక యింటి ఆవరణలో గడిచిన నెల 24వ తేదీన బ్రునేల్, అతని ప్రియురాలూ కాల్చి వెయ్యబడితే, వాళ్ల

* పిస్టల్ — షేక్స్పియర్ నాటకాలు "నాల్గవ హెన్రీ," "ఐదవ హెన్రీ," "విం డ్సర్లోని విలాసవతుల"లో ఒక పాత్ర, వంచకుడు, భీరువు, బడాయికోరు. — సం.

కళేబరాలు 27వ తేదీ మధ్యాహ్నందాకా అక్కడే వదిలెయ్యబడ్డాయి. శవాలను తొలగించే బృందం వచ్చే వరికి, ఆ స్త్రీ యింకా ప్రాణాలతో వుండటం చూసి, వాళ్ళు ఆమెను ఆస్పత్రిలో చేర్చారు. ఆమెకు నాలుగు గుళ్ళు తగిలినా, ఆమె యిప్పుడు ప్రమాదం గడిచి సజీవంగా ఉంది." — పారిస్ విలేకరి "Evening Standard"[93] జూన్ 8వ తేదీ.

## II

జూన్ 13వ తేదీ నాటి [లండన్] "Times"[65] పత్రికలో యీ క్రింది లేఖ వెలువడింది: [94]

### "The Times" సంపాదకునికి

"మహాశయా, 1871 జూన్ 6వ తేదీన, జూల్ ఫ్రావ్ అన్ని యూరపియన్ రాజ్యాలకూ ఒక సర్క్యులర్ పంపుతూ, అందులో, ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్స్ అసోసియేషన్‌కు[16] చెందినవారిని వేటాడాల్సిందిగా విజ్ఞప్తి చేశాడు. ఆ పత్ర స్వభావాన్నీ, బండారాన్నీ తెలుసుకోవడానికి యీ క్రింద యివ్వబడిన కొద్ది విశేషాలు తోడ్పడతాయి.

"మా నిబంధనావళి అవతారికలోనే ఇంటర్నేషనల్ '1864 సెప్టెంబరు 28వ, లండన్‌లో, లాంగ్ ఆక్‌లోని, సెయింట్ మార్టిన్ హాల్లో జరిగిన ఒక బహిరంగ సమావేశంలో' స్థాపించబడింది. అయితే, తన సొంత కారణాలు ఏమిటో ఏమోగాని, ఇంటర్నేషనల్ సంస్థాపన తేదీని, జూల్ ఫ్రావ్ 1862 వెనక్కి నెట్టాడు.

"మా సూత్రాలను వివరించేందుకు గాను, అతను తనకు అన్నీ తెలుసునన్నట్లు 'దాని (ఇంటర్నేషనల్‌యొక్క) 1869 మార్చి 25 నాటి కరపత్రాన్ని' ఉదహరించాడు. నిజానికి, అతను ఉదహరించేది ఏమిటి? ఇంటర్నేషనల్ కాని మరేదో సొసైటీ కరపత్రాన్ని ఉటంకించాడు. ఇటువంటి ఎత్తుగడ అతనికి కొత్త ఏమీ కాదు. అతనింకా యువ లాయరుగా ఉన్నప్పుడు, కాబె వేసిన ఒక పరువు నష్టం దావాలో "National" వార్తాపత్రిక[56] తరఫున అతను వాదించాడు. అప్పుడతను కాబే రచించిన పుస్తకాల మంచి భాగాలను చదివివినిపించినట్లు నటించి, వాటిలో తను చొప్పించిన వాక్యాలు చదివి వినిపించాడు — కోర్టులో కేసింకా నడుస్తూండగానే యీ బండారం బయట పడిపోయింది. కాబె దయతో విడిచిపెట్టాడు కనుక సరిపోయింది గాని, లేకుంటే జూల్ ఫ్రావ్ పారిస్

బార్ కౌన్సిలు నుంచి బహిష్కార శిక్షకు గురై యుండేవాడు. ఇంటర్నేషనల్ పత్రాలుగా అతను ఉదహరించిన పత్రాలన్నింట్లోనూ ఇంటర్నేషనల్‌కి చెందినది ఏ ఒక్కటీ లేదు. ఉదాహరణకు, అతనేమంటాడో చూడండి:

> "'1869 జూలైలో లండన్‌లో ఏర్పడిన జనరల్ కౌన్సిలు, అలయన్స్ తనను తాను నాస్తికమైనదిగా చెప్పుకొందని ప్రకటించింది.'

"జనరల్ కౌన్సిలు అటువంటి పత్రాన్ని ఎన్నడూ విడుదల చెయ్యలేదు. తద్విరుద్ధంగా, అలయన్స్‌యొక్క నిబంధనావళినే త్రోసిరాజనే పత్రాన్నొక దాన్ని* — జెనీవాలో L'Alliance de la Démocratie Socialiste ప్రచురించినదాన్ని జూల్ ఫ్రావ్ ఉదహరించాడు.

"ఒక మేరకు సామ్రాజ్యానికి వ్యతిరేకంగా కూడా ఉద్దేశింపబడినట్లు కనిపించే తన పర్క్యులర్ అంతట్లోనూ ఇంటర్నేషనల్‌కి వ్యతిరేకంగా, సామ్రాజ్యానికి చెందిన పబ్లిక్ ప్రాసిక్యూటర్లు వాడిన పోలీసు కట్టుకథలనే — ఆ సామ్రాజ్యపు న్యాయస్థానాల ముందే వీగిపోయిన వాటినే — జూల్ ఫ్రావ్ పునశ్చరణ చేశాడు.

"ఇంటర్నేషనల్ జనరల్ కౌన్సిలు గత యుద్ధంపై, తను చేసిన రెండు విజ్ఞప్తుల్లోనూ* (గత జూలై, సెప్టెంబరు మాసాల నాటి), ప్రష్యాకి వ్యతిరేకంగా ప్రష్యన్ దురాక్రమణ పథకాలను నిరసించిన సంగతి తెలిసినదే. అటు తర్వాత, జూల్ ఫ్రావ్ అంతరంగిక కార్యదర్శి అయిన రేట్లింజర్ నిష్ఫలంగానే అయినా, బిస్మార్కుకి వ్యతిరేకంగాను, జాతీయ రక్షణ ప్రభుత్వానికి అనుకూలంగాను జనరల్ కౌన్సిలుచేత ఒక ప్రదర్శనను లేవదీయించాల్సిందిగా జనరల్ కౌన్సిల్ సభ్యులు కొందరికి విజ్ఞప్తి చేశాడు. దానితోబాటే రిపబ్లిక్ సంగతి ప్రస్తావించ వద్దన్న ప్రత్యేక కోర్కెను సైతం అతను జోడించాడు. సెప్టెంబరు 9వ తేదీనాటి తన విజ్ఞప్తిలో, జనరల్ కౌన్సిలు, జూల్ ఫ్రావ్‌కీ, అతని సహచరులకీ వ్యతిరేకంగా పారిస్ కార్మికులను విస్పష్టంగా హెచ్చరించి వున్నప్పటికీ కూడా — జూల్ ఫ్రావ్ లండన్‌కు వస్తాడన్న సందర్భంగా ప్రదర్శన కోసం ఖచ్చితంగా సదుద్దేశంతోనే సన్నాహాలు చెయ్యబడ్డాయి.

"తన సంతొచ్చినప్పుడు, ఇంటర్నేషనల్ కనక, జూల్ ఫ్రావ్‌ని గురించి, కీ. శీ. మిల్యేర్ పారిస్‌లో ప్రకటించిన పత్రాలపైకి వాటి ప్రత్యేక దృష్టిని ఆకర్షిస్తూ యూరపి

---

* 38–43వ పేజీలు, 44–52వ పేజీలు చూడండి. — సం.

యన్ దేశాలన్నింటి మంత్రివర్గాలకూ, ఒక సర్క్యులర్ పంపితే, జూల్ ఫ్రావ్ ఏ మంటాడు?

"ఇట్లు, తమ విధేయుడు,

"జాన్ హేల్స్,

"ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్స్ అసోసియేషన్

జనరల్ కౌన్సిల్ కార్యదర్శి

"లండన్, జూన్ 12వ తేదీ, 1871."

పవిత్రమైన చాడీకోరు పాత్ర వహించే లండన్ "Spectator"[96] (జూన్ 24), "ఇంటర్నేషనల్ అసోసియేషనూ, దాని ఆశయాలూ" అన్న ఒక వ్యాసంలో, మిగిలిన అటువంటి అనేక జిత్తుల మధ్య, జూల్ ఫ్రావ్ ఉదహరించిన దానికన్న మరింత పూర్తిగా, అదీ కూడా, "Times"లో ఖండన ప్రకటన వెలువడిన పదకొండు రోజుల తర్వాత — పైన పేర్కొన్న "అలయన్స్" పత్రాన్ని ఇంటర్నేషనల్ పత్రంగా ఉదహరించింది. దీన్ని గురించి మేము ఎక్కువగా ఆశ్చర్యపడం. జెస్యూట్లందరిలోకీ పరమ దగుల్బాజీలు ప్రొటెస్టెంటు జెస్యూట్లనని, వెనకటికి ఫ్రెడెరిక్ ది గ్రేట్ అంటూండేవాడు.

1871 ఏప్రిల్ — మేలో
కార్ల్ మార్క్స్‌చేత రచింపబడింది

ఆదిలో ఇంగ్లీషు భాషలో, లండన్‌లో
1871 జూన్ మధ్యలో, చిన్న పుస్తకం రూపంలో
ప్రచురింపబడింది,
1871, 1872 సంవత్సరాల్లో,
యూరపియన్ దేశాల్లోను,
అమెరికాలోను క్రమంగా
యిది ప్రచురింపబడింది

# కార్ల్ మార్క్స్

# "ఫ్రాన్సులో అంతర్యుద్ధం" సంక్షిప్త పాఠాలు[97]

## "ఫ్రాన్సులో అంతర్యుద్ధం" మొదటి సంక్షిప్త పాఠం

### రక్షణ ప్రభుత్వం

యుద్ధారంభానికి నాలుగు నెలల తర్వాత, రక్షణ ప్రభుత్వం, బుజెన్‌వాల్ యుద్ధంలో,[98] తన యుద్ధ నైపుణ్యాన్ని ప్రదర్శించేందుకు అవకాశం కల్పించడం ద్వారా, పారిస్ నేషనల్ గార్డును తక్షాంతి చేసిన తర్వాత పారిస్‌ను లొంగుబాటుకు సంసిద్ధం చేసేందుకు తరుణం ఆసన్నమైందని ప్రభుత్వం భావించింది. పారిస్ మేయర్ల సమావేశంలో, లొంగుబాటుకు సంబంధించి, జూల్ ఫ్రావ్, తన సహచరులు మరికొందరి సమక్షంలో, వాళ్ల ఆమోదంతో, చివరకు త్రొషూ, తన "పథకం" బయటపెట్టాడు. అతను అక్షరాలా యిలా అన్నాడు:

> "సెప్టెంబరు 4వ తేదీ సాయంత్రమే, నా సహచరులు నన్నడిగిన మొట్టమొదటి ప్రశ్న యిదీ: పారిస్ ప్రష్యన్ సైన్యపు ముట్టడిని తట్టుకొని నిలబడే అవకాశం ఏమైనా ఉందా? లేదు అని చెప్పడానికి నేను ఎంత మాత్రమూ సంకోచించలేదు. ఇప్పుడిక్కడ వున్న నా సహచరులు కొందరు, నా మాటల్లోని వాస్తవాన్నీ, నా అభిప్రాయంలోని దృఢత్వాన్నీ ఆమోదిస్తారని తలుస్తాను. నేను సరిగా యిదే మాటల్లో వాళ్లకి ప్రస్తుత పరిస్థితుల్లో, ప్రష్యన్ సైన్యపు ముట్టడిని తట్టుకొని నిలబడాలన్న పారిస్ ప్రయత్నం కేవలం వెర్రితనమే అవుతుందని చెప్పాను. నిస్సందేహంగా అది వీరోచితమైన వెర్రితనం అవుతుంది, అంత మాత్రమే, అని కూడా నేను చెప్పాను.... ఘటనలు నా జోస్యం సరైందని రుజువుచేశాయి."

కాగా, త్రొషూ పథకం, రిపబ్లిక్ ప్రకటింపబడిన మొదటి రోజు నుండీ కూడా, శత్రువుకి పారిస్ లొంగుబాటూ, ఫ్రాన్సు లొంగుబాటే. వాస్తవానికి, అతను ప్రష్యన్ల

కమాండర్ ఇన్ ఛీఫ్ గంబెట్టాకి రాసిన ఒక లేఖలో జూల్ ఫ్రావ్ స్వయంగా చెప్పనే చెప్పాడు, అణచెయ్యాల్సిన శత్రువు ప్రష్యన్ సైనికుడు కాదు, పారిస్ (విప్లవవాది) "ప్రజావక్త" అని. అందుకని రక్షణ ప్రభుత్వం ప్రజలకు చేసిన గప్పాలతో కూడిన వాగ్దానాలన్నీ కూడా పచ్చి అబద్ధాలు. పారిస్ రక్షణను బోనపార్టిస్టు జనరల్సుకు అప్పగించడం ద్వారా, నేషనల్ గార్డ్సును అవ్యవస్థితం చెయ్యడం ద్వారా, జూల్ ఫెర్రీ దుష్పరిపాలనలో కరువును సృష్టించడం ద్వారా, అది తన "పథకాన్ని" క్రమబద్ధంగా అమలు జరిపింది. కమ్యూన్‌చేత, యీ దేశద్రోహులను పదవీ భ్రష్టుంచేయించడానికి, పారిస్ కార్మికులు అక్టోబరు 5న, అక్టోబరు 31న చేసిన ప్రయత్నాలూ, తదితర ప్రయత్నాలూ, ప్రష్యన్లతో కుట్రలన్న పేరుతో అణచివెయ్యబడ్డాయి![38] లొంగుబాటు తదనంతరం యీ ముసుగు కాస్తా విసర్జింపబడింది (ప్రక్కకు విసిరెయ్యబడింది). బిస్మార్కు దయాధర్మ బిచ్చమా అని capitulards[39] (లొంగుబాటుదారులు) ప్రభుత్వాధినేతలయ్యారు. అతని ఖైదీలు కనుక, వారతనితో సాధారణ యుద్ధ విరమణ ఒప్పందం చేసుకొన్నారు. ఆ ఒప్పందపు షరతులు ఫ్రాన్సును నిరాయుధం చేసి, యిక ముందెటువంటి ప్రతిఘటనా సాధ్యం కాకుండా చేశాయి. బోర్డోలో రిపబ్లిక్ ప్రభుత్వంగా పునఃప్రతిష్ఠింపబడిన యీ లొంగుబాటుదారులే, తమ మాజీ రాయబారి అయిన త్యేర్ ద్వారా, తమ విదేశాంగ మంత్రి అయిన జూల్ ఫ్రావ్ ద్వారా, జాతీయ అసెంబ్లీ అనబడే దాని మెజారిటీ పేర, పారిస్ తిరుగుబాటుకు చాలా ముందుగానే, పారిస్‌ను నిరాయుధం చేసి, ఆక్రమించుకొనమనీ, ఫ్రాన్సు నుండి బెర్లిన్‌కి తిరిగి వచ్చాక, ఫ్రాంక్‌ఫుర్ట్‌లోని తన ఆరాధకులతో ఎగతాళి స్వరంలో సాక్షాత్తూ బిస్మార్కు అన్నట్లు "దాని canaille*"ను అణచి పారెయ్యమనీ బిస్మార్కును మనఃపూర్తిగా అర్థించారు. ప్రష్యన్లచేత యీ పారిస్ ఆక్రమణే — రక్షణ ప్రభుత్వ "పథకం"యొక్క తుది అభ్యర్థన. వెర్సైల్స్‌లో ప్రతిష్ఠింపబడిన నాటి నుండీ, వీళ్లే సిగ్గుమాలిన లేకి పద్ధతిలో ప్రష్యా సాయుధ జోక్యం కోసం, కాళ్లావేళ్లాపడి దేవురించిన తీరు, అందుకోసం ప్రష్యన్ పాలకులకు స్తోత్ర పాఠాలు వల్లించిన తీరు యూరప్‌లోని కిరాయి పత్రికలను సైతం మూగవోయేటట్లు చేసింది. పారిస్ నేషనల్ గార్డ్సు వీరోచిత కృత్యాలు, వాళ్ళ యికనెంత మాత్రమూ లొంగుబాటుదారుల క్రింద కాక, వారికి వ్యతిరేకంగా పోరాడుతున్న కారణంగా, అత్యంత సంశయాత్మకులు సైతం, ట్రొషూ, జూల్ ఫ్రావ్ ప్రభృతులకు "ద్రోహి" అన్న పదం తగిలించాల్సిన పరిస్థితిలో పడ్డారు. కమ్యూన్ చేతికి చిక్కిన పత్రాలు, చివరకు వాళ్ల దేశ ద్రోహానికి సంబంధించిన, న్యాయ సంబంధమైన సాక్ష్యాన్ని సమకూర్చాయి. ఈ పత్రాల్లో బోనపార్టిస్టు ఖడ్గ సైనికుల ఉత్తరాలు

---

* అలగా మూక. — సం.

కూడా వున్నాయి. త్రొషూ "పథకం" అమలుకు సంబంధించిన రహస్య సమాచారం వెల్లడింపబడిన యీ దగుల్బాజీలు, తమ లేఖల్లో తమ "పారిస్ రక్షణ పట్ల" తామే జోక్సు విసురుకొని, ఎగతాళికి పూనుకొన్నారు (ఉదాహరణకు, కమ్యూన్‌యొక్క "Journal Officiel"చే ప్రచురింపబడిన పారిస్ రక్షణ సైన్యానికి చెందిన ఫిరంగి దళం సుప్రీమ్ కమాండరూ, గ్రాండ్ క్రాస్ ఆఫ్ ది లీజియన్ ఆఫ్ ఆనర్ బిరుదాంకితుడూ అయిన అల్ఫోన్స్ సిమొన్ గియో, ఫిరంగి దళం జనరల్ అయిన సుసాన్‌కి రాసిన లేఖ చూడండి).

అందుకని, యిప్పుడు వెర్సేల్స్ ప్రభుత్వంగా ఏర్పడ్డ వ్యక్తులకు శిక్ష విధింపబడిన ద్రోహుల గతి పట్టకుండా ఉండాలంటే — అంతర్యుద్ధం, రిపబ్లిక్ వినాశం, ప్రష్యన్ బయనెట్ల పరిరక్షణలో రాజరిక పునరుద్ధరణ — వీటి ద్వారా మాత్రమే సాధ్యమని స్పష్టం.

కాసైతే సామ్రాజ్యానికి చెందిన మనుషులకూ, అలాగే ఆ గడ్డమీదా, ఆ వాతావరణంలోనూ ప్రజల కుహనా ప్రవక్తలుగా పెరగగల వ్యక్తులకు మాత్రమే సహజంగా యిది వర్తిస్తుంది — విజయవంతమైన రిపబ్లిక్, వాళ్లను ద్రోహులుగా ఖండించడమే కాకుండా, వాళ్లను సామాన్యమైన నేరస్థులుగా క్రిమినల్ కోర్టుకి అప్పగించాల్సి వుంటుంది. త్యేర్ నాయకత్వం క్రింద రక్షణ ప్రభుత్వంలో వున్న మనుషులనే — జూల్ ఫావ్, ఎర్నెస్ట్ పికార్డ్, జూల్ ఫెరీలనే — చూడండి!

మిల్యేర్ అనే జాతీయ అసెంబ్లీ ప్రతినిధి, 20 ఏళ్ల ప్రామాణికమైన పలు కోర్టు పత్రాలను ప్రచురించాడు. జూల్ ఫావ్ అల్జీయర్స్‌లోని ఒక త్రాగుబోతు భార్యతో అక్రమ సంబంధం పెట్టుకొని అనేక సంవత్సరాల కాలంలో దఫదఫాలుగా దుస్సాహసంతో దొంగ పత్రాలు సృష్టించి, తన వ్యభిచారం ద్వారా కలిగిన బిడ్డల పేర, పెద్ద వారసత్వాన్ని కాజేశాడు, తద్వారా అతగాడు ధనికుడయ్యాడు, చట్టబద్ధమైన వారసులు కోర్టులో వేసిన దావాలో, బోనపార్టిస్టు కోర్టుల కుమ్మక్కుతో, తన నేరం బయటపడకుండా తప్పించుకున్నాడు. ఈవిధంగా, కుటుంబం, మతం, ఆస్తి, భద్రతలకు సంబంధించి ధర్మసన్నాల బాకా అయిన యీ జూల్ ఫావ్, Code pénal* పరిధిలో ఎన్నడో పడ్డాడు. నిజాయితీ గల ఏ ప్రభుత్వం క్రిందనైనా అతను యావజ్జీవిత కఠిన కారాగార శిక్షను తప్పించుకో గలిగి వుండేవాడు కాడు.

ఎర్నెస్ట్ పికార్డ్, ప్రస్తుతం వెర్సేల్స్ ప్రభుత్వ హోమ్‌మంత్రి, లూయీ బోనపార్ట్‌చేత పదవికి నియమింపచేసుకోవడంలో విఫలుడైన తర్వాత, సెప్టెంబరు 4న,

* శిక్షాస్మృతి. — సం.

తనను తాను రక్షణ ప్రభుత్వ హోమ్‌మంత్రిగా* నియమించుకున్నాడు. ఈ ఎర్నెస్ట్ పికార్డు ఆర్థర్ పికార్డు అనే వ్యక్తికి సోదరుడు. జూల్ ఫ్రావ్ అండ్ కంపెనీతో కలిసి, ప్రబుద్ధుడైన తన యీ సోదరుడిని, సీన్-ఎట్-ఉవాజ్‌లో శాసన సభకి అభ్యర్థిగా ప్రతిపాదించేటంతటి సాహసానికి పూనుకొన్నప్పుడు, సామ్రాజ్యవాద ప్రభుత్వం రెండు పత్రాలు ప్రచురించింది. వాటిలో ఒకటి, యీ ఆర్థర్ పికార్డ్ "escroc"**గా స్టాక్ ఎక్స్చేంజి లోంచి తొలగింపబడాడని పేర్కొనే పోలీసు ప్రిఫెక్టు (1867 జూలై 31వ తేదీ) నివేదిక. రెండోది, 1868 డిసెంబరు 11 నాటి పత్రం. దీని మేరకు, పాలెస్ట్రో రోడ్డు, నంబరు 5లోని "Société Générale"[41] శాఖల్లో ఒక దానికి మేనేజరుగా ఉండగా, తను ఒప్పుకున్న దాన్ని బట్టే ఈ ఆర్థరు పికార్డ్ 3,00,000 ఫ్రాంకులను కైంకర్యం చేశాడు. అంతటి ఘనుడైన ఆర్థర్‌ని, ఎర్నెస్ట్ "Electeur libre"[42] అనే తన పత్రికకి ప్రధాన సంపాదకుడుగా నియమించాడు. సామ్రాజ్యం క్రింద ప్రారంభమైన యీ పత్రిక యీనాటికీ కొనసాగుతోంది, ఈ పత్రికలో రిపబ్లికన్లు నిత్యము "దొంగలు, బందిపోట్లు, partageux"***గా దూషింపబడుతూ వుంటారు. అంతేకాక, ఎర్నెస్ట్ "రక్షణ" ప్రభుత్వంలో హోమ్‌మంత్రి అయినప్పుడు ఆర్థర్ని, హోమ్ కార్యాలయానికీ స్టాక్ ఎక్స్చేంజికీ మధ్య ఆర్థిక దళారీగా, తనకు అప్పగింపబడిన ప్రభుత్వ రహస్యాల నక్కుడ విక్రయించేందుకు, ఉపయోగించాడు.

ఎర్నెస్ట్‌కీ ఆర్థర్‌కీ మధ్య సాగిన "ఆర్థిక" పరమైన యావత్తు ఉత్తరప్రత్యుత్తరాలూ కమ్యూన్ చేతుల్లో పడ్డాయి. మొసలి కన్నీళ్లు కార్చే జూల్ ఫ్రావ్‌లాగే, వెర్సైల్స్ ప్రభుత్వపు జో మిల్లర్ అనదగిన ఎర్నెస్ట్ పికార్డ్, శిక్షాస్మృతికీ, కఠిన కారాగార శిక్షకీ తగినవాడే!

ఈ మూర్తిత్రయంలో మూడోవాడు జూల్ ఫెర్రీ. సెప్టెంబరు 4వ తేదీకి ముందు చేతిలో చిల్లర పెన్నీ కూడా లేని యీ బారిస్టరు పారిస్ కరువును సృష్టించడంతో తృప్తి చెందకుండా, దాన్నుంచి పెద్ద సంపదను కూడబెట్టడంలో సఫలుడయ్యాడు. పారిస్ ముట్టడి కాలంలో తను చేసిన రాజ్యధనాపహరణానికి గాను జవాబు చెప్పకో వలసిన రోజు వస్తే, అతను శిక్షను ఎదుర్కోక తప్పదు.

---

* "ఫ్రాన్సులో అంతర్యుద్ధం" తుది పాఠంలో మార్క్స్ సవరణచేశాడు: జాతీయ రక్షణ ప్రభుత్వంలో ఎర్నెస్ట్ పికార్డ్ ఆర్థిక మంత్రిగా వున్నాడు. (57వ పేజీ చూడండి.) — సం.

** దగాకోరు. — సం.

*** అన్ని వస్తువులనూ, సమస్త సంపదనూ పంచుకోవాలని కోరేవారు. — సం.

రాజరిక ప్రభుత్వంలో మాత్రమే కారాగార శిక్ష నుంచి తప్పించుకోగల వీళ్ళ, ప్రష్యన్ బయనెట్ల రక్షణ కలిగిన వీళ్ళ, అంతర్యుద్ధమనే గడబిడలో మాత్రమే తమ ticket-of-leave (విడుదల సర్టిఫికెట్లు) సంపాదించుకోగల వీళ్ళ, యీ దుస్సాహసిక దుర్మార్గులు త్యేర్‌చేత వెంటనే ఎంచుకోబడ్డారన్నా, "భూస్వాముల సభ"చేత వీళ్ళ విప్లవ ప్రతిఘాతానికి బాగా ఆధారపడదగిన సాధనాలుగా స్వీకరింపబడ్డారన్నా ఆశ్చర్యపడాల్సిందేమీ లేదు!

ఏప్రిల్ మొదట్లో పట్టుబడిన నేషనల్ గార్డులు, వెర్సేల్స్‌లో పియెట్రీయొక్క "అమాయిక గొర్రెల"చేతా, వెర్సేల్స్ మూకచేతా దారుణ హింసాకాండకు గురిచెయ్యబడినప్పుడు, "ప్రిఫెక్టర్ బాల్కనీ నుంచి మదాం త్యేరూ, మదాం జూల్ ఫ్రావ్ నుంచి ఆరోగ్యంగా ఉత్సాహంగా ఉన్న యింకా పలువురు మహిళలూ" ఆ బీభత్స దృశ్యాన్ని మహోత్సాహంగా తిలకిస్తూండగా ఎర్నెస్ట్ పికార్డ్, "తన లాగు జేబుల్లో చేతులు పెట్టుకొని, ఖైదీల ఒక గుంపు దగ్గర్నుంచి మరో గుంపు దగ్గరకి హాస్యోక్తులాడుతూ నడిచాడంటే" ఆశ్చర్య పడాల్సిందేమీ లేదు. ఫ్రాన్సుకి చెందిన ఒక భాగం విజేతల యినప పాదాలక్రింద బాధతో గిలగిలలాడుతూంటే, ఫ్రాన్సుయొక్క శిరస్సూ, హృదయమూ అయిన పారిస్ ఆంతరంగిక దేశద్రోహంకు వ్యతిరేకంగా ఆత్మరక్షణ క్రమంలో నిత్యమూ అత్యుత్కృష్టమైన తన రక్తాన్ని ఏరులుగా ధారపోస్తూంటే... త్యేర్‌లు, ఫ్రావ్‌లు, ఆ బాపతు వాళ్ళూ పద్నాల్గవ లూయీ **రాజభవనంలో** విందుల్లో త్రాగి తందనాలాడుతున్నారు. రువాన్ నుండి తిరిగివచ్చిన సందర్భంగా (అక్కడికి అతను పంపబడినది ప్రష్యన్లతో—వాళ్లని తెసపొగడి—కుట్ర చెయ్యడానికి) జూల్ ఫ్రావ్ గౌరవార్థం త్యేర్ యిచ్చిన ఘనమైన విందు యిటువంటిదే. **అది, తప్పించుకు తిరుగుతున్న నేరస్థుల అమానుష ఉన్మత్త** విలాసతాండవం తప్ప వేరేమీ కాదు!

---

రక్షణ ప్రభుత్వం మొదట్లో తమ విదేశ రాయబారి అయిన త్యేర్‌ను యూరప్ రాజాస్థానాలన్నింటికీ, ప్రష్యా కనుక ఫ్రాన్సుకి వ్యతిరేకంగా ఐక్యం చేసుకుంటే ఫ్రాన్సుని తాము రాజుకి కట్టబెడతామన్న షరతులో అభ్యర్థనలతో పంపారంటే; ఆటు తర్వాత, ఆతగాడిని వాళ్ళ ఫ్రెంచి రాష్ట్రాలన్నింటికీ, అక్కడ châteaux*తో కుట్ర చేసి, సార్వజనీన ఎన్నికలకు రహస్యంగా సంసిద్ధం చేసేందుకు, దీనికితోడు ఫ్రాన్సు లొంగుబాటును కూడా పూర్తిచేసి ఫ్రాన్సును విభ్రాంత మొనర్చేందుకు, యాత్రకు పంపారంటే — త్యేర్ అందుకు బదులుగా, వాళ్లని తన మంత్రులుమా, ఉన్నతోద్యోగులుమా చేసుకున్నాడు. వాళ్ళ ఆధారపడదగిన మనుషులు.

---

* కోటలు, అంటే బడా భూస్వాములు. — సం.

త్యేర్ చర్యల్లో ఆశ్చర్యం కొలిపేది ఒకటి వుంది, పారిస్ విప్లవాన్ని అవాలోచితంగా అతనెందుకు అంత త్వరితపరచాడా అన్నదే అది. తన "భూస్వాముల సభ"యొక్క రిపబ్లికన్ వ్యతిరేకతా ప్రదర్శనల ద్వారా, పారిస్ శిరచ్ఛేదం చేస్తాననీ, దాని రాజధాని హోదాను తొలగిస్తాననీ బెదరింపుల ద్వారా, పారిస్ వాణిజ్య వర్గాలను దివాళాలో ముంచే బిల్లుల échéances*కి సంబంధించిన మార్చి 10వ తేదీ నాటి డుఫోర్ (త్యేర్ న్యాయ శాఖ మంత్రి) చట్టం ద్వారా, అర్జీయనిన్ను రాయబారుల నియామకం ద్వారా, అసెంబ్లీని వెర్సేల్స్‌కి తరలించడం ద్వారా, వార్తాపత్రికలపై కొత్త పన్నును విధించడం ద్వారా, రిపబ్లికన్ పారిస్ పత్రికలను జప్తుచెయ్యడం ద్వారా, పలికావొచేత ప్రకటింపబడి, సెప్టెంబరు 4న సామ్రాజ్యవాద ప్రభుత్వ పతనంతో రద్దయిన ముట్టడి స్థితిని పున రుద్ధరించడం ద్వారా, décembriseur,[58] మాజీ సెనేటరు అయిన వినువాను పారిస్‌కి గవర్నరుని చెయ్యడం ద్వారా, సామ్రాజ్యవాద జెండార్మ్ అయిన వలంటేన్‌ని పోలీసు ప్రిఫెక్టుని చెయ్యడం ద్వారా, జెస్యూట్ జనరల్ అయిన ఒరేల్ డి పలడీన్‌ని పారిస్ నేషనల్ గార్డుకి కమాండర్ ఇన్ ఛీఫ్‌గా చెయ్యడం ద్వారా — వీటన్నిటి ద్వారా పారిస్‌ని రెచ్చగొట్టడంతో తృప్తిపడకుండా, అతడు తక్కువ బలగాలతో అంతర్యుద్ధాన్ని ప్రారంభించాడు. అంతర్యుద్ధం మాంమార్ట్‌ర్ కొండపై వినువా దాడితో ప్రారంభమైంది. నేషనల్ గార్డుల ఫిరంగులను — పారిస్ లొంగుబాటు కన్వెన్షన్ ద్వారా వారికి దఖలు పడిన ఆ ఫిరంగులు వారి ఆస్తే — వశం చేసుకోవడం ద్వారా పారిస్‌ని నిరాయుధంచెయ్యడమే యీ దాడి లక్ష్యం.

ఇంతటి విపరీతమైన తొందర d'en finir** ఎందుకు, ఎక్కడి నుంచి వచ్చినట్లు? పారిస్‌ను నిరాయుధం చెయ్యడం, అణచివెయ్యడం — యిదే రాజరిక విప్లవ ప్రతిఘాతానికి ప్రథమ షరతనడంలో సందేహం లేదు. కానైతే, త్యేర్‌వంటి సూక్ష్మ బుద్ధి గల పన్నాగాల కర్త తగినంత సన్నాహం లేకుండా, మరీ బొత్తిగా తక్కువ సాధన సంపత్తితో, యింతటి క్లిష్ట వ్యవహారంలో వైఫల్యానికి సైతం తెగబడి దిగాడంటే, దీని వెనక ఏదో పెద్ద ఎత్తుగడ ఉండే ఉండాలి. అది యిది. తన ఆర్థిక మంత్రి పుయ్యే-కర్టేయ ద్వారా, 200 కోట్ల ఫ్రాంకుల రుణం వెన్వెంటనే చెల్లింపబడేలా, మరికొన్ని వందల కోట్లు తర్వాత కొన్ని విరామాల్లో చెల్లింపబడేలా త్యేర్ ఒక ఒప్పందం కుదుర్చు కున్నాడు. ఈ రుణ ఒప్పందంలో, త్యేర్, జూల్ ఫ్రావ్, ఎర్నెస్ట్ పికార్డ్, జూల్ సిమొన్, పుయ్యే-కర్టేయ వంటి మహా పౌరులకు దఖలుపడే పెద్ద pot-de-vin (మామూలు)

---

* చెల్లించే కాలం. — సం.

** పని ముగించెయ్యడానికి. — సం.

కూడా కేటాయింపబడింది. అయితే యీ బేరంలో ఒక్కటే చిక్కుంది. ఈ ఒప్పందాన్ని నిర్దిష్టంగా ఒప్పుకొనే ముందు కంట్రాక్టర్లు — పారిస్‌ని స్తబ్దపరచడం — అనే ఒక హామీ కోరారు. త్యేర్ దుస్సాహసిక చర్యలకు కారణమదే. పారిస్ శ్రమజీవుల పట్ల యింతటి ఆటవిక ద్వేషం, అది అతని యీ ఘనకార్యానికి భంగం కలిగించేదైనా కూడా యిందుకే.

జూల్ ఫ్రావ్‌లు, పికార్డులు, మొదలైన వాళ్లకు సంబంధించినంతవరకు, యిటువంటి లంచగొండి వ్యవహారంలో సహకారులుగా ఉండదగిన యోగ్యతలన్నీ వాళ్ల కున్నాయన్న సంగతి యింతకు ముందే వివరించాం. ఇక త్యేర్ అంటారా, లూయీ ఫిలిప్ క్రింద మంత్రిగా ఉన్న రెండు సందర్భాల్లోనూ అతను 20 లక్షల ఫ్రాంకులు చేసుకున్నాడన్న సంగతి అందరికీ తెలిసినదే. పోతే, అతను ప్రధానిగా వున్న కాలంలో (1840 మార్చి నాటి[నుండి]), స్టాక్ ఎక్స్చేంజి ధనాపహరణల విషయంలో ప్రతినిధుల సభ చేత అధిక్షేపించబడ్డాడు. దానికి అతను చెప్పుకున్న సంజాయిషీ కన్నీళ్లు పెట్టుకోవడమే. జూల్ ఫ్రావ్ లాగా, సుప్రసిద్ధ నటుడు ఫ్రెడరిక్ లెమేట్ర్ లాగా ధారాళంగా కన్నీరు కార్చ డంలో యితగాడు నేర్పరి. యుద్ధం మూలంగా ఫ్రాన్సు ఎదుర్కొంటున్న ఆర్థిక వినా శం నుంచి దాన్ని కాపాడటానికి త్యేర్ తీసుకున్న తొలి చర్య ఏమిటయ్యా అంటే, తనకు 30 లక్షల ఫ్రాంకుల వార్షిక జీతాన్ని కుదుర్చుకోవడం. శాసన సభలోని త్యేరూ, అతని ముఠా సార్వజనిక ఓటింగు హక్కును రద్దుచేసేందుకు అనుమతించినందుకుగాను[100] లూయీ బోనపార్ట్ పొందిన మొత్తంతో యిది సరిగా సమానం. 1869లో తన పారిస్ ఓటర్లకు, తనకు ఓట్లువేస్తే "పొదుపైన రిపబ్లిక్"ను ఏర్పాటు చేస్తానంటూ త్యేర్ వాగ్దానాలు కురిపించాడు. త్యేర్‌కి యిలా 30 లక్షల ఫ్రాంకులు దక్షిణ పడటమన్నది ఆ పొదుపైన రిపబ్లిక్ ఎలా ఉండబోతుందన్న దానికి వాచవి అన్నమాట. ఇక పుయ్యే-కర్టేయ్. ఇతగాడు రువాన్ పట్టణంలో తొలి పారిశ్రామికుడు. 1869లో, ఇంగ్లీషు మార్కెట్టును "జయించేందు" కోసం అని చెప్పి కార్మికుల వేతనాల్లో సాధారణ కోత ప్రకటించిన తొలి మిల్లు యజమానుల గూడుపుఠాణీకి యితగాడు నాయకుడు. అయితే, యీ పన్నాగాన్ని ఇంటర్నేషనల్ భగ్నంచేసింది.[101] పుయ్యే-కర్టేయ్ మామూలుగా అయితే సామ్రాజ్యాన్ని మహోత్సాహంగా బలపరచేవాడే, ఒక విధంగా దాన్ని దాసాను దాసుడులా మోసేసుకొచ్చే వాడే. కాని, తన వృత్తి ప్రయోజనాలకు భంగం కల్పించే ఇంగ్లండుతో వాణిజ్య ఒప్పందాన్ని[84] అది చేసుకోవడం ఒక్కటి మాత్రం అతనికి గిట్టలేదు. త్యేర్ ఆర్థిక మంత్రిగా ఆ "ఏహ్యమైన" ఒప్పందాన్ని నిరసించడం, తన సొంత పరిశ్రమకు పాత రక్షణ సుంకాల పునరుద్ధరణావశ్యకతను ప్రకటించడమే అతను తీసుకున్న తొలి చర్య. ఈ సందర్భంలో వాటి పునరుద్ధరణకు ఏ అంతర్జాతీయ ఒడంబడికా అడ్డురా దన్న సాకుతో, పునరుద్ధరింపబడిన పాత రక్షణ సుంకాల ద్వారా ఆల్సేస్‌ను దెబ్బతియ్య

ప్రయత్నించడమే అతని దేశభక్తియుతమైన రెండవ చర్య. ఈ చాణక్యపు ఎత్తుగడతో రువాన్‌లోని అతని పరిశ్రమకు ముల్‌హౌసెన్‌లోని ప్రత్యర్థి పరిశ్రమల ప్రమాదకరమైన పోటీ పీడ తప్పిపోతుంది. తన అల్లుడైన రోష్-లంబేర్‌కు, లువార్ పన్నుల వసూలు ప్రధానాధికారి పదవిని బహుమతిగా కట్టబెట్టడమన్నది అతని తుది చర్య. అధికారంలో వున్న బూర్జువావర్గం ఒళ్లో పడే కొల్లసొమ్ముమల్లె వంటిది ఈ పదవి. ప్రజా సేవ పేర సొమ్ముచేసుకొనే యీ పదవిని తన కొడుక్కి కట్టబెట్టినందుకు, సామ్రాజ్యవాద ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా వున్న మాన్‌ను యిదే పుయ్యే-కర్ట్యే తప్పుపట్టిన విషయం గమనార్హం. ఈవిధంగా, పైన పేర్కొన్న వేరవేరాన్ని కుదుర్చుకోడానికి పుయ్యే-కర్ట్యే సరిగా సరిపోయే వ్యక్తి.

---

మార్చి 30వ, "Rappel."[102] పారిస్ మాజీ మేయర్ అయిన జూల్ ఫెర్రీ, పారిస్‌కు పన్ను బకాయిల వసూళ్లను వెంటనే నిలుపుచెయ్యాల్సిందిగా, పన్నులు వసూలు చేసే అధికార్లకు మార్చి 28వ ఒక సర్క్యులర్ జారీ చేశాడు.

---

చిల్లర మల్లర ప్రభుత్వ దగాలు — హీన స్వభావం... పడలిపోతున్న నీతి విజాయితీలు... నిరంతరాయంగా పార్లమెంటరీ దుష్ప్రవర్తనాగాలు పన్నే ప్రబుద్ధుడు... నీచమైన ఎత్తులు జిత్తులు... లిబరలిజానికి, "libertés nécessaires"*కి, సంబంధించిన ధర్మసూత్రాల వల్లెవేత...... అపజయావకాశాలకు గట్టి కారణాలు వెతకడంలో... ఆత్రుతతో కూడిన వినమ్రత... అందుకు యుక్తియుక్తమైన బలమైన వాదనలు... పరమ నైచ్యతలో ఒక రకమైన శూరత్వం... అదృష్టవంతమైన పార్లమెంటరీ కుతంత్రాలు...

---

ఇ. పికార్డ్, ముట్టడి కాలమంతట్లోనూ మన సేనల ఓటమిపైన లాభసాటి చట్టా వ్యాపారం చేసిన దగాకోరు.

---

ఉచకోత, దేశద్రోహం, దహనకాండ, హత్య, అభాండాలు, అబద్ధాలు.

---

* అవసరమైన స్వేచ్ఛలు. — సం.

మేయర్ను మొదలైన వారి సమావేశంలో (ఏప్రిల్ 25) తానిచ్చిన ఉపన్యాసంలో థ్యేర్ స్వయంగా యిలా అన్నాడు:

> "క్లిమాన్ టొమా లెకాంట్‌ల హంతకులు" పిడికెడుమంది నేరస్తులు — "చేతల ద్వారా గాని, కుట్ర పన్నడం ద్వారా గాని యీ నేరాలలో సహకారులుగా ఉన్నట్లు సహేతుకంగా పరిగణింపదగిన వారు, అంటే, అత్యల్ప సంఖ్య వ్యక్తులు."

## డుఫార్

రాష్ట్రాలలో పత్రికలపై కేసులు పెట్టడం ద్వారా డుఫార్ పారిస్‌ను అణచెయ్యాలని కోరుతున్నాడు. "రాజీ పడాల"ని కోరుతున్న పాపానికి పత్రికలను కోర్టులముందు కీడ్వడం ఘాతుకం.

థ్యేర్ దుష్ట వన్నాగంలో డుఫార్ పెద్ద పాత్ర వహిస్తున్నాడు. మార్చి 10వ తేదీనాటి తన చట్టం ద్వారా బకాయిపడ్డ వాణిజ్యవేత్తలందర్నీ అతను తట్టిలేపాడు. పారిస్ ఇళ్ల అద్దెలకు సంబంధించిన తన చట్టం ద్వారా అతను పారిస్ సంతటినీ భయభ్రాంతం చేశాడు. ఫ్రాన్సు గౌరవాన్ని కాపాడి, బిస్మార్కుకి లొంగకుండా దాన్ని ఆరు మాసాలు నిలబెట్టిన పారిస్‌ను శిక్షించడమే యీ రెండు చట్టాల పరమోద్దేశం. డుఫార్ అర్లియనిస్టు, పార్లమెంటరీ అర్థంలో "లిబరల్." తత్పర్యవసానంగా అతనెప్పుడూ అణచివేతకు, ముట్టడి స్థితికి సంబంధించిన మంత్రిగా ఉంటూ వచ్చాడు.

రిపబ్లికన్ పార్టీ[103]యొక్క dernière prise d'armes* ఓటమి తర్వాత, 1839 మే 13న అతను తన తొలి మంత్రి పదవిని స్వీకరించాడు. అందుకని అతను, ఆనాటి జూలై ప్రభుత్వాన్ని నిర్దయగా అణచివేసిన మంత్రి అన్నమాట.

(1848) అక్టోబరు 29న ముట్టడి స్థితిని ఎత్తివెయ్యాల్సి వచ్చిన కవేన్యాక్ 1849 జూన్ 2న, తన మంత్రి వర్గంలోకి లూయీ ఫిలిప్ ప్రభుత్వానికి చెందిన యిద్దరు మంత్రులను (డుఫార్‌ను ఆంతరంగిక శాఖకు, వివ్యేన్‌ను[104]) చేర్చుకున్నాడు. హామీలు కోరిన పువాట్యే రోడ్డు కమిటీ (థ్యేర్)[105] డిమాండుపై వాళ్లని అతను మంత్రి పదవుల్లో నియమించాడు. తద్వారా, రాబోయే అధ్యక్ష ఎన్నికల్లో అతను, రాజరికవాదుల తోడ్పాటును సమకూర్చుకోవాలనుకున్నాడు. కవేన్యాక్ అభ్యర్థిత్వాన్ని సంపాదించేందు కోసం డుఫార్, చట్టానికి పరమ విరుద్ధమైన పద్ధతులు అవలంబించాడు. బెదరింపులూ

---

* తుది సాయుధ తిరుగుబాటు. — సం.

ఎన్నికలో అవినీతి యింత పెద్ద స్థాయిలో మరెన్నడూ జరగలేదు. దుఫార్ యితర అభ్యర్థులకు, ప్రత్యేకించి లూయీ బోనపార్ట్‌కి, వ్యతిరేకంగా పరువు తీసే అనేక కరపత్రాలు ప్రచురించి ఫ్రాన్సు అంతటా వెదజల్లాడు. అయితేనేం, అతను తర్వాత లూయీ బోనపార్ట్ మంత్రి కావడానికిది అడ్డంకి కాలేదు. 1849 జూన్ 13న ప్రకటింపబడిన ముట్టడిస్థితి ప్రభుత్వంలో దుఫార్ మరోసారి మంత్రి అయ్యాడు. రోమ్, మొదలైన నగరాలపై ఫ్రెంచి సైన్యపు బాంబార్డుమెంటుకి వ్యతిరేకంగా నేషనల్ గార్డు జరిపిన నిరసన ప్రదర్శన సందర్భంగా ఈ ముట్టడి స్థితి ప్రవేశపెట్టబడింది. ఇప్పుడు వెర్సేల్స్‌లో (సీన్-ఎట్-ఉవాజ్ రాష్ట్రం కోసం) ప్రకటింపబడిన ముట్టడి స్థితి సందర్భంగా అతను మరల మంత్రి అయ్యాడు. ఏ రాష్ట్రమైనా సరే ముట్టడిస్థితిలో ఉన్నట్లు ప్రకటించడానికి త్యేర్‌కి అధికారం యివ్వబడింది. 1839లో లాగే 1849లో కూడా, దుఫార్, కొత్త నిర్బంధశాసనాలు, పత్రికలకు సంబంధించిన కొత్త శాసనాలు, "కోర్టు మార్షల్ విచారణకు సంబంధించిన తంతును కుదించే" శాసనమూ తీసుకు రావాలని డిమాండు చేస్తున్నాడు. ప్రధాన పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ని ఉద్దేశించి జారీచేసిన ఒక సర్క్యులర్‌లో, "రాజీపడా"లన్న నినాదాన్ని తీవ్ర నేరంగా పరిగణించి పత్రికలను కఠినంగా శిక్షించాలని అతను ఆదేశించాడు. ప్రధాన పబ్లిక్ ప్రాసిక్యూటరు (మయ్యేకి చెందిన) ఒకడు* మాత్రమే దుఫార్‌ని రాజీనామా చెయ్యమని డిమాండు చేశాడు. ఫ్రెంచి మేజిస్ట్రేట్ల స్వభావానికిది నిదర్శనం....

> "అంతర్యుద్ధ తరుణంలో పార్టీ పోరాటంలో తల దూర్చాల్సిందిగాను, రాజీపడాలి అన్నమాటని ఉచ్చరించిన మాత్రాన, అమాయకులుగా నేను పరిగణించే పౌరులను ప్రాసిక్యూట్ చెయ్యాల్సిందిగాను నన్ను ఆజ్ఞాపించే ప్రభుత్వం కింద నేను పని చెయ్యజాలను."

లూయీ బోనపార్ట్‌కి వ్యతిరేకంగా కుట్ర చేసిన 1869 నాటి "లిబరల్ యూనియన్"తో సంబంధమున్నట్లుగానే, గిజోకి వ్యతిరేకంగా కుట్రచేసిన 1847 నాటి "లిబరల్ యూనియన్"తో[106] కూడా దుఫార్‌కి సంబంధముంది.

మార్చి 10 చట్టాన్ని తీసుకున్నా, ఇళ్ల అద్దెల చట్టాన్ని తీసుకున్నా ఒక విషయాన్ని చెప్పుకోవాల్సి వుంది. దుఫార్, పికార్డ్‌ల (యిద్దరూ అడ్వకేట్లే) దిట్టమైన కాతాదార్లందరూ, పారిస్ ముట్టడి కారణంగా ఏ మాత్రమూ కోల్పో

---

* లూయీ వ్రషేన్. — సం.

రాదని కోరుకొనే ఇళ్ల యజమానులూ, బడా చట్బా వ్యాపారస్తులే నన్నదే ఆ విశేషం.

---

1848 ఫిబ్రవరి విప్లవానంతరం చెప్పినట్లుగానే యిప్పుడు కూడా, రిపబ్లిక్కుకి పెళ్ల డాన్ కార్లోస్* నుద్దేశించి ఉరితీసేవాడన్నట్లు: "Je vais t'assassiner, mais c'est pour ton bien" ("నిన్ను నేను హత్య మారుస్తాను, అయితే అది నీ మేలు కోసమే") అనే చెప్తున్నారు.

## లెకాంట్, క్లెమాన్ టొమా

మాంమార్ట్ర్ కొండని ఆక్రమించాలని వినువా చేసిన ప్రయత్నం తర్వాత (మార్చి 18న, 4 గంటలకు, షటో రూజ్ పార్క్లో వాళ్ళ కాల్చబడ్డారు) 81వ సైనిక రెజిమెంటుకి చెందిన అదే ఉద్రిక్త సైనికులు జనరల్ లెకాంట్, క్లెమాన్ టొమాలను పట్టుకుని కాల్చివేశారు. కేంద్ర కమిటీకి చెందిన కొందరు ప్రతినిధులు వారిస్తున్నా కూడా సైనికులు అమలు జరిపిన మూక న్యాయ విచారణానంతర తక్షణ మరణ శిక్ష అది. ఉన్నత సైనికాధికారి అయిన హంతకుడు లెకాంట్ నిరాయుధులైన స్త్రీలను, పిల్లలను కాల్చివేయాలని ప్లేస్ పిగాల్‌లో తన దళాలకు నాలుగు పార్లు ఆజ్ఞలు ఇచ్చాడు. ఆ సైనికులు ప్రజలను కాల్చి చంపేందుకు బదులు అతగాడినే కాల్చి చంపారు. ఈ మాజీ క్వార్టర్-మాస్టర్-సార్జెంట్ అయిన క్లెమాన్ టొమా జూన్ (1848) ఊచ కోతలకు సరిగా ముందు[8] "National"[56]కి చెందిన మనుషుల చేత ఒకే మారుగా యితను "జనరల్" చెయ్యబడ్డాడు (ఇతను అంతకు ముందు ఆ పత్రికకు gérant**గా ఉన్నాడు). పారిస్ కార్మికవర్గపు రక్తాన్ని తప్ప మరే యితర శత్రువు రక్తాన్నీ ఎన్నడూ చిందించని ఘనుడితను. జూన్ తిరుగుబాటును బుద్ధిపూర్వకంగా రెచ్చగొట్టిన దుర్మార్గపు కుట్రదారుల్లోను, దాని అత్యంత క్రూరమైన ఉరితీతదార్లలోను యితనొకడు. 1870 అక్టోబరు 31న, పారిస్ శ్రామికవర్గ నేషనల్ గార్డు నగర పాలక కార్యాల

---

* 60వ పేజిలో వివరణ చూడండి. — సం.

** మేనేజింగ్ ఎడిటర్. — సం.

యంలోని రక్షణ ప్రభుత్వాన్ని ఆకస్మికంగా ముట్టుముట్టి, వాళ్లని ఖైదీలుగా పట్టుకున్న ప్పుడు, స్వయం నియమితులైన వీళ్లు, వీళ్లలోనే ఒకడైన పికార్డ్, యిటీవల వీళ్లని పేర్కొన్నట్లు gens de paroles,* కమ్యూన్‌కి చోటిచ్చి తాము పక్కకి వైదొలగు తామని వాగ్దానం చేశారు. ఆవిధంగా సిగపువ్వైనా వాడకుండా నిరాటంకంగా తప్పించుకో గలిగిన వీళ్లు, తమ మాటపై అత్యంత విశ్వాసంతో ఉన్న తమ విజేతలపై త్రొషూయొక్క బ్రెటన్లను** ఎగదోలారు. అయితే, వాళ్లలో ఒకడైన టమిజ్యే, నేషనల్ గార్డు కమాండర్ ఇన్ ఛీఫ్ పదవికి రాజీనామా యిచ్చాడు. అతను, తన వాగ్దానాన్ని భంగం చెయ్యడానికి నిరాకరించాడు. అప్పుడు మరోమారు క్లెమాన్ టొమాకి అవకాశం చేతికి చిక్కింది. టమిజ్యే స్థానంలో అతను నేషనల్ గార్డు కమాండర్ ఇన్ ఛీఫ్‌గా నియమితుడయ్యాడు. త్రొషూ "పథకం" అమలు జరపడానికి అతనే సరిగా సరిపోయే వ్యక్తి. అతగాడు ప్రష్యన్లపై ఎన్నడూ యుద్ధం చేయలేదు; అతను యుద్ధంచేసినదల్లా నేషనల్ గార్డు పైనే. వాళ్లని అతను అసంఘటితులను చేశాడు, వాళ్ల ఐక్యతను చెడగొట్టాడు, వాళ్లపై అభాండాలు వేశాడు, వాళ్ల ఆఫీసర్లలో త్రొషూ "పథకానికి" వ్యతిరేకులైన వాళ్లంద రినీ తొలగించాడు, నేషనల్ గార్డుల్లో ఒక దళాన్ని మరొకదానిపై ఉసిగొల్పాడు. ముట్ట డించిన వాళ్లపై దాడులలో ఒక దళాన్ని బలిపెట్టాడు, అందువా, దానిని అపహాస్యం పాలు చేసేలా ఆ దాడులు ఏర్పాటు చేశాడు. జూన్‌లో తన వాతబడినవాళ్ల ప్రేతాంచేత నిత్యం వేధింపబడుతుండే యితగాడు, ఏ అధికార బాధ్యతాలేని యీ వ్యక్తి, మార్చి 18న, మళ్లీ యుద్ధరంగంలో ప్రత్యక్షమయ్యాడు. పారిస్ ప్రజల మరో ఊచకోతని పసిగట్టి, బహుశా అక్కడకి అతను తయారై వుంటాడు. ప్రజల్లో క్రోధం పెల్లు బికిన మరుక్షణమే అతను మూకన్యాయానికి బలైపోయాడు. రిపబ్లిక్ గొంతు నుల మడానికీ, వుయ్యే-కర్ట్యే ఒప్పందం మేరకు లభించే లంచపు పంచులను కాజెయ్యడా నికీగాను పారిస్‌ను décembriseur నిమవా దయాదాక్షిణ్యాలకు వదిలేసిన వ్యక్తులిప్పుడు "హంతకులు, హంతకులు!" అంటూ అరవ నారంభించారు. "శ్రామికుల" రక్తం కోసం మహా ఆత్రుత గలిగిన యూరపియన్ పత్రికలు ఆ పాలికేకను అందుకున్నాయి. "భూస్వాముల సభ"లో అపస్మారక సమయోచిత ప్రహసనం ఒకటి ప్రదర్శింపబడింది. వెనకటి మాదిరిగానే యిప్పుడు కూడా, వాళ్ల మిత్రుల శవాలు, వాళ్ల శత్రువులకు వ్యతిరేకంగా మిక్కిలి వాంఛిత ఆయుధాలయ్యాయి. వారి అదుపులో లేని ఒకానొక దుర్ఘ టనకు, పారిస్‌కీ, కేంద్ర కమిటీకీ బాధ్యత ఆపాదింపబడింది. పారిస్ ఆర్చిబిషప్ హత్య విషయంలో, తిరుగుబాటుదారులకు వ్యతిరేకంగా 1848 జూన్ రోజుల్లో "శాంతి

* మాట తప్పని మనుషులు. — సం.

భద్రతా సంరక్షకులు" కోపఘూర్ణిత ఆరోపణలతో యూరప్ అంతటినీ ఎంతగా కదిలించివేశారో తెలిసిందే. బారికేడ్లవద్దకు ఆర్చిబిషప్‌ను అనుసరించిన ఆర్చిబిషప్ వికార్ జనరల్ అయిన జక్మే, బిషప్‌ను కాల్చినది కవేన్యాక్ సేనలే గాని తిరుగుబాటుదారులు కాదని చెప్పిన సాక్ష్యాన్నిబట్టి, వాళ్లకీ విషయం అప్పటికే బాగా తెలును. అయితేనేం, ఆర్చిబిషప్ మృతకళేబరం వాళ్లకి ఒక వరప్రసాదంలా దొరికింది, దాన్ని తమ ప్రయోజనాలకు వాళ్లు వినియోగించుకున్నారు. వెర్సైల్స్ ప్రభుత్వం చేస్తున్న ఆటవిక ఘాతుకాలకు ప్రతిగా ఆత్మరక్షణ కోసం ప్రస్తుత పారిస్ ఆర్చిబిషప్ దార్బువాను హామీ బందీగా కమ్యూన్ పట్టుకుంది. అయితే, త్యేర్‌కి ఆయన రాసిన లేఖనుబట్టి, ఫాదర్ ట్రాన్స్‌వానెస్[44] ప్రజల్లో మతపరమైన క్రోధాగ్నిని రెచ్చగొట్టడానికి, తన శవాన్ని కూడా వినియోగించుకుంటాడేమో నన్న భయం ఆయనకి ఉన్నట్లు స్పష్టమవుతోంది. ఆయన ఉరితీతను గురించి వెర్సైల్స్ పత్రికలు గగ్గోలు పెట్టకుండా గడిచిన రోజు ఒక్కటి కూడా లేదు. నిరంతరాయంగా జరిగిన ఘాతుకాలను, "ఆర్డర్" పక్షంచేత యుద్ధ నియమాల ఉల్లంఘనను కనుక చూస్తే, ఒక్క కమ్యూన్ తప్ప మరే ప్రభుత్వమైనా ఆ పని చేసే ఉండును. వెర్సైల్స్ ప్రభుత్వం తొలి సైనిక విజయమింకా సాధించిందో లేదో, తన జెండార్మ్‌ల అగ్రభాగాన నిలిచి, ఔదార్య సాహసాది గుణాలు కలిగిన ఫ్లొరెన్సును హతమార్చిన కెప్టెన్ డెమరేకి త్యేర్ బిరుదప్రదానం చేశాడు. అక్టోబరు 31న, "రక్షణ" ప్రభుత్వ సభ్యుల ప్రాణాలను కాపాడినది ఈ ఫ్లొరెన్సే.[62] సారుబోతు వినువా గ్రాండ్ క్రాస్ ఆఫ్ ది లీజియన్ ఆఫ్ ఆనర్‌తో బహూకరింపబడ్డాడు. ఇతడు చేసిన ఘనకార్యాలేమిటయ్యా అంటే, సాహసి అయిన మన క్రామేడ్ ద్యువాల్‌ను ఖైదీగా పట్టుకుని, దుర్గభాగాల్లోనే కాల్చివెయ్యడం, పారిస్ ప్రజల పక్షాన చేరిన నేరానికి ఖైదీలుగా పట్టుకున్న ఓ డజను మంది సైనికులను కాల్చడం, "డిసెంబరు పద్ధతుల" ద్వారా[107] అంతర్యుద్ధాన్ని ప్రారంభించడమూను. "ధర్మ వాట్యాల్లో ఫ్రెంచి సామ్రాజ్య వింతల్లో ఒకటిగా పరిగణింపబడే చిత్ర విచిత్రమైన దుస్తులు ధరించే అందాల మార్క్విస్ భర్త" గాలిఫే, లండన్‌కి చెందిన ఒక పత్రికారచయిత ముస్సితంగా అభివర్ణించినట్లు, రుయే దగ్గర ఒక కెప్టెన్‌ని, ఒక లెఫ్టినెంటును, నేషనల్ గార్డ్సుకి చెందిన సైనికులను "ఆకస్మికంగా పట్టుకొని," తక్షణమే వాళ్లను కాల్పించి, ఆ వెంటనే, తన యీ ఘన కార్యాన్ని ప్రస్తుతించుకొంటూ ప్రకటన జారీ చేశాడు. వెర్సైల్స్ ప్రభుత్వం అధికారికంగా పేర్కొని, ఘనతగా భావించిన హత్యల్లో యివి కొన్ని మాత్రమే. 80వ సైనిక రెజిమెంటుకి చెందిన 25 మంది సైనికులు "తిరుగుబాటుదారులు"గా, 75వ సైనిక రెజిమెంటుచేత కాల్చించి వెయ్యబడ్డారు.

"కమ్యూనిస్టు శ్రేణుల్లో రెగ్యులర్ సైనిక యూనిఫారంలో పట్టు బడిన ప్రతి వ్యక్తీ, వెన్వెంటనే నిర్దాక్షిణ్యంగా కాల్చివేయబడ్డాడు. ప్రభుత్వ సైనిక దళాలు పరమ భయానకంగా వ్యవహరించాయి."

"ఫ్లొరెన్స్ మృతికి సంబంధించిన ప్రోత్సాహకర వివరాలను త్యేర్ జాతీయ అసెంబ్లీకి తెలియజేశాడు."

వెర్సేల్స్. ఏప్రిల్ 4. ఆ అష్టావక్రుడైన మరుగుజ్జు త్యేర్, (తన అధికార ప్రకటనలో) వెర్సేల్స్‌కి తీసుకొచ్చిన ఖైదీలను గురించి యిలా పేర్కొన్నాడు:

"క్షుద్ర ప్రజాస్వామ్యానికి చెందిన యింతకన్న క్షుద్రమైన ముఖాకృతులు నిజాయితీపరుల (పియెట్రీ మనుష్యుల!) క్షుభిత వీక్షణాలకు ఎన్నడూ ఎదురై యుండవు."

"తిరుగుబాటు ఆఫీసర్ల పట్లగాని, సైనికుల పట్లగాని ఏ మాత్రం దయ చూపడాన్ని కూడా వినువా వ్యతిరేకిస్తున్నాడు."

ఏప్రిల్ 6న, దమనకాండ పైన, (హామీ బందీలపైన) కమ్యూన్ ఉత్తరువు జారీ చేయబడింది.

"వెర్సేల్స్ ప్రభుత్వం బహిరంగంగా మానవత్వ నియమాలనూ, యుద్ధ నియమాలనూ కాలరాస్తున్న దృష్ట్యా, ఫ్రాన్సుపై దాడి జరిపిన వాళ్ళపైతం ఒడిగట్టి తమను తాము అగౌరవ పరచుకోని ఘాతుకాలు చేసిన దృష్ట్యా... యిలా ఆజ్ఞాపించడమైనది, వగైరా" (అంశాలు పేర్కొనబడ్డాయి*).

ఏప్రిల్ 5. కమ్యూన్ అధికార ప్రకటన:

"వెర్సేల్స్ బందిపోట్లు రోజూ మన ఖైదీలను ఊచకోత కొయ్యడమో, కాల్చెయ్యడమో చేస్తున్నారు. గంటగంటకీ మనకు మరో కొత్త హత్య జరిగినట్లు వార్త అందుతోంది.... జన సామాన్యం, ఎంత

* పత్రికలో, యీ వాక్యం జర్మన్ భాషలో ఉంది. — సం.



1871 మార్చి 18న మాంమార్టర్‌వద్ద శతఘ్నులను పట్టుకోడానికి ప్రయత్నించిన థ్యేర్ పోలీసులను, సైనికులను తిరుగుబాటు చేసిన జనాలు వెళ్లగొట్టుతున్న దృశ్యం

కోపంలో వున్నా కూడా, రక్తపాతాన్ని అంతర్యుద్ధాన్నిలాగే అసహ్యించుకుంటున్నారు. కానైతే, శత్రువుల ఆటవిక ప్రయత్నాల నుండి తమను తాము పరిరక్షించుకోవడమూ, ఎంతటి కష్ట నష్టాలకైనా ఓర్చి, దెబ్బకి దెబ్బ తియ్యడమూ వారి విధి."

"పారిస్‌కి వ్యతిరేకంగా పోరాడుతున్న పోలీసులకు రోజుకు 10 ఫ్రాంకులు ముడుతున్నాయి."

వెర్సేల్స్. ఏప్రిల్ 11. కిరాతకంగా పలాయితులను కాదు, ఖైదీలను కాల్చిచంపిన ఘటనలకు సంబంధించిన దారుణమైన వివరాలను సీనియర్ ఆఫీసర్లూ, తదితర సాక్షులూ మహోత్సాహంగా వర్ణించి చెప్తున్నారు.

త్యేర్‌కి రాసిన తన లేఖలో,

"భ్రాతృ హత్యా సదృశమైన మన యుద్ధానికి తోడు, జరుగుతున్న దారుణ అత్యాచారాలకు వ్యతిరేకంగా" దార్బువా తన నిరసనను వ్యక్తం చేశాడు."

డెగ్యురి (లా మాడ్లేన్ చర్చికి చెందిన మతగురువు) అదే ధోరణిలో యిలా రాశాడు:

"ఈ మరణశిక్షలు పారిస్‌లో పెనుక్రోధాన్ని రెచ్చగొట్టి, భయంకరమైన పగసాధింపు చర్యలకు దారితీయ వచ్చు." "అలాగే, ప్రతి ఒక్క కొత్త మరణశిక్షకీ బదులుగా, తమ వద్ద వున్న పలువురు హామీ బందీల్లో యిద్దరిని కాల్చివెయ్యాలన్న నిర్ణయం యింతకు ముందే తీసుకోబడింది. నేను, ఒక మత బోధకునిగా, మిమ్మల్ని అర్థిస్తున్నది, తక్షణమే చెయ్యాల్సిన ఎంతటి పరమ అవసర కార్యమో మీరే నిర్ణయించుకోండి."

ఈ బీభత్సకాండ మధ్య ప్రిఫెక్టుల నుద్దేశించి త్యేర్ యిలా రాశాడు: "L'Assemblée siège paisiblement." (Elle aussi a le coeur léger.)*

---

* "అసెంబ్లీ శాంతియుత వాతావరణంలో సమావేశ మవుతోంది." (అసెంబ్లీ కూడా లఘుచిత్తం కలిగినదే.) మంత్రివర్గ అధ్యక్షుడు ఒలివ్యే అన్న మాటల పునశ్చరణ యిది. ప్రష్యాకి వ్యతిరేకంగా యుద్ధాన్ని ప్రకటించడానికి సరిగా ముందర, యుద్ధానికి తను బాధ్యతను "లఘుచిత్తం"తో స్వీకరిస్తున్నట్లు ఒలివ్యే చెప్పాడు. — సం.

త్యేరూ, అతని "భూస్వాముల సభ" ప్రతినిధుల పదిహేను మంది కమిషన్[108] "వెర్సేల్స్ సేనలకు ఆపాదింపబడిన కల్పిత మరణ దండనలను, పగ సాధింపులను" "అధికారికంగా తిరస్కరించేటంత" ధూర్తత్వానికి తెగబడ్డారు. కాని, ఫాదర్ ట్రాన్స్ నొనైన్, పారిస్ బొంబార్డుమెంటుపై ఏప్రిల్ 16 నాటి తన సర్క్యులర్‌లో యిలా రాస్తాడు:

> "ఎక్కడైనా ఏమైనా ఫిరంగి కాల్పులు వినిపించాయంటే, అవి వెర్సేల్స్ సైన్యం కాల్చినవి కావు. తమ ముఖాలైనా చూప సాహసించని కొద్దిమంది తిరుగుబాటుదారులు తామింకా పోరాటం సాగిస్తూనే ఉన్నామని జనాన్ని నమ్మించే ప్రయత్నంలో కాల్చిన కాల్పులు తప్ప అవి వేరేమీ కాదు."

తన హీరో అయిన మొదటి నెపోలియన్‌ని, కనీసం ఒక్క అంశంలో – తప్పుడు సమాచార పత్రాల విషయంలోనైనా తను మించిపోయినట్లు త్యేర్ రుజువు చేశాడు. (త్యేర్‌పై అభాండాలు వేసేందుగ్గాను, పారిస్, తనపై తనే బొంబార్డు చేసుకుంటోందట!)

బోనపార్టిస్టు ద్రోహులు దుష్టబుద్ధితో యిలా రెచ్చగొడుతుంటే, హామీబందీలను పట్టుకోవడంతోను, తగిన ప్రాయశ్చిత్తం చేస్తామని బెదరించడంతోను కమ్యూన్ సరిపెట్టుకుంది. అయితే, దాని బెదరింపులు కొరగాకుండా పోయాయి! ఆఫీసర్ల వేషాలతో తిరిగే జెండార్మ్‌లుగాని, చివరకు బాంబులతోబాటు పట్టుబడిన పోలీసులుగాని, కోర్టు మార్షల్* ముందు హాజరు పరచబడలేదు! ఈ రక్త పిపాసుల రక్తంతో తన హస్తాలను మలిన పరచుకోవడానికి కమ్యూన్ తిరస్కరించింది!

మార్చి 18కి కొద్ది రోజుల ముందు, క్లెమాన్ టొమా, నేషనల్ గార్డులో వాల్గింట మూడువంతుల మంది నిరాయుధీకరణకుగాను ఒక పథకాన్ని యుద్ధమంత్రి లెఫ్లో ముందుంచాడు.

> "పారిస్ గాలిమూకలో నిగ్గ నదగినవాళ్లు మాంమార్ట్‌ర్ చుట్టూ గుమిగూడారు, బెల్‌విల్‌తో చెట్టపట్టాలేసుకుని పని చేస్తున్నారు" అన్నాడు.

---

* సైనిక నిబంధనల ఉల్లంఘన జరిగిన సందర్భాల్లో విచారణకై ఏర్పడే సైనికాధికారులతో కూడిన కోర్టు. – సం.

## జాతీయ అసెంబ్లీ

ఫిబ్రవరి 8న ఎన్నుకోబడిన అసెంబ్లీ, శత్రువు ఒత్తిడిచేత ఎన్నుకోబడింది, ఏ శత్రువుకైతే వెర్సేల్స్ ప్రభుత్వ సభ్యులు అన్ని దుర్గాలనూ కట్టబెట్టి, రక్షణలేని పారిస్‌ను చేతులారా అప్పగించారో, ఆ శత్రువు ఒత్తిడిచేత ఎన్నుకోబడింది. అటువంటి ఆ వెర్సేల్స్ అసెంబ్లీ, జనవరి 28న వెర్సేల్స్‌లో సంతకాలు జరిగిన కన్వెన్షనులోనే స్పష్టంగా పేర్కొనబడినట్లు, యుద్ధాన్ని కొనసాగించడం సాధ్యమా, లేక శాంతి కుదుర్చుకోవాలా అన్న ఒకేఒక అంశాన్ని నిర్ణయించేందుకూ, ఒక వేళ శాంతినే కుదుర్చుకోవాలంటే, శాంతి షరతులను కుదుర్చుకొనేందుకూ, ఫ్రెంచి భూభాగాన్ని సాధ్యమైనంత త్వరగా ఖాళీచేయించేలా చూసేందుకే సమావేశమైంది.

## షంజీ, పారిస్ ఆర్చిబిషప్, వగైరా

షంజీ విముక్తి, పెస్సే తిరోగమనమూ, దాదాపుగా ఏక కాలంలోనే జరిగాయి. రాచరికవాద పత్రికా రచయితలు జనరల్ మరణదండన నిర్ణయం విషయంలో ఏకాభిప్రాయం ప్రదర్శించారు. ఆ చర్య బాధ్యతను కమ్యూనార్డులపై మోపాలని వాళ్ళు వాంఛించారు. అతనిపై యింతకు ముందు మూడు సార్లు మరణశిక్ష విధింపబడింది, కానైతే అతనిప్పుడే నిజంగా కాల్చివెయ్యబడబోతున్నాడు.

వెండోమ్ చౌకు ఘర్షణానంతరం* వెర్సేల్స్‌లో తల్లడపాటు వ్యక్తమైంది. కమ్యూన్ ఉద్యమ నాయకులు, జాతీయ అసెంబ్లీ కనక ప్రతికూల చర్య ఏమైనా తీసుకుంటే, తాము వెర్సేల్స్‌పై దాడి చేస్తామని ప్రకటించడంతో, మార్చి 23న వెర్సేల్స్‌పై దాడి జరుగుతుందని అనుకోవడమే యీ తల్లడపాటుకి కారణం. అయితే అసెంబ్లీ అటువంటి చర్యకు పాల్పడలేదు. తద్విరుద్ధంగా, పారిస్, మొదలైన చోట్ల కమ్యూన్‌కు హుటాహుటి ఎన్నికలు జరపాలన్న ప్రతిపాదనకు అనుకూలంగా ఓటు చేసింది. ఈ రాయితీల ద్వారా, అసెంబ్లీ తన అశక్తతను ఒప్పుకుంది. అదే సమయంలో — వెర్సేల్స్‌లో రాచరిక (రాయలిస్టు) కుతంత్రాలు, బోనపార్టిస్టు జనరల్సు, డ్యూక్ డి ఔమాలె.[109] మార్చి 26 కల్లా భద్రత పునరుద్ధరింపబడకపోతే, పారిస్‌ను జర్మన్ సేనలు ఆక్రమిస్తాయని ప్రకటించే ఉత్తరం ఒకటి బిస్మార్కు నుండి తనకు అందినట్లు ఫావ్ బహిరంగంగా

* 207–208వ పేజీలు చూడండి. — సం.

ప్రకటించాడు. అతగాని యీ కుయుక్తిని కమ్యూనార్డులు వెంటనే గ్రహించారు. ఫోర్జరీదారూ, నికృష్ట జెస్యూటూ అయిన జె. ఫ్రావ్ చేతనే వెండొమ్ చౌకులో సంఘర్షణ రెచ్చగొట్టబడింది. తనను అనామకత్వంనుంచి ఏ ప్రజలైతే పైకి లేవనెత్తారో వారిని అవమానపరచడానికీ, రాష్ట్రాలకు వ్యతిరేకంగా పారిస్‌ను రెచ్చగొట్టడానికీ గాను (మార్చి 21న?) వెర్సేల్స్ అసెంబ్లీ వేదిక ఎక్కాడు.

మార్చి 30. కమ్యూన్ అధికార ప్రకటన:

> "మీరు ఎవరి నైతే ప్రాసిక్యూట్ చెయ్యాలని కోరుకొన్నైనా లేదో ఆ నేరస్థులు, ఈనాడు, పారిస్ నగర ముఖద్వారం దగ్గరనే రాచరిక కుట్రను చేసేందుకుగాను మీ ఔదార్యాన్ని దుర్వినియోగపరుస్తున్నారు. వాళ్లు అంతర్యుద్ధానికి రెచ్చగొడుతున్నారు. వాళ్లు నానా విధ అవినీతి సాధనాలకూ పాల్పడ్డారు. వాళ్లు ప్రతి ఒక్కరితోనూ కుమ్మక్కయ్యారు. చివరకు సహాయం కోసం విదేశీయులను అడుక్కునేటంత దాకా కూడా వాళ్లు దిగజారారు."

## త్యేర్

సీన్‌కు చెందిన శివారు కమ్యూన్ల మేయర్లకు, ఉపమేయర్లకు, మ్యునిసిపల్ కౌన్సిలర్లకూ, ఏప్రిల్ 25న తానిచ్చిన స్వాగతం సందర్భంగా త్యేర్ యిలా అన్నాడు:

> "రిపబ్లిక్ ఉంది. కార్యనిర్వాహకాధికారాన్ని అమలు పరుస్తున్న ప్రధాన వ్యక్తి కేవలం సర్వసామాన్య పౌరుడు."

త్యేర్ అభిప్రాయంలో 1830–1871 మధ్య ఫ్రాన్సు ప్రగతి, యీ క్రింది వాటిలో వుంది: 1830లో లూయీ ఫిలిప్ "అత్యుత్తమ రిపబ్లిక్." పోతే 1871లో, లూయీ ఫిలిప్ పాలననాటి మంత్రివర్గానికి చెందిన శిలీభూత అవశేషమైన తను, మరుగుజ్జు త్యేర్, రిపబ్లిక్కుల్లోకెల్ల అత్యుత్తమ రిపబ్లిక్.

దురాక్రమణ చర్యతో త్యేర్ తన పాలనను ప్రారంభించాడు. జాతీయ అసెంబ్లీ చేత అతగాడు అసెంబ్లీ మంత్రివర్గ ప్రధానిగా నియమింపబడ్డాడు. తనను తాను ఫ్రాన్సు కార్యనిర్వాహక ప్రధానాధికారిగా అతను నియమించుకున్నాడు.

# జాతీయ అసెంబ్లీ, పారిస్ విప్లవమూ

విదేశీ దాడిదారు ఆన మేరకు సమావేశపరచబడిన అసెంబ్లీ, జనవరి 28నాటి వెర్సేల్స్ కన్వెన్షన్‌లో విస్పష్టంగా నిర్దేశింపబడినట్లు, కేవలం ఒకేఒక్క లక్ష్యం కోసం — యుద్ధాన్ని కొనసాగించడమా, లేక, శాంతి షరతులేమిటన్న అంశాన్ని నిర్ణయించేందు కోసమే — సమావేశపరచబడింది. ఎన్నికల్లో పాల్గొనేందుకు ఫ్రెంచి ప్రజలకు చేసిన విజ్ఞప్తిలోనే పారిస్ capitulards (లొంగుబాటుదార్లు) అసెంబ్లీయొక్క ఆ ప్రత్యేక కర్తవ్యాన్ని స్పష్టంగా నిర్వచించారు. అసెంబ్లీ నిర్మాణస్వరూపాన్ని యిది చాల వరకు స్పష్టపరుస్తుంది. లొంగుబాటుదార్లచేత పరమ విధేయంగా ఆమోదింపబడిన యుద్ధ విరమణ ఒప్పందపు షరతుల కారణంగానే యుద్ధపు కొనసాగింపు దుస్సాధ్యం కావడంతో, అసెంబ్లీ నిజానికి ఏమి చెయ్యాల్సి వచ్చిందంటే, అవమానకరమైన ఆ శాంతి ఒడంబడికను నమోదు చేయడం మాత్రమే. ఈ ప్రత్యేక కార్యనిర్వాహణ కోసం ఫ్రాన్సుకి చెందిన అతి నికృష్టులే అత్యుత్కృష్టులు మరి.

సెప్టెంబరు 4న రిపబ్లిక్ ప్రకటింపబడినది, పారిస్ ప్రజలచేతనేగాని, నగర పాలక కార్యాలయంలో తమను తాము రక్షణ ప్రభుత్వంగా ప్రతిష్ఠించుకున్న మోసకారి నీచపు వకీళ్ల చేత కాదు. ఫ్రాన్సు అంతటా రిపబ్లిక్ పట్ల ఏకగ్రీవంగా హర్షామోదం వ్యక్తమైంది. అది, అయిదు మాసాల యుద్ధం ద్వారా తన అస్తిత్వాన్ని తనే సాధించు కుంది. ఆ యుద్ధానికంతటికీ కీలకమైనది సుదీర్ఘమైన పారిస్ ప్రతిఘటన. రిపబ్లిక్ చేత, రిపబ్లిక్ పేర సాగింపబడిన ఈ యుద్ధమే లేకుంటే, సెడాన్ లొంగిపోయిన తర్వాత బిస్మార్క్‌చేత సామ్రాజ్యం పునరుద్ధరింపబడివుండేది. త్యేర్ నాయకత్వానగల మోసకారి నీచపు వకీళ్ళు, పారిస్ కోసం కాక, తాము కయ్యేన్ ప్రవాసానికి వెళ్లకుండా చూసుకోవాల్సి వచ్చేది. "భూస్వాముల సభ" ప్రసక్తే ఉండేది కాదు. పారిస్‌లో ప్రారం భింపబడిన రిపబ్లికన్ విప్లవం ధర్మమా అని మాత్రమే అసెంబ్లీ సమావేశమైంది. త్యేర్ మెగటు కలిగేలా పదేపదే వర్ణించినట్లు, అది, రాజ్యాంగ సభ కాదు కాబట్టి, రిపబ్లికన్ విప్లవానికి సంబంధించిన గత ఘటనలను కేవలం నమోదు చేసేది గానే తప్ప, బోనపార్ట్ కుటుంబ రాజరికపు పదభ్రష్టత్వాన్ని గురించి అధికార ప్రకటన చేయగల హక్కు సైతం దానికి ఉండేది కాదు. అందుకనే, ఫ్రాన్సులోని ఏకైక చట్టబద్ధ అధికారం, పారిస్‌లో కేంద్రీకృతమైన విప్లవమే. ఆ విప్లవం, రెండవ సామ్రాజ్య ఆవి ర్భావానికి దారితీసిన సాంఘిక, రాజకీయ పరిస్థితులకు వ్యతిరేకంగా జరిగినదే గాని, వామనమూర్తి నెపోలియన్‌కి వ్యతిరేకంగా జరిగినది కాదు. రెండవ సామ్రాజ్య పాలనలో

తుదిరూపు దిద్దుకొన్న ఆ సాంఘిక రాజకీయ పరిస్థితులు కార్మికవర్గంయొక్క పునర్జాగృతం చేసే శక్తులచేత రద్దుచెయ్యబడకపోతే ఫ్రాన్సు నొక మృత కళేబరంగా మార్చియుండేవి. ప్రష్యాతో యుద్ధం ఈ విషయాన్ని స్పష్టంగా రుజావు చేసింది. కేవలం మరొకరి తరపున సంతకం పెట్టే, అటార్నీ అధికారాన్ని మాత్రమే విప్లవం నుండి పొందిన భూస్వాముల అసెంబ్లీ, "కార్యనిర్వాహకాధికార వర్గం"చేత విదేశీ ఆక్రమణదారుకి దఖలుపరచబడిన ఒప్పందంపై సంతకం పెట్టేందుకు చేసే ప్రయత్నం, విప్లవాన్ని తనకే లొంగుబాటుదారుగా పరిగణించేందుకు అది చేసిన ప్రయత్నం, అధికార అక్రమ దురాక్రమణ ప్రయత్నం తప్ప మరేమీ కాదు. పారిస్‌కి వ్యతిరేకంగా అది చేసిన యుద్ధం ప్రష్యన్ బయనెట్ల రక్షణలో అది చేసిన పిరికి Chouannerie[110] తప్ప వేరేమీ కాదు. క్షీణించి, సారం చచ్చి, కుళ్లి పోయిన వర్గాల ప్రత్యేక సౌకర్యాలను, గుత్త హక్కులను, విలాసాలను కాపాడేందు కోసం, ఫ్రాన్సును హతమార్చేందుకు జరిగిన నీచమైన కుట్ర అది. ఈ వర్గాలు ఫ్రాన్సును అగాధంలోకి యీడ్చుకెళ్లాయి. దాన్నుంచి ఫ్రాన్సుని పైకి లాగడమన్నది నిజమైన సాంఘిక విప్లవానికి సంబంధించిన భీమబలంతో కూడిన హస్తానికి మాత్రమే సాధ్యం.

## త్యేర్‌యొక్క మిక్కిలి శ్రేష్ఠమైన సైన్యం

తనింకా "రాజకీయవేత్త" కాకముందే, త్యేర్, చరిత్రకారుడుగా అబద్ధాలాడగల తన శక్తిని రుజావు చేసుకున్నాడు. మరుగుజ్జుకు సహజసిద్ధమైన అహంకారం, యీ మారతన్ని అపసవ్యతా పారమ్యంలో ముంచింది. అతని వ్యవస్థ సంరక్షక సైన్యం, బిస్మార్క్ దయాధర్మమా అంటూ, ప్రష్యన్ ఖైదుల నుండి కొత్తగా తిరిగి దిగుమతి చేసుకున్న బోనపార్టిస్టు సైనికుల మాదిరి తుర్కోజీ రకం, పోపు జువావ్‌లూ, షరేట్‌కి చెందిన షువాన్లూ,[80] కతెలీనొకి చెందిన వెండేన్లూ,[110] వలంటేన్‌కి చెందిన "మునిసిపల్సూ,"[111] పియెత్రీకి చెందిన మాజీ పోలీసులూ, వలెంటేన్‌కి చెందిన కార్సికన్ జెండార్మీలూ — లూయీ బోనపార్ట్ క్రింద కేవలం సైన్యానికి వేగులు మాత్రమే అయిన వీళ్లు — త్యేర్ క్రింద సేనలో నిగ్గుక్రింద రూపొందారు. ఈ అమాంబాపతు వాళ్లంతా సైనిక ఉన్నత హోదాలు పొందిన mouchards* పర్యవేక్షణ క్రింద, కోల్పోయేందుకు పరువంటూ లేని పారుబోతు డిసెంబరిస్టు మార్షల్సు నాయకత్వం క్రింద పని చేసే

* వేగులు. — సం.

వీళ్లను — యీ కలగాపులగపు, మురికి, నీచపు మూకనే త్యేర్, "ఫ్రాన్సు చరిత్రలోనే ఎన్నడూ లేనంతటి మిక్కిలి శ్రేష్ఠమైన సైన్యం!" అని అభివర్ణిస్తున్నాడు. ప్రష్య న్లనింకా అతగాడు సెయింట్ డెనీలో ఉండ నిచ్చాడంటే, వెర్సేల్స్‌కి చెందిన "మిక్కిలి శ్రేష్ఠమైన సైన్యాన్ని" చూపి, వాళ్లని హడలగొట్టడానికి మాత్రమే అనుకోవాలి మరి!

## త్యేర్

చిల్లర మల్లర ప్రభుత్వ మోసాలు. పార్లమెంటరీ కుట్రలకు సంబంధించిన సూచనల్లో అందెవేసిన చెయ్యి అయిన త్యేర్ "సమర్థుడైన" పత్రికారచయిత, తెలివైన "చతురభాషి," పార్లమెంటరీ వంచనలో నిపుణుడు, కూట సాక్ష్యంలో కళాకారుడు, పార్లమెంటరీ పార్టీ పోరాటాలకు సంబంధించిన చిల్లర మల్లర వ్యూహారచనలో, నికృష్టమైన నయవంచనల్లో, సూక్ష్మమైన పద్ధతుల్లో మహా నిపుణుడు. ఈ జిత్తులమారి మరుగుజ్జు ఫ్రెంచి బూర్జువావర్గాన్ని అర్ధశతాబ్దం పాటు సమ్మోహితం చేశాడంటే, తమ సొంత వర్గ అవినీతికి అతను అత్యంత సంపూర్ణ మేధో వ్యక్తీకరణ కావడమే అందుకు కారణం. ప్రతిపక్షంలో వున్నప్పుడు, అతను మరల మరల libertés nécessaires* గురించి ధర్మ పన్నాలు వల్లిస్తూండేవాడు. అధికారంలో ఉన్నప్పుడు వాటిని కాలరాస్తూండేవాడు. అధికారంలో లేనప్పుడు, ఫ్రెంచి ఖడ్గంతో యూరప్‌ను బెదరిస్తూండేవాడు. ఇంతకీ వాస్తవానికి, అతని దౌత్యపరమైన ఘనకార్యాలేమిటి? 1841లో లండన్ కన్వెన్షను[113] అవమానాన్ని దిగమింగడం, జర్మన్ ఐక్యతకు వ్యతిరేకంగా తన ఆడంబర ప్రసంగాల కారణంగా ప్రష్యాతో యుద్ధాన్ని త్వరితంచెయ్యడం, 1870లో యూరప్ రాజాస్థానాలన్నింటికీ భిక్షాందేహీ అంటూ తను చేసిన యాత్ర ద్వారా ఫ్రాన్సు పరువు తియ్యడం, 1871లో పారిస్ లొంగుబాటు పత్రంపై సంతకం పెట్టడం,[14] "ఎంత మూల్యం చెల్లించి అయినా సరే శాంతి"కి ఒప్పుకొని, ప్రష్యా నుండి ఒక రాయితీని — క్రిందికి తొక్కివెయ్యబడిన తన సొంత దేశంలో అంతర్యుద్ధాన్ని రెచ్చగొట్టడానికి అనుమతినీ, సాధనాలనూ అర్థించడం — ఇవీ అతగాడి ఘనకార్యాలు. అతని మాదిరి మనిషికి ఆధునిక సమాజాన్ని నడిపే అంతర్వాహినులు ఎన్నడూ బోధపడవనుకున్నా, కళ్లెదుట అత్యంత విస్పష్టంగా కనిపించే మార్పులను సైతం అర్థం చేసుకోవడంలో అతను విఫలుడయ్యాడు. ఈవిధంగా, పాత ఫ్రెంచి రక్షిత వ్యవస్థ నుండి ఏ మాత్రం వైదొలగినా కూడా, అప

---

* స్వేచ్ఛా స్వాతంత్ర్యాల ఆవశ్యకత. — సం.

చారంగా పరిగణించి అతను దుమ్మెత్తి పోశాడు. లూయీ ఫిలిప్ క్రింద మంత్రిగా ఉండగా రైల్వేల నిర్మాణం శుద్ధ మరీచిక అంటూ నిరసించాడు. లూయీ బోనపార్ట్ క్రింద పని చేసినప్పుడు సైతం కుళ్లిపోయిన ఫ్రెంచి సైనిక వ్యవస్థకు సంబంధించిన ప్రతి ఒక సంస్కరణనూ కూడా అతను ఆత్రంగా వ్యతిరేకించాడు. ఇతనిలో భావాలు పూజ్యం, విశ్వాసాలు నాస్తి, ధైర్యం శూన్యం.

ఇతడు ఒక అర్థంలో వృత్తిపరమైన "విప్లవవాది." తన ప్రదర్శనోత్సుకతతో, అధికారంలోకొచ్చి ప్రభుత్వ బొక్కసాన్ని అందుబాటులోకి తెచ్చుకోవాలన్న ఆతృతలో, తను ప్రతిపక్షంలోకి గెంటబడినప్పుడు ప్రజల ఉద్రేకాలను రెచ్చగొట్టి, ప్రత్యర్థిని పడ గొట్టేందుకు ఎలాంటి ముప్పునైనా కొనితెచ్చేందుకు అతను జంకడు. అదే సమయంలో అతను సరుకు తక్కువ సాదా యాంత్రిక వ్యక్తి, వగైరా. కార్మికవర్గాన్ని అతను "అలగా మూక"గా తూలనాడాడు. శాసన సభల్లో, అతని మాజీ సహచరుల్లో ఒకడూ, అతని సమకాలికుడూ, పెట్టుబడిదారే అయినా పారిస్ కమ్యూన్‌కి అంకితమైన సభ్యుడూ అయిన బెలే, అతన్ని ఉద్దేశించి ఒక బహిరంగ సమావేశంలో యిలా అన్నాడు:

"శ్రమను పెట్టుబడికి బానిసను చెయ్యడమే (asservissement) మీ విధానానికెప్పుడూ మూలాధారంగా ఉంటూ వచ్చింది. పారిస్ నగరపాలక కార్యాలయంలో శ్రమ రిపబ్లిక్ నెలకొన్న రోజు నుండీ కూడా 'వీళ్ల నేరస్తులు!' అంటూ గొంతెత్తి ఫ్రాన్సుకు అరచి చెప్పడం మీరు మానలేదు."

థ్యేర్ తన హోమ్‌మంత్రి ఎర్నెస్ట్ పికార్డ్ ద్వారా "ఇంటర్నేషనల్ అసోసియేషన్" పారిస్‌తో సంబంధాలు పెట్టుకోకుండా నిరోధించమని ఆజ్ఞలు జారీ చేశాడంటే అందులో ఆశ్చర్య పడాల్సిందేమీ లేదు (అసెంబ్లీ సమావేశం. మార్చి 28). ప్రిఫెక్టులకూ, సబ్ ప్రిఫెక్టులకూ థ్యేర్ సర్క్యులర్:

"శ్రమజీవుల్లో చిత్తశుద్ధిపరులు చెడ్డవాళ్లతో పోలిస్తే చాలా ఎక్కువ. వాళ్లు ఈ విషయం గుర్తుంచుకోవాలి. వాళ్ల నోటికి రొట్టె యింకో సారి దూరమైందంటే, దానికి బాధ్యత ఇంటర్నేషనల్‌కి చెందిన ప్రబుద్ధులకే చెందుతుంది. ఏ శ్రమ విమోచన దాతలుగా వాళ్లు నటిస్తూ వుంటారో నిజానికి ఆ శ్రమపట్ల వాళ్లు నియంతలు."

ఇంటర్నేషనల్ లేకుంటే...*

(ఇప్పుడిక డబ్బుకి సంబంధించిన కథ.) (అతనూ, ఫ్రావ్ తమ డబ్బును లండన్‌కి బదిలీ చేశారు.)** మోసగాళ్ల మధ్య కలహమొస్తే, నిజం బయటపడుతుందన్నదొక సామెత. అందుకని త్యేర్‌ని గురించిన చిత్రాన్ని పూర్తిచెయ్యడానికి, అతడి వెర్సేల్స్ జనరల్స్‌లో ముఖ్యునికి చెందిన లండన్ "Moniteur"లోని మాటలు ఉదహరిస్తే సముచితంగా ఉంటుంది. మార్చి 28వ తేదీ సంచికలో "Situation"[113] యిలా పేర్కొంది:

> "పితృహత్యా పాతకుడు, వావి వరసల్లేని వ్యభిచారి, రాజ్యధనాపహర్త, కావ్యచోరుడు, దేశద్రోహి, ఆతపాతకుడు, నపుంసకుడు అయిన త్యేర్ మంత్రి అయినప్పుడెప్పుడూ ప్రజలను ఊచకోత కొయ్యడానికి సైనికులను ఉసిగొల్పకుండా ఉండలేదు."

జిత్తులమారి కుయుక్తుల్లోను, కపటమైన కుతంత్రాల్లోను అతను చతురుడు.

---

జూలై విప్లవానికి ముందు రిపబ్లికన్లతో ముడివేసుకున్న వాడల్లా, తన పూర్వ పోషకుడైన లఫిట్‌కి పలాంకొట్టి, లూయీ ఫిలిప్ క్రింద తన తొలి మంత్రి పదవిలో దూరాడు త్యేర్. అతనప్పుడు చేసిన మొదటి పని, తన పూర్వ సహచరుడైన అర్మాన్ కరేల్‌ని ఖైదులోకి నెట్టడం. డచెస్ డి బెర్రీ పై వేగుగా, జైల్లో ఆమెకు మగమంత్రసానిగా పనిచెయ్యడం ద్వారా లూయీ ఫిలిప్ కృపాకటాక్షాలను సంపాదించుకున్నా డతను. కానైతే అతని కార్యక్రమం ట్రాన్స్‌నొనైన్ రోడ్డులో పారిస్ రిపబ్లికన్ తిరుగుబాటుదారుల ఊచకోత పైనా, పత్రికలకు వ్యతిరేకంగా సెప్టెంబరు చట్టాల[44] పైననే కేంద్రీకరింపబడింది. ఆటు తర్వాత పదును పోయిన ఉపకరణంలాగ, అతను ప్రక్కకు నెట్టివెయ్యబడ్డాడు. 1840లో కుట్ర ద్వారా మళ్లీ అధికారంలోకి దూరిన త్యేర్ పారిస్ దుర్గాల నిర్మాణ పథకం వేశాడు. "National"కి చెందిన బూర్జువా రిపబ్లికన్ల తప్ప, డెమోక్రటిక్ పార్టీ అంతా అతని యీ పథకాన్ని పారిస్ స్వేచ్ఛను అపహరించే ప్రయత్నంగా పరిగణించి వ్యతిరేకించింది. వారి యీ ఆందోళనకు ప్రతినిధుల సభ వేదికపైనుంచి త్యేర్ యిలా జవాబిచ్చాడు:

---

* ప్రాతప్రతిలో యీ వాక్యం అసంపూర్తిగా వుంది. — సం.

** ప్రాతప్రతిలో ఈ వాక్యాలు జర్మన్ భాషలో ఉన్నాయి. — సం.

"ఏమిటేమిటి? చుట్టూ కోటలు కడితే స్వేచ్ఛకు భంగం కలుగుతుందనుకోవడం విడ్డూరంగా లేదూ?... వాస్తవాన్ని బొత్తిగా గుర్తించక పోవడం తప్ప యిది వేరేమీ కాదు. మొదటి విషయం ఏమిటంటే, ఏ ప్రభుత్వమైనా ఏదో ఒక రోజున పారిస్‌ను బొంబార్డు చేయడం ద్వారా తనను తాను నిలబెట్టుకోవాలని చూస్తుందనుకోవడం ద్వారా మీరు ప్రభుత్వంపై అభాండాలు వేస్తున్నారు. ప్రభుత్వం తన బాంబులతో 'అంగ వికలుర' భవనాన్నీ, పాంథియన్*నో ఛిద్రంచేసిన తర్వాత, మీ కుటుంబాలనూ, యిళ్లనూ మంటలతో నిర్ధూమధామం చేసిన తర్వాత, మళ్లీ అది ఏ ముఖం పెట్టుకొని మీ ముందుకొచ్చి పదవిలో తిరిగి తనను ప్రతిష్ఠించమని కోరగలదు? అయితే, అటువంటి ప్రభుత్వం ముందరికన్న తన విజయం తర్వాతనే శతాధికంగా దుస్సాధ్యమవుతుంది."

నిజానికి, లూయీ ఫిలిప్ ప్రభుత్వం గాని, రాజప్రతినిధిగా బోనపార్టు ప్రభుత్వం గాని పారిస్ నుండి ఉపసంహరించుకొని, దానిని బొంబార్డు చేయడానికి సాహసించ లేదు. ఈ దుర్గాలను ఈవిధంగా ఉపయోగించడానికి త్యేర్‌కే అవకాశం కల్పించింది. ఈ దుర్గాల పథకం వేసినది అతనే.

1848 జనవరి[46]లో నేపుల్స్‌కి చెందిన బాంబు రాజు** పాలెర్మోను బొంబార్డు చేసినప్పుడు, త్యేర్ ప్రతినిధుల సభలో తిరిగి యిలా ప్రకటించాడు:

"అయ్యా పెద్దలారా, పాలెర్మోలో జరుగుతున్న దేమిటో మీకు తెలుసు. 48 గంటలపాటు ఒక పెద్ద పట్టణం ఫిరంగులతో బొంబార్డు చెయ్యబడింది. ఈ వార్త విన్నప్పుడు మీరందరూ భయకంపితులవుతారు. ఈ బొంబార్డుమెంటు చేస్తున్నదెవరు? విదేశీ శత్రువు తన యుద్ధ హక్కులు వినియోగించి యీ బొంబార్డుమెంటు చేస్తున్నాడా? లేదండి, దాని సొంత ప్రభుత్వమే ఈ పని చేస్తోంది. ఎందుకట? ఎందుకంటే, దురదృష్టవంతమైన ఆ పట్టణం తన హక్కులను డిమాండు చేసింది. ఔను, అలా తన హక్కులను డిమాండు చేసినందుకు గాను, అది 48 గంటల బొంబార్డుమెం

---

* మరణించిన ప్రముఖుల స్మారకమందిరం. — సం.

** రెండవ ఫెర్డినాండ్. — సం.

టుకు గురైంది. యూరప్ ప్రజాభిప్రాయానికై నన్ను విజ్ఞప్తి చెయ్యని వ్వండి. జాగరితమైన, యూరప్‌లో బహుశా అత్యున్నతమైన వేదిక నుండి, అటువంటి కృత్యాలకు వ్యతిరేకంగా కొన్ని కోపోద్రిక్త నిరసన పదాలను ప్రతిధ్వనింపచేస్తే, మానవాళికి సేవ చేసినదవుతుంది. పెద్దలారా, 50 ఏళ్ల క్రితం, సుదీర్ఘమైన ముట్టడిని తప్పించుకొనేందు కోసం, ఆస్ట్రియన్లు, యుద్ధ హక్కులను వినియోగించుకొని లిల్లీపై బొంబార్డు చెయ్యాలను కున్నప్పుడు; అటు తర్వాత అవే యుద్ధ హక్కులను వినియోగించుకొనే ఇంగ్లీషువారు కొపెన్‌హాగెన్‌ని బొంబార్డు చేసినప్పుడు, చివరకు, యిటీవలనే, తన మాతృదేశానికి సేవలు చేసిన రీజెంట్ ఎస్పర్టెరో, ఒక తిరుగుబాటును అణచివేసేందుకు గాను బార్సిలోనాని బొంబార్డు చేయించ దలచినప్పుడు ప్రపంచపు నలు మూలల నుండీ సర్వత్రా ఆగ్రహం ప్రకటింపబడింది."

అటు తర్వాత ఏ కొంచెమో ఎక్కువగా ఒక సంవత్సరం తర్వాత, రోమ్‌ని ఫ్రెంచి రిపబ్లిక్ సేనలు బొంబార్డు చెయ్యడాన్ని[47] త్యేర్ చాలా గట్టిగా బలపరచాడు, ఫ్రెంచి రాజ్యాంగచట్టాన్ని యీ విధంగా అతిక్రమించడానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేసిన పారిస్ నేషనల్ గార్డులను ఆశ్విక సైనికులచేత హతమార్పింపచేసిన తన మిత్రుడు జనరల్ షంగర్న్యేని బహుధా ప్రశంసించాడు త్యేర్.

1848 ఫిబ్రవరి విప్లవానికి కొద్ది రోజుల ముందు, గిజో ధర్మమా అని పదవికి తను చాలా కాలంగా దూరమైనందుకు చిరుబుర్రు లాడుతూ, ప్రజల్లో పెరుగుతున్న ఆందోళనను పసిగట్టిన త్యేర్, అది తన ప్రత్యర్థికి ఉద్వాసన చెప్పి, తనే లూయీ ఫిలిప్ ప్రభుత్వంలో కుదురుకోడానికి తనకొక అవకాశంగా ఎంచి, ప్రతినిధుల సభలో తన అచ్చెరువుము మళ్లీ యిలా వెల్లడించాడు:

"ఒక్క ఫ్రాన్సులోనే కాదు, యూరప్‌లో కూడా నేను విప్లవ పార్టీకి చెందినవాడివి. విప్లవ ప్రభుత్వం మితవాద వ్యక్తుల చేతుల్లో ఉండాలని నేను కోరుకుంటున్నాను.... కాని, ఒకవేళ అది ఉద్వేగపరుల చేతుల్లో, చివరకు రాడికల్స్ చేతుల్లో పడినా కూడా, నేను నా కర్తవ్యాన్ని విడిచిపెట్టను. నేను సదా విప్లవ పార్టీకే చెంది వుంటాను."

రిపబ్లిక్ ప్రకటింపబడిన నాటి నుండి రాజకీయ కుట దాకా ఫిబ్రవరి విప్లవాన్ని అణచడమొక్కటే అతని ఏకైక కార్యక్రమంగా ఉంది.

ఫిబ్రవరి తిరుగుబాటు అనంతరం మొదటి రోజుల్లో అతగాడు జాగ్రత్తగా దాక్కున్నాడు. కానీ, పారిస్ కార్మికులకు అతని పట్ల ద్వేషంకన్న ఏహ్య భావం చాలా ఎక్కువ కావడంతో అతన్ని గురించి అంతగా పట్టించుకోలేదు. అయినప్పటికీ, రోసిపోయిన అతని పిరికితనంతో – "నేనేదో ఒక రోజున రైన్‌నది గట్టుపై నా ప్రాణం విడుస్తాను" అన్న అతని బీరాలు అర్మాన్ కరేల్‌చేత "నువ్వు మురికి కాలవలో కుక్క చావు చస్తావు" అనిపింపచేశాయి – జూన్ తిరుగుబాటుదార్ల ఊచకోత ద్వారా ప్రజాశక్తులు అణచి వెయ్యబడిన తర్వాత గాని ప్రజా రంగంలో అతను సాక్షాత్కరించడానికి సాహసించలేదు. మొదట్లో అతను, తిరిగి తను బహిరంగంగా బయటకొచ్చేందుకు రంగం సిద్ధమయ్యే దాకా పువాట్యే రోడ్డు కుట్ర సమావేశానికి రహస్యంగా మార్గదర్శకత్వం వహించడంతోనే సరిపెట్టుకున్నాడు. ఆ కుట్ర సామ్రాజ్య పునరుద్ధరణకు దారి తీసింది.

---

పారిస్ ముట్టడి కాలంలో, పారిస్ లొంగిపోబోతున్నదా అన్న ప్రశ్నపై, "లొంగుబాటు" అన్న మాటను అనడానికి, పారిస్‌పై బొంబార్డుమెంటు జరగడం అవసరమని, జూల్ ఫావ్ జవాబిచ్చాడు! ప్రష్యన్ బొంబార్డుమెంటుకి వ్యతిరేకంగా అతని వాటకీయమైన నిరసనల రహస్యాన్నీ, త్యేర్ చేసిన బొంబార్డుమెంటు గట్టిదీ వికరమైనదీ కాగా, ప్రష్యన్ల బొంబార్డుమెంటు కుహనా దాడి అన్న విషయాన్నీ యిది స్పష్టం చేస్తుంది.

పార్లమెంటరీ బఫూను.

అతగాడు 40 ఏళ్లపాటు ప్రజారంగంలో ఉన్నాడు. ప్రభుత్వానికి గాని, జీవితానికి గాని సంబంధించిన ఏ ఒక్క రంగంలోనూ కూడా అతను ఎన్నడూ ఏ ఒక్క ఉపయోగకర చర్య ప్రారంభించలేదు. డాంబికుడు, సంశయాత్మకుడు, విషయ సుఖాసక్తుడు అయిన త్యేర్, గంభీర విషయాలను గురించి ఎన్నడూ రాయలేదు, మాట్లాడలేదు. తన రచనా ప్రాగల్భ్యాన్నీ, వాగ్ధాటినీ ప్రదర్శించుకోవడానికి వాస్తవ ఘటనలు అతని దృష్టిలో కేవలం సాకులు మాత్రమే. పదవి పట్లా, లాభార్జన పట్లా, ఆడంబర ప్రదర్శన పట్లా వ్యామోహం తప్ప, అతనికి సంబంధించి మరేదీ వాస్తవం కాదు. చివరకు అతని జాతీయ దురహంకారం సైతం వాస్తవం కాదు.

వృత్తి రీత్యా అసభ్య జర్నలిస్టుకి సరిగా తగినట్లుగానే, తన వెర్సేల్స్ ఖైదీల వికారాకారాలను గురించి తన బులెటిన్లలో ఎగతాళి చేస్తాడు, "భూస్వాముల సభ లక్షణంగా ఉంది" అని రాస్తాడు, మళ్లీ అంతలోనే, 300 మంది ఖైదీలుంచబడిన "ములెన్ సాకే" (మే 4) పట్టుబడటాన్ని గురించి బులెటిన్‌లో ప్రకటించి తనని తను అపహాస్యం పాలు చేసుకుంటాడు.

"యుద్ధ రంగంలో 150 మంది మృతులనూ, క్షతగాత్రులనూ దిగవిడిచి, మిగిలిన తిరుగుబాటుదార్లందరూ పలాయనం చేశారు" అని రాసి, యింకా యిలా జోడించాడు: "కమ్యూన్ రేపటి తన బులెటిన్లలో అభినందించు కోదగిన విజయం అలాంటిది.... తనను అణచివేస్తున్న ఘాతుక నిరంకుశుల నుండి పారిస్ త్వరలోనే విముక్తం చెయ్యబడుతుంది."

పారిస్ — అతనికి వ్యతిరేకంగా పోరాడుతున్న పారిస్ — జన సామాన్యపు పారిస్, అతని దృష్టిలో "పారిస్" కాదు. "పారిస్ అంటే, సంపన్న, పెట్టుబడిదారీ, సోమరి పారిస్ మాత్రమే" (పోనీ కలగాపులగపు కలగూరగంప అంటే?) త్యేర్ దృష్టిలో యిదీ పారిస్. నిజమైన పారిస్, కష్టించి పని చేసే, ఆలోచించే, పోరాడే పారిస్, ప్రజల పారిస్, కమ్యూన్‌కి చెందిన పారిస్, అతని దృష్టిలో "అలగా మూక" మాత్రమే. త్యేర్ వ్యాధి కంతటికీ మూలం పారిస్ పట్లనే కాకుండా, యావత్తు ఫ్రాన్సు పట్ల త్యేర్‌కి గల యీ వైఖరే. "శాంతియుత ఊరేగింపు"లోను, సెస్పే పిరికి పలాయనంలోను తన ధైర్యాన్ని ప్రదర్శించిన పారిస్, యీవాడు వెర్సేల్స్‌లో, రుయే వద్ద, సెయింట్ డెనీ వద్ద, సెయింట్ జెర్మేన్-ఎన్-లే వద్ద మూగుతున్న వాళ్ళు, వాళ్ల వెంటనే "మతానికి, కుటుంబానికి, భద్రతకి చెందిన వాళ్ళను, ఆస్తిపరులను" అనుసరించి వెళ్లే వేశ్యలు, (నిజంగా "ప్రమాదకారులైన," దోపిడిగాళ్ళు, పనిపాటల్లేకుండా ఉల్సాగా తిరిగే వర్గాల) ("the franc-fileurs"[78]) పారిస్, జరుగుతున్న యుద్ధం కేసి దూరదర్శిని యంత్రాల్లో తిలకించి మురిసేవాళ్ళు, ఎవరికైతే "అంతర్యుద్ధం ఒక కులాసా వ్యాపకమో" వాళ్ల పారిస్ — (కోబ్లెంజ్ ప్రవాస కేంద్రం[79] డి కలోన్ ఫ్రాన్సు అయినట్లుగానే) — త్యేర్ పారిస్ యిదీ. తన మొరటు జర్నలిస్టు పద్ధతిలో కనీసం కృత్రిమమైన హుందాతనాన్ని ప్రదర్శించడం పైతం అతనికి తెలియదు. అయితేనేం అతను, "లెజిటిమిస్టు" మర్యాదను తప్పకుండా ఉండేందుకు గాను నెయిల్లీ శిథిలాల క్రింద కానవచ్చిన స్త్రీలను, బాలికలను, పిల్లలను హతమారుస్తాడు. ఫ్రాన్సులో జరగాలని తను ఆజ్ఞాపించిన మునిసిపల్ ఎన్నికల సందర్భంగా దీపావళి కోసం పెట్రోలియం బాంబులు వేసి అతను క్లమార్‌లో జ్వాలాతోరణం సృష్టించాడు. రోమన్ చరిత్రకారులు నీరో స్వభావ చిత్రణను, ఆ రాక్షసుడు, తను లొల్లాయిపదాలల్లేవాడూ, విదూషకుడూ అయినందుకెలా గర్వంతో ఉబ్బి తబ్బిబ్బయే వాడో చెప్పడంతో ముగిస్తూ వుంటారు. కాని అంతదాకా ఎందుకు, త్యేర్‌లాంటి వృత్తి రీత్యా కేవలం జర్నలిస్టు, పార్లమెంటరీ బఫూనుకి అధికారం ఇచ్చేసి చూడండి, అతను నీరోను మించిన నీరో కాకపోతే చూసుకోండి.

బోనపార్టిస్టు "జనరల్సు"ను పారిస్‌పై పగతీర్చుకో నివ్వడంలో వర్గ ప్రయోజనాల

గుడ్డి సాధనంగా మాత్రమే అతను వ్యవహరిస్తున్నాడు; అయితే అతను — బులెటిన్లు, ఉపన్యాసాలు, విజ్ఞప్తుల ద్వారా — తన సొంత పాత్ర నిర్వహిస్తున్నాడు. వాటిలోనే అతని డాంబికం, అసభ్యత, జర్నలిస్టుగా అతనికుండే నీచాభిరుచీ బయటపడతాయి.

---

తనను లింకన్‌తోనూ, పారిస్ వాసులను అమెరికా దక్షిణ ప్రాంతపు తిరుగుబాటు దారులైన బానిస యజమానులతోనూ[37] అతను పోల్చుకున్నాడు. దక్షిణాదివాళ్లు శ్రమ బానిసత్వం కోసమూ, యునైటెడ్ స్టేట్స్ నుండి ప్రాంతీయ వేర్పాటు కోసమూ పోరాడారు. పారిస్, శ్రమ విమోచన కోసమూ, త్యేర్ ప్రభుత్వాధికార పరభాగ్యోప జీవుల నుండీ, ఫ్రాన్సుయొక్క కాబోయే బానిసయజమానుల నుండీ వేర్పాటు కోసమూ పోరాడుతోంది.

---

మేయర్ల నుద్దేశించి అత నిచ్చిన ఉపన్యాసంలో:

> “మీరు నా మాటమీద ఆధారపడవచ్చు, నేను నా మాట నెన్నడూ తప్పలేదు!”
>
> “ఈ అసెంబ్లీ, ఫ్రాన్సుచేత ఎన్నుకోబడిన మిక్కిలి ఉదారమైనవాటిలో ఒకటి.”

అతను రిపబ్లిక్‌ను కాపాడబోతున్నాడు,

> “రిపబ్లిక్ సంక్షేమానికి తామే ప్రత్యేక పరిరక్షకులన్నట్లు చెప్పుకొనే వారిచేత భద్రతా, శ్రమా వరుసగా భంగపరచబడకుండా ఉన్నట్లయితే.”

---

ఏప్రిల్ 27వ తేదీనాటి అసెంబ్లీ సమావేశంలో అతనిలా అన్నాడు:

> “అతనికంటె కూడా అసెంబ్లీ మరింత ఉదారమైనది.”

---

వియన్నా ఒప్పందాల విరసనను సదా తన వాగ్ధారలో తురుపు ఆసులా వాడుకొనే యీ ప్రబుద్ధుడు, పారిస్ ఒప్పందంపై[14] సంతకం పెట్టాడు: ఫ్రాన్సు నుండి ఒక భాగాన్ని విడదియ్యడమే కాక, దాదాపుగా దానిలో సగ భాగాన్ని జర్మన్ల ఆక్రమణలో అట్టిపెట్టే ఒప్పందమిది. బిస్మార్కును కనీసం తన యుద్ధ ఖర్చులేమిటో ఖచ్చితంగా తేల్చి చెప్పమనైనా అడక్కుండా వేల కోట్ల ఫ్రాంకులు నష్ట పరిహారంగా చెల్లించే ఈ ఒప్పందంపైన సంతకం పెట్టాడు! తన లొంగుబాటు ఒప్పందపు భాగాలను బోర్డో అసెంబ్లీ చర్చించేందుకు సైతం అతను అనుమతించలేదు!

విదేశీ సేనం వెనక తిరిగివచ్చినందుకూ, శాంతి సంధి[114] అనంతరం, ఫ్రాన్సును ఆక్రమించుకున్న మిత్రదేశాల పట్ల పరువుకి భంగమైన పద్ధతిలో ప్రవర్తించినందుకూ తన జీవితకాలమంతటా బూర్జువాల పై దుమ్మెత్తి పోసిన యీ ప్రబుద్ధుడు, బిస్మార్కుతో తను చేసుకున్న ఒప్పందంలో ఒకే ఒక రాయితీని (బిస్మార్కు రైహ్‌స్టాగ్‌లో పేర్కొన్నట్లు) పారిస్‌ను అణచేందుకు 40 000 సైనికులను కోరుకున్నాడు ఆంతరంగిక రక్షణ విషయంలోనూ, విదేశీ దురాక్రమణ విషయంలోనూ, పారిస్ తన సాయుధ నేషనల్ గార్డు చేతుల్లో పూర్తి భద్రంగా ఉంది. కానైతే త్యేర్ మాత్రం విదేశీ దురాక్రమణదారుకి పారిస్ వత్వర లొంగుబాటుకుతోడు, పారిస్‌ను తనకూ, తన ముఠాకీ కట్టబెట్టాల్సిన పద్ధతిని కూడా పేర్కొన్నాడు ఈ షరతు అంతర్యుద్ధానికి దారితియ్యక తప్పదు ఆ యుద్ధాన్ని సైతం, ప్రష్యా పరోక్షానుమతితోనే కాకుండా, అది అతనికిచ్చే తోడ్పాటుతోను, జర్మన్ కారాగార కూపాల నుంచి అది మహౌదార్యంగా పంపించే ఫ్రెంచి సైనిక ఖైదీలతోనే అతగాడు ప్రారంభిస్తాడు! తన సమాచార బులెటిన్లలోను అసెంబ్లీలో తనూ, ఫావ్ చేసిన ప్రసంగాల్లోను ప్రష్యా ముందు అతను అడియేన్ దాసోహం అంటూ మోకరిల్లతాడు, బిస్మార్కే పేర్కొన్నట్లు, ఆ సహాయం పొందడంలో విఫలుడయ్యాక కూడా ప్రతి వారమూ పారిస్‌ని ప్రష్యా జోక్యంతో బెదరిస్తూ వుంటాడు. ఈ బవూనులో, ఈ జాతీయ దురహంకార మహా బోధకునితో పోలిస్తే బూర్జువాల్లు హెందాతనం మూర్తీభవించిన వాళ్లని చెప్పాల్సి వుంటుంది!

---

ప్రష్యా విచ్ఛిత్తి తర్వాత (టిల్సిట్ శాంతి సంధి, 1807[30]) మహత్తరమైన ఒక సాంఘిక పునరుద్ధరణ (పెద్ద మార్పుల) ద్వారా మాత్రమే తననూ, దేశాన్నీ కాపాడుకోగలనని ప్రష్యన్ ప్రభుత్వం భావించింది ప్రష్యాలో అది చిన్న ఎత్తున, ఫ్యూడల్ రాజరిక పరిధిలో ఫ్రెంచి విప్లవ ఫలితాలను స్వీకరించి అన్వర్తింప చేసుకుంది రైతాంగాన్ని అది విముక్తం చేసింది వగైరా[115]

సెవాస్తపోల్ రక్షణ ద్వారా రష్యా తన గౌరవాన్ని కాపాడుకొని ఉండవచ్చు, పారిస్‌లో దౌత్యపరమైన తన విజయాల ద్వారా విదేశస్తుల కళ్లు మిరుమిట్లు కొల్పి యుండవచ్చు కాని, క్రైమియన్ యుద్ధంలో పరాజయానంతరం, స్వదేశంలో తన సాంఘిక, రాజకీయ వ్యవస్థలోని శైథిల్యం బయటపడటంతో, దాని ప్రభుత్వం ఫ్యూడల్ దాసులను విముక్తం చేసి, తన యావత్తు పాలనా వ్యవస్థనూ, న్యాయ వ్యవస్థనూ సంస్కరించింది.[116] రెండు దేశాల్లోనూ కూడా ఈ సాంఘిక సాహసిక సంస్కరణ ప్రజలచేత సాధించుకోబడటానికి బదులుగా, రాజరికంచేత దానం చేయబడినందున స్వభావ రీత్యా అది కుంచితము, పరిమితమూ అయింది. అయినా కూడా, పాలకవర్గాల దారుణమైన ప్రత్యేక

సౌకర్యాలు రద్దుచేసిన, పాత సమాజపు ఆర్థిక పునాదిలో మార్పు తెచ్చిన మహత్తరమైన సాంఘిక మార్పు లొచ్చాయి. వీరోచితమైన చర్యల ద్వారా మాత్రమే మహా జాడ్యాన్ని కుదర్చడం సాధ్యమని రెండు దేశాలలో గమనించారు. సాంఘిక సంస్కరణల ద్వారా, ప్రజా పునరుద్ధరణ శక్తులను సజీవం చెయ్యడం ద్వారా మాత్రమే విజేతలకు తాము సమాధానం చెప్పగలమని భావించారు. 1870 నాటి ఫ్రెంచి మహా విపత్తుకి సాటి వచ్చేది ఆధునిక ప్రపంచ చరిత్రలో మరొకటి లేదు! కుళ్లిపోయిన శవంవంటి అధికారిక ఫ్రాన్సును, లూయీ బోనపార్ట్ ఫ్రాన్సును, పాలకవర్గాల, వాళ్ల ప్రభుత్వ పరాన్నభుక్కుల ఫ్రాన్సును, అది బహిర్గతం చేసింది. అదమరచిన ప్రజలను వంచించి, ప్రభుత్వంలో తిష్ఠవేసి, విదేశీ దాడిదారునితో కుట్ర ద్వారా ఆ అధికారాన్ని నిలబెట్టుకుంటున్న కుఖ్యాతుల మొట్టమొదటి ప్రయత్నమేమిటి? ప్రష్యన్ పోషకత్వంలో, లూయీ బోనపార్ట్ సైనికుల చేతా, పియెత్రీ పోలీసులచేతా, పారిస్‌లో ప్రారంభమైన ప్రజా పునరుద్ధరణ మహత్తర కృషిని అంతమొందించడం, జూలై విప్లవంచేత తాడింపబడిన లెజిటిమిస్టు* పాత భూతాలన్నింటినీ తిరిగి ఆవాహన చెయ్యడం ఫిబ్రవరి విప్లవంచేత పరాజితమైన లూయీ ఫిలిప్‌కి చెందిన కాలం చెల్లిన దగాకోర్లను తిరిగి రప్పించడం, విప్లవ ప్రతిఘాత విలయ తాండవ నృత్యం సాగించడమూను! విపరీతమైన ఆత్మనైచ్యంలో యిటువంటి వీరత్వానికి ప్రపంచ చారిత్రకేతిహాసంలోనే మరెక్కడా పోలిక లేదు! కాని, అత్యంత విడ్డూరమైన విషయ మేమిటంటే, అధికార యూరప్, అమెరికాలలో సాధారణ క్రోధావేశాలను రెచ్చగొట్టడానికి బదులు అది సానుభూతి పరంపరను, పారిస్ పట్ల తీవ్రమైన నిరసనను లేవగొట్టింది! దీన్నిబట్టి పారిస్, తన గత చరిత్రకు తగినట్లుగా, పాత సమాజ పునరుజ్జీవనంలోను, మానవాళి సాంఘిక పునరుజ్జీవనాన్ని ఫ్రాన్సుయొక్క జాతీయ వ్యవహారంగా చెయ్యడంలోను ఫ్రెంచి ప్రజల పునరుజ్జీవనాన్ని కోరుతున్నట్లుగా రుజువవుతోంది! దోపిడి వర్గాల నుండి, వాటి భృత్యుల నుండి, "les valets du diable sont pire que le diable"* అనే ఫ్రెంచి సామెతలోని సత్యాన్ని రుజువుచేసేవారి ప్రభుత్వ పరాన్నభుక్కుల నుండి ఉత్పాదక వర్గ విముక్తే అది. పారిస్, మానవాళి పతాకాన్ని ఎగరేసింది!

<u>మార్చి 18:</u> ప్రభుత్వం ఈ కింది చర్యలు తీసుకుంది:

> "అదెలాంటిదైనా సరే, ప్రతి ఒక్క పత్రికయొక్క, ప్రతి ఒక్క కాపీపైనా రెండు సెంటీములు చెల్లించినట్లు ప్రత్యేక స్టాంపు ఉండాలి."
> "ముట్టడి స్థితిని ఎత్తివేసే దాకా కొత్త పత్రికల స్థాపన నిషేధింపబడింది."

---

* "భూత భృత్యుడు భూతంకన్న భయంకరుడు." — సం.

ఫ్రెంచి బూర్జువావర్గానికి చెందిన విభిన్న ముఠాలు, ఒక దాని తర్వాత మరొకటి తమ పాలనలు సాగించాయి. రెస్టొరేషన్ (పాత బూర్బన్ల) క్రింద బడా భూస్వాములు, దాని బోనపార్టిస్టు, రిపబ్లికన్ శక్తులు వెనక నుండి కలతలు రేపుతూండగా జూలై పార్లమెంటరీ రాజరికం (లూయీ ఫిలిప్) క్రింద పెట్టుబడిదారులు పాలన సాగించారు. వాళ్ల పార్టీ కుమ్ములాటలూ, కుట్రలూ ప్రజా సంక్షేమం సాకుతో కొనసాగించబడుతూ వచ్చాయి. ప్రజా విప్లవం ఒక రాజరికాన్ని త్రోసివెయ్యడంతో, మరొకటి తయారైంది. (ఫిబ్రవరి) రిపబ్లిక్కుతో యిదంతా మారింది. బూర్జువావర్గానికి చెందిన ముఠాలన్నీ పార్టీ ఆఫ్ ఆర్డర్లో, అంటే, భూస్వాములూ, పెట్టుబడిదారుల పార్టీలో, శ్రమ యొక్క ఆర్థిక దాస్యాన్నీ, దానికి తోడ్పాటునిచ్చే పీడక రాజ్య యంత్రాన్నీ కొనసాగించేందుకు గాను, ఏకమయ్యాయి. రాజరికం అంటేనే ఒక బూర్జువా ముఠాపై మరో బూర్జువా ముఠా పెత్తనం, ఒక పక్షానికి విజయమూ, మరో పక్షానికి అపజయమూ (ఒక పక్షానికి విజయోత్సాహం, మరో పక్షానికి పరాజయ క్లేశం) అవుతుంది. కాబట్టి, రాజరికానికి బదులు, రిపబ్లిక్ ఏర్పడితే అది, ప్రజలను దోపిడి చేసేవాళ్లనందర్నీ ఏక తాటిన కట్టిన బూర్జువా ముఠాలన్నింటి సమైక్య అనామక జాయింట్ స్టాక్ కంపెనీ అవుతుంది. నిజానికి సరిగా అలాగే, లెజిటిమిస్టులు, బోనపార్టిస్టులు, ఆర్లియనిస్టులు, బూర్జువా రిపబ్లికన్లు, జెస్యూట్లు, వోల్టేరియన్లు ఒకరినొకరు పరస్పరం ఆలింగనం చేసుకున్నారు. ఇప్పుడిక రాజరిక ఛత్రఛాయ అనే ముసుగు లేదు, యిప్పుడిక తమ పార్టీ కుమ్ములాటలకు ప్రజా ప్రయోజనాల కోసం జరిగే పోరాటాలన్న ముసుగు వేసి, వాటిలో ప్రజలకు ఆసక్తి కలిగించగల శక్తీ లేదు, ఇప్పుడిక ఈ ముఠా మరొకదానికి తలొగ్గాల్సిన పనీ లేదు. ఉత్పత్తి చేసే ప్రజా సామాన్యంయొక్క విముక్తికి తమ వర్గ పాలనయొక్క ప్రత్యక్ష ప్రాతికూల్యాన్ని బాహాటంగా ప్రకటించ వచ్చు—భద్రత అన్నది, వాళ్ల వర్గపాలనయొక్క ఆర్థిక, రాజకీయ పరిస్థితులకూ, శ్రమ దాస్యానికీ పేరు. ఈ అనామక, లేక బూర్జువా పాలనయొక్క రిపబ్లికన్ రూపం, ఈ బూర్జువా రిపబ్లిక్, పార్టీ ఆఫ్ ఆర్డర్యొక్క ఈ రిపబ్లిక్—అన్ని రాజకీయ వ్యవస్థల్లోనూ పరమ ఏహ్యమైనది. వేరుగా దాని పనీ, దాని అస్తిత్వానికి గల ఏకైక ప్రయోజనమూ కూడా ప్రజలను అణచివెయ్యడమే. వర్గపాలనయొక్క టెర్రరిజం (హింసావాదం) అది. అది యీవిధంగా సాధించబడింది. ప్రజలు పోరాడి, విప్లవం జరిపి, రిపబ్లిక్ను ప్రకటించి, జాతీయ అసెంబ్లీకి చోటిచ్చారు. అసెంబ్లీలో, ఓడిపోయినవాళ్లు, రిపబ్లిక్కి ప్రకటిత శత్రువులు, మెజారిటీలో ఉన్నారు. అసెంబ్లీలోని ఆ మెజారిటీచేత, రిపబ్లికన్ వాగ్దానాలు చేసే బూర్జువాలు—వాళ్లే తమ "రిపబ్లిక్"కి రక్షకులన్నట్లు—వేదికమీద ముందు వరసకి నెట్టబడ్డారు. ప్రజలను తిరుగుబాటు అనే బోనులోకి ప్రోత్సాహపరచి నెట్టే బాధ్యత

రిపబ్లికన్లకు అప్పగింపబడింది. అటు తర్వాత సైన్యంచేత దాన్ని మట్టు పెట్టడమే ఈ ఎత్తుగడలోని ఆంతర్యం. ఫిబ్రవరి విప్లవానంతరం (జూన్ తిరుగుబాటుచేత) కవేన్యాక్ నాయకత్వానగల "National" పార్టీచేత ఈ పాత్ర నిర్వహింపబడింది. ప్రజా సామాన్యానికి వ్యతిరేకంగా తాము చేసిన అపరాధం కారణంగా, ఈ రిపబ్లికన్లు అప్పుడు తమ పలుకుబడిని కోల్పోయారు. వాళ్ళు తమ పని పూర్తిచేశారు. పార్టీ ఆఫ్ ఆర్డర్ శ్రామికవర్గానికి వ్యతిరేకంగా జరిపే సాధారణ పోరాటంలో, దాన్ని బలపరచడానికి వాళ్ళింకా అనుమతింపబడుతున్నా, వాళ్ళు ప్రభుత్వం నుంచి తొలగింపబడ్డారు, వెనక శ్రేణుల్లోకి నెట్టబడ్డారు, వాళ్ళను "సహించి ఉన్నారు" అంతే. సమైక్య రాజరిక బూర్జువా వర్గం అప్పుడిక రిపబ్లిక్ పీఠ అయింది, పార్టీ ఆఫ్ ఆర్డర్‌యొక్క సిసలైన పాలన నెలకొంది. ప్రజల భౌతిక శక్తులు తాత్కాలికంగా విచ్ఛిన్నం చెయ్యబడటంతో, అభివృద్ధి నిరోధక శక్తుల కృషి — నాలుగు విప్లవాల్లో సంపాదించుకున్న రాయితీలన్నింటినీ భగ్నం చెయ్యడం — క్రమక్రమంగా ప్రారంభమైంది. పార్టీ ఆఫ్ ఆర్డర్ చేసిన ఘనకార్యాల వల్లనే కాకుండా, తమను నికారపు తలబిరుసుతనంతో ఓడిపోయినవారుగా పరిగణించడంవల్ల కూడా ప్రజలు కోపోన్మత్తులయ్యారు. తమ పేరునా, రిపబ్లిక్ పేరునా, తమను ఆ నికృష్టుల ముఠా పాలిస్తున్న తలబిరుసు తీరువల్ల కూడా ప్రజలు కోపోద్రిక్తులయ్యారు. అనామక వర్గ నిరంకుశత్వానికి సంబంధించిన గుబుళ్ళవంటి పాలన రూపం ఎక్కువ కాలం మనజాలదు, అది పరివర్తన దశగా మాత్రమే ఉండగలదు. తాను విప్లవమనే ఒక అగ్ని పర్వతంపై కూర్చున్నానన్న సంగతి దానికీ తెలుసు. మరోవంక, పార్టీ ఆఫ్ ఆర్డరుగా కార్మికవర్గానికి వ్యతిరేకంగా తను జరిపే యుద్ధంలో సమైక్యంగానే వున్నా, దానికి చెందిన విభిన్న ముఠాలు ఒకదానికి వ్యతిరేకంగా మరొకటీ, పాత సామాజిక వ్యవస్థలో తన ప్రత్యేక ప్రయోజనం కొనసాగేందు కోసమూ, ప్రతి ముఠా మరొక దానికి వ్యతిరేకంగా కుతంత్రాల్లో మునిగే వుంది. ప్రతి ముఠా తన సొంత మనిషిని గద్దెనెక్కించేందు కోసం, అలాగే తన సొంత ఆశా సాఫల్య సాధన కోసం, కృషిచేస్తూనే ఉంది. అయినా, భౌతిక విప్లవ శక్తుల వినాశం ద్వారా పార్టీ ఆఫ్ ఆర్డర్ పాలన భద్రంగా ఉందని హామీ తోచగానే దాని పూర్తి శక్తిని వినియోగించడంలో ముఠాలన్నీ పూర్తిగా సహకరిస్తున్నాయి. ప్రజలకు వ్యతిరేకంగా ఉమ్మడి పోరాటం, రిపబ్లిక్‌కి వ్యతిరేకంగా ఉమ్మడి దురాలోచన, వీటితో కలిసికట్టుగా సాగే దాని పాలకుల ఆంతరంగిక కుమ్ములాటలు, వాళ్ల కుతంత్రాలు — ఇవన్నీ కలిసి సమాజాన్ని స్తంభింపచేస్తాయి, బూర్జువావర్గంలోని చాలా మందిని చికాకుపరచి గందరగోళపరుస్తాయి. వ్యాపారులకు "యిబ్బంది కలిగిస్తాయి." వాళ్ళను నిరంతర అశాంతి ఆందోళనలకు గురి చేస్తాయి. ఈ పాలన క్రింద నిరంకుశత్వ పరిస్థితులన్నీ సృష్టింపబడ్డాయి (ఉత్పన్నం చేయబడ్డాయి). అయితే, యిది ప్రశాంతి

లేని నిరంకుశత్వం, పార్లమెంటరీ అరాజకత్వం తలమానికంగా కల నిరంకుశత్వం. అప్పుడిక అక్రమంగా అధికారాన్ని హస్తగతం చేసుకొనేందుకు రాజకీయ కుట్రకి తరుణం ఆసన్నమైంది. చేతకాని ముఠా అదృష్టవంతుడైన సింహాసన వారసునికి చోటిచ్చి ప్రక్కకి వైదొలగి, అనామక వర్గ పాలనకు స్వస్తి చెప్పాల్సి వచ్చింది. ఈవిధంగా, నాలుగేళ్ల పాటు అస్తిత్వంలో వున్న బూర్జువా రిపబ్లిక్‌ను లూయీ బోనపార్ట్ తుదముట్టించాడు.[10] ఆ కాలమంతట్లోనూ రిపబ్లిక్ పేర రిపబ్లిక్‌పై యుద్ధం చేసిన, ప్రజలపై వర్గ యుద్ధం జరిపిన, వాస్తవానికి సామ్రాజ్యాన్ని సృష్టించిన పార్టీ ఆఫ్ ఆర్డర్‌యొక్క "âme damnée"*గా త్యేర్ ఉన్నాడు. అతగాడు యిప్పుడు కూడా సరిగా వెనక వహించిన పాత్రనే వహించాడు. అయితే ఒక్కటే తేడా. వెనక పార్లమెంటరీ కుతంత్ర కర్తగా యీ పని చేస్తే, యిప్పుడు ప్రభుత్వ ప్రధానిగా యీ పని చేశాడు. విప్లవంచేత జయింపబడక పోయినట్లయితే, యిప్పుడూ అప్పటిలాగే అతగాడు భంగపాటుకు గురైన సాధనంగానే ఉంటాడు. ప్రత్యర్థి ప్రభుత్వం ఏది పదవిలోకి వచ్చినా, దాని తొట్ట తొలి చర్య, ఫ్రాన్సుని ప్రష్యాకి కట్టబెట్టి, పారిస్‌ని బొంబార్డు చేయించిన యీ వ్యక్తిని ప్రక్కకి యీడ్చి పారెయ్యడమే అవుతుంది.

లూయీ బోనపార్ట్‌కు వ్యతిరేకంగా త్యేర్‌కు ఫిర్యాదులు చాలా వున్నాయి. లూయీ బోనపార్ట్ అతగాడినొక సాధనంగా ఉపయోగించుకొని, అతనిని బోల్తా కొట్టించాడు. రాజకీయ కుట్ర అనంతరం అరెస్టు చెయ్యడం ద్వారా లూయీ బోనపార్ట్ అతడిని భయకంపితుడిని (అతడి నవ నాడులనూ, స్తంభింప) చేశాడు. త్యేర్ వంటి కేవల ప్రభుత్వోపజీవి, వట్టి వాగుడుకాయ, ఏ పార్లమెంటరీ పాలనలో మాత్రమైతే తన రాజకీయ పాత్రను వహించగలడో దాన్ని లూయీ బోనపార్ట్ అణచివేశాడు. ఆఖరిదే అయినా అప్రధానం కానిది, చరిత్రకు సంబంధించిన తన రచనలలో నెపోలియన్ బూట్లు తుడిచేవాడుగా తయారైన త్యేర్, నెపోలియన్ ఘనకార్యాలను దీర్ఘ కాలంగా వర్ణించి వర్ణించి ఉన్నాడేమో, చివరికి వాటన్నింటినీ తనే చేశానేమోనన్న భ్రమలో పడ్డాడు. అతని దృష్టిలో మొదటి నెపోలియన్‌కి సరైన వ్యంగ్య చిత్రం మరుగుజ్జు త్యేర్‌గాని, వామనమూర్తి నెపోలియన్ కాదు. పైగా, లూయీ బోనపార్ట్ చేసిన దగుల్బాజీ పనుల్లో త్యేర్ బలపరచనిది — రోమ్‌ను ఫ్రెంచి సేనలు ఆక్రమించుకోవడం నుండి ప్రష్యాతో యుద్ధం దాకా — ఒక్కటి కూడా లేదు.

సగం లెజిటిమిస్టులతో, సగం ఆర్లియనిస్టులతో కూడిన జాతీయ అసెంబ్లీని కలిగి, బోనపార్టిస్టు జనరల్స్ నాయకత్వం క్రింద ఉన్న సైన్యాన్ని కలిగి, మెడమీద తల వున్న

* అంటే, త్యేర్ పార్టీ ఆఫ్ ఆర్డర్‌కి "విధేయుడైన దాసుడు." — సం.

ఏ రిపబ్లిక్ అయినా, విజయం సాధించిన వాడు, తనను ప్రక్కకి గెంటెయ్యదని బొత్తిగా బుర్ర లేని వ్యక్తి తప్ప భ్రమపడలేదు.

---

అంగుష్ఠమాత్రుడు తైమూర్ తామర్లేన్ పాత్ర నిర్వహించాలని ప్రయత్నించడంకన్న వికృతమైన దారుణం మరొకటుండదు. త్యేర్‌కు సంబంధించినంత వరకు క్రూరకృత్యాలన్నవి మామూలు దైనందిన కార్యక్రమాలే కాకుండా చోద్యమైన స్వాతిశయ నాటకీయ ప్రదర్శనలుగా కూడా కనిపిస్తాయి. "తన" సమాచార పత్రాల (బులెటిన్ల) రచన, "తన" కాఠిన్య ప్రదర్శన, "తన" సేనలను కలిగి ఉండటం, "తన" వ్యూహం, "తన" బొంబార్డుమెంటులు, "తన" పెట్రోలియం బాంబులు, డిసెంబరిస్టు ద్రోహులు పారిస్‌పై పగసాధించుకోవడానికి నిర్దాక్షిణ్యంగా అనుమతించడం ద్వారా "తన" భీరుత్వాన్ని కప్పిపుచ్చుకోవడం! ఈ రకమైన వీరత్వముందే, యిది నైచ్యానికి పరాకాష్ఠ తప్ప మరొకటి కాదు! తను వహించే ప్రముఖ పాత్రనీ, ప్రపంచంలో తను చేసే కలకలాన్నీ తలుచుకొని అతను సగర్వంగా మురిసిపోతాడు! తానొక మహా వ్యక్తినని భ్రమిస్తాడు! మరుగుజ్జు, పార్లమెంటరీ కుయుక్తిపరుడూ అయిన తాను, ప్రపంచం దృష్టిలో తాళవృక్ష ప్రమాణంలో కనిపించాలని తాపత్రయపడతాడు! ఈ యుద్ధానికి సంబంధించిన భయంకర దృశ్యాల నడుమ, త్యేర్ స్వాతిశయపు కుప్పిగంతులను చూసిన వాళ్లెవ్వరూ పొట్టపగిలేట్లు నవ్వకుండా ఉండజాలరు! త్యేర్ ఊహాశాలి, అతని రక్తంలో కళాకారుని కుండే చిన్నె వుంది. దానితోబాటే, తన అబద్ధాలను తన చేతనే నిజమని భ్రమింప చేసే, తన ఘనతపట్ల తనకే భ్రమలు గొలిపే కళాకారుని స్వాతిశయం కూడా అతనిలో ఉంది.

---

త్యేర్ ప్రసంగాలు, బులెటిన్లు మొదలైన వాటన్నింటిలోనూ కూడా స్వాతిశయం ప్రొతస్వినిలా కనిపిస్తుంది.

---

<u>అనన్యాకరమైన ఆ ట్రిబులే.*</u>

మాంవలెర్యేన్ నుండి జరిపిన శోభాయమానమైన బొంబార్డుమెంటు (పెట్రోలియం బాంబులతో) కారణంగా ప్రాకారం లోపలి టెర్న్ పేట యిళ్లలో కొన్ని వాటవ

---

*ట్రిబులే – 19వ శతాబ్దపు ఫ్రెంచి రచయిత హ్యూగో రచించిన "రాజు వినోదపరుస్తున్నాడు" అనే నాటకంలోని విదూషకుడు. – సం.

మవుతాయి. అప్పుడు ఆకాశాన్నంటే మంటలు లేస్తాయి. ఫిరంగి మ్రోతలు పారిస్ నగరాన్ని దద్దరిల్లజేస్తాయి. చెర్చ్‌లోకి ఎలిసే పార్క్‌లోకి బుద్ధిపూర్వకంగా బాంబులు విసరబడతాయి.

పేలే బాంబులు, పెట్రోలియం బాంబులు.

## కమ్యూన్

ప్రఖ్యాత బ్రిటిష్ చౌకబారు పత్రికా రచయిత, స్వపరిపాలన అంటే తాము అనుకుంటూ వచ్చినది యిది కాదంటూ ఘనమైన విశేషమొకదాన్ని కనిపెట్టాడు. అది కాని మాట నిజమే భోజన ప్రియులైన ఆల్డర్‌మెన్‌చేతా, చట్టా వ్యాపారులచేతా, అనాథశరణాలయాల్లో వారిపై క్రౌర్యం ప్రదర్శించే పోషకులచేతా జరిగే పట్టణాల స్వపరిపాలన కాదిది బడా భూస్వాములచేతా ధనపతులచేతా, శూన్య మస్తిష్కాలచేతా చెయ్యబడే కౌంటీల స్వయం పరిపాలన కాదిది 'జీతభత్యాల్లేని మహోద్యోగుల"117 న్యాయ పరమైన అసహ్యకరమైన గూడు పుఠానీ కాదు స్వపరిపాలన అంటే. ప్రభువుల క్లబ్బు ద్వారాగాని* "Times" పత్రికా పరనం ద్వారా గాని సాగే దేశపు రాజకీయ స్వయం పరిపాలన కాదిది. ప్రజలు తమ కోసం తామే చేసుకొనే పరిపాలన యిది.

---

ప్రభుత్వ అధినాయకత్వంలో బైరాయించిన విహ్వాన్మైన మరుగుజ్జుయొక్క "సాహితీ పరమైన" కూతలే, నరభక్షకుల ఈ యుద్ధంలో మిక్కిలి అసహ్యం కలిగించే అంశాలు!

వెర్సైల్స్ ఖైదీలను క్రూరంగా చూడటమన్నది ఒక్క నిముషం కూడా విరామం లేకుండా సాగింది కమ్యూన్, దమనకాండకి సంబంధించిన తన ఆజ్ఞలను అమలు జరప జాలనంతటి అధికతర మానవత్వం కలిగి వుందని వెర్సైల్స్ గ్రహించిన తక్షణమే ఖైదీలను హతమార్చడాన్ని నిర్దాక్షిణ్యంగా తిరిగి సాగించింది!

(వెర్సైల్స్‌లోని) "Par s-Journa ," క్లమార్ రైల్వే స్టేషన్లో ఖైదు చెయ్యబడిన పదముగ్గురు సైనికులు వెన్వెంటనే కాల్చివెయ్యబడ్డారనీ, సైనిక దుస్తులు

---

* మునిసిపల్ కార్యాలయం పద్యులు. — సం.

ధరించి వెర్సేల్స్ చేరుకున్న ఖైదీలందరూ, వాళ్ల గుర్తింపుకి సంబంధించిన అనుమానాలు రుజువు కాగానే కాల్చివెయ్యబడతారనీ రాసింది!

హోదాలేకపోయినా, జనరల్ బాధ్యతలు నిర్వహిస్తున్న ఒక యువకుడు (బందీగా) కొద్దివందల గజాలు నడిపింపబడిన తర్వాత రోడ్డుపై కాల్చివెయ్యబడ్డాడని అలెగ్జాండర్ డ్యూమా జూనియర్ తెలియజేశాడు.

మే 5. "Mot d'Ordre": వెర్సేల్స్‌లో ప్రచురింపబడే "Liberté"[118] పత్రిక రాసిన దాన్నిబట్టి, "క్లమార్ వద్ద తిరుగుబాటుదారుల మధ్య కనిపించిన రెగ్యులర్ సైన్యానికి చెందిన సైనికులందరూ అక్కడికక్కడ కాల్చివెయ్యబడ్డారు" (లింకన్-త్యేర్‌చేత!) (లింకన్ యుద్ధంలో ప్రత్యర్థుల హక్కుల్ని గుర్తించాడు). "ఫ్రెంచి కమ్యూన్లన్నింటి గోడలపైనా పారిస్ వాసులు హంతకులంటూ రాస్తున్నది వీళ్లండీ!" బందిపోటు దొంగలు!

డెమరే.

కమ్యూన్ రాయబార వర్గ మొకటి 185వ ఫీల్డు బెటాలియన్‌కి చెందిన నలుగురు నేషనల్ గార్డుల కేసును గురించి వాకబు చెయ్యడానికి (ఏప్రిల్ 27న) బిసేటర్‌కి, వెళ్లింది. అక్కడ వాళ్లకు చనిపోకుండా మిగిలిన (బాగా గాయపడిన) షెఫేర్ కనిపించాడు.

> "ఏప్రిల్ 25న, తనూ, తన ముగ్గురు కామ్రేడ్సూ విల్‌జాయిఫ్ సమీపంలోని బెల్ ఎపిన్ వద్ద అశ్విక సైనిక దళంచేత చిక్కామనీ, వాళ్లు తమను లొంగిపొమ్మన్నారనీ ఆ క్షతగాత్రుడు చెప్పాడు. తమను చుట్టుముట్టిన దళానికి వ్యతిరేకంగా ప్రతిఘటనకు పూనుకోవడం దుస్సాధ్యమైనందున, వాళ్లు తమ ఆయుధాలను క్రిందపెట్టి లొంగిపోయారు. సైనికులు వాళ్లను చుట్టుముట్టి, వాళ్లపై ఏవిధమైన దౌర్జన్యమూ జరపకుండా, బెదరింపులూ బెదరించకుండా వాళ్లను ఖైదీలను చేశారు. వాళ్లు అలాగ కొద్ది నిముషాలు ఖైదీలుగా ఉన్నారో లేదో, యూలోగా గుర్రంపై స్వారీ చేస్తూ ఒక కెప్టెను అక్కడి కొచ్చి, చేతిలో రివాల్వరుతో వాళ్లపైకి ఉరికాడు. ఒక్క మాట కూడా మాట్లాడకుండా, అతను వారిలో ఒకడిని నిలువునా కాల్చి అక్కడికక్కడ చంపేశాడు. తర్వాత అతను గార్డ్స్‌మన్ షెఫేర్‌పై కాల్చాడు. రొమ్ముపై గుండు తగిలిన షెఫేర్ తన కామ్రేడ్ వరసనే నేలకొరిగాడు. నీచమైన యీ దాడిని చూసి భయకంపితులైన మిగిలిన యిద్దరు గార్డులూ తప్పించుకు పారి

పోయేందుకు ప్రయత్నించారు. కానైతే కృద్ధుడైన ఆ కెప్టెన్ వాళ్లిద్దరినీ కూడా తరిమి తరిమి రివాల్వరుతో కాల్చి చంపాడు. ఆటవికమైన యీ పిరికి దాడుల తర్వాత ఆశ్విక సైనికులు హతులను అక్కడే వదిలి, తమ దళపతితో కలిసి నిష్క్రమించారు."

"New-York Tribune"[119] లండన్ పత్రికలను మించిపోయింది.

తైర్‌యొక్క "ఫ్రాన్సులో ముందెన్నడూ లేని మిక్కిలి ఉదారమై, పరమ స్వేచ్ఛా యుతంగా ఎన్నుకోబడిన జాతీయ అసెంబ్లీ, ఆర్లియనిస్టు బంటు తైర్ నాయకత్వంలో, తన "ఫ్రాన్సు చరిత్రలోనే ఎన్నడూ లేనంతటి మిక్కిలి శ్రేష్ఠమైన సైన్యంతో." దొంగ సాకుపైన ఎన్నుకోబడిన యీ ముదిమది తప్పిన chambre introuvable* ప్రత్యేకించి దాదాపు పూర్తిగా లెజిటిమిస్టులతోను, ఆర్లియనిస్టులతోనే[9] కూడి వుంది. తైర్ ప్రత్యక్ష పర్యవేక్షణలోనే ఏప్రిల్ 30న నిర్వహింపబడిన మునిసిపల్ ఎన్నికలు, ఫ్రెంచి ప్రజలతో వాళ్లకి గల మనిష్ఠ సంబంధాన్ని తెలియజేస్తాయి! ఛిద్రం చెయ్య బడిన ఫ్రాన్సులో యింకా మిగిలి వున్న 35,000 కమ్యూన్లు ఎన్నుకొన్న 7,00,000ల మంది కౌన్సిలర్లలోనూ 200 మంది లెజిటిమిస్టులు, 600 మంది ఆర్లియనిస్టులు, 7000 మంది ప్రకటిత బోనపార్టిస్టులు, మిగిలిన వాళ్లందరూ రిపబ్లికన్లో, కమ్యూనిస్టులో. (వెర్సేల్స్ విలేకరి, "Daily News,"[91] మే 5.) ఫ్రాన్సులో యింతవరకున్న వాటన్నింట్లోకీ ఈ అసెంబ్లీ కేవలం, అధికారాన్ని చేజిక్కించుకున్న ఒక మైనారిటీకి చెందినది మాత్రమేనని చెప్పడానికి యింత కన్న మరేం రుజువు కావాలి?

## పారిస్

పిడికెడుమంది "నిరూపిత నేరస్తుల," "విడుదల సర్టిఫికెట్లు పొందిన వ్యక్తుల"యొక్క, పారిస్ శత్రువులయొక్క సాధనంగా తైర్ కమ్యూన్‌ను పదేపదే వర్ణించాడు. ఈ "పిడికెడుమంది" సాహసికులే ఆరు వారాలకు పైగా తైర్ బుద్ధి బలంచేత ప్రోత్సహింపబడిన, ఓటమి నెరుగని, మెక్‌మహన్‌చేత నడపబడిన, "ఫ్రాన్సు చరిత్రలోనే ఎన్నడూ లేనంతటి మిక్కిలి శ్రేష్ఠమైన సైన్యాన్ని" అటకాయించి నిలబెట్టారు!

---

* సాటిలేని సభ. — సం.

పారిస్ వాసుల సాహసకార్యాలు అతగాడిని చిత్తు చెయ్యడమే కాదు. పారిస్ ప్రజా శక్తులన్నీ కూడా వివదించాయి.

"పారిస్ ఉద్యమాన్నీ మాంమార్టర్ పట్టుకోవడాన్నీ, కలగాపులగం చెయ్యరాదు. మాంమార్టర్ పట్టుకోవడం కేవలం దాని అవకాశమూ నాందీ ప్రస్తావనా మాత్రమే; ఈ ఉద్యమం పారిస్ అంతరాత్మలో సర్వథా వ్యాపించి ప్రగాఢంగా హత్తుకు పోయింది; ఏ కారణంవల్లనైనా దానికి దూరంగా ఉన్నవారిలో సైతం అత్యధిక సంఖ్యాకులు సాంఘికంగా అది హేతుబద్ధమైనదన్న విషయాన్ని కాదన లేదు."

ఈ మాట చెప్పిందెవరండి? సిండికల్ సభల ప్రతినిధులు, 7 000 నుండి 8,000 మంది వర్తకుల, పరిశ్రమల యజమానుల తరఫున మాట్లాడేవాళ్ల చెప్పిన మాటలివి.... అతనితో యీ విషయం చెప్పడానికి వాళ్ల వెర్సేల్స్‌కి వెళ్లారు.... రిపబ్లికన్ యూనియన్ లీగు . శ్రీమసన్ల ప్రదర్శన,[120] వగైరా.

## రాష్ట్రాలు

**Les provinciaux espiègles.***

పారిస్ ఉద్యమానికి రాష్ట్రాలు నిజంగానే ప్రతికూలంగా ఉన్నాయని త్యేర్‌కి క్షణకాలం తోచినా, ఆ ఉద్యమంతోను, "దాని ఘాతుకాలు" అన్నింటితోను పరిచయం పెట్టుకొనేందుకు గాను త్యేర్ వాటికి తను చెయ్యగలిగినదంతా చేసి వుండును అదంటే యేమిటో స్వయంగా తమ కళ్లతో చూసి, చెవులతో విని తెలుసుకొనేందుకు గాను దాన్ని, దాని నగ్నరూపంలో చూడమని అతను రాష్ట్రాలను అర్థించి వుండేవాడు అతనలా చెయ్యందే! రాష్ట్రాలను తొక్కిపట్టి ఉంచేందుకూ, ప్రష్యన్ ముట్టడి కాలంలో పారిస్‌వి గురించిన వార్తలను రాష్ట్రాల నుండి వాళ్లు దాచినట్లుగానే, అన త్యాల గోడ ద్వారా, పారిస్‌కి అనుకూలంగా వాటి సాముదాయిక తిరుగుబాటు జరగకుండా నివారించేందుకూ అతనూ, అతని "రక్షణ బలగమూ" ప్రయత్నించారు. పారిస్ వంక చూడటానికి వెర్సేల్స్ కెమెరా అబ్‌స్క్యూరా (వక్రీకరణ అద్దం) గుండా మాత్రమే

---

* రాష్ట్రీయ దగాకోర్లు. — సం.

రాష్ట్రాలకు పిలు కల్పించబడింది. (వెర్సేల్స్ పత్రికలు రాసే అబద్ధాలూ, అభాండాలూ తప్ప రాష్ట్రాలకు మరే వార్తలూ చేరవు. అబద్ధాలూ, అభాండాలే అక్కడ నిలుబడి పొగిస్తాయి.) 20,000 మంది పెరోలుపై విడుదల పత్రాలు పొందిన నేరస్తుల లూటీలూ, హత్యలూ రాజధానికి అగౌరవ కారణమయ్యాయి.

> "యదార్థంపై కాంతిని ప్రసరింపచేసి, రాష్ట్రాలకూ పారిస్‌కీ మధ్య మామూలు సంబంధాలను పునరుద్ధరించడాన్ని లీగు[130] తన ప్రధాన బాధ్యతగా పరిగణిస్తోంది."

పారిస్‌లో ముట్టడింపబడినప్పుడు వాళ్లెలా ఉన్నారో, యిప్పుడు దాన్ని తాము ముట్టడించినప్పుడు సైతం వాళ్లు అలాగే ఉన్నారు.

> "గతంలో మాదిరిగానే, అబద్ధమే వాళ్ల ప్రీతిపాత్రమైన ఆయుధం. రాజధానికి చెందిన పత్రికలను వాళ్లు నిషేధిస్తారు, జప్తు చేస్తారు. వచ్చే రిపోర్టులను మధ్యలో అడ్డుకొడతారు. జాబులను సెన్సారు చేస్తారు. అందుకని జూల్ ఫ్రావ్, పికార్డ్ ప్రభృతులకు నచ్చిన వార్తలు మాత్రమే రాష్ట్రాలకు చేరుతాయి. వాటిలోని యాదార్థ్యాన్ని పరిచూసుకొనే అవకాశం కూడా ఉండదు."

త్యేర్ బులెటిన్లు, పికార్డ్ సర్క్యులర్లు, దుఫోర్.... కమ్యూన్లలో ప్లేకార్డులు. వెర్సేల్స్‌యొక్క రొమ్మురుంట పత్రికలు, జర్మన్లు. చిన్న "Moniteur."[131] ఒక చోటు నుండి మరొక చోటుకు ప్రయాణం చెయ్యడానికి పాస్‌పోర్టుల పద్ధతి పునరుద్ధరణ. అన్ని పక్కలా mouchards* సైన్యం విస్తరణ. (ప్రష్యన్ పెత్తనంలో రువాన్, మొదలైన చోట్ల) అరెస్టులు వగైరా. తిరుగుబాటు నగరంలో ప్రచురింపబడే ఏ ధోరణికి చెందిన పత్రికలనైనా సరే పట్టుకొని, హోలీ ఇన్‌క్విజిషన్[132] ఉచ్ఛ స్థితిలో ఉన్న కాలంలో జరిగినట్లు, వాటిని బహిరంగంగా తగలబెట్టాలని, పారిస్ పరిసరాల్లో వెల్లావెదరుగా వున్న వేలాదిమంది పోలీసు కమిషనర్లకు జెండార్మరీ ప్రిఫెక్టు అయిన సరంటేవ్, ఆజ్ఞలు జారీ చేశారు.

త్యేర్ ప్రభుత్వం, నేషనల్ గార్డుల దళాలను ఏర్పాటుచేసి, పారిస్‌కి వ్యతిరేకంగా వెర్సేల్స్‌కి పంపాల్సిందిగా రాష్ట్రాలకు మొదట విజ్ఞప్తి** చేసింది.

---

* వేగులు. — సం.

** ప్రాత్రప్రతిలో, యీ మాటలపైన యీ క్రింది మాటలున్నాయి: "అదుర్దాగా

"Journal de Limoges"[123] పేర్కొన్నట్లు, "త్యేర్, అతని 'భూస్వాముల సభ' తమను అర్థించిన వలంటీరు దళాలను పంప నిరాకరించ డంద్వారా, రాష్ట్రాలు తమ అసంతృప్తిని ప్రకటించాయి."

శ్వేత పతాకం క్రింద, వారిలో ప్రతి ఒక్కడూ తెల్లని గుడ్డతో తయారైన క్రీస్తు గుండె గుర్తును తన రొమ్ముపై ధరించి, "Vive le Roi!"* అని నినాదాలిస్తూ పోరాటంలో పాల్గొన్న కొద్దిమంది బ్రెటాన్ ఠుంఠలు తప్ప, త్యేర్ చుట్టూ చేరిన "రాష్ట్రీయ" సైన్యం మరొకటేదీ లేదు.

ఎన్నికలు. మే 6వ తేదీ "Vengeur."[124]

డుఫార్ పత్రికల చట్టం (ఏప్రిల్ 8) ఖండితంగా రాష్ట్రీయ పత్రికల "అత్యాచారాలకు" వ్యతిరేకంగా ఉద్దేశింపబడింది.

అటు తర్వాత రాష్ట్రాలలో అనేక అరెస్టులు. అవి అనుమానితులకు సంబంధించిన చట్టాల[125] పరిధిలో జరిగాయి.

రాష్ట్రానికి మేధోపరమైన, పోలీసు దిగ్బంధం.

ఏప్రిల్ 23. హ్యావ్. రిపబ్లిక్ నిలుపుకొని, ఫ్రాన్సు అంతటికీ మునిసిపల్ స్వేచ్ఛల ప్రాతిపదికపై, అంతర్యుద్ధాన్ని అంతంచేసే ఉద్దేశంతో, మునిసిపల్ కౌన్సిలు తన సభ్యుల్లో ముగ్గురిని, రాజీ సంప్రతింపులకు సంబంధించిన ఆదేశాలతో పారిస్, వెర్సేల్స్ లకు పంపించింది.... ఏప్రిల్ 23, లియోన్ నుండి వచ్చిన ప్రతినిధులు పికార్డు, త్యేర్‌లను కలుసుకున్నారు – "నూరు అరైనా సరే యుద్ధం సాగాల్సిందే" అన్నదే వాళ్ల జవాబు.

లియోన్ ప్రతినిధుల విజ్ఞాపన ఏప్రిల్ 24న గ్రెప్పోచేత జాతీయ అసెంబ్లీకి అందచెయ్యబడింది.[126]

రాష్ట్రీయ పట్టణాల మునిసిపాలిటీలు, పారిస్ ఏదైతే డిమాండు చేస్తున్నదో దానిని మంజూరు చెయ్యాల్సిందిగా అడగడానికి గాను, తమ రాయబార వర్గాలను వెర్సేల్స్‌కి పంపి విశేషమైన అవినయాన్ని ప్రదర్శించాయి. త్యేర్‌యొక్క, "భూస్వాముల సభ" యొక్క చర్యలను ఆమోదిస్తూ ఫ్రాన్సులోని ఒక్క కమ్యూన్ కూడా విజ్ఞాపన పంపలేదు.

---

విజ్ఞప్తి చేసింది... బిస్మార్కు నుండి ఖైదీలతో కూడిన సైన్యాన్ని తెచ్చుకునేందుకు ముందు." – సం.

* "రాజా వర్ధిల్లాలి!" – సం.

రాజీ సంప్రతింపులకు వ్యతిరేకంగా ప్రొక్యూరర్స్-జనరల్‌కి పంపించిన తన సర్క్యులర్‌లో డుఫార్ ఫిర్యాదు చేస్తున్నట్టు, ఈ మునిసిపల్ కౌన్సిళ్లలాగే రాష్ట్రాల పత్రికలు కూడా

> "సార్వత్రిక ఓటింగు ద్వారా ఎన్నుకోబడిన అసెంబ్లీని స్వయంప్రకటిత పారిస్ కమ్యూన్‌తో ఒకే గాటన కట్టి, పారిస్‌యొక్క మునిసిపల్ పాలనా హక్కులను గుర్తించడంలో విఫలమైనందుకు అసెంబ్లీని దూషిస్తు న్నాయి, వగైరా."

అంతకన్న అధ్వాన్నమేమిటంటే, యీ మునిసిపల్ కౌన్సిళ్ళు, ఉదాహరణకు ఓష్ మునిసిపల్ కౌన్సిలు,

> "పారిస్‌కి, అది వెన్వెంటనే యుద్ధ విరమణ ప్రతిపాదన చెయ్యాలనీ, ఫిబ్రవరి 8న ఎన్నుకోబడిన అసెంబ్లీ, దానికి ప్రజలిచ్చిన తీర్పు కాలదోషం పట్టింది కాబట్టి, తనను తను రద్దుచేసుకోవాలనీ, ఏకగ్రీవంగా డిమాండ్ చేశాయి" (డుఫార్, వెర్సేల్స్ అసెంబ్లీ, ఏప్రిల్ 26).

ఇవి ఏప్రిల్ 30న ఎన్నుకోబడినవి కావనీ, యివి పాత మునిసిపల్ కౌన్సిళ్లన్న[187] విషయం గుర్తించుకోవడం అవసరం. వాటి ప్రతినిధివర్గాలు అధిక సంఖ్యలో వస్తూండ టంతో, యిక వాటిని తను స్వయంగా కలుసుకోరాదనీ, మంత్రివర్గ ఉప అధికారి వద్దకు వాటిని పంపాలనీ త్యేర్ నిర్ణయించుకున్నాడు.

చిట్టచివరకు, ఏప్రిల్ 30నాటి ఎన్నికలు — అసెంబ్లీపై తుది తీర్పు, దానికి దారితీసిన దిగ్భ్రాంతికరమైన ఎన్నికలకు తుది తీర్పు. పారిస్‌కి అనుకూలంగా తిరగబడ కుండా, వెర్సేల్స్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాష్ట్రాలింకా పరోక్ష సాత్విక ప్రతి ఘటనవే సాగిస్తున్నాయంటే, పాత అధికారుల చేతుల్లో యింకా యిక్కడ వున్న గట్టి స్థావరాలూ, సామ్రాజ్యం మునిగి వున్న పారవశ్యస్థితీ, యుద్ధమూ రాష్ట్రాలను యీ స్థితిలో ఉంచడమే అందుకు కారణం. పారిస్‌కీ రాష్ట్రాలకూ మధ్య వున్న వెర్సేల్స్ సైన్యమూ, ప్రభుత్వమూ, అబద్ధాల చైనాగోడయే యిందుక్కారణం. ఆ గోడ కూలి పోయిన నాడు, రాష్ట్రాలు పారిస్‌తో ఏకమవుతాయి.

1850 మేలో పార్లమెంటరీ కుట్ర ద్వారా సార్వజనిక ఓటింగు హక్కును రద్దుచేసిన అదే వ్యక్తులు (త్యేర్ అండ్ కంపెనీ) (వాళ్లకి వలలో చిక్కుకొనేందుకు తోడ్పడి, తద్వారా బోనపార్ట్, వాళ్లను తన దయమీద ఆధారపడేలా చేశాడు. రాజకీయ

క్కుట తర్వాత, పార్టీ ఆఫ్ ఆర్డర్‌కీ, దాని జాతీయ అసెంబ్లీకీ వ్యతిరేకంగా సార్వజనిక ఓటింగు హక్కు పునరుద్ధారకుడుగా ప్రకటించుకున్నాడు), రిపబ్లిక్ క్రింద అదింకా తమకు ప్రతికూల ఫలితాలకు దారితియ్యవచ్చునన్న అనుమానంతో, యిప్పుడు దాన్ని వీరావేశంతో బలపరుస్తున్నారు. బోనపార్ట్ క్రింద సార్వజనిక ఓటింగు హక్కుకి ఏర్పడిన యంత్రాంగం ప్రభుత్వం చేతిలో కేవలం ఒక ఆట వస్తువుగా, కేవలం ఒక మోసకారి యంత్రంగా, విభ్రమ కొలిపేదిగా, దగాకోరు తతంగంగా తయారైంది. దాన్నే త్యేర్ ముఠా యిప్పుడు, పారిస్‌కి వ్యతిరేకంగా "చట్టబద్ధమైన" తమ ప్రధాన వివాదంగా చేసుకుంది. (నగరాల సమాఖ్య మహాసభ) ("Rappel," మే 6!)[128]

## ట్రొషూ, జూల్ ఫ్రావ్, త్యేరూ, రాష్ట్రీయులూ

త్యేర్, ఫ్రావ్, దుఫోర్, గర్న్యే-పాజేస్‌ల వంటి మునలితొక్కులైన పార్లమెంటరీ బహురూప్లు, కుతంత్రజ్ఞులూ (కొద్దిమంది అదే బాపతు దుర్మార్గులచేత మాత్రమే బలపరచబడిన వాళ్లు) ప్రతి విప్లవం తర్వాతా తిరిగి పైకి వచ్చి ప్రభుత్వ నిర్వహణాధికారాన్ని హస్తగతం చేసుకోవడం ఎలా తటస్థిస్తుంది, అని ఎవరైనా అడగవచ్చు. విప్లవాన్ని ఎప్పుడూ స్వప్రయోజనాలకు దుర్వినియోగం చేసుకొని, దానికి ద్రోహంచేసే వీళ్లు, విప్లవం చేసిన జనాన్ని కాల్చివేసి, పూర్వ ప్రభుత్వాల నుండి (వేటనైతే తాము ప్రతిఘటించారో) సాధించుకున్న కొద్దిపాటి స్వేచ్ఛలను, రాయితీలను సైతం రద్దు చేసే యీ బాపతు వ్యక్తులు మళ్లీమళ్లీ రంగప్రవేశం ఎలా చెయ్యగలుగుతున్నారు?

దీనికి జవాబు చెప్పడం చాలా తేలిక. మొదటి సంగతి, ఫిబ్రవరి విప్లవానంతరం త్యేర్ లాగ, మరీ బొత్తిగా జనకంటకుడు కాకపోయినట్లయితే ప్రజా ఔదార్యం వాళ్లని క్షమించి వదిలేస్తుంది. ప్రజలు సాధించిన విజయవంతమైన ప్రతి తిరుగుబాటు అనంతరమూ, ప్రజలకు బద్ధ విరోధులైన వాళ్లు రాజీ సంప్రదింపులంటూ వివాదాలు చేస్తారు. తమ సొంత విజయం కారణంగా ఉత్తేజితులైన ప్రజలు సైతం తొలి క్షణాల్లో ఆ వివాదాన్ని పునశ్చరణ చేస్తారు. ఈ తొలి క్షణం తర్వాత, త్యేర్ దుఫోర్‌ల వంటి వ్యక్తులు, ప్రజలు భౌతికాధికారాన్ని నిలుపుకున్నంతకాలమూ కనుమరుగై, రహస్యంగా తమ కార్యకలాపాలు సాగిస్తారు. ప్రజలు నిరాయుధం కాగానే వాళ్లు రంగంమీద మళ్లీ ప్రత్యక్షమవుతారు, బూర్జువావర్గంచేత దాని chefs de file*గా హర్షించబడతారు.

---

* నాయకులు. — సం.

లేక, ఫ్రాన్, గర్నే-పాజేస్, జూల్ సిమోన్, వగైరాలవంటి వాళ్లను, (అదే బాపతు కొద్ది మంది యువకులచేత చేర్చుకోబడినవాళ్లు), సెప్టెంబరు 4 తర్వాత సాక్షాత్తూ త్యేర్‌ని, లూయీ ఫిలిప్ క్రింద "గౌరవనీయ" రిపబ్లికన్ ప్రతిపక్షంగా అటు దరిమిలా, లూయీ బోనపార్ట్ క్రింద పార్లమెంటరీ ప్రతిపక్షంగా పరిగణిస్తారు. విప్లవంచేత అధికారాని కెత్తబడి, తామే ప్రారంభించిన అభివృద్ధి నిరోధక పాలనలు, వాళ్లకి ప్రతిపక్ష హోదాలను కల్పిస్తాయి. కాగా సిసలైన విప్లవవాదులను ద్వీపాంతర వాసాలకు పంపి, చంపి, దేశ బహిష్కృతులను చేస్తారు. ప్రజలు గతాన్ని విస్మరిస్తారు, బూర్జువావర్గం, వాళ్లను తమ మనుషులుగా పరిగణిస్తుంది. వాళ్ల కుఖ్యాతగతం విస్మరింప బడుతుంది. ఆవిధంగా వాళ్లు, తమ దేశ ద్రోహకర కార్యకలాపాలనూ, తమ దగుల్బాజీ పనులనూ తిరిగి ప్రారంభించేందుకు తిరిగి సాక్షాత్కరిస్తారు.

---

మే 1–2 మధ్యరాత్రి: క్లమార్ గ్రామం సైన్యం చేతుల్లో ఉంది, రైల్వే స్టేషను (ఇది ఇస్సీ కోటకి పై పటున వుంది) తిరుగుబాటుదార్ల చేతుల్లో వుంది. ఆకస్మిక దాడిద్వారా (సంకేత పదం ద్రోహకరంగా బహిర్గతంచేసి దాని గస్తీ సైనికులను ఒక కాపలా సైనికుడు లోపలికి రానిచ్చిన కారణంగా) 22వ పదాతి సైనిక దళం ఆకస్మికంగా లోపలికొచ్చి కోటలో నిద్రిస్తున్న రక్షణ సైనికుల్లో అధిక సంఖ్యాకులను విభ్రాంతపరచి, కేవలం 60 మందిని మాత్రమే బందీలుగా పట్టుకొని, 300 మంది తిరుగుబాటుదార్లను బయనెట్లతో పొడిచి చంపేశారు. దానికితోడు స్థాయీ సైనికులను ఏ విచారణా లేకుండా కాల్చిపారేశారు. ప్రిఫెక్టులను, పౌర, సైనిక అధికారులను ఉద్దేశించి మే 2న జారీ చేసిన తన సర్క్యులర్‌లో త్యేర్ తలబిరుసుగా యిలా రాశాడు:

> "అది (కమ్యూను) జనరల్సును (క్లుసెరే!) కాల్చెయ్యడానికే అరెస్టు చేస్తుంది, బొత్తిగా పనికి మాలిన మనుషులతో ప్రజాభద్రతా కమిటీని ఏర్పాటుచేస్తుంది!"

జనరల్ లక్రెటెల్ నాయకత్వాన గల సేనలు ఆకస్మిక దాడి ద్వారా ఇస్సీ కోట, మాంరూజ్‌ల మధ్య వున్న ములెన్ సాకే దుర్గభాగాన్ని వశపరచుకున్నాయి. వెర్సేల్స్ సేనలకు సంకేత పదాన్ని అమ్ముకున్న కమాండెంట్ గల్యేన్ ద్రోహకారణంగా దుర్గ రక్షణ సైన్యంపైన ఆకస్మిక దాడి జరిగింది; దానిలో 150 మంది కమ్యూనార్డులను బయనెట్లతో పొడిచి చంపేశారు. 300 మందికి పైగా ఖైదీలుగా పట్టుకున్నారు. "Times"[65] పత్రికా విలేకరి, త్యేర్ దృఢంగా ఉండాల్సినప్పుడు బలహీనంగాను (తనకు

ప్రమాదం ఎదురయ్యే భయమున్నంతకాలం పిరికి పంద ఎప్పుడూ బలహీనంగానే వుంటాడు), కొద్ది రాయితీలివ్వడం ద్వారా టోలెడు రాయితీలు లభించే తరుణంలో దృఢంగాను ఉన్నాడని రాశాడు. (భౌతిక బలప్రయోగం ఫ్రాన్సులో రక్తపాతం కలిగించి నప్పుడు యీ దుర్మార్గుడెప్పుడూ దృఢంగానే ఉన్నాడు, తాను వ్యక్తిగతంగా క్షేమంగా ఉన్నంత కాలం పెద్దగా పోజులూ పెడతాడు. అదే అతగాని తెలివి అంతా. ఆంథోనీ* మాదిరిగానే త్యేర్ "నిజాయితీపరుడు.")

---

ములెన్ సాకే (మే 4) పై త్యేర్ బులెటిన్:

"పారిస్‌ను అణచివేసే నిక్రృష్టమైన నిరంకుశుల నుండి దాన్ని విముక్తం చెయ్యడం." ("వెర్సేల్స్‌వాళ్ళు నేషనల్ గార్డుల ముసుగులో వున్నారు"); ("కమ్యూనార్డుల్లో చాలమంది నిద్రిస్తున్నారు. వారు చంపనైనా చంపబడ్డారు, లేకుంటే బందీలుగా పట్టుకోబడ్డారు").

పికార్డ్: "మా ఫిరంగి దళం బొంబార్డు చెయ్యదు — అది ఫిరంగులు మాత్రం కాలుస్తుంది, అంతే." ("Moniteur des communes,"[121] పికార్డుయొక్క వార్తాపత్రిక.)

"మరణావస్థలో బ్లాంకీ జైల్లో కుక్కబడ్డాడు. జెండార్ములచేత ఫ్లొరెన్సు ముక్కముక్కలుగా నరకబడ్డాడు. దువాల్ వినువాచేత కాల్చి వెయ్యబడ్డాడు. అక్టోబరు 31న వాళ్ళందరూ వీళ్ళ చేతుల్లో వున్నా, వాళ్ళకి ఏవిధమైన హాని వీళ్ళు చెయ్యలేదు."

---

* ఆంథోని (మార్క్ ఆంథోని) — షేక్స్పియర్ విషాదాంత నాటకం "జూలియస్ సీజర్"లో ఒక పాత్ర. — సం.

# కమ్యూన్

## 1. కార్మికవర్గం కోసం చర్యలు

బేకర్లచేత రాత్రిపూట పనిచేయించడం రద్దుచెయ్యబడింది (ఏప్రిల్ 20).

ప్రభుత్వ, ప్రైవేటు కర్మాగారాల్లో సొంత న్యాయాధికారపరిధి రద్దుచేయబడింది. మిల్లు యజమానులు మొదలైన వాళ్ళు (ఫ్యాక్టరీ యజమానులు) (పెద్ద, చిన్న వ్యాపారస్తులు), చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకొని సొంత న్యాయాధికారపరిధిని సృష్టించుకొని తగాదాల్లో ఏక కాలంలో జడ్జీలూ వాళ్ళే, తీర్పులు అమలు జరిపే వాళ్ళూ వాళ్ళే, కక్షిదారులూ వాళ్ళే, లబ్ధిపొందేవాళ్ళూ వాళ్ళే అయి, శిక్షల పేర శ్రమజీవుల వేతనాల నుండి జరిమానాలు, కోతలు మొదలైన రూపాలలో దోచుకోవడానికి అవకాశం కల్పించే తమ సొంత శిక్షాస్మృతిని అమలు జరిపే హక్కు రద్దుచేయబడింది. ఈ చట్టాన్ని ధిక్కరించిన సందర్భాల్లో యజమానులపై పెనాల్టీలు విధింపబడ్డాయి. మార్చి 18 దరిమిలా గుంజుకోబడిన జరిమానాలు, కోతలు శ్రమజీవులకు (ఏప్రిల్ 27) తిరిగి చెల్లింపబడాలని శాసింపబడింది. తాకట్టు షాపుల్లో తాకట్టు పెట్టబడిన వస్తువుల అమ్మకం ఆపేయబడింది (మార్చి 29).

పారిస్‌లోని కర్మాగారాల్లో, ఫ్యాక్టరీలలో ఎక్కువ భాగం, వాటి యజమానులు పలాయనం చిత్తగించడంతో, మూసివెయ్యబడ్డాయి. పారిశ్రామిక పెట్టుబడిదారుల పాత పద్ధతి యిది. "అర్థశాస్త్ర నియమాల అయత్నకృత చర్య ద్వారా" పని చెయ్యనిచ్చి శ్రమ నుండి లాభం పొందే హక్కే కాకుండా, పనినే పూర్తిగా బందుచేసి కార్మికులను రోడ్లపైకి నెట్టి – విజయవంతమైన విప్లవం తమ "వ్యవస్థ భద్రత"కి ముప్పుం తెచ్చినప్పుడల్లా కృత్రిమ సంక్షోభాన్ని సృష్టించే హక్కు తమకుందని వాళ్ళు భావిస్తారు. కమ్యూన్ ఎంతో తెలివితేటలుగా వ్యవహరించి ఒక కమిషన్‌ని నియమించింది. అది

వివిధ వృత్తుల నుండి ఎన్నుకోబడిన ప్రతినిధుల సహకారంతో, విడిచిపెట్టబడిన కర్మాగారాలను, ఫ్యాక్టరీలను కార్మికుల సహకార సంఘాలకు అప్పగించే (పలాయనం చిత్తగించిన పెట్టుబడిదారులకు కొంత నష్టపరిహారం యిచ్చే పద్ధతిలో) పద్ధతులను రూపొందించాలి (ఏప్రిల్ 16). (ఈ కమిషను విడిచిపెట్టబడిన కర్మాగారాలకు సంబంధించిన గణాంక లెక్కలను కూడా తయారుచెయ్యాలి.)

75 సెంటీముల ఎక్స్‌గ్రేషియా విషయంలో, అక్రమ భార్యలనబడే వారికీ, నేషనల్ గార్డుల తల్లులకూ, వితంతువులకూ మధ్య వివక్ష చూపరాదని మెయిరీలకు కమ్యూన్ ఆజ్ఞ జారీ చేసింది.

"వ్యవస్థ సంరక్షకుల కోసం" పారిస్‌లో ఉంచబడిన బహిరంగ వ్యభిచారిణులు, వ్యవస్థ సంరక్షకుల "భద్రత" కోసమే, పోలీసుల నిరంకుశ నియమం మేరకు, వ్యక్తిగత బానిసలుగా ఉంచబడ్డారు. నీచమైన యీ బానిసత్వం నుంచి కమ్యూన్ యిప్పుడా వ్యభిచారిణులను విముక్తం చేసింది. అయితే అదే సమయంలో, ఏ పరిస్థితులలో వ్యభిచారం వృద్ధి చెందుతుందో వాటిని, ఎవరివల్ల వ్యభిచారం వృద్ధి చెందుతుందో వారిని తుడిచి పెట్టేసింది. ఉన్నత శ్రేణి వ్యభిచారిణులు — వేశ్యలు — మాత్రం, పూర్వపు పాలనలో, పోలీసులయొక్క, పాలకులయొక్క బానిసలు కారు, పైగా వాళ్ల యజమానురాండ్రు.

ప్రజా విద్యాబోధనను పునర్నిర్మించే వ్యవధి కమ్యూన్‌కి లేకపోయింది. కానైతే, మతపరము, పూజా పునస్కార సంబంధమైన అంశాన్ని తొలగించడం ద్వారా ప్రజల మానసిక విముక్తి విషయంలో కమ్యూన్ చొరవ తీసుకుంది. విద్యావ్యవస్థ (ప్రాథమిక (ప్రారంభ), వృత్తిపర) వ్యవస్థీకరణ కోసం, అది ఒక కమిషన్‌ను నియమించింది (ఏప్రిల్ 28). పుస్తకాలు, దేశపటాలు, కాగితం, మొదలైన విద్యాబోధక సాధనాలన్నీ, తాము ఏ మెయిరీలకైతే చెందుతారో వాటి నుండి ఉపాధ్యాయులకు యివ్వబడాలనీ, వాటిని వారు పిల్లలకు ఉచితంగా యివ్వాల్సి వుంటుందనీ కమ్యూన్ ఆజ్ఞ జారీచేసింది. ఈ బోధనా సాధనాలకు గాను ఏ ఉపాధ్యాయుడూ ఏ సాకుతోనూ తన విద్యార్థులను డబ్బు చెల్లించమని కోరరాదు (ఏప్రిల్ 28).

తాకట్టు కొట్లు: 1871 ఏప్రిల్ 25కి ముందు Mont de Piété జారీ చేసిన రసీదుల మేరకు తాకట్టు పెట్టబడిన దుస్తులు, ఫర్నిచరు, దుప్పట్లు, గలేబులు, పుస్తకాలు, పక్క వస్తువులు, శ్రమ సాధనాలు 20 ఫ్రాంకుల విలువకు మించనట్లయితే, మే 12 దరిమిలా, ఎటువంటి చెల్లింపులూ అవసరంలేకుండా డిమాండ్‌చేసి, వాటిని తీసుకో వచ్చు (మే 7).

# 2. కార్మికవర్గం కోసం చర్యలు, కాని ఎక్కువ భాగం మధ్యతరగతులకు

ఏప్రిల్‌లోగా గత మూడు క్వార్టర్లకూ (తొమ్మిది మాసాలకూ) ఇంటి అద్దె పూర్తిగా రద్దుచెయ్యబడింది: ఒక వేళ యీ మూడు క్వార్టర్లకూ ఎవరైనా అద్దె చెల్లించి వుంటే ఆ సొమ్ము ముందు ముందు చెల్లించాల్సిన మొత్తాలకు సరిపెట్టుకోవచ్చు. సామాన్లతోబాటు అద్దెకివ్వబడిన ఇళ్ల వాటాలకు కూడా యిదే చట్టం వర్తిస్తుంది. ఇళ్ళు ఖాళీ చెయ్యాల్సిందిగా ఇళ్ల యజమానులిచ్చే నోటీసులు రాబోయే మూడు మాసాలకూ చెల్లవు (మార్చి 29).

Échéances (బకాయిపడ్డ ప్రామిసరీ నోట్ల చెల్లింపు) (నోట్ల కాలదోషం): ప్రామిసరీ నోట్ల మొత్తాలు బకాయిపడిన కారణంగా పెట్టబడిన ప్రాసిక్యూషన్లన్నీ నిలువు చెయ్యబడ్డాయి (ఏప్రిల్ 12).

ఆ రకమైన వాణిజ్య పత్రాలకు సంబంధించిన మొత్తాలన్నీ రెండేళ్లలో (రెండేళ్ల కాలంలో వాయిదాలపై చెల్లించే ఏర్పాటు చెయ్యబడింది), చెల్లింపబడాల్సి రాబోయే జూలై 15 నుండి యీ చెల్లింపులు ప్రారంభమవుతాయి, ఆ రుణాలపై వడ్డీలు వసూలు చెయ్యబడవు. బకాయిల మొత్తం ఎనిమిది సమాన కిస్తీలుగా క్వార్టరు (మూడేసి నెలల) కొక మారు చెల్లించబడాలి (మొదటి క్వార్టరు జూలై 15 నుండి ప్రారంభమవుతుంది). ఈ కిస్తీల చెల్లింపులు బకాయి పడినప్పుడు మాత్రమే న్యాయపరమైన ప్రాసిక్యూషన్లు అనుమతింపబడతాయి (ఏప్రిల్ 16). అద్దెకూ, ప్రామిసరీ నోట్లకూ సంబంధించిన డుఫార్ చట్టాలు, పారిస్‌లోని గౌరవనీయులైన పలువురు విజాయితీపరులైన షాపు యజమానులు దివాలా తియ్యడానికి దారితీశాయి.

నోటరీలు,* బెయిలిఫ్‌లు (న్యాయ స్థానాల్లోని షరీపులు), వారి అసిస్టెంట్లు, తదితర కోర్టు అధికారులు యింత కాలమూ తమ యీ ఉద్యోగాల్లో పెద్ద మొత్తాల్లో సొమ్ము చేసుకుంటూండే వారు. వాళ్లిప్పుడు కమ్యూన్ ఉద్యోగులుగా మార్చబడ్డారు. ఇతర కార్మికుల్లాగే వాళ్లకి కూడా యిప్పుడు స్థిరమైన జీతాలు ముడుతున్నాయి.

వైద్య కళాశాలకి చెందిన ప్రొఫెసర్లు పారిస్ నుండి పలాయనం చిత్తగించినందువ, స్వేచ్ఛాయుత విశ్వవిద్యాలయాల స్థాపన కోసం కమ్యూన్ ఒక కమిషన్‌ని నియమించింది. అవి యిక నెంతమాత్రమూ ప్రభుత్వంపై ఆధారపడి సాగే సంస్థలుగా ఉండబోవు.

---

* కోర్టుల్లో దస్తావేజాలపై ముద్రవేసి ధృవీకరించే ఉద్యోగులు. — సం.

పరీక్ష ప్యాసైన విద్యార్థులకు, డాక్టరు పట్టాలతో నిమిత్తంలేకుండా (ఈ పట్టాలను ఆయా విశ్వవిద్యాలయ విభాగాలు ప్రదానం చేస్తాయి) ప్రాక్టీసు చేసేందుకు సౌకర్యాలు కల్పించబడతాయి.

ఏ వర్గ ప్రభుత్వం క్రిందనైనా సరే పని చెయ్యడానికి సిద్ధంగా వుండే సీన్ సివిల్ న్యాయస్థానం జడ్జీలు యితర మేజిస్ట్రేటుల్లాగే, పారిస్ నుండి పారిపోయినందున, సార్వజనిక ఓటింగు హక్కు ప్రాతిపదికపై కొత్త న్యాయస్థానాలు ఎన్నుకోబడే దాకా, మిక్కిలి అర్జెంటు పనులు చేసేందుకు గాను కమ్యూన్ ఒక అడ్వకేటును నియమించింది (ఏప్రిల్ 26).

## 3. సాధారణ చర్యలు

నిర్బంధ సైనిక సమీకరణ రద్దుచెయ్యబడింది. ప్రస్తుత యుద్ధంలో దృఢగాత్రుడైన ప్రతి వ్యక్తీ కొలువు చెయ్యాలి (నేషనల్ గార్డులో). పారిస్‌లో నక్కిన అందరు ద్రోహులనూ, పిరికిపందలనూ వదిలించుకోవడానికి యిది శ్రేష్ఠమైన చర్య (మార్చి 29).

వికృతమైన రౌలెట్ వంటి జూదపు ఆటలన్నీ నిషేధించబడ్డాయి (ఏప్రిల్ 2).

చర్చి రాజ్యం నుంచి వేరుచెయ్యబడింది. మతపరమైన బడ్జెట్టు రద్దుచెయ్యబడింది. మతపరమైన ఎస్టేట్లన్నీ జాతీయ ఆస్తిగా ప్రకటించబడ్డాయి (ఏప్రిల్ 3).

ప్రైవేటుగా లభించిన సమాచారాన్ని అనుసరించి కమ్యూన్ సోదా చేసి, పాత గిలటిన్‌కితోడు "పాత వ్యవస్థ ప్రభుత్వం" మరో కొత్త గిలటిన్ చేయించినట్టూ (మరింత వడిగా పని చేసేదీ, మరింత తేలిగ్గా తీసుకెళ్లడానికి వీలైనదీ), దాని కోసం అడ్వాన్సు కూడా చెల్లించినట్టూ తెలుసుకుంది. పాత గిలటిన్‌నీ, కొత్త గిలటిన్‌నీ కూడా ఏప్రిల్ 6న బహిరంగంగా తగలబెట్టాలని కమ్యూన్ ఆజ్ఞ జారీచేసింది. వెర్సేల్స్ పత్రికలు, పారిస్ ప్రజలు, కమ్యూనార్డుల రక్తదాహానికి నిరసనగా యీ గిలటిన్లను తగలబెట్టారని రాశాయి! ఇదే కట్టుకథను ప్రపంచమంతటా పాలక వర్గాల పత్రికలన్నీ రెట్టించాయి!

(ఏప్రిల్ 6). మార్చి 18 నాటి విప్లవానంతరం వెన్వెంటనే రాజకీయ ఖైదీలందరూ విడుదల చెయ్యబడ్డారు. లూయీ బోనపార్టి పాలనలోనూ, దానికి తగిన వారసురాలైన రక్షణ ప్రభుత్వ పాలనలోనూ, పలువురు వ్యక్తులు, ఎటువంటి నేరారోపణా లేకుండా, రాజకీయ అనుమానితులుగా జైలు కొట్లలో నిర్బంధించబడిన సంగతి కమ్యూన్‌కి తెలుసు. అందుకని, కమ్యూన్ తన సభ్యుల్లో ఒకడైన ప్రొటోను విచారణ జరిపేందుకు నియమించింది. అతనిచేత 150 మంది ఖైదీలు విడుదల చెయ్యబడ్డారు. వాళ్లందరూ

ఎలాంటి న్యాయవిచారణా లేకుండా ఆరు మాసాలుగా నిర్బంధంలో ఉన్నారు; వాళ్లలో చాలామంది బోనపార్టు పాలనలో నిర్బంధింపబడి, ఏ నేరారోపణగాని, ఏవిధమైన న్యాయ విచారణగాని లేకుండా ఒక ఏడాది పాటు జైలులో వున్నారు (ఏప్రిల్ 9). రక్షణ ప్రభుత్వానికి స్వతఃసిద్ధమైన యీ విషయం, దానికి కోపకారణమైంది. కమ్యూన్, నేరస్తు లందరినీ విడిచేసిందంటూ అది గగ్గోలు పెట్టింది. కాని, నిర్బంధింపబడిన నేరస్తులను విడిచి పెట్టిందెవరు? కూట పత్రాల సృష్టికర్త, జూల్ ఫ్రావే. అతగాడు అధికారంలోకి వచ్చీ రాగానే "Etendard"[40] వ్యవహారంలో దొంగతనం, ఫోర్జరీ నేరాలకుగాను అభియోగం దాఖలు చెయ్యబడిన పీక్, ప్రైఫేర్‌లను అతను అర్జెంటుగా విడుదల చేశాడు. ఈ యిద్దరిలో ఒకడైన ప్రైఫేర్, పారిస్‌కి రావడానికి సాహసించినప్పుడు, అతడు తనకి అనువైన స్థానంలో తిరిగి పెట్టబడ్డాడు. అంతే కాక, ఫ్రాన్సు అంతటా శిక్షితులైన దొంగలను, త్యేర్ సైన్యంలో చేరాలన్న షరతుపై, వెర్సేల్స్ ప్రభుత్వం సెంట్రల్ జైళ్ల నుంచి విడుదల చేసింది!

వెండోమ్ చౌకు స్తంభాన్ని కూల్చివెయ్యడంపై ఉత్తరువు:

> అది "అటవికత్వానికి స్మారక చిహ్నం, పశుబలానికీ, మిథ్యా ఘనతకీ చిహ్నం, సైనికతత్వ పునరుద్ఘాటన, అంతర్జాతీయ హక్కుల నిరాకరణ" (ఏప్రిల్ 12).

కమ్యూన్‌కి ఫ్రాంకెల్ ఎన్నిక (ఇంటర్నేషనల్ యొక్క జర్మన్ సభ్యుడు) చెల్లుతుందని ప్రకటించబడింది. "కమ్యూన్ పతాకం ప్రపంచ రిపబ్లిక్‌కి చెందినది కావడం, విదేశీయులు సైతం దానిలో స్థానం పొందగలగడం దృష్ట్యా" యీ ప్రకటన జరిగింది (ఏప్రిల్ 4). ఫ్రాంకెల్, తర్వాత కమ్యూన్ కార్యవర్గ సభ్యుడుగా ఎన్నుకోబడ్డాడు (ఏప్రిల్ 21).

కమ్యూన్ సమావేశాలకు సంబంధించిన సమాచారాన్ని "Journal Officiel"[38] ప్రచురించసాగింది (ఏప్రిల్ 15).

రిక్విజిషన్లకు వ్యతిరేకంగా విదేశస్తులకు రక్షణ కల్పించే పస్కాల్ గ్రుస్సె ఉత్తరువు. పారిస్‌లోని ఏ ప్రభుత్వమూ ముందెన్నడూ కూడా విదేశస్తుల పట్ల యింత మన్నన ప్రదర్శించలేదు (ఏప్రిల్ 27).

రాజకీయ, వృత్తిపరమైన ప్రమాణాలను కమ్యూన్ రద్దు చేసింది (మే 4).

11*

డి అంజూ-సెయింట్ ఒనోరే రోడ్డులో (1816లో "chambre introuvable"చేత నిర్మింపబడిన[50]) "పదహారవ లూయీ రాజు మరణ శిక్షకు ప్రాయశ్చిత్తార్థ చర్చి" అనబడే స్మారక చిహ్న నిర్మూలన (మే 7).

## 4. ప్రజాభద్రతా చర్యలు

"విధేయులైన" నేషనల్ గార్డుల నిరాయుధీకరణ (మార్చి 30).

కమ్యూన్ సభ్యుడుగా ఉండడమూ, వెర్సేల్స్ సభకి సభ్యుడుగా ఉండడమూ దుస్సాధ్యమని కమ్యూన్ ప్రకటన చేస్తుంది (మార్చి 29).

దమన చర్యలకు సంబంధించిన ఉత్తరువు. ఇది ఎన్నడూ ఆచరణలో పెట్టబడలేదు. అరెస్టు చెయ్యబడిన వాళ్లల్లా ఆర్చిబిషప్ ఆఫ్ పారిస్, లా మడ్లేన్ చర్చికి చెందిన మతగురువు; జెస్యూట్ల కాలేజి అధ్యాపక బృందమంతా, ప్రధానమైన చర్చి లన్నింటి మతబోధకులు మాత్రమే. వీళ్లలో కొందరు హామీ బందీలుగా అరెస్టు చెయ్యబడ్డారు. మరి కొందరు వెర్సేల్స్‌తో కలిసి కుట్రచేసినందుకు అరెస్టు చెయ్యబడ్డారు. వేరొక కొందరు కమ్యూన్ చేతుల్లోంచి చర్చి ఆస్తిని రక్షించ ప్రయత్నించినందుకు అరెస్టు చెయ్యబడ్డారు (ఏప్రిల్ 6).

> "రాజరికవాదులు ఆటవికుల్లాగ యుద్ధం సాగిస్తారు; వాళ్లు ఖైదీలను కాల్చిచంపుతారు, వాళ్లు క్షతగాత్రులను హత మారుస్తారు, రోగులు, క్షతగాత్రుల ప్రాథమిక చికిత్సా కేంద్రాలపై కాల్పులు జరుపుతారు; వాళ్ల సైనికులు తమ రైఫిళ్ల మడమలను గాలిలో పైకెత్తినట్టు నటించి మోసంగా కాల్పులు సాగిస్తారు" (కమ్యూన్ ప్రాక్లమేషన్ (అధికార ప్రకటన)).

దమనకాండకు సంబంధించిన యీ ఉత్తరువుల విషయంలో యీ క్రింది అంశాలు గమనించాల్సి వుంది:

ఒకటి: పారిస్ మతగురువులను మినహాయించి — పారిస్ ప్రజానీకానికి చెందిన అన్ని శ్రేణులవాళ్లూ — పెట్టుబడిదారులు, సోంబేరులు, పరాన్నభుక్కులూ అక్కడ నుంచి తరలిపోయాక — అంతర్యుద్ధాన్ని విరిపెయ్యాల్సిందంటూ వెర్సేల్స్ నుండి డిమాండు చేశారు. పారిస్ ఆర్చిబిషప్పూ, లా మడ్లేన్ చర్చికి చెందిన మతగురువూ — "తమ సొంత రక్తం చిందించడానికి" విముఖులు కాబట్టే, హామీ బందీలుగా త్యేర్‌కి జాబు రాశారు.

రెండు: దమన చర్యలు, హామీ బందీలను పట్టుకోవడం మొదలైనవాటిని గురించిన ఉత్తరువును కమ్యూన్ ప్రచురించిన తర్వాత, పియెత్రి అమాయిక అనుచరులచేతా, వలంటేన్ జెండార్మిలచేతా వెర్సేల్స్ ఖైదీల పట్ల క్రూరప్రవర్తన ఆగకపోయినప్పటికీ, నిర్బంధింపబడిన పారిస్ ఖైదీలను, నేషనల్ గార్డులను హత్య చెయ్యడమన్నది నిలిచి పోయింది. కానైతే, కమ్యూన్ తన ఏప్రిల్ 6 నాటి ఉత్తరువును అమలు జరపకుండా మానవత్వాన్ని అతిగా ప్రదర్శిస్తోందని ఎప్పుడైతే గ్రహించిందో, అప్పుడిక వెర్సేల్స్ ప్రభుత్వం, ద్విగుణీకృత క్రోధంతో ఆ క్రూరకృత్యాలకు తిరిగి పూనుకొంది. అప్పుడిక తిరిగి మూకుమ్మడి హత్యాకాండ ప్రారంభమైంది. కమ్యూన్, ఒక్కగా నొక్క హామీ బందీనిగాని, ఒక్క ఖైదీనిగాని, చివరకు నేషనల్ గార్డుల ముసుగులో వేగుల్లా పారిస్‌లో ప్రవేశించిన జెండార్మి ఆఫీసర్లను గాని కాల్చి చంపలేదు. వాళ్ళని పట్టినే అరెస్టు చేసిందంతే.

క్లమార్ కోట భాగంపై ఆకస్మిక దాడి (మే 2). రైల్వే స్టేషను పారిస్ వాసుల చేతుల్లో ఉంది, ఊచకోత, బయొనెట్లతో పొడవడం, 22వ పదాతి సైనిక దళం (గాలిఫే?) స్థాయీ సేనల సైనికులపై ఎటువంటి లాంఛనమూ పద్ధతీ లేకుండా ఉన్నట్లుండి కాల్పులు సాగించింది (మే 2). ఇస్సీ కోట, మాంరూజ్‌ల మధ్య వున్న ములెన్ సాకె దుర్గభాగాన్ని వశపరుచుకున్నాయి. వెర్సేల్స్ సేనలకు సంకేత పదాన్ని అమ్ముకున్న కమాండెంట్ గల్యేన్ ద్రోహకారణంగా, దుర్గ రక్షణ సైన్యంపైన రాత్రి ఆకస్మిక దాడి జరిగింది. పక్కలమీద విశ్రమిస్తున్న కమ్యూనార్డులపై జరిగిన యీ దాడిలో, వారిలో ఎక్కువ భాగం ఊచకోత కొయ్యబడ్డారు (మే 4?).

ఏప్రిల్ 25. నలుగురు నేషనల్ గార్డులు (విల్‌జుయిఫ్ సమీపంలోని బెల్ ఎపైన్ వద్ద, నలుగురిలోనూ ఒకే ఒక్కడు బ్రతికి వున్నాడు. బిసేటర్‌కి పంపబడిన కమిస్సార్‌లు యీ విషయం సత్యమని ధృవీకరించారు. అలా బ్రతికిన వ్యక్తి పేరు షెఫేర్). ఆశ్వికసైనికులచేత ముట్టడింపబడిన యీ నలుగురు వ్యక్తులూ, ప్రతిఘటించ సాధ్యం కాక, వాళ్ళ ఆజ్ఞ మేరకు, ఆయుధాలు క్రింద పడేసి, లొంగిపోయారు. వాళ్ళను సైనికు లేమీ చెయ్యలేదు. కాని అప్పుడక్కడికి వచ్చిన ఆశ్విక దళం కెప్టెను వాళ్ళలో ఒకడి తర్వాత ఒకడిని తన రివాల్వరుతో కాల్చిపారేశాడు. వాళ్ళక్కడే నేలపై వదిలెయ్య బడ్డారు. దారుణంగా గాయపడిన షెఫేర్ మాత్రం బ్రతికాడు.

క్లమార్ రైల్వే స్టేషన్లో ఖైదు చెయ్యబడిన స్థాయీ సైన్యానికి చెందిన పద ముగ్గురు సైనికులు వెన్వెంటనే కాల్చి వెయ్యబడ్డారు. సైనిక దుస్తులు ధరించి వెర్సేల్స్ చేరుకున్న ఖైదీలందరూ, వాళ్ళ గుర్తింపుకి సంబంధించిన అనుమానాలు నివృత్తి కాగానే (వెర్సేల్స్ "Liberté"[118]) కాల్చివెయ్యబడతారు. హోదా లేకపోయినా,

జనరల్ బాధ్యతలు నిర్వహిస్తున్న ఒక యువకుడు, బందీగా కొద్దివందల గజాలు నడిపింపబడిన తర్వాత ఒక బోనపార్టిస్టు జనరల్ ఆజ్ఞ మేరకు రోడ్డుపై కాల్చివెయ్యబడ్డాడని ప్రస్తుతం వెర్సేల్స్‌లో వున్న అలెగ్జాండర్ డ్యూమా జూనియర్ తెలియజేశాడు.... ఇళ్లలో వున్న పారిస్ సేనలను, నేషనల్ గార్డులను ముట్టడించిన జెండార్మ్‌లు, ఇళ్లలో పెట్రోలు పోసి, వాటికి నిప్పంటించారు. నేషనల్ గార్డులకు చెందిన కొన్ని శవాలు (నల్లగా మాడి బొగ్గయినవి) టెర్న్ పత్రికకు చెందిన యాంబ్యులెన్సు కారులో ("Mot d'Ordre,"[118] ఏప్రిల్ 20) రవాణా చెయ్యబడ్డాయి. "వాళ్లకి ఆస్పత్రులకెళ్లే హక్కు లేదు."

త్యేర్. బ్లాంకీ. ఆర్చిబిషప్. జనరల్ షంజీ. (తన బోనపార్టిస్టులు, కాల్చబడేందుకు యిష్టపడతారని త్యేర్ అన్నాడు.)

ఇళ్లలో సోదాలు, వగైరాలు. సెప్టెంబరు 4 నియంతల చర్యలపై విచారణ కమిషన్‌కు అధ్యక్షుడుగా కసిమిర్ బుయిన్ నియమింపబడ్డాడు (ఏప్రిల్ 14). వ్యక్తిగత గృహాలలో సోదాలు జరిగి, పత్రాలు జప్తు చెయ్యబడ్డాయే గాని యే సామానులూ తీసుకుపోయి వేలం వెయ్యలేదు. (సెప్టెంబరు 4 ఘటనల్లో పాల్గొన్న వ్యక్తుల – త్యేర్, మొదలైనవాళ్ల, బోనపార్టిస్టు పోలీసుల – పత్రాలు జప్తు చేయబడ్డాయి.) ఉదాహరణకు, జైళ్ల ఇన్‌స్పెక్టర్ జనరల్ అయిన లఫోన్ మేడలో (ఏప్రిల్ 11). ద్రోహులుగా, త్యేర్ ప్రభుత్వుల యిళ్లలో సోదాలు చెయ్యబడ్డాయి గాని కేవలం పత్రాలు మాత్రమే జప్తు చెయ్యబడ్డాయి.

వాళ్లలోనే అరెస్టులు: రాజకీయ పూజా ప్రతిమలనూ, "గొప్ప వ్యక్తులనూ" ప్రగాఢంగా కోరుకొనే బూర్జువాలకు యిదొక ఆఘాతం.

> "కమ్యూన్‌కి వున్న అధికారం ఏమిటో ఏమోగాని, అది వరుసగా చేతులు మారుతోంది. రేపటి రోజున అధికారం ఎవరి చేతుల్లో ఉంటుందో మనకీ రోజున తెలియదు. ఈ పరిస్థితి చికాకు కలిగించేదే కాకుండా ("Daily News," మే 6. పారిస్ నుండి లేఖ), చిరాకు కలిగిస్తుంది కూడా.... అనంతమైన యీ మార్పులన్నింట్లోనూ మనకి యింతకు ముందెప్పటికన్న స్పష్టంగా కనిపించే అంశమొకటుంది, ఒక పెద్దతలకాయ లేకపోవడమన్నదే అది. కమ్యూన్, సమానులైన అణుమాత్రుల సమూహం మాత్రమే. అందులో ప్రతి ఒకడూ ప్రతి యితరుని పట్ల ఈర్ష్యాళువు. మిగిలినవారిపై ఏ ఒక్కనికీ పూర్తి పెత్తనం లేదు."

పత్రికల నిషేధం!

# 5. ఆర్థిక చర్యలు

మే 6వ తేదీనాటి "Daily News"[91] చూడండి.

యుద్ధానికి అయ్యే ప్రధాన వ్యయాలు!

స్వాధీనం చేసుకోవడం ద్వారా 8,928 ఫ్రాంకులు మాత్రమే లభ్యమైంది — అదైనా, మతగురువుల నుండే అదంతా తీసుకోబడింది, వగైరా.

మే 6వ తేది "Vengeur."[124]

# కమ్యూన్

## కమ్యూన్ ప్రాదుర్భావం, కేంద్ర కమిటీ

సెడాన్ తర్వాత కమ్యూన్ లియోన్, మార్సేల్స్, టులూజలలోను, తదితర చోట్లా ప్రకటింపబడింది.[129] దాన్ని అణచివెయ్యడానికి గంబెట్టా శాయశక్తులా ప్రయత్నించాడు.

విదేశీ దండయాత్రకు వ్యతిరేకంగా రక్షణ చర్యగానూ, సెప్టెంబరు 4 తిరుగుబాటు కర్తవ్యాల సాధనకుగానూ, అక్టోబరు మొదట్లో పారిస్‌లోని విభిన్న ఉద్యమాలు కమ్యూన్ ఏర్పాటును లక్ష్యంగా పెట్టుకున్నాయి. అక్టోబరు 31 ఉద్యమం కమ్యూన్ నెలకొల్పడంలో విఫలమైందంటే, బ్లాంకీ, ఫ్లోరెన్సులూ, ఉద్యమపు అనాటి యితర నాయకులూ gens de paroles* తాము పదవీ త్యాగం చేసి పారిస్ జిల్లాలన్నీ స్వేచ్ఛాయుతంగా ఎన్నుకొన్న కమ్యూన్‌కి చోటిస్తామంటూ యిచ్చిన parole d'honneur**ని నమ్మడమే అందుకు కారణం. తమ రక్షకులను హత్య చేసేందుకు ఆతృతగా ఎదురుచూసే వాళ్ల ప్రాణాలను దాని నాయకులు కాపాడిన కారణంగానే అక్టోబరు ఉద్యమం విఫలమైంది. ట్రొషూ, ఫెర్రీలను తప్పించుకుపోనిచ్చిన మీదట, ట్రొషూ వాళ్లమీద అకస్మికంగా బ్రెటాన్లను ఎగదోలాడు. అక్టోబరు 31న స్వయంనియమిత "రక్షణ ప్రభుత్వం" యింకా ఉన్నదంటే, ప్రజల సహిష్ణుతే అందుకు కారణమన్న సంగతి గుర్తుంచుకోవడం అవసరం. అదింకా జనవాక్య సేకరణ[130] అనే ప్రహసనంగుండా కూడా గడవ లేదు. ఆ పరిస్థితుల్లో, ఉద్యమ స్వభావానికి వక్ర వ్యాఖ్యానం చెప్పడంకన్న, దానిని ప్రష్యన్లతో దేశద్రోహకరమైన కుట్ర అని నింద వేయడం కన్న తేలికైనది

---

* తమ మాటపైన నిలబడే మనుష్యులు. — సం.

** ప్రమాణం. — సం.

మరొకటి లేదు. వాళ్లలో, తన మాట తప్పని ఒకేఒక్క వ్యక్తి* బర్తరఫ్‌ను వినియోగించుకొని, క్లెమాన్ టొమాను నేషనల్ గార్డు కమాండర్ ఇన్ ఛీఫ్‌గా నియమించడం ద్వారా ట్రొషూ బ్రెటాన్ల బలగాలను బలపరచడం కన్న తేలికైన పని మరొకటి లేదు. లూయీ బోనపార్ట్‌కి కార్సికన్ spadassins** ఎలాగో, రక్షణ ప్రభుత్వానికి యీ ట్రొషూ బ్రెటాన్లు అలాగ. భీతావహం కల్పించడంలో ఎక్కువ అనుభవం కలిగిన యీ మనుషులకు, చొరవ తీసుకున్న కార్మిక బెటాలియన్లను చూపించి మధ్యతరగతి వాళ్లలో భయం రెచ్చగొట్టడంకన్న, దేశభక్తికి విజ్ఞప్తి చేసి కార్మిక బెటాలియన్లలోనే పరస్పర అపనమ్మకాలను, చీలికలను ప్రోత్సహించడంకన్న — తమ అక్రమ ఆక్రమిత అధికారాన్ని కొనసాగించుకోవడానికి వాళ్లు వినియోగించుకుంటూ వచ్చిన, అంత అభివృద్ధి నిరోధకత్వ, వినాశకర అనుమానాలను సృష్టించడంకన్న తేలికైన పని మరొకటి లేదు. సెప్టెంబరు 4న ఆకస్మిక పితూరీ ద్వారా వాళ్లు అధికారంలోకి దూరిన కారణంగా, అభివృద్ధినిరోధక బీభత్స దినాల్లో సిసలైన బోనపార్టిస్ట్ తరహా జనవాక్య సేకరణ ద్వారా, తమ అధికారానికి కుహనా ఆమోదాన్ని సమకూర్చ గలిగారు.

1870 నవంబరు ఆరంభంలో పారిస్‌లో కమ్యూన్ విజయవంతమై యుంటే (అప్పటికే దేశంలోని గొప్ప నగరాల్లో ప్రారంభమై, ఫ్రాన్సు అంతటా తప్పని సరిగా అనుకరించబడేది) రక్షణను ద్రోహం చేతుల్లో నుండి ఊడలాగడమే కాకుండా, ప్రస్తుత వీరోచిత పారిస్ పోరాటం ప్రదర్శించిన ఉత్సాహంతో రక్షణ కొనసాగించడమే కాకుండా, అసలు యుద్ధ స్వభావాన్నే పూర్తిగా మార్చి ఉండేది. దురాక్రమణ, ప్రతిఘాత విప్లవ పతాకధారి అయిన ప్రష్యాకి వ్యతిరేకంగా 19వ శతాబ్దపు సాంఘిక విప్లవ పతాకాన్నె గురవేస్తూ - అది రిపబ్లికన్ ఫ్రాన్సు యుద్ధం అయ్యుండేది. కిరాయి ముసలి కుతంత్రజ్ఞుని యూరప్ రాజాస్థానాలన్నింటికీ వాటివాట దయాధర్మ భిక్షం కోసం పంపడం కన్న, పాత, కొత్త ప్రపంచాల్లోని శ్రామిక జనసామాన్యాన్ని కమ్యూన్ ఉత్తేజితం చేసి వుండేది. అక్టోబరు 31న, జూల్ ఫావ్ర్, ప్రభృతులు కమ్యూన్‌ని escamotage*** ద్వారా ప్రష్యాకి ఫ్రాన్సు లొంగుబాటును పదిలంచేసి, ప్రస్తుత అంతర్యుద్ధాన్ని ప్రారంభించారు.

అయితే, ఒక విషయం మటుకు స్పష్టమైంది: సెడాన్ యుద్ధంలో సామ్రాజ్యాధికారాపహర్త లొంగుబాటు కారణంగా[12] అతని స్థానం ఖాళీ అయినందున, సెప్టెంబరు 4 నాటి విప్లవం కేవలం రిపబ్లిక్ పునఃప్రతిష్ఠాపన మాత్రమే కాదు. తన శత్రువుల

---

* టమిజ్యే. — సం.

** బందిపోట్లు. — సం.

*** కన్నుగప్పి మోసగించడం. — సం.

నాయకత్వాననే పోరాడుతున్నప్పటికీ, పారిస్ ప్రతిఘటనను దీర్ఘకాలం పాటు సాగించడం ద్వారా, విదేశీ దాడిదారు నుండి ఆ రిపబ్లిక్‌ను అది జయించింది. అంతే కాదు, ఆ విప్లవం కార్మికవర్గపు హృదయాల్లోకి చొరుచుకు పోతోంది. రిపబ్లిక్ అన్నది గతానికి సంబంధించిన దేనికో పేరుగా ఉండటమన్న స్థితి గతించింది. దానిలో ఒక నూతన ప్రపంచం గర్భితమై వుంది. కుట్రదారీ లాయర్ల, వాక్చతురుల ముఠా చేసే మోసాలు, అబద్ధాలు, వెకిలి వక్రీకరణల మూలంగా ప్రపంచం దృష్టి నుండి మరుగు పరచబడిన దాని నిజ లక్ష్యం, వైఖరీ, పారిస్ కార్మికవర్గపు (ఫ్రెంచి దక్షిణాది కార్మికుల) ఎగువులవంటి ఉద్యమాల ద్వారా మరల మరల బహిర్గత మయ్యాయి. వాటి సమరనినాదమెప్పుడూ కమ్యూనే!

కమ్యూన్ — సామ్రాజ్యానికీ, దాని అస్తిత్వ పరిస్థితులకూ వ్యతిరేకమైన విప్లవ వాస్తవ రూపం — దక్షిణ ఫ్రెంచి నగరాల్లో తన తొలి ప్రయోగాలు జరుపుకొని, పారిస్ ముట్టడి కాలంలో ఎగువుల్లా సాగిన ఉద్యమాలలో మరల మరల ప్రకటితమవుతూ, రక్షణ ప్రభుత్వంయొక్క, "లొంగుబాటు పథక" పేరుడైన ట్రొషూ ప్రెటాన్ల యొక్క గారడీల, హస్తలాఘవాల కాలంలో మరుగుపడుతూ, చిట్టచివరకు మార్చి 26న విజయవంతంగా నెలకొల్పబడింది. అంతే గాని, ఆ రోజున అది ఆకస్మికంగా ఉద్భవించలేదు. కార్మిక విప్లవానికి మార్పురాని గమ్యమది. పారిస్ లొంగుబాటు, రిపబ్లిక్‌కి వ్యతిరేకంగా బోర్డోలోని బహిరంగ కుట్ర, మాంమార్ట్రర్‌పై చీకటి చాటున జరిగిన దాడి ద్వారా అధికారాన్ని హస్తగతం చేసుకునేందుకు సాగిన రాజకీయ కుట్ర, "రక్షణ ప్రభుత్వపు మనుషులు" పారిస్ కార్మికవర్గంలోని అత్యంత చైతన్యయుత, విప్లవకర విభాగాలకు మాత్రమే దాన్ని యికనెంత మాత్రమూ పరిమితం చెయ్యనివ్వకుండా పారిస్‌లోని సజీవ శక్తులన్నింటినీ కమ్యూన్ కొరకు జరిగే పోరాటం చుట్టూ సమీకరించాయి.

తొలి ఆకస్మిక పరాజయ ఫలితంగా, pis aller*గా, యుద్ధ ఆవశ్యకతగా మాత్రమే రక్షణ ప్రభుత్వం భరింపబడింది. రెండవ సామ్రాజ్యానికి, అబద్ధాల సామ్రాజ్యానికి పారిస్ ప్రజలిచ్చిన సరైన జవాబే కమ్యూన్.

ఆవిధంగా, రక్షణ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సజీవమైన పారిస్ యావత్తూ — బోనపార్టిజానికి ఆధారస్తంభాలనదగ్గవాళ్లూ, దాని అధికారిక ప్రతిపక్షమూ, బడా పెట్టుబడిదారులూ, ఆర్థిక అవినీతిపరులూ, దగాకోరులూ, సోమరులూ, పాత ప్రభుత్వ భాగ్యోపజీవులూ తప్ప — చేసిన తిరుగుబాటు తేదీ, మార్చి 18 (కుట్రకి వ్యతిరేకంగా దాని తొలి విజయం ఆ రోజుననే సాధింపబడినప్పటికీ) కాదు. అది జనవరి 28, లొంగుబాటు మొదటి రోజే! నేషనల్ గార్డు — అంటే, పారిస్‌లోని సకల సాయుధ

---

* మేలైన మరొక గత్యంతరంలేక ఆమోదింపబడిన క్రమం. — సం.

పురుష జనమూ — సంఘటితమై ఆ రోజు నుండే, బిస్మార్కు కృపవల్ల నెలకొల్పబడిన లొంగుబాటుదారుల అధికారాపహర్తక ప్రభుత్వం ప్రసక్తి లేకుండా, పారిస్‌ను de facto* పాలించింది. తన ఆస్తి అయినటువంటి, లొంగుబాటు షరతుల కనుగుణంగా తన ఆస్తి అయినందున మాత్రమే తనకు విడిచిపెట్టబడినటువంటి తన ఆయుధాలను, ఫిరంగులను అప్పగించడానికి అది నిరాకరించింది. బిస్మార్కు నుండి యీ ఆయుధాలను కాపాడినది తన ఆయుధాల కోసం జూల్ ఫ్రావ్ బిస్మార్కులకు వ్యతిరేకంగా పోరాడటానికి సాయుధ పారిస్ సంసిద్ధతే గాని, జూల్ ఫ్రావ్ ఔదార్యం కాదు. విదేశీ దండయాత్ర దృష్ట్యా, శాంతి సంప్రతింపుల దృష్ట్యా పరిస్థితిని పారిస్ సంక్లిష్టం చెయ్యదలచలేదు. అది అంతర్యుద్ధాన్ని గురించి భయపడింది. అది, కేవలం ఆత్మరక్షణ ధోరణి మాత్రమే వహించి, పారిస్‌లో de facto* స్వయంపాలనతో తృప్తిపడింది. కానైతే అది ప్రతి ఘటన కోసం మెల్లగా నిబ్బరంగా తనను తాను సంఘటితపరుచుకుంది. (లొంగుబాటు షరతుల్లో సైతం లొంగుబాటుదారులు ప్రష్యాకి తమ లొంగుబాటును పారిస్‌పై తమ పెత్తనాన్ని నెలకొల్పుకోవడాని కొక సాధనంగా వాడుకొనే అసందిగ్ధమైన ధోరణిని ప్రదర్శించారు. పారిస్‌ను లొంగదియ్యడానికి 40,000 మంది సైనికులను వాళ్ళ కోరారు. ప్రష్యా నుండి వాళ్ళు కోరిన రాయితీ యిదొక్కటే. వాళ్ళు దీన్నొక రాయితీగా అర్థించియుండకపోయి వుంటే, బిస్మార్కు దీన్నొక షరతు క్రింద వాళ్ళపైన విధించియుండేవాడు. 3,00,000 మంది నేషనల్ గార్డులుండగా — విదేశీ శత్రువు దాడి ప్రయత్నం నుండి పారిస్‌ని రక్షించడానికీ, దాని ఆంతరంగిక భద్రతను కాపాడటానికీ యీ బలం కావలసిన దానికన్న ఎక్కువ — కాగా, 40,000 మంది సైనికుల కోసం యీ డిమాండుకి — దీన్ని గురించి బహిరంగంగా ప్రకటింపబడింది — మరొక ప్రయోజనమేమీ ఉండదు.) తన ప్రస్తుత సైనిక వ్యవస్థకు అదనంగా అతిసరళమైన పథకం ప్రకారం నిర్మింపబడిన రాజకీయ ఫెడరేషన్‌ని అది జోడించింది. ప్రతి ఒక్క కంపెనీ ప్రతినిధులచేతా, ఒకదానితో మరొకటి అనుసంధానింపబడిన నేషనల్ గార్డులందరి కలయిక అది. వాళ్ళు తిరిగి బెటాలియన్ల ప్రతినిధులను, వాళ్ళు తిరిగి సాధారణ ప్రతినిధులను, జిల్లాకు ప్రాతినిధ్యం వహించే దళాల జనరల్సునూ నియమిస్తారు. వాళ్ళు మిగిలిన 19 యితర జిల్లాల ప్రతినిధులతోనూ సహకరిస్తారు. నేషనల్ గార్డుయొక్క మెజారిటీ బెటాలియన్లచేత ఎన్నుకోబడిన ఆ 20 మంది ప్రతినిధులూ కేంద్ర కమిటీగా ఏర్పడతారు. మార్చి 18న, ఈ శతాబ్దంలో కెల్ల గొప్ప విప్లవాన్ని ప్రారంభించినదీ, ప్రస్తుత మహత్తర పారిస్ పోరాటంలో తన పనిని నిర్వహిస్తున్నదీ ఆ కేంద్ర కమిటీయే.

---

* ఆచరణలో. — సం.

ప్రతినిధుల ఎన్నికల్లో ముందెన్నడూ యింతటి వడబోత జరగలేదు. ఏ ప్రజా సమూహం నుంచైతే ప్రతినిధులు పైకొచ్చారో, వారి కిప్పుడు ప్రాతినిధ్యం వహించినంత పూర్తిగా ముందెన్నడూ ప్రాతినిధ్యం వహించలేదు. వాళ్ళు అపరిచితులు, అనామకులు అన్న బయటి వారి అభ్యంతరానికి — నిజానికి, వాళ్ళు కార్మికవర్గానికి మాత్రమే పరిచితులు, అంతేగాని పాత అనుభవం ఉన్నవాళ్ళు కారు, గతంలో దగుల్బాజీ పనులు చేసి, పదవి కోసం, అన్యాయార్జన కోసం వేట సాగించి దుష్కీర్తి పొందినవాళ్ళు కారు — వాళ్ళందు కనే సగర్వంగా జవాబిచ్చారు: "12 గురు క్రీస్తు శిష్యు"లైనా అంతే కదా. వాళ్ళు తమ చేతలతో జవాబిచ్చారు.

## కమ్యూన్ స్వభావం

తన సర్వవ్యాప్త, సంక్లిష్ట సైనిక, నిరంకుశాధికార, మతపర, న్యాయ అంగాలతో సజీవ పౌర సమాజాన్ని కొండచిలువలాగ చుట్టివేసే కేంద్రీకృత రాజ్యయంత్రాంగం, మొదట, నిరంకుశ రాజరిక కాలంలో, అప్పుడే ఉద్భవిస్తున్న ఆధునిక సమాజం ఫ్యూడలిజం నుండి విముక్తి చెందేందుకు చేసే పోరాటంలో, దాని చేతిలో ఒక ఆయుధంగా రూపొందింపబడింది. మధ్యయుగాలనాటి ప్రభువుల, నగరాల, మతగురువుల ప్రత్యేక హక్కులు ఏకీకృత రాజ్యాధికారానికి హంగులుగా మార్చబడ్డాయి. ఫ్యూడల్ అధికారులను రద్దుచేసి వాళ్ళ స్థానంలో జీతంపై పనిచేసే ప్రభుత్వాధికారులు నియమింపబడ్డారు. భూస్వాముల మధ్యయుగ భృత్యుల చేతుల నుండి, పట్టణవాసుల కార్పొరేషన్ల వద్ది నుండి ఆయుధాలు స్థాయీ సైన్యం చేతుల్లోకి బదిలీ చెయ్యబడ్డాయి. రకరకాల పరస్పర విరుద్ధ మధ్యయుగ ప్రభుత్వాల అరాజకత్వం స్థానంలో క్రమబద్ధమూ, క్రమానుగతమైన శ్రమ విభజనతో కూడిన నియమితం చెయ్యబడిన రాజ్యాధికార పథకం రూపొందింది. జాతీయైక్యతా (జాతి సృష్టి కోసం) సంస్థాపన కర్తవ్యంలో మొదటి ఫ్రెంచి విప్లవం సకల స్థానిక, ప్రాంతీయ, పట్టణ, గ్రామీయ స్వాతంత్ర్యాన్ని కూల్చివెయ్యాల్సి వచ్చింది. కాగా అది, నిరంకుశ రాజరికం ప్రారంభించిన రాజ్యాధికార కేంద్రీకరణను, వ్యవస్థా నిర్మాణాన్ని కొనసాగించాల్సిన పరిస్థితిలో పడింది. రాజ్యాధికార పరిధినీ, దాని హంగులనూ విస్తృతం చెయ్యాల్సి వచ్చింది. తన పరికరాలనూ, తన స్వేచ్ఛనూ, వాస్తవ సమాజంపై తన మానవాతీత పెత్తనాన్నీ పెంకొల్పుకోవాల్సి వచ్చింది. నిజానికిది ఎలాంటిదంటే మధ్యయుగాల నాటి పవిత్రులతో కూడిన మానవాతీతమైన స్వర్గం స్థానంలో వచ్చినది. సాంఘిక గ్రూపులయొక్క సంబంధాలవల్ల కలిగిన

ప్రతి చిన్న విడి ప్రయోజనమూ సమాజం నుంచే వేరుచెయ్యబడింది. సుస్థిర మొనర్చబడి, సమాజానికి అతీతం చెయ్యబడింది. ప్రభుత్వ ప్రయోజనం రూపంలో సమాజానికి వ్యతిరేకమైనదిగా, ఖచ్చితంగా నిర్ణయింపబడిన క్రమానుగతమైన విధులు కలిగిన రాజ్యాధికార పూజారులచేత అమలు జరపబడేదిగా అది తయారు చెయ్యబడింది.

పౌర సమాజంపై పరాన్నజీవియైన కంతివంటి యీ రాజ్యయంత్రాంగం, సమాజపు ఆదర్శప్రాయమైన ప్రతిరూపంగా నటిస్తూ, మొదటి బోనపార్ట్ పాలనలో పూర్తిగా వికసించింది. రెస్టొరేషన్, జూలై రాజరికమూ[131] మరింత శ్రమ విభజనను దానికి చేర్చడమే తప్ప, దాన్ని మరేమీ పెంచలేదు. పౌర సమాజంలో శ్రమ విభజన, కొత్త ప్రయోజనాల గ్రూపులనూ, ఆ కారణంగానే ప్రభుత్వ కార్యకలాపాలకు కొత్త రంగాలనూ సృష్టించి, ఆ మేరకు అది కూడా పెరిగింది. 1848 విప్లవానికి వ్యతిరేకంగా తాము జరిపే పోరాటంలో, ఫ్రెన్చి పార్లమెంటరీ రిపబ్లిక్కూ, యూరప్ ఖండంలోని అన్ని ప్రభుత్వాలూ, ప్రజోద్యమానికి వ్యతిరేకంగా తమ నిర్బంధ చర్యలతో, కార్యాచరణ సాధనాలను, ఆ ప్రభుత్వాధికార కేంద్రీకరణను బలపరచాల్సిన పరిస్థితిలో పడ్డాయి. ఈవిధంగా, అన్ని విప్లవాలూ ప్రాణాంతకమైన యీ పీడకలను విసర్జించేందుకు బదులు, రాజ్యయంత్రాంగాన్ని మెరుగుపరచడం మాత్రమే చేశాయి. ఒకటి మార్చి మరొకటి సర్వాధిపత్యం కోసం పోరాడిన పాలకవర్గాల గ్రూపులూ, పార్టీలూ, బ్రహ్మాండమైన యీ ప్రభుత్వ యంత్రాంగాన్ని ఆక్రమించుకోవడం (అదుపులోకి తెచ్చుకోవడం), (వశం చేసుకోవడం), దాన్ని పడపడమే విజేతకు లభించే ముఖ్యమైన కొల్లసొమ్ముగా పరిగణిస్తూ వచ్చాయి. అపారమైన స్థాయీ సైన్యాల ఏర్పాటుపైన, ప్రభుత్వానికి సంబంధించిన పలువురు నిక్షిప్తుల సృష్టిపైన, బృహత్తర జాతీయ ఐక్యతపైనా అది తన కార్యకలాపాలను కేంద్రీకరించింది. నిరంకుశ రాజరిక కాలంలో అది, ఆధునిక సమాజం ఫ్యూడలిజానికి వ్యతిరేకంగా చేసిన పోరాట సాధనంగా ఉంది. ఆ పోరాటానికి మకుటాయమానంగా ఫ్రెంచి విప్లవం వచ్చింది. మొదటి బోనపార్ట్ కింద, విప్లవాన్ని అణచివెయ్యడానికీ, సకల ప్రజా స్వేచ్ఛలనూ రూపుమాపడానికీ అది తోడ్పడటమే కాకుండా, ఫ్రెంచి విప్లవాన్ని విదేశాల్లో దెబ్బతియ్యడానికీ, ఫ్రెన్చికు అనుకూలంగా యూరప్ ఖండంలో ఫ్యూడల్ రాజరికాలకు బదులు కొంచెం ఎక్కువ తక్కువలో ఫ్రెన్చి ప్రతిబింబాలనదగిన రాజ్యాల స్థాపనకూ అది సాధనమైంది. రెస్టొరేషన్, జూలై రాజరిక కాలాల్లో అదే రాజ్యయంత్రాంగం బూర్జువావర్గంయొక్క బలాత్కార వర్గ పెత్తనానికి సాధనం కావడమే కాకుండా, ప్రత్యక్ష ఆర్థిక దోపిడికి, తమ కుటుంబాలకు ప్రభుత్వ వ్యవస్థకి సంబంధించిన సంపన్న స్థానాలన్నింటినీ కట్టబెట్టడం ద్వారా ప్రజా దోపిడీలో మరొక దాన్ని జతచేసే సాధనం కూడా అయింది. 1848 నాటి విప్లవ కాలంలో

చివరకది ఆ విప్లవాన్ని రూపుమాపే సాధనంగా, విస్తృత ప్రజానీకపు విముక్తికి సంబంధించిన ఆకాంక్షలన్నింటినీ రూపుమాపే సాధనంగా ఉపయోగపడింది. కానైతే, రాజ్యయంత్రాంగ మనే యీ పరభాగ్యోపజీవి తన తుది వికాసాన్ని రెండవ సామ్రాజ్య కాలంలోనే పొందింది. ప్రభుత్వాధికారం తన స్థాయీ సైన్యంతో, తన సకల నిర్దేశక నిరంకుశ ఉద్యోగ వర్గంతో, ప్రజలను విమూఢులను చేసే మతబోధకులతో, తన అంచెలవారీ బానిస న్యాయస్థానాలతో, సమాజానికే ఎంతగా అతీతంగా పెరిగిందంటే, తనకు బాసటగా దుస్సాహసిక కసాయి ముఠా వొకదాన్ని కలిగిన ఏ విలక్షణ వాసి సాహసికుడైనా కూడా దాన్ని వశంచేసుకోగలడు. 1789 నాటి విప్లవంచేత స్థాపింపబడిన నూతన ప్రపంచానికి వ్యతిరేకంగా పాత యూరప్‌యొక్క సాయుధ కలయిక అనే సాకు సైతం దానికి యికనెంత మాత్రమూ అవసరం లేదు. అది, తన పార్లమెంటరీ మంత్రివర్గానికో, లేక శాసన సభకో లొంగి వున్న వర్గ పెత్తనపు సాధనంగా యికనెంత మాత్రమూ కనిపించదు. పాలకవర్గాల ప్రయోజనాలను సైతం తన నిరంకుశ పాలన క్రింద అణచిపెట్టి, స్వయంనియమిత శాసన సభలతోను, తమకు తామే చెల్లించుకొనే సెనేట్లతోను, వాటి పార్లమెంటరీ ప్రదర్శనకు స్వస్తి చెప్పి, తన ఎదురులేని పాలనకు సార్వజనిక ఓటింగు హక్కుద్వారా అనుమతి సంపాదించుకొని, "భద్రతా" పరిరక్షణావశ్యకత దృష్ట్యా, అంటే, ఉత్పత్తి దారులపై భూస్వాములయొక్క, పెట్టుబడిదారులయొక్క పాలన కోసం, ప్రస్తుత అవినీతి విలయతాండవాన్నీ, అత్యంత పరభాగ్యోప జీవనం గడిపే సమాజ విభాగం, అర్థిక దగాకోరుల విజయాన్నీ, గతానికి సంబంధించిన చిరుగుల బొంతను మునుగేసి, గతానికి సంబంధించిన అభివృద్ధి నిరోధక ప్రభావాలన్నింటి వికృత <u>విలయతాండవాన్ని</u> విచ్చలవిడిగా వదిలి — దగుల్బాజీ పనుల పిశాచగణ సమవాకారమనదగిన — రాజ్యాధికారం రెండవ సామ్రాజ్యంలో పరాకాష్ఠనందుకుంది. సమాజంపై యిది ప్రభుత్వాధికార తుది విజయంలా కనిపించినా, నిజానికిది ఆ సమాజంలోని సకల అవినీతికర శక్తుల వికృత విజృంభణే. విజ్ఞులు కానివాళ్ల కళ్లకిది కేవలం శాసన అధికారంపై కార్యనిర్వాహక అధికారం విజయంగా మాత్రమే కనిపించింది. సమాజంకన్న అధికమైనదిగా నటించే దాని రూపం ద్వారా, సమాజపు నిరంకుశాధికారంగా నటించే వర్గ పాలన రూపంయొక్క తుది పరాజయంగా మాత్రమే అది కనిపించింది. కాని నిజానికి, అది తుది వికృతమ్మే, ఆ వర్గ పాలనకు వీలైన ఏకైక రాజ్య రూపమే. ఏ కార్మికవర్గాన్నైతే వాళ్లు శృంఖలా బద్ధంగా ఉంచారో దానికే కాకుండా, ఆ పాలకవర్గాలకు సైతం యీ రాజ్య రూపం అవమానకరమైనదే.

సెప్టెంబరు 4 తేదీ, రిపబ్లిక్కుని హతమార్చిన వికృత దుస్సాహసికునికి వ్యతిరేకంగా రిపబ్లిక్ సామంజస్య పునర్నిరూపణ మాత్రమే. <u>సాక్షాత్తూ సామ్రాజ్యానికి</u> —

అంటే, రాజ్యాధికారం, కేంద్రీకృత కార్యనిర్వాహకాధికారం, రెండవ సామ్రాజ్యమే దీనికి పూర్తి పరాకాష్ఠ — దానికి పూర్తిగా విరుద్ధమైనది కమ్యూన్. వాస్తవానికి యీ రాజ్యాధికారం బూర్జువావర్గం రూపొందడానికి దారితీస్తుంది, అది మొదట ఫ్యూడలిజాన్ని కూల్చివెయ్యడానికి ఒక సాధనంగా వినియోగపడుతుంది. తర్వాత అదే, ఉత్పత్తిదారుల యొక్క, కార్మికవర్గంయొక్క విమోచన ఆకాంక్షలను అణచివెయ్యడానికి సాధనంగా వినియోగపడుతుంది. అన్ని అభివృద్ధినిరోధక ఉద్యమాలూ, అన్ని విప్లవాలూ కూడా ఆ సంఘటిత అధికారాన్ని — శ్రమ బానిసత్వంయొక్క సంఘటిత బలప్రయోగాన్ని — ఒక చేతి నుండి మరొక చేతికి, పాలక వర్గాల్లోని ఒక ముఠా చేతుల్లో నుండి మరొక ముఠా చేతుల్లోకి మార్చడానికి మాత్రమే తోడ్పడ్డాయి. పాలకవర్గాలకు అది, అణచిపెట్టడానికీ, అన్యాయార్జనకూ సాధనంగా వినియోగపడింది. ప్రతి ఒక్క మార్పు నుండీ అది కొత్త శక్తులను పైకి లాగింది. ప్రతి ఒక్క ప్రజా తిరుగుబాటునూ అణచివేసే సాధనంగా అది ఉపయోగపడింది. కార్మికవర్గం పోరాటం సాగించి, తన పీడకుల్లోని ఒక విభాగం నుంచి మరొక విభాగానికి రాజ్యాధికార బదిలీని సాధించాల్సిందిగా శాసించబడిన తర్వాత, కార్మికవర్గాన్ని అణచివెయ్యడానికి అది తోడ్పడింది. అందుకని కమ్యూన్, దీనికో దానికో, లెజిటిమిస్టు, రాజ్యాంగబద్ధ, రిపబ్లికన్, లేక సామ్రాజ్యవాద రాజ్యాధికార రూపానికి వ్యతిరేకమైన విప్లవం కాదు. రాజ్యానికే వ్యతిరేకమైన విప్లవమిది. మానవాతీతమైన సామాజిక గర్భస్రావం వంటి దానికి వ్యతిరేకమైన విప్లవమిది. ప్రజలచేత, ప్రజల కోసం ప్రజలు తమ సొంత సాంఘిక జీవితాన్ని తిరిగి చేతుల్లోకి తీసుకోవడమే యిది. పాలకవర్గాల్లోని ఒక ముఠా చేతుల్లోంచి మరో ముఠా చేతుల్లోకి రాజ్యాధికారాన్ని మార్చేందుకు జరిగిన విప్లవం కాదిది, వర్గ పెత్తనానికి సంబంధించిన భయంకర యంత్రాంగాన్ని భగ్నంచేసేందుకు జరిగిన విప్లవ మిది. కార్యనిర్వాహక అధికారానికీ వర్గ పెత్తనానికి సంబంధించిన పార్లమెంటరీ రూపాలకూ మధ్య జరిగిన కుమ్ములాటల్లో ఒకటి కాదిది. ఒక దానిలో మరొకటి సమేకమైన ఈ రెండు రూపాలకూ వ్యతిరేకంగా జరిగిన తిరుగుబాటిది. వీటిలో పార్లమెంటరీ రూపం, కార్యనిర్వాహక అధికారంయొక్క మోసకారి అనుబంధం మాత్రమే. ఈ రాజ్యాధికార అక్రమ అక్రమణకు రెండవ సామ్రాజ్యం తుది రూపం. దానిని ఖచ్చితంగా త్రోసిపుచ్చేదే కమ్యూన్. అందుకే అది, 19వ శతాబ్దపు సాంఘిక విప్లవ నాందీ ప్రస్తావన. అందుకని, పారిస్‌లో దాని గతి ఏమైనప్పటికీ, అది ప్రపంచమంతా వ్యాపిస్తుంది. యూరప్, అమెరికాలకు చెందిన కార్మికవర్గం వెన్వెంటనే దాన్ని విముక్తి మంత్రంగా హర్షించింది. ప్రష్యన్ విజేతయొక్క ఘనతలూ, పురాతన కాలంనాటి బూజుపట్టిన చర్యలూ కాలదోషం పట్టిపోయిన చిత్రభ్రమల్లాగ కనిపించాయి.

ఈ నూతన ఆకాంక్షకు "కమ్యూన్" అనే అక్షర రూపం యివ్వగలిగినదీ, పోరాటం జరిపే పారిస్ కమ్యూన్‌చేత దానికి నాంది ప్రస్తావన చెయ్యగలిగినదీ ఒక్క కార్మికవర్గం మాత్రమే. రెండవ సామ్రాజ్యంలో చివరి సారిగా వ్యక్తమైన ఆ రాజ్యాధికారం, పాలక వర్గాల గర్వాన్ని కించపరిచేదే అయినా, స్వయంపాలనకు సంబంధించిన వాళ్ల బూటక నాటకాలను గాలికి ఎగర కొట్టేదే అయినా, వాళ్ల వర్గపాలన సాగేందుకు సాధ్యమైన తుది రూపమే అది. రాజకీయంగా వాళ్లకున్న అధికారాలు ఊడగొట్టబడినా అదే సమయంలో వాళ్ల పాలనకు సంబంధించిన ఆర్థిక, సాంఘిక నైచ్యాలన్నీ పూర్తిగా విజృంభించి విలయతాండవం చేశాయి. మధ్య తరహా బూర్జువావర్గమూ, పెటీబూర్జువావర్గమూ వాటి ఆర్థిక జీవన పరిస్థితుల దృష్ట్యా ఒక నూతన విప్లవాన్ని ప్రారంభించజాలవు. పాలకవర్గాల అడుగు జాడల్లో నడవడమో లేక, కార్మికవర్గ అనుచరులుగా ఉండటమో తప్ప వాటికి గత్యంతరం లేకపోయింది. సమాజం నుండి భిన్నమూ, స్వతంత్రమూ అయిన రాజ్యంయొక్క తుది విజయ స్వరూప మనదగిన రెండవ సామ్రాజ్యానికి అనాసక్త ఆర్థిక ప్రాతిపదిక రైతులు. యావత్తు సమాజం కోసమూ సాధించాల్సిన నూతన సాంఘిక కర్తవ్యంచేత ఉత్తేజితులై, అన్ని వర్గాలనూ, వర్గపాలననూ తుదముట్టించే కర్తవ్యోత్తేజితులై, ఆ వర్గ పాలన పరికరమైన రాజ్యాన్ని, సమాజపు సేవకురాలుగా కాక దాని యజమాని స్థానాన్ని ఆక్రమించుకున్న కేంద్రీకృత, సంఘటిత ప్రభుత్వాధికారాన్ని నాశనం చేసేది శ్రామికులు మాత్రమే. వాళ్లకి వ్యతిరేకంగా పాలకవర్గాలు, రైతాంగంయొక్క క్రియారహితమైన తోడ్పాటుతో, జరిపే క్రియాశీల పోరాటంలో, రెండవ సామ్రాజ్యం — మధ్యయుగాల నాటి చర్చి స్థానాన్ని ఆక్రమించిన, తుది అత్యున్నతము, అదే సమయంలో మిక్కిలి దారుణమైన క్షుద్రమైన, అవినీతికరమైన రాజ్యం — సృష్టించబడింది. వాళ్లకి వ్యతిరేకంగానే అది అస్తిత్వంలోకి వచ్చింది. వాళ్లచేతనే అది, ప్రత్యేక రకమైన (కేంద్రీకృత) ప్రభుత్వాధికార రూపంగా కాక, దానియొక్క అత్యంత శక్తివంతము, సమాజం నుండి స్వతంత్రమైనదిగా కనిపించే విస్తరణగా, వ్యక్తీకరణగా, కాగా, దానియొక్క అత్యంత నికృష్ట వాస్తవంగా, పైనుండి క్రిందిదాకా దుష్కీర్తితో నిండిన, దేశంలో పూర్తి అవినీతికీ, విదేశాల్లో పరమ చేతకానితనానికీ కేంద్రమైన వాస్తవంగా అది కూల్చివెయ్యబడింది.

కాని యీ వర్గపాలన రూపం కూల్చివెయ్యబడిన తర్వాత కార్యనిర్వాహకాధికారం, ప్రభుత్వ రాజ్యయంత్రాంగం, విప్లవానికి ఏకైక మహత్తర దాడి లక్ష్యమైంది.

ఫ్రాన్సులో పార్లమెంటరిజం అంతమైంది. దాని తుది దశా కాలమూ, పూర్తి పెత్తనమూ పార్లమెంటరీ రిపబ్లిక్కే, 1848 మేకీ రాజకీయ కుట్రకీ మధ్య కాలంలో సాగిందది. దాన్ని నాశనం చేసిన సామ్రాజ్యం దాని సొంత సృష్టే. శాసనసభలోను,

సెనేట్‌తోను కూడిన సామ్రాజ్యం క్రింద — ఈ రూపంలోనే ప్రష్యా, ఆస్ట్రియా సైనిక రాజరికాల్లో యిది పునరావృతమైంది — పార్లమెంటరిజం కేవలం ఒక ప్రహసనంగా, కేవలం నగ్నమూ భయోద్విగ్నమూ అయిన నిరంకుశత్వంయొక్క ఉపకార్య క్రమంగా ఉండింది. ఫ్రాన్సులో అప్పుడిక పార్లమెంటరిజం అంతరించింది. కార్మిక విప్లవం దాన్ని ఆ మృతస్థితి నుంచి మేల్కొలపాలని ఎంత మాత్రమూ కోరుకోలేదు.

కమ్యూన్ — సమాజంచేత, సమాజాన్ని అదుపు చేసేదిగా, అణచేదిగా కాకుండా, దాని సొంత జీవ శక్తుల మాదిరిగా రాజ్యాధికార పునస్స్వీకరణ. ఇది జన సామాన్యంచేత, తమను అణచే సంఘటిత శక్తిగా కాకుండా తమ సొంత బలాన్ని రూపొందించుకోవడం ద్వారా జరుగుతుంది — జన సామాన్యపు పీడకులచేత హస్తగతం చేసుకోబడిన కృత్రిమ బలప్రయోగం కాకుండా, యిది, వారి సాంఘిక విమోచన రాజకీయ స్వరూపం. సమాజపు పీడకులచేత వశం చేసుకోబడిన యీ కృత్రిమ బలం (జన సామాన్యానికే వ్యతిరేకమైన, వారికి వ్యతిరేకంగా సంఘటిత పరచబడిన వారి సొంత బలప్రయోగం) ఇది, వారిని అణచేందు కోసం వారి శత్రువులు ప్రయోగించేది కాదు. అన్ని మహత్తర విషయాల్లాగే యీ రూపం కూడా సాదా అయినది, సరళమైనది. పూర్వ విప్లవాలకు భిన్నంగా — చారిత్రక పరిణామాలన్నింటికీ అవసరమైన సమయం, గతంలో ఎప్పుడూ అన్ని విప్లవాల్లోనూ ప్రజా విజయ దినాల్లోనే కోల్పోతూ వుండిన కాలం, విజయవంతమైన తన హస్తాలను తనకే వ్యతిరేకంగా తిప్పేలా చేస్తూవచ్చింది — కమ్యూన్ మొట్టమొదట సైన్యం స్థానంలో నేషనల్ గార్డును ఏర్పాటు చేసింది.

> "సెప్టెంబరు 4 దరిమిలా ప్రప్రథమ పర్యాయం, రిపబ్లిక్, తన శత్రువుల ప్రభుత్వం నుండి విముక్తం చెయ్యబడింది.... నగరంలో, పౌరులకు వ్యతిరేకంగా ప్రభుత్వాన్ని కాపాడే స్థాయీ సైన్యానికి బదులుగా, అధికారానికి (ప్రభుత్వానికి) వ్యతిరేకంగా, పౌరులను కాపాడే జాతీయ మిలీషియా ఉంది." (మార్చి 22వ తేదీనాటి కేంద్ర కమిటీ ప్రకటన.)

(స్థాయీ సైన్యాలను రద్దుచేసేందుకుగాను ప్రజలు యీ మిలీషియా (పౌర సైన్యం)ను జాతీయ స్థాయిలో మాత్రమే ఏర్పాటు చెయ్యాలి. అన్ని సాంఘిక అభివృద్ధులకూ తొలి ఆర్థిక conditio sine qua non* అయిన, పన్నులకూ, ప్రభుత్వ రుణాలకూ మూలమైన యీ సైన్యాన్ని, వర్గపాలన — ప్రభుత్వాధికారాన్ని

* తప్పనిసరి షరతు. — సం.

హస్తగతం చేసుకొనే యీ నిరంతర ప్రమాదాన్ని — (క్రమబద్ధమైన వర్గపాలనో, లేక అన్ని వర్గాలనూ కాపాడేవానిలా నటించే సాహసికుని పాలనో — రద్దుచెయ్యాలి.) అదే సమయంలో విదేశీ దురాక్రమణకు వ్యతిరేకంగాను, తదితర రాజ్యాలన్నింటిలోనూ అధిక వ్యయంతో కూడిన సైనిక యంత్రాంగాన్ని అసాధ్యం చేసే విశ్వసనీయమైన హామీ మిలీ షియా; రక్తపు పన్ను నుంచి, సకల ప్రభుత్వ పన్నులకూ, ప్రభుత్వ రుణాలకూ సారవంత మైన ఆధారంగా ఉండే పరిస్థితినుంచి రైతుకు విముక్తి అది. కమ్యూన్ రైతుకి ఒక ఆకర్షణ అన్నదానిలో యిప్పటికే యిక్కడొక అంశం వుంది. అతని విముక్తిలో యిది తొలి ఘట్టం. "స్వతంత్ర పోలీసు" రద్దు కావడంతో, దాని గూండాల స్థానంలో కమ్యూన్ సేవకులు పెట్టబడ్డారు. పవిత్ర రాజ్యాధికారానికి పార్లమెంటరీ అనుమతి నివ్వడానికో, లేక, పాలకవర్గాల చేతిలో ఒక ఆటబొమ్మగానో యింతకాలమూ దుర్విని యోగింపబడుతూ వచ్చిన సార్వత్రిక ఓటింగు, పలు సంవత్సరాలకు ఒకమారు పార్లమెంటరీ వర్గపాలన (సాధనాల ఎంపిక)కు అనుమతిని మంజూరు చెయ్యడానికి మాత్రమే వినియో గింపబడుతూ వచ్చిన సార్వత్రిక ఓటింగు, యిప్పుడు తన అసలైన ప్రయోజనాల కోసం, కమ్యూన్లచేత తమ సొంత పాలన నిర్వాహకులను, శాసనకర్తలను ఎంపిక చేసు కునేందుకు అనువర్తింపబడింది. పరిపాలనా, రాజకీయ ప్రభుత్వమూ గుప్త విద్యలనీ — ప్రభుత్వ భాగ్యోపజీవులు, పెద్ద జీతాలు పొందే వందిమాగధులు, పనిపాటల్లేకుండా ఉల్పాగా జీతాలు పొందేవాళ్లతో కూడిన శిక్షణ పొందిన ఒకానొక ప్రత్యేక కులానికి మాత్రమే ఉన్నతోద్యోగాలు అప్పగించవలసినవనీ భ్రమపడే రోజులు పోయాయి. ప్రజానీకపు తెలివి తేటలను గ్రహించి, అధికార పదవుల నిశ్రేణిలో క్రింది మెట్లలోని ఒకరిపైకి మరొకరిని రెచ్చగొట్టే రోజులు గతించాయి. రాజ్యాధికార అంతస్తులను పూర్తిగా రద్దుచేసి, ప్రజ లపై దాష్టీకం చేసే యజమానుల స్థానంలో ఎప్పుడంటే అప్పుడు తొలగించే వీలున్న సేవకులను పెట్టి, కుహనా బాధ్యత స్థానంలో నిజమైన బాధ్యతను ప్రవేశపెట్టి, వారు సదా ప్రజా పర్యవేక్షణక్రింద పనిచేసే ఏర్పాట్లు జరిగాయి. నిపుణులైన కార్మికుల మాదిరిగా నెలకు 12 పౌనుల జీతం, అత్యధిక జీతం ఏడాదికి 240 పౌనులును మించకుండా యిచ్చే ఏర్పాటు జరిగింది. ప్రొఫెసర్ హక్స్లీ వంటి గొప్ప శాస్త్రజ్ఞుని దృష్టిలో యీ జీతం, మెట్రోపోలిటన్ స్కూలు బోర్డులో పని చేసే ఒక గుమాస్తాకు అవసరమైన దానిలో అయిదో వంతుకి ఏ కొంచెమో ఎక్కువ. రాజ్యానికి సంబంధించిన అద్భుత రహస్యాలూ, టక్కుటమారనటనల కాపట్యం యావత్తూ ప్రధానంగా సామాన్య కార్మికులతో కూడిన కమ్యూన్చేత తుదముట్టింపబడింది. ఈ కమ్యూన్ వాళ్లు పారిస్ రక్షణకు ఏర్పాట్లు చేశారు. బోనపార్టు అంగరక్షక దళాలకు వ్యతిరేకంగా యుద్ధాన్ని సాగించారు. బ్రహ్మాండ మైన ఆ నగరానికి అవసరమైన సప్లైలను సమకూర్చారు. ప్రభుత్వ, పోలీసు, ప్రిఫె

క్యూర్ శాఖల క్రింద యింతకాలం విభజింపబడిన ఉద్యోగాలన్నింటినీ భర్తీ చేశారు. వాళ్ళు తమ పనిని అత్యంత కష్టమూ, క్లిష్టమూ అయిన పరిస్థితుల్లో, బహిరంగంగా, నిరాడంబరంగా నిర్వహించారు. కొద్ది పీనుల ప్రతిఫలానికి, మిల్టన్ తన "కోల్పోయిన స్వర్గం" రచన చేసినట్లు, వాళ్ళు తమ పనులు బహిరంగంగా చేశారు. పొరపాట్లకు తాము అతీతులమన్నట్లు వాళ్ళెన్నడూ నటించలేదు. డొంక తిరుగుడు పద్ధతిని ఆఫీసు పనుల్లో ప్రవేశపెట్టి వాళ్ళు తమ పొరపాట్లను కప్పిపుచ్చుకోలేదు. చేసిన తప్పిదాలను ఒప్పుకోవడానికి సిగ్గుపడకుండా వాళ్ళు వాటిని సరిదిద్దుకున్నారు. శిక్షణ పొందిన ఒక కులానికి చెందిన గుప్త గుణ విశేషాలైన సైనిక, పాలన, రాజకీయ ప్రజా విధులను వాళ్ళు వెన్వెంటనే సిసలైన కార్మిక విధులుగా చేశారు; (అంతర్యుద్ధ, విప్లవాల కల్లోలంలో శాంతి భద్రతలను కాపాడారు), (సాధారణ పునరుద్ధరణ కార్యక్రమాలను ప్రవేశపెట్టారు). కమ్యూన్ విడివిడి చర్యల గుణావగుణాలేమైనప్పటికీ, తనను తాను నెల కొల్పుకోవడమన్నది దాని చర్యల్లో కెల్ల ఘనమైనది. ఒక వంక విదేశ శత్రువూ, మరో వంక వర్గ శత్రువూ తొందర పెడుతున్న కాలంలో అది ఉద్భవించింది. తన అస్తిత్వం ద్వారా తన జీవశక్తినీ, ఆచరణ ద్వారా తన సిద్ధాంతాలనూ అది రుజావుచేసుకుంది. కమ్యూన్ ఆవిర్భావం విజేతలపై విజయం. నిర్బంధిత పారిస్, సాహసికమైన ఒక పెద్ద అంగలో యూరప్ నాయకత్వాన్ని తిరిగి తీసుకుంది. అది పాశవిక బలప్రయోగంపై ఆధారపడలేదు. సాంఘికోద్యమానికి నాయకత్వం స్వీకరించడం ద్వారా, సకల దేశాల కార్మికవర్గ ఆకాంక్షలకూ ఆకృతి నివ్వడం ద్వారా ఆ నాయకత్వాన్ని అది పొందింది.

పారిస్ నమూనాలో అన్ని పెద్ద పట్టణాలూ కమ్యూన్లుగా సంఘటితం అయివుంటే, ఆకస్మిక అభివృద్ధినిరోధక దాడి ద్వారా ఏ ప్రభుత్వమూ కూడా ఆ ఉద్యమాన్ని అణచలేకపోయి ఉండేది. ఈ సన్నాహక చర్య ద్వారా, ఉద్యమ విజయానికి అవసరమైన కాలవ్యవధి సాధింపబడితే, యావత్తు ఫ్రాన్సూ స్వయం నిర్వాహక, స్వయం పాలక కమ్యూన్లుగా సంఘటితమైయుండేది. స్థాయీ సైన్యం స్థానంలో ప్రజా మిలీషియా ఏర్పడి వుండేది. ప్రభుత్వ భాగ్యోపజీవుల మూక తొలగింపబడేది. మతగురు పరంపర స్థానాన్ని ఉపాధ్యాయులు ఆక్రమించేవారు. ప్రభుత్వ న్యాయస్థానాలు కమ్యూన్ శాఖలుగా మార్చబడేవి. జాతీయ ప్రతినిధుల ఎన్నిక సార్వజనిక ఓటింగు సర్వశక్తి వంతమైన ప్రభుత్వానికి అనుకూలమైన గారడి కాక సంఘటిత కమ్యూన్ల బుద్ధి పూర్వక వ్యక్తీకరణ అయ్యుండేది. రాజ్యవిధులు సాధారణ జాతీయావసరాలను తీర్చుకొనే కొద్దిపాటి విధులుగా కుదింపబడియుండేవి.

కమ్యూన్ — శ్రామికులచేతనే సృష్టింపబడిన, లేక ప్రకృతి ప్రసాదించిన శ్రమ సాధనాల గుత్తదారుల ఆక్రమాక్రమణ (బానిస యాజమాన్యం) నుండి శ్రమకు విమో

చన – సాంఘిక విమోచనయొక్క రాజకీయ రూపం. రాజ్య యంత్రాంగమూ, పార్లమెంటరిజమూ ఏవిధంగా అయితే పాలకవర్గాల నిజ జీవితం కాక, కేవలం వారి పెత్తనానికి సంబంధించిన సంఘటిత సాధారణ సంస్థలో, పాత వ్యవస్థయొక్క రాజకీయ హామీలూ, రూపాలూ, వ్యక్తీకరణలో, అలాగే కమ్యూన్ కూడా, కార్మికవర్గపు సాంఘికోద్యమంగాని, తత్కారణంగానే మానవాళియొక్క సాధారణ పునరుజ్జీవనంగాని కాక, సంఘటిత కార్యాచరణ సాధనమే. ఏ వర్గ పోరాటం ద్వారా అయితే కార్మికవర్గం అన్ని వర్గాల రద్దు కోసమూ కృషి చేస్తుందో, తద్వారా అన్ని రకాల వర్గపాలనల రద్దు కోసమూ కృషి చేస్తుందో, ఆ వర్గ పోరాటాన్ని కమ్యూన్ అంతం చేయదు. (ఎందుకంటే, ఏ ప్రత్యేక ప్రయోజనానికీ అది ప్రాతినిధ్యం వహించదు. అది "శ్రమ" విమోచనకు అంటే, వ్యష్టి జీవితానికీ, సాంఘిక జీవితానికీ మౌలికము, సహజమైన షరతుకి ప్రాతినిధ్యం వహిస్తుంది. అక్రమాక్రమణ ద్వారా, దగా ద్వారా, కృత్రిమ సాధనాల ద్వారా మాత్రమే వాటిని కొద్దిమంది పైనుండి పెక్కు మంది పైకి నెట్టడం సాధ్యం.) కాని, కమ్యూన్ ఆ వర్గ పోరాటం తన వివిధ దశలగుండా అత్యంత హేతుబద్ధమూ, మానవీయమూ అయిన పద్ధతిలో సాగేందుకు అవసరమైన హేతుబద్ధమైన సాధనాన్ని కల్పిస్తుంది. కమ్యూన్ హింసాత్మక ప్రతిక్రియలకు దారితీసియుండ వచ్చు, అంతటి హింసాత్మక విప్లవాలనూ అది రెచ్చగొట్టి యుండవచ్చు. ప్రభుత్వ భాగ్యోపజీవుల అనుత్పాదక, కిలాడీ కృషికి స్వస్తి చెప్పడం ద్వారా, ఒక వంక, జాతీయ ఉత్పత్తిలో హెచ్చు భాగాన్ని రాజ్యమనే రాక్షసుడిని మేపడానికి త్యాగంచేసే స్రోతస్సులను తెంపివెయ్యడం ద్వారా, మరో వంక, శ్రామికజన వేతనాలను పొంది, నిసలైన పరిపాలనను, స్థానిక, జాతీయ పాలనను, సాగించడం ద్వారా తన మహత్తర గమ్యమైన శ్రమ విమోచనను అది ప్రారంభిస్తుంది. ఆవిధంగా, ఆర్థిక సంస్కరణతోబాటు, రాజకీయ మార్పులను తీసుకురావడం ద్వారా పెద్ద ఎత్తున పాదుపుతో అది ప్రారంభిస్తుంది.

కమ్యూన్ నిర్మాణం జాతీయ స్థాయిలో సుస్థిరంగా నెలకొని ఉంటే, అప్పటికీ అది బానిస యజమానుల చెదురుబదురు తిరుగుబాట్లనే ముప్పులను ఎదుర్కోవలసి ఉండును. కొద్ది కాలం శాంతియుత ప్రగతి క్రమాన్ని అడ్డగించినా, సాంఘిక విప్లవం చేతిలో ఆయుధాన్ని పెట్టడం ద్వారా ఆ ముప్పులు ఉద్యమాన్ని త్వరితం మాత్రమే చేసివుండేవి.

తాను వర్గ పోరాటానికి సంబంధించిన వివిధ దశలగుండా గడవాలన్న సంగతి కార్మికవర్గానికి తెలుసు. స్వేచ్ఛాయుత, సంయుక్త శ్రమ పరిస్థితుల ద్వారా శ్రమ బానిసత్వానికి సంబంధించిన ఆర్థిక పరిస్థితులను రద్దుచెయ్యడమన్నది కాలక్రమేణా జరిగే ప్రగతిశీల కృషి (ఆ ఆర్థిక పరివర్తన) మాత్రమేనన్న సంగతి దానికి తెలుసు. పంపకంలో మార్పు రావడం తనకు అవసరమన్న సంగతే కాకుండా, ఒక నూతన ఉత్పత్తి

వ్యవస్థ, లేక, ప్రస్తుత సంఘటిత శ్రమ (ప్రస్తుత పరిశ్రమ ద్వారా ప్రభవించిన దాని) లోని సామాజిక ఉత్పత్తి రూపాలను బానిసత్వ శృంఖలాలనుండి, వాటి ప్రస్తుత వర్గ స్వభావం నుండి విముక్తి చెయ్యడం అవసరమన్న సంగతీ, సామాజిక ఉత్పత్తి రూపాలను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సమన్వయం చెయ్యాలన్న సంగతీ కార్మికవర్గానికి తెలుసు. ఈ పునరుజ్జీవన కృషికి, స్వార్థపర శక్తుల ప్రతిఘటన కారణంగా, వర్గ స్వార్థాల కారణంగా మరలమరల ఎదురు దెబ్బలూ అడ్డంకులూ కలుగుతాయన్న సంగతి దానికి తెలుసు. ప్రస్తుత "పెట్టుబడికీ, భూ వసతికీ సంబంధించిన సహజ నియమాల స్వతస్సిద్ధ క్రియ" "స్వేచ్ఛాయుత, సంయుక్త శ్రమకి సంబంధించిన సామాజిక ఆర్థిక విధాన నియమాల స్వతస్సిద్ధ క్రియ"చేత మాత్రమే రద్దుచెయ్యబడగలదన్న సంగతి దానికి తెలుసు. "బానిసత్వపు ఆర్థిక నియమాల స్వతస్సిద్ధ క్రియ" "అర్ధబానిసత్వానికి సంబంధించిన ఆర్థిక నియమాల స్వతస్సిద్ధ క్రియ" లాగే నూతన పరిస్థితుల సుదీర్ఘ క్రమంలో జరుగుతుందన్న సంగతి దానికి తెలుసు. అయితే, అదే సమయంలో దానికి, కమ్యూన్ మాదిరి రాజకీయ నిర్మాణం ద్వారా, సత్వరమే పెద్ద ముందంగలు వెయ్యవచ్చునన్న సంగతీ, ఆ ఉద్యమాన్ని తన కోసమూ, యావత్తు మానవ జాతి కోసమూ ప్రారంభించాల్సిన సమయం ఆసన్నమైందన్న సంగతీ కూడా తెలుసు.

## రైతాంగం

(యుద్ధ నష్టపరిహారం.) కమ్యూన్ ప్రతిష్ఠాపన కింకా ముందే, తన "Journal Officiel" ద్వారా కేంద్ర కమిటీ యిలా ప్రకటించింది: "యుద్ధ నష్టపరిహారంలో ఎక్కువ భాగాన్ని యుద్ధకర్తలే చెల్లించాలి."[132] వ్యవస్థ సంరక్షకుల దృష్టిలో "నాగరికతకు వ్యతిరేకమైన పెద్ద కుట్ర" యిది. ఇదంటే వాళ్ళకి పరమ భయం. ఇది పరమ ప్రత్యక్ష సమస్య. కమ్యూన్ విజయవంతమైతే యుద్ధకర్తలు దాని నష్టపరిహారాన్ని చెల్లించాలి. అలా కాకుండా వెర్సైల్స్ విజయం సాధిస్తే యింతకుముందే తమ రక్తంతో, వినాశంతో, విరాళాలతో యుద్ధ మూల్యం చెల్లించిన ఉత్పత్తిదారులైన ప్రజానీకం మరో మారు మూల్యం చెల్లించాలి. ఆర్థిక హోదాపరులు యీ వ్యవహారంలో సైతం లాభం గుంజుకొనే పన్నాగం పన్నకపోరు. యుద్ధ ఖర్చుల సమస్య అంతర్యుద్ధంచేత పరిష్కరించబడాల్సి వుంది. కీలకమైన యీ సమస్యపై కమ్యూన్, కార్మికవర్గ ప్రయోజనాలకే కాకుండా, పెటీబూర్జువావర్గంయొక్క, నిజానికి, బూర్జువావర్గాన్ని (సంపన్న

పెట్టుబడిదారులను) (ధనిక భూస్వాములను, వారి రాజ్యధనోప జీవులను) మినహాయించి యావత్తు మధ్యతరగతి ప్రయోజనాలకూ ప్రాతినిధ్యం వహిస్తుంది. అందరికన్న ఎక్కువగా ఫ్రెంచి రైతాంగం ప్రయోజనాలకు అది ప్రాతినిధ్యం వహిస్తుంది. త్యేరూ, అతని "భూస్వాముల సభా" గెలిచినట్లయితే యుద్ధ పన్నులలో అధిక భాగం రైతులపైకే నెట్టబడుతుంది. బడా భూస్వాములైన తామే, రైతాంగానికి ప్రాతినిధ్యం వహిస్తామని "భూస్వాముల సభ" చేసే నినాదాన్ని, ప్రజలు పునశ్చరణచేసేటంతటి మూర్ఖత్వాన్ని ప్రదర్శించడం అసమంజసమైన వ్యవహారం. రైతాంగం, తమ అమాయకత్వంలో, ఈ దొడ్డ భూస్వాముల కోసం, యింతకు ముందే తమచేత కోట్ల ఫ్రాంకుల మేరకు విప్లవ నష్టపరిహారాన్ని చెల్లింపచేసిన భూస్వాముల కోసం, కోట్లాది ఫ్రాంకుల యుద్ధ నష్టపరిహారాన్ని చెల్లించడానికి ఎక్కడలేని ఆతృతా ప్రదర్శిస్తున్నారనడం అసందర్భం![73]

అదే వ్యక్తులు, రైతుపై బుద్ధిపూర్వకంగా 45 సెంటీముల అదనపు పన్నును[133] విధించడం ద్వారా ఫిబ్రవరి రిపబ్లిక్కును విరసనపాత్రం చేశారు. దీన్ని వాళ్ళ విప్లవం పేర, దానిచేత నెలకొల్పబడిన "తాత్కాలిక ప్రభుత్వం" పేర విధించారు. అయితే యిప్పుడు మాత్రం వాళ్ళ తమ సొంత పేరుననే కమ్యూన్ రిపబ్లిక్‌పై అంతర్యుద్ధాన్ని సాగిస్తున్నారు. యుద్ధ నష్టపరిహారాన్ని తమ భుజాలమీదినుండి రైతు భుజంమీదికి నెట్టడానికే వాళ్ళిది సాగిస్తున్నారు! దీని మూలంగా అతను ఎంతగా సంతోషిస్తాడో మరి!

నిర్బంధ సైన్య సమీకరణను కమ్యూన్ రద్దుచేస్తుంది, పార్టీ ఆఫ్ ఆర్డర్ రైతుపై రక్తపు పన్నును గట్టిగా రుద్దుతుంది. పార్టీ ఆఫ్ ఆర్డర్ పరభాగ్యోపజీవివంటి, విపరీతమైన ఖర్చుతో కూడిన రాజ్యాంగయంత్ర నిర్వహణ కోసం రైతు నెత్తిన పన్ను వసూలుదారును ఎక్కిస్తుంది, కమ్యూన్ తద్విరుద్ధంగా అతనికి పొదుపైన ప్రభుత్వాన్నిస్తుంది. పార్టీ ఆఫ్ ఆర్డర్, పట్టణవాసపు వడ్డీ వ్యాపారి ద్వారా రైతును కొల్లగొట్టడాన్ని కొనసాగిస్తుంది, రైతు కమతంపై మిగిలివున్న తనఖా తాకట్ల పీడకల నుంచి అతన్ని కమ్యూన్ విముక్తుని చేస్తుంది. రైతు ఆదాయాన్ని దిగమింగే పరభాగ్యోపజీవివంటి న్యాయ యంత్రాంగాన్ని — నోటరీలు, అమీనాలు, మొదలైన వాళ్లను — కమ్యూన్ రద్దుచేసి, దాని స్థానంలో, రైతు కృషి ఫలితంపై తెగబలవకుండా కార్మికుల వేతనాలకు పని చేసే కమ్యూన్ ఉద్యోగులను నియమిస్తుంది. ఫ్రెంచి రైతును తన వలయంలో యిరికించుకొని, అతని రక్తపానం చేసే బూర్జువా సాలీళ్లయొక్క న్యాయమూర్తులకూ, మేయర్లకూ నెలవుకల్పించే సాలెగూడువంటి ఈ యావత్తు న్యాయ వ్యవస్థనూ కమ్యూన్ కూల్చివేస్తుంది. పార్టీ ఆఫ్ ఆర్డర్ రైతును సాయుధ పోలీసు (జెండార్మీ) పాలన క్రింద అణచి వుంచుతుంది, కమ్యూన్ స్వతంత్ర సాంఘిక, రాజకీయ జీవితానికి అతడిని పునరుద్ధరిస్తుంది! కమ్యూన్ అతడిని ఉపాధ్యాయుని శిక్షణ

ద్వారా వివేకవంతుణ్ణి చేస్తుంది, పార్టీ ఆఫ్ ఆర్డరు అందుకు భిన్నంగా మతబోధకుని శిక్షణ ద్వారా అతనిపై మౌఢ్యాన్ని రుద్దుతుంది! అయితే, ఫ్రెంచి రైతు అన్నింటికన్న ముఖ్యంగా లెక్కగాడు! తను మతబోధకులకు చెల్లించే మొత్తాన్ని పన్నులు వసూలు చేసేవాడు గోళ్లూడకొట్టి యికనెంత మాత్రమూ వసూలు చెయ్యడనీ, మతపరమైన తన "విశ్వాసాల ఫలితంగా ఐచ్ఛికంగా" మాత్రమే తనేమైనా డబ్బు చెల్లిస్తే చెల్లించవచ్చుననీ యిది మిక్కిలి సహేతుకమైన విషయమనీ ఫ్రెంచి రైతు గుర్తిస్తాడు!

ఫ్రెంచి రైతు లూయీ బోనపార్ట్‌ను రిపబ్లిక్ అధ్యక్షుడుగా ఎన్నుకున్నాడు. కాని, పార్టీ ఆఫ్ ఆర్డర్ (రాజ్యాంగ సభ క్రిందా, శాసన సభల క్రిందా రిపబ్లిక్‌యొక్క అనామక పాలన కాలంలో) సామ్రాజ్యాన్ని సృష్టించింది! ఫ్రెంచి రైతు, తను నిజంగా ఏమి కోరుకుంటాడో, అతను 1849, 1850లలో – ప్రభుత్వ ప్రిఫెక్టుకి తన మేయర్నీ, ప్రభుత్వ మతబోధకునికి తన ఉపాధ్యాయునీ పోటీగా నిలపడం ద్వారా, ప్రభుత్వ జెండార్మ్‌కి తానే పోటీగా నిలబడటం ద్వారా – చూపనారంభించాడు. పార్టీ ఆఫ్ ఆర్డర్ 1849లో, విశేషించి 1850 జనవరి, ఫిబ్రవరిలలోనే, చేసిన అభివృద్ధి నిరోధక చట్టాల సారాంశం ప్రత్యేకించి ఫ్రెంచి రైతాంగానికి వ్యతిరేకంగా ఉద్దేశింపబడింది! ఫ్రెంచి రైతు లూయీ బోనపార్ట్‌ని రిపబ్లిక్ అధ్యక్షుని చేసిన మాట నిజమే, అయితే దానికి, మొదటి విప్లవం నుండి తాను పొందిన ప్రయోజనాలన్నీ కూడా అతని దృష్టిలో చోద్యంగా సాంప్రదాయికంగా మొదటి నెపోలియన్‌కి ఆపాదింపబడటమే అందుకు కారణం. కానైతే, ఫ్రాన్సులోని కొన్ని రాష్ట్రాల్లో రైతుల సాయుధ తిరుగుబాట్లూ, అధికారాన్ని హస్తగతం చేసుకోవడానికి జరిగిన రాజకీయ కుట్ర తర్వాత జెండార్మ్ వాళ్లను వేటాడటం, వాళ్లలోని భ్రమ త్వరితంగా చెదిరిపోతోందనడాన్ని రుజువు చేస్తుంది! రైతుయొక్క కృతకంగా పెంపొందించబడ్డ భ్రమలపైనా, సాంప్రదాయికంగా వస్తున్న దురభిప్రాయాలపైననే సామ్రాజ్యం ఆధారపడింది. కమ్యూన్ తద్విరుద్ధంగా అతని ప్రాణతుల్యమైన ప్రయోజనాలపైనా, అతని వాస్తవ అవసరాలపైనా ఆధారపడుతుంది.

ఫ్రెంచి రైతు ద్వేషం భూస్వామిపైనా, ఎస్టేట్ యజమానిపైనా, వెయ్యికోట్ల ఫ్రాంకుల యుద్ధ నష్టపరిహారాన్ని తనపై రుద్దిన వాడిపైనా, భూఖామందు ముసుగులోవున్న పట్టణవాస పెట్టుబడిదారుపైనా కేంద్రీకరింపబడింది. ఫ్రెంచి రైతు భూములపై వీళ్ల అతిక్రమణ రెండవ సామ్రాజ్యంలో సాగినంత వేగంగా మరెన్నడూ జరగలేదు. ఈ అతిక్రమణ, పాక్షికంగా కృతకమైన ప్రభుత్వ చర్యల ద్వారా పెంపొందించబడింది, పాక్షికంగా ఆధునిక వ్యవసాయాభివృద్ధి నుండి సహజంగానే పెంపొందింది. ఫ్రాన్సులో మూడు నెలల పాటు రిపబ్లికన్ కమ్యూన్ పరిపాలన సాగడమంటే,

ఫ్రెంచి రైతాంగానికీ, వ్యవసాయ శ్రామికవర్గానికీ తమకు వ్యతిరేకంగా తిరుగుబాటు చెయ్యడానికి కనుసన్న చెయ్యడం వంటిదేనన్న సంగతి భూస్వాములకు తెలుసు. అందుకనే కమ్యూనంటే వాళ్ల కంతటి దారుణమైన ద్వేషం! పట్టణవాస శ్రామికవర్గ విముక్తి పట్ల కన్న రైతుల విముక్తి పట్ల వాళ్లకి మరింత ఎక్కువ భయం! పట్టణవాస శ్రామిక వర్గాన్ని తమ సొంత నాయకుడుగాను, అగ్రజుడుగాను రైతులు త్వరలోనే పరిగణిస్తారు. పలు యూరపియన్ దేశాల్లోలాగే ఫ్రాన్సులో కూడా పట్టణవాస, గ్రామీణ ఉత్పత్తి దారుల మధ్య, పారిశ్రామిక శ్రామికవర్గానికీ రైతాంగానికీ మధ్య ప్రగాఢమైన వైరుధ్య మున్న మాట విజమే. శ్రామికవర్గపు ఆకాంక్ష, దాని ఉద్యమ భౌతిక ప్రాతిపదిక — పెద్ద స్థాయిలో సంఘటితం చెయ్యబడిన శ్రమ. అయితే, ప్రస్తుతం అది విరంకుశంగా సంఘ టితం చెయ్యబడిన మాటా, ఉత్పత్తి సాధనాలు కేంద్రీకరింపబడిన మాటా, అవి గుత్త పెట్టుబడిదారు చేతిలో ఉత్పత్తి సాధనాలుగా మాత్రమే కాకుండా, ఉత్పత్తి చేసే శ్రామికుని దోపిడి చేసుకోవడానికీ, బానిసగా చేసుకోవడానికీ సాధనంగా కేంద్రీ కరింపబడిన మాటా నిజమే. శ్రామికవర్గం చెయ్యాల్సిన దేమిటంటే, ఆ సంఘటిత శ్రమయొక్క ప్రస్తుత పెట్టుబడిదారీ స్వభావాన్ని, ఆ కేంద్రీకృత శ్రమ సాధనాలనూ మార్చడం. వర్గపాలన సాధనాలుగాను, వర్గ దోపిడీ సాధనాలుగాను వున్న వాటిని స్వేచ్ఛాయుత సంయుక్త శ్రమ రూపాలుగాను, సామాజిక ఉత్పత్తి సాధనాలుగాను మార్చడం. అందుకు భిన్నంగా రైతు శ్రమ వేరుచెయ్యబడింది. అతని ఉత్పత్తి సాధనాలు విడ దియ్యబడి, చెల్లాచెదరు చెయ్యబడ్డాయి. ఈ ఆర్థిక విభేదాలపై ఆధారపడి, పూర్తిగా భిన్నమైన సాంఘిక, రాజకీయాభిప్రాయాలతో కూడిన మొత్తం ప్రపంచం నిర్మింప బడింది. కానైతే, యీ రైతాంగ స్వామ్యం ఎన్నడో తన సహజ దశను దాటిపోయింది. అంటే, తను ఒక యదార్థంగా వున్న దశను, తానొక ఉత్పత్తి విధానంగా ఉన్న దశను, సమాజంయొక్క ఆర్థిక అవసరాలకు ప్రతిస్పందించే ఆస్తి రూపంగా ఉన్న దశను, గ్రామీణ ఉత్పత్తిదారులను సహజ జీవన పరిస్థితుల్లో ఉంచిన దశను అదెన్నడో దాటిపోయింది. అది తన క్షీణ దశలో ప్రవేశించింది. ఒక వంక, దానిలోంచి ఓ పెద్ద prolétariat foncier (గ్రామీణ శ్రామికవర్గం) పెరిగింది. దాని ప్రయోజనాలు పట్టణవాస వేతన కార్మికుల ప్రయోజనాలకు సరిపోలుతాయి. గ్రామీణార్థిక వ్యవస్థయొక్క ఆధు నిక ప్రగతి కారణంగా ఆ ఉత్పత్తి విధానానికే కాలం చెల్లిపోయింది. రైతుకు యాజ మాన్య భ్రమను మాత్రమే మిగిల్చి, అతని సొంత శ్రమ ఫలితాన్ని సైతం అతనికి దక్కకుండా చేసి, చివరకు, రైతు స్వామ్యమే నామమాత్రంగా తయారైంది. పెద్దపెద్ద క్షేత్రాల ఉత్పత్తిదారులలో పోటీ, రక్తపు పన్ను (నిర్బంధ సైనిక సేవ) ప్రభుత్వ పన్నులు, పట్టణవాస తాకట్టు వర్తకుల దారుణమైన వడ్డీలు, అతని మెడకి చుట్టబడిన న్యాయ

వ్యవస్థచేత సవాలక్ష చిలకకొట్టు – అతడినొక హిందూ రైతు స్థితికి దిగజార్చాయి. పోతే, ఆస్తిహరణం, అది నామమాత్రపు స్వామ్యంనుండే అయినా, ఆస్తిహరణం, గ్రామీణ వ్యవసాయ శ్రామికుని స్థితికి అతని పతనం – యిది ప్రతిదిన వాస్తవమైంది. అందుకని, రైతును శ్రామికుని నుండి విడదీసేది, అతని భ్రమాత్మక దురభిప్రాయమే తప్ప, నిజమైన అతని ఆస్తి ప్రయోజనమెంత మాత్రమూ కాదు. మేము పైన చూపి నట్లు, తన ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల్లో పైతం, అతనికి సత్వరమే గొప్ప వరా లివ్వ గలిగిన ప్రభుత్వం ఒక్క కమ్యూన్ మాత్రమే. అతని ప్రస్తుత ఆర్థిక పరిస్థితులను మార్చగలదీ, ఒక వంక, బడా భూస్వామి దోపిడి నుండి అతడిని కాపాడగలిగినదీ, మరో వంక, సొంత యాజమాన్యం సాకుతో, అతను గురవుతున్న కష్టాలూ కడగండ్ల నుండీ, దైన్యం నుండీ అతడిని గట్టెక్కించ గలిగినదీ, భూమిపై అతనికి గల నామమాత్రపు స్వామ్యాన్ని అతని శ్రమ ఫలితాలపై నిజమైన యాజమాన్యంగా మార్చ గలిగేదీ, సాంఘికావసరాలకు అనుగుణంగా, యిప్పుడు ప్రతి రోజూ తన ప్రయోజనాలను ప్రతికూల శక్తిగా అతిక్రమిస్తున్న ఆధునిక గ్రామీణార్థిక వ్యవస్థ ఫలితాలను నిజమైన స్వతంత్ర ఉత్పత్తిదారుగా అతని స్థానాన్ని రూపుమాపకుండా అతనికి సమకూర్చగలిగేదీ – ఒక్క కమ్యూన్ మాదిరి ప్రభుత్వం మాత్రమే. కమ్యూన్ రిపబ్లిక్‌వల్ల రైతు సత్వర లాభం పొందుతాడు కాబట్టి, అతను త్వరలోనే దాని పట్ల పూర్తి విశ్వాసాన్ని ప్రదర్శిస్తాడు.

## రిపబ్లికన్ యూనియన్ (లీగు)

రెండవ సామ్రాజ్యపు అవినీతి క్రింద దేని పాలన పారాన్ని అంటిందో ఆ అవ్యవస్థ పార్టీ, పారిస్‌ని విడిచిపోయింది (పారిస్ నుండి నిష్క్రమించింది), దాని హంగుదారులతో, చోపుదారులతో, అనుచరులతో, భృత్యగణంతో, దాని ప్రభుత్వ భాగ్యోప జీవులైన ఉద్యోగులతో, దాని mouchards*తో, దాని "వేశ్యల"తో, నీచ bohéme (సామాన్య నేరస్తుల)తో కూడిన పెద్ద దండుతో (ప్రభు బొహీమికి తోడుగా) తరలి వెళ్లింది. అయితే, మధ్య తరగతికి చెందిన నిజమైన, సజీవ శక్తులు, కార్మిక విప్లవం ద్వారా తమ నకిలీ ప్రతినిధుల నుండి విముక్తులై, ఫ్రెంచి విప్లవాల చరిత్రలోనే ప్రప్రథమ పర్యాయం, దాని నుండి విడివడి, తమ నిజ రూపంలో ముందు కొచ్చారు. పారిస్‌కీ రాష్ట్రాలకీ నడుమ మధ్యవర్తిగా వ్యవహరించిన, వెర్సేల్స్‌ను తిరస్కరించి, కమ్యూన్ పతాకాం క్రింద కదం తొక్కుతూ నడిచిన "రిపబ్లికన్ స్వేచ్ఛా లీగు"[134] అదే.

* వేగులు. – సం.

# ఇతరుల శ్రమపై జీవించని అన్ని సామాజిక వర్గాల ప్రతినిధిగా కమ్యూన్ విప్లవం

పారిస్ శ్రామికుడు ఫ్రెంచి రైతు కోసం పోరాడుతాడనీ, వెర్సేల్స్ అతనికి వ్యతిరేకంగా పోరాడుతుందనీ మనం చూశాం. పారిస్ ప్రభావం రైతాంగంమీద ఎక్కడ పడుతుందో, ముట్టడి సైతం ఆ ప్రభావం పడకుండా యికనెంత మాత్రమూ ఆపజాలదేమో నన్నదే "భూస్వాముల సభ"ను మిక్కిలి వేధించే అంశమన్న సంగతి కూడ మనం చూశాం. పారిస్‌పై వెర్సేల్స్ జరిపే యుద్ధం విషయంలో దాని మనసులోతుల్లో ఉన్నది రైతును తన కట్టుబానిసగా నిలుపుకోవాలన్న తపనా, యింతకు ముందులాగే యిక ముందు కూడా అతడిని తన వస్తువుగా, "taillable à merci et miséricorde"*గా వాడుకోవాలన్న ఆదుర్దాయేనన్న విషయం మనకు తెలుసు.

చరిత్రలో మొట్టమొదటి సారిగా పెటీబూర్జువాలూ, మధ్య తరహా బూర్జువా వాళ్ళూ బాహాటంగా కార్మిక విప్లవం చుట్టూ సమీకృతులయ్యారు, తమయొక్క, ఫ్రాన్సుయొక్క విముక్తికి అది మాత్రమే ఏకైక తరణోపాయమని ప్రకటించారు! కార్మికులతోబాటు పెద్దసంఖ్యలో వాళ్ళు నేషనల్ గార్డులో చేరారు, కమ్యూన్‌లో వాళ్ళసరసన కూర్చున్నారు, రిపబ్లికన్ యూనియనులో వాళ్ళ తరఫున మధ్యవర్తిత్వం నెరపారు!

కమ్యూన్ తీసుకున్న ప్రధాన చర్యలు, రుణదాత వర్గానికి వ్యతిరేకంగా పారిస్‌కి చెందిన రుణగ్రహీత వర్గమైన మధ్యతరగతి ముక్తికోసం తీసుకోబడ్డాయి! ఆ మధ్యతరగతే (1848) జూన్ తిరుగుబాటులో, పెట్టుబడిదారీవర్గంయొక్క, దాని జనరల్సుయొక్క, దాని ప్రభుత్వ భాగ్యోపజీవులయొక్క పతాకాలక్రింద, శ్రామికవర్గానికి వ్యతిరేకంగా సమీకృతమైంది. "Concordats á l'amiable"[70] తిరస్కృతితో వెన్వెంటనే 1848 సెప్టెంబరు 19నే అది శిక్షింపబడింది. జూన్ తిరుగుబాటుపై విజయం, రుణగ్రహీత అయిన మధ్యతరగతిపై రుణదాత అయిన సంపన్న పెట్టుబడిదారు విజయం అని వెన్వెంటనే తేలిపోయింది. తనకి బాకీ వున్న "సౌను శరీర మాంసమూ" చెల్లించాల్సిందేనని అది పట్టుపట్టింది.** 1849 జూన్ 13న ఆ మధ్యతరగతియొక్క నేషనల్ గార్డు బూర్జువావర్గ సైన్యంచేత నిరాయుధం చెయ్యబడి, ఊచకోతకొయ్య

---

* యిచ్ఛవచ్చిన రీతిగా మలుచుకోవడం. — సం.

** షేక్స్‌పియర్ నాటకం "వెనీస్ వర్తకుడు," రంగం IV, అంకం 1. — సం.

బడింది! సామ్రాజ్య కాలంలో ప్రభుత్వ వనరుల దివాళా (పర్యవసానంగా), (వీటినే సంపన్న పెట్టుబడిదారు మేస్తూవుంటాడు) యీ మధ్యతరగతి చట్టా వ్యాపారుల, రైల్వే యజమానులైన గుత్త పెట్టుబడిదారుల, Crédit Mobilier[41]కి చెందిన దగాకోరు అసోసియేషన్లు మొదలైన వాటి దోపిడీకి గురిచెయ్యబడింది. పెట్టుబడిదారీ అసోసియేషన్ (జాయింట్ స్టాక్ కంపెనీ) చేత అది దోచుకోబడింది. తన రాజకీయ హోదా దిగజారి, తన ఆర్థిక ప్రయోజనాలు దెబ్బతినడంతో, ఆ పాలనకు సంబంధించిన ఉన్మత్త విశృంఖల విలాసాలు మధ్యతరగతికి నైతికంగా వెగటు గొలిపాయి. యుద్ధానికి సంబంధించిన నికృష్ట వ్యవహారాలతో దిగ్భ్రాంతి చెందిన మధ్యతరగతిలో ఫ్రెంచి జాతీయ భావాలు పెల్లుబికాయి. ఆ యుద్ధంలో ఫ్రాన్సుకు వాటిల్లిన విపత్తులనూ, జాతీయ విచ్ఛిత్తి కారణంగా దానికి సంభవించిన సంక్షోభాన్నీ, దాని ఆర్థిక వినాశాన్నీ చూసిన ఈ మధ్యతరగతి, ఫ్రాన్సుయొక్క కాబోయే బానిస యజమానుల అవినీతికర వర్గం కాక, కార్మికవర్గంయొక్క సాహసిక ఆకాంక్షయూ, దాని భీమ బలమే తనను కాపాడ గలిగినవని గ్రహిస్తుంది!

కార్మికవర్గం మాత్రమే తమను మతబోధకుల పాలన నుండి విముక్తం చెయ్యగలదనీ, వర్గ పాలన పరికర స్థాయి నుండి విజ్ఞానశాస్త్రాన్ని ప్రజా శక్తిగా మార్చగలదనీ, వర్గ ప్రతికూలాభిప్రాయ వ్యాపనంలో సహాయకులు, పదవులకు ఎగబడే ప్రభుత్వ భాగ్యోప జీవులు, పెట్టుబడికి సహకారుల దశ నుండి శాస్త్రజ్ఞులను స్వతంత్ర భావ ప్రసారకు లుగా మార్చగలదనీ మధ్యతరగతి వాళ్ళు భావిస్తారు! విజ్ఞానశాస్త్రం శ్రమ రిపబ్లిక్‌లో మాత్రమే నికరమైన తన పాత్రను వహించగలదు.

## రిపబ్లిక్ బాహాటంగా గుర్తింపబడిన సాంఘిక రిపబ్లిక్‌గా మాత్రమే సాధ్యం

ప్రభుత్వ జెండార్మి, మతబోధకుల చేతుల్లో అసంఘటితమైన "సార్వత్రిక ఓటింగు హక్కు" పట్ల భ్రమను సామ్రాజ్యం ఎలా పారదోలిందో అలాగే "రిపబ్లిక్" పట్ల చిట్టచివరి భ్రమలను యీ అంతర్యుద్ధం పారదోలింది. రిపబ్లిక్ ఫ్రాన్సు, యూరప్‌లలో "సాంఘిక రిపబ్లిక్"గా మాత్రమే సాధ్యమనీ, అంటే, పెట్టుబడిదారీ, భూస్వామ్య వర్గానికి చెందిన రాజ్యయంత్రాన్ని విసర్జించి, దాని స్థానంలో "సాంఘిక విమోచన"ను రిపబ్లిక్ మహా లక్ష్యంగా బాహాటంగా ప్రకటించే కమ్యూన్‌ను నెలకొల్పి, కమ్యూనల్ నిర్మాణం ద్వారా ఆ సామాజిక పరివర్తనకు హామీ యిచ్చినప్పుడే అటువంటి రిపబ్లిక్

సాధ్యమనీ ఫ్రాన్సులోని జీవ శక్తులన్నీ అంగీకరిస్తాయి. తద్భిన్నంగా ఏ యితర రిపబ్లిక్కైనా సకల రాజరిక ముఠాల, లెజిటిమిస్టులు, ఆర్లియనిస్టులు, బోనపార్టిస్టుల ఉమ్మడి అనామక హింసాకాండ తప్ప మరేమీ కాదు. ఏదో ఒక రకమైన సామ్రాజ్యాన్ని దేశానికి తీసుకురావడమే దాని తుది గమ్యం. వర్గ పాలనకు సంబంధించిన అనామక హింసాకాండ, తన నికృష్ట కార్యక్రమాన్ని ముగించుకొన్న తర్వాత, సదా సామ్రాజ్యంగా బయటపడుతూ వుంటుంది!

"భూస్వాముల సభ"కి చెందిన వృత్తిపర రిపబ్లికన్లు – 1848–51 నాటి అనుభవం తర్వాత పైతం,[135] పారిస్‌కి వ్యతిరేకంగా అంతర్యుద్ధం తర్వాత పైతం – రిపబ్లికన్ తరహా వర్గ నిరంకుశత్వం సాధ్యమైన, చిరకాలం వుండే రూపమని నిజంగా నమ్మే వ్యక్తులు. "పార్టీ ఆఫ్ ఆర్డర్" తద్భిన్నంగా, రిపబ్లిక్‌తో పోరాడటానికి ఒక కుట రూపంగా మాత్రమే దాన్ని కోరుకుంటుంది. వర్గ నిరంకుశత్వ రూపంగా తనకి సరిపోయే ఏకైక రూపమైన రాజరికాన్నో, లేక సామ్రాజ్యాన్నో అది కోరుకుంటుంది. 1848లో, మోసానికి ఇచ్ఛికంగా తమను గురిచేసుకొన్న యీ వ్యక్తులు, జూన్ తిరుగుబాటు ద్వారా ఫ్రాన్సులో కాబోయే బానిస యజమానుల అన్ని ముఠాల అనామక పరిపాలనకు మార్గం సుగమం అయ్యేదాకా, ముందుకు నెట్టబడ్డారు. 1871లో, వెర్సేల్స్‌లో, అందుకు భిన్నంగా ఆది నుంచీ కూడా వాళ్లు వెనక్కి నెట్టబడ్డారు. అక్కడ త్యేర్ పాలనకు "రిపబ్లికన్" అలంకారంగా ఉండే పాత్ర వాళ్లకి కల్పించబడింది. పారిస్‌పై బోనపార్టిస్టు జనరల్సు యుద్ధానికి ఆమోదముద్ర సాధించడమే అక్కడ వాళ్ల హాజరు యొక్క పరమ ప్రయోజనం! ఈ దగుల్బాజీలు తమకు తెలియకుండానే ఆత్మావహేళన చేసుకొంటున్నట్లుగా తమ పార్టీ సమావేశాన్ని సల్ డె పోమ్ (టెన్నిస్ కోర్టు)లో జరుపుకొని, 1789 నాటి తమ ముందరివాళ్లతో పోల్చినప్పుడు తామెంతగా పతనమయ్యారో ప్రదర్శించుకున్నారు![77] తమ షెల్‌షేలు, మొదలైనవాళ్ల ద్వారా, త్యేర్‌కు, తన ఆయుధాలు అప్పగించేలా నయవంచన ద్వారా పారిస్‌చేత అంగీకరింపచేసేందుకూ, సెస్సే క్రింద గల "వ్యవస్థ"కు చెందిన నేషనల్ గార్డు ద్వారా బలిమిని దాన్ని నిరాయుధం చేసేందుకూ వాళ్లు ప్రయత్నించారు! లూయీ బ్లాంక్ వంటి పారిస్ సోషలిస్టు డిప్యూటీ లనబడే వాళ్లని గురించి మేమిక్కడ చెప్పడం లేదు. దుఫార్, "భూస్వాముల సభా" చేసే అవమానాలను వాళ్లు నమ్రంగా భరిస్తారు. త్యేర్‌యొక్క చట్టబద్ధ హక్కుల పట్ల ఉబ్బితబ్బిబ్బవుతారు. బందిపోటుదొంగల సమక్షంలో మొత్తుకుంటారు, తమకు తాము ఆత్రపలిష పులుముకుంటారు!

## కార్మికులూ, కోంట్

కార్మికులు సోషలిస్టు ఒంటెత్తు పోకడ దశను అధిగమించారంటే, కోంటిజం మార్గదర్శక బంధనాల్లో వాళ్లెన్నడూ లేరన్న సంగతిని మరచిపోరాదు. ఈ బృందం, ఇంటర్నేషనల్‌కి సుమారొక అరడజను మందిని సమకూర్చిన ఒక శాఖ తప్ప మరేమీ కాదు. దాని కార్యక్రమం జనరల్ కౌన్సిలుచేత నిరాకరింప బడింది.[136] పారిస్ కార్మికులకు కోంట్, రాజకీయాలలో సామ్రాజ్యవాద వ్యవస్థ (వ్యక్తి గత నియంతృత్వ) ప్రవక్తగా, అర్థశాస్త్రంలో పెట్టుబడిదారీ పాలన ప్రవక్తగా, అన్ని జీవిత రంగాల్లోనూ, చివరకు విజ్ఞానశాస్త్ర రంగంలో సైతం తరతమ భేదాల ప్రవక్తగా, పాతవాళ్ల స్థానంలో కొత్త పోపును, కొత్త సెయింట్లను ప్రవేశపెట్టే ప్రశ్నోత్తర రూపంలో ఓ కొత్త పుస్తకాన్ని రచించిన వాడుగా మాత్రమే తెలును.

ఇంగ్లండులోని అతని అనుచరులు ఫ్రాన్సులోని వారికంటె మరింత జనరంజక మైన పాత్ర వహించారంటే, అందుకు, వాళ్ల వ్యక్తిగత ధైర్య పరాక్రమాలే కారణంగాని, తమ ఒంటెత్తు సిద్ధాంతాల బోధన ద్వారా మాత్రం కాదు. తమ తోడ్పాటు లేకుండానే కార్మిక జనం సృష్టించిన వర్గ పోరాట రూపాలను, ఉదాహరణకు, ఇంగ్లండులో ట్రేడ్‌యూనియన్లను, సమ్మెలను, అన్నట్లు, తమ పారిస్ – సహగోత్రికులచేత పాషండ త్వంగా నిరసింపబడిన వాటిని, ఈ బృందం స్వీకరించడమే యిందుకు కారణం.

## కమ్యూన్ (సాంఘిక చర్యలు)

ప్రస్తుత విప్లవంలో పారిస్ కార్మికులు చొరవ తీసుకున్నారన్నా, వీరోచితమైన ఆత్మత్యాగంతో ఈ పోరాటపు ప్రధాన తాకిడిని భరిస్తున్నారన్నా, యిందులో కొత్త ఏమీ లేదు. ఫ్రెంచి విప్లవాలన్నింటిలోనూ కొట్టవచ్చినట్లు కనిపించే వాస్తవమే యిది! గతం పునరావృతం కావడమే యిది! జన సామాన్యం పేరున, ఖచ్చితంగా జన సామాన్యం కోసం, అంటే, ఉత్పత్తి చేసే ప్రజాసామాన్యం కోసం, విప్లవం చెయ్య బడటమన్నది, ఈ విప్లవానికి యింతకు పూర్వపు విప్లవాలన్నింటితో గల ఒక ఉమ్మడి సామ్యం. అయితే, యీ విప్లవానికి సంబంధించిన ఒక కొత్త లక్షణమేమిటంటే, తొలి తిరుగుబాటు తర్వాత, ప్రజలు తమను తాము నిరాయుధంచేసుకొని, పాలక వర్గాలకు చెందిన రిపబ్లికన్ బఫూన్ల చేతుల్లోకి తమ అధికారాన్ని అప్పగించలేదు. వాళ్ళ కమ్యూన్‌ను స్థాపించి, తమ విప్లవ ప్రత్యక్ష నిర్వాహకత్వాన్ని తమ సొంత చేతుల్లోకి

తీసుకున్నారు. దానితోబాటే, విజయం సిద్ధించేట్లయితే, పాలకవర్గాల రాజ్యయంత్రాంగాన్నీ, ప్రభుత్వ యంత్రాంగాన్నీ ప్రక్కకు నెట్టి దాని స్థానంలో తమ సొంత ప్రభుత్వ యంత్రాంగాన్ని నెలకొల్పడం ద్వారా, విప్లవ నిర్వాహకత్వాన్ని ప్రజల చేతుల్లోనే ఉంచే సాధనాన్ని కనుగొన్నారు. ఇదే వాళ్ళు చేసిన చెప్పరాని నేరం! ప్రభుత్వ నిర్వహణ విష యంలో పై 10,000 మందికీ ఉంటూ వచ్చిన ప్రత్యేక హక్కును కార్మిక జనం అతిక్రమించి, ఏ వర్గ నిరంకుశత్వమైతే సమాజంయొక్క సంఘటిత రాజ్య శక్తిని తన కోసమే వినియోగించుకొన్నదో, ఆ వర్గ నిరంకుశత్వపు ఆర్థిక పునాదిని విచ్ఛిన్నం చేస్తామన్న తమ దృఢసంకల్పాన్ని ప్రకటించడమే వాళ్ళు చేసిన ఘోర నేరం! అమెరికా లోని, అలాగే యూరప్‌లోని ఘనతవహించిన తరగతులవారు మూర్ఛ పెట్టులొచ్చిన వాళ్లలా మెలి దిరిగి పోయారన్నా, యిదేదో మహా పవిత్రమైనదాన్ని దూషించడ మన్నట్లు అసహ్యత ప్రకటిస్తూ పెడబొబ్బలు పెట్టారన్నా, ప్రజలను హతమార్చా ల్సిందిగా క్రూరమైన విజ్ఞప్తులు చేశారన్నా, తమ పార్లమెంటరీ వేదికల మీదనుంచీ, తమ జర్నలిస్టు భృత్యుల కూడళ్ల నుంచీ బజారు తిట్లు తిట్టిపోసి, అభాండాలు కురిపించారన్నా, వాళ్లనిందుకు పురికొల్పినది యిదే!

కనివిని ఎరగని క్లిష్ట పరిస్థితుల్లో తన సొంత అస్తిత్వాన్ని నిలుపుకోవడం, కృషిచెయ్యడమే కమ్యూన్ చేసిన పనుల్లోకెల్ల మిక్కిలి గొప్పది! పారిస్ కమ్యూన్ ఎగరేసిన ఎర్ర జెండా, నిజానికి, పారిస్ కార్మిక ప్రభుత్వానికే కలికితురాయి! శ్రమ విమోచనమూ, సమాజ పరివర్తనమూ తమ గమ్యమని వాళ్ళు స్పష్టంగా, చైతన్యంతో ప్రకటించారు! అయితే, కార్మికులు పారిస్ కమ్యూన్‌ని పాలిస్తారన్న దానిలోనే వాళ్ల రిపబ్లిక్‌కి సంబంధించిన వాస్తవ "సాంఘిక" స్వభావం యిమిడి వుంది! వాళ్ళు తీసుకున్న చర్యలకు సంబంధించినంతవరకు, ఉన్న పరిస్థితులను బట్టి, పారిస్‌యొక్క సైనిక రక్షణకీ, దాని సప్లయ్‌లకే ప్రధానంగా అవి పరిమితం కావాల్సి వుంది!

కార్మికవర్గంయొక్క కొందరు సంరక్షక మిత్రులు, తాము "సోషలిస్టు" చర్యలుగా పరిగణించే కొద్దిపాటి చర్యల పట్ల సైతం, వాటి ధోరణి మినహాయిస్తే సోషలిస్టుది అంటూ వాటిలో ఏమీ లేకపోయినా తమ అసహ్యాన్ని బొత్తిగా కప్పిపుచ్చుకోకుండా, తమ సంతృప్తిని ప్రకటిస్తారు. కార్మికులు వివేకం కలిగిన వాళ్లు, వాళ్ళు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా చొరవతో కూడిన సోషలిస్టు చర్యలను గట్టిగా తిరస్కరిస్తారు లెమ్మన్న తమ గొప్ప ఆవిష్కరణ ద్వారా పారిస్ కమ్యూన్ పట్ల నాగరికుల సానుభూతు లను సంపాదించ ప్రయత్నిస్తారు! వాళ్ళు పారిస్‌లో స్థాపించ దలుచుకున్నది నిజానికి ఫలాన్‌స్టీర్ గాని, ఇకేరియా[137] గాని కాదు. తమ తరానికి వివేకశీలురు, ఉదారవంతు

లైన యీ పోషకులు, కార్మికవర్గపు వాస్తవ ఆకాంక్షలూ, వాస్తవ ఉద్యమమూ బొత్తిగా తెలియని వీళ్ళు, ఒక విషయం మరచిపోతూ వుంటారు. సోషలిస్టు బృందాల సంస్థాపకులందరూ కూడా, కార్మికవర్గమే యింకా తగినంతగా శిక్షణ పొందని కాలానికి, పెట్టుబడిదారీ సమాజ పురోగమనం ద్వారా సంఘటితమై ప్రపంచ రంగంపైకి చారిత్రక శక్తిగా యింకా ప్రవేశించని కాలానికి, లేక పాత ప్రపంచంలోనే దాని విముక్తికి అవసరమైన భౌతిక పరిస్థితులింకా తగినంతగా పరిణతంకాని దశకి, చెందుతారు. దాని దైన్యమైతే ఉంది కాని, దాని సొంత ఉద్యమానికి అవసరమైన పరిస్థితులు అప్పటికింకా లేవు. ఊహాజనిత సోషలిస్టు బృందాల సంస్థాపకులు, ప్రస్తుత సమాజానికి సంబంధించిన తమ విమర్శలో సాంఘిక ఉద్యమ గమ్యమైన, వర్గపాలనకు సంబంధించిన ఆర్థిక పరిస్థితులన్నింటితోబాటు, వేతన వ్యవస్థ రద్దును గురించి స్పష్టంగా వర్ణించారే గాని, సమాజంలోనే వున్న సమాజ పరివర్తనకు సంబంధించిన భౌతిక పరిస్థితులను గాని, కార్మికవర్గంలో సంఘటిత శక్తినిగాని, ఉద్యమ ఆత్మను గాని సందర్శించలేకపోయారు. ఉద్యమానికి సంబంధించిన చారిత్రక పరిస్థితుల స్థానాన్ని నూతన సమాజానికి సంబంధించిన విద్యూరమైన కల్పిత చిత్రాలతో, పథకాలతో భర్తీచేసేందుకు వాళ్ళు ప్రయత్నించారు. వాటి ప్రచారంలోనే నిజమైన ముక్తి సాధన ఉందనుకున్నారు. కార్మికవర్గ ఉద్యమం వాస్తవ రూపం దాల్చిన క్షణం నుంచీ, విద్యూరమైన ఊహాకల్పిత స్వర్గాలన్నీ మాయమయ్యాయి — అయితే, యీ ఊహాజనిత స్వర్గ పథకాలు లక్షించిన గమ్యాన్ని కార్మికవర్గం విడిచిపెట్టడం యిందుకు కారణం కాదు, వాటి సాధనకు అది నిజమైన సాధనాలను కనుగొనడమే యిందుకు కారణం — వాటి స్థానంలో ఉద్యమానికి సంబంధించిన చారిత్రక పరిస్థితులకూ, నానాటికీ బలాన్ని సంతరించుకొంటున్న కార్మికవర్గ సమరశీల నిర్మాణానికీ సంబంధించిన నిజమైన ప్రగాఢమైన అవగాహన ఏర్పడింది. అయితే, ఊహాజనిత సోషలిస్టులు ప్రకటించిన ఉద్యమ తుది లక్ష్యాలు రెండూ పారిస్ విప్లవమూ, ఇంటర్నేషనలూ ప్రకటించిన చివరి రెండు లక్ష్యాలూ ఒక్కటే, సాధనాలు మాత్రమే భిన్నం. ఉద్యమానికి సంబంధించిన వాస్తవ పరిస్థితులు యిప్పుడిక ఎంతమాత్రమూ ఊహాజనితమైన కట్టుకథలచేత ఆవరింపబడి లేవు. శ్రామికవర్గంయొక్క యీ పోషక మిత్రులు ఈ విప్లవానికి సంబంధించి బాహాటంగా ప్రకటింపబడిన సోషలిస్టు ధోరణులను మరుగుపరచడంలో తమ మౌఢ్యాన్ని తామే బయటపెట్టుకున్నారు. కార్మికోద్యమ ప్రవక్తల ఊహాజనిత స్వర్గాలింకా "సాంఘిక విప్లవ"మే అయితే, అంటే, సాంఘిక విప్లవమన్నది వాళ్ళకింకా "ఊహాజనితమే" అయితే, అది పారిస్ శ్రామికవర్గం పొరపాటు కాదు.

మార్చి 20వ తేదీ, కేంద్ర కమిటీయొక్క "Journal Officiel":

> 'పారిస్ శ్రామికులు, ప్రభుత్వ (పాలక) వర్గాల defa l ances* విద్రోహాలను చూసి, సామాజిక వ్యవహారాల (రాజ్య వ్యవహారాల) నిర్దేశకత్వాన్ని (యాజమాన్యాన్ని) తమ చేతుల్లోకి తీసుకొని, పరిస్థితిని కాపాడాల్సిన క్షణం ఆసన్నమైందని గ్రహించారు."

"ఫ్రాన్సుయొక్క దురదృష్టాలన్నింటికీ" మూలం, "బూర్జువావర్గపు రాజకీయ అసామర్థ్యమూ నైతిక శైథిల్యమే" అని ఖండిస్తారు.

> "అన్నింటినీ ఉత్పత్తి చేసి, దేన్నీ అనుభవించని శ్రమజీవులు, తాము చెమటోడ్చి, కష్టించి గుట్టలుగా పేర్చిన తమ ఉత్పత్తుల మధ్య, శ్రమ ఫలితాల మధ్య దైన్యంతో బాధపడే శ్రమజీవులు.... స్వీయ విమోచనకోసం పనిచేసేందుకు వారికెన్నడూ నమ్మతే లభించదా?... శ్రామికవర్గం, తన హక్కులకు వ్యతిరేకంగా శాశ్వతమైన ముప్పు దృష్ట్యా, న్యాయబద్ధమైన తన ఆకాంక్షలన్నింటి పూర్తి తిరస్కృతి దృష్ట్యా, దేశంయొక్క, దాని అన్ని ఆశలయొక్క వినాశం దృష్ట్యా, తన సొంత భవితవ్యాలను తన చేతుల్లోకే తీసుకోవడం, రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకోవడం (en s'emparant du pouvoir)లో విజయాన్ని దృఢపరచుకోవడం తన తక్షణ విధియనీ, తిరుగులేని తన హక్కనీ అర్థం చేసుకుంది."


మొట్టమొదటి సంగతి, పాలకవర్గాలు దానిపైకి తెచ్చిపెట్టిన వినాశం నుండీ, అవినీతి నుండీ ఫ్రాన్సును కాపాడటానికి కార్మికవర్గ ప్రభుత్వం అవసరమనీ, ఈ పాలక వర్గాలను (ఫ్రాన్సును పాలించే సామర్థ్యాన్ని కోల్పోయిన ఈ వర్గాలను) పదవీభ్రష్టం చెయ్యడం జాతీయ భద్రతకు ఆవశ్యకమనీ యిక్కడ స్పష్టంగా పేర్కొనబడింది.

కార్మికవర్గ ప్రభుత్వం తన సొంత విముక్తికోసం కృషిచెయ్యడం ద్వారా మాత్రమే ఫ్రాన్సుని కాపాడి, జాతీయ వ్యవహారం నిర్వహించగలదనీ, కార్మికవర్గ విముక్తి షరతులే ఫ్రాన్సు పునరుజ్జీవన షరతులనీ కూడా స్పష్టంగానే వివరింపబడింది.

శ్రమసాధనాల సొంతదారులపైనా, పెట్టుబడిపైనా శ్రమ యుద్ధంగా అది ప్రకటింపబడింది.

---

* వైఫల్యాలు. — సం.



నగర పాలకకార్యాలయంలో పారిస్ కమ్యూన్ సమావేశం

బూర్జువావర్గపు జాతీయ దురహంకారం కేవలం ఒక భేషజం మాత్రమే, దాని కపట నటనలన్నింటికీ జాతీయతా ముసుగు నివ్వడం మాత్రమే. స్థాయీ సైన్యాల ద్వారా అంతర్జాతీయ పోరాటాలను కొనసాగింప చెయ్యడానికీ, ప్రతి ఒక్క దేశంలోని ఉత్పత్తిదారులనూ ప్రతి యితర దేశంలోని వారి సోదరులపైనా ఉసికొల్పడం ద్వారా వారిని అణచివేయడానికీ, కార్మికవర్గ విముక్తికి మొదటి షరతైన కార్మికవర్గ అంతర్జాతీయ సహకారాన్ని నిరోధించడానికీ జాతీయ దురహంకారం ఒక సాధనం. జాతీయ దురహంకార (చాల కాలంగా యిది కేవలం ఒక ఉత్తపదంగా తయారైంది) నిజ స్వభావం సెడాన్ పరాజయం తరువాత ఆత్మరక్షణ యుద్ధక్రమంలో బయటపడింది, ప్రతి చోటా కూడా జాతీయ దురహంకారపూరిత బూర్జువావర్గంచేతనే ఆత్మరక్షణ యుద్ధం స్తంభింప చెయ్యబడింది. ఫ్రాన్సు లొంగుబాటులోనూ, జాతీయ దురహంకార పీఠాధిపతి థ్యేర్ క్రింద, బిస్మార్కు సమ్మతితో సాగిన అంతర్యుద్ధంలోనూ అది బయట పడింది! జర్మన్ వ్యతిరేక లీగ్‌యొక్క అల్పమైన పోలీసు కుట్రలోను, లొంగుబాటు అనంతరం పారిస్‌లో విదేశీయుల వేటలోను అది బయటపడింది. పారిస్ ప్రజలనూ (యావత్తు ఫ్రాన్సు ప్రజలనూ) జాతీయ ద్వేష భావోద్వేగ విమూఢులుగా చెయ్యడం, విదేశీయులపై దారుణ దుర్మార్గాలు జరపడం ద్వారా తమ నిజ ఆకాంక్షలనూ, స్వదేశీద్రోహంనూ మరచిపోయేలా చెయ్యడం సాధ్యమని భావింపబడింది!

విప్లవ పారిస్ ఊర్పు తాకిడికి యీ కృత్రిమ ఉద్యమం ప్రచండ ప్రభంజనం ముందు దూదిపింజలా అదృశ్యమైంది (చెదరగొట్టబడింది)! విప్లవ పారిస్ తన అంతర్జాతీయతా వైఖరులను విస్పష్టంగా ప్రకటించింది: ఉత్పత్తిదారు ఏ జాతికి చెందినవాడైనా (ఏ జాతీయ దుస్తుల్లో వున్నా), అతని లక్ష్యం అన్ని చోట్లా ఒక్కటే, అతని శత్రువు అన్ని చోట్లా ఒక్కడే కనక, కమ్యూన్‌లోకి విదేశీయులను చేర్చుకోవడాన్ని అదొక మాత్రంగా ప్రకటించింది, అది ఒక విదేశీ కార్మికుని* (ఇంటర్నేషనల్ సభ్యుడిని) తన కార్యవర్గానికి ఎన్నుకొంది, ఫ్రెంచి జాతీయ దురహంకారానికి చిహ్నమైన వెండొమ్ స్తంభాన్ని ధ్వంసం చెయ్యాలని అది ఆజ్ఞ జారీచేసింది!

బూర్జువా జాతీయ దురహంకారులు ఫ్రాన్సును విచ్ఛిన్నంచేసి, విదేశీ ఆక్రమణదారు నియంతృత్వం క్రింద పనిచెయ్యగా, పారిస్ కార్మికులు తమ సొంత వర్గ పాలకులపై దెబ్బతియ్యడం ద్వారా విదేశీ శత్రువుపై దెబ్బతీశారు, సరిహద్దులను రద్దుచేసి, అన్ని జాతుల కార్మికుల అగ్రగామిదళ స్థానాన్ని ఆక్రమించుకున్నారు!

బూర్జువావర్గపు అసలైన దేశభక్తి — అన్ని రకాల "జాతీయ" ఆస్తి యజమా

---

* లెయో ఫ్రాంకెల్. — సం.

నులకు ఎంతో సహజమైన దేశభక్తి — దాని ఆర్థిక, వాణిజ్య, పారిశ్రామిక కార్యకలాపాలపై అంతర్జాతీయ స్వభావం ముద్రితం కావడంతో కేవలం నటనగా దిగజారింది. అదే మాదిరి పరిస్థితుల్లో, ఫ్రాన్సులోలాగే అది దేశాలన్నింటిలోనూ బయటపడివుండేది.

## "భూస్వాముల సభ" వికేంద్రీకరణ ఆకాంక్షలూ, కమ్యూనూ

పారిసూ, దానితోబాటే తదితర ఫ్రెంచి పట్టణాలూ రైతుల పాలనచేత అణచివెయ్యబడుతున్నాయనీ, పోతే, దాని ప్రస్తుత పోరాటం రైతుల పాలన నుంచి విముక్తి కోసమేననీ అంటూ ఉన్నారు! ఇంతకు మించిన మూర్ఖపు అబద్ధం మరెన్నడూ విని ఉండం!

కేంద్రీకృత ప్రభుత్వ యంత్రాంగానికి కేంద్ర పీఠమైన పారిస్ రైతాంగాన్ని, జెండార్మ్, పన్నులు వసూలుచేసేవాళ్ళ, ప్రిఫెక్టు, మతబోధకుడు, గ్రామీణ ప్రభువుల పాలనకు, అంటే, దాని శత్రువు నిరంకుశత్వానికి గురిచేసి, దాన్ని ప్రాణహీనం చేసింది (దాని ప్రాణాన్ని తీసింది). గ్రామీణ జిల్లాల్లోని స్వేచ్ఛా జీవితాంగాలన్నింటినీ అది అణచివేసింది. మరొక వంక పారిస్ కేంద్రంగా కేంద్రీకృతమైన రాజ్యాంగయంత్రంచేత ఎవరి చేతుల్లోకైతే రాష్ట్రాల యావత్తు పలుకుబడీ పెట్టబడిందో, ఆ ప్రభుత్వమూ, గ్రామీణ ప్రభువూ, జెండార్మ్, మతబోధకుడూ, తమ యీ పలుకుబడిని ప్రభుత్వానికీ, ఆ ప్రభుత్వం ఏ వర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తుందో ఆ వర్గాలకే అనుకూలంగా వినియోగించారు; ప్రభుత్వం, పరాన్నభుక్కు, పెట్టుబడిదారు, సోమరిపోతు, దేశీ, విదేశీ కలగాపులగాలకు చెందిన పారిస్‌కి వ్యతిరేకంగా కాకుండా, శ్రమజీవుల, మేధావుల పారిస్‌కి వ్యతిరేకంగా వినియోగించారు. ఈవిధంగా, పారిస్ స్థావరంగా ప్రభుత్వ కేంద్రీకరణచేత, ప్రభుత్వానికీ, పెట్టుబడిదారులకీ చెందిన పారిస్‌చేత రైతులు అణచబడ్డారు, రైతుల శత్రువుల చేతులకు అప్పగించబడిన రాష్ట్రీయాధికారంచేత శ్రమజీవుల పారిస్ అణచబడింది.

వెర్సేల్స్ "Moniteur"[131] (మార్చి 29) యిలా ప్రకటించింది:

"<u>రాజధాని</u> కాబట్టి, పారిస్ <u>స్వేచ్ఛా నగరం</u> కాజాలదు."

ఇది వివరమైన సత్యం. పాలకవర్గాల, వాటి ప్రభుత్వ రాజధాని అయిన పారిస్ "స్వేచ్ఛా నగరం" కాజాలదు, పోతే, అటువంటి పారిస్ రాజధాని కాబట్టి, రాష్ట్రాలు

"స్వేచ్ఛ"గా ఉండజాలవు. పారిస్‌లో కమ్యూన్ ఉన్నప్పుడు మాత్రమే రాష్ట్రాలు స్వేచ్ఛగా ఉండగలవు. పారిస్, తన నుండీ, తన ప్రభుత్వం నుండీ తన విమోచనాన్ని ప్రకటించు కున్నందుకుకంటె, అలా చెయ్యడం ద్వారా అది, తన పెత్తనం నుండీ విముక్తం కమ్మని రైతుకీ, రాష్ట్రాలకీ ప్రమాదకరసూచన చెయ్యడమే పార్టీ ఆఫ్ ఆర్డర్‌కి మరింత ఎక్కువ క్రోధకారణమైంది.

కమ్యూన్‌కి చెందిన "Journal Officiel" ఏప్రిల్ 1:

> "మార్చి 18 నాటికి విప్లవానికి గల ఏకైక లక్ష్యం, పారిస్‌కి కమ్యూన్ ప్రాతినిధ్య ఎన్నికను సాధించడమొక్కటే కాదు, గట్టిగా కేంద్రీకృతమైన ఒక జాతీయ ప్రభుత్వ నిరంకుశ సంరక్షకత్వం క్రింద దాన్ని సాధించాలి, స్వాధీనం చేసుకోవాలి. ఫ్రాన్సుయొక్క కమ్యూన్లన్నింటికీ, వాటితోబాటు, తమలో తాము, నిజమైన ఒక జాతీయ ఒడంబడికచేత, తమ ఉమ్మడి ప్రయోజనం కోసం ఐక్యమైన అన్ని పెద్ద గ్రూపులకూ, జిల్లాలకూ (డిపార్టుమెంట్లు), రాష్ట్రాలకూ స్వేచ్ఛను సాధించాలి, స్వాధీనం చేసుకోవాలి. రిపబ్లిక్ అస్తిత్వానికి హామీ కల్పించి, దాన్ని కొనసాగించడం — ఇవి కూడా ఆ విప్లవ లక్ష్యాలు... పారిస్, తన పైపై సర్వశక్తిమత్వాన్ని పరిత్యజించింది, సర్వశక్తిమత్వానికి హక్కును కోల్పోవడంతో యిది సమానం. అయితే, ఏ నైతిక శక్తి, మేధోపరమైన పలుకుబడి ప్రభావాలైతే, ఫ్రాన్సులోనూ, యూరపులోనూ అది చేసే ప్రచారంలో దానికి తరచుగా విజయాన్ని సమకూర్చాయో వాటినది పరిత్యజించలేదు."
>
> "ఇప్పుడు కూడా పారిస్, యావత్తు ఫ్రాన్సు కోసమూ కృషిచేస్తుంది, కష్టాలు భరిస్తుంది, అందుకది తన పోరాటాల ద్వారా, త్యాగాల ద్వారా ఫ్రాన్సు మేధో, నైతిక, పరిపాలన, ఆర్థిక పునరుజ్జీవనాన్ని, కీర్తి సౌభాగ్యాలను సాధించడానికి సన్నద్ధమవుతుంది" (బెలాన్ ద్వారా పంపబడిన పారిస్ కమ్యూన్ కార్యక్రమం).[138]

థ్యేర్, రాష్ట్రాలగుండా తను చేసిన పర్యటనలో ఎన్నికలను, అన్నిటికన్న ముఖ్యంగా వివిధ ప్రదేశాల్లో తన సొంత ఎన్నికలను నడిపించాడు. అయితే, ఒక యిబ్బంది వుంది. రాష్ట్రీయ బోనపార్టిస్టులు ప్రస్తుతానికి అసాధ్యులుగా తయారయ్యారు. (పైగా, అతనూ వాళ్ళ కావాలని కోరుకోలేదు, వాళ్ళూ అతను కావాలని కోరుకోలేదు.) పాత ఆర్లియనిస్టు అనుభవశాలురు పలువురు బోనపార్టిస్టు గుంపులో కలిసిపోయారు.

అందుకని, రాజకీయాల నుండి పూర్తిగా దూరంగా పల్లెప్రాంతాల్లో ఉండిపోయిన లెజిటిమిస్టు భూస్వాములకు విజ్ఞప్తి చెయ్యడం అవసరమైంది. జనాన్ని మోసగించ డానికి సరిగా తగిన వ్యక్తులు వీళ్లే. వెర్సేల్స్ అసెంబ్లీకి పైపై మెరుగుమా, 18వ లూయీ "chambre introuvable" స్వభావాన్నీ, దాని "భూస్వామ్య" స్వభా వాన్నీ కలిగించినది వీళ్లే. తమ గర్వాతిశయంకొద్దీ, 1814, 1815లలో[139] వచ్చి నట్లే, రెండవ బోనపార్టిస్టు సామ్రాజ్య పతనంతో, విదేశీ దాడి మాటున చివరకు తమకు అనువైన కాలం వచ్చిందని వాళ్లు నమ్మారు. వాళ్లది కేవలం పిచ్చి భ్రమ మాత్రమే. వాళ్లు పనిచేసినంతవరకు, "పార్టీ ఆఫ్ ఆర్డర్"కి చెందిన శక్తులుగా మాత్రమే, 1848–51లో లాగ, దాని "అనామక" హింసాకాండ పరికరాలుగా మాత్రమే పనిచెయ్యగలుగుతారు. వాళ్ల సొంత పార్టీ ప్రవచనాలు ఆ సంఘానికి హాస్యాస్పద స్వభా వాన్ని కల్పించాయి. వాళ్లు అందుకనే, జైల్లో డచెస్ డి బ్యెరీకి – మగమంత్రసానిగా పని చేసినవానిని తమ ప్రెసిడెంటుగాను, రక్షణ ప్రభుత్వానికి చెందిన కుహనా రిపబ్లి కన్లను తమ మంత్రులుగాను భరించాల్సి వచ్చింది. వాళ్ల పనులు పూర్తికాగానే, వాళ్లు ప్రక్కకి నెట్టివెయ్యబడతారు. కాని, చరిత్ర విపరీత చెయ్యమేమిటంటే, పరిస్థితుల యీ విద్యూర సమ్మేళనంవల్ల, "République une et indivisible"*కి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసిన కారణంగా, వాళ్లు పారిస్‌పై దాడి చెయ్యాల్సిన పరిస్థితిలో పడ్డారు. (యూయీ బ్లాంక్ యిలా అంటే, త్యేర్ దీన్ని ఫ్రాన్సు ఐక్యత అంటాడు.) అసెంబ్లీని రాష్ట్రీయ పట్టణంలో ప్రతిష్ఠించాలని కోరడం ద్వారా పారిస్ "శిరచ్ఛేదం చేస్తాననీ, దాని రాజధాని హోదాను తొలగిస్తాననీ" ప్రకటించడం ద్వారా ఐక్యతకు వ్యతిరేకంగా ప్రవర్తించడమే వాళ్లు చేసిన తొట్టతొలి ఘనకార్యం. వాళ్లు నిజంగా కోరుకునేది ఏమిటంటే, కేంద్రీకృత రాజ్యయంత్రాంగానికి ముందున్న స్థితికి తిరిగివెళ్లడం, కొంచెం యించుమించుగా తమ ప్రిఫెక్టుల నుండి, తమ మంత్రుల నుండి స్వతంత్రులు కావడం, దాని స్థానంలో రాష్ట్ర, స్థానిక భూస్వాముల ప్రాభవాన్ని నెలకొల్పడమూను. వాళ్లు కోరుకునేది ఫ్రాన్సుయొక్క అభివృద్ధి నిరోధక వికేంద్రీకరణ. ఏ కేంద్రీకరణ అయితే ఫ్యూడల్ వ్యవస్థకు వ్యతిరేకంగా తన పని పూర్తి చేసిందో, కాని, జెండార్మ్‌లపైనా, ఎర్ర, నల్ల సేనలపైనా ఆధారపడే కేవలం ఒక కృతకమైన వ్యవస్థయొక్క ఐక్యతగా తయారైందో, నిజమైన సమాజపు జీవితాన్ని అణచివేస్తూ, దానిపైన ఒక పీడకలలాగ తయారై, రాష్ట్రాల నుండి పారిస్‌ను వేరుచేసి, దాని చుట్టూ ఒక అగడ్తను సృష్టించడం ద్వారా దానికి "పైపై సర్వశక్తిమత్వాన్నిస్తూ"

---

* ఏకైక అభేద్య రిపబ్లిక్. – సం.

వుందో ఆ కేంద్రీకరణను రద్దుచేసి, ఫ్రెంచి సమాజానికి వెలిగా వుండే ఈ ఏకీకృత ఫ్రాన్సు స్థానంలో కమ్యూన్ నిర్మాణం ద్వారా ఫ్రెంచి సమాజ రాజకీయ ఏకీకరణ నెలకొల్పడమే, పారిస్ కోరుకుంటున్నది.

అందుకని, ఫ్రాన్సు ఐక్యతా విచ్ఛిత్తిని కోరుకొనే వాస్తవ కక్షిదారులు 'భూస్వాముల సభ" ప్రతినిధులే, సమైక్య రాజ్యయంత్రం తమ సొంత స్థానిక ప్రాధాన్యంపై (జమీందారీ హక్కులపై) ఐక్యం చేసుకొనే మేరకు, ఫ్యూడలిజానికి అది ప్రత్యర్థి అయిన మేరకు, వాళ్ళు సమైక్య రాజ్యయంత్రాన్ని వ్యతిరేకిస్తారు.

ఫ్రాన్సుయొక్క వాస్తవ సజీవ ఐక్యతకు ప్రత్యర్థి అయిన మేరకు, కేవలం వర్గ పాలనకు సాధనం మాత్రమే అయిన మేరకు కృత్రిమమైన ఆ ఏకీకృత వ్యవస్థను విచ్ఛిన్నం చెయ్యాలనే పారిస్ కోరుకుంటోంది.

## కోంట్ దృక్పథం

ప్రస్తుత ఆర్థిక వ్యవస్థను గురించి పూర్తిగా అజ్ఞానంలో ఉన్నవాళ్ళు, ఆ వ్యవస్థను కార్మికులు వాస్తీకరిస్తారన్న సంగతిని అసలే గ్రహించలేరు. కార్మికవర్గం లక్షిస్తున్న సాంఘిక పరివర్తనం ప్రస్తుత వ్యవస్థ అవసర, చారిత్రక అనివార్య ఆవిర్భావమేనన్న సంగతిని వాళ్ళు గ్రహించలేరు. 'ఆస్తి" రద్దు ప్రమాద సూచనను గురించి వాళ్ళు బేల స్వరంలో మొరపెడతారు. ఎందుకంటే, వాళ్ల దృష్టిలో, — చారిత్రకంగా ఒకానొక తాత్కాలిక ఆస్తి రూపమే — తమ ప్రస్తుత వర్గ ఆస్తిస్వామ్య రూపమే — ఆస్తి. అందుకని, వాళ్ల దృష్టిలో ఆ ఆస్తి రూపాన్ని రద్దుచెయ్యడమంటే ఆస్తినే రద్దు చెయ్యడం. వాళ్లిప్పుడు పెట్టుబడిదారీ పాలనయొక్క, వేతన వ్యవస్థయొక్క "శాశ్వతత్వాన్ని" బలపరుస్తున్నట్లే, ఫ్యూడల్ వ్యవస్థ కాలంలో గాని, బానిసత్వ కాలంలో గాని వాళ్లు ఉండివుంటే వాళ్ళు ఫ్యూడల్ వ్యవస్థనూ, బానిస వ్యవస్థనూ కూడా సహజ సంస్థాపితాలైనవనీ, ప్రకృతి నుండే పుట్టుకొచ్చినవనీ వాదించి యుండేవాళ్ళు. వాటి "ఉల్లంఘనలకు" వ్యతిరేకంగా భీకరమైన ప్రసంగాలు చేసేవాళ్లు అదే సమయంలో, తమ అజ్ఞానాతిశయ శిఖరం నుంచి, వాటి రద్దుకు సంబంధించిన దోషాలకు, వాటి "శాశ్వతత్వానికి" సంబంధించిన 'నైతిక పరిమితుల" ('నిర్బంధాల") చేత సరిదిద్దబడటమన్న తమ పిడివాదంతో జవాబిచ్చి ఉండేవాళ్ళు

కమ్యూన్ కోరుకునేది ప్రష్యన్ మునిసిపల్ వ్యవస్థ అన్నప్పుడు బిస్మార్కు ఎంత రైటో, పారిస్ కార్మికవర్గపు ఆశయాలకు సంబంధించిన తమ అంచనాల్లో వీళ్లూ అంతే రైటు.

దౌర్భాగ్యులు! ఆస్తికి సంబంధించిన ప్రతి సామాజిక రూపానికీ తన సొంత "నీతులు" ఉంటాయన్న సంగతీ, ఆస్తిని శ్రమకు చెందినదిగా పరిగణించే సామాజిక ఆస్తి రూపం, వైయక్తిక "నైతిక నిర్బంధాల"ను సృష్టించేందుకు బదులుగా, వ్యక్తియొక్క "నీతులను" దాని వర్గ పరిమితులనుంచి విముక్తం చేస్తుందన్న సంగతీ కూడా వీళ్లెరగరు.

---

ప్రజా విప్లవపుటూర్పు పారిస్ నెంతగా మార్చింది! ఫిబ్రవరి విప్లవం నైతిక విలువల తృణీకార విప్లవమని పిలవబడింది! "À bas les grands voleurs! À bas les assassins!"* అనే ప్రజల నినాదాలతో పారిస్ కదిలిపోయింది. ప్రజల భావావేశం యిలా వుంది. అయితే బూర్జువావర్గానికి సంబంధించినంతవరకు, అవినీతికిగాను దానికి మరింత విస్తృతమైన పెత్తనం కావాలి! దాని కది లూయీ బోనపార్ట్ (వామనమూర్తి నెపోలియన్) పాలనలో లభించింది. మహా నగరమైన పారిస్, చారిత్రక గౌరవ కలిగిన పారిస్, ప్రపంచపు సోమరిపోతులు, దగాకోరులందరి Maison dorée**గా, అంతర్జాతీయ వేశ్యా వాటికగా మార్చబడింది! "ఉత్తమ శ్రేణి వాళ్ల" నిష్క్రమణానంతరం, వీరోచితము, ఆత్మత్యాగ పూరితము, తను సాధించాల్సిన బృహత్తర కర్తవ్య పాలనోత్సాహపూరితమైన కార్మికవర్గపు పారిస్ తిరిగి అవతరించింది! శవపరీక్షా కేంద్రాల వద్ద ఒక్క శవం కూడా కనపడటం లేదు. వీధుల్లో భద్రతా లోపం లేదు. పారిస్ లోపల యింతకు ముందెన్నడూ యింతకన్న ఎక్కువ ప్రశాంతంగా లేదు. వేశ్యలకు బదులు పారిస్ వీరవనితలు దర్శనమిస్తున్నారు! పౌరుషం కలిగిన, సుదృఢమైన, పోరాడే, పనిచేసే ఆలోచించేవారి పారిస్! ఉదారమైన పారిస్! తన శత్రువుల నరమాంసభక్షక స్వభావం దృష్ట్యా, తన ఖైదీలను ప్రమాద రహితులను మాత్రమే చేసింది పారిస్! పారిస్ యికనెంత మాత్రమూ సహించజాలనిది వేశ్యలు, షోకిల్లాలనే. ఈ మహా నగరాన్ని తన స్వంతానికి వినియోగించుకోవేందుకై, కైవసం చేసుకున్న ఈ పనికిమాలిన, సంశయాత్మక, స్వార్థపరమైన జాతినే తరిమెయ్యాలనీ, లేక మార్చాలనీ అది గట్టినిశ్చయం చేసుకుంది. సామ్రాజ్యానికి చెందిన ఏ ప్రసిద్ధ వ్యక్తికీ, "పారిస్‌లోని మంచి ప్రాంతాల్లో చాలా మనోజ్ఞంగా ఉంటుంది, అయితే యితర ప్రాంతాల్లో చాలామంది నిర్భాగ్యులున్నారు" అనగలిగే హక్కుండదు.

("Vérité,"[140] ఏప్రిల్ 23):

---

* "పెద్ద దొంగలు నశించాలి! హంతకులు నశించాలి!" — సం.

** స్వర్ణ నిలయం. — సం.

"పారిస్‌లో నేరాలు ఆశ్చర్యకరంగా తగ్గిపోయాయి. దొంగలూ, వేశ్యలూ లేరు, హత్యలూ, వీధి దాడులూ లేవు. కన్సర్వేటివ్ అందరూ వెర్సేల్స్‌కి పలాయనం చిత్తగించారు!"

"పౌరులు తమ పోలీసు పనిని తామే చేసుకుంటున్నప్పటి నుంచీ సుదూరమైన పేటల్లోను, జన సంచారం అంతగా లేని ప్రాంతాల్లో పైతం రాత్రిపూటల్లో ఒక్కగా నొక్క దాడి కూడా జరిగినట్లు గుర్తింపబడలేదు."

ఖండికలు

## "భూస్వాముల సభ" గురించి థ్యేర్

ఈ పార్టీకి

"మూడు సాధనాలను — విదేశీ దాడి, అంతర్యుద్ధ, అరాజకత్వాలను — వాడటం మాత్రమే తెలుసు.... అటువంటి ప్రభుత్వం ప్రమాదస్వప్నదూ కాబోదు" (ప్రతినిధుల సభ, 1883 జనవరి 5వ తేదీ).

## రక్షణ ప్రభుత్వం

ఇదే ట్రొషూ తన ప్రసిద్ధ కార్యక్రమంలో: "పారిస్ గవర్నరు చచ్చినా లొంగి పోడు" అన్నాడు. జూల్ ఫ్రావ్ తన పర్క్యులరులో: "మన దుర్గాల్లో ఒక్క రాయిని గాని, మన భూభాగంలోని ఒక్క అంగుళం జాగాను గాని" శత్రువుచేత చిక్కనియ్యం అన్నాడు. డ్యుక్రో కూడ అలాగే: "విజయం సాధించో, వీరమరణం పొందోగాని పారిస్‌కి నేనెన్నడూ తిరిగి రాను" అన్నాడు. అయితే యితగాడు తర్వాత బోర్డోలో, పారిస్ "తిరుగుబాటుదారుల"ను అణచి ఉంచడానికి తన ప్రాణం అవసరమన్న సంగతి కను గొన్నాడు. వెర్సేల్స్‌కి తాము పలాయనం చేసినప్పుడు తమ నేరాల రుజువులను వెనక దిగ విడిచామన్న సంగతి యీ దగుల్బాజీలకు తెలును. ఈ రుజువులను రూపుమాపేందుకు గాను పారిస్ నొక శిధిలాల పెనుగుట్టగా చేసి, దాన్నొక రక్తసముద్రంలో ముంచెత్త డానికి సైతం వాళ్లు సంకోచించరు. (రాష్ట్రాలకు ప్రణాళిక, బెలూన్ ద్వారా పంచ బడినది.)

---

"సామ్రాజ్యంచేత, రాజరికంచేత, పార్లమెంటరీ ప్రభుత్వంచేత యింత వరకూ మనపై విధించబడిన ఐక్యత, నిరంకుశమైన, తెలివిమాలిన, నియమ రహితమైన, భారప్రాయమైన కేంద్రీకరణ తప్ప మరేమీ కాదు. తద్భిన్నంగా, పారిస్ వాంఛించిన రాజకీయ ఐక్యత, అన్ని స్థానిక చొరవల ఐచ్ఛిక కలయిక..." ఫెడరల్ కమ్యూన్ల నుండి ఒక కేంద్ర ప్రతినిధివర్గం.

"పాత ప్రభుత్వపు, మతాచార్య ప్రపంచపు అంతం; ఏ సైనిక పెత్తనం, నిరంకుశాధికారవర్గ లంచగొండితనం, గుత్త సంస్థలు, ప్రత్యేక సౌకర్యాలూ శ్రామికవర్గ బానిసత్వానికి కారణాలో, దేశ దురదృష్టాలకూ, విపత్తులకూ కారణాలో వాటన్నింటి అంతం." (కమ్యూన్ ప్రకటన. ఏప్రిల్ 19.)

## జెండార్మీలు, పోలీసులు

(సామ్రాజ్యం క్రింద మొత్తం 30,000 జెండార్మీ వుండగా, ఫ్రాన్సు అంతటి నుంచీ వెర్సైల్స్‌కి రప్పింపబడిన) 20,000 జెండార్మీలు, 12,000 పారిస్ పోలీసు ఏజెంట్లు — ఫ్రాన్సు చరిత్రలోనే ఎన్నడూ లేనంతటి మిక్కిలి శ్రేష్ఠమైన సైన్యానికి ప్రాతిపదిక.

## పారిస్‌కి చెందిన రిపబ్లికన్ ప్రతినిధులు

"పారిస్‌కి చెందిన రిపబ్లికన్ ప్రతినిధులు పారిస్‌ని ఫిరంగులతో బొంబార్డు చెయ్యడాన్ని గాని, ఖైదీలను ఏ విచారణా లేకుండా సత్వర మరణదండనకు గురిచెయ్యడాన్ని గాని, పారిస్ ప్రజలపై అభాండాలను గాని నిరసించలేదు. సరికదా, అందుకు విరుద్ధంగా అసెంబ్లీలో తమ హాజరు ద్వారాను, తమ మౌనం ద్వారాను, వాళ్లకి రిపబ్లికన్ పార్టీ కల్పించిన అపకీర్తి తోడ్పాటుతో, యీ చర్యలన్నింటికీ పవిత్రతను కల్పించారు. రాజరిక పార్టీకి సహచరులూ, బుద్ధిపూర్వక వత్తాసుదారులూ అయ్యారు. ఎన్నికల్లో ప్రజల నుండి పొందిన ఆదేశానికీ, రిపబ్లిక్కుకూ వాళ్ళ ద్రోహులని ప్రకటిస్తున్నాం" (రిపబ్లిక్ పరిరక్షకుల జనరల్ అసోసియేషన్[141]) (మే 9).

"కేంద్రీకరణ, పారిస్‌లో స్తంభనకీ మిగిలిన అన్ని చోట్లా జీవ రాహిత్యానికీ దారితీస్తుంది" (లమెనే).

"ప్రతి ఒక్కటీ కూడా యిప్పుడు ఒకే ఒక్క కేంద్రానికి ఆకర్షింపబడుతోంది, మరి ఈ కేంద్ర మేమిటంటే, రాజ్యమే" (మాంటెస్క్యూ).

## వెండొమ్ చౌకు సంఘర్షణ, వగైరా

ప్రతి ఒక కంపెనీ నుండీ ఒక ప్రతినిధి చొప్పున నియమించడం ద్వారా ఏర్పడిన నేషనల్ గార్డు కేంద్ర కమిటీ, ప్రష్యన్లు పారిస్‌లో ప్రవేశించడంతో, నేషనల్ గార్డులు సొంత విరాళాలతో నెలకొల్పుకున్న ఫిరంగులను, మిట్రయిల్యూజ్‌లను మాంమార్టర్, బెల్‌విల్, లా విలెట్‌లకు రవాణా చేశారు. జాతీయ రక్షణ ప్రభుత్వం యీ ఫిరంగులనూ, మిట్రయిల్యూజ్‌లనే, సరిగా ప్రష్యన్లు ఆక్రమించుకునే పేటలలో విడిచి పెట్టేసింది.

మార్చి 18వ తేదీ ఉదయం ప్రభుత్వం నేషనల్ గార్డుకి గట్టి పిలుపు నిచ్చింది. కానైతే, 4,00,000 మంది నేషనల్ గార్డుల్లోనూ కేవలం 300 మంది మాత్రమే దానికి ప్రతిస్పందించారు.

మార్చి 18వ తేదీ, తెల్లవారు జామున 3 గంటల వేళ, పోలీసులూ స్థాయీ సైన్యానికి చెందిన కొన్ని బెటాలియన్లూ మాంమార్టర్, బెల్‌విల్, లా విలెట్‌లలో ఫిరంగులను కాపాడుతున్న రక్షక సైనికులపై ఆకస్మికంగా దాడి చేసి బలవంతంగా వాటిని తీసుకుపోవాలని ప్రయత్నించారు.

నేషనల్ గార్డు ప్రతిఘటించింది. స్థాయీ సైన్యానికి చెందిన సైనికులు, జనరల్ లెకాంట్ బెదరింపులనూ, ఆజ్ఞలనూ సైతం ధిక్కరించి, levèrent la crosse en l'air.* క్లెమాన్ టొమా కాల్చివెయ్యబడిన రోజుననే, అదే సమయంలోనే ఈ జనరల్ లెకాంట్ తన సైనికులచేత కాల్చివెయ్యబడ్డాడు.

("స్థాయీ సైనిక దళాలు తమ రైఫిళ్ల మడమలను గాలిలో కెత్తి, తిరుగుబాటుదారులతో సంఘీభావం ప్రదర్శించారు.")

విజయానికి సంబంధించిన సమాచార పత్రం ఒరేల్ డి పలడీన్‌చేత అప్పుడే అచ్చువెయ్యబడింది; పారిస్ Decembrisation**పై పత్రాలు కూడా కనుగొనబడ్డాయి.

మార్చి 19వ తేదీన, కేంద్ర కమిటీ, పారిస్ ముట్టడి స్థితి తొలగింపబడినట్లు

* తమ రైఫిళ్లను మడమలు గాలిలోకి వుండేలా పైకెత్తారు. — సం.

** అంటే, 1851, డిసెంబరు 2 నాటి కుట్ర పద్ధతిలో ఒక రాజకీయ కుట్ర. — సం.

ప్రకటించింది. 20న పికార్డ్, సీన్-ఎట్-ఉవాజ్ డిపార్టుమెంటు తరఫున దాన్ని ప్రకటించాడు.

18 మార్చి (ఉదయం: తన విజయంలో యింకా నమ్మకంతో) త్యేర్ అధికార ప్రకటన గోడలపై ప్లేకార్డులుగా అతికించబడింది:

"ప్రభుత్వం చర్య తీసుకొనేందుకు తీర్మానించుకుంది. ప్రభుత్వాన్ని పెకొల్పి దలచుకొన్న నేరస్తులను న్యాయ స్థానాలకు అప్పగించాలి. తీసుకు పోబడిన ఫిరంగులు ఆయుధాగారాల్లో అప్పగింపబడాలి."

చీకటి మాటున రాత్రిపూట చేసిన దాడి విఫలం కావడంతో, మధ్యాహ్నం పూట ఆలస్యంగా, అతను నేషనల్ గార్డు కిలా విజ్ఞప్తి చేశాడు:

"ప్రభుత్వం రాజకీయ కుట్రకి పన్నద్ధం కావడం లేదు. రిపబ్లిక్ ప్రభుత్వానికి, రిపబ్లిక్ భద్రత మినహాయించి, మరో ఆశయమేదీ లేదు, ఉండజాలదు."

అతను కేవలం

"తిరుగుబాటు కమిటీని తుదముట్టిస్తాడు..." "దాదాపు కమిటీలోని వాళ్ళందరూ జనానికి తెలియని వాళ్ళే...."

సాయంత్రం పూట ఆలస్యంగా, పికార్డ్, డి ఒరేల్‌ల సంతకాలతో నేషనల్ గార్డుకి మూడవ అధికార ప్రకటన వెలువడింది:

"తప్పుదారి పట్టింపబడిన కొందరు వ్యక్తులు... నేషనల్ గార్డునూ, సైన్యాన్నీ పట్టుదలతో ప్రతిఘటిస్తున్నారు.... మీ ఆయుధాలు మీకే వదిలెయ్యబడాలని ప్రభుత్వం సంకల్పించింది. రిపబ్లిక్‌ను అరాజకత్వం నుండి కాపాడటానికీ, చట్టబద్ధ పాలన నెలకొల్పడానికీ కృతనిశ్చయంతో మీరు వాటిని పట్టుకోండి."

(17వ తేదీన, వాళ్ళచేత వయవంచన ద్వారా ఆయుధ విసర్జన చేయించేందుకు షాల్‌షే ప్రయత్నించాడు.)

మార్చి 19నాటి, కేంద్ర కమిటీ అధికార ప్రకటన:

"ముట్టడి స్థితి రద్దుచెయ్యబడింది. పారిస్ ప్రజలు, తమ కమ్యూన్ ఎన్నికలకు సమాహ్వానింపబడ్డారు."

ఆదే ప్రకటనలో నేషనల్ గార్డుకి:

"పారిస్‌యొక్కా, మీ హక్కులయొక్కా రక్షణ ఏర్పాట్లు చేసే బాధ్యతను మీరు మాపై ఉంచారు .. ఈ క్షణాన మీరు మాకిచ్చిన మాండేట్లు గడువు ముగిసింది వాటిని మీకు మేము తిరిగి అప్పగిస్తున్నాం, ప్రజల నిశ్వాసం ఎవరినైతే తుడిచిపెట్టేసిందో వాళ్ళ స్థానాన్ని మేము ఆక్రమించం"

ప్రభుత్వ సభ్యులు చల్లగా వెర్సేల్స్‌కి జారుకోవడానికి (ఫ్లౌరీవలె, తమ చేతుల్లో ఉన్న వాళ్లను సైతం) వాళ్ళు అనుమతించారు.

మార్చి 22న అని ప్రకటింపబడిన కమ్యూన్ ఎన్నికలు పార్టీ ఆఫ్ ఆర్డర్ ప్రదర్శన ద్వారా మార్చి 26 దాకా వాయిదా వేయబడ్డాయి

మార్చి 21. "పౌరులకు, సైన్యానికి (సైనికులకు)" అనే అధికార ప్రకటన చివర "Vive la République"* అనే మాటలకు వ్యతిరేకంగా అసెంబ్లీ ఉన్మత్త ప్రలాపాల ద్వారా భిన్నాభిప్రాయ ప్రకటన. త్యేర్: "అది ఎంతో న్యాయబద్ధమైన ప్రతిపాదన కావచ్చు వగైరా" ("భూస్వాముల సభ" భిన్నాభిప్రాయ ప్రకటన) సార్వత్రిక ఓటింగు హక్కు కన్న రిపబ్లిక్ మిన్న అన్న సిద్ధాంతానికి వ్యతిరేకంగా జూల్ ఫ్రావ్ ఉపన్యాసం దంచాడు భూస్వామ్య మెజారిటీని పొగిడాడు, ప్రమ్యన్ జోక్యంతో పారిస్‌వాసులను బెదరించాడు, వ్యవస్థ సంరక్షకుల పారిస్ ప్రదర్శనను రెచ్చగొట్టాడు త్యేర్: 'ఆరు నూరైనా, నూరు ఆరైనా సరే తను పారిస్‌పై దాడికి సాయుధ బలగాన్ని పంపడు' (అసలా పని చేసేందు కింకా అతనికి సేనలు లేవు).

కేంద్ర కమిటీ తన విజయంపట్ల ఎంత అపనమ్మకంతో ఉందంటే పారిస్ మేయర్ల, ప్రతినిధుల మధ్యవర్తిత్వానికి ఆత్రుతగా అది సమ్మతించింది త్యేర్ మొండితనం అది (కమిటీ) ఒకటి రెండు రోజులు నిలబడేందుకు అవకాశ మిచ్చింది అప్పటి కది తన బలమేమిటో గ్రహించగలిగింది. విప్లవవాదుల సవాలక్ష పొరపాట్లు. పోలీసులను ప్రమాదరహితులను చేసేందుకు బదులు వాళ్లకి తలుపులు బార్లా తెరవబడ్డాయి వాళ్లు వెర్సేల్స్‌కి వెళ్లారు అక్కడ వాళ్లకి రక్షకులన్నట్లు స్వాగతం లభించింది 43వ స్థాయీ సైనిక శ్రేణిని వెళ్లి పోనిచ్చారు; ప్రజలతో సంఘీభావం ప్రదర్శించిన సైనికులందరినీ యిళ్లకు వెళ్లిపోనిచ్చారు; పారిస్ నడిబొడ్డుపైన అభివృద్ధి నిరోధకులను సంఘటితులను కానిచ్చారు; వెర్సేల్స్‌ను దాని మానాన దాన్ని విడిచిపెట్టేశారు

* "రిపబ్లిక్ వర్ధిల్లాలి!" – సం.

ట్రిడాన్, జక్లార్, వార్లెన్, వైయాన్‌లు వెన్వెంటనే వెళ్లి రాయలిస్టులను (రాజరిక వాదులను) తరిమెయ్యడం అవసరమని భావించారు.... పారిస్‌లో తిరుగుబాటు ఉద్యమాన్ని తొక్కెయ్యడానికి... ఫ్రావ్, త్యేర్‌లు ప్రష్యన్ అధికారులతో సంప్రతించి, వాళ్ల తోడ్పాటును సంపాదించడానికి తక్షణ చర్యలు తీసుకున్నారు.

నేషనల్ గార్డును సాయుధం చెయ్యడానికీ, సంఘటితం చెయ్యడానికీ జరిగిన ప్రతి ప్రయత్నాన్నీ వమ్ముచెయ్యడంలో ట్రొషూ, క్లెమాన్ టొమాలు నిమగ్నులయ్యారు. కమ్యూన్‌కి తెలియకుండా, విస్పష్టంగా ప్రకటింపబడిన దాని యిచ్ఛకు పూర్తి భిన్నంగా సైతం, కేంద్ర కమిటీచేత వెర్సేల్స్‌పై దాడికి నిర్ణయం జరిగింది, సన్నాహ మొనర్చబడింది, అమలుకై ఏర్పాటు జరిగింది....

బెర్జెరే... మాంవెలెర్యేన్ కారణంగానూ, కూర్బెవాలో నెలకొల్పబడిన ఫిరంగుల కారణంగానూ కమ్యూనార్డులు విలబెట్టుకోలేని నెయ్‌ల్లి వంతెనను ధ్వంసం చేసేందుకు బదులు, రాయలిస్టులు దాన్ని వశంచేసుకొని, అక్కడ దృఢంగా కాలూనుకొని, తద్వారా పారిస్‌తో సంబంధానికి ఒక మార్గాన్ని సంపాదించుకో నిచ్చాడు....

లిట్రే ఒక లేఖలో యిలా చెప్పాడు ("Daily News,"[91] ఏప్రిల్ 20):

> "పారిస్ నిరాయుధం చెయ్యబడింది; వినువాలచేత, వలంటేన్లచేత, వలడీన్లచేతా పారిస్ శృంఖలాబద్ధం చెయ్యబడింది, రిపబ్లిక్ నష్టమైంది. ఈ విషయాన్ని పారిస్ వాసులు అర్థంచేసుకున్నారు. పోరాడకుండా లొంగిపోవడం, అనిశ్చిత అంశంపై భయంకరమైన పోరుసలపాల్సిన ప్రమాదం అన్న ప్రత్యామ్నాయం ఎదురుకోవడంతో, వాళ్ళు పోరాడటానికే నిశ్చయించుకున్నారు; దీనికి గాను వాళ్లని కొనియాడకుండా నేను ఉండలేకపోతున్నాను."

రోమ్ దండయాత్ర కవేన్యాక్, జూల్ ఫ్రావ్, త్యేర్‌ల పని.

> రిపబ్లికన్ ప్రభుత్వానికుండే అన్ని అంతరంగిక సౌలభ్యాలూ, రాజరిక ప్రభుత్వానికుండే బాహ్య బలమూ ఉన్న ప్రభుత్వం. నా ఉద్దేశం ఫెడరల్ రిపబ్లిక్ అని.... అది సమాజాల సమాఖ్య, ఓ కొత్త సమాజం, పలు కొత్త సంయుక్త సభ్యులతో యిది తగినంతగా పెరిగి, అలా సమైక్యమైన సమాజాల భద్రతను సాధ్యం చేసేటంతగా బలపడుతుంది. ఈ రకమైన రిపబ్లిక్... ఆంతరిక అవినీతికి లొంగి ప్రకుంగిపోకుండా తన పైజాను నిలుపుకో గలుగుతుంది. ఈ సామాజిక రూపం అన్ని కష్టాలనూ నివా

రిస్తుంది" (మాంటెస్క్యూ, L'Esprit des Lois ("నియమాల సారాన్ని గురించి"), 1. IX, ప్ర. 1).

## 1793 నాటి రాజ్యాంగం[142]

§78. రిపబ్లిక్‌కు చెందిన ప్రతి కమ్యూనూ మునిసిపల్ పరిపాలన కలిగివుంటుంది. ప్రతి జిల్లా మధ్యంతర పరిపాలన, ప్రతి డిపార్టుమెంటూ కేంద్ర పరిపాలన కలిగివుంటుంది. §79. కమ్యూన్ సమావేశాల్లో మునిసిపల్ అధికారులు ఎన్నుకోబడతారు. §80. డిపార్టుమెంటుల్లోనూ, జిల్లాల్లోనూ ఓటర్ల సమావేశాలచేత అడ్మినిస్ట్రేటర్లు నియమింపబడతారు. §81. మునిసిపాలిటీల, అడ్మినిస్ట్రేషన్ల సభ్యుల్లో సగంమంది ప్రతి ఏడూ కొత్తగా ఎన్నుకోబడతారు.

కార్యనిర్వాహక కౌన్సిలు. §62. 24 మంది సభ్యులతో కూడి వుంటుంది. §63. ప్రతి డిపార్టుమెంటుయొక్క ఎలెక్టరల్ సమావేశం ఒక్కొక్క అభ్యర్థిని ఎన్నుకొంటుంది. శాసనసభ కౌన్సిలు సభ్యుల్ని సాధారణ హాజరు పట్టీ ద్వారా ఎన్నుకుంటుంది. §64. దానిలో సగంమందికిపైగా సభ్యులు శాసనసభ సమావేశపు చివరి మాసంలో కొత్తగా ఎన్నుకోబడతారు. §65. సాధారణ పరిపాలనకు మార్గదర్శకత్వం వహించడం, దాన్ని అజమాయిషీ చెయ్యడం కౌన్సిలు విధి. §66. రిపబ్లిక్ సాధారణ పరిపాలనకోసం ముఖ్యమైన అధికార్లను తన సభ్యుల్లోంచి కాకుండా బయటివారి నుంచి అది నియమిస్తుంది. §68. ఈ అధికార్లు ఒక కౌన్సిలుగా ఏర్పడక విడివిడిగా వ్యవహరిస్తారు, ఒకరితో మరొకరు ప్రత్యక్ష సంబంధం కలిగియుండరు; వాళ్లకి ఏ విధమైన వ్యక్తిగత అధికారం ఉండదు. §73. కౌన్సిలు తను నియమించిన అధికార్లను పదవి నుంచి తొలగించుతుంది, కొత్తవాళ్లను నియమిస్తుంది.

ఒక వంక అసెంబ్లీలో జూల్ ఫ్రావ్ అంతర్యుద్ధాని కిచ్చిన పిలుపు మూలంగా ఉద్రిక్తులై — పారిస్‌వాసులు వెన్వెంటనే లొంగిరాకపోతే జోక్యంచేసుకుంటామని ప్రష్యన్లు బెదరించారని అతను చెప్పాడు, — ప్రజల దీర్ఘకాల ఓపిక వల్లను, తమ పట్ల కేంద్ర కమిటీ క్రియారహిత ధోరణివల్లను ప్రోత్సాహితులై పారిస్‌లోని పార్టీ ఆఫ్ ఆర్డర్ coup de main* చెయ్యాలని నిశ్చయించుకుంది. శాంతియుతమైన ఊరేగింపు

* ఆకస్మిక దాడి. — సం.

మునుగులో, విప్లవ ప్రభుత్వానికి వ్యతిరేకంగా శాంతియుతమైన ప్రదర్శనగా అది మార్చి 22న జరిగింది. నిజానికి అదొక మిక్కిలి ప్రత్యేక రకమైన శాంతియుత ప్రదర్శనగా వుంది.

> "ఆ ఉద్యమం యావత్తూ ఆశ్చర్యకరంగా కనిపించింది. దాన్ని ఎదుర్కోవడానికి సన్నాహాలేమీ లేవు."

"పెద్దమనుషుల దొమ్మీగుంపు," దాని మొదటి శ్రేణిలో సామ్రాజ్యానికి చెందిన పాత ముఖాలు, హెక్కారెన్, క్యోట్లగాన్, ఆంరీ డి పేన్ వగైరాలు, వెండొమ్ చౌకుకు పారిపోయిన పెంటెనల్సు నుండి విడివడిన నేషనల్ గార్డులను హింసిస్తూ, నిరాయుధం చేస్తూ ముందుకు సాగారు. వెండొమ్ చౌకు నుండి నేషనల్ గార్డులు వెంటనే రోవ్ డెప్టీషన్ రోడ్డుకి మార్చ్ చేశారు. దొమ్మీగుంపు నేషనల్ గార్డులకు ఎదురైనా దానిపై కాల్పులు జరపవద్దని వాళ్లకు ఆజ్ఞలు జారీ చెయ్యబడ్డాయి. కానైతే దొమ్మీదారులు "హంతకులు నశించాలి! కేంద్ర కమిటీ నశించాలి!" అని నినాదాలు చేసుకుంటూ, నేషనల్ గార్డులను అవమాన పరుస్తూ, వాళ్ల (తుపాకులను) పట్టుకు లాగుతూ, ముందుకు సాగారు. రివాల్వరుతో సిటిజన్ మల్‌జర్నాల్‌ను (వెండొమ్ చౌకులోని సైనిక కేంద్రానికి చెందిన లెఫ్టినెంటు) (కేంద్ర కమిటీ సభ్యుడు) కాల్చారు. జనరల్ బెర్జెరే వాళ్లని వెళ్లిపొమ్మని (చెదరిపొమ్మని) (వెనక్కి తిరిగిపొమ్మని) విజ్ఞప్తి చేశాడు. ఐదు నిముషాల పాటు డప్పులు వాయించబడ్డాయి. ముమ్మారు హెచ్చరికలు (దొమ్మీ చట్టాల ఇంగ్లీషు పాఠాల ననుసరించి)[61] చెయ్యబడ్డాయి. దొమ్మీదారులు తిట్లతో జవాబిచ్చారు. ఇద్దరు నేషనల్ గార్డులు తీవ్రమైన గాయాలతో నేలకొరిగారు. ఈలోగా వాళ్ల కామ్రేడ్సు సంకోచించి గాలిలోకి కాల్పులు జరిపారు. దొమ్మీదారులు బలప్రయోగంతో గార్డుల శ్రేణులను చొరుకుని ముందుకెళ్లేందుకూ, వాళ్లను నిరాయుధం చేసేందుకూ ప్రయత్నించారు. బెర్జెరే కాల్చమని ఆజ్ఞాపించడంతో పిరికి పందలు పలాయనం చిత్తగించారు. **Émeute*** క్షణం అణచివేయబడింది, కాల్పులు ఆగిపోయాయి. నేషనల్ గార్డులపై యిళ్ల నుండి కాల్పులు జరపబడ్డాయి. వారిలో వలేన్, ఫ్రాంసువా అనే యిద్దరు చంపబడ్డారు, ఎనిమండుగురు గాయపడ్డారు. ఏ వీధులగుండా అయితే "శాంతియుత" తిరోగమనం జరిగిందో వాటిలో రివాల్వర్లు,

---

* తిరుగుబాటు. — సం.

కత్తికర్రలు (వాటిలో చాలవరకు డి లా పేన్ రోడ్డులో ఏరబడ్డాయి). (తన సొంత మనుషులచేతనే) వెనక నుంచి చంపబడిన వికోంట్ డి మొలినే దగ్గర గొలుసుకి తగిలింపబడిన బాకు కనిపించింది.

పలాయనం జరిగింది. "నిరాయుధ" ప్రదర్శన సాగిన వీధుల్లో కత్తికర్రలు, రివాల్వర్లు, బాకులు పడివున్నాయి. గుంపుపై కాల్పులు జరపాల్సిందిగా తిరుగుబాటు దారులకు ఆజ్ఞలు యిచ్చేముందు పిస్టలు కాల్పులు కాల్చబడ్డాయి. దౌర్జన్యంచేసిన వాళ్ళు ప్రదర్శకులే (దీనిని కిటికీ నుండి జనరల్ షెరిడన్ స్వయంగా చూశాడు).

వినువా తన పోలీసులతో, సైనికులతో, ఫిరంగులతో, మిట్రయిల్యూజ్‌లతో ఏదైతే చెయ్యడంలో విఫలమయ్యాడో, సరిగా దాన్నే చెయ్యడానికి పారిస్ అభివృద్ధి నిరోధకులు చేసిన ప్రయత్నమిది. పారిస్‌కి చెందిన "అధో జనం" పారిస్ "పెద్ద మనుషుల" చేత కనీసం నిరాయుధం చెయ్యబడనివ్వక పోవడం నిజంగా చాలా ఘోరమే మరి!

1849 జూన్ 13న, పారిస్ నేషనల్ గార్డులు రోమ్‌పై ఫ్రెంచి సేనల దాడి అనే నేరానికి వ్యతిరేకంగా నిరసన తెలిపేందుకు, నిజంగానే "నిరాయుధ" "శాంతి యుత" ప్రదర్శన జరిపినప్పుడు, వారిని కత్తులతో కసిమసగివందుకూ, కాల్చి పార వేసినందుకూ జనరల్ షంగర్నేని అతని స్నేహితుడైన త్యేర్ అభినందించాడు. ముట్టడి స్థితి ప్రకటింపబడింది, కొత్త నిర్బంధ శాసనాలు, కొత్త బహిష్కరణలు, కొత్త బీభత్స పాలనా సాగాయి! వీటన్నింటికీ భిన్నంగా కేంద్ర కమిటీ, పారిస్ కార్మికులూ సంఘర్షణ జరిగిన సమయంలో సైతం పూర్తిగా దెబ్బకాచుకొనే స్థితిలో ఉండిపోయారు. దాడిదారులైన బాకుల పెద్దమనుషులను ప్రశాంతంగా యిళ్లకు తిరిగి పోనిచ్చారు. పైగా తమ మెతకతనం ద్వారా, ఈ దుస్సాహసిక దాడికి ప్రతిగా తగిన శాస్తి చెయ్యక, వాళ్లని ఎంతగా ప్రోత్సహించారంటే, రెండు రోజుల తర్వాత, వెర్సేల్స్ నుండి పంప బడిన అడ్మిరల్ సెస్సే నాయకత్వం క్రింద, వాళ్లు తిరిగి సమీకృతులై, అంతర్యుద్ధం చెయ్యడానికి మళ్లీ ప్రయత్నించారు.

ఈ వెండొమ్ చౌకు సంఘర్షణ గురించి వెర్సేల్స్‌లో "నిరాయుధ పౌరుల హత్యా కాండ" అంటూ పెద్ద గోల చెలరేగింది. ఆ గోల ప్రపంచమంతటా ప్రతిధ్వనించింది. అయితే మన మిక్కడ ఒక విషయం చెప్పుకోవాల్సి వుంది. ఇద్దరు జనరల్ల హత్యని గురించి పదేపదే వర్ణించే త్యేర్ సైతం ఈ "నిరాయుధ పౌరుల హత్య"ని గురించి ఒక్కగా నొక్క సారి కూడా ప్రపంచానికి గుర్తుచెయ్య సాహసించలేదు.

మధ్యయుగాల్లో లాగే ప్రభువు సామాన్యునికి వ్యతిరేకంగా ఏ ఆయుధాన్నైనా వాడవచ్చు కాని, సామాన్యుడు మాత్రం ఆత్మరక్షణకు సైతం సాహసించరాదు.

(మార్చి 27. వెర్సేల్స్. థ్యేర్:

> "రాజరిక ఏర్పాటుకు దారితీస్తున్నా నన్న ఆరోపణను నేను లాంఛన ప్రాయంగా ఖండిస్తున్నాను. నేను పదవిని స్వీకరించినప్పుడు రిపబ్లిక్ గట్టి వాస్తవంగా వుంది. భగవత్సాక్షిగా, మనుషులసాక్షిగా నేను దానికి ద్రోహం చెయ్యనని ప్రకటిస్తున్నాను.")

పార్టీ ఆఫ్ ఆర్డర్ రెండవ తిరుగుబాటు అనంతరం, పారిస్ ప్రజలు ప్రతీకార చర్యలేమీ తీసుకోలేదు. కేంద్ర కమిటీకి చెందిన అత్యంత క్రియాశీలురైన కొందరు సభ్యులు వెర్సేల్స్‌పై వెన్వెంటనే దాడి చెయ్యమని యిచ్చిన సలహాను సైతం పాటించక కేంద్ర కమిటీ పెద్ద పొరపాటు చేసింది. అడ్మిరల్ సెస్సే పలాయనానంతరం, పాత ప్రభుత్వానికి చెందిన నేషనల్ గార్డు ఘోరంగా కూలబడిపోయిన తర్వాత, అక్కడింకా ప్రతిఘటన బలగాలేమీ సంఘటితం కాని కారణంగా తల్లడపాటు విపరీతంగా వ్యాపించి యున్న తరుణమది.

కమ్యూన్ ఎన్నిక తర్వాత, పార్టీ ఆఫ్ ఆర్డర్ ఎన్నికల్లో మరోమారు తన బలాన్ని పరీక్షించుకుంది. అప్పుడు తిరిగి ఓడిపోవడంతో పారిస్ నుండి తన నిష్క్రమణను అమలుపరచింది. ఎన్నికలప్పుడు (మేయర్ల కార్యాలయాలలో) తిరుగుబాటు నేషనల్ గార్డులతో బూర్జువాల కరచాలనాలూ, సౌహార్ద ప్రదర్శనలూ సాగాయి. అయితే వాళ్లలో వాళ్ళ మాత్రం "సమూల నిర్మూలన," "మిత్రయిల్యూజ్‌లు," "కయ్యేన ప్రవాసంలో సజీవ దహనం," "తుపాకి గుళ్ల వర్షం ద్వారా మూకుమ్మడి మారణ హోమం" గురించి తప్ప వేరేమీ మాట్లాడుకోరు.

> "నిన్నటి పారుబోతులు ఈనాడు, నగర పాలక కార్యాలయం మను షుల్ని పొగడటం ద్వారా, వెర్సేల్స్‌లో గుమికూడుతున్న "భూస్వాముల సభ" ప్రతినిధులూ, బోనపార్టిస్టు జనరల్సూ వాళ్లపై కాల్పులు సాగించగల స్థితిలో కొచ్చేదాకా, బోకొట్టగలమని భావిస్తున్నారు."

థ్యేర్ నేషనల్ గార్డుపై సాయుధ దాడిని రెండవమారు ఏప్రిల్ 2 నాటి ఘటనతో ప్రారంభించాడు. పారిస్‌కి సమీపంలో కూర్బెవా నెయ్‌ల్లి మధ్య పోరాటం జరిగింది. నేషనల్ గార్డులు ఓడింపబడ్డారు, నెయ్‌ల్లి బ్రిడ్జి థ్యేర్ సైనికులచేత ఆక్రమింపబడింది. నేషనల్ గార్డుల్లో అనేక వేలమంది పారిస్ నుండి బయటకొచ్చి,

కూర్బెవా, ప్యూటోలను, నెయ్‌ల్లి బ్రిడ్జిని ఆక్రమించుకొన్న మీదట, చిత్తుగా ఓడింప బడ్డారు. అనేక మంది ఖైదు చెయ్యబడ్డారు. పలువురు తిరుగుబాటుదార్లు తిరుగుబాటు చేసిన నేరానికి తక్షణమే కాల్చి వెయ్యబడ్డారు. వెర్సేల్స్ సేనలు కాల్పులు ప్రారంభించాయి.

కమ్యూన్:

> "వెర్సేల్స్ ప్రభుత్వం మనపై దాడి చేసింది. సైన్యంపై నమ్మకంలేక, షరేట్‌కు చెందిన పోపు జువావ్‌లను,[80] ట్రొషూయొక్క బ్రెటన్లను,[59] వలంటేన్ జెండార్మీలను, నెయ్‌ల్లిని బొంబార్డు చేసేటందుకుగాను అది తెచ్చుకుంది."

ఏప్రిల్ 2న, వెర్సేల్స్ ప్రభుత్వం ప్రధానంగా జెండార్మీలతో, ఓడ సిపాయిలతో, ఫారెస్టు గార్డులతో, పోలీసులతో కూడిన ఒక డివిజన్‌ను ముందుకు పంపింది. వినువా నాయకత్వాన రెండు బ్రిగేడ్ల కాల్బలమూ, గాలిఫే నాయకత్వాన అశ్విక సైనిక బ్రిగేడూ, ఫిరంగి దళమూ కూర్బెవా పైకి పురోగమించాయి.

పారిస్. ఏప్రిల్ 4. మిర్యేర్. (ప్రకటన):

> "మాజీ సెనేటర్ల నాయకత్వం క్రింద, అంగరక్షక దళాలుగా ఏర్పడి, సామ్రాజ్యానికి చెందిన మాజీ పోలీసులు పారిస్ ప్రజలపై దాడి చెయ్యాలని ప్రభుత్వం ఆజ్ఞలు జారీచేసే నాటికి... పారిస్ ప్రజలు దాడి ప్రయత్నమేమీ చెయ్యడం లేదు."

# "ఫ్రాన్సులో అంతర్యుద్ధం"
# రెండవ సంక్షిప్త పాఠం

## 1) రక్షణ ప్రభుత్వం. పారిస్ ప్రతినిధులుగా ట్రొషూ, ఫ్రావ్, పికార్డ్, ఫెర్రీలు

పారిస్ కార్మికులచేత సెప్టెంబరు 4న ప్రకటింపబడిన రిపబ్లిక్ పట్ల ఫ్రాన్సు అంతటా ఏకగ్రీవంగా హర్షామోదాలు వ్యక్తమయ్యాయి. దాని అస్తిత్వ హక్కు కోసం, ఐదు మాసాల ఆత్మరక్షణ యుద్ధం, పారిస్ (కేంద్రంగా) ప్రతిఘటన ప్రాతిపదికపై సాగింది. రిపబ్లిక్ పేర ఆ ఆత్మరక్షణ యుద్ధమే జరిగియుండకపోయి వుంటే, విజేత విల్‌హెల్మ్, తన "బావ మరది" లూయీ బోనపార్ట్ సామ్రాజ్యాన్ని పునరుద్ధరించి యుండేవాడే. రాజకీయవేత్త థ్యేర్, జనరల్ ట్రొషూల నాయకత్వాన అధికార దాహంగల బారిస్టర్ల కుట్ర ముఠా ఒకటి నగరపాలక కార్యాలయాన్ని అనూహ్యక్షణంలో ఆక్రమించుకుంది. అప్పుడు పారిస్ కార్మికవర్గపు నిజమైన నాయకులింకా బోనపార్టిస్టు జైళ్లలో నిర్బంధింపబడి వున్నారు, ప్రష్యన్ సైన్యం అప్పటికప్పుడే పారిస్‌పై తరలి వస్తోంది. థ్యేర్, జూల్ ఫ్రావ్, పికార్డ్‌ల మనుష్యులో, పారిస్ చారిత్రక నాయకత్వం పట్ల విశ్వాసం ఎంత గాఢంగా పాతుకొన్నదంటే, జాతీయ రక్షణ ప్రభుత్వంగా తమ హక్కుకు చట్టబద్ధత నెంకొల్పుకొనేందుకు గాను, 1869లో శాసనసభకి తాము ఎన్నుకోబడటాన్నే ప్రత్యేకాధారంగా చేసుకున్నారు.

ఈ మనుషులు అధికారానికి వచ్చిన అయిదు రోజుల అనంతరం, గత యుద్ధంపై మా రెండవ విజ్ఞప్తిలో, వాళ్లెలాంటి వ్యక్తులో మీకు మేము చెప్పాం.* పారిస్‌తో సంప్రతించకుండా వాళ్లు ప్రభుత్వాధికారాన్ని వశంచేసుకుంటే, వాళ్ల ప్రతిఘటనకు వ్యతిరేకంగా పారిస్ రిపబ్లిక్‌ను ప్రకటించింది. వాళ్లు వేసిన మొదటి అడుగు, యూరపియన్ రాజాస్థానాలన్నింటికీ దేహీ అని దేవురించడానికి థ్యేర్‌ను పంపడం, రిపబ్లిక్ స్థానంలో

---

* 50వ పేజీ చూడండి. — సం.

రాజును మార్చుకొనే షరతుపై సాధ్యమైతే విదేశీ మధ్యవర్తిత్వాన్ని కొనుక్కోవడం. అధికారం, జాతీయ రక్షణకు మాత్రమే వినియోగిస్తామని వాళ్లు చాలా పెద్ద ప్రమాణాలు చెయ్యడంతో, పారిస్ వాళ్ల పాలనను (అధికారం వశం చేసుకోవడాన్ని) సహించింది. పారిస్ కార్మికులను సాయుధం చేసి, వాళ్లను నేషనల్ గార్డుగా సంఘటితం చేసి, వాళ్లకు యుద్ధ క్రమంలోనే శిక్షణ కరపక పోయినట్లయితే పారిస్ రక్షణ నిజంగా సాధ్యం కాదని వేరే చెప్పనక్కర్లేదు కదా. కాని, పారిస్‌ను సాయుధం చెయ్యడమంటే సాంఘిక విప్లవాన్ని సాయుధం చెయ్యడమే. తన ప్రష్యన్ ముట్టడిదారులపై పారిస్ విజయం సాధించి వుంటే అది, ఫ్రెంచి వర్గపాలనపై రిపబ్లిక్ విజయమై యుండేది. జాతీయ విధి బాధ్యతలకూ వర్గ ప్రయోజనాలకూ మధ్య ఎన్నుకోవలసి వచ్చినప్పుడు జాతీయ రక్షణ ప్రభుత్వం జాతీయ బాధ్యతా పరిత్యాగానికి క్షణకాలం కూడా తటపటాయించలేదు. గంబెట్టాకు రాసిన ఒక లేఖలో జూల్ ఫ్రావ్, త్రొషూ సాగిస్తున్న ఆత్మరక్షణ ప్రష్యన్ సైనికులకు వ్యతిరేకంగా కాదనీ, పారిస్ కార్మికులకు వ్యతిరేకంగానేననీ ఒప్పుకున్నాడు. ముట్టడి ప్రారంభమై నాలుగు మాసాలు గడిచిన తర్వాత, లొంగుబాటుకు సంబంధించిన తొలి ప్రస్తావనకు తగిన సమయం ఆసన్నమైందని అది భావించి, జూల్ ఫ్రావ్ సమక్షంలోను, తన యితర సహచరుల సమక్షంలోను, పారిస్ మేయర్ల సమావేశంలో త్రొషూ యిలా ప్రసంగించాడు:

> "సెప్టెంబరు 4వ తేదీ సాయంత్రమే, నా సహచరులు నన్నడిగిన మొట్టమొదటి ప్రశ్న యిదీ: పారిస్ ప్రష్యన్ సైన్యపు ముట్టడిని తట్టుకొని నిలబడే అవకాశం ఏమైనా ఉందా? లేదు అని చెప్పడానికి నేను ఎంత మాత్రమూ సంకోచించలేదు. ఇప్పుడిక్కడ వున్న నా సహచరులు కొందరు, నా మాటల్లోని వాస్తవాన్నీ, నా అభిప్రాయంలోని దృఢత్వాన్నీ ఆమోదిస్తారని తలుస్తాను. నేను సరిగా యిదే మాటల్లో వాళ్లకి ప్రస్తుత పరిస్థితుల్లో ప్రష్యన్ సైన్యపు ముట్టడిని తట్టుకొని నిలబడాలన్న పారిస్ ప్రయత్నం కేవలం వెర్రితనమే అవుతుందని చెప్పాను. నిస్సందేహంగా అది వీరోచితమైన వెర్రితనం అవుతుంది, అంత మాత్రమే, అని కూడా నేను చెప్పాను.... ఘటనలు" (ఆయన ఆధ్వర్యంలో జరిగినవే) "నా జోస్యం సరైనదనీ, రుజువుచేశాయి."

(త్రొషూ యిచ్చిన యీ చిన్న ఉపన్యాసాన్ని, యుద్ధ విరమణ ఒడంబడిక అనంతరం, ఆ సమావేశానికి హాజరైన మేయర్లలో ఒకడైన ఎమ్. కోర్బన్ తర్వాత ప్రచురించాడు.) ఈవిధంగా, రిపబ్లిక్ ప్రకటింపబడిన నాటి సాయంత్రమే, త్రొషూ "పథకం,"

పారిస్, ఫ్రాన్సుల లొంగుబాటు తప్ప మరేమీ కాదని అతని సహచరులకు తెలుసు. పారిస్‌యొక్క "సరోచితమైన వైరితనాన్ని" కుదర్చాలంటే, జన నిర్మూలన, కరువు అనే చికిత్సను అది అనుభవించాలి. డిసెంబరు రాజకీయ కుట్ర వీరుల పగసాధింపు నుండి సెప్టెంబరు 4న అధికారాన్ని అక్రమంగా హస్తగతం చేసుకున్న వాళ్లను మరుగు పరచేటంత వ్యవధిదాకా యీ చికిత్స సాగాలి. "జాతీయ రక్షణ" అన్నది "ప్రభుత్వానికి" బూటకమైన సాకు మాత్రమే కాక అంతకన్న ఎక్కువే అయినట్లయితే, దాని స్వయం నియమిత సభ్యులు సెప్టెంబరు 5ననే అధికార పరిత్యాగం చేసియుండేవాళ్లు, ట్రొషూ "పథకాన్ని" బహిరంగంగా వెల్లడించేవాళ్లు, పారిస్ ప్రజలకు వెన్వెంటనే విజేతకు లొంగి పొమ్మని చెప్పియుండేవాళ్ళు, లేక రక్షణ కృషిని తమ చేతుల్లోకి తీసుకొమ్మని విజ్ఞప్తి చేసియుండేవాళ్లు. దీనికి మారుగా ఆ వంచకులు, "గవర్నరైన" ట్రొషూ "చచ్చినా లొంగిపోడు" అనీ, విదేశాంగ మంత్రి జూల్ ఫ్రావ్ "మన దుర్గాల్లో ఒక్క రాయిని గాని, మన భూభాగంలోని ఒక్క అంగుళం భాగాన్ని గాని పరులకు దత్తం చెయ్యడని" ఆడంబర పదాలతో కూడిన ప్రకటనలు ప్రచురించారు. ముట్టడి కాలమంతటిలోనూ కూడా ట్రొషూ పథకం క్రమబద్ధంగా అమలుజరపబడింది. నిజానికి, పారిస్ ఆధిపత్యం అప్పగించబడిన నికృష్టులైన బోనపార్టిస్ట్ కసాయి మూకలు, తాము రాసుకున్న గుప్తమైన లేఖలలో, రక్షణ ప్రహసనం పట్ల పరస్పరం సుగ్రాహ్యమైన, అసభ్యమైన పరిహాసాలు దొర్లిస్తూనే వున్నారు. (ఉదాహరణకు, కమ్యూన్‌యొక్క "Journal Officiel"చే ప్రచురించబడిన, పారిస్ రక్షణ సైన్యానికి చెందిన ఫిరంగి దళం సుప్రీం కమాండరూ, గ్రాండ్ క్రాస్ ఆఫ్ ది లీజియన్ ఆఫ్ ఆనర్ బిరుదాంకితుడూ అయిన అల్ఫోన్స్ సిమోన్ గియో ఫిరంగి దళం జనరల్ అయిన సుసాన్‌కి రాసిన లేఖ చూడండి.[38]) పారిస్ లొంగుబాటు విషయంలో యీ కాపట్యపు ముసుగు విసర్జించబడింది. "జాతీయ రక్షణ ప్రభుత్వం" తనను తాను "బిస్మార్క్ ఖైదీలతో ఏర్పడ్డ ఫ్రాన్సు ప్రభుత్వం"గా బహిర్గతం చేసుకుంది (పునరుద్భవించింది) – సెడాన్‌లో యిటువంటి పాత్ర వహించడానికి లూయీ బోనపార్ట్ సైతం (అతని బాపతు మనిషికి సైతం) మరీ అప్రతిష్ఠాకరమైనదిగా ఎంచిన పాత్ర యిది. మార్చి 18 నాటి ఘటనల తరువాత, పిక్కబలం చూపి వెర్సేల్స్‌కి తాము పలాయనం చిత్తగించినప్పుడు, capitulards[38] (లొంగుబాటుదారులు) తమ దేశద్రోహానికి సంబంధించిన సాక్ష్య పత్రాలు పారిస్ చేతుల్లో దిగవిడిచారు. రాష్ట్రాలనుద్దేశించి జారీ చేసిన ప్రకటనలో కమ్యూన్ చెప్పినట్లు ఆ సాక్ష్యాధారాలను నాశనం చేసేందుకు గాను:

> "పారిస్‌ను శిధిలాల గుట్టగా చేసి, రక్త సముద్రంలో ముంచెత్తడానికైనా వాళ్లు వెనకాడరు."

అటువంటి ముగింపు విషయంలో మరీ అంతగా ఉత్సాహం చూపడానికి, రక్షణ ప్రభుత్వానికి చెందిన మిక్కిలి పలుకుబడి కలిగిన కొందరు సభ్యులకైతే వాళ్ల సొంత సత్వర కారణాలున్నాయి. జూల్ ఫ్రావ్, ఎర్నెస్ట్ పికార్డ్, జూల్ ఫ్రెరీల విషయమే చూడండి!

యుద్ధ విరమణ ఒప్పందం కుదిరిన తర్వాత కొద్ది కాలానికి జాతీయ అసెంబ్లీకి పారిస్ ప్రతినిధుల్లో ఒకడైన మిల్యేర్, వరుసగా ప్రామాణికమైన కొన్ని న్యాయచట్ట సంబంధమైన పత్రాలను ప్రచురించాడు. జూల్ ఫ్రావ్, అల్జియర్స్‌లోని ఒక త్రాగుబోతు భార్యతో అక్రమ సంబంధం పెట్టుకొని అనేక సంవత్సరాల కాలంలో దఫదఫాలుగా దుస్సాహసంతో దొంగ పత్రాలు సృష్టించి, తన వ్యభిచారం ద్వారా కలిగిన బిడ్డల పేర, పెద్ద వారసత్వాన్ని కాజేశాడు, తద్వారా అతగాడు ధనికుడయ్యాడు, చట్టబద్ధమైన వారసులు కోర్టులో వేసిన దావాలో, బోనపార్టిస్టు కోర్టుల కుమ్మక్కుతో, తన నేరం బయటపడకుండా తప్పించుకున్నాడు. ఎంత బుకాయించి కూడా, చట్టానికి సంబంధించిన యీ శుష్క పత్రాల పట్టు నుండి విడిపించుకోవడం సాధ్యం కాక, జూల్ ఫ్రావ్, ఆత్మహైన్య ప్రదర్శనలో అదే వీరత్వంతో, ఒకేఒక్క మారు నోరు కట్టుకున్నాడు. అంతర్యుద్ధ కల్లోలంలో తిరిగి అతగానికి వెర్సేల్స్ అసెంబ్లీలో పారిస్ ప్రజలను కుటుంబం, మతం, ఆస్తి, భద్రతలు పట్టని బందిఖానానుంచి "పారిపోయి వచ్చిన ఖైదీల" గుంపుగా తూలనాడే అవకాశం కలిగింది!

(పికే వ్యవహారం). ఈ కూట పత్రాల సృష్టికర్త, అధికారంలోకి వచ్చి రాగానే సానుభూతితో పికే, టైఫేర్‌లనే ఫోర్జరీ నేరస్తులను విడుదల చెయ్యడానికి హడావిడిగా ముందుకొచ్చాడు. వీళ్లిద్దరూ సామ్రాజ్యం క్రిందనే దొంగతనం, ఫోర్జరీ నేరాలకు గాను కారాగార శిక్ష అనుభవించిన ప్రబుద్ధులు. వీళ్లిద్దరిలో ఒకడైన టైఫేర్, కమ్యూన్ స్థాపనానంతరం, పారిస్‌కి రావడానికి సాహసించినప్పుడు వెన్వెంటనే తనకి అనువైన స్థానంలో తిరిగి పెట్టబడ్డాడు. అప్పుడు యిదే జూల్ ఫ్రావ్, తన ఖైదుల్లో వున్న సామాన్య నేరస్తులందర్నీ కమ్యూన్ విడిచిపెట్టేస్తోందంటూ యూరప్ కంతటికీ చాటి చెప్పాడు!

ఎర్నెస్ట్ పికార్డ్, లూయీ బోనపార్ట్ క్రింద హోమ్‌మంత్రి కావాలని నానా తంటాలూ పడి విఫలుడై చివరకు సెప్టెంబరు 4న, ఫ్రెంచి రిపబ్లిక్కుకి తనను తనే హోంమంత్రిగా నియమించుకున్నాడు. ఇతగాడు, పారిస్ స్టాక్ ఎక్స్‌చేంజి నుండి మోసగాడుగా బహిష్కరింప బడిన ఆర్థర్ పికార్డ్ అనే వ్యక్తికి సోదరుడు (1867 జూలై 31వ తేదీ గల పోలీసు ప్రిఫెక్టర్ నివేదిక చూడండి). "Société Générale"41 శాఖల్లో ఒకదానికి మేనేజరుగా ఉండగా, తను ఒప్పుకున్న దాన్ని బట్టే ఈ ఆర్థర్ పికార్డ్ 3,00,000

ఫ్రాంకులను కైంకర్యం చేశాడు (1868 డిసెంబరు 11 నాటి పోలీసు ప్రిఫెక్టర్ నివేదిక చూడండి). ఈ రెండు నివేదికలూ సామ్రాజ్య కాలంలోనే ప్రకటింపబడ్డాయి. అటువంటి ఘనుడైన అర్థర్ పికార్డ్‌ని, ఎర్నెస్ట్ పికార్డ్, "Électeur libre"[42] అనే తన పత్రికకి ప్రధాన సంపాదకుడుగా నియమించాడు. ముట్టడి కాలమంతట్లోనూ ఆర్థిక వ్యవహారాల్లో తన తరఫున దళారీగా వ్యవహరించడానికీ, ఎర్నెస్ట్ వద్దిలో వున్న రాజ్య రహస్యాలను స్టాక్ ఎక్స్‌చేంజ్‌లో వెల్లడించి సొమ్ము చేసుకోవడానికీ, హోమ్‌మంత్రిత్వ శాఖయొక్క పత్రిక అయిన "Électeur libre"లో* ప్రకటింపబడే తప్పుడు వార్తల ద్వారా, ఆధికారికమైన అబద్ధాల ద్వారా సామాన్య స్టాక్ ఎక్స్‌చేంజి చట్టా వ్యాపారస్తులు తప్పుదారి పట్టింపబడుతూండగా ఫ్రెంచి సైన్యపు పరాజయాలపై యితగాడు భద్రంగా వ్యాపారం చేశాడు. ఈ అపూర్వ సహోదరుల మధ్య ఆర్థిక వ్యవహారాలపై సాగిన ఉత్తర ప్రత్యుత్తరాల కట్ట యావత్తూ కమ్యూన్ చేతుల్లో పడింది. వెర్సేల్స్ ప్రభుత్వపు టో మిల్లర్ అనదగిన ఆ ఎర్నెస్ట్ పికార్డ్ ఖైదు చెయ్యబడి, పియ్మోటే అమాయక అనుచరుల దారుణ దమనకాండకు గురిచెయ్యబడిన మొదటి బృందం నేషనల్ గార్డులను ఉద్దేశించి "తన లాగు జేబుల్లో చేతులు పెట్టుకొని హేళనగా వేళాకోళాలాడడంటే" అందులో అబ్బుర మేమీ లేదు.

సెప్టెంబరు 4వ తేదీకి ముందు చేతిలో చిల్లర పెన్నీ కూడా లేని జూల్ ఫ్రేరీ అనే బారిస్టరు, ముట్టడి కాలంలో పారిస్ మేయరుగా, ఎక్కువ భాగం తన దుష్పరిపాలన ఫలితమే అయిన కరువు నుండి పెద్ద సంపదను కూడబెట్టుకోడంలో సఫలుడయ్యాడు. ఇందుకు సంబంధించిన సాక్ష్యాధార పత్రాలు కమ్యూన్ చేతుల్లో ఉన్నాయి. తన దుష్పరిపాలనకి గాను జవాబు చెప్పుకోవలసిన రోజు వస్తే, అతను శిక్షను ఎదుర్కోక తప్పదు.

అందుకని, వీళ్ళ శ్రమజీవుల పారిస్‌కి పరమ శత్రువులు. పాలకవర్గాల పరభాగ్యోపజీవులు గానే కాక, ముట్టడి కాలంలో పారిస్‌కి ద్రోహంచేసిన వాళ్ళు గానే కాక, అంతకన్న అధికంగా ఫ్రెంచి విప్లవ దుర్గమైన యీ పారిస్ శిధిలాల్లో మాత్రమే తమ **tickets-of-leave** (విడుదల సర్టిఫికేట్లు) పొందగలమని ఆశించగల ప్రబుద్ధులు వీళ్ళు. ఈ దుస్సాహసిక దుర్మార్గులే త్యేర్ మంత్రులు కాగల సరైన వ్యక్తులు.

---

* "ఫ్రాన్సులో అంతర్యుద్ధం"కి సంబంధించిన తుది పాఠంలో జాతీయ రక్షణ ప్రభుత్వంలో ఎర్నెస్ట్ పికార్డ్ ఆర్థిక మంత్రి అని మార్క్స్ స్పష్టంగా పేర్కొన్నాడు; ఆ వార్తాపత్రిక ఆర్థికమంత్రిత్వ శాఖకి చెందిన పత్రిక (56–57వ పేజీలు చూడండి). – సం.

# 2) త్యేర్. డుఫోర్. పుయ్యే-కర్త్యే

"పార్లమెంటరీ అర్థంలో" విషయాలన్నవి కేవలం మాటలకు సాకులు మాత్రమే. ఆ మాటలు, ప్రత్యర్థులను బురిడీ కొట్టించడానికి ఉచ్చులుగా పనికొస్తాయి, ప్రజలను బోల్తా కొట్టించడానికి మాటుగా పనికొస్తాయి. లేకుంటే, వక్తకే కళాత్మక ప్రకర్ష ప్రదర్శనకు వినియోగపడతాయి.

అటువంటి మాటల్లో మేటి అయిన త్యేర్, జిత్తులమారి మరుగుజ్జు అయిన త్యేర్ ఫ్రెంచి బూర్జువావర్గాన్ని దాదాపుగా అర్ధశతాబ్దం పాటు సమ్మోహితం చేశాడంటే, తమ సొంత వర్గ అవినీతికి అతను అత్యంత సంపూర్ణ మేధో వ్యక్తీకరణ కావడమే అందుకు కారణం. అతను రాజకీయవేత్త అయ్యేందుకు ముందే చరిత్రకర్తగా అబద్ధాలాడగల అపూర్వ శక్తులు తనకున్నట్లు రుజావు చేసుకున్నాడు. మరుగుజ్జు మనుషులందరి లాగే ఆడంబర ప్రదర్శన పట్ల ఆతృత చూపుతూ, పదవి పట్ల, అన్యాయార్జన పట్ల దురాశలో, ఊసర క్షేత్రంవంటి మేధా శక్తితో, కాని సజీవమైన కాల్పనిక శక్తితో, భోగలాలసుడు, సంశయాత్మకుడు, ఘటనలకు సంబంధించిన పైపై అంశాల (పరిగ్రహణ)లో సర్వతోముఖ కౌశల్యం కలిగినవాడు, విషయాలను మాటలకొక సాకు మాత్రంగా చూసేవాడు, అపూర్వమైన సంభాషణా చాతుర్యం కలిగి, మాటలు వేర్పుగా విసరగలిగిన వాడు, సరకులేని సాదా రచయిత, చిల్లరమల్లర ప్రభుత్వ మోసాల్లో అందెవేసిన చెయ్యి, కూటసాక్ష్య కళాప్రవీణుడు, పార్లమెంటరీ పార్టీ పోరాటకాండకు సంబంధించి చిల్లరమల్లర ఎత్తుల్లోను, టక్కరి జిత్తుల్లోను, నికృష్ట నయవంచనల్లోను వేర్పరి, భావాల స్థానంలో జాతి, వర్గ ద్వేషాలు పట్టుకొమ్మగా కలిగిన వాడు, ఆత్మశుద్ధి స్థానంలో స్వాతిశయం కలిగిన వాడు, ప్రత్యర్థిని వైదొలగించుకొనేందుకు, ప్రజలపై కాల్పులు సాగించేందుకు, విప్లవాన్ని ఉక్కిరిబిక్కిరి చేసేందుకు, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జిత్తులమారితనం, పదవిలో ఉన్నప్పుడు హేయ ప్రవర్తనం, విప్లవాలు రెచ్చగొట్టడాని కెప్పుడూ జంకుగొంకుల్లేక పోవడం, ప్రజారంగంలో అతని పాత్రను పరిశీలిస్తే అతని దేశ దైన్యాల జాబితా తప్ప వేరేమీ కానరాదు. తన మరుగుజ్జు చేతులతో, యూరపుపై, మొదటి నెపోలియన్ కత్తిని ఝళిపించడమంటే సరదా కలిగిన, చరిత్రకు సంబంధించిన తన రచనలలో నెపోలియన్ బూట్లు తుడిచేవాడుగా తయారైన అతగాని విదేశాంగ విధాన మెప్పుడూ కూడా ఫ్రాన్సు తలవంపులకే దారితీసింది. 1841 నాటి లండన్ కన్వెన్షన్,[112] 1871 నాటి పారిస్ లొంగుబాటు, పోతే యిప్పటి అంతర్యుద్ధం వీట న్నింటిలోనూ కూడా జరిగినదిదే. ఆధునిక సమాజపు ప్రగాఢ భావ ప్రవంతులెప్పుడూ

కూడా అతనికి అంతుపట్టవన్న సంగతి వేరే చెప్పనక్కర్లేదు. అతని మేధస్సుకు గల జవ జీవాలన్నీ అతని నాలుకలోకి పలాయనం చిత్తగించాయేమో, కొట్టొచ్చేటట్లు అత్యంత విస్పష్టంగా కనిపించే మార్పులు సైతం అతని బుర్రకి ఎక్కవు. ఈవిధంగా, పాత ఫ్రెంచి రక్షిత వ్యవస్థ నుండి ఏ మాత్రం వైదొలగినా కూడా, అపచారంగా పరిగణించి, విధివిరామం లేకుండా అతను దుమ్మెత్తి పోశాడు. లూయీ ఫిలిప్ క్రింద మంత్రిగా ఉండగా రైల్వేలు శుద్ధ మరీచికలంటూ నిరసించాడు. లూయీ బోనపార్ట్ క్రింద పని చేసేటప్పుడు, బలిగి పోయిన ఫ్రెంచి సైనిక వ్యవస్థకు సంబంధించిన ప్రతి సంస్కరణనూ అతను ఒక అపచార మన్నట్లు తిట్టి పోశాడు. తనకున్న బహుముఖ ప్రజ్ఞతోను, అస్థిర సంకల్పంతోను అతను పాత బూజుపట్టిన మార్పులేని సంప్రదాయ సిద్ధమైన దైనందిన కార్యక్రమాలకు గట్టిగా అంకితమై పోయాడు. తన సుదీర్ఘ పదవీ కాలక్రమంలో ఏ ఒక్క శాసనమూ, ఆచరణలో ఉపయోగకరమైన ఏ చిన్న చట్టమూ చేసిన పాపాన పోలేదు. వామనమూర్తి నెపోలియన్, మరుగుజ్జు థ్యేర్‌ల నాయకత్వ భాగ్యం కలిగి వున్నందుకు పాత ప్రపంచ వ్యవస్థ మాత్రమే గర్వించ గలదు. అటువంటి మనిషిలో సాంస్కృతిక గుణ విశేషాలన బడేవి వ్యభిచారంలోను...* స్వార్థంలోను నాజూకు తనంగా మాత్రమే కనిపిస్తాయి.

రెస్టొరేషన్ (పునరుద్ధరణ) కాలంలో రిపబ్లికన్లతో ముడేసుకున్న థ్యేర్, డచెస్ డి బెర్రీపై వేగుగా, జైల్లో ఆమెకు మగమంత్రసానిగా పనిచెయ్యడం ద్వారా లూయీ ఫిలిప్ కృపాకటాక్షాలను సంపాదించుకున్నాడు. కానైతే మొదటి పర్యాయం మంత్రి పదవిలోకి దూరినప్పుడు (1834 – 1835), అతని కార్యక్రమం, ట్రాన్స్‌నొవేన్ రోడ్డు తిరుగుబాటు రిపబ్లికన్ల ఊచకోత పైనా, పత్రికలకు వ్యతిరేకంగా అతిదుష్టమైన సెప్టెంబరు చట్టాల[44] తయారీ పైననే కేంద్రీకరించబడింది.

1840 మార్చిలో, ప్రధాన మంత్రిగా పునర్దర్శన మిచ్చి, పారిస్ దుర్గనిర్మాణాలకు సంబంధించిన కుట్రతో అతను ముందు కొచ్చాడు. పారిస్ స్వేచ్ఛపై యీ ఘాతుక ప్రయత్నానికి వ్యతిరేకంగా రిపబ్లికన్ పార్టీ (ఖండన)కి అతనిలా జవాబిచ్చాడు:

> "ఏమిటేమిటి! చుట్టూ కోటలు కడితే స్వేచ్ఛకు భంగం కలుగుతుందనుకోవడం విడ్డూరంగా లేదూ? మొదటి విషయం ఏమిటంటే, ఏ ప్రభుత్వమైనా ఏదో ఒక రోజున పారిస్‌ను బొంబార్డు చెయ్యడం ద్వారా తనను తాను నిలబెట్టుకోవాలని చూస్తుందనుకోవడం ద్వారా మీరు ప్రభు

---

* ప్రాతప్రతిలో ఖాళీ. – సం.

త్వంపై అభాండాలు వేస్తున్నారు.... అయితే, అటువంటి ప్రభుత్వం ముందరికన్న తన విజయం తర్వాతనే శతాధికంగా దుస్సాధ్యమవుతుంది."

నిజానికి, విడుదల సర్టిఫికెట్లు పొందిన నేరస్త మంత్రులతోను, పాశవిక భూస్వాముల సభతోను కూడిన త్యేర్ ప్రభుత్వాన్ని మినహాయిస్తే మరే ఫ్రెంచి ప్రభుత్వమూ కూడా, అటువంటి పనికి సాహసించగలిగి వుండేది కాదు! అదీ కూడా, మిక్కిలి సాంప్రదాయికమైన పద్ధతిలో, తన దుర్గాల్లో ఒక భాగం తన ప్రష్యన్ విజేతల సంరక్షకుల చేతుల్లో ఉండగా.

1848 జనవరిలో బాంబు రాజు* పాలెర్మోపై దాడికి ప్రయత్నించినప్పుడు, త్యేర్ ప్రతినిధుల సభలో మళ్లీ లేచి యిలా అన్నాడు:

> "అయ్యా పెద్దలారా, పాలెర్మోలో జరుగుతున్న దేమిటో మీకు తెలుసు. 48 గంటలపాటు ఒక పెద్ద పట్టణం ఫిరంగులతో బొంబార్డు చెయ్యబడింది. ఈ వార్త విన్నప్పుడు మీరందరూ భయకంపితులవుతారు" ("పార్లమెంటరీ" అర్థంలో). "ఈ బొంబార్డుమెంటు చేస్తున్నదెవరు? విదేశీ శత్రువు తన యుద్ధ హక్కులు వినియోగించి ఈ బొంబార్డుమెంటు చేస్తున్నాడా? లేదండి, దాని సొంత ప్రభుత్వమే యీ పని చేస్తోంది."

(అది తన సొంత ప్రభుత్వమే అయ్యుండి, విదేశీ శత్రువు కళ్ల ముందు, అతని అనుమతితో జరిగితే బహుశా అంతా నవ్యంగా ఉండి ఉండునేమో.)

> "ఎందుకట? ఎందుకంటే, దురదృష్టవంతమైన ఆ పట్టణం తన హక్కులను డిమాండు చేసింది. ఔను, అలా తన హక్కులను డిమాండు చేసినందుకు గాను, అది 48 గంటల బొంబార్డుమెంటుకు గురైంది."

(అదే బొంబార్డుమెంటు నాలుగు వారాలో, అంతకన్న ఎక్కువగానో కొనసాగి వుంటే, అంతా నజావుగా ఉండేది.)

> "...యూరప్ ప్రజాభిప్రాయానికై నన్ను విజ్ఞప్తి చెయ్యనివ్వండి. జాగరితమైన, యూరప్‌లో బహుశా అత్యున్నతమైన వేదిక నుండి, అటువంటి కృత్యాలకు వ్యతిరేకంగా కొన్ని కోపోద్రిక్త నిరసన పదాలను" (పదాలు మాత్రమే సుమా!) "ప్రతిధ్వనింపచేస్తే, మానవాళికి సేవ చేసినదవు

---

* రెండవ ఫెర్డినాండ్. — సం.

తుంది.... తన మాతృదేశానికి సేవలు చేసిన" (త్యేర్ అటువంటి పాపపు పనులెన్నడూ చెయ్యలేదు!) "రీజెంట్ ఎస్పర్టెరో, ఒక తిరుగుబాటును అణచివేసేందుకు గాను బార్సిలోనాని బొంబార్డు చేయించ దలచినప్పుడు ప్రపంచపు నలు మూలల నుండీ సర్వత్రా ఆగ్రహం ప్రకటింపబడింది."

సుమారొక సంవత్సరం తర్వాత, వాణ్యమైన ఆత్మగల యీ మనిషి, లెజిటిమిస్టు ఉడినో నాయకత్వం క్రింద, రోమ్‌పై ఫ్రెంచి రిపబ్లిక్ దళాల బొంబార్డుమెంటును[47] తీవ్రంగా బలపరచే వాళ్లలో ఒకడయాడు.

ఫిబ్రవరి విప్లవానికి కొద్ది రోజుల ముందు, గిజో ధర్మమా అని పదవికి తను చాలా కాలంగా దూరమైనందుకు చిర్రుబుర్రు లాడుతూ, ప్రజల్లోని కల్లోలాన్ని పసిగట్టిన త్యేర్ ప్రతినిధుల సభలో తన అచ్చెరువును మళ్లీ యిలా వెల్లడించాడు:

> "ఒక్క ఫ్రాన్సులోనే కాదు, యూరప్‌లో కూడా నేను విప్లవ పార్టీకి చెందినవాడిని. విప్లవ ప్రభుత్వం మితవాద వ్యక్తుల చేతుల్లో ఉండాలని నేను కోరుకుంటున్నాను. కాని, ఒకవేళ అది ఉద్వేగపరుల చేతుల్లో, చివరకు రాడికల్సు చేతుల్లో పడినా కూడా, నేను నా కర్తవ్యాన్ని విడిచిపెట్టను (విడను). నేను సదా విప్లవ పార్టీకే చెంది వుంటాను."

ఫిబ్రవరి విప్లవం వచ్చింది. ఈ ఛోటా వ్యక్తి ఆశించినట్లు గిజో మంత్రివర్గం స్థానంలో అది త్యేర్ మంత్రివర్గాన్ని తేకుండా, లూయీ ఫిలిప్ స్థానంలో విప్లవం రిపబ్లిక్‌ను తీసుకొచ్చింది. రిపబ్లిక్ ప్రకటన నాటి నుండి రాజకీయ కుట్ర దాకా ఆ విప్లవాన్ని అణచెయ్యడమే త్యేర్‌యొక్క ఏకైక కార్యక్రమంగా ఉంది. ప్రజా విజయపు తొలి రోజున, తన పట్ల ప్రజలకు గల ఏహ్యభావమే వాళ్ల ద్వేషాన్నుండి తనను కాపాడిందన్న అంశాన్ని మరచిపోయి, గాభరాగా అతను దాక్కున్నాడు. అయినా కూడా, అతను తన మిధ్యా ధైర్యంతో, బూర్జువా రిపబ్లికన్ అయిన కవేన్యాక్ చేత పారిస్ శ్రామికవర్గపు భౌతిక శక్తులు రక్తపాతంతో విచ్ఛిన్నం చెయ్యబడేటంతదాకా ప్రజారంగానికి దూరంగానే ఉంటూ వచ్చాడు. తర్వాత అతని మాదిరి వ్యక్తులకు రంగం సిద్ధం చెయ్యబడింది. అతనికి మళ్లీ కాలం కలిసివచ్చింది. "పార్టీ ఆఫ్ ఆర్డరు"కీ, దాని "పార్లమెంటరీ రిపబ్లిక్"కీ అతను మళ్లీ సైద్ధాంతిక నాయకుడు అయ్యాడు. పాలక వర్గాలకు చెందిన ప్రత్యర్థి గ్రూపులన్నీ కలసికట్టుగా కార్మికవర్గాన్ని అణచివెయ్యడానికి కుట్రచేసి, ఒకదానికి వ్యతిరేకంగా మరొకటి గూడు పుఠాణీ చేసి, ప్రతి ఒక్క గ్రూపూ తన సొంత రాజరిక పునరుద్ధరణ కోసం కృషిచేసిన అనామక పాలన అది.

(పునరుద్ధరణ ప్రభువర్గ భూఖామందుల పాలన, జూలై రాజరిక పెట్టుబడిదారుల పాలన, కవేన్యాక్ రిపబ్లిక్ బూర్జువావర్గంలోని "రిపబ్లికన్" గ్రూపు పాలన. ఈ పాలన లన్నింటిలోనూ కూడా బోనపార్టిస్టు పార్టీగా ఏర్పడ్డ ఆకలిగొన్న దుస్సాహసికుల ముఠా, ఫ్రాన్సును, తమను "ఆస్తిభద్రతల, కుటుంబ, మతాల రక్షకులు"గా వర్ణించే ఫ్రాన్సును కొల్లగొట్టడానికి వృథాగా ఆయాసపడింది.

ఆ రిపబ్లిక్ లెజిటిమిస్టులు, ఆర్లియనిస్టులు, బోనపార్టిస్టులు వాటి వెనక తోక వెంబడి నారాయణలాగా బూర్జువా రిపబ్లికన్ల కలయికయొక్క అనామక పాలన.)

## 3) "భూస్వాముల సభ"

బోర్డోలో సమావేశమవుతున్న "భూస్వాముల సభ" యీ ప్రభుత్వాన్ని తయారు చేస్తే, "రక్షణ ప్రభుత్వ వ్యక్తులు" ఆ సభను రూపొందించడానికి, ముందే బాగా జాగ్రత్త పడ్డారు. అందుకుగాను థ్యేర్‌ను వాళ్ళు రాష్ట్రాల్లో యాత్రా పర్యటనకు పంపారు, రాబోయే ఘటనలను ముందుగానే చూచాయగా తెలియజేసేందుకూ, ఆకస్మికంగా జరగబోయే సాధారణ ఎన్నికలకోసం సన్నాహాలు జరిపేందుకూ ఆ పర్యటన సాగింది. దానిలో థ్యేర్ ఒక యిబ్బందిని అధిగమించాల్సి వచ్చింది. ఫ్రెంచి ప్రజలకు ద్వేష పాత్రులు కావడంతోపాటు బోనపార్టిస్టులు, పెద్ద సంఖ్యలో ఎన్నుకోబడేట్లయితే, వెన్వెంటనే సామ్రాజ్యాన్ని పునరుద్ధరించి, థ్యేర్ ముఠాను కయ్యేన యాత్రకు పంపి వుందురు. తమ సొంత స్థానాలను, బోనపార్టిస్టులు ఖాళీ చేసిన స్థానాలను తిరిగి పూరించడానికి ఆర్లియనిస్టులు చెదురుబదురుగా మాత్రమే వున్నారు. అందుకని, లెజిటిమిస్టు పార్టీని ఉత్తేజితం చెయ్యక తప్పని పరిస్థితి ఏర్పడింది. ఈ కర్తవ్యం పట్ల థ్యేర్ వెరపు చెందలేదు. ఆధునిక ఫ్రాన్సు ప్రభుత్వంగా బొత్తిగా పనికి రాక, అందుకని పదవి కోసమూ ఆక్రమార్జన కోసమూ ప్రత్యర్థులుగా క్షుద్ర స్థానంలో వున్న అది తప్ప, థ్యేర్ మాటల్లోనే, "విదేశీ దండయాత్ర, అంతర్యుద్ధం, అరాజకత్వం" అనే యీ మూడు వనరుల పైననే తన కార్యాచరణ విషయంలో ఆధారపడే ఆ పార్టీని మించి ప్రతిఘాత విప్లవానికి గుప్త సాధనంగా వాడదగిన పార్టీ మరొకటే దుంటుంది? (1883 జనవరి 5న, ప్రతినిధుల సభలో థ్యేర్ చేసిన ప్రసంగం.)

1789 విప్లవం చేత ఆస్తులు కోల్పోయిన లెజిటిమిస్టుల ఒక ప్రత్యేక బృందం, మొదటి నెపోలియన్ భృత్యగణంలో చేరడం ద్వారా తమ ఎస్టేట్లను తిరిగి సంపాదించు కున్నారు. వాళ్లలో ఎక్కువమంది కోట్ల ఫ్రాంకుల నష్టపరిహారం ద్వారా, పునరుద్ధరణ కాలంలో ప్రైవేటు విరాళాల ద్వారా లబ్ధి పొందారు. అటు తర్వాతి కాలంలో లూయీ

ఫిలిప్, వామనమూర్తి నెపోలియన్‌ల పాలనల్లో వాళ్ల క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉండటం కూడా భూఖామందులుగా వాళ్ల తమ ఆస్తులు తిరిగి పెంచుకోవడానికి సాధనమైంది. పారిస్‌లో రాజాస్థానాలకు, ప్రాతినిధ్యానికి అయ్యే ఖర్చులు తప్పిపోవడం, రాష్ట్రీయ ఫ్రాన్సు మారుమూలల్లో వుండిన, తమ భూముల ధరలు ఆధునిక పరిశ్రమలు, రైల్వేల ఆగమన కారణంగా పెరగడం, పెట్టుబడిదారీ వ్యవసాయదారులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను ప్రవేశపెట్టి వ్యావసాయికోత్పత్తిని పెంచడం, నానాటికీ విపరీతంగా పెరుగుతున్న పట్టణవాస జనాభాయొక్క తరగని గిరాకీ, తత్కారణంగా వస్తువులకోసం మార్కెట్ల పెరుగుదల – వీటన్నింటి కారణంగా వాళ్ల ఒడిలో బంగారం కుప్పలుగా కురిసింది. తమ పాదార్థిక సంపదను తిరిగి కూడదీసుకొని, ఆధునిక బానిస యజమానుల ఆ జాయింట్ స్టాక్ కంపెనీ భాగస్వాములుగా వారి ప్రాముఖ్యాన్ని పునర్నిర్మించిన అవే సాంఘిక అంశాలు, ఆధునిక భావాలు వాళ్లకి సోకకుండా దడులుకట్టి, వాళ్లను కొత్తని నేర్చుకోని, పాతని మరచిపోని గ్రామీణ అమాయకత్వంలో అట్టే పెట్టాయి. థ్యేర్ లాంటి వ్యక్తికి, వాళ్ల కేవలం క్రియారహిత పదార్థంగా, తన పని సాగించడానికి అమరైన పదార్థంగా పని కొచ్చారు. రక్షణ ప్రభుత్వం తనకి అప్పగించిన పని నిర్వహణలో యీ జిత్తులమారి దయ్యం ఓటర్లను ఖరీదీ కొట్టించి, మెజారిటీ మాండేట్లను సంపాదించి, రక్షణ ప్రభుత్వ సభ్యులను తన ప్రత్యర్థి యజమానులుగా వుండే స్థితి నుంచి, తన ప్రకటిత నౌకర్లుగా ఉండే స్థితికి మార్చుకున్నాడు.

ఎన్నికల ఉచ్చులు ఆవిధంగా అమర్చబడిన పిమ్మట, పారిస్ capitulards (లొంగుబాటుదారులు)[89] ఫ్రెంచి ప్రజలను 8 రోజుల్లోగా, బిస్మార్క్ ఆనల మేరకు, జనవరి 28వ తేదీ కన్వెన్షన్ షరతుల ప్రకారం, యుద్ధం సాగించడమా, శాంతి ఒడంబడిక చేసుకోవడమా అన్న ఏకైక సమస్యా నిర్ణయం కోసం జాతీయ అసెంబ్లీ ఎన్నికల్లో పాల్గొనాల్సిందిగా ఆకస్మికంగా ఆజ్ఞాపించారు. ఆ ఎన్నికలు అసాధారణ పరిస్థితుల క్రింద జరగడంతోపాటు ఆలోచనకు సమయం లేదు. ఫ్రాన్సు జనాభాలో సగం ప్రష్యన్ బయనెట్ల పాలనలో వుంది. మిగిలిన సగంమందిపైనా ప్రభుత్వ కుతంత్రం ద్వారా బిగా సాగుతోంది. రాష్ట్రాల నుండి పారిస్ వేరుచెయ్యబడింది. ఆ పరిస్థితిలో capitulards కుదుర్చుకున్న యుద్ధవిరమణ ఒడంబడిక షరతుల కారణంగా, ఫ్రాన్సుకి à outrance* శాంతి కుదుర్చుకోవడం మినహా గత్యంతరం (ప్రత్యామ్నాయం) లేదన్న సంగతిని, దాన్ని మంజూరు చెయ్యడానికి ఫ్రాన్సుకి చెందిన అత్యధములే అత్యుత్కృ

---

* ఎంత మూల్యం చెల్లించి అయినా సరే. – సం.

ష్టలన్న సంగతినీ ఫ్రెంచి ప్రజలు తమ యింగితజ్ఞానంతో గ్రహించారు. బోర్డోలో "భూస్వాముల సభ" ఆవిర్భావానికిదే కారణం.

అయినప్పటికీ, పాత పాలనయొక్క త్రాగుబోతు విశృంఖల తాండవాల నుంచి భూస్వాముల ప్రతినిధులయొక్క నిజ చారిత్రక ఆచరణను మనం విడదీసి చూడాల్సి వుంటుంది. తామూ, ఆర్లియనిస్టులూ, బూర్జువా రిపబ్లికన్ల బృందమొకటీ, చెదురు బదురుగా కేవలం కొద్ది మంది బోనపార్టిస్టులతో కూడిన బ్రహ్మాండమైన మెజారిటీలో తమదే మిక్కిలి బలమైన గ్రూపు కావడంతో విస్మయం చెందిన వాళ్ళు, తమ చిరకాల వాంఛితమైన, వేల సంవత్సరాల గత చరిత్ర పునరావృతమవుతుందని నిజంగా (అమాయకంగా) విశ్వసించారు. ఫ్రాన్సుపై విదేశీ దాడి పదఘట్టనలు, సామ్రాజ్య పతనం, బోనపార్ట్ నిర్బంధం; అటు తర్వాత తామే అక్కడున్నారు. చరిత్ర చక్రం వెనక్కి తిరిగి 1816 నాటి "chambre introuvable"[50] దగ్గర ఆగింది. విప్లవ వెల్లువకీ, దాని అసహ్యకర చేష్టలకీ వ్యతిరేకంగా ప్రగాఢమూ, ఆవేశపూరితమైన శాపవార్తాలతో, "పారిస్ శిరచ్ఛేదమూ, దాని రాజధాని హోదా తొలగించడం" ద్వారా, "వికేంద్రీకరణ" ద్వారా ప్రభుత్వ పాలనను స్థానిక ప్రభువుల ఎస్టేట్లకు కట్టబెట్టడంతో, మతపరమైన తన ధర్మ పన్నాలతో, రాజకీయాలకు సంబంధించిన బూజుపట్టిన తన పురాతన సిద్ధాంతాలతో, తన జెంటిల్ హోమరీ*తో, తలబిరుసు వాగుడుతో, కండలు కరిగించి శ్రమించే ప్రజాసామాన్యంపట్ల వంశ పారంపర్యంగా వచ్చే ద్వేషంతో, ప్రపంచంపట్ల తన oeil de boeuf** దృక్పథంతో అది అవతరించింది. అప్పటికీ నిజానికి వాళ్ళు, ఉత్పత్తి సాధనాల గుత్త యజమానులుగా, "పార్టీ ఆఫ్ ఆర్డర్"యొక్క జాయింట్ స్టాక్ భాగస్వాములుగా మాత్రమే వ్యవహరించాలి. 1848 నుండి 1851 దాకా, "పార్లమెంటరీ రిపబ్లిక్"యొక్క మధ్యంతర ప్రభుత్వంలో ఒక పక్షంగా మాత్రమే వాళ్ళు ఉండాల్సి వచ్చింది. అయితే వెనక వీళ్లకి బెర్యే, ఫలూ, లరోష్‌జక్లేన్ వంటి విద్యాశిక్షణలు కలిగిన వారు ప్రాతినిధ్యం వహించారు, అందుకు భిన్నంగా యిప్పుడు సామాన్య భూస్వాములను తమకు ప్రాతినిధ్యం వహించేలా ప్రయత్నించాల్సి వచ్చింది. ఆవిధంగా వాళ్ళ అసెంబ్లీకి ఒక భిన్నమైన స్వరాన్నీ, బాణీనీ సమకూర్చారు. ఫ్యూడల్ రంగుల మాటున తమ బూర్జువా యాదార్థ్యాన్ని మరుగుపరచారు. వాళ్ల విడ్డూరమైన అతిశయోక్తులు (ధర్మపన్నాలు)

---

* ప్రభుహోదా. — సం.

** అక్షరాలా — వెలుగు కోసం పెట్టే గుండ్రని కంత; చారిత్రకంగా వెర్సేల్స్‌లోని గుండ్రని అద్దపు కంత కలిగిన ముందు గదికి సంబంధించిన ప్రస్తావన యిది. ఆస్థానికులు సమావేశమై రాజుగారి కోసం వేచియుండే గది. — సం.

తమ బందిపోటు ప్రభుత్వపు ఉదారవాదాన్ని ఘనంగా ప్రదర్శించుకోవడానికి మాత్రమే పని కొస్తాయి. ఎన్నికల మాండేట్ల ద్వారా తమకు లభించిన దాన్ని మించి అధికారాలను అక్రమంగా హస్తగతం చేసుకొనేలా వలలో చిక్కించుకొనబడిన వీళ్ళు, తమ స్వయం కృత పాలకుల తాలిమిధర్మమా అని మాత్రమే బ్రతుకుతారు. 1814–1815 నాటి విదేశీ ఆక్రమణే[139] బూర్జువా నడమంత్రపు సిరిమంతులు తమకు వ్యతిరేకంగా వాడిన మారణాయుధం కావడంతో, వాళ్ళు, చట్టవిరుద్ధ అంధత్వంలో, విదేశీయునికి తమ బూర్జువా శత్రువుయొక్క ఈ అపూర్వమైన లొంగుబాటుకు బాధ్యతను తమ నెత్తిన వేసుకున్నారు. ఎన్నడో వూడ్చిపెట్టబడ్డారని తాము విశ్వసించిన ఘనత వహించిన పుర్ప్సెన్యాక్* అందరూ పునర్దర్శన మివ్వడంతో ఆశ్చర్య చకితులు కావడంతోబాటు అవమానభరితులైన ఫ్రెంచి ప్రజలు, 19వ శతాబ్దపు విప్లవం చెయ్యడంతోబాటు, జంతువులన్నింటినీ వాటి తుది గమ్యమైన కసాయివాని కబేళాకి తోలినట్లే, యీ పశువులను వధ్య స్థానానికి పంపడం ద్వారా 1789 నాటి విప్లవాన్ని కూడా తాము పూర్తి చెయ్యాల్సివుందని గ్రహించారు.

## 5) అంతర్యుద్ధారంభం. మార్చి 18 నాటి విప్లవం. క్లెమాన్ టొమా. లెకాంట్. వెండొమ్ చౌకు సంఘర్షణ

విప్లవ ప్రతీఘాత కుట్రకు కేవలం ఒక ఆవశ్యకతగా, పారిస్ నిరాయుధీకరణ మరింత తాపీగా, మరింత జాగ్రత్తతో కూడిన పద్ధతిలో జరిగియుండవచ్చు. కానైతే, అప్రతిహతమైన సమ్మోహనాత్మక ఆకర్షణలతో కూడిన సత్వర ఆర్థిక ఒప్పందపు షరతు కారణంగా అలస్యం ఎంతమాత్రమూ సాధ్యం కాలేదు. అందుచేత త్యేర్, రాజకీయ కుట్రకి పూనుకోవాల్సి వచ్చింది. **Décembriseur**[63] వినువా నాయకత్వాన అధిక సంఖ్యాక పోలీసు దళాన్నొకదాన్నీ, స్థాయీ సైన్యానికి చెందిన కొన్ని రెజిమెంట్లనీ చీకటి మాటున మాంమార్ట్రర్ కొండపై ఆకస్మిక దాడికి పంపి, అతను అంతర్యుద్ధాన్ని ప్రారంభించాడు. నేషనల్ గార్డు ప్రతిఘటన మూలంగాను, సైనికులతో దాని భ్రాతృత్వ సౌహార్దం మూలంగాను తన దుష్ప్రయత్నం విఫలం కావడంతో, మరుసటి

---

*63వ పేజీలో పాదపీఠిక చూడండి. — సం.

రోజున, పారిస్ గోడలకు అంటించబడిన ఒక కరపత్రంలో, నేషనల్ గార్డులకు వారి ఆయుధాలను విడిచిపెట్టెయ్యాలన్న తన ఉదారమైన నిర్ణయాన్ని త్యేర్ తెలియ జేశాడు. వాటితో వాళ్ళు, "తిరుగుబాటుదారులకు" వ్యతిరేకంగా ప్రభుత్వం చుట్టూ సమీకృతులయ్యేందుకు ఆత్రపడతారని అతను గట్టిగా విశ్వసించాడు. 3,00,000 మంది నేషనల్ గార్డుల్లోనూ కేవలం 300 మంది మాత్రమే అతని విజ్ఞప్తిని పాటించారు. మార్చి 18 నాటి మహత్తర కార్మిక విప్లవం పారిస్‌పై తిరుగులేని ఆధిపత్యాన్ని (పెత్త నాన్ని) సంపాదించింది.

మాంమార్టర్ రక్షణను నిర్వహించి, మార్చి 18న విప్లవ నాయకుడుగా ముందు కొచ్చిన కేంద్ర కమిటీ, తాత్కాలిక ఆవశ్యకంగా ఉద్భవించినది గాని, రహస్య కుట్ర నుండి పుట్టినది గాని కాదు. లొంగుబాటు ద్వారా జాతీయ రక్షణ ప్రభుత్వం ప్రామ్సును నిరాయుధం చేసింది కాని, పారిస్‌ను లొంగదీసేందుకు గాను తన కోసం 40,000 మంది సైనికులతో కూడిన అంగరక్షక దళాన్ని కేటాయించుకుంది. లొంగుబాటు తొలి దినంనుండీ యీ వ్యవహారాన్ని పారిస్ ఓ కంట కనిపెడుతూనే వుంది. నేషనల్ గార్డు తన నిర్మాణాన్ని సంస్కరించుకొని తనపై అంతిమ అజమాయిషీని కేంద్ర కమిటీకి అప్పగించింది. విడివిడి కంపెనీల ప్రతినిధులతో, ఎక్కువ భాగం కార్మికులతో ఏర్ప డిన కమిటీ యిది. దీని బలం ప్రధానంగా శ్రమజీవుల శివార్లలో వుంది. కానీ, త్వరలోనే, పాత బోనపార్టిస్టు దళాలను మినహాయించి, మొత్తం నేషనల్ గార్డు అంతటి ఆమోదాన్నీ కేంద్ర కమిటీ పొందింది. ప్రష్యన్లు సరిగా పారిస్‌లో ప్రవేశించేందుకు ముందు, ప్రష్యన్లు ఆక్రమించుకోబోయే తావుల్లో, capitulards ద్రోహబుద్ధితో విడిచి పెట్టిన ఫిరంగులనూ, మిట్రల్యూజ్‌లనూ మాంమార్టర్, బెల్‌విల్, లా విలిట్‌లకు తరలించేందుకు కేంద్ర కమిటీ చర్యలు తీసుకుంది. ఆవిధంగా, నేషనల్ గార్డు విరాళాలతో సమకూర్చబడిన, జనవరి 28 నాటి కన్వెన్షనులో వారి ప్రైవేటు ఆస్తిగా అధికారికంగా గుర్తింపబడిన, ఆ అధికారం మేరకే ఆయుధాల సాధారణ అప్పగింత నుండి మినహా యింపబడిన ఫిరంగులను అది కాపాడింది. బోర్డోలో జరిగిన జాతీయ అసెంబ్లీ సమా వేశానికీ మార్చి 18వ తేదీకీ మధ్యగల మొత్తం విరామకాల మంతట్లోనూ కేంద్ర కమిటీయే రాజధానియొక్క ప్రజా ప్రభుత్వంగా వ్యవహరించింది. అసెంబ్లీయొక్క రెచ్చగొట్టే ప్రయత్నాలను, కార్యనిర్వాహక శాఖ కఠిన చర్యలను, సేనల విపత్కర కేంద్రీకరణను లెక్కచెయ్యకుండా, రక్షణకు సంబంధించి అది, సుదృఢ వైఖరిని కొనసాగించి తన బలాన్ని రుజువు చేసుకుంది.

సెప్టెంబరు 4వ తేదీ విప్లవం రిపబ్లిక్‌ను పునరుద్ధరించింది. ముట్టడి కాలంలో పట్టుదలతో కూడిన పారిస్ ప్రతిఘటన, రాష్ట్రాల్లో ఆత్మరక్షణ యుద్ధానికి ప్రాతి

పదికగా పనిచేసి, విదేశీ దండయాత్రికుని నుండి రిపబ్లిక్ గుర్తింపును గుంజుకొంది. కానైతే దాని నిజమైన అర్థ లక్ష్యాలు మార్చి 18 నాటి విప్లవం ద్వారా మాత్రమే ఆవిష్కృతమయ్యాయి. ఆ ఆవిష్కరణే ఒక విప్లవం. వేటిపైనైతే పాత ప్రపంచ వ్యవస్థ ఆధారపడి వుందో, ఏవైతే రెండవ సామ్రాజ్యావిర్భావానికి కారణభూతమై, అందుకు బదులుగా దేని సంరక్షకత్వంలోనైతే తాము మాగి క్రుళ్లిపోయాయో, వర్గ పాలనకు సంబంధించిన ఆ సాంఘిక రాజకీయ పరిస్థితులను రద్దుచెయ్యడానికే ఆ విప్లవం జరిగింది. దానితో విద్యుద్ఘాతం తగిలినట్లు యూరప్ జలదరించింది. రాజ్యానికీ, యుద్ధానికీ సంబంధించిన తన యిటీవలి ఉద్వేగ జనక కృత్యాలలో వాస్తవ మేమైనా ఉందా, లేక ఎప్పుడో గడచి పోయినదానికి సంబంధించిన కేవల చిత్త విభ్రమం మాత్రమేనా అని క్షణకాలం అది అనుమానిస్తూ ఉండిపోయింది.

నేషనల్ గార్డు చేతుల్లో వినువా ఓటమి పాలకవర్గాల కుట ఫలితమైన ప్రతీ ఘాత విప్లవానికొక ఎదురు దెబ్బ. అయితే పారిస్ ప్రజలు తమ ఆత్మరక్షణకు సంబంధించిన ఆ సంఘటనను వెన్వెంటనే సాంఘిక విప్లవ తొలి చర్యగా మార్చారు. అక్రమ ఆక్రమణదారుయొక్క గద్దె ఖాళీ అయిన తర్వాత సెప్టెంబరు 4వ తేదీ విప్లవం రిపబ్లిక్‌ను పునరుద్ధరించింది. ముట్టడి కాలంలో పట్టుదలతో కూడిన పారిస్ ప్రతిఘటన, రాష్ట్రాల్లో ఆత్మరక్షణ యుద్ధానికి ప్రాతిపదికగా పనిచేసి, విదేశీ దండయాత్రికుని నుండి ఆ రిపబ్లిక్ గుర్తింపును గుంజుకుంది. కానైతే దాని నిజమైన అర్థ లక్ష్యాలు మార్చి 18న మాత్రమే ఆవిష్కృతమయ్యాయి. వేటిపైనైతే పాత ప్రపంచ వ్యవస్థ ఆధారపడి వుందో, ఏవైతే రెండవ సామ్రాజ్యావిర్భావానికి కారణభూతమై, అందుకు బదులుగా దేని సంరక్షకత్వంలోనైతే తాము మాగి క్రుళ్లిపోయాయో, వర్గ పాలనకు సంబంధించిన ఆ సాంఘిక రాజకీయ పరిస్థితులను రద్దుచెయ్యడానికే ఆ విప్లవం జరిగింది. దానితో విద్యుద్ఘాతం తగిలినట్లు యూరప్ జలదరించింది. రాజ్యానికీ, యుద్ధానికీ సంబంధించిన తన యిటీవలి ఉద్వేగ జనక కృత్యాలలో వాస్తవమేమైనా ఉందా, లేక ఎప్పుడో గడచిపోయినదానికి సంబంధించిన కేవల మారణ హోమానికి సంబంధించిన కలలు మాత్రమేనా అని, క్షణకాలం అది అనుమానిస్తూ ఉండిపోయింది. చిరకాలం అనుభవించిన కరువు జాడలింకా తమ ఆకృతులపై మెసులుతూ వుండగా, ప్రష్యన్ బయనెట్ల కట్టెదుట, పారిస్ కార్మికులు ఒక్క ఉదుటున ప్రగతి కొంకు సాగించిన పోరాటంలో విజయం సాధించారు, వగైరా.

చారిత్రక చొరవకు సంబంధించిన మహనీయ ఉత్సాహంలో, పారిస్ కార్మికుల విప్లవం, విప్లవమూ, అంతకన్న ఎక్కువగా తమ సహజసిద్ధమైన అధికుల ("ఉన్నత వర్గాల")యొక్క ప్రతిఘాత విప్లవమూ అధిక సంఖ్యలో చేసే నేరాల నుండి శ్రామిక వర్గాన్ని దూరంగా ఉంచడాన్ని ప్రతిష్ఠకు సంబంధించిన ఒక అంశంగా చేసుకుంది.

## క్లైమాన్ టొమా. లెకాంట్, వగైరా

మరైతే, ఈ విప్లవాన్ని పంకిలం చేసిన భయంకర "ఘాతుకాల" సంగతేమిటి?

విప్లవానికి దాని శత్రువులు ఆపాదిస్తున్న యీ ఘాతుకాలు, వెర్సేల్స్ బుద్ధి పూర్వకంగా వేస్తున్న అభాండాలు గాని, పెన్నీ కొక పంక్తి చొప్పున రాసే పత్రికా రచయితల బుర్రలోంచి పుట్టుకొచ్చిన భయంకరమైన కథలుగాని కావు, అవి రెండే రెండు వాస్తవాలకు – జనరల్సు లెకాంట్, క్లైమాన్ టొమాల వధకీ, వెండొమ్ చౌకు సంఘర్షణకూ – సంబంధించినవి. వాటిని నాలుగు మాటల్లో స్పష్టంచేస్తాము.

మాంమార్ట్రర్‌పై coup de main*ని రాత్రి చీకటి మాటున (దుర్మార్గ కృత్యం) అమలు జరిపేందుకు ఎన్నుకోబడిన కసాయివాళ్లలో ఒకడైన జనరల్ లెకాంట్, పిగాల్ చౌకులోని నిరాయుధ ప్రజాసమూహంపై కాల్పులు సాగించమని 81వ సైనిక రెజిమెంటుకి చెందిన తన సైనికులకు నాలుగు సార్లు ఆజ్ఞలు ఇచ్చాడు. వారా ఆజ్ఞలను ధిక్కరించేసరికి వారిని తీవ్రంగా తూలనాడాడు. స్త్రీలనూ, బాల బాలికలనూ కాల్చి చంపేందుకు బదులు, అతని సైనికుల్లో కొందరు, మార్చి 18 మధ్యాహ్నం పూట షటో రూజ్ పార్కులో అతనిని అరెస్టు చేసి, కాల్చిచంపారు. కార్మికవర్గ శత్రువుల శిక్షణలో ఫ్రెంచి సైనికుల్లో చిరకాలంగా స్థిరంగా పాతుకుపోయిన అలవాట్లు, యీ సైనికులు పక్షాలు మారిన మరుక్షణమే మారిపోవు కదా. ఆ సైనికులే క్లైమాన్ టొమాను కాల్చి చంపారు.

అసంతృప్తజీవియైన మాజీ క్వార్టర్-మాస్టర్-సార్జెంట్ అయిన "జనరల్" క్లైమాన్ టొమా, లూయీ ఫిలిప్ పాలన చివరి కాలంలో, "రిపబ్లికన్" వార్తాపత్రిక అయిన "National"[56]లో చేరాడు. దానిలో అతనికి రెండు రకాల బాధ్యతలుండేవి. ఒకటి, నిజానికి పెద్ద బాధ్యతంటూలేని ప్రధాన సంపాదకునిగా (బాధ్యతాయుతుడైన gérant) ఉద్యోగం, మరోటి, ఆ జగడాల మారి పత్రిక తరఫున కుస్తీలు పట్టే పస్తాదు పని. "National"కి చెందిన వ్యక్తులు, తాము అధికారంలోకి దూరేందుకు గాను ఫిబ్రవరి విప్లవాన్ని దుర్వినియోగం చేసిన మీదట, సరిగా జూన్ ఊచకోతకు ముందు, తమ పాత క్వార్టర్-మాస్టర్-సార్జెంటుని ఒక "జనరల్"గా మార్చారు. ఆ ఊచకోతకి ఘాతుకమైన కుట్రలు పన్నిన వాళ్లలోను, వాటిని పరమ నిర్దాక్షిణ్యంగా అమలు జరిపిన వాళ్లలోను జూల్ ఫ్రావ్ లాగే, యితగాడూ ఒకడు. తర్వాత యితగాని

---

* ఆకస్మిక దాడి. – సం.

జనరల్ గిరీ అకస్మాత్తుగా ముగిసింది. అప్పుడు కనుమరుగైన అతను, 1870 నవంబరు 1న మళ్లీ పైకొచ్చాడు. రక్షణ ప్రభుత్వం నగర పాలక కార్యాలయంలో పట్టుబడి, బ్లాంకీ, ఫ్లౌరెన్సులకూ, తదితర కార్మికవర్గ ప్రతినిధులకూ తాము అక్రమంగా హస్తగతం చేసుకున్న అధికారాన్ని పారిస్ స్వేచ్ఛగా ఎన్నుకొనే కమ్యూన్‌కి అప్పగిస్తామనీ ప్రమాణపూర్వక వాగ్దానం చేసినది సరిగా అంతకు ముందు రోజుననే. వాళ్ళ తమ వాగ్దానాన్ని భంగపరచారని వేరే చెప్పనక్కర్లేదు, వాళ్ళ లూయీ బోనపార్ట్‌కి చెందిన కార్సికన్ల స్థానంలో ట్రొషూకు చెందిన బ్రెటన్లను తమ చిత్తశుద్ధిని విశ్వసించిన నేరానికి ప్రజలపై ఎగదోలారు. ఒక్క జనరల్ టమిజ్యే మాత్రం, అటువంటి ద్రోహపూరితమైన పనితో తన పేరు ప్రతిష్ఠలు మలినంచేసుకో రాదని, టమిజ్యే నేషనల్ గార్డు చీఫ్ కమాండరు పదవికి వెంటనే రాజీనామా చెయ్యడంతో అతని స్థానంలోకి "జనరల్" క్లెమాన్ టొమా పెట్టబడ్డాడు. అతని పదవీ కాలమంతటిలోనూ, ప్రష్యన్లపైన కాక, పారిస్ నేషనల్ గార్డుపైననే అతను యుద్ధం చేశాడు. నేషనల్ గార్డు సాధారణ సాయుధీకరణను నివారించడానికి సవాలక్ష సాకులు వెతకడంలో, దానిలోని బూర్జువా శక్తులను కార్మిక శక్తుల పైకి ఉసికొల్పడం ద్వారా విచ్ఛిన్నపరచే మార్గాలు వెతకడంలో, ట్రొషూ "పథకానికి" ప్రతికూలురైన ఆఫీసర్లను ఏరి పారెయ్యడంలో, ఏ శ్రామికవర్గ బెటాలియన్ల వీరత్వమైతే, వారి చిరకాల పరమ శత్రువులకు సైతం యిప్పుడు విభ్రాంతి కొలిపిందో, వాటినే భీరుత్వం ప్రదర్శించాయన్న బురదపూసి, రద్దుచెయ్యడంలో అలుపు సొలుపుల్లేని శక్తియుక్తులు ప్రదర్శించాడు. పారిస్ శ్రామికవర్గానికి వ్యక్తిగత శత్రువుగా, 1848 జూన్ ఊచకోతలో తన ప్రాధాన్యాన్ని తిరిగి సంపాదించుకున్నందుకు క్లెమాన్ టొమా మహా గర్వించాడు. మార్చి 18కి కొద్ది రోజుల ముందే, "పారిస్ canaille*కి చెందిన la fine fleur [మేలి భాగము]ను పాతమార్చడానికి" తన సొంత పథక మొకదాన్ని, యుద్ధ మంత్రి లెఫ్లోకి అతను సమర్పించాడు. జూన్ భూతాలచేత ఆవహింపబడ్డాడేమో అన్నట్లు, వినువా తీవ్ర పరాజయం పొందిన తర్వాత, కార్యరంగంలో యితగాడు ఔత్సాహిక గూఢచారి హోదా వహించకుండా ఉండలేకపోయాడు.

సైనికుల మహోద్రిక్త మూకన్యాయం నుండి ఈ యిరువురు నేరస్తులనూ — లెకాంట్, క్లెమాన్ టొమాలను — కాపాడేందుకు కేంద్ర కమిటీ వృథా ప్రయత్నం చేసింది. యువరాణి అలెగ్జాండ్రా తన లండన్ ప్రవేశ దినాన తొక్కిసలాటలో నలిగి పోయిన ప్రజల చావుకెంత బాధ్యురాలో, లెకాంట్, క్లెమాన్ టొమాలు ప్రజలచేత చంపబడటానికి కేంద్ర కమిటీ, పారిస్ కార్మికులూ అంతే బాధ్యులు. జూల్ ఫ్రావ్,

---

* మూక. — సం.

తన కృతక విచార ప్రదర్శనతో, పారిస్‌ను, హంతకుల స్థావరమంటూ దుమ్మెత్తి పోశాడు. భూస్వాముల సభ మధ్యమధ్య "ఉచితజ్ఞత" ప్రదర్శించింది. ప్రజల రక్తాన్ని చిందించ డానికి ఒక సాకుగా తప్ప, వీళ్లు మరెన్నడూ తమ మొసలి కన్నీళ్లను కార్చరు. గౌరవ నీయుల కళేబరాలను అంతర్యుద్ధపు ఆయుధాలుగా వాడటమన్నది, పార్టీ ఆఫ్ ఆర్డరు కెప్పుడూ యిష్టమైన కుయుక్తిగా ఉంటూ వచ్చింది. 1848లో జూన్ తిరుగుబాటు దార్లచేత పారిస్ ఆర్చిబిషప్ హత్య చెయ్యబడ్డాడంటూ యూరప్ అంతటా హాహాకారాలు చెలరేగాయి. అయితే, ఆ ఘటనకు ప్రత్యక్ష సాక్షి అయిన ఆర్చిబిషప్‌యొక్క వికార్ జక్మే కవేన్యాక్ సైనికులచేతనే ఆర్చిబిషప్ కాల్చి చంపబడ్డాడని సాక్ష్య మిచ్చినా, అది నిజమని పూర్తిగా వాళ్లకి తెలిసినా కూడా, వాళ్ళు హాహాకారాలు కొనసాగించారు! త్యేర్‌కి ప్రస్తుత పారిస్ ఆర్చిబిషప్* (యితగాడు అమరవీరుని లక్షణం కలిగిన వాడేమీ కాదు) రాసిన లేఖల్లో, తను ముందు ముందు హతమార్చబడితే, తన వెర్సేల్స్ మిత్రులు, ఆ వాంఛనీయ బాధ్యతను కమ్యూన్‌పై పెట్టవచ్చునన్న తహతహతో వున్నట్లు కవి పెట్టిన జాడ కనిపిస్తుంది! అయితే, "హంతకులు" అంటూ చేసిన గొడవతో ప్రయోజనం తీరిపోయినప్పుడు, జాతీయ అసెంబ్లీ వేదిక పైనుంచి, ఆ "హత్య" "బహు కొద్ది మంది" అనామక వ్యక్తుల వ్యక్తిగత చర్య అంటూ త్యేర్ చల్లగా తేల్చిపారేశాడు.

"వ్యవస్థ సంరక్షకులు," పారిస్‌కి చెందిన అభివృద్ధి నిరోధకులు, ప్రజా విజ యాన్ని తమపట్ల పగసాధింపుకు చిహ్నంగా తలుచుకొని కంపించుతూ, ప్రజల ఓటమిని తాము సంప్రదాయ సిద్ధంగా జరుపుకొనే పద్ధతుల్లో కాకుండా, అందుకు భిన్నంగా విద్యూరంగా వ్యవహారం జరగడంతో పరమాశ్చర్యం పొందారు. పోలీసులను పైతం నిరాయుధం చేసి, ఖైదుల్లో పెట్టకుండా, వెర్సేల్స్‌కి సురక్షితంగా పారిపోవడానికి వీలుగా వాళ్లకి పారిస్ కవాటాలు బార్లా తెరవబడ్డాయి. "వ్యవస్థ సంరక్షకులు" నిరపా యంగా విడిచి పెట్టబడటమే కాకుండా, వాళ్ళు తిరిగి సంఘటితులై, పారిస్ నడి బొడ్డులోనే వున్న కీలకమైన స్థావరాలను నిరాటంకంగా ఆక్రమించుకోవడానికి పైతం వాళ్లకి అవకాశమివ్వబడింది. కేంద్ర కమిటీ ప్రదర్శించిన యీ మెతకతనానికి, సాయుధ కార్మికుల యీ ఔదార్యానికి బుద్ధిపూర్వకమైన బలహీనతకు లక్షణాలుగా వాళ్ళు వక్ర భాష్యం చెప్పారు. అందుకే పార్టీ ఆఫ్ ఆర్డర్, నిరాయుధ ప్రదర్శన మాటున, నాలుగు రోజుల ముందు వినువా తన ఫిరంగులతోనూ, మిట్రల్యూజ్‌లతోనూ సాధించజాలని దాన్ని సాధించాలని, పథకమొకటి వేసి, దాన్ని అమలు జరపాలని ప్రయత్నించింది. సంపన్న విలాస ప్రాంతాల నుండి "పెద్ద మనుషుల" దొమ్మి మూక ఒకటి బయ

* జార్జెస్ దార్బువా. – సం.

చేరింది. దానిలో సంపన్న రంగేళీ యువకులున్నారు. గుంపుకి అగ్రభాగాన, సామ్రాజ్యానికి చెందిన రోసిపోయిన — హెక్కరెన్, క్వ్యేట్లగాన్, అన్రి డి పేన్ వగైరా భ్రష్టాచారులున్నారు. "హంతకులు నశించాలి! కేంద్ర కమిటీ నశించాలి! జాతీయ అసెంబ్లీ వర్ధిల్లాలి!" అని నినాదాలిచ్చుకుంటూ, త్రోవలో తమ కెదురైన చెదరియున్న నేషనల్ గార్డ్సుకు చెందిన కాపలాదారులను హింసించి, నిరాయుధులను చేస్తూ యీ మనుషులు ముందుకు సాగారు. చివరకు బింబిలాడుతూ వెండోమ్ చౌకుకి చేరుకున్నప్పుడు, బండ బూతులు తిడుతూ, నేషనల్ గార్డులను వారి కేంద్ర స్థావరం నుండి తొలగించడానికీ, బలిమిని వాళ్ల శ్రేణులను చెదరగొట్టడానికీ వాళ్ళు ప్రయత్నించారు. వాళ్ల పిస్టల్ కాల్పులకు బదులుగా, మామూలుగా ముమ్మారు జరిగే sommations* (ఇంగ్లీష్ దొమ్మీ చట్టానికి ఫ్రెంచిలో సమానమైన పదం)[61] వర్తింపచబడ్డాయి కాని, హింసాత్మక ప్రదర్శకులపై అవి పనిచెయ్యలేదు. అప్పుడిక నేషనల్ గార్డు జనరల్** కాల్పులకు ఆజ్ఞ యివ్వడంతో యీ అల్లరి మూక చెల్లాచెదరుగా పారిపోయింది. ఇద్దరు నేషనల్ గార్డులు ప్రాణాలు కోల్పోయారు. ఎనిమిది మంది ప్రమాదకరంగా గాయపడ్డారు. దొమ్మీ మూక (పారుబోతులు) ఏ వీధులగుండా పారిపోయారో వాటినిండా రివాల్వర్లు, బాకులు, కర్ర కత్తులు చెల్లాచెదరుగా పడివుండటాన్నిబట్టి వాళ్ల "శాంతియుత" ప్రదర్శనయొక్క "నిరాయుధ" స్వభావం స్పష్టంగా రుజువైంది. రోమ్‌పై ఫ్రెంచి సేనలు జరిపిన దుర్మార్గపు దాడికి[47] నిరసనగా, 1849 జూన్ 13న పారిస్ నేషనల్ గార్డు నిజంగా శాంతియుతమైన ప్రదర్శన జరిపినప్పుడు, "పార్టీ ఆఫ్ ఆర్డర్" జనరల్ అయిన షంగార్నీ, వాళ్ల శ్రేణులను కత్తులతో నరికించాడు, అశ్విక సైన్యంచేత తొక్కించాడు, కాల్పించి చంపించాడు, వెన్వెంటనే ముట్టడి స్థితి ప్రకటించబడింది, కొత్త అరెస్టులు, కొత్త ప్రవాసశిక్షలు — యిలా మళ్లీ దౌర్జన్యం తాండవించింది. కాని "అధోశ్రేణి జనం" అలాంటి సందర్భాలలో మరొక విధంగా వ్యవహరిస్తారు. మార్చి 22 నాటి పారుబోతులను వాళ్ళు వెన్నంటి తరమనూ లేదు, పారిపోతూండగా వాళ్లను చిత్రహింసలూ పెట్టలేదు, తర్వాత మేజిస్ట్రేటు (juge d'instruction) చేత వాళ్లకు శిక్షలు విధింపబడనూ లేదు. కాగా రెండే రెండు రోజుల్లో వాళ్ళు అడ్మిరల్ సెస్సె నాయకత్వంలో "సాయుధ" ప్రదర్శనకు బలాన్ని కూడదీసుకోగలిగారు. తమ యీ రెండవ ప్రయత్నం సైతం విస్పష్టంగా విఫలం కావడంతో మిగిలిన పారిస్ పౌరులందరిలాగే, వాళ్ళు, కమ్యూన్‌కు ఎన్నికయ్యేందుకు బేలట్‌బాక్సు ద్వారా

* చెదరి పొమ్మంటూ ముమ్మారు చేసే హెచ్చరికలు. — సం.

** బెర్జెరే. — సం.

తమ బలాన్ని పరీక్షించుకోడానికి అనుమతింపబడ్డారు. ఈ రక్తరహిత పోరాటంలో ఓడి పోయాక చివరకు వాళ్లు, నిరాటంకంగా, నిరపాయంగా, తమతోబాటు వేశ్యలనూ, బిచ్చగాళ్లనూ, కొంపాగోడూలేని సోమరులనూ, రాజధానికి చెందిన తదితర ప్రమాదకర బాపతునీ వెంటపెట్టుకొని, పారిస్‌ని విడిచిపెట్టి పోయారు. మార్చి 22న "నిరాయు ధులైన పౌరుల" హత్యాకాండ అన్నదొక కట్టుకథ. దాన్ని వర్ణించడానికి త్యేరూ, అతని "భూస్వాముల సభా" సైతం ఎన్నడూ సాహసించ లేదు. దీనికి సంబంధించిన దుష్ప్ర చార బాధ్యతను యూరపియన్ కిరాయి పత్రికా రచయితలకే కేటాయించారు.

ఈ "వ్యవస్థ సంరక్షకుల" పట్ల, మార్చి 18కీ, వాళ్ల నిర్గమనానికీ మధ్యకాలంలో, కేంద్ర కమిటీ, పారిస్ కార్మికుల ప్రవర్తనలో దోషమేమైనా ఉందంటే, అది వాళ్ల పట్ల (ప్రదర్శింపబడిన మితిమీరిన బలహీనత అనిపించేటంతటి) ఆత్మసంయమనం తప్ప వేరేమీ కాదు.

---

ఇప్పుడిక నాణానికి రెండో పక్క చూడండి!

మాంమార్త్‌ర్‌పై రాత్రిపూట జరిపిన తమ ఆకస్మిక దాడి విఫలమైన తర్వాత, ఏప్రిల్ మొదట్లో, పార్టీ ఆఫ్ ఆర్డర్, పారిస్‌పై క్రమబద్ధమైన తన దాడిని ప్రారంభించింది. డిసెంబరు పద్ధతుల్లో అంతర్యుద్ధానికి ప్రారంభం చేసినందుకూ, పట్టుబడిన స్థాయీ సైన్యపు సైనికులను నిర్దాక్షిణ్యంగా ఊచకోత కోసినందుకూ, మన సాహసిక మిత్రుడు ద్యువాల్‌ను హీనంగా హత్య చేసినందుకూ గాను, త్యేర్‌చేత పారుబోతు వినువా గ్రాండ్ క్రాస్ ఆఫ్ ది లీజియన్ ఆఫ్ ఆనర్ బహూకరింపబడ్డాడు! రెండవ సామ్రాజ్యపు త్రాగుబోతు తాండవాల్లో సిగ్గుమాలిన తన ఛద్మవేషాలకు దుష్ప్రసిద్ధి పొందిన ఆ స్త్రీకి ప్రియుడైన గాలిఫే, ఒక అధికారిక కరపత్రంలో పారిస్ నేషనల్ గార్డులను వారి లెఫ్టినెంట్, కెప్టెన్లతోబాటు, ఆకస్మిక మోసపూరిత దాడిలో పిరికిగా హత్య చేసినందుకు ఘనంగా గొప్పలు చెప్పుకున్నాడు. పరాక్రమౌదార్యాది సద్గుణ గరిష్ఠుడైన ఫ్లొరెన్సును కసాయివానిలా నరికిన ఘనకార్యానికి డెమరే అనే పోలీసుని సత్కరించారు. ఫ్లొరెన్సు మృతికి సంబంధించిన "ప్రోత్సాహకరమైన" వివరాలు త్యేర్‌చేత విజయోత్సాహంతో అసెంబ్లీకి అందజెయ్యబడ్డాయి. తైమూర్ తామర్లేన్ పాత్ర నిర్వహించిన ఒక అంగుష్ఠ మాత్రునియొక్క భయానక వికృత వికటాట్టహాసంలాగ, త్యేర్, తన నైచ్యానికి వ్యతి రేకంగా తిరగబడిన వారికి, నాగరిక యుద్ధకాండకు సంబంధించిన సకల హక్కులనూ, ఆచారాలనూ, ప్రాథమిక చికిత్స చేసే కేంద్రాల అముల్లంఘనీయతా హక్కును సైతం, తిరస్కరించాడు.

ఏప్రిల్ 7న కమ్యూన్ జారీచేసిన దమనకాండకు సంబంధించిన ఉత్తరువులో, వెర్సేల్స్ బందిపోట్లు నరమాంసభక్షకులతో సమానంగా చేస్తున్న క్రూర కృత్యాలకు వ్యతిరేకంగా పారిస్‌ను కాపాడటం, కంటికి కన్ను, పంటికి పన్నుగా దెబ్బకి దెబ్బ తియ్యాల్సిందిగా డిమాండు చెయ్యడం తన విధియనీ, వెర్సేల్స్ ఖైదీల పట్ల దారుణ ప్రవర్తన — వీళ్లని గురించే త్యేర్ తన సమాచార పత్రాల్లో ఒక దానిలో

> "హీనమైన ప్రజాస్వామ్యానికి చెందిన యింతకన్న హీనమైన ముఖాకృతులు నిజాయితీపరుల వ్యధిత దృక్కులకు మరెన్నడూ ఎదురై యుండవు" అని అభివర్ణించాడు — నిలిచిపోలేదు గాని, ఖైదీల మరణశిక్ష అమలు వాయిదా వెయ్యబడింది.

త్యేరూ, అతని జనరల్సూ — డిసెంబర్ కుట్ర వీరులు — ఎప్పుడైతే కమ్యూన్ జారీచేసిన ఉత్తరువు పట్ల బెదరింపు మాత్రమేనని గ్రహించారో, పారిస్‌లో నేషనల్ గార్డుల మారువేషాల్లో పట్టుబడ్డ తమ సాయుధ సైనిక గూఢచారులూ, చివరకు ప్రేలుడు బాంబులతో బాటు పట్టుబడిన తమ పోలీసులూ సైతం విడిచిపెట్టెయ్యబడ్డారని గ్రహించారో ఆ వెంటనే పాత పాలన మొత్తంగా విరుచుకు పడింది, ఈ నాటికీ తన దాడిని కొనసాగిస్తోంది. తమ కన్న అధిక సంఖ్యాక బలంలో వున్న అశ్విక సైనికుల దళానికి బెల్ ఎపిన్ వద్ద నేషనల్ గార్డులు లొంగిపోయినప్పుడు, గుర్రంపై అధిష్ఠించిన ఆ దళం కెప్టెనుచేత, వారిలో ఒకరి తర్వాత మరొకరు కాల్చిచంపబడ్డారు. పారిస్ సైనికులూ, నేషనల్ గార్డులూ పరుగెత్తుకెళ్లి తల దాచుకున్న యిళ్లను సాయుధ పోలీసులు చుట్టుముట్టి, పెట్రోలుతో ముంచెత్తి, తర్వాత వాటికి నిప్పంటించారు. నల్లగా కాలి బొగ్గయిపోయిన శవాలను పారిస్ ప్రథమ చికిత్స దళాలు తీసుకొచ్చాయి. ములెన్ సాకే దుర్గభాగంలో నిద్రిస్తున్న నేషనల్ గార్డులు ద్రోహ కారణంగా ఆకస్మిక దాడికి గురై బయనెట్లతో కుమ్మబడ్డారు (తమ పక్కలపై నిద్రిస్తున్న కమ్యూనార్డులు ఆకస్మిక దాడికి గురయ్యారు), క్లమార్ ఊచకోత (గుళ్ల వర్షాలు), సైనిక యూనిఫారం ధరించిన ఖైదీలు ఎక్కడికక్కడ కాల్చివెయ్యబడ్డారు, ఈ ఘనకార్యాలన్నీ త్యేర్ బులెటిన్లలో నిర్లక్ష్యంగా పేర్కొనబడ్డాయి. బానిస యజమానుల యీ తిరుగుబాటులో యివి కేవలం కొన్ని ఘటనలు మాత్రమే! కానైతే, వెర్సేల్స్ కుట్రదారులచేత, పరమ నీచమైన వర్గ ప్రయోజనాల దృష్ట్యా, బిస్మార్క్ ప్రాపకంలో, తన సైనికుల కళ్లెదుట, పారిస్‌ని బాంబార్డు చెయ్యడంతోబాటు ఫ్రాన్సు శిథిలాలమధ్య రెచ్చగొట్ట బడిన ఈ అంతర్యుద్ధం దృష్ట్యా, ఏవేవో విడివిడి క్రూరకృత్యాలకు సంబంధించిన

వాస్తవాలను పేర్కొనడం పరిహాసాస్పదమైన విషయం కాదూ! వీటి విషయమై, తన బులెటిన్లలో థ్యేర్ నిర్లక్ష్య ధోరణి అంతగా సున్నితత్వం లేని "Times" పత్రికకు సైతం విభ్రాంతి కొలిపింది. అయితే యిదంతా కూడా, స్పానిష్ వాళ్ళు చెప్పినట్లు "క్రమబద్ధమైనదే." తమ విశేష హక్కులకు ప్రమాదం ఏర్పడినప్పుడు ఉత్పత్తి చేసే వర్గాలకు వ్యతిరేకంగా పాలకవర్గాలు చేసే పోరాటాల నిండా యిటువంటి ఘాతుకాలు కొల్లలుగా ఉంటాయి. పీడితుల పట్ల ఏ ఒక్కరూ అంతటి అతిశయ మానవత్వాన్ని ప్రదర్శించని మాట నిజమే అయినా, యింతటి నైచ్యాన్ని ప్రదర్శించే వాళ్ళు సైతం బహు కొద్ది మందే.... సామాన్యుని పట్ల వాడితే, అది ఏ ఆయుధమైనా సరైనదేనన్న మధ్యయుగాల పాత సూత్రానికే థ్యేర్ సదా కట్టుబడివున్నాడు.

ప్రిఫెక్టుల నుద్దేశించి థ్యేర్, "L'Assemblée siège paisiblement"* అని రాశాడు.

## బెల్ ఎపిన్ సంఘటన

విల్‌జాయిఫ్ సమీపంలోని బెల్ ఎపిన్ దగ్గర జరిగిన సంఘటన యిదీ: ఏప్రిల్ 25న నలుగురు నేషనల్ గార్డులు ఒక అశ్విక సైనిక దళంచేత చుట్టుముట్టబడ్డారు. అశ్విక సైనికులు వాళ్ళని లొంగిపొమ్మని, ఆయుధాలు క్రింద పెట్టమని ఆజ్ఞాపించారు. ప్రతిఘటించే శక్తిలేక వాళ్ళు లొంగిపోయారు, అశ్విక సైనికులు వాళ్ళకి హాని కలిగించకుండా వదిలేశారు. కొంత సేపు గడిచాక, వాళ్ళ కెప్టెను, గాలిఫేకి తగిన ఆఫీసరు, గుర్రంమీద వేగంగా దౌడుతీస్తూ వచ్చి ఖైదీలను ఒకరి తర్వాత ఒకరిని రివాల్వరుతో టపటప కాల్చేసి, తర్వాత తన దళంతోపాటు గుర్రంపై టకటక మంటూ వెళ్ళిపోయాడు. గార్డుల్లో ముగ్గురు చనిపోయి వున్నారు, షెఫేర్ అనే పేరుగల ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడి కూడా కొనప్రాణంతో బ్రతికి వున్నాడు. తర్వాత అతడిని బిసేటర్ ఆస్పత్రికి తీసుకెళ్ళారు. అతని మరణ వాఙ్మూలం తీసుకోవడానికి కమ్యూన్ అక్కడికొక కమిషన్‌ని పంపి, దాన్నది తన నివేదికలో ప్రచురించింది. ఆ నివేదిక విషయమై అసెంబ్లీలో పారిస్ సభ్యుడొకడు యుద్ధమంత్రిని ప్రశ్నించినప్పుడు, "భూస్వాముల సభ" ప్రతినిధులు గట్టిగా అరచి అతని స్వరం వినిపించకుండా ముంచెత్తి, మంత్రిని జవాబివ్వకుండా ఆటంక పరచారు. తమ "ఘనమైన" సైన్యానికి అవమానం కదా మరి — ఏమిటనుకున్నారు, హత్య చెయ్యడం కాదు, దాన్ని గురించి మాట్లాడటం.

---

* "అసెంబ్లీ శాంతియుత వాతావరణంలో సమావేశ మవుతోంది." — సం.

అంతర్యుద్ధానికి సంబంధించిన ఘాతుకాల విషయంలో అసెంబ్లీ ఎంత ప్రశాంత చిత్తంతో భరిస్తుందో అన్నది, తన ప్రిఫెక్టుల నుద్దేశించి త్యేర్ విడుదల చేసిన ఒక బులెటిన్‌లో చెప్పబడింది: "L'Assemblée siège paisiblement"* (ఒలివ్యే లాగే coueur léger** కలిగివుంది), కార్యనిర్వాహకాధికార విభాగం, పెరోలుపై తాత్కాలిక విడుదల సర్టిఫికెట్లు పొందిన తన నేరస్తులతో, త్యేరూ, జర్మన్ ప్రభువులూ చేసిన విందుల్లో తిండిపోతుతనంలో తమ పరాక్రమాన్ని ప్రదర్శించి, లెకొంట్, క్లెమాన్ టొమాల ప్రేతాల కారణంగా సైతం తమ తిండిపుష్టి తగ్గలేదని రుజావుచేసింది.

## 6) కమ్యూన్

సెడాన్ తర్వాత లియోన్, మార్సేల్స్, టులూజల కార్మికులు కమ్యూన్‌ను ప్రకటించారు.[129] దాన్ని నాశనం చెయ్యడానికి గంబెట్టా శాయశక్తులా ప్రయత్నించాడు. పారిస్ ముట్టడి కాలంలో మరలమరల కార్మికుల తిరుగుబాట్లు జరిగాయి. వాటిని లూయీ బోనపార్ట్ కార్సికన్లతో సరిగ్గా బ్రెటాన్ల సహాయంతో, కృత్రిమమైన సాకులతో, మరలమరల అణచివేశారు. ఆ తిరుగుబాట్లు అక్రమ ఆక్రమణదారుల ప్రభుత్వం స్థానంలో కమ్యూన్‌ని పెట్టాలనే ప్రయత్నాలు. శ్రామికవర్గ బుద్ధికుశాగ్రత చేత నెమ్మదిగా నిర్మించబడిన కమ్యూనే సెప్టెంబరు 4వ తేదీ విప్లవ నిజ రహస్యం. కాగా, ప్రతిఘాత విప్లవం చిత్తుగా ఓడిపోయిన తర్వాత, మార్చి 18 శుభోదయానవే, ప్రష్యన్ సామ్రాజ్యానికి సంబంధించిన కలల మత్తులో వున్న యూరప్, పారిస్‌లో "Vive la Commune!"*** అన్న మేఘ గర్జనవంటి కేకలతో మేల్కొంది!

బూర్జువా మనస్సులను యింతగా కల్లోలితం చేసే ఆ కమ్యూన్, ఆ బ్రహ్మరాక్షసి ఏమిటి?

మిక్కిలి సరళంగా చెప్పుకోవాలంటే, కార్మికవర్గం తనకు పాంఘికంగా బలమైన స్థావరాలైన, పారిస్‌లోను, తదితర పారిశ్రామిక కేంద్రాల్లోను రాజకీయాధికారాన్ని ఏ రూపంలో వహిస్తుందో ఆ రాజకీయాధికార రూపమే కమ్యూన్.

---

* "అసెంబ్లీ శాంతియుత వాతావరణంలో సమావేశమవుతోంది." — సం.

** కౌన్సిలు అధ్యక్షుడు ఒలివ్యే మాటలపై ప్రసక్తి — 129వ పేజీ చూడండి. — సం.

*** "కమ్యూన్ వర్ధిల్లాలి!" — సం.

మార్చి 20 నాటి తన ప్రణాళికలో కేంద్ర కమిటీ యిలా అంది:

"పారిస్ శ్రామికులు, పాలకవర్గాల వైఫల్యాలను, విద్రోహాలను చూసి, సామాజిక వ్యవహారాల నిర్దేశకత్వాన్ని తమ చేతుల్లోకి తీసుకొని, పరిస్థితిని కాపాడాల్సిన క్షణం ఆసన్నమైందని గ్రహించారు.... రాజకీయాధికారాన్ని (రాజ్యాధికారం) హస్తగతం చేసుకొని, తమ భవితవ్యాల కర్తృత్వాన్ని తామే వహించడమన్నది తమ సగర్వమైన విధియనీ తిరుగులేని తమ హక్కనీ వారు గ్రహించారు."

అయితే, పాలకవర్గాలూ, వాటిలోని విభిన్న ప్రత్యర్థి బృందాలూ, వాటి వాటి విజయ తరుణాల్లో చేసినట్లు, శ్రామికవర్గం కేవలం ఉన్న రాజ్యయంత్రాన్ని పట్టుకొని, సర్వసిద్ధంగా వున్న ఈ సాధనాన్ని తన సొంత ప్రయోజనాల కోసం వాడుకోజాలదు. రాజకీయాధికారాన్ని నిలుపుకోవడానికి మొట్టమొదటి షరతు, సంప్రదాయ సిద్ధమైన రాజ్యయంత్రాంగాన్ని మార్చివెయ్యడం, వర్గపాలన సాధనంగా దాన్ని నిర్మూలించడమే. స్థాయీ సైన్యం, క్రమానుగత (బుర్యాక్రసీ) అధికార వర్గం, విధేయమైన పోలీసు శాఖ, మతగురువులు, దాస్యబుద్ధి కలిగిన మేజిస్ట్రేట్లతో కూడిన సర్వవ్యాప్తమైన వలలో, నిజమైన సామాజిక యతాంగాన్ని కొండచిలువలా చుట్టపెట్టే ఆ పెద్ద ప్రభుత్వ యంత్రాంగం, మొట్టమొదటి సారిగా, నిరంకుశ రాజరికపు రోజుల్లో, ఫ్యూడలిజం నుండి విడివడేందుకు, తను చేసే పోరాటంలో కొత్తగా అవతరించిన బూర్జువా సమాజానికి, ఒక ఆయుధంగా రూపొందించబడింది. మొదటి ఫ్రెంచి విప్లవం, ఆధునిక బూర్జువా సమాజం స్వేచ్ఛగా అభివృద్ధి చెందేందుకు పూర్తి అవకాశం కల్పించాల్సిన కర్తవ్యంతో, ఫ్యూడలిజానికి గల స్థానిక, భూసంబంధ, పట్టణవాస, రాష్ట్రీయ స్థావరా లన్నింటినీ తుడిచిపెట్టెయ్యాల్సి వచ్చింది. అదే విధంగా, అదే కాలంలో, క్రమబద్ధమైన, అంచెలవారీ శ్రమవిభజన మాత్రం మేరకు సర్వవ్యాప్తమైన అంగాలుగా విభజితమైన కేంద్రీకృత రాజ్యాధికార ఉపరినిర్మాణానికి సాంఘిక భూమికను తయారుచేసింది.

కానైతే, కార్మికవర్గం, తయారై సిద్ధంగా వున్న రాజ్యయంత్రాంగాన్ని కేవలం యిలా పట్టుకొని, అలా తన సొంత ప్రయోజనాల కోసం వాడుకోజాలదు. దానిని బానిసగా ఉంచే రాజకీయ సాధనం, దాని విముక్తికి రాజకీయ సాధనంగా పని చెయ్యజాలదు.

ఆధునిక బూర్జువా రాజ్యం పార్లమెంటు, ప్రభుత్వం అనే రెండు ముఖ్య అంగాలుగా రూపు దాల్చింది. పార్లమెంటరీ సర్వశక్తిమత్వం, 1848 నుండి 1851

వరకు, పార్టీ ఆఫ్ ఆర్డర్[48] రిపబ్లిక్ కాలంలో, తనకే ప్రతికూలమైన రెండవ సామ్రాజ్యానికీ, యూరప్ ఖండానికి చెందిన అధిక సంఖ్యాక సైనికవాద పెద్ద రాజ్యాల్లో యీనాటికీ వికసించే పాలన ఐన పార్లమెంటుకి కేవలం అపహాస్యం మాత్రమే అయిన సామ్రాజ్య పాలనకూ జన్మ నిచ్చింది. మొదటి చూపులకు, ఒకే మాదిరిగా అన్ని వర్గాలకూ అతీతంగా, అన్ని వర్గాలనూ ఒకే మాదిరిగా అణచివడుతూన్నట్లు కనిపిస్తూ, సమాజంపైననే నియంతృత్వాధికారాన్ని హస్తగతం చేసుకున్న ప్రభుత్వ వ్యవస్థ, నిజానికి, కనీసం యూరప్ ఖండంలోనైనా, దోపిడిదారీ వర్గం ఉత్పత్తిచేసే వర్గంపై పెత్తనం సాగించేందుకు వీలుకలిగించే ఏకైక రాజ్య రూపంగా తయారైంది. రెండవ సామ్రాజ్యంచేత రూపొందించబడిన రీతిలో ప్రభుత్వ యంత్రాంగమే తప్ప, వెర్సేల్స్ వింకా పట్టుకు పీడిస్తున్న గత ఫ్రెంచి పార్లమెంటులన్నిటి ప్రేతాల సముదాయానికి నిజానికి మరొక బలమేమీ లేదు.

బ్యురాక్రసీ, పోలీసులు, స్థాయీ సైన్యం, మతగురువులూ, న్యాయాధికారి వర్గంతో కూడిన సర్వవ్యాప్తమైన వలలో సంఘ శరీరాన్ని కొండచిలువలా పెనవైచుకొన్న బ్రహ్మాండమైన ప్రభుత్వ పరభాగ్యోప జీవియొక్క పుట్టుక తిరుగులేని రాజరికపు రోజుల్లో జరిగింది. అప్పుడే ఉద్భవిస్తున్న బూర్జువా సమాజానికి, ఫ్యూడలిజం నుండి విముక్తి కోసం అది జరిపే పోరాటంలో, యీ కేంద్రీకృత రాజ్యాధికారం మహా శక్తివంతమైన ఆయుధంగా ఉపయోగపడాల్సి వుంది. ఫ్యూడల్ ప్రభువుల, స్థానిక, పట్టణవాస, రాష్ట్రీయ ప్రత్యేక సౌకర్యాలనే మధ్యయుగాలనాటి చెత్తనంతటినీ తుడిచిపెట్టెయ్యాల్సిన కర్తవ్యం కలిగిన **18వ శతాబ్దం నాటి ఫ్రెంచి విప్లవానికి అదే కాలంలో దానితోబాటు,** కేంద్రీకృత రాజ్యాధికార సంపూర్ణాభివృద్ధికి గల తుది అవరోధాలకు సంబంధించిన సాంఘిక భూమికను, క్రమబద్ధమైన పారంపరిక శ్రమవిభజనకు సంబంధించిన మాత్రం మేరకు తయారు చెయ్యబడిన సార్వత్రిక అంగాలతోబాటు తుడిచిపెట్టక తప్పలేదు. అటువంటి అది, ఆధునికమైన ఫ్రాన్సుకు వ్యతిరేకంగా పాత అర్ధ ఫ్యూడల్ యూరప్ జరిపిన సంయుక్త యుద్ధాల ఫలితంగానే ఉద్భవించిన మొదటి సామ్రాజ్యం క్రిందనే తొలి ఊపిరి పీల్చుకొంది. తదుపరి పార్లమెంటరీ పాలనలైన పునరుద్ధరణ, జూలై రాజరికం, పార్టీ ఆఫ్ ఆర్డర్ రిపబ్లిక్‌ల కాలంలో, ఆ రాజ్యయంత్రాంగపు అంతిమ యాజమాన్యం, దానితో బాటే అనివార్యంగా ఉండే పదవికి, అన్యాయార్జనకు, ప్రాపకానికి సంబంధించిన వ్యామోహాలతో, పాలకవర్గాలకు చెందిన ప్రత్యర్థి కూటాల మధ్య వివాద కారణం అయింది. అంతేకాకుండా అదే స్థాయిలో, ఆధునిక సమాజపు ఆర్థిక ప్రగతి కార్మికవర్గ సంఖ్యను పెంపొందించింది, దాని దైన్యాలను యినుమడింపజేసింది, దాని ప్రతిఘటనను సంఘటితం చేసింది, దాని విమోచన ధోరణులను అభివృద్ధి చేసింది. ఒక్క మాటలో

చెప్పాలంటే, వర్గాల మధ్య ఆధునిక పోరాటం, శ్రమకీ పెట్టుబడికీ మధ్య పోరాటం, ఒక ఆకృతినీ రూపాన్నీ సంతరించుకుంది. రాజ్యాధికార స్వరూప స్వభావాలు ప్రస్ఫుటమైన మార్పులు పొందాయి. రాజ్యాధికారమన్న దెప్పుడూ కూడా వ్యవస్థను సంరక్షించడాన్ని, అంటే, ప్రస్తుతమున్న సామాజిక వ్యవస్థ కొనసాగింపునూ, కాగా, దోపిడివర్గం ఉత్పత్తి చేసే వర్గాన్ని లొంగదియ్యడాన్నీ, దోపిడి చేసుకోవడాన్నీ కొనసాగించే అధికారం మాత్రమే. అయితే, యీ వ్యవస్థ ఎదిరించరాని, పోటీలేని ఆవశ్యకతగా ఆమోదింపబడినంత కాలమూ, రాజ్యాధికారం నిష్పాక్షికత్వ పార్శ్వాన్ని ప్రదర్శించగలదు. మార్పు రాని వ్యవస్థగా, ప్రజా సామాన్యంచేత ఎదిరింపబడని, వారి "సహజ అధికుల"చేత నిస్సంకోచంగా అమలు జరపబడిన సాంఘిక వాస్తవంగా ఉంటూ వచ్చిన ప్రజా సామాన్యపు పరాధీనతను రాజ్యాధికారం నిలబెట్టింది. సమాజమే ఒక నూతన దశలోకి, వర్గ పోరాట దశలోకి ప్రవేశించడంతో, దాని సంఘటిత సామాజిక శక్తి అయిన రాజ్యాధికార స్వభావం సైతం మారకుండా ఉండజాలదు (గణనీయమైన మార్పు కూడా పొందుతుంది), అంతకంతకు అధికంగా అది తన స్వభావాన్ని వర్గ నిరంకుశత్వ సాధనంగా పెంపొందించుకుంటుంది, సంపదను కాజేసే వారిచేత సంపదను ఉత్పత్తిచేసే వారి సాంఘిక బానిసత్వాన్ని బలప్రయోగం సహాయంతో శాశ్వత పరచాలనే రాజకీయ యంత్రంగానూ, శ్రమపై పెట్టుబడియొక్క ఆర్థిక పాలన సాధనంగానూ అది పని చేస్తుంది. రాజ్య యంత్ర నిర్దేశకత్వం పాలకవర్గాలకు చెందిన ఒక బృందంనుంచి మరో బృందానికి మార్పు చెందడానికి దారితీసే ప్రతి ఒక కొత్త ప్రజా విప్లవం తర్వాతా రాజ్యాధికారంయొక్క అణచివేసే స్వభావం మరింత సంపూర్ణంగా అభివృద్ధి చెయ్యబడింది, మరింత నిర్దాక్షిణ్యంగా వినియోగింపబడింది. విప్లవంచేత చెయ్యబడిన వాగ్దానాలనూ, దానిచేత హామీ యివ్వబడినట్లు కనిపించిన వాగ్దానాలనూ బలప్రయోగ వినియోగం ద్వారా మాత్రమే భగ్నంచెయ్యడం సాధ్యం కావడమే యిందుకు కారణం. పైగా, ఒకదాని తరువాత మరొకటి వరుసగా వచ్చిన విప్లవాల ఫలితంగా జరిగిన మార్పులు, పెరుగుతున్న పెట్టుబడి శక్తి అనే సాంఘిక వాస్తవాన్ని రాజకీయంగా మాత్రమే మంజూరు చేశాయి. అందుచేత రాజ్యాధికారాన్నే అంతకంతకు ప్రత్యక్షంగా కార్మికవర్గపు ప్రత్యక్ష వైరుల చేతుల్లోకి బదిలీ చేశాయి. ఆవిధంగా జూలై విప్లవం అధికారాన్ని భూస్వాముల చేతుల్లో నుండి బడా ఉత్పత్తిదారుల (బడా పెట్టుబడిదారుల) చేతుల్లోకి మార్చింది. ఫిబ్రవరి విప్లవం, పాలకవర్గానికి చెందిన సమైక్య ముఠాలకు, కార్మికవర్గం పట్ల వైరుధ్యం ఆధారంగా, "పార్టీ ఆఫ్ ఆర్డర్"గా ఐక్యమైన, తమ సొంత వర్గ పాలన వ్యవస్థ చేతుల్లోకి అధికారాన్ని బదలాయించింది. పార్లమెంటరీ రిపబ్లిక్ కాలంలో రాజ్యాధికారం చిట్టచివరకు ప్రకటిత యుద్ధ సాధనంగా, ఉత్పాదక ప్రజా సామాన్యానికి వ్యతిరేకంగా సంపదను కాజేసే

వర్గం వాడే సాధనంగా తయారైంది. కానైతే, ప్రకటిత అంతర్యుద్ధ సాధనంగా, అది అంతర్యుద్ధ కాలంలో మాత్రమే వాడటానికి సాధ్యమవుతుంది. కాగా, ఏ "వ్యవస్థ" పేరుతో అయితే అంతర్యుద్ధం సాగించబడిందో ఆ వ్యవస్థకే ప్రతికూలమైనదైన ప్రకటింపబడిన అంతర్యుద్ధపు కొనసాగింపు అందుకే పార్లమెంటరీ రిపబ్లిక్ ఉనికికి షరతుగా వుండింది ఇది ఉండీ ఉడిగీ వచ్చే ఎగుడువంటి అసాధారణ పరిస్థితి మాత్రమే సమాజంయొక్క సాధారణమైన రాజకీయ స్వరూపంగా యిది సాగడం అసాధ్యమైంది. బూర్జువా వర్గానికి చెందిన అధిక సంఖ్యాకులకు సైతం యిది సహించరానిదిగా తయారైంది. కాగా ఎప్పుడైతే ప్రజా ప్రతిఘటన శక్తులన్నీ భగ్నమయ్యాయో అప్పుడిక రెండవ సామ్రాజ్యం ముందు పార్లమెంటరీ రిపబ్లిక్ మటుమాయం కావాల్సి వచ్చింది (పైదొంగాల్సి వచ్చింది).

జాతిలో ఉత్పత్తిచేసే మెజారిటీ జనాభా అయిన రైతులపై ఆధారపడుతున్నానని చెప్పుకొనే సామ్రాజ్యం, పెట్టుబడికీ శ్రమకీ మధ్య జరిగే వర్గపోరాట పరిధికి బయట వున్నట్లు కనిపించే (పోటీ పడుతున్న రెండు సాంఘిక శక్తులపట్ల అవానక్తితో, శత్రుత్వంతో వున్న) రైతాంగంపై ఆధారపడుతున్నానని చెప్పుకొనే సామ్రాజ్యం, పాలక, పాలిత వర్గాలకు అతీతమైన శక్తిగా రాజ్యాధికారాన్ని వినియోగిస్తూ, రెండింటిపైనా యుద్ధ విరమణను అమలు జరుపుతూ, (వర్గ పోరాటంయొక్క రాజకీయ రూపాన్ని కాగా విప్లవ రూపాన్ని అణచివేస్తూ), సంపద కాజేసే వర్గాలయొక్క పార్లమెంటరీ అధికారాన్ని ఆకారణంగానే వాటి ప్రత్యక్ష రాజకీయాధికారాన్నీ విడదియ్యడం ద్వారా రాజ్యాధికారం నుండి దాని వర్గ నిరంకుశత్వ ప్రత్యక్ష రూపాన్ని లాగివేసింది. పాత సాంఘిక వ్యవస్థ ఉనికిని మరి కొంతకాలం పొడిగించగల రాజ్య రూపం యిదొక్కటి మాత్రమే. అందుకని ప్రపంచమంతా "వ్యవస్థ సంరక్షకురాలుగా" సామ్రాజ్యానికి స్వాగతమిచ్చింది, ప్రపంచమంతటిలోనూ బానిస యజమానులు కావాలని కోరుతున్నవాళ్ళు, 20 ఏళ్లపాటు దానిని చూసి మురిసిపోయారు దాని పెత్తనం క్రింద, దానితోబాటే ప్రపంచ మార్కెట్టులో కాలిఫోర్నియా, ఆస్ట్రేలియాలు తెచ్చిన మార్పులతోను,[143] సంయుక్త రాష్ట్రాలు సాధించిన అద్భుతమైన అభివృద్ధితోను, ముందెన్నడూ కనివిని ఎరుగని పారిశ్రామిక కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి, చట్టా వ్యాపారం, ఆర్థిక దగాకోరుతనం, జాయింట్ స్టాక్ కంపెనీల, దుస్సాహసికుల విశృంఖలత్వం ప్రారంభమయ్యాయి – ఇవన్నీ కలిసి, మధ్యతరగతియొక్క ఆస్తిహరణానికీ, పెట్టుబడి సత్వర కేంద్రీకరణకూ, పెట్టుబడిదారీ వర్గానికీ కార్మికవర్గానికీ మధ్య అఖాతాన్ని విస్తృతం చెయ్యడానికీ దారితీశాయి పెట్టుబడిదారీ విధానంయొక్క యావత్తు నైచ్య దుర్మార్గాలూ, దానిలో స్వతస్సిద్ధంగా యిమిడివున్న ధోరణులకు పూర్తి అవకాశం లభించడంతో, విశృంఖలంగా

బయటపడ్డాయి. అదే సమయంలో, మిక్కుటంగా తినడం, త్రాగడం, వ్యభిచారం వంటి విలాసవంతమైన విశృంఖల వ్యవహారం, కళ్ళు జిగేల్మనిపించే వైభవం, "ఉన్నత వర్గాల" హీన మనోవికారాల పిశాచగణ సమవాకారం పెద్ద పెట్టున సాగాయి. ఇది ప్రభుత్వా ధికారపు తుది రూపం. అదే సమయంలో, దానియొక్క అత్యంత అవినీతికర, మిక్కిలి నీచ రూపం, ప్రభుత్వ వనరులను దుస్సాహసికుల ఓ చిన్న బృందం సిగ్గుమాలి దోచు కొనే రూపం, బ్రహ్మాండమైన ప్రభుత్వ రుణాలకు నెలవు, వ్యభిచార వైభవ పరాకాష్ఠ, కృత్రిమ నటనలతో కూడిన అస్వాభావిక జీవితం. పైనుండి క్రిందిదాకా కృత్రిమమైన మెరుగుపూతతో నిండిన ప్రభుత్వాధికారం మురికిలో మునిగి వుంది. రాజ్య యంత్రంయొక్క పూర్తి కుళ్ళతనమూ, దాని క్రింద విలసిల్లుతున్న యావత్తు సంఘ శరీరం కుళ్ళి పోవడమూ, స్వర్ణ రక్తపంకాల పాలనయొక్క యూరపియన్ పీఠాన్ని పారిస్ నుండి బెర్లిన్‌కి తరలించుకుపోవాలని మాత్రమే ఆతృత చూపే ప్రష్యా బయనెట్ల ముందు, బయటపడ్డాయి.

రాజ్యాధికార తుది రూపమిది, అత్యంత అవినీతికర రూపమిది, దాని సర్వోన్నత, పరమ నీచ వాస్తవిక రూపం యిది. దీన్నే పారిస్ కార్మికవర్గం అధిగమించాల్సి వచ్చింది. దీని నుండి సమాజాన్ని వదిలించగలది యీ వర్గం మాత్రమే. పార్లమెంటరిజానికి సంబంధించినంత వరకు, తన సొంత విజయంచేతా, సామ్రాజ్యంచేతా అది హతమార్చ బడింది. కార్మికవర్గం చెయ్యాల్సినదల్లా దాన్ని పునరుద్ధరించకుండా ఉండటం మాత్రమే.

కార్మికులు భగ్నంచెయ్యాల్సి వచ్చినది పాత సమాజానికి చెందిన కొద్దో గొప్పో అసంపూర్ణ ప్రభుత్వాధికార స్వరూపాన్ని కాదు, ఆ అధికారపు తుది, సమగ్ర స్వరూప మైన సామ్రాజ్యాన్నే వాళ్ళు భగ్నం చెయ్యాల్సి వచ్చింది. సామ్రాజ్యానికి ప్రత్యక్షంగా విరుద్ధమైనది కమ్యూన్.

మిక్కిలి సరళంగా చెప్పాలంటే, పాత ప్రభుత్వ యంత్రాంగాన్ని దాని కేంద్ర పీఠాలైన పారిస్‌లోను, తదితర మహా నగరాల్లోను ఉపక్రమణికగా నిర్మూలించడం, దాని స్థానంలో నిజమైన స్వపరిపాలనను ప్రవేశపెట్టడం, కార్మికవర్గానికి సాంఘిక దుర్గాలైన పారిస్‌లోను, తదితర పెద్ద నగరాల్లోను కార్మికవర్గ ప్రభుత్వ స్థాపనమే కమ్యూన్ అంటే. ముట్టడి ద్వారా పారిస్, సైన్యాన్ని వదిలించుకొని, దాని స్థానంలో, ఎక్కువ భాగం పారిస్ కార్మికులతో ఏర్పడిన నేషనల్ గార్డుని నెలకొల్పింది. ఈ పరిస్థితి కారణంగానే మార్చి 18 నాటి తిరుగుబాటు సాధ్యమైంది. ఈ వాస్తవం వ్యవస్థీకృతం కావాలంటే, మహా నగరాల నేషనల్ గార్డు ఏర్పడటం, ప్రజలకు వ్యతిరేకంగా ప్రభుత్వాన్ని కాపాడే స్థాయీ సైన్యాన్ని నిర్మూలించడానికీ, ప్రభుత్వాన్ని అక్రమంగా ఆక్రమించుకోవడానికి వ్యతిరేకంగానూ ప్రజలు సాయుధులు కావడం అవసరం. వివిధ జిల్లాలయొక్క మున

సివిల్ కౌన్సిలర్లతో కమ్యూన్ ఏర్పడాలి (పారిసే దాన్ని ప్రారంభించినదీ, దాని నమూనా కనుక దాన్నిక్కడ మనం పేర్కొనాలి), పౌరులందరిచేతా వీళ్ల సార్వత్రిక ఓటింగు పద్ధతిలో ఎన్నుకోబడాలి, తక్కువ కాల వ్యవధులకు మాత్రమే వీళ్ల బాధ్యులుగా వుండాలి, వీళ్లను పదవి నుంచి తొలగించే వీలుండాలి. వీళ్లలో అధిక సంఖ్యాకులు సహజంగా కార్మికులే అయ్యుంటారు, లేక, కార్మికవర్గంయొక్క గుర్తింపబడిన ప్రతినిధులై యుండాలి. కమ్యూన్, పార్లమెంటరీ సంస్థగా కాకుండా, కార్యాచరణ సంస్థగా, ఏక కాలంలో కార్యనిర్వాహక, శాసనసభగా ఉండాలి. పోలీసులు కేంద్ర ప్రభుత్వపు పరికరాలుగా ఉండేందుకు బదులు, కమ్యూన్ సేవకులుగా ఉండాలి, తదితర పాలనా శాఖలన్నింటిలోని ఉద్యోగుల్లాగే వీళ్ళు కూడా కమ్యూన్‌చేతనే నియమింపబడాలి. వీళ్ళ నెప్పుడైనా తొలగించే అవకాశ ముండాలి. కమ్యూన్ సభ్యుల మాదిరిగానే ఉద్యోగులందరూ కార్మికుల వేతనాలతోనే తమ పనులు చెయ్యాల్సి వుంటుంది. జడ్జీలు సైతం ఎన్నుకోబడాలి, తొలగింపబడే అవకాశ ముండాలి, బాధ్యులై వుండాలి. సాంఘిక జీవితానికి సంబంధించిన సకల వ్యవహారాల్లోనూ చొరవ కమ్యూన్‌కి కేటాయింపబడాలి. ఒక్క మాటలో చెప్పాలంటే, అన్ని సామాజిక విధులూ, కేంద్ర ప్రభుత్వానికి చెందిన కొద్ది వాటితోబాటు, కమ్యూన్ ఉద్యోగులచేతనే, కాగా, కమ్యూన్ అజమాయిషీ క్రిందనే నిర్వహింపబడాలి. కేంద్ర విధులు, ప్రజలపై ప్రభుత్వ ఆధిపత్యానికి సంబంధించినవి కాక, దేశపు ప్రముఖ సాధారణ అవసరాల కారణంగా ఆవశ్యకమైనవి, అసాధ్యమవుతాయనడం అసంగతమైన విషయాల్లో ఒకటి. ఈ విధులు ఉండటమైతే ఉంటాయి, కానైతే, అధికారులు మాత్రం, పాత ప్రభుత్వ యంత్రాంగంలో మాదిరిగా, నిజమైన సమాజానికి అతీతంగా తమని తాము పెంచుకోజాలరు. ఎందుకంటే, ఈ విధులు కమ్యూన్ ఉద్యోగుల చేత నిర్వహింపబడతాయి, కాగా, ఎప్పుడూ నిజమైన అదుపులో ఉంటాయి. ప్రభుత్వ పదవులన్నవి, కేంద్ర ప్రభుత్వం తన గులాములకు ప్రసాదించే ప్రైవేటు ఆస్తిగా ఉండే పద్ధతికి స్వస్తి చెప్పబడింది. స్థాయీ సైన్యం, ప్రభుత్వ పోలీసులను రద్దుచెయ్యడం ద్వారా అణచివేతకు సంబంధించిన భౌతిక బలం భగ్నంచెయ్యబడాలి. చర్చిలకు గల ఆస్తి హక్కులన్నింటినీ రద్దుచేసి, వాటికి గల ప్రత్యేకాధికార ప్రతిపత్తిని తొలగించడం, అన్ని ప్రభుత్వ విద్యాలయాల నుంచీ మతపరమైన శిక్షణకు (ఉచిత విద్యాబోధనతో బాటు) స్వస్తిచెప్పి ప్రైవేటు జీవితపు మారుమూలలకు దాన్ని తరిమి, అక్కడ అది విశ్వాసపరుల భిక్షపై బతికేలా చెయ్యడం, అన్ని విద్యా సంస్థలనూ ప్రభుత్వ పోషకత్వం నుంచీ, దాస్యం నుంచీ విముక్తం చెయ్యడం, మానసికంగా అణచివేసే బలప్రయోగాన్ని విచ్ఛిన్నం చెయ్యడం, విజ్ఞానశాస్త్రాన్ని అందరికీ అందుబాటులోకి తేవడమే కాకుండా, ప్రభుత్వ ఒత్తిడి, వర్గ పక్షపాతాల శృంఖలాల నుండి దాన్ని విముక్తం

చెయ్యడం జరగాలి. మునిసిపల్ పన్నుల నిర్ణయమూ, విధింపూ కమ్యూన్‌చేత జరగాలి. సాధారణ రాజ్య కార్యాలకోసం పన్నుల విధింపు కమ్యూన్ అధికారులచేత జరగాలి. ఆ సొమ్ము వినిమయం, సాధారణ అవసరాల కోసం కమ్యూన్‌చేతనే జరగాలి (సాధారణ అవసరాల నిమిత్తం అది చేసే ద్రవ్య వినియోగాన్ని కమ్యూన్ స్వయంగా పర్యవేక్షించాలి).

అణచివేతకూ, సమాజంపై ఆధిపత్యానికీ సంబంధించిన ప్రభుత్వ బలప్రయోగం, ఆవిధంగా, దాని కేవల అణచివేత అంగాలను నాశనం చెయ్యడం ద్వారా భగ్నంచెయ్య బడాలి. పోతే, అది ఎక్కడైతే సముచితమైన విధులను నిర్వహించాల్సి వుందో, ఆ విధులు సమాజానికి అతీతమైన సంస్థ ద్వారా కాక, సమాజపు బాధ్యతాయుత ఉద్యోగుల ద్వారా మాత్రమే నిర్వహింపబడాలి.

## 7) ముగింపు

ఒక వంక చారిత్రక చొరవకి సంబంధించిన ఉత్సాహంతో ఉత్తేజితమై, వీరత్వం మూర్తీభవించి, పోరాడుతూ, కృషిచేస్తూ, ఆలోచిస్తున్న పారిస్‌లో ప్రసవ వేదన పడుతున్న నూత్న సమాజం — మరోవంక ఇందుకు భిన్నంగా కాలం చెల్లిపోయిన కపట నటనలతో పేరుకున్న అసత్యాలతో వెర్సేల్స్‌లోని పాత సమాజం. దీనికి సిసలైన ప్రతినిధి ఆ "భూస్వాముల సభ," కాలం చెల్లిన పాలన లన్నింటికీ చెందిన, పటపట వాగుతూ శవాలు పీక్కుతినే రాక్షసులవంటి వాళ్లతో నిండిన "భూస్వాముల సభ." ఫ్రాన్సులో క్రమేణా మూర్తీభవించిన వర్గ పాలనల రూపమే యీ సభ. వీళ్లకి నాయకుడు ఒక ముసలి చాదస్తపు పార్లమెంటరీ బఫూన్. వీళ్ల సైనిక శక్తి, తమ ప్రష్యన్ విజేతల కళ్లముందు పారిస్‌ని బొంబార్డు చేస్తున్న బోనపార్టిస్టు లొంగుబాటుదారుల చేతుల్లో వుంది.

రెండవ సామ్రాజ్యం తన పతనంలో ఫ్రాన్సుపై అపారమైన శిధిలాలను పేర్చింది. ఇది వాళ్లకు, లెజిటిమిజంకో లేక ఆర్లియనిజంకో సంబంధించిన పూర్వ శిధిలాల పనికిమాలిన చెత్తను త్రవ్వి ఉపరితలంపైకి తీసేందుకు, ఒక అవకాశం మాత్రమే.

జీవనజ్యోతి, గడచిపోయిన సకల ప్రవాసాల నిరాశాపూరిత నిశ్వాసాల వాతావరణంలో వెలగాల్సి వచ్చింది. (వాళ్ళు పీల్చే గాలే గడచిపోయిన సకల ప్రవాసాల నిరాశాపూరిత నిశ్వాసాలు.)

జీవితానికి వ్యతిరేకంగా ఉమ్మడి కుట్ర, వర్గ ప్రయోజనానికి సంబంధించిన స్వార్థపరత్వం, ఫ్రెంచి సమాజ శవంపైపడి పీక్కుతినాలన్న కోరిక, బానిస యజమానుల

ఉమ్మడి ప్రయోజనం, వర్తమానం పట్ల ద్వేషం, పారిస్‌పై యుద్ధం — వాళ్లకి ఉన్నవల్లా యివే తప్ప వాళ్లలో వాస్తవమైనది ఏమీ లేదు.

వర్సైల్స్‌వ లూయీ రాజప్రాసాదంలోని జాతీయ అసెంబ్లీలో: "మేమే రాజ్యం" ("రాజ్యమంటే మేమే")[144] అని ఉద్ఘాటించిన (నిజానికి వాళ్లు సమాజం నుండి వేర్పడిన రాజ్యానికి ప్రేతం వంటివాళ్లు) లూయీ ఫిలిప్ పాలనకు సంబంధించిన ఆ పాత శిలీభూత అవశేషమైన కౌంట్ జొబేర్ నుండి 1789 నాటి తమ ముందు వాళ్లకన్న తమ పతనాన్ని ప్రదర్శించుకొని, జె డి పొమ్ (టెన్నిస్ కోర్టు)లో తమ సమావేశాలను జరుపుకొన్న త్యేర్‌యొక్క రిపబ్లికన్ వంది మాగధుల దాకా — వాళ్లకి సంబంధించిన ప్రతిదీ కూడా ఒక పరిహాసాత్మకమైన వ్యంగ్య చిత్రమే.

త్యేర్ నాయకత్వంలో వాళ్లలో అత్యధిక మెజారిటీ లెజిటిమిస్టులు, ఆర్లియనిస్టులు అనే రెండు గ్రూపులుగా విభజింపబడింది, "పాత తరహా"కు చెందిన రిపబ్లికన్లు తోక స్థానంలో వున్నారు. ఈ ముఠాల్లో ప్రతి ఒక్కటీ కూడా తన సొంత అధికార పునరుద్ధరణ కోసం కుతంత్రాలు పన్నుతూ వుంటుంది. త్యేర్‌యొక్క వాదపటిమపు అతిశయంపై తమ ఆశలు పెట్టుకొని ఈలోగా అతని పాలనకు రిపబ్లికన్ అలంకారం చేసి, పారిస్‌ను బుజ్జగింపు ద్వారా వంచించి త్యేర్ చేతుల్లో పెట్టేందుకూ, దాన్ని పెన్సేచేత నిరాయుధం చేసేందుకూ ప్రయత్నించిన మీదట తమ హోజరు ద్వారా బోనపార్టిస్టు జనరల్సు పారిస్‌పై జరిపే యుద్ధానికి అనుమతి మంజూరు చేసి, రిపబ్లికన్లు పార్లమెంటరీ రిపబ్లిక్ పునరుద్ధరణ కోసం కుట్ర చేస్తారు! డాన్‌క్విక్సోట్‌ని పోలిన ఈ వీరయోధులనూ, వీళ్లు ఇచ్ఛికంగా భరించే అవమానాలనూ చూస్తే, వర్గ పాలనకు సంబంధించిన ఒక ప్రత్యేక రూపంగా రిపబ్లికనిజం ఎంత పతన స్థితికి చేరుకుందో బోధపడుతుంది. సీన్-ఎట్-ఉవాజ్‌లో సమావేశమైన మేయర్లనుద్దేశించి, వాళ్లకి అంతకన్న కావలసిన దేముందని త్యేర్ అడిగినప్పుడు అతను సరిగా వీళ్లనే దృష్టిలో పెట్టుకున్నాడు: "కేవలం ఒక సామాన్య పౌరుడైన తను, రాజ్యాధిపతిగా లేడా?" 1830 నుండి 1870కి పురోగతి ఏమిటయ్యా అంటే, అప్పుడేమో లూయీ ఫిలిప్ అత్యుత్తమ రిపబ్లిక్ కాగా, యిప్పుడేమో లూయీ ఫిలిప్ మంత్రి అయిన సాక్షాత్తూ మరుగుజ్జు త్యేరే అత్యుత్తమ రిపబ్లిక్.

రెచ్చిపోయిన బోనపార్టిస్టు జనరల్సు నాయకత్వాన బోనపార్టిస్టు సైనికులు, జెండార్మ్‌లు, పోలీసులచేత తమ అసలైన పని — పారిస్‌కి వ్యతిరేకంగా యుద్ధం — చెయ్యాల్సి రావడంతో, — 1848—51 నాటి తమ పాలనలో లాగే — సామ్రాజ్యపు రెండవ పునరుద్ధరణకే తాము ఆయుధాన్ని తయారుచేస్తున్నామేమోనన్న అనుమానం కొద్దీ వాళ్లు భయంతో వణుకుతున్నారు. పోపుకు చెందిన జావాప్‌లా, కతెలీనాకి

చెందిన వెండేన్లూ, షరేట్‌కి చెందిన బ్రెటాన్లూ, నిజానికి వాళ్ల "పార్లమెంటరీ" సైన్యం వీళ్లే. సామ్రాజ్యపు వాస్తవిక బలంతో పోలిస్తే వాళ్ళు కేవలం సైన్యపు మిథ్యా రూపాలు మాత్రమే. ఒక వంక "రిపబ్లిక్" పేరు వింటేనే కోపంతో బుసలు కొట్టే వీళ్ళు, మరోవంక బిస్మార్కు ఆదేశాలను రిపబ్లిక్ పేరనే ఆమోదిస్తారు, దాని పేరనే మిగిలి వున్న ఫ్రెంచి సంపదను అంతర్యుద్ధంపై వృథా చేస్తారు, దాని పేరనే పారిస్‌పై దుమ్మెత్తిపోస్తారు, తిరుగుబాటుదారులకు వ్యతిరేకంగా రాబోయే దేశ బహిష్కరణ చట్టాలనూ దాని పేరనే జారీచేస్తారు, ఫ్రాన్సుపై నియంతృత్వాధికారాన్నీ దాని పేరనే అక్రమంగా హస్తగతం చేసుకుంటారు.

తమ పాలన సాగిన 1815–48 మధ్య కాలంలో తామెప్పుడూ వ్యతిరేకిస్తూ వచ్చిన సార్వత్రిక ఓటింగు హక్కును, తమకు వ్యతిరేకంగా రిపబ్లిక్‌చేత నెలకొల్పబడి, తదుపరి 1850లో రద్దుచెయ్యబడిన సార్వజనిక ఓటింగు హక్కును, దానితో బాటు జనవాక్య సేకరణలను సైతం తాము అంగీకరిస్తున్నామన్న సంగతిని మరచిపోయి, సామ్రాజ్యపు వడుపుకత్తెగా అంగీకరిస్తున్న సార్వజనిక ఓటింగు హక్కునే వాళ్లిప్పుడు తమ అధికారానికి చట్టబద్ధతగా చెప్పుకుంటున్నారు: సార్వజనిక ఓటింగు హక్కుతో సైతం వాళ్ళు అధికారం నిలుపుకోవడం అసంభవం.

జాతీయైక్యతకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసినందుకు పారిస్‌ను వాళ్లు నింది స్తున్నారు. పారిస్ రాజధాని హోదాను తొలగించడం ద్వారా ఆ ఐక్యత శిరచ్ఛేదమే వాళ్ల మొదటి డిమాండు. వాళ్లు తాము కోరుతున్నట్లు నటించిన దాన్ని పారిస్ చేసింది. అయితే, వాళ్ళు కోరుకున్నట్లు, గతానికి చెందిన అభివృద్ధి నిరోధక స్వప్నంగా చెయ్యక, భవిష్యత్తుకి సంబంధించిన విప్లవ న్యాయ నిరూపణగానే దాన్ని అది చేసింది. జాతీయ దురహంకారి అయిన త్యేర్, మార్చి 18నాటి నుండి "ప్రష్యా లోక్యం" పేరుతో పారిస్‌ను బెదరిస్తున్నాడు, బోర్డోలో "ప్రష్యా లోక్యం" కోసం అర్థించాడు. నిజానికి అతను, తనకు ప్రష్యా ప్రసాదించిన సాధనాల ద్వారానే పారిస్‌కి వ్యతిరేకంగా వ్యవహరిస్తాడు. ఈ జాతీయ దురహంకార విదూషకునితో పోలిస్తే బూర్బన్లు మూర్తీభవించిన హుందాతనమనే చెప్పవచ్చు.

వారి పునరుద్ధరణకు పేరేమైనప్పటికీ – వాళ్లొక వేళ గెలవడమే తటస్థిస్తే – గద్దెకు అక్రమాధికారాన్ని సంపాదించడంలో ఎవడు విజయం పొంది, దానికి అధినాయకత్వం వహించినప్పటికీ, వాస్తవంలో అది, శిథిలమై పోయిన తమ వర్గాల పాలనకు తప్పని సరి, తుది రాజకీయ స్వరూపం అయిన సామ్రాజ్యం మాత్రమే అవగలదు. దాన్ని పునరుద్ధరించడంలో వాళ్ళు విజయులైతే, వాళ్ల పునరుద్ధరణ కోసం వేసుకొనే పథకాలు ఏవి విజయవంతమైనప్పటికీ వాళ్ళు సామ్రాజ్యాన్ని పునరుద్ధరించి తీరల్సిందే

— వాళ్ళు ఏ సమాజానికైతే తాము ప్రాతినిధ్యం వహిస్తారో ఆ పాత సమాజపు శైథిల్యాన్ని, వాళ్ళు దేనితోనైతే తలపడుతున్నారో ఆ సమాజపు పరిణతిని త్వరితం చెయ్యడంలో మాత్రమే వాళ్ళు విజయులవుతారు. గతించిపోయిన పాలనల రాజకీయ బాహ్య ప్రాకారాలను మాత్రమే మసకబారిన వాళ్ళ కళ్ళు చూస్తాయి, ఏ ఐదవ హెన్రీనో, లేక ఏ పారిస్ కౌంట్‌నో నాయకత్వంలో పెట్టడం ద్వారా వాళ్ళు వాటిని పునరుద్ధరించాలని కలలు గంటారు. ఈ రాజకీయ ఉపరినిర్మాణాల భారాన్ని వహించిన సాంఘిక సంస్థలు క్షీణించిపోయాయనీ, యిప్పటికి కాలంచెల్లిపోయిన పరిస్థితుల్లోను, ఫ్రెంచి సమాజపు గత దశల్లోను మాత్రమే ఈ పాలనలు సాధ్యమనీ, సామ్రాజ్యవాదాన్ని దాని శిథిల దశలోను, శ్రమ రిపబ్లిక్‌ను దాని పునరుద్భవ స్థితిలోను మాత్రమే అది సహించ గలదన్న సంగతిని వాళ్ళు చూడరు. రాజకీయ రూపాల వర్తుల భ్రమణాలు సమాజంలో జరిగిన వాస్తవిక మార్పుల రాజకీయ వ్యక్తీకరణ మాత్రమేనన్న సంగతిని వాళ్ళు గ్రహించరు.

మొరటు యుద్ధ విజయోత్సాహాతిరేకంలో, ఫ్రెంచి సమాజపు వేదనలవంక చూస్తూ, షైలాక్ మాదిరి దురాశాపాతకమైన నీచపు లెక్కలతో, Krautjunker*ల మాదిరి మొరటైన నోటి దురుసుతనంతో వాటిని తమ ప్రయోజనాల కొరకు వినియోగించుకొనే ప్రవ్యన్ను, సామ్రాజ్యం జర్మన్ గడ్డపై నెలకొల్పబడటంతో తమకి తాము అప్పటికే శిక్షింపబడ్డారు. తమను పాత వ్యవస్థతో ముంచెత్తే అంత శక్తులను ఫ్రాన్సులో వాళ్ళే విముక్తం చెయ్యాల్సిన దుర్గతిలో పడ్డారు. పారిస్ కమ్యూన్ కూలిపోవచ్చు, కానైతే అది ప్రారంభించిన సాంఘిక విప్లవం విజయవంతమై తీరుతుంది. ప్రతి చోటూ దాని జన్మస్థానమే.

## ఖండికలు

### త్యేర్ బులెటిన్లలోని అబద్ధాలు

వెర్సేల్స్‌యొక్క ఆ అధికతర కపట నటనా, అబద్ధాలాడే దాని స్వభావమూ అబద్ధాలాడటమే వృత్తిగా కలిగిన త్యేర్‌లో కన్న హెచ్చుగా మరెవ్వరిలో మూర్తీభవించగలవు, పునఃప్రారంభం కాగలవు? త్యేర్‌కి "విషయాల యాదార్థ్యం" అన్నది,

* తలబిరుసు, సంకుచిత, అభివృద్ధినిరోధక జమీందారు. — సం.

వాటి "పార్లమెంటరీ అర్థం"లో మాత్రమే, అంటే, అబద్ధంగా మాత్రమే ఉంటుంది.

ఆర్చిబిషప్ జాబుకి తను రాసిన జవాబులో ఁతను "వెర్సైల్స్ సేనలకు ఆపాదించబడిన కల్పిత మారణకాండలనూ, దమన కాండనూ (!)" చల్లగా తిరస్కరించాడు. తన "భూస్వాముల సభ"చేత, అందుకోసమే ఒక విచారణ కమిషన్‌ను నియమింపచేసి, అసంగతమైన తన యీ అబద్ధాన్ని రూఢి చేయించుకున్నాడు. బోనపార్టిస్టు జనరల్స్ విజయోత్సాహాతిరేకంతో చేసిన ప్రకటనల ద్వారా అతనికివి వాస్తవమన్న సంగతి తెలియక పోలేదు. కానైతే "పార్లమెంటరీ అర్థంలో" మాత్రం అవేవీ జరగలేదు.

పారిస్‌పై బొంబార్డుమెంటుకి సంబంధించిన ఏప్రిల్ 16 నాటి తన సర్క్యులర్‌లో అతను యిలా రాశాడు:

> "ఎక్కడైనా ఏమైనా ఫిరంగికాల్పులు వినిపించాయంటే, అవి వెర్సైల్స్ సైన్యం కాల్చినవి కావు. తమ ముఖాలైనా చూప సాహసించని కొద్దిమంది తిరుగుబాటుదారులు తామింకా పోరాటం సాగిస్తూనే ఉన్నామని జనాన్ని నమ్మించే ప్రయత్నంలో కాల్చిన కాల్పులు తప్ప అవి వేరేమీ కాదు."

అయ్యో చిత్తగించండి, పారిస్ తనని తనే బొంబార్డు చేసుకుంటోంది, ఎందుకంటారేమో, తను పోరాటం సాగిస్తున్నానని ప్రపంచాన్ని నమ్మింప చేసేందుకు!

అటు తర్వాత: "మా ఫిరంగి దళం బొంబార్డు చెయ్యదు—అది ఫిరంగులు మాత్రం కాలుస్తుంది, అంతే."

ములెన్ సాకేపై (మే 4) త్యేర్ బులెటిన్: "పారిస్‌ను అణచివేసే నికృష్టమైన నిరంకుశుల నుండి దాన్ని విముక్తం చెయ్యడం" (విద్రిస్తున్న పారిస్ నేషనల్ గార్డులను చంపడం ద్వారా).

సైన్యానికి సంబంధించిన కలగాపులగపు గుంపును — బిస్మార్కు ధర్మమా అని ఖైదు నుండి విడుదల చెయ్యబడిన బోనపార్టిస్టు సైనికులలోని అధములు, వలంటీర్ జెండార్మ్‌లు, పియెత్రీ పోలీసులు జీవకేంద్రంగా, పోవుకు చెందిన జువావ్‌లు, షారెట్‌కి చెందిన షువాన్లు, కతెలీనొకి చెందిన వెండేన్లు పమ ఉజ్జీగా, వీళ్లంతా లొంగుబాటుకు చెందిన పారుబోతు డిసెంబరిస్టు జనరల్సు నాయకత్వంలో కలగాపులగపు గుంపును — "ఫ్రాన్సు చరిత్రలోనే ఎన్నడూ లేనంతటి మిక్కిలి శ్రేష్ఠమైన సైన్యం"గా అతను అభివర్ణిస్తున్నాడు. ప్రష్యన్లింకా సెయింట్ డెనీలో తిష్ఠవేసుక్కూర్చున్నారంటే,

"శ్రేష్ఠమైన సైన్యాల్లో కెల్లా మిక్కిలి శ్రేష్ఠమైన సైన్యం" చూపించి ప్రష్య న్లను భయభీతుల్ని చెయ్యాలని త్యేర్ కోరుకోవడమే అందుక్కారణమనుకోవాలి మరి.

అటువంటిదే "మిక్కిలి శ్రేష్ఠమైన సైన్యం" అయితే – వెర్సేల్స్ అసెంబ్లీ అనే అసందర్భం "ఫ్రాన్సులో ముందెన్నడూ లేని మిక్కిలి ఉదారమైన, పరమ స్వేచ్ఛాయుతంగా ఎన్నుకోబడిన అసెంబ్లీ" అన్నమాట. మేయర్లు మొదలైన వాళ్లకు తను 'మాట తప్పని మనిషిని" పార్లమెంటరీ అర్థంలో మాట తప్పని పద్ధతిలోనే అనుకోండి – అవి చెప్పుకోవడం త్యేర్ విద్యూర ప్రవర్తనకి కలికితురాయి అనుకోవాలి.

రిపబ్లికన్లలో కెల్లా అతను నికార్సైన రిపబ్లికన్ (ఏప్రిల్ 27వ తేదీ సమావేశం):

'అతనికంటె కూడా అసెంబ్లీ మరింత ఉదారమైనది."

మేయర్లకు: "మీరు నా మాటమీద ఆధారపడవచ్చు, నేను నా మాట నెన్నడూ తప్పలేదు" పార్లమెంటరీయేతర అర్థంలో, దేన్నైతే నేనెన్నడూ నిలబెట్టుకో లేదో దానిపై అన్నమాట. "ఈ అసెంబ్లీ, ఫ్రాన్సుచేత ఎన్నుకోబడిన మిక్కిలి ఉదారమైనవాటిలో ఒకటి"

అతగాడు తనను లింకన్‌తోను, పారిస్ వాసులను అమెరికా దక్షిణ ప్రాంతపు తిరుగుబాటుదారులైన బానిస యజమానులతోను సరిపోల్చాడు అమెరికా దక్షిణాది వాళ్ల శ్రమ బానిసత్వం కోసం, అమెరికా నుంచి ప్రాంతీయ వేర్పాటును కోరుకున్నారు తద్భిన్నంగా, శ్రమ విముక్తి కోసం, పాశ్చాత్య త్యేర్‌యొక్క, అధికార స్థానం నుండి ఏ ప్రయోజనాలకైతే అతను ప్రాతినిధ్యం వహిస్తాడో వాటియొక్క వేర్పాటును పారిస్ కోరుకుంటోంది.

బోనపార్టిస్టు జనరల్సూ జెండార్మిలూ, ఘుమాన్లూ పారిస్‌పై సాధించే పగ, శ్రమకి వ్యతిరేకంగా జరిగే వర్గ యుద్ధానికి ఒక అవశ్యకత. కానైతే, బులెటిన్లనే తన వినోదాత్మక ఉప నాటకంలో తన ఆరాధ్య మూర్తి అయిన మొదటి నెపోలియన్ వ్యంగ్యానుకరణకు దాన్నొక సాకుగా తీసుకొని, ప్రష్యన్లపై యుద్ధంలో పోగొట్టుకున్న ప్రతిష్ఠను పారిస్ వాసులపై తను జరిపిన యుద్ధం ద్వారా, ఫ్రెంచి సైన్యం తిరిగి సంపాదించుకున్నదని గట్టిగా నొక్కిచెప్పడం ద్వారా, తనను తాను యూరప్‌లో పరిహాస పాత్రుణ్ణి చేసుకున్నాడు. ఆవిధంగా మొత్తం యుద్ధమంతా, కేవలం పిల్లల ఆటగా, తన సొంత రహస్య అధి నాయకత్వాన, తన సొంత సైన్యం సాగించిన, తన సొంత యుద్ధాలను అభివర్ణించుకోవలసి రావడంతో ఆనందాతిశయంలో మునిగిన ఒకానొక మరుగుజ్జు వాని బాల్యాతిశయ వ్యక్తీకరణ సాధనంగా కనిపిస్తుంది.

పారిస్‌కి సంబంధించీ, రాష్ట్రానికి సంబంధించీ అతని అబద్ధాలు పరాకాష్ఠకు చేరుకున్నాయి.

ప్రచ్ఛన్న రహస్య తోడ్పాటున్నప్పటికీ కూడా, "ఫ్రాన్సు చరిత్రలోనే ఎన్నడూ లేనంతటి మిక్కిలి శ్రేష్ఠమైన సైన్యాన్ని" నిజానికి రెండు మాసాలపాటు అటకాయించిన పారిస్, వాస్తవానికి దాని "ఘాతుక నిరంకుశుల" బారి నుండి త్యేర్‌చేత విముక్తి పొందడానికి మాత్రమే ఆతృతగా ఉందట. అందుకే అది, కేవలం పిడికెడు నేరస్తులే అయినప్పటికీ, తనకి వ్యతిరేకంగా పోరాడుతోంది.

కమ్యూన్‌ని పిడికెడు నేరస్తుల, విడుదల సర్టిఫికెట్లు పొందిన వాళ్ళ, నికృష్టుల గుంపుగా వర్ణించడంలో అతనికెన్నడూ అలుపు లేదు. పారిస్ అతనికి వ్యతిరేకంగా పోరాడుతోందంటే, "తనని అణచివేసే నికృష్టమైన నిరంకుశుల" నుండి అతనిచేత విముక్తం కావాలని కోరుతున్నది కాబట్టేనట. మరి యీ "పిడికెడు" నేరస్తులే, అపజయ మెరుగని మెక్ మహన్ నాయకత్వాన, నెపోలియన్ తరహా మేధానిధియైన సాక్షాత్తూ త్యేర్‌చేత ఉత్తేజితమైన "ఫ్రాన్సు చరిత్రలోనే ఎన్నడూ లేనంతటి మిక్కిలి శ్రేష్ఠమైన సైన్యాన్ని" రెండు నెలల పాటు నిలవరించారు!

పారిస్ ప్రతిఘటన వాస్తవం కాదు, పారిస్‌ని గూర్చిన త్యేర్ అబద్ధాలే వాస్తవం!

తమ సాహసకృత్యాల ద్వారా అతడిని ఖండించడంతో తృప్తిచెందక, పారిస్‌కి చెందిన సజీవ శక్తులన్నీ కూడా, అతడిని, అతని అబద్ధాల ప్రపంచంలోంచి బయటికి లాగుదామని వృథా ప్రయత్నం చేశాయి.

> "పారిస్ ఉద్యమాన్ని మాంమార్త్రర్ పట్టుకోవడంతో, కలగాపులగం చెయ్యరాదు. మాంమార్త్రర్ పట్టుకోవడం కేవలం దాని అవకాశమూ నాందీ ప్రస్తావనా మాత్రమే; ఈ ఉద్యమం పారిస్ అంతరాత్మలో సర్వథా వ్యాపించి ప్రగాఢంగా హత్తుకు పోయింది; ఏ కారణంవల్లనైనా దానికి దూరంగా ఉన్నవారిలో సైతం అత్యధిక సంఖ్యాకులు సాంఘికంగా అది హేతుబద్ధమైనదన్న విషయాన్ని కాదన లేదు."

ఈ విషయాన్ని అతగానికి చెప్పిన దెవరో తెలుసా? సిండికల్ సభల ప్రతినిధులు, 7000 నుండి 8000 మంది వర్తకుల, పరిశ్రమల యజమానుల తరఫున మాట్లాడే వాళ్ళు. అతనితో యీ విషయం నేరుగా చెప్పడానికి వాళ్ళు వెర్సేల్స్‌కి వెళ్లారు. రిపబ్లికన్ యూనియన్ లీగు, ఫ్రీమసన్స్[120] తమ ప్రతినిధుల ద్వారానూ, తమ ప్రదర్శనల ద్వారానూ అదే విషయం ప్రకటించాయి. అయితేనేం త్యేర్ మాత్రం తన అబద్ధాలకే అంటి పెట్టుకొని వున్నాడు.

ములెన్ సాకే సందర్భంగా తన బులెటిన్‌లో (మే 4) అతను యిలా రాశాడు:

> "300 మంది ఖైదీలను పట్టుకున్నాం.... యుద్ధ రంగంలో 150 మంది చనిపోయిన వాళ్ళనూ, క్షతగాత్రులనూ దిగవిడిచి, మిగిలిన తిరుగుబాటుదార్లందరూ పలాయనం చేశారు.... కమ్యూన్ తన బులెటిన్లలో అభినందించుకోదగిన విజయం అలాంటిది. తనను అణచివేస్తున్న ఘాతుక నిరంకుశుల నుండి పారిస్ త్వరలోనే విముక్తం చెయ్యబడుతుంది."

అయితే, అతనికి చెందిన పారిస్, పోరాడే పారిస్సూ, అసలైన పారిస్సూ కాదు. అతని పారిస్ అన్నదే ఒక పార్లమెంటరీ అబద్ధం. "సంపన్న, సోమరి, పెట్టుబడిదారీ పారిస్," కలగాపులగపు కలగూరగంప, అదీ అతని పారిస్. అతనికి తిరిగి చెందాలని వాంఛించే పారిస్ అదీ. అసలైన పారిస్ "నికృష్ట అలగా మూక"కి చెందినది. "శాంతియుత ఊరేగింపు"లోనూ, పెస్సే దొమ్మీ పలాయనంలోను తన ధైర్యాన్ని ప్రదర్శించిన పారిస్, యిప్పుడు వెర్సేల్స్‌లో, రుయేల్‌లో, సెయింట్ డెనిలో, సెయింట్-జెర్మేన్-ఎన్-లేలో, "కుటుంబం, మతం, వ్యవస్థలకు చెందిన వ్యక్తులకు" అన్నిటికన్న ఎక్కువగా "ఆస్తి పరుల"కు అంటిపెట్టుకొని వేశ్యలు వెంటరాగా – మూగుతున్న వ్యక్తుల పారిస్, ఒళ్ళొంచకుండా సోమరిగా తిరిగే వర్గాల పారిస్, francs-fileurs [78] పారిస్, జరుగుతున్న యుద్ధాల కేసి దూరదర్శిని యంత్రాల్లో తిలకించి సరదా తీర్చుకొంటూ, అంతర్యుద్ధాన్నొక కులాసా వ్యాసంగా పరిగణించే వాళ్ళ పారిస్, అదీ త్యేర్ పారిస్. కోబ్లెంజ్ ప్రవాస కేంద్రం [79] డి కలోన్ ఫ్రాన్సు అయినట్లుగానే, వెర్సేల్స్ ప్రవాస కేంద్రం త్యేర్‌కి చెందిన ఫ్రాన్సు.

త్యేర్‌చేత, అతని "భూస్వాముల సభ"చేత, décembriseursచేత, జెండార్మ్‌లచేత కమ్యూన్ నుండి విముక్తం చెయ్యబడాలని పారిస్ కోరుకుంటోందన్నది ఎలా అబద్ధమో, "రాష్ట్రాలు" త్యేర్ ద్వారా, అతని "భూస్వాముల సభ" ద్వారా పారిస్ నుండి విముక్తం కావాలనుకుంటున్నదన్నది కూడా అటువంటి అబద్ధమే.

ఫ్రాంక్‌ఫుర్టులో ఖచ్చితమైన శాంతి ఒప్పందం [145] కుదుర్చుకొనేందుకు ముందు, పారిస్‌కి వ్యతిరేకంగా పోరాడేందుకుగాను తమ నేషనల్ గార్డు దళాలనూ, వలంటీరు దళాలనూ వెర్సేల్స్‌కి పంపార్సిందిగా రాష్ట్రాలకు అతను విజ్ఞప్తి చేశాడు. రాష్ట్రాలు నిర్ద్వంద్వంగా ఆ విజ్ఞప్తిని తిరస్కరించాయి. ఒక్క బ్రెటాన్ మాత్రమే కొద్దిమంది మనుష్యులను పంపింది. "శ్వేత పతాకం క్రింద, వారిలో ప్రతి ఒక్కడూ తెల్లని గుడ్డతో

తయారైన క్రీస్తు గుండె గుర్తును తన రొమ్ముపై ధరించి, 'Vive le roi!'* అని నినాదాలిస్తూ పోరాడాడు!" ఫ్రెంచి రాష్ట్రాలు అతని ఆదేశాలను పాటిస్తున్న తీరు యిది. కాగా, అతను బిస్మార్క్ నుండి ఫ్రెంచి బందీ సైనికులను బదులు తెచ్చుకోవలసి వచ్చింది, పోపుకు చెందిన జువావ్[80]లను (అతని రాష్ట్రీయ ఫ్రాన్సుకి చెందిన నిజమైన సాయుధ ప్రతినిధులు) పట్టుకొని, 20,000 జెండార్మీలను, 12,000 మంది పోలీసులను తన సైన్యానికి జీవకేంద్రంగా చేసుకోవాల్సిన పరిస్థితిలో పడ్డాడు.

పారిస్‌కీ రాష్ట్రాలకీ నడుమ అబద్ధాల గోడయూ, సైద్ధాంతిక, పోలీసు దిగ్బంధాయూ నిర్మించి పారిస్‌ని రాష్ట్రాలకు దూరంగా ఉంచాలని (అడ్డగించాలని) అతను ఎంతగా ప్రయత్నించినా, పారిస్‌పై యుద్ధం సాగించేందు కోసం అతనికి సైనిక దళాలను పంపేందుకు బదులు, రాష్ట్రాలు, పారిస్‌తో శాంతి ఒప్పందం చేసుకొమ్మని ఒత్తిడిచేసే అనేక ప్రతినిధివర్గాలతో అతన్ని ముంచెత్తాయి. దానితో చివరికి అతను అటువంటి ప్రతినిధివర్గాలను స్వయంగా యికనెంత మాత్రమూ కలుసుకోనని ప్రకటించాడు. రాష్ట్రాల నుండి అలా వచ్చిన విజ్ఞాపనల ధోరణి, వాటిలో చాలవరకు, పారిస్‌తో వెన్వెంటనే యుద్ధ విరమణ ఒడంబడిక చేసుకొమ్మనీ, అసెంబ్లీని, "దాని మాండేట్ల కాలపరిమితి ముగిసింది కనక" రద్దుచెయ్యమనీ, పారిస్ డిమాండు చేసిన మునిసిపల్ హక్కులను మంజూరు చెయ్యమనీ ప్రతిపాదించేవే కావడం దుఫోర్‌కి ఎంతగా చిర్రెత్తించాయంటే, ప్రిఫెక్టుల నుద్దేశించి "శాంతి సంప్రతింపులకు వ్యతిరేకంగా సర్క్యులర్" అనే పేరున తాను జారీ చేసిన సర్క్యులర్‌లో వాటిని అతను నిరసించాడు. మరో వంక, "భూస్వాముల సభకూ," త్యేర్‌కీ రాష్ట్రాల నుండి ఆమోదం తెలిపే విజ్ఞాపన ఒక్కటి కూడా అందలేదు.

రాష్ట్రాలకు సంబంధించిన త్యేర్ "అభూత కల్పన"కు రాష్ట్రాలిచ్చిన ప్రధానమైన సవాలు ఏప్రిల్ 30వ తేదీనాటి మునిసిపల్ ఎన్నికలే. అతని అసెంబ్లీ చేసిన చట్టం ప్రాతిపదికపైనవే, అతని ప్రభుత్వం క్రిందనే ఆ ఎన్నికలు జరిగాయి. ఛిన్నాభిన్నం చెయ్యబడిన ఫ్రాన్సులో యింకా మిగిలి వున్న 35,000 కమ్యూన్లు ఎన్నుకొన్న 7,00,000 మంది కౌన్సిలర్ల (పూర్ణాంకం)లోనూ లెజిటిమిస్టులకూ, ఆర్లియనిస్టులకూ, బోనపార్టిస్టులకు కలిసి 8,000 స్థానాలు కూడా రాలేదు! ఉప ఎన్నికల ఫలితాలు వాళ్లకి యింతకన్న ఎక్కువ ప్రతికూలంగా వున్నాయి! ఆకస్మికంగా, కపటమైన సాకులతో జరిగిన ఎన్నికల్లో ఎన్నుకోబడిన జాతీయ అసెంబ్లీ, ఫ్రాన్సుకి, రాష్ట్రీయ ఫ్రాన్సుకి, పారిస్‌ని మినహాయించిన

* "రాజా వర్ధిల్లాలి!" — సం.

ఫ్రాన్సుకి ఎంతగా ప్రాతినిధ్యం వహిస్తుందో దీన్ని బట్టి స్పష్టంగా రుజువవుతోంది!

కాని, బోర్డోలో రాష్ట్రీయ పెద్దపట్టణాల మునిసిపల్ ప్రతినిధుల సమావేశం జరగాలన్న పథకం — 1834 నాటి తన చట్టం ప్రాతిపదికపైనా, 1855 నాటి బోనపార్టిస్టు చట్టం[146] ప్రాతిపదికపైనా ఈ సమావేశం త్యేర్‌చేత నిషేధింపబడింది — "తన" పారిస్ మిథ్య అయినట్లే "తన రాష్ట్రాలు" కూడ ఒక మిథ్య అని త్యేర్‌చేత అంగీకరింపచేసింది. "కృత్రిమ" పారిస్‌ని పోలివున్నాయనీ, "కమ్యూనిజానికీ, తిరుగుబాటుకీ పునాదులు వెయ్యడానికి" అవి పరమ ఆత్రంగా వున్నాయనీ రాష్ట్రాలపై అతను దుమ్మెత్తి పోశాడు. నాంట్, ల్యేన్, షంబెరీ, లిమూ, కర్కాసోన్, అంజే, కర్పంట్రా, మాంపెల్యే, ట్రీవ్, గ్రెనోబ్ల్ మొదలైన మునిసిపల్ కౌన్సిళ్ల పారిస్‌తో శాంతి ఒడంబడిక చేసుకోవాల్సిందిగా విజ్ఞప్తిచేస్తూ, ఒత్తిడి చేస్తున్న తుది తీర్మానాలు అతనికి మరోమారు జవాబిచ్చాయి.

> ల్యేన్ మునిసిపల్ కౌన్సిల్ చెప్పినట్లు, "రిపబ్లిక్‌ను బేషరతుగా గుర్తించడమూ, కమ్యూన్ హక్కులను గుర్తించడమూ ఫిబ్రవరి 8న ఎన్నుకోబడిన వాళ్లు వీటిని తామింకా అభ్యర్థులుగా ఉన్నప్పుడు తమ సర్క్యులర్లలో వాగ్దానం చేశారు. విదేశీ యుద్ధాన్ని నివారించేందుకు, అది" (జాతీయ అసెంబ్లీ) "రెండు రాష్ట్రాలను దత్తం చేసింది, ప్రష్యాకి 500 కోట్లు చెల్లిస్తానని వాగ్దానం చేసింది. అంతర్యుద్ధాన్ని అంతం చేసేందుకు అది చెయ్యరాని దేముంది?"

(సరిగా దీనికి విరుద్ధం. ఆ రెండు రాష్ట్రాలూ వాళ్ల "ప్రైవేటు" ఆస్తి కాదు, పోతే, 500 కోట్లకి ప్రామిసరీ నోటు రాశారంటే, అసలు సంగతేమిటంటే ఆ మొత్తాన్ని తాము చెల్లిస్తామని కాదు, ఫ్రెంచి ప్రజలు చెల్లిస్తారని మాత్రమే.)

అందుకని, రాష్ట్రాలు శాంతియుత ప్రదర్శనలకే పరిమిత మవుతున్నాయనీ, ప్రభుత్వ బలగాలన్నింటికీ వ్యతిరేకంగా తను జరిపే పోరాటంలో నిస్సహాయంగా తనను అవి వదిలేశాయనీ పారిస్ ఫిర్యాదు చెయ్యడం సహేతుకమే... తమకు అసెంబ్లీలో ప్రాతినిధ్యముందన్న త్యేర్, అసెంబ్లీల వాదాన్ని రాష్ట్రాలు అత్యంత అసందిగ్ధమైన పద్ధతిలో తిప్పికొట్టాయి. వాళ్ల మొత్తం అస్తిత్వంలాగే వాళ్ల రాష్ట్రాలు కూడా బూటకమనీ, కృత్రిమ నటన అనీ అవి చాటి చెప్పాయి.

ఇంటర్నేషనల్‌యొక్క పారిస్ శాఖలు మహత్తరమైన పారిస్ విప్లవంలో వహించిన ప్రముఖ పాత్ర విషయంలో జనరల్ కౌన్సిలు గర్విస్తోంది. మందబుద్ధులు కల్పించినట్లు, పారిస్‌గాని, ఇంటర్నేషనల్‌యొక్క మరే శాఖ గాని, ఏదో ఒక కేంద్రం నుండి తన

mot d'ordre*ను పొందుతున్న కారణంగా మాత్రం కాదు. అన్ని నాగరిక దేశాల్లోని, ఇంటర్నేషనల్‌కు చెందిన కార్మికవర్గపు నిగ్గూ, ఇంటర్నేషనల్ భావాలతో ఉత్తేజిత మైన కారణంగా, కార్మికవర్గోద్యమాల్లో అన్నిచోట్లా అది నాయకత్వం వహించడం ఖాయంగా జరుగుతుంది.**

బిస్మార్కు బందీల ప్రభుత్వం, ఫ్రాన్సు అప్పగింతకు అంగీకరిస్తూ సంతకం పెట్టి లొంగిపోయింది. కానైతే అందుకు బదులుగా, ప్రత్యేకించి పారిస్‌ను తొక్కిపట్టి వుంచేందుకు గాను, అంగరక్షక సైన్యాన్ని అట్టే పెట్టుకొనేందుకు అనుమతి సంపాదించుకుంది. ఆ లొంగుబాటుకు సంబంధించిన మొట్టమొదటి రోజు నుండీ కూడా పారిస్ అప్రమత్తంగా నిలిచింది. నేషనల్ గార్డు తనను తాను పునస్సంఘటితం చేసుకొని, సేనాధిపత్యాన్ని పాత బోనపార్టిస్టు సేనలకు చెందిన కొద్ది తువకలను మినహాయించి, అన్ని కంపెనీలు, బెటాలియన్లు, బేటరీల (ఫిరంగి దళాల)చేత ఎన్నుకోబడిన కేంద్ర కమిటీకి అప్పగించింది. ప్రష్యన్లు పారిస్‌లోకి ప్రవేశించేందుకు సరిగా ముందు, ప్రష్యన్లు ఆక్రమించుకోబోయే తావుల్లో "capitulards" ద్రోహ బుద్ధితో విడిచిపెట్టిన ఫిరంగులనూ, మిట్రల్యూజ్‌లనూ మాంమార్టర్, బెల్‌విల్, లా విలెట్‌లకు తరలించేందుకు [illegible]

[illegible] ...రోధం.

[illegible] ...వింమ్గ

[illegible] అభిప్రాయం వ్యక్తంచేసింది. దాని "భూస్వాముల సభ" ప్రతినిధుల యొక్క ఆడంబర పదజాలంతో కూడిన అరుపులు వినిపించని వాళ్ళకు, ఏ కాస్త అనుమానమైనా మిగిలివుంటే, త్యేర్ పారిస్‌ను, డిసెంబ్రిస్టూర్ వినువా, బోనపార్టిస్టు జెండార్మీ వలంటేన్, జెస్యూట్ జనరల్ ఒరేల్ డి పలడీన్ అనే త్రిమూర్తుల సున్నితమైన దయాదాక్షిణ్యాలకు అప్పగించడమన్నది, దాన్ని తొలగించి వుండాలి. కానైతే, వాళ్ల లక్ష్యం విస్పష్టంగా బయటకు చెప్పబడినా, ఈ ఘాతుక నేరస్తులు ఏ సాకుతోనైతే అంతర్యుద్ధాన్ని ప్రారంభించారో అది మాత్రం పరమ సిగ్గుమాలిన నగ్నమైన (సుస్పష్టంగా కనిపించే) అబద్ధాల్లో ఒకటి. పారిస్ నేషనల్ గార్డుయొక్క ఫిరంగులు ప్రభుత్వానికి చెందినవనీ, కాగా వాటిని ప్రభుత్వానికే తిరిగి యిచ్చెయ్యాలనీ, సెలవి

* ఆదేశాలు. — సం.

** దీని తర్వాత పేజీల సంఖ్య వెయ్యని మూడు కాగితాలపై విషయం వుంది. రెండవ పేరా ముందు జర్మన్ భాషలో పేజి 9 అనే మాటలున్నాయి. — సం.

చ్చాడు త్యేర్. కాని యదార్థం యిదీ: బిస్మార్క్ బందీలు, ఫ్రాన్సు లొంగుబాటు పత్రంపై సంతకం పెట్టినా, పారిస్‌ను లొంగదీసుకొనేందు కోసం, ప్రత్యేకించి తమకు అనేక రక్షణలను కేటాయించుకున్నారు. అలా వారు లొంగిపోయిన మొట్టమొదటి రోజు నుండీ కూడా, పారిస్ తన జాగ్రత్తలో తానుంది. నేషనల్ గార్డులు తమను తాము పునస్సంఘటితం చేసుకున్నారు. పాత బోనపార్టిస్టు దళాలలో కొన్ని శకలాలను మిన హాయించి, తాము యావన్మందీ కలిసి ఎన్నుకొన్న కేంద్ర కమిటీకి నేషనల్ గార్డు పూర్తి అదుపు బాధ్యతను అప్పగించారు. ప్రష్యన్లు సరిగా పారిస్‌లో ప్రవేశించ బోయేందుకు ముందు, లొంగుబాటుదారులు సరిగా ప్రష్యన్లు ఆక్రమించుకోబోయే తావుల్లోనే ద్రోహబుద్ధితో విడిచిపెట్టిన ఫిరంగులనూ, మిట్రల్యూజ్‌లనూ మాంమార్ట్రర్, బెల్‌విల్, లా విలెట్‌లకు తరలించేందుకు కేంద్ర కమిటీ చర్యలు తీసుకుంది. నేషనల్ గార్డు వేసుకున్న చందా మొత్తం ద్వారా ఆ ఫిరంగులు సమకూర్చబడ్డాయి. జనవరి 28 నాటి కన్వెన్షనులో అవి నేషనల్ గార్డుకి చెందిన సొంత ఆస్తిగా అధి కారికంగా గుర్తింపబడ్డాయి. అదే పేర, ప్రభుత్వానికి చెందిన ఆయుధాలన్నీ విజేతకి అప్పగింపబడినప్పుడు, అవి మినహాయింపబడ్డాయి. నేషనల్ గార్డుకి చెందిన ఫిరంగులు ప్రభుత్వ ఆస్తి అన్న మోసకారి నెపంపై అంతర్యుద్ధాన్ని ప్రారంభించడానికి త్యేర్ సాహసించాడు!

ఈ ఫిరంగులను పట్టుకోవడంలో ఉద్దేశం, పారిస్ నేషనల్ గార్డుయొక్క సాధారణ నిరాయుధీకరణకు తద్వారా సెప్టెంబరు 4వ తేదీ విప్లవ నిరాయుధీకరణకు పూర్వరంగం మాత్రమే నన్న విషయం స్పష్టం. కానైతే ఆ విప్లవం, ఫ్రాన్సులో చట్టబద్ధ ప్రతిపత్తిని సంతరించుకుంది. ఫ్రెంచి రిపబ్లిక్ విజేతచేత లొంగుబాటు పత్రంలోనే గుర్తింపు పొందింది. లొంగుబాటు తదనంతరం, అది విదేశీ ప్రభుత్వాలచేత గుర్తింపబడింది, దాని పేరనే జాతీయ అసెంబ్లీ సమావేశపరచబడింది. బోర్డోలో సమావేశమైన జాతీయ అసెంబ్లీకీ, దాని కార్యవర్గానికీ, చట్టబద్ధమైన హోదా కల్పించిన దేదైనా ఉందా అంటే, అది ఒక్క సెప్టెంబరు 4వ తేదీ నాటి పారిస్ కార్మికుల విప్లవం మాత్రమే. అదే లేకుంటే, సార్వజనిక ఓటింగు పద్ధతిలో ఎన్నుకోబడి, విప్లవంచేత చెదరగొట్టి వెయ్యబడిన శాసనసభకు జాతీయ అసెంబ్లీ వెన్వెంటనే చోటు చెయ్యాల్సి వచ్చేది. త్యేరూ, విడుదల సర్టిఫికేట్లు పొందిన అతని ముఠా, కయ్యేన యాత్ర చెయ్యకుండా ఉండగలగాలంటే, ప్రయాణ భద్రతా పత్రాల కోసమూ, జామీను పత్రాల కోసమూ లోబడాల్సి వచ్చేది, ప్రష్యాతో శాంతి సంధిని ఆమోదించే అధికారాన్ని పొందిన జాతీయ అసెంబ్లీ, విప్లవ ఘటనలలో ఒకటి మాత్రమే. దాన్ని ప్రారంభించి, దాని కోసం దారుణ మైన కరువు బాధలతోబాటు అయిదు నెలల ముట్టడిని అనుభవించి, ట్రొషూ పథకాన్ని

వమ్ముచేసి ర్రాష్ట్రల్లో పట్టువిడవని ఆత్మరక్షణ యుద్ధానికి సుదీర్ఘ ప్రతిఘటనను ప్రాతిపదికగా చేసుకున్న సాయుధ పారిసే యిప్పటికీ ఆ విప్లవానికి అసలైన ప్రతిరూపం. అటువంటి పారిస్ ముందు యీనాడు రెండే రెండు ప్రత్యామ్నాయాలున్నాయి. ఒకటి, తిరుగబడిన బోర్డో బానిస యజమానుల అప్రతిష్ఠాకరమైన ఆజ్ఞలు శిరసావహించి, తన ఆయుధాలను క్రింద పెట్టి, సెప్టెంబరు 4 నాటి ప్రజా విప్లవ ఏకైక లక్ష్య మేమంటే, లూయీ బోనపార్ట్ నుండీ, అతని వంది మాగధుల నుండీ అతని రాచరిక ప్రత్యర్థులకు పట్టే అధికారపు బదిలీ మాత్రమే తప్ప మరేమీ కాదని అంగీకరించడం. రెండు, ఫ్రాన్సు కోసం ఆత్మత్యాగం చేసే వీరుడుగా ముందుకు రావడం, రెండవ సామ్రాజ్యం సృష్టించిన రాజకీయ, సాంఘిక పరిస్థితులను (అది శ్రద్ధాసక్తులతో పరమ నికృష్ట స్థితికి దిగజార్చిన పరిస్థితులను) విప్లవాత్మకంగా తొలగించి, వినాశం నుంచి ఫ్రాన్సును కాపాడి, దాని పునరుజ్జీవనాన్ని సాధ్యం చెయ్యడం. అయిదు మాసాల కరువు కాటకాలతో చివికి జీర్ణమైన పారిస్, తృటికాలం సైతం సంకోచించలేదు. తన ముంగిట్లోనే తిష్ఠ వేసిన ప్రష్యన్ సేనల కళ్ళెదుట ఫ్రెంచి కుట్రదారులకు వ్యతిరేకంగా ప్రతిఘటన క్రమంలో ఎదురయ్యే విపత్తులన్నింటినీ ఎదుర్కోవడానికి, పారిస్ వీరోచితమైన నిర్ణయం తీసుకుంది. కానైతే అంతర్యుద్ధం పట్ల తనకు గల అయిష్టతతో, జాతీయ అసెంబ్లీ ఒక మూల రెచ్చగొట్టే చర్యలు ఎన్ని చేస్తున్నా, కార్యనిర్వాహక శాఖ ఎన్ని అధికారాలను అక్రమంగా కైవసం చేసుకున్నా, పారిస్ లోపలా, చుట్టూనూ, విపత్కరమైన సేనల కేంద్రీకరణ ఎంతగా జరుగుతున్నా కూడా, పారిస్ ప్రజా ప్రభుత్వం, నేషనల్ గార్డు కేంద్ర కమిటీ కేవలం దెబ్బ కాచుకొనే ధోరణినే కొనసాగించింది.

మార్చి 18వ తేదీ వేకువ ఝామున "Vive la Commune!"* అన్న మేఘ గర్జనం వంటి కేకలతో పారిస్ మేల్కొంది. బూర్జువా మనస్సులను యింతగా కల్లోలితం చేసే ఆ కమ్యూన్, ఆ బ్రహ్మరాక్షసి ఏమిటి?

> మార్చి 18 నాటి తన ప్రణాళికలో కేంద్ర కమిటీ యిలా పేర్కొంది: "పారిస్ శ్రామికులు, పాలకవర్గాల వైఫల్యాలను, విద్రోహాలను చూసి, సామాజిక వ్యవహారాల నిర్దేశకత్వాన్ని తమ చేతుల్లోకి తీసుకొని, పరిస్థితిని కాపాడాల్సిన క్షణం ఆసన్నమైందని గ్రహించారు.... రాజకీయాధికారాన్ని హస్తగతం చేసుకొని, తమ భవితవ్యాల కర్తృత్వాన్ని తామే వహించడమన్నది తమ సగర్వమైన విధియనీ, తిరుగులేని తమ హక్కనీ వారు గ్రహించారు."

---

* "కమ్యూన్ వర్ధిల్లాలి!" – సం.

అయితే, సంపద స్వాయత్తం చేసుకొనే వర్గానికి చెందిన ఆయా ప్రత్యర్థి మురాలు తమ తమ విజయ తరుణాల్లో చేసినట్లు, కార్మికవర్గం, తయారై సిద్ధంగా వున్న రాజ్యయంత్రాంగాన్ని కేవలం యిలా పట్టుకొని, అలా తన సొంత ప్రయోజనాల కోసం వాడుకోజాలదు

స్థాయీ సైన్యం పోలీసులు, బ్యూరాక్రసీ, మతగురువులూ, న్యాయాధికారి వర్గమూ అనే సార్వత్రికమైన అంగాలతో క్రమబద్ధము, క్రమానుగతమైన శ్రమ విభజనాంగాలతో కూడిన కేంద్రీకృత రాజ్యాధికారం, తిరుగులేని రాజరికపు రోజుల్లో ఆరంభమై, అప్పుడే ఉద్భవిస్తున్న బూర్జువా సమాజానికి, ఫ్యూడలిజం నుండి విముక్తి కోసం అది జరిపే పోరాటాల్లో మహా శక్తివంతమైన ఆయుధంగా ఉపయోగపడింది 18వ శతాబ్దం నాటి ఫ్రెంచి విప్లవం ఫ్యూడల్ ప్రభువుల, స్థానిక పట్టణవాస రాష్ట్రీయ ప్రత్యేక సౌకర్యాలనే చెత్తనంతటినీ తుడిచిపెట్టి, తద్వారా, రాజ్యపు ఉపరినిర్మాణానికున్న తుది మధ్యయుగావరోధాలను తొలగించి సాంఘిక భూమికను సిద్ధపరచింది. పాత, అర్ధ ఫ్యూడల్ యూరప్, నూతన ఫ్రాన్సుకి వ్యతిరేకంగా జరిపిన మిశ్రమ యుద్ధాల సంతానమైన మొదటి సామ్రాజ్యం క్రింద అది తన తుది రూపురేఖలు దిద్దుకుంది తదుపరి పార్లమెంటరీ పాలనల్లో, ప్రభుత్వాధికారపు పట్టు, పదవికీ, అక్రమధనార్జనకూ, పోషకత్వానికీ సంబంధించిన విరోధించజాలని దాని వ్యామోహాలతో పాలకవర్గాలకు చెందిన ప్రత్యర్థి మురాల మధ్య పోరాటాంశంగా తయారైంది. సంఘపు ఆర్థిక మార్పుల తోబాటే అదే కాలంలో దాని రాజకీయ స్వభావం కూడా మార్పు చెందింది. పరిశ్రమాభివృద్ధి పురోగమించిన, విస్తృతమైన, తీవ్రతరమైన స్థాయిలోనే పెట్టుబడికీ శ్రమకీ మధ్య వర్గ వైరుధ్యం పెరిగింది ప్రభుత్వ శక్తి శ్రమపై పెట్టుబడియొక్క జాతీయాధికార స్వభావాన్నీ, సాంఘిక బానిసత్వాన్ని అమలు జరిపేందుకు సంఘటితం చెయ్యబడిన రాజకీయ శక్తి స్వభావాన్నీ, వర్గ నిరంకుశత్వానికి కేవలం ఒక చోదక శక్తి స్వభావాన్నీ అంతకంతకు ఎక్కువగా సంతరించుకుంది వర్గాలయొక్క పోరాట (వర్గ పోరాట) క్రమం (అభివృద్ధి)లో ఒక కొత్త ప్రగతిశీల దశను సూచించే ప్రతి ప్రజా విప్లవం వెంటా, రాజ్యాధికారపు అణచివేత స్వభావం మరింత నిర్దాక్షిణ్యంగా, మరింత నగ్నంగా బయటికొస్తుంది. జూలై విప్లవం, రాజ్యయంత్ర నిర్వహణను భూస్వామి చేతుల నుంచి పెట్టుబడిదారు చేతుల్లోకి బదలాయించడం ద్వారా, కార్మికులయొక్క సుదూర శత్రువు చేతుల నుండి వాళ్ల సన్నిహిత శత్రువు చేతుల్లోకి దాన్ని బదలాయిస్తుంది. అందుకని, రాజ్యాధికారం, కార్మికవర్గానికి సంబంధించినంతవరకు మరింత స్పష్టమైన, నిర్దిష్టమైన శతృత్వ అణచివేత ధోరణిని వహిస్తుంది ఫిబ్రవరి విప్లవం "సామాజిక రిపబ్లిక్" పతాకాన్ని ఎగరేసి, తద్వారా, రాజ్యాధికారపు నిజమైన అర్థం బహిర్గతమవు

తుందనీ, రాజ్యాధికారం ప్రజా సంక్షేమాన్ని కాపాడే సాయుధబలం అనీ, అది సమాజపు సాధారణ ప్రయోజనాల మూర్తిత్వం అనీ, అది తమ తమ రంగాల్లో పని చేసిన వాటికన్న, పరస్పరం సంఘర్షించే ప్రైవేటు ప్రయోజనాల కన్న అతీతమైన దన్న వాదం తిరస్కరింప బడిందన్న సంగతిని ఆదిలోనే రుజువు చేసింది. ఈ విప్లవం, వర్గ నిరంకుశత్వపు సాధనంగా రాజ్యాధికారపు రహస్యం బహిర్గతం చెయ్యబడిందనీ, కార్మికులు రిపబ్లిక్కును, పాత పద్ధతి వర్గ పాలనకు రాజకీయ రూపాంతరంగా యికనెంత మాత్రమూ కోరుకోవడం లేదనీ, వర్గపాలననే బద్దలు చేసే విప్లవ సాధనంగా మాత్రమే వాళ్ళు దాన్ని కోరుతు న్నారనీ రుజువు చేస్తుంది. "సామాజిక రిపబ్లిక్" వల్ల ముంచు కొచ్చే ముప్పుల దృష్ట్యా, పాలకవర్గం సహజసిద్ధంగానే, పార్లమెంటరీ రిపబ్లిక్‌యొక్క అనామక పాలనను, పరస్పర విరుద్ధమైన తమ ముఠాల జాయింట్ స్టాక్ కంపెనీగా మార్చుకోవచ్చునని భావిస్తుంది. గత రాజరికాలు యిందుకు విరుద్ధంగా, తమ పేరును బట్టే ఒక ముఠా విజయాన్నీ, మరొక ముఠా పరాజయాన్నీ, పాలకవర్గానికి చెందిన ఒక విభాగపు ప్రయోజనాలపై మరొక విభాగపు ప్రయోజనాల విజయాన్నీ, పెట్టుబడిపై భూస్వామ్యంయొక్క లేక, భూస్వామ్యంపై పెట్టుబడియొక్క విజయాన్నీ సూచిస్తాయి. కార్మికవర్గానికి భిన్నంగా, యింతవరకూ పాలకవర్గంగా వున్న వర్గం, ప్రజా సామాన్యపు శ్రమను ఏ ప్రత్యేక రూపాల్లో కాజేసినప్పటికీ, దానికి ఒకే ఆర్థిక ప్రయోజనం వుంది: శ్రమ బానిసత్వాన్ని కొనసాగించడం, దాని ఫలితాలను ప్రత్యక్షంగా భూస్వామిగానో, పెట్టుబడిదారుగానో వినియోగించుకోవడం, లేక పరోక్షంగా భూస్వామియొక్క, పెట్టుబడిదారుయొక్క రాజ్య పరభాగ్యోపజీవులుగా వినియోగించుకోవడం; ఏ "వ్యవస్థ" అయితే ఉత్పత్తిచేసే ప్రజా సమూహాన్ని "అలగా మూక"గా "ఉన్నత వర్గాలకు" సంపదనూ, పాలనాధికారాన్నీ సమకూర్చే కేవల సాధనంగా తయారు చేస్తుందో ఆ "వ్యవస్థ"ను బలప్రయోగం ద్వారా అమల్లో పెట్టడం. అందుకనే లెజిటిమిస్టులు, ఆర్లియనిస్టులు, బూర్జువా రిపబ్లికన్లు, బోనపార్టిస్టు దుస్సాహసికులు, అన్నిటినీ మించి ఆస్తిని కాజెయ్యడం ద్వారా దాని రక్షకులు తామేనన్న ప్రతీతిని సంపాదించుకోవాలన్న ఆతృతతో, జతకూడి "పార్టీ ఆఫ్ ఆర్డర్"గా సమైక్యమయ్యారు. "సామాజిక రిపబ్లిక్" అన్న ఉత్సాహపూరిత నినాదాల క్రింద శ్రామికవర్గం చేసిన ఆ విప్లవ ఆచరణాత్మక పర్యవసానంగానే ఆ పార్టీ రూపొందింది. పార్టీ ఆఫ్ ఆర్డరుయొక్క పార్లమెంటరీ రిపబ్లిక్ అన్నది పాలకవర్గంయొక్క బీభత్స పాలన మాత్రమే కాదు: రాజ్యాధికారం, ఉత్పత్తిచేసే శ్రామికుని విప్లవ ఆకాంక్ష లకు వ్యతిరేకంగా, పెట్టుబడిదారు, భూస్వామి, వాళ్ల రాజ్యపరభాగ్యోపజీవుల (సంగతి చెప్పనే అక్కర్లేదు) చేతుల్లో అంతర్యుద్ధంయొక్క బాహాటంగా గుర్తింపబడిన సాధనంగా తయారవుతుంది.

రాజరిక పాలనల క్రింద, ఆనాడున్న ప్రభుత్వపు అణచివేత చర్యలనూ, అది ఉద్ఘాటించిన సూత్రాలనూ అధికారంలో లేని పాలకవర్గాలకు చెందిన ముఠాలు ప్రజల ముందు బట్టబయలు చేస్తాయి. పాలకవర్గపు ప్రత్యర్థి గణాలు, ప్రజల ప్రయోజనాలకు అనుకూలంగా మాట్లాడటం ద్వారా, ప్రజా వేదికల పట్ల తమ కపట అనుకూల వైఖరుల ద్వారా, పౌర స్వేచ్ఛలను బలపరచడం ద్వారా తమ పార్టీ కుమ్ములాటల్లో ప్రజలకు ఆసక్తి కల్పించడానికి ప్రయత్నిస్తాయి. కానైతే రిపబ్లిక్‌యొక్క అనామక పాలనలో (గత పాలనలన్నింటి ఆయుధాగారాల్లోని నిర్బంధాయుధాలను బయటికి తియ్యడం ద్వారా) గడచిపోయిన పాత పాలనలకు చెందిన నిర్బంధ విధానాలన్నింటినీ జమచేసి, వాటిని నిర్దాక్షిణ్యంగా ప్రయోగిస్తూ, పాలకవర్గానికి చెందిన వివిధ ముఠాలు విశృంఖలమైన సూత్రత్యాగమనే జాతరను జరుపుకొంటాయి. సిగ్గులజ్జలేకుండా తాము గతంలో చెప్పిన ప్రవచనాలను అవి తిరస్కరిస్తాయి. తమ సూత్రాలు "అనబడే" వాటిని కాలరాస్తాయి. వాటిపేరు తామే రెచ్చగొట్టిన విప్లవాలను దుమ్మెత్తి పోస్తాయి. దాని అనామక పాలన మాత్రమే వాటిని ప్రజలకు వ్యతిరేకంగా ఉమ్మడి పోరాటంలోకి ఆహ్వానించేటంతటి విస్తృతి కలిగివున్నా, చివరకు ఆ రిపబ్లిక్ పేరునే అవి దూషిస్తాయి.

ఈవిధంగా, యిది వర్గ పాలనకు సంబంధించిన అత్యంత క్రూరమైన, అదే సమయంలో మిక్కిలి ఏహ్యము, అసహ్యకరమైన రూపం. అంతర్యుద్ధ సాధనంగా మాత్రమే రాజ్యాధికారాన్ని ఉపయోగిస్తూ, దాన్ని అది, అంతర్యుద్ధాన్ని శాశ్వతంగా కొనసాగించడం ద్వారా మాత్రమే నిలుపుకోగలుగుతుంది. పార్లమెంటరీ అరాజకత్వాన్ని తలకెత్తుకొని, "ఆర్డర్" పార్టీకి చెందిన ముఠాల్లో ప్రతి ఒక్కటీ తన సొంత అభీష్టానికి అనుగుణమైన పాలన పునరుద్ధరణకు నిర్విరామంగా చేసే కుతంత్రాలు దానికి తోడు కాగా, తన సొంత సంకుచిత వలయానికి వెలపల గల యావత్తు సమాజంమీదా బహిరంగ యుద్ధంచేసే పార్టీ ఆఫ్ ఆర్డర్ పాలన బొత్తిగా భరించ రాని అక్రమ పాలనగా తయారవుతుంది. ప్రజా సమూహానికి వ్యతిరేకంగా తను చేసే యుద్ధంలో ప్రజల ప్రతిఘటనా సాధనాలన్నింటినీ విచ్ఛిన్నంచేసి, కార్యనిర్వాహకాధికారంయొక్క కరవాలం క్రింద వారిని నిస్సహాయులనుగా పడేసి వుంచిన పార్టీ ఆఫ్ ఆర్డరూ, దాని పార్లమెంటరీ పాలనా కార్యనిర్వాహకాధికారం కరవాలంచేత రంగ నిష్క్రమణం చేయించబడ్డాయి. అందుకే ఆ పార్లమెంటరీ పార్టీ ఆఫ్ ఆర్డర్ రిపబ్లిక్ మధ్యంతర ప్రభుత్వం మాత్రమే కాగలదు. అది ఎన్నవ సామ్రాజ్యమైనా కానీ, దాని సహజ పర్యవసానమే సామ్రాజ్యవాదం. సామ్రాజ్య రూపంలో రాజ్యాధికారం, తన రాజదండం స్థానంలో కరవాలాన్ని చేతధరించి, రైతాంగంపైన, శ్రమ పెట్టుబడుల వర్గ పోరాటానికి ఖచ్చితంగా బయటవున్న బ్రహ్మాండమైన ఉత్పత్తిదారుల సమూహంపైన తను ఆధారపడుతున్నట్లు చెప్పుకుంటుంది. పార్లమెంట

రిజాన్ని, తద్వారా పాలకవర్గాల రాజ్యాధికారానికి ప్రత్యక్ష పరాధీనతను విచ్ఛిన్నం చెయ్యడం ద్వారా, కార్మికవర్గాన్ని కాపాడుతానని చెప్తుంది. కార్మికవర్గాన్ని అవమానించకుండానే లొంగదియ్యడం ద్వారా పాలకవర్గాలనే కాపాడుతానని చెప్తుంది. తన లక్ష్యం — ప్రజా సంక్షేమం కాకపోయినా, కనీసం జాతీయ ఖ్యాతి అని అది చెప్పుకొంటుంది. అందుకనే అది "వ్యవస్థ రక్షకురాలు"గా ప్రకటింపబడింది. పాలకవర్గంయొక్క, దాని రాజ్య భాగ్యోపజీవులయొక్క రాజకీయాహంకారానికి అదెంతటి చీకాకు కలిగించేదైనా, దాని పరిశ్రమల విశృంఖల వ్యవహారానికీ, దాని చట్టావ్యాపార నైచ్యాలకీ, దాని జీవితానికి సంబంధించి వ్యామోహితం చేసే కృత్రిమ శోభలకీ పూర్తి అవకాశాన్ని కల్పించడం ద్వారా బూర్జువా "వ్యవస్థ"కి నిజంగా తగిన పాలన తనేనని అది రుజావు చేసుకుంటుంది. అలా, పౌర సమాజానికి అతీతమైనదిగా చేయబడినట్టు కనిపించే రాజ్యం, అదే కాలంలో తనే, ఆ సమాజపు సకల అవినీతులకూ సారవంతమైన క్షేత్రంగా తయారవుతుంది. దాని పరమ శైథిల్యమూ, దాన్నుండి కాపాడబడాల్సిన సమాజపు శైథిల్యమూ ప్రష్యా బయనెట్ల ముందు నగ్నంగా బయటపడింది. కానైతే, యీ సామ్రాజ్యవాదం ఎంతగా "వ్యవస్థ"యొక్క, బూర్జువా సమాజపు "వ్యవస్థ"యొక్క అనివార్య రాజకీయ స్వరూపమంటే, పారిస్‌లో వున్న దాని కేంద్ర పీఠాన్ని బెర్లిన్‌కి మార్చేందుకని ప్రష్యాయే దాన్ని వెనక్కి మళ్ళించిందేమోనన్నట్లు కనిపిస్తుంది.

సామ్రాజ్యం, దాని పూర్వపు వాటి మాదిరిగా — లెజిటిమిస్టు రాజరికం, రాజ్యాంగ బద్ధమైన రాజరికం, పార్లమెంటరీ రిపబ్లిక్కూ — బూర్జువా సమాజపు రాజకీయ రూపాల్లో ఏ ఒకటీ కాదు. అయితే అదే సమయంలో అది దాని పరమ అవినీతికర, దాని అత్యంత సంపూర్ణ, దాని అంతిమ రాజకీయ రూపం. కనీసం యూరప్ ఖండంలోనైనా, ఆధునిక వర్గ పాలనయొక్క రాజ్యాధికారం అదే.

1871 ఏప్రిల్, మే మాసాల్లో రచింపబడింది

మొట్టమొదటి సారిగా పూర్తిగా
ఆంగ్ల మూలంలోనూ, రష్యన్‌లో
"మార్క్స్ ఎంగెల్స్‌ల పురావస్తు
భాండాగారం"లోనూ ప్రచురింపబడింది,
వాల్యూం III (VIII), 1934



వెండొమ్ స్తంభాన్ని కూల్చివేయడం, 1871 మే 16

# రెండవ భాగం

# ఉపన్యాసాలు, వ్యాసాలు, పత్రాలు

# జాతీయ రక్షణ ప్రభుత్వంపై మార్క్స్ ఉపన్యాసపు రికార్డు[147]

## 1871 జనవరి 17 నాటి జనరల్ కౌన్సిలు సమావేశపు మినిట్స్ నుండి

పలువురు ఇంగ్లీషు సభ్యులు హాజరై వున్నారు కాబట్టి చాలా ముఖ్యమైన ప్రకటన ఒకటి చెయ్యాల్సి వుందని చెప్పాడు సిటిజన్ మార్క్స్. సెయింట్ జేమ్స్ హాలులో జరిగిన గత సమావేశంలో ఫ్రెంచి ప్రభుత్వాన్ని గురించి ఓడ్జర్ సత్య విరుద్ధంగా మాట్లాడాడు. తాత్కాలిక ప్రభుత్వ సభ్యులు కొందరికి, 1848 విప్లవం నుండే ఎటువంటి కుఖ్యాతి నచ్చి వున్నదో మన రెండవ విజ్ఞప్తిలో చెప్పాం. వాళ్లపైన ఎటువంటి నిందారోపణా లేదన్నాడు ఓడ్జర్. ఫ్రాన్‌ని రిపబ్లిక్ ప్రతినిధిగా మాత్రమే స్వీకరించ నచ్చు, అకలంక దేశభక్తుడు జూల్ ఫ్రాన్‌గా కాదు. ఈవాడు అతన్ని గురించి చెప్పబడుతున్న పద్ధతి ఫ్రాన్‌ని ముందుకు పెట్టి, రిపబ్లిక్‌ని దాదాపుగా కనుమరుగు చేస్తోంది. ఫ్రాన్ చర్యలకు ఒక ఉదాహరణ. 1848 విప్లవం తర్వాత ఫ్రాన్ ఆంతరంగిక శాఖ మంత్రి అయ్యాడు ఫ్లోకొన్ అనారోగ్యంతో వున్న కారణంగా, లెద్ర్యూ-రోలిన్ ఫ్రాన్‌ను ఎంచుకున్నాడు. మొట్టమొదట అతను తీసుకున్న చర్యలలో ఒకటేమిటంటే సైన్యాన్ని వెనక్కి పారిస్‌కి తీసుకురావడం. తర్వాత బూర్జువావర్గం కార్మికులను కాల్చి పారెయ్యడానికి యిదే తోడ్పడింది. తర్వాత, అసెంబ్లీ, బూర్జువావర్గ ప్రతినిధులతో కూడివుందని ఎప్పుడైతే గ్రహించారో, అప్పుడు ప్రజలు పోలండుకు అనుకూలంగా ప్రదర్శన జరిపారు. ఆ సందర్భంగా ప్రజలు సమావేశాల హాలులోకి చొచ్చుకువెళ్లారు.[148] వాళ్లతో మాట్లాడాల్సిందిగాను, నచ్చచెప్పి శాంతింప చెయ్యాల్సిందిగాను లూయీ బ్లాంక్‌ను అధ్యక్షుడు అర్థించాడు, ఆయన అలా చేశాడు. రష్యాతో యుద్ధం రిపబ్లిక్‌ను కాపాడి వుండేది. కొద్ది రోజుల తర్వాత జూల్ ఫ్రాన్ చేసిన మొదటి పనేమిటంటే, దాడిదారులతో కుమ్మక్కయ్యాడన్న నేరారోపణపై లూయీ బ్లాంక్‌ని ప్రాసిక్యూట్ చెయ్యడానికి అధికారమిమ్మని అడగడం. అలా చెయ్యమని అతగాడిని ప్రభుత్వం ఆదేశించిందేమోనని అసెంబ్లీ భావించింది. కాని, ప్రభుత్వంలోని మిగిలిన సభ్యులందరూ యిది ఫ్రాన్ వ్యక్తి

గత వ్యవహారమని చెప్పి, యీ చర్యను అధిక్షేపించారు. జూన్ తిరుగుబాటుకీను రెచ్చ గొట్టేందుకు తాత్కాలిక ప్రభుత్వం కుట్రచేసింది. ప్రజలు కాల్చివెయ్యబడ్డాక ఎగ్జి క్యూటివ్ కమిటీ[149] రద్దుచెయ్యబడాలని ఫ్రావ్ ప్రతిపాదించాడు. 27వ తేదీన, ఖైదీలను విచారణ లేకుండా ద్వీపాంతరవాసానికి పంపేందుకు ఒక శాసనాన్ని అతను తయారు చేశాడు; 15,000 మంది ద్వీపాంతర వాసం పంపబడ్డారు. నవంబరులో, అప్పటికింకా ద్వీపాంతరానికి రవాణా చెయ్యబడని కొందరు ఖైదీల విషయం అసెంబ్లీ పరిశీలించాల్సి వచ్చింది. ఒక్క బ్రెస్ట్‌లోనే 1000 మందిని విడుదల చెయ్యాల్సి వచ్చింది. ఒక మిలిటరీ కమిషను విచారణ జరిపిన మిక్కిలి ప్రమాదకారులనబడే వాళ్లలో పలు వురిని విడుదల చెయ్యాల్సి వచ్చింది, మిగిలిన వాళ్లకి స్వల్ప కాల శిక్షలు మాత్రమే విధింపబడ్డాయి. అటు తర్వాత క్షమాదానం కోసం ప్రతిపాదనలొచ్చాయి, ఫ్రావ్ వాటి నెప్పుడూ వ్యతిరేకిస్తూ వచ్చాడు. ఫిబ్రవరిని మినహాయించి యావత్తు విప్లవంపైనా విచారణ జరిపేందుకు ఒక కమిషన్‌ని నియమించాలని పట్టుబట్టిన వాళ్లలో అతనొకడు. అంతకు ముందెన్నడూ లేనంతటి అత్యంత నికృష్టమైన ప్రెస్ లాస్ (పత్రికా చట్టాలు)[150] ఆమోదింపబడటానికి అతను కారకుడు, వాటిని నెపోలియన్ బాగా వినియోగించుకున్నాడు. జూలై రాజరికం క్రింద బోనపార్టిస్టులతో ఫ్రావ్‌కి కొన్ని సంబంధాలున్నాయి. దానితో, నెపోలియన్‌ని జాతీయ అసెంబ్లీలోకి తెచ్చేందుకు, తనకున్న పలుకుబడినంతటినీ అతను వినియోగించాడు. రోమ్‌పై దాడి[47] విషయంలో అతను ప్రత్యేకాసక్తి చూపాడు. సామ్రాజ్య స్థాపనకు అదే తొలిమెట్టు.

ఉపన్యాసానికి సంబంధించిన
వివరమైన రిపోర్టు (కర్త
పేరు ప్రస్తావన లేకుండా)
"The Eastern Post" 1871 జనవరి
21వ తేదీ, 121వ
సంచికలో ప్రచురింపబడింది

# పారిస్‌లో మార్చి 18 నాటి విప్లవంపై ఎంగెల్సు ఉపన్యాసపు రికార్డు[151]

## 1871 మార్చి 21 నాటి జనరల్ కౌన్సిలు సమావేశపు మినిట్స్ నుండి

పారిస్‌లో వ్యవహారాల పరిస్థితిని అప్పుడు సిటిజన్ ఎంగెల్సు సవివరంగా వర్ణించాడు. పారిస్ నుండి ఆ వారంలో వచ్చిన ఉత్తరాలు — వీటిని గురించి సెక్రటరీ యింతకు ముందే పేర్కొన్నాడు — యింత దాకా అగ్రాహ్యంగా ఉన్నదాన్ని స్పష్టపరచాయి. ఇంత దాకా, ఏదో కొద్దిమంది వ్యక్తులు అకస్మాత్తుగా అనేక ఫిరంగులను పట్టుకొని అట్టే పెట్టేసుకున్నారేమోనని అనిపించింది. అన్ని పత్రికలూ, విలేకరుల్లో ప్రతి ఒక్కడూ వీళ్ళని అణచిపారెయ్యాలనే రాశారు, కాని ఫ్రెంచి ప్రభుత్వం మాత్రం వెనక్కితగ్గి సమయోచితంగా ప్రవర్తించింది. మా పారిస్ కమిటీ నుంచి వచ్చిన సమాచారం ఏమిటంటే ఈ ఫిరంగుల తయారీకి అయిన ఖర్చును నేషనల్ గార్డులు చెల్లించారు, వాళ్ళు వాటిని అట్టే పెట్టుకోవాలని కోరుకుంటున్నారు. ఎన్నుకోబడిన జాతీయ అసెంబ్లీ[152] క్రింద రిపబ్లిక్ ఎంతమాత్రమూ భద్రంగా వుండదన్న సంగతిని వాళ్ళు ఎన్నికల తర్వాత గ్రహించారు. ప్రష్యన్లు పారిస్‌లో ప్రవేశించినప్పుడు ఫిరంగులు వాళ్ళకి అందుబాటులో లేకుండా ఉండేందుకుగాను పట్టణంలోని మరో భాగానికి తరలించబడ్డాయి. అప్పుడిక ప్రభుత్వం ఫిరంగులు తమవేనని చెప్పి నేషనల్ గార్డుల నుండి వాటిని తీసేసుకునేందుకు ప్రయత్నించింది. ఒరేల్ డి పలడీన్ నేషనల్ గార్డుల కమాండర్-ఇన్-ఛీఫ్‌గాను, పోలీసు ప్రిఫెక్టుగాను నియమించబడ్డాడు.* నెపోలియన్ క్రింద యితగాడు జెండార్మరీ (సాయుధ పోలీసు దళం) కమాండర్-ఇన్-ఛీఫ్‌గా వున్నాడు. ఇతను మతబోధకుల

---

* తదుపరి సమావేశంలో, 1871 మార్చి 28న, మార్చి 21 నాటి తన ఉపన్యాసపు నోట్సులో ఒక పొరపాటుందని ఎంగెల్సు పేర్కొన్నాడు: "ఒరేల్ డి పలడీన్, వలంటేన్ అనే యిద్దరు జనరల్సు, ఒక్కరుగా చెయ్యబడ్డారు. వీరిలో రెండవ వ్యక్తి పోలీసు ప్రిఫెక్టుగా నియమించబడ్డాడు." — సం.

పక్షపాతి. అర్లియన్సు బిషప్ డ్యుపన్లూ ఆదేశం మేరకు యితగాడు చర్చిలో అయిదు గంటల పాటు ప్రాయశ్చిత్త కర్మకాండ జరిపాడు. సరిగా అదే సమయంలో జర్మన్లపై పోరాటం జరుపుతున్న యితని సైన్యం ఓడింపబడింది. దీన్ని బట్టి ప్రభుత్వ అంతర్యమేమిటో అసందిగ్ధంగా బయటపడింది.

అప్పుడిక నేషనల్ గార్డు ప్రతిఘటనకు సన్నద్ధమైంది. 260 బెటాలియన్ల లోనూ 215, సైనికులతో ఆఫీసర్లతో కూడిన ఒక కేంద్ర కమిటీని ఏర్పాటు చేసుకున్నాయి. ప్రతి ఒక కంపెనీచేతా ఒకొక్క ప్రతినిధి ఎన్నుకోబడ్డాడు. వాళ్లలోంచి జిల్లాలకు, లేక వార్డులకు చెందిన స్థానిక కమిటీలు ఏర్పాటు చెయ్యబడ్డాయి. నేషనల్ గార్డు కేంద్ర కమిటీని ఎన్నుకుంది.

20 జిల్లాలలోనూ కేవలం అయిదు మాత్రమే ఏ ప్రతినిధులనూ ఎన్నుకోలేదు. అసెంబ్లీ వెర్సేల్స్‌కు తరలిపోయినప్పుడిక ప్రభుత్వం పారిస్‌లోని విప్లవవాదులను ఏరిపారెయ్యాలనీ, వాళ్ల దగ్గర్నుంచి ఫిరంగులను వశం చేసుకోవాలనీ ప్రయత్నించింది. పారిస్‌కి యిప్పుడే చేరుకున్న సైనిక దళాలు, 1851 నాటి coup d'état (రాజకీయ కుట్ర) కాలంలో ప్రజలను వీధుల్లో కాల్చిచంపిన సైనికులకు నాయకత్వం వహించిన వినువా నాయకత్వంలో వినియోగింపబడటానికే ఉద్దేశింపబడ్డాయి. వాళ్లు తెల్లవారు జామున పాక్షికంగా విజయం సాధించారు కాని నేషనల్‌గార్డులు జరిగిందేమిటో కనిపెట్టగానే ఫిరంగులను పునరాక్రమించుకొన పూనుకొన్నారు, సైనికులు ప్రజల పట్ల సౌభ్రాతృత్వం ప్రదర్శించి వారితో సహకరించారు. పట్టణం యిప్పుడిక ప్రజల చేతుల్లో వుంది; ప్రజల పక్షాన చేరిపోని సైనిక దళాలు వెర్సేల్స్‌కి ఉపసంహరింపబడ్డాయి. అసెంబ్లీకి ఏమి చెయ్యడానికీ పాలుపోలేదు.

కేంద్ర కమిటీకి చెందిన వ్యక్తుల్లో ఏ ఒక్కడూ ప్రసిద్ధుడు కాడు. ఫెలిక్స్ పియా, ఆ బాపతు మనుష్యులూ అందులో లేరు. కానైతే వాళ్లు కార్మికవర్గంలో సుపరిచితులు. కమిటీలో ఇంటర్నేషనల్‌కి చెందిన నలుగురు సభ్యులున్నారు.

కమ్యూన్ మరునటి రోజున ఎన్నుకోబడాల్సి వుంది. పత్రికా స్వాతంత్ర్యం పాటింపబడాల్సిందే కాని నికృష్టమైన బోనపార్టిస్టు పత్రికలకు మాత్రం యిది వర్తించదని కేంద్ర కమిటీ ప్రకటించింది. అది ఆమోదించిన తీర్మానాలన్నింటిలోనూ మిక్కిలి ముఖ్యమైనది శాంతికి సంబంధించిన ప్రాథమిక షరతులు పాటింపబడాలన్నది. ప్రష్యన్లింకా దగ్గర్లోనే ఉన్నారు. కలహంలో వాళ్లు ప్రవేశించకుండా చెయ్య గలిగితే విజయావకాశాలు పెరుగుతాయి.

ఉపన్యాసానికి సంబంధించిన
రిపోర్టు (కర్త పేరు ప్రస్తావన
లేకుండా) "The Eastern Post," 1871
మార్చి 25వ తేదీ 130వ
సంచికలో ప్రచురింపబడింది

## కార్ల్ మార్క్స

# "The Times" పత్రిక సంపాదకునికి[153]

మహాశయా, విస్తృతంగా వ్యాపింప చెయ్యబడిన అసత్యాలను ఖండించేందుకు గాను మీ పత్రిక పేజీల్లో కొద్ది స్థలాన్ని వినియోగించుకోవడానికి అనుమతిస్తారా?

పారిస్, మార్చి 30 తేదీ లొంబార్డు టెలిగ్రాములో "Gaulois"[154] పత్రిక నుండి కొంత భాగం ఉటంకించబడింది. "లండన్‌లో పారిస్ విప్లవ నిర్మాణ ప్రయత్నాలు?" అంటూ సంచలనాత్మకమైన శీర్షికతో గత శనివారపు లండన్ పత్రికలను అది అలంకరించింది. గత యుద్ధ కాలంలో, పారిస్ petite presse*ను యూరప్ అంతటా ఒక లోకోక్తిగా తయారుచేసిన, మున్హౌసెన్** అభూత కల్పనల్లో "Figaro," "Paris-Journal"[155] పత్రికలతో విజయవంతంగా పోటీ చేసిన పత్రిక యిది. అటువంటి ఆ "Gaulois" పత్రిక, వార్తా పత్రికలు చదివే జనం సదా "Credo quia absurdum est"*** అనే సూత్రానికే కట్టుబడివుంటారని యింతకు ముందెప్పటికన్న యిప్పుడెక్కువ నమ్మకంతో ఉన్నట్టు కనిపిస్తుంది. సాక్షాత్తూ బేరన్ మున్హౌసెన్, "ఫిబ్రవరి మొదటి భాగంలో," త్యేర్ యింకా ఎటువంటి అధికారిక పదవినీ ఆక్రమించుకోనప్పుడు, అదే త్యేర్ పారిస్ నేషనల్ గార్డును నిరాయుధం గావించేందుకు చేసిన ప్రయత్నం ద్వారా అస్తిత్వంలోకి తెచ్చిన "మార్చి 18నాటి తిరుగుబాటు"ను, నిర్వహించేందుకు పూనుకొని ఉండేవాడా? లండన్‌లో వాలో ఒక గుప్త స్థానంలో కుట్ర

---

* ఛోటా పత్రికలు. — సం.

** మున్హౌసెన్ — జర్మన్ సాహిత్యంలో బడాయికోరుకీ, ప్రదపోతుకీ పేరు. — సం.

*** "అది అసందర్భంగా ఉంది కనుకనే నేను దాన్ని నమ్ముతాను" (రెండవ శతాబ్దపు అంత్యభాగానికీ, 3వ శతాబ్దపు తొలి భాగానికీ చెందిన టెర్టూల్లియన్ అనే క్రిస్టియన్ రచయితకు ఆపాదించబడిన మాటలు). — సం.

చేసేందుకుగాను, అస్సీ, బ్లాంకీలను లండన్‌కు ఊహాజనిత యాత్ర చేయించడంతో తృప్తిపడకుండా, "Gaulois" పత్రిక ఆ గుప్త కూటానికి మరో యిద్దరు కల్పిత వ్యక్తులను — ఒకరు "బెంటేని, ఇటలీకి జనరల్ ఏజెంటు," మరొకరు, "డెర్మాట్, ఇంగ్లండుకి జనరల్ ఏజెంటు" — చేర్చింది. మొదట "Paris-Journal" నాకు తగిలించబడిన, "ఇంటర్నేషనల్ సుప్రీమ్ ఛీఫ్" అనే ఉన్నత హోదాను సైతం ఉదారంగా అది ఖాయపరచింది. ఈ ఘనమైన రెండు పత్రికలూ ఏమి రాసినప్పటికీ, ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్స్ అసోసియేషన్[16] జనరల్ కౌన్సిలు, "ఛీఫ్," లేక "అధ్యక్షుడు" అనే భారం లేకుండానే తన వ్యవహార నిర్వహణను కొనసాగిస్తుందని నేను భావిస్తున్నాను.

ఇట్లు తమ విధేయుడు,

కార్ల్ మార్క్స్

లండన్, ఏప్రిల్ 3

"The Times"
1871 ఏప్రిల్ 4వ తేదీ,
27028వ సంచికలోను,
"The Daily News"
1871 ఏప్రిల్ 6వ తేదీ
7780వ సంచికలోను
ప్రచురింపబడింది

# పారిస్ కమ్యూన్‌పై ఎంగెల్సు ఉపన్యాసపు రికార్డు

## 1871 ఏప్రిల్ 11 నాటి జనరల్ కౌన్సిలు సమావేశపు మినిట్స్ నుండి

సిటిజన్ ఎంగెల్స్ తానింకో వాస్తవాన్ని తెలియజెయ్యాల్సి వుందన్నాడు. పత్రికలు ఇటీవల, అసోసియేషన్[16] చేసిన అద్భుతాలతో నిండివుంటున్నాయి. ఒక పారిస్ పత్రికలో వెలువడిన చిట్టచివరి విడ్డూరం ఏమిటంటే, మార్క్స్ 1857లో బిస్మార్కుకి ప్రైవేటు సెక్రటరీగా ఉన్నాడని.

పారిస్ వ్యవహారాన్ని గురించి ఏదో ఒకటి చెప్పకుండా ఉండలేక పోయానన్నాడు. నేషనల్‌గార్డు కేంద్ర కమిటీ ఆ వ్యవహారాన్ని నిర్వహించినంత కాలమూ అది బాగానే సాగింది కాని, ఎన్నికల[156] తర్వాత కబుర్లేగాని కార్యాచరణ లేకుండా పోయింది. వెర్సేల్స్‌కి వ్యతిరేకంగా చర్య తీసుకోవలసిన తరుణం అది బలహీనంగా ఉన్నప్పుడు, కానైతే, ఆ అవకాశం చెయ్యి జార్చబడింది, ఇప్పుడేమో వెర్సేల్స్‌ది పైచెయ్యి అవుతున్నట్లూ, అది పారిస్ వాసులను వెనక్కి తరుముతున్నట్లూ కనిపిస్తోంది. అపజయం దిశగా నడవ బడటాన్ని ప్రజలు ఎక్కువ కాలం సహించరు. వాళ్ళు భూభాగాన్ని పోగొట్టుకున్నారు, వాళ్ళ మందు గుండు సామగ్రి వృథాగా ఖర్చయి పోయింది, వాళ్ళ ఆహారపదార్థాలు తరిగి పోతున్నాయి. పారిస్‌యొక్క ఒక పార్శ్వం తెరచివున్నంత కాలం వాళ్ళని మాడ్చి లొంగ దీసుకోవడం సాధ్యం కాదు. ప్రష్యన్ సహాయం తీసుకోవడానికి ఫ్రావ్ నిరాకరించాడు.[157] 1848 జూన్‌లో పోరాటం నాలుగు రోజుల్లోనే ముగిసింది,[8] కానైతే అప్పుడు కార్మికులకు ఫిరంగుల్లేవు. పోరాటం ఇప్పుడంత తొందరగా ముగియదు. లూయీ నెపోలియన్ వీధులను వెడల్పు చేయించాడు, వాటిలో ఫిరంగులు పెట్టి కార్మికుల మారణహోమం జరపవచ్చు నని, కాని యిప్పుడది వాళ్ళకే అనుకూలంగా ఉంది: వాళ్ళే యిప్పుడా వీధుల్లో తమ ఫిరంగులతో ఎదిరి పక్షాన్ని కాల్చివేస్తారు. కార్మికులు — 2,00,000 మంది — ఇంతకు పూర్వపు ఏ తిరుగుబాటులోకన్న యిప్పుడు ఎంతో బాగా సంఘటితులై వున్నారు.

వాళ్ల పరిస్థితి కష్టమైనది. వాళ్ళ అవకాశాలు ఒక పక్షం రోజుల ముందున్నంత బాగా లేవు.

మొట్టమొదట రష్యన్ భాషలో<br>
"ప్రావ్ద" వార్తాపత్రికలో<br>
1932 మార్చి 18వ తేదీ<br>
77వ సంచికలో ప్రచురించబడింది

# పారిస్ కమ్యూన్‌పై మార్క్స్ ఉపన్యాసపు రికార్డు

## 1871 ఏప్రిల్ 25 నాటి జనరల్ కౌన్సిల్ సమావేశపు మినిట్స్ నుండి

[మార్క్స్] .. లేక పత్రికలు.* కమ్యూన్‌కీ లండన్‌కీ మధ్య వాణిజ్య సంబంధాలు ఒక సంచార ఏజెంటు ద్వారా కొనసాగింపబడతాయి కాబట్టి ఈ లోపం భవిష్యత్తులో సరిదిద్దబడుతుంది ఈ ఏజెంటే మన కమ్యూనికేషన్ల (ఉత్తరప్రత్యుత్తరాల) విషయంలో కూడా బాధ్యత తీసుకుంటాడు.

17వ డిస్ట్రిక్టులో ఏర్పడ్డ ఖాళీలు భర్తీ చెయ్యడానికిగాను సెరయ్యే, దుపాన్‌లు అభ్యర్థులుగా నామినేట్ చేయబడ్డారు.[158] దుపాన్ తప్పక ఎన్నికవుతాడని సెరయ్యే రాశాడు, కాని ఎన్నికల తర్వాత అతను మళ్లీ రాయలేదు, అతను మాంచెస్టరుకి రాసి వుంటాడు. చేరిన ఉత్తరాలకన్న ఎక్కువ ఉత్తరాలే రాయబడినట్లు కనిపిస్తుంది.

పారిస్‌లో ఫేలిక్స్ పియా, వెసిన్యేలు, సెరయ్యే, దుపాన్‌లపైన అభాండాలు వేస్తున్నారు; సెరయ్యే కోర్టులో కేసు పెడతానని బెదిరించినప్పుడు వాళ్లు తమ కర్తృత్వాన్ని తిరస్కరించారు. సెరయ్యే, దుపాన్‌లపైన పియా అభాండాలు వెయ్యడానికి కారణాలను తెలియజేస్తూ పారిస్‌కి వెన్వెంటనే రాయాలి, సిటిజన్ మోటెర్స్‌హెడ్ ప్రతిపాదనపైన రాయడానికి సిటిజన్ మార్క్స్ ఆదేశింపబడ్డాడు.[159]

[మార్క్స్] ఆ ఉత్తరాలను లఫార్గ్ పారిస్ సైనిక స్థావరాల వెలుపల పోస్టు చేశాడు; అందుకని అవి రైళ్లో ఆలస్యం చెయ్యబడ్డాయి: ఫ్రెంచి ప్రష్యన్ ప్రభుత్వాలు రెండూ వాటిని మనిశితంగా పరిశీలించాయి. వాటిలో ఉన్న సమాచారంలో చాల

---

* మార్క్స్ ఉపన్యాసారంభం ఇప్పటికి లేదు, ఎందుచేతనంటే దీనికి జత చేరే పేజి జనరల్ కౌన్సిలు మినిట్ బుక్‌లో లోపించింది. — సం.

వరకు పాతదే, కానైతే పత్రికలివ్వని కొన్ని వాస్తవాలున్నాయి. ముట్టడి కాలంలో లాగే పారిస్‌లో ఏమి జరుగుతోందన్నది రాష్ట్రాలకు చాలా తక్కువ తెలిసిందని పేర్కొన బడింది. పోరాటం కొనసాగుతున్న చోట మినహాయించి పారిస్‌లోనే యింత ప్రశాంతంగా ఎన్నడూ లేదు. మధ్యతరగతి వారిలో ఎక్కువ భాగం బెల్‌విల్ నేషనల్ గార్డుతో కలి శారు. బడా పెట్టుబడిదారులు పలాయనం చిత్తగించారు, సన్నకారు వర్తక జనం, కార్మికవర్గాన్ని అనుసరించారు. ప్రజలయొక్క, నేషనల్ గార్డుయొక్క ఉత్సాహాన్ని అంచనా వెయ్యడానికి ఎవరికీ శక్యం కాలేదు. వెర్సేల్స్‌లోని వ్యక్తులు పారిస్‌లో ప్రవేశించ గలమని విశ్వసించి వుంటే వాళ్లు తప్పక మూర్ఖులై వుండాలి. రాష్ట్రాల్లో తిరుగుబాటు పట్ల పారిస్‌కి నమ్మకం లేదు. తనకి వ్యతిరేకంగా బలవత్తరమైన బలగాలు రప్పింప బడ్డాయన్న సంగతి దానికి తెలుసు, కానైతే అందుకది ఏమీ భయపడలేదు, దానికి వున్న భయమల్లా ప్రష్యా బోక్యాన్ని గురించీ, జీవితావసరవసర వస్తువుల కొరతను గురించీ మాత్రమే. అద్దెకూ, వాణిజ్య బిల్లులకూ సంబంధించిన శాసనాలు రెండూ సరైన తరుణంలో తీసుకున్న రెండు పటిష్ఠమైన చర్యలు: అవి లేని నాడు వర్తక జనంలో నాలుగింట మూడు వంతుల మంది దివాళా తీసివుండేవారు. ద్యువాల్, ఫ్లొరెన్సుల హత్య పగసాధింపు ఉద్రేకాలను రెచ్చగొట్టింది. వారి మృతికి కారణాన్ని నికరంగా తేల్చుకునేందు కోసం ఫ్లోరెన్సు కుటుంబమూ, కమ్యూనూ ఒక ఆఫీసరును పంపాయి, కాని ఫలితం శూన్యం అయింది. ఫ్లోరెన్సు ఒక యింట్లో చంపబడ్డాడు.

తప్పుడు టెలిగ్రాముల సృష్టికి సంబంధించి కొంత సమాచారం వుంది. జాతీయ రక్షణ ప్రభుత్వపు జమాఖర్చులను ప్రొటో* పరిశీలించినప్పుడు, మెరుగొనర్చబడిన పోర్టబుల్ గిలటిన్ నిర్మాణానికి సొమ్ము చెల్లింపబడిందన్న సంగతిని కనుగొన్నాడు. కమ్యూన్ ఆజ్ఞ మేరకు ఆ గిలటిన్‌ని పట్టుకొని బహిరంగంగా కాల్చేశారు. గ్యాస్ కంపెనీ మునిసిపాలిటీకి పదిలక్షల ఫ్రాంకులకుపైగా బకాయి పడింది. కాని, దాని సరకులను పట్టుకున్న తర్వాతగాని, ఆ మొత్తం చెల్లించడానికి అది సుముఖత చూపలేదు; ఆ తర్వాతనే ఆ మొత్తానికి బ్యాంక్ ఆఫ్ ఫ్రాన్సుపై బిల్లు యివ్వబడింది. ఈ వ్యవహారాలకు సంబంధించి టెలిగ్రాములూ, విలేకరులూ పూర్తిగా భిన్నమైన కథనాల నిచ్చారు. కమ్యూన్ యింత పొదుపుగా పాలన సాగించడం అన్నింటికన్న ఎక్కువగా వాళ్లకు కన్నెర్రగా తయారైంది. అత్యున్నతాధికారులు ఏడాదికి కేవలం 6000 ఫ్రాంకుల జీతం

---

* ప్రొట్టో అని వుండాలి. — సం.

చొప్పున మాత్రమే పొందుతున్నారు, మిగిలిన వాళ్లకు కార్మికుని వేతనాలు మాత్రమే ముదుతున్నాయి.

విజ్ఞప్తి* వచ్చే సమావేశం నాటికి సిద్ధం కావాలి.

1871, ఏప్రిల్ 29వ తేదీ,
"The Eastern Post"
135వ సంచికలో
(కర్త పేరు ప్రస్తావన
లేకుండా) ఉపన్యాసపు
సవివరమైన రిపోర్టు
ప్రచురింపబడింది

* "ఫ్రాన్సులో అంతర్యుద్ధం." — సం.

ఫ్రెడరిక్ ఎంగెల్స్

# ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్స్ అసోసియేషన్ నుండి టొలేన్‌ను బహిష్కరిస్తూ జనరల్ కౌన్సిల్ తీర్మానం[180]

ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్స్ అసోసియేషన్ జనరల్ కౌన్సిలు,

కార్మికవర్గపు ప్రతినిధిగా జాతీయ అసెంబ్లీకి ఎన్నుకోబడిన పిమ్మట, మిక్కిలి అవమానకరమైన పద్ధతిలో దాని లక్ష్యానికి తిలోదకాలిచ్చిన సిటిజన్ టొలేన్‌ని అసోసియేషన్ నుంచి బహిష్కరిస్తూ పారిస్ శాఖల ఫెడరల్ కౌన్సిల్ చేసిన తీర్మానాన్ని, జనరల్ కౌన్సిలు ధృవీకరణ కోసం పంపబడిన తీర్మానాన్ని పరిశీలించి,

ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్స్ అసోసియేషన్‌కి చెందిన ప్రతి ఫ్రెంచి సభ్యుని స్థానమూ అక్రమాక్రమణదారీ, విప్లవ ప్రతిఘాత వెర్సేల్స్ అసెంబ్లీలో కాక, నిస్సందేహంగా పారిస్ కమ్యూన్ పక్షంలోనే ఉన్న దృష్ట్యా,

పారిస్ ఫెడరల్ కౌన్సిలు తీర్మానాన్ని ధృవీకరించి, ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్స్ అసోసియేషన్ నుండి సిటిజన్ టొలేన్ బహిష్కరింపబడ్డాడని యిందు మూలంగా ప్రకటిస్తోంది.

పారిస్ ఫెడరల్ కౌన్సిలుయొక్క పై తీర్మానం రూఢియైన రూపంలో ఏప్రిల్ 25న మాత్రమే తమ ముందుంచబడిన దృష్ట్యా, జనరల్ కౌన్సిలు ఈ అంశంపై యింతకంటె ముందే చర్య తీసుకొనలేకపోయింది.

1871 ఏప్రిల్ 25న ప్రవేశపెట్టబడింది

"The Eastern Post" 135వ సంచిక,
1871 ఏప్రిల్ 29; "L'Internationale"
122వ సంచిక, 1871, మే 14;
"Der Volksstaat" 42వ సంచిక,
1871 మే 24లలో ప్రచురింపబడింది

# పారిస్ కమ్యూన్‌పై ఎంగెల్సు ఉపన్యాసపు రికార్డు

## 1871 మే 9 నాటి జనరల్ కౌన్సిలు సమావేశపు మినిట్స్ నుండి

సిటిజన్ ఎంగెల్స్ అప్పుడు విజ్ఞప్తి* యింకా తయారు కాలేదని పేర్కొన్నాడు. సిటిజన్ మార్క్సు తీవ్ర అస్వస్థతలో ఉన్నాడనీ, విజ్ఞప్తి తయారీ ఆయన పరిస్థితిని మరింత క్లిష్టం చేసిందనీ చెప్పాడు. కానైతే అది శనివారంనాడు తయారవుతుందనీ, ఆ రోజు మధ్యాహ్నం 5 గంటల తర్వాత ఏ వేళప్పుడైనా సరే సబ్‌కమిటీ[161] మార్క్సు యింటివద్ద కలుసుకో వచ్చుననీ చెప్పాడు.

కమ్యూన్ నుండి ఒక ప్రతినిధి యిక్కడికొచ్చాడు. పరిస్థితులు బాగున్నాయి. పాస్‌పోర్టులులేని వ్యక్తులను పోనివ్వకుండా బందోబస్తు చెయ్యాలి. వెర్సేల్స్ నుండి వచ్చిన గూఢచారులు తాపీగా అటూ యిటూ సంచరిస్తున్నట్లు బయటపడింది. ప్రధానమైన దాడి విఫలమైంది. వెర్సేల్స్ సైన్యం నేషనల్ గార్డుకీ ప్రాకారానికీ మధ్య చొరబడాలని ప్రయత్నించింది. కాని అది యిప్పుడు ఒక్క చోట మాత్రమే దాడి చెయ్యగలిగింది, అది వాళ్ళింతకు ముందు విఫలమైన చోటు, రక్షణ అంతకంతకు దృఢతరమవుతోంది. కమ్యూన్ కొంత పట్టును కోల్పోయింది (కాని) క్లమార్‌ను తిరిగి సంపాదించుకుంది. సైన్యం ఒకవేళ ప్రాకారం దగ్గర విజయవంతమైనా కూడా తర్వాత బ్యారికేడ్లున్నాయి. జరగబోతున్న పోరాటాన్ని పోలిన పోరాటం ముందెన్నడూ జరగలేదు. మొట్టమొదటి సారిగా బ్యారికేడ్లు ఫిరంగుల చేతా, సైనిక తుపాకుల చేతా, క్రమబద్ధంగా సంఘటిత మొనర్చబడిన బలగాల చేతా పరిరక్షింపబడతాయి. తల పడుతున్న సైన్యాలు రెండూ దాదాపు సమ ఉజ్జీలుగా ఉన్నాయిప్పుడు. వెర్సేల్స్, రాష్ట్రం నుండి సైనిక దళాలనేమీ రప్పించుకోగల స్థితిలో లేదు. పైగా వాళ్లే కొన్నింటిని పట్టణాల్లో శాంతి భద్రతలు కాపాడటానికి పంపాల్సి వచ్చింది. మునిసిపల్ కౌన్సిళ్ల బోర్డులో సమావే

---

* "ఫ్రాన్సులో అంతర్యుద్ధం." — సం.

శమై రాజకీయాలు చర్చించుకోవడాన్ని సైతం త్యేర్ సాగనివ్వ లేకపోయాడు, దాన్ని నివారించేందుకతను నెపోలియన్ చట్టాన్ని వినియోగించాల్సి వచ్చింది.[146]

మొదట రష్యన్ భాషలో
"పారిస్ కమ్యూన్ రోజుల్లో
మొదటి ఇంటర్నేషనల్"
(1941) అనే పుస్తకంలో
ప్రచురింపబడింది

# పారిస్ కమ్యూన్‌పై మార్క్స్ ఉపన్యాసపు రికార్డు[162]

## 1871 మే 23 నాటి జనరల్ కౌన్సిలు సమావేశపు మినిట్స్ నుండి

సిటిజన్ మార్క్స్ తను జబ్బుపడ్డాననీ, తను రాస్తున్న విజ్ఞప్తి*ని పూర్తి చెయ్యలేక పోయాననీ, అయితే వచ్చే మంగళవారం నాటికి దాన్ని తయారుచెయ్యగలనని ఆశిస్తున్నాననీ వివరించాడు. పారిస్‌లో పోరాటాన్ని గురించి ప్రస్తావించి దాని ముగింపు దగ్గరపడుతున్నట్లు తనకు తోస్తున్నదనీ, ఒకవేళ కమ్యూనే కనక ఓడింపబడితే, పోరాటం కేవలం వాయిదా మాత్రమే పడుతుందన్నాడు. కమ్యూన్ సూత్రాలు శాశ్వతమైనవనీ, వాటిని రూపుమాపడం సాధ్యంకాదనీ చెప్పాడు; కార్మికవర్గం విముక్తమయ్యే దాకా అవి పదేపదే ముందుకొస్తాయి. పారిస్ కమ్యూను ప్రష్యన్ల తోడ్పాటుతో అణచివెయ్యబడుతోంది. థ్యేర్ తరపున జెండార్మ్‌ల్లా వాళ్లు పనిచేస్తున్నారు. కమ్యూన్‌ని నాశనం చేసేందుకు పన్నబడిన కుట్ర బిస్మార్క్, థ్యేర్, ఫావ్‌లచేత రూపొందింపబడింది. తను జోక్యం చేసుకోవాల్సిందిగా థ్యేర్, ఫావ్‌లు కోరారని బిస్మార్క్ ఫ్రాంక్‌ఫుర్ట్‌లో చెప్పాడు. ఫలితాన్ని పరిశీలిస్తే, జర్మన్ సైనికుల ప్రాణాలను పణంగా పెట్టడంతప్ప — అదైనా, లబ్ధిపొందే దేమైనావుంటే ప్రాణానికి అతనేమైనా విలువయిస్తాడనేమీ లేదు — వాళ్లకి తోడ్పాటునివ్వడానికి ఏమి చెయ్యడానికైనా సంసిద్ధమేనన్న సంగతి స్పష్టమవుతుంది. అతను కేవలం కోరుకునేదల్లా ఫ్రాన్సు మరింత పతనం కావాలని, అప్పుడే తను దాన్నుండి మరింత గుంజుకోగలనని. కన్వెన్షనులో ఆమోదింపబడిన దానికన్న ఎక్కువమంది సైనికులను కలిగివుండేందుకు థ్యేర్‌ను అతను అనుమతించాడు, పారిస్‌లోకి పరిమిత పరిమాణాల్లో మాత్రమే ఆహార పదార్థాలు వెళ్లనిచ్చాడు. అది పరమ పాత కథే. కార్మికవర్గాన్ని అణచివేసేందుకు ఉన్నత వర్గాలు ఎప్పుడూ ఏకమవుతూనే వచ్చాయి. 11వ శతాబ్దంలో కొందరు ఫ్రెంచి నైట్స్ (ప్రభువుల)కీ, నార్మన్ నైట్స్‌కీ మధ్య

---

* "ఫ్రాన్సులో అంతర్యుద్ధం." — సం.

యుద్ధం జరిగింది, ఆ అదనులో రైతులు తిరుగుబాటు చేశారు; ప్రభువులు వెంటనే తమ విభేదాలను విస్మరించి, రైతుల ఉద్యమాన్ని అణచివేసేందుకుగాను జతకూడారు. ప్రష్యన్లు పోలీసు పని ఎలా సాగిస్తున్నారో రుజువు చేసేందుకు ఒక్క ఉదాహరణ చెప్పు కుంటే చాలు. ప్రష్యన్ల ఆక్రమణలో వున్న రువాన్‌లో 500 మంది — ఇంటర్నేషనల్‌కు చెందిన వాళ్లన్న సాకుపై — అరెస్టు చెయ్యబడ్డారు. ఇంటర్నేషనల్ అంటే వాళ్లు భయపడిచచ్చేవారు. ఫ్రెంచి అసెంబ్లీలో ఆ మధ్య కౌంట్ జౌబేర్ — ప్రోదు వారిన బొంది, 1834 నాటి ఒక మంత్రి, పత్రికలకు వ్యతిరేకమైన చట్టాలను బలపరచిన ప్రబుద్ధుడు — ఒక ఉపన్యాస మిచ్చాడు. అందులో, భద్రత పునరుద్ధరింపబడ్డ తర్వాత, ఇంటర్నేషనల్ పని తీరును గురించి పరిశీలన జరపడం, దాన్ని అణగతొక్కడమే ప్రభుత్వపు మొట్టమొదటి విధి అని అతగాడు చెప్పాడు.

1871 మే 27వ తేదీ
"The Eastern Post"
139వ సంచికలో
ప్రచురింపబడింది

# ఇంటర్నేషనల్‌ని గురించీ, పారిస్ కమ్యూన్‌ని గురించీ బూర్జువా పత్రికలు వ్యాపింపచేసిన అబద్ధాలకు వ్యతిరేకంగా మార్క్స్ చేసిన ఉపన్యాస సంగ్రహం

## 1871 జూన్ 6 నాటి జనరల్ కౌన్సిలు సమావేశపు వార్తాపత్రిక రిపోర్టు నుండి

కౌన్సిలు దృష్టికి తీసుకురావాలని ఆయన కోరుకున్న మరో విషయమేమిటంటే, కమ్యూన్‌ని గురించి ఇంగ్లీషు పత్రికలు ప్రచారంలో పెట్టిన అప్రతిష్ఠాకరమైన అబద్ధాలు. ఫ్రెంచి, ప్రష్యన్ పోలీసులు కల్పించిన అబద్ధాలవి. వాస్తవమెక్కడ బయట పడుతుందోనని వాళ్ళు భయపడ్డారు. కమ్యూన్‌కి చెందిన మిక్కిలి ఉగ్రులైన సభ్యుల్లో మిల్యేర్ ఒకడని ఉద్ఘాటించబడింది. ఇంతకీ ఆయన ఎన్నడూ కమ్యూన్ సభ్యుడు కాడన్న సంగతి వాస్తవం. అయితేనేం, ఆయన పారిస్ ప్రతినిధి కనుక ఆయన్ని కాల్చిపారేసేందుకు సాకు ఒకటి అవసరమైంది. ఇంగ్లీషు పత్రికలు త్యేర్ తరఫున పోలీసుల్లాగా, వేగుల్లాగా పని చేశాయి. అతని దారుణ విధానానికి అనువుగా కమ్యూన్‌కి వ్యతిరేకంగానూ, ఇంటర్నేషనల్‌కి వ్యతిరేకంగానూ అభాండాలు కల్పించాయి. ఇంటర్నేషనల్ లక్ష్యాలేమిటో, సూత్రాలేమిటో పత్రికలకు పూర్తిగా బాగా తెలుసు. సామ్రాజ్యం క్రింద పారిస్‌లో ఇంటర్నేషనల్‌కి వ్యతిరేకంగా జరిగిన ప్రాసిక్యూషన్ల వార్తలను అవి యిచ్చాయి. అసోసియేషన్ జరుపుకున్న వివిధ మహాసభల్లో పత్రికల ప్రతినిధులున్నారు, ఆ మహాసభల కార్యక్రమాలను వాళ్ళు రిపోర్టు చేశారు, అయినా కూడా, ఫెనియన్ భ్రాతృత్వం, కర్బొనారి (1830లో మూతపడింది), మరియాన[163] (1854లో యిదీ మూతపడింది), తదితర రహస్య సంఘాలూ అసోసియేషన్లో ఉన్నాయంటూ అవి వార్తలను ప్రచారంలో పెట్టాయి. లండన్‌లో సమావేశమవుతుందని చెప్పబడే జనరల్ కౌన్సిలు జాడా పత్తా కలనల్ హెండర్సన్‌కేమైనా తెలుసునా అని అవి ప్రశ్నించాయి. ఇంటర్నేషనల్‌కి వ్యతిరేకంగా తీసుకొనే ఏ చర్య అయినా సహేతుకమైనదేనని చూపేందుకోసమే యీ అభాండాలు సృష్టించబడ్డాయి. ఉన్నత వర్గాల వాళ్ళు ఇంటర్నేషనల్ సూత్రాల పట్ల భయపడిచస్తున్నారు.

"Contemporary Review"[164] అనే పత్రికలో మజ్జినీ కమ్యూన్‌ని నిరసిస్తూ రాశాడన్న వాస్తవాన్ని సభికుల దృష్టికి తీసుకు రావాలని కూడా ఆయన కోరుకున్నాడు కార్మికవర్గోద్యమాలకు మజ్జినీ ఎప్పుడూ ప్రతికూలుడే, అయితే యీ విషయం తెలియాల్సినంత విరివిగా తెలియలేదు. 1848 జూన్ తిరుగుబాటుదారులను ఆయన నిరసించాడు. ఇప్పటికన్న ఆనాడు ఎక్కువ ధైర్యం కలిగిన లూయీ బ్లాంక్, అప్పుడాయనకి జవాబు చెప్పాడు.

పెద్ద కుటుంబం కలిగిన ప్యేర్ లెరూ లండన్‌లో ఉద్యోగం సంపాదించుకున్నప్పుడు అతడిని బహిరంగంగా ఆక్షేపించిన మనిషి మజ్జినీ. అసలు సంగతేమిటంటే, మజ్జినీ, తన పాత పద్ధతి రిపబ్లికనిజంతో తెలుసుకున్నదీ లేదు, సాధించినది అంతకంటె లేదు. ఇటలీలో అతను తన జాతీయతా వివాదంతో ఒక సైనిక నియంతృత్వాన్ని సృష్టించాడు. ఆయనకి సంబంధించినంతవరకు — ఊహాత్మకమైనదైన రాజ్యం — సర్వస్వం, — వాస్తవమైన సమాజం — ఏమీ కాదు. ఇటువంటి వాళ్లను ప్రజలు ఎంత త్వరగా వదలించుకుంటే అంత మంచిది.

1871 జూన్ 10వ తేదీ,
141వ సంచిక "The Eastern
Post"లో ప్రచురింపబడింది

# కార్ల్ మార్క్స్

# "The Times" సంపాదకుని ఉద్దేశించి జనరల్ కౌన్సిల్ చేసిన ప్రకటన[165]

## "The Times" పత్రికకు

"ఇంటర్నేషనల్"పై 1871 జూన్ 19న మీరు రాసిన సంపాదకీయానికి జవాబుగా యీ దిగువ వాస్తవాలను పేర్కొవాల్సిందిగా ఈ అసోసియేషన్ జనరల్ కౌన్సిలు నన్ను ఆదేశించింది:

"Paris-Journal,"[156] లటువంటివే యితర పత్రికలూ ప్రచురించిన బూటక పారిస్ ప్రణాళికలనూ — కేవలం వెర్సైల్స్ పోలీసుల అభూత కల్పనలైన ప్రణాళికలనూ — మా "ఫ్రాన్సు అంతర్యుద్ధంపై విజ్ఞప్తి"ని మీరు ఒకే గాటన కట్టారు.

మీరిలా అన్నారు:

> "ఈమధ్య యీ పేజీల్లో ఉదహరింపబడిన, ప్రొఫెసర్ బీజ్‌లీచేత ప్రచురింపబడిన 'రాజకీయ వ్యాఖ్యలు' కౌన్సిలు విజ్ఞప్తిలో కూడా, పూర్తి ఆమోదంతో ఉదహరింపబడ్డాయి. మాజీ చక్రవర్తి సమాజ రక్షకుడని పిలవబడటానికి ఎంతగా అర్హుడో యిప్పుడు మేము అర్థం చేసుకోగలం."

కాని, కౌన్సిలు, తన విజ్ఞప్తిలో గత పారిస్ విప్లవంలో పాల్గొన్న "ఇంటర్నేషనల్" సభ్యుల వ్యక్తిగత స్వభావం విషయమై ప్రసిద్ధుడు, గౌరవనీయుడు, ఫ్రెంచి విద్వాంసుడైన రచయిత ప్రామాణ్యాన్నే తప్ప "రాజకీయ వ్యాఖ్యల" నుండి ఏమీ ఉదహరించలేదు.* "మాజీ చక్రవర్తి"తోనూ, అతనిచేత రక్షింపబడిన సమాజంతోనూ దీనికి సంబంధమేముంది? అసోసియేషన్ "కార్యక్రమం," మీరు చెప్తున్నట్లు, టొలేన్, ఓడ్జర్‌లచేత "ఏడేళ్ళక్రితం" "తయారుచెయ్యబడ" లేదు. లాంగ్ ఏక్‌లోని సెయింట్ మార్టిన్ హాల్లో 1864 సెప్టెంబరు 28న జరిగిన బహిరంగ సమావేశంలో తాత్కాలిక

---

* 108–109వ పేజీలు చూడండి. — సం.

కౌన్సిలుచేత అది జారీ చెయ్యబడింది. ఆ కౌన్సిల్లో టొలేన్ ఎన్నడూ సభ్యుడుగా లేడు, ఆ కార్యక్రమం రూపొందింపబడినప్పుడు అతగాడు లండన్‌లోనే లేడు.

"మిల్యేర్ కమ్యూన్‌కి చెందిన మిక్కిలి ఉగ్రసభ్యుల్లో ఒకడు" అంటారు మీరు. మిల్యేర్ కమ్యూన్ సభ్యుడుగా ఎన్నడూ లేడు.

> మీరింకా యిలా సెలవిచ్చారు: "అసోసియేషన్‌యొక్క యిటీవలి అధ్యక్షుడైన అస్సీని గురించి కూడా మేము గుర్తుచెయ్యాల్సి వుంది," వగైరా.

అస్సీ "ఇంటర్నేషనల్" సభ్యుడుగా ఎన్నడూ లేడు. పోతే "అసోసియేషన్ అధ్యక్ష" పదవికి సంబంధించినంత వరకు అదెన్నడో 1867 లోనే రద్దుచెయ్యబడింది.[166]

1871 జూన్ 20 ప్రాంతంలో
రచింపబడింది

మార్క్స్ ఎంగెల్సుల రచనలు
(మొదటి ముద్రణ),
వాల్యూం XIII, రెండవ భాగంలో,
1940లో మొదట
రష్యన్ భాషలో ప్రచురింపబడింది

కార్ల్ మార్క్స్

# "The Standard" సంపాదకునికి జనరల్ కౌన్సిల్ లేఖ[167]

"The Standard" సంపాదకునికి

"ఇంటర్నేషనల్"పై మీ సంపాదకీయంలో (జూన్ 19వ తేదీ) మీరిలా అన్నారు:

> "కమ్యూన్‌ని సమర్థిస్తూ యిటీవల విడుదల చెయ్యబడిన రెండు కార్యక్రమాల్లోనూ (లండన్‌ది, పారిస్‌ది) పారిస్ శాఖ కార్యక్రమానికి మరింత చిత్తశుద్ధి, మరింత నిష్కాపట్యము అనే యోగ్యత వుంది."

దురదృష్టవశాత్తూ, "పారిస్" ప్రణాళిక మా పారిస్ శాఖచేత కాక, "వెర్సేల్స్ పోలీసుల"చేత విడుదల చెయ్యబడింది.

మీరిలా అన్నారు:

> "లండన్ ఇంటర్నేషనలిస్టులు, 'పాత సమాజం నశించాలి, నశించి తీరాలి' అని హృదయపూర్వకంగా కోరడంలో తమ పారిస్ సోదరులకు ఎంత మాత్రమూ తీసిపోరు. ప్రభుత్వ భవనాలను తగలపెట్టడాన్ని గురించీ, 'సమాజాన్ని కూల్చదోసేందుకు బ్రహ్మాండమైన ఒక ప్రయత్నం'గా హామీ బందీలను చేర్చిపెట్టుకోడం గురించీ వాళ్లు మాట్లాడుతారు — ఈ ప్రయత్నం ఒకప్పుడు అపజయం పాలైనా, అది విజయవంతమయ్యే దాకా పట్టుదలతో కొనసాగింపబడుతుంది."

పోతే, మాకు మీరు ఆపాదించిన యీ మాటలు మా విజ్ఞప్తిలో సరిగా ఏ పేజిలో, ఏ పంక్తుల్లో ఉన్నాయో పేర్కొవాల్సిందిగా ఈ అసోసియేషన్ జనరల్ కౌన్సిలు మిమ్మల్ని కోరుతోంది!

1871 జూన్ 20 ప్రాంతంలో
రచింపబడింది
మార్క్స్, ఎంగెల్స్ రచనలు
(మొదటి ముద్రణ),
వాల్యూం XIII, రెండవ భాగంలో, 1940లో
మొదటి సారి రష్యన్ భాషలో
ప్రచురింపబడింది

ఫ్రెడరిక్ ఎంగెల్స్

# హోలియోక్ లేఖపై జనరల్ కౌన్సిల్ ప్రకటన[168]

## "The Daily News"[91] సంపాదకునికి

మహాశయా,

మంగళవారపు "Daily News" లోని మిస్టర్ జియో జాకబ్ హోలియోక్ లేఖకు జవాబుగా యీ క్రింది అంశాలు తెలియజెయ్యాల్సిందిగా ఇంటర్నేషనల్ వర్కింగ్ మెన్స్ అసోసియేషన్ జనరల్ కౌన్సిలు నన్ను ఆదేశించింది:

1. కౌన్సిలు విడుదలచేసిన విజ్ఞప్తి "వెర్సేల్స్‌లో మరణ శిక్షకో, ద్వీపాంతర వాస శిక్షకో కారణం కావచ్చు"నన్న సూచనాత్మకధ్వనికి సంబంధించి, మిస్టర్ హోలియోక్ కన్న తన పారిస్ మిత్రులు మంచి న్యాయనిర్ణేతలని కౌన్సిలు భావిస్తోంది.

2. తన అధికారిక పత్రాలన్నిటి చివర, హాజరైనా, గైరుహాజరైనా, తన సభ్యు లందరి పేర్లనూ చేర్చడమన్నది కౌన్సిలు నియమం. అయితే, ఈ సందర్భంలో మాత్రం, ఒక మినహాయింపు చెయ్యబడింది, గైరుహాజరైన సభ్యుల అంగీకారం క్రమపద్ధతిలో అర్థించబడింది.

3. ఈ విజ్ఞప్తి "ఇంగ్లీషు తయారీ కాదు, ఎవరిదో శాక్సన్ లేక కెల్టిక్ కలం దీన్ని సరిచూసిందనడం స్పష్టమే అయినప్పటికీ" అన్న ప్రకటనకు సంబంధించినంత వరకు, మామూలు క్రమంలోనే, ఒక అంతర్జాతీయ సంఘపు రచనలు జాతీయ స్వభా వాన్ని ఎన్నడూ కలిగియుండజాలవని తెలియజెయ్యాలని కౌన్సిలు భావిస్తోంది. అయితే, ఈ అంశంలో కౌన్సిలుకి రహస్య విషయాలేవీ ఉండనవసరం లేదు. కౌన్సిలుయొక్క గత యితర అనేక ప్రచురణల్లాగే, ఈ విజ్ఞప్తి, జర్మనీకి ఉత్తరప్రత్యుత్తరాలు జరిపే కార్యదర్శి అయిన డా. కార్ల్ మార్క్స్ చేత రచింపబడి, ఏకగ్రీవంగా ఆమోదింప బడింది. ఎవరిచేతా యిది "సరిచూడబడ లేదు."

4. 1870 ....*న, మిస్టర్ జార్జ్ జాకబ్ హోలియోక్ కౌన్సిలు సభ్యత్వానికి తన అభ్యర్థిత్వాన్ని సమర్పించాడు, కాని ఆయన చేర్చుకోబడలేదు.

ఇట్లు, తమ విధేయుడు,

జాన్ హేల్స్

కార్యదర్శి, జనరల్ కౌన్సిల్ ఇంటర్నేషనల్

వర్కింగ్‌మెన్స్ అసోసియేషన్

256, హై హల్‌బోర్న్, లండన్ డబ్ల్యు. సి.,
1871 జూన్ 21

1871 జూన్ 20న రచించబడింది

"The Da ly News"లో 1871 జూన్ 23న,
"The Eastern Post" 143వ సంచికలో
1871 జూన్ 24న ప్రచురించబడింది

---

* వ్రాతప్రతిలో ఖాళీ. – సం

# ఫ్రెడరిక్ ఎంగెల్స్

## "The Spectator,"[96] "The Examiner"[169] సంపాదకులకు జనరల్ కౌన్సిల్ లేఖ

### "The Spectator" సంపాదకునికి ("The Examiner" సంపాదకునికి ప్రతితో)

మహాశయా,

అన్ని కుహనా ప్రణాళికలూ, పారిస్ "ఇంటర్నేషనల్"కి చెందిన తదితర ప్రచురణలూ – వీటితో ఇంగ్లీషు పత్రికలన్నీ యీనాడు నిండివుంటున్నాయి (వాటిలో అన్నీ కూడా మొట్టమొదట రోసిపోయిన "Paris-Journal"[155]లో ప్రచురింపబడినవే), ఒక్కగానొక్క మినహాయింపు కూడా లేకుండా వెర్సేల్స్ పోలీసుల శుద్ధ అభూత కల్పనలేనన్న వాస్తవాన్ని ప్రచురించడం ద్వారా ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్స్ అసోసియేషన్ జనరల్ కౌన్సిలు కోర్కెను మన్నించగలరని ఆశిస్తున్నాను.

ఇట్లు, మీ....

1871 జూన్ 21 ప్రాంతంలో
రచింపబడింది

మార్క్స్ ఎంగెల్సుల రచనలు
(మొదటి ముద్రణ) వాల్యూం XIII,
రెండవ భాగంలో, 1940లో మొదటి
సారి రష్యన్లో ప్రచురింపబడింది

# కార్ల్ మార్క్స

## "The Daily News" సంపాదకునికి[170]

మహాశయా,

ముప్పది మందికిపైగా సభ్యులతో కూడిన కౌన్సిలు, తన సొంత పత్రాలను సహజంగా, తనే రూపొందించుకో జాలదు. దాన్ని తిరస్కరించడానికో, లేక సవరించడానికో హక్కును తనకు అట్టేపెట్టుకొని, ఆ కర్తవ్యాన్ని అది, తన సభ్యుల్లో ఎవరికో ఒకరికి అప్పగించాల్సే వుంటుంది. "ఫ్రాన్సులో అంతర్యుద్ధం"పై విజ్ఞప్తి నాచేత రచించబడి, ఇంటర్నేషనల్ జనరల్ కౌన్సిలుచేత ఏకగ్రీవంగా ఆమోదింపబడింది, కాగా కౌన్సిలు అధికారిక అభిప్రాయాన్నే అది వ్యక్తంచేస్తుంది. అయితే, జూల్ ఫ్రావ్ ముఠాకి వ్యతిరేకంగా వ్యక్తిగతంగా చెయ్యబడిన ఆరోపణలకు సంబంధించినంతవరకు, పరిస్థితి యిందుకు భిన్నం. ఈ విషయంలో కౌన్సిలుకి చెందిన అత్యధిక మెజారిటీ నా విశ్వాస పాత్రత పైననే ఆధారపడాల్సి వచ్చింది. సరిగా యీ కారణంగానే, మిస్టర్ హోలియోక్‌కు తన జవాబులో మిస్టర్ జాన్ హేల్స్ విజ్ఞప్తి* కర్తగా నన్ను పేర్కొనాలన్న కౌన్సిల్‌కి చెందిన మరో సభ్యుని** ప్రతిపాదనను నేను బలపరచాను. ఆ ఆరోపణలకు నేను మాత్రమే బాధ్యుడినని అంగీకరిస్తున్నాను, కాగా నన్ను పరువు నష్టానికిగాను కోర్టులో కేసుపెట్టాల్సిందిగా, యిందు మూలంగా జూల్ ఫ్రావ్ ముఠాను సవాలుచేస్తున్నాను. తన లేఖలో మిస్టర్ లుయెలిన్ డేవిస్ యిలా అన్నాడు,

> "ఫ్రెంచివాళ్లు పరస్పరం ఒకరిపై మరొకరు యింత విశృంఖలంగా వ్యక్తిగత నైచ్యానికి సంబంధించిన ఆరోపణలను విసరుకోవడం గురించి చదవడానికి విచారకరంగా వుంది."

---

* 280–281వ పేజీలు చూడండి. — సం.

** ఫ్రెడరిక్ ఎంగెల్స్. — సం.

విలియం కాబెట్ కుత్సిత బుద్ధితో కపటానుష్ఠానపరుని పోజుపెట్టి బ్రిటిష్ మేధస్సును తరచుగా దెప్పిపొడవడాన్ని ఈ వాక్యం గుర్తుచెయ్యడం లేదూ? లుయెలిన్ డేవిస్ గారిని ఒక ప్రశ్న అడగాలనుకుంటున్నాను: కమ్యూన్‌కి సంబంధించిన మృతులకు, బందీలకు, లేక దాచబడిన వారికి వ్యతిరేకంగా, వెర్సైల్స్ పోలీసుల సేవలో, పరమ నికృష్టమైన అభాండాలను కల్పించే ఫ్రెంచి pet te presse* లేకుంటే, petite presse పట్ల తన అసహ్యాన్ని ప్రకటిస్తూనే మరోవంక ఆ రొచ్చుగుంట రాతలను యీనాటికీ పునర్ముద్రిస్తున్న ఇంగ్లీషు పత్రికలా? ఈ రెండింటిలో ఏవి ఎక్కువ దగుల్బాజీవి? ఉదాహరణకు కీ శే లార్డ్ పామర్‌స్టన్‌కి వ్యతిరేకంగా, ఒక పావు శతాబ్దం పాటు, మిస్టర్ డేవిడ్ ఉర్క్వార్ట్ వంటి వ్యక్తిచేత చెయ్యబడిన అటువంటి తీవ్రమైన ఆరోపణలను చల్లగా కప్పెట్టడం ఇంగ్లండులో సాధ్యమేమో గాని, ఫ్రాన్సులో మాత్రం కాదు, ఇది ఫ్రెంచి వాళ్లకు అవమానకరమైనదేమీ కాదు.[171]

కార్ల్ మార్క్స్

మెయిట్‌లాండ్ పార్క్ రోడ్డు,
హావెర్‌స్టాక్ హిల్, జూన్ 26

"The Eastern Post"
1871 జూలై 1వ తేదీ 144వ
సంచికలోను, క్లుప్తంగా "The
Da ly News"లో 1871 జూన్
27వ తేదీ సంచికలోను
ప్రచురించబడింది

---

* చిల్లర మల్లర చెత్త పత్రికలు. – సం.

ఫ్రెడరిక్ ఎంగెల్స్

# హాలియోక్, లుక్రాఫ్ట్‌ల లేఖలపై జనరల్ కౌన్సిల్ ప్రకటన[172]

"The Daily News"[91] సంపాదకునికి

మహాశయా,

మీ పత్రిక గత సోమవారపు సంచికలో ప్రచురితమైన మిస్టర్ జి. జె. హాలియోక్, మిస్టర్ బి. లుక్రాఫ్ట్‌ల లేఖలకు జవాబివ్వాల్సిందిగా ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్స్ అసోసియేషన్ జనరల్ కౌన్సిలు నన్ను ఆదేశించింది. 1869 నవంబరు 16న జరిగిన కౌన్సిలు సమావేశానికి, అనుమతితో, మిస్టర్ హాలియోక్ హాజరయ్యారనీ, ఆ సమావేశ క్రమంలో కౌన్సిల్ సభ్యుడు కావాలనీ, 1870 సెప్టెంబరులో పారిస్‌లో జరగబోయే ఇంటర్నేషనల్ సాధారణ మహాసభకు హాజరు కావాలనీ తన కోర్కెను వెల్లడించారనీ కౌన్సిలు మినిట్సు తిరగేసినమీదట మేము కనుగొన్నాను. ఆయన సమావేశం నుంచి వెళ్లిపోయాక, సభ్యత్వం కోసం ఆయన అభ్యర్థిత్వాన్ని మిస్టర్ జాన్ వెస్టన్ ప్రతిపాదించారు. కానైతే, ఆ ప్రతిపాదనకు లభించిన స్వాగతపు తీరును చూసినమీదట, మిస్టర్ వెస్టన్ తన ప్రతిపాదనపై పట్టుపట్టక దాన్ని ఉపసంహరించుకున్నారు. విజ్ఞప్తిపై ఓటింగు జరిగినప్పుడు సమావేశంలో తను హాజరైలేనన్న మిస్టర్ లుక్రాఫ్ట్ ప్రకటనకు సంబంధించినంత వరకు, 1871 మే 23న జరిగిన కౌన్సిలు సమావేశానికి మిస్టర్ లుక్రాఫ్ట్ హాజరయ్యారనీ, అందులోనే, మే 30న జరగబోయే తదుపరి కౌన్సిలు సాధారణ సమావేశంలో "ఫ్రాన్సులో అంతర్యుద్ధం"పై విజ్ఞప్తి ముసాయిదా చదివి వినిపించబడుతుందనీ, చర్చింపబడుతుందనీ అధికారికంగా ప్రకటింపబడింది. కాగా, ఆ సందర్భంగా హాజరు కావడమా కాకపోవడమా అన్న నిర్ణయం పూర్తిగా మిస్టర్ లుక్రాఫ్ట్‌కే విడిచిపెట్టబడింది. తన అధికారిక పత్రాల చివర, హాజరైనా, గైరు హాజరైనా, తన సభ్యులందరి పేర్లనూ చేర్చడమన్నది కౌన్సిలు నిబంధన. అయితే, ఆ నిబంధనను మిక్కిలి పట్టుదలగా బలపరచిన వాళ్లలో ఆయన ఒకరు, దాన్ని ఉల్లంఘించేందుకై జరిగిన పలు ప్రయత్నాలను ఆయన ప్రతిఘటించారు; ఆయన మిగిలిన వాటితోబాటు

మే 23న యిలాంటి ప్రయత్నాలను ప్రతిఘటించారు. అప్పుడాయన "తన యావత్తు సానుభూతీ పారిస్ కమ్యూన్‌తోనే" ఉన్నదని స్వచ్ఛందంగా తెలియజేశారు. జూన్ 20న మంగళవారం సాయంత్రం జరిగిన కౌన్సిలు సమావేశంలో, అప్పటికింకా తను విజ్ఞప్తినే చదవలేదనీ, దాన్ని గూర్చిన తన అభిప్రాయాలన్నీ పత్రికల్లో వెలువడిన ప్రకటనల నుండి గ్రహింపబడినవి మాత్రమేననీ ఒప్పుకోవాల్సిన పరిస్థితిలో పడ్డారు. మిస్టర్ ఓడ్జర్ నిరాకరణకు సంబంధించినంత వరకు, వ్యక్తిగతంగా ఆయన్ని కలుసుకోవడం, కౌన్సిలు విజ్ఞప్తి నొకదాన్ని విడుదల చెయ్యబోతోందని చెప్పడం, ఆ సందర్భంగా ఆయన పేరు వెలువడటానికి ఆయనకి అభ్యంతర మేమైనా ఉందా అని అడగడం జరిగింది, ఆయన "లేదు" అని చెప్పారు. దీన్ని బట్టి లోకులు తమ నిర్ణయాలు తామే చేసుకోవచ్చు. ల్యుక్రాఫ్ట్, ఓడ్జర్‌ల రాజీనామాలు కౌన్సిల్‌చేత ఏకగ్రీవంగా ఆమోదింపబడ్డాయన్న సంగతి కూడా యిక్కడ చెప్పడం అవసరం.

ఇట్లు, మీ విధేయుడు,

జాన్ హేల్స్,
ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్స్ అసోసియేషన్
జనరల్ కౌన్సిల్ కార్యదర్శి

256, హై హల్‌బోర్న్,
లండన్, డబ్ల్యు. సి.

1871 జూన్ 27న రచింపబడింది

1871 జూన్ 29న "The Daily News"లోను, "The Eastern Post" 1871, జూలై 1, 144వ సంచికలోను ప్రచురింపబడింది

# ఫ్రెడరిక్ ఎంగెల్స్

# "ఫ్రాన్సులో అంతర్యుద్ధం" అనే విజ్ఞప్తీ, ఇంగ్లీషు పత్రికలూ[173]

(కొంత భాగం)

లండన్, జూన్ 30. ఇంటర్నేషనల్ జనరల్ కౌన్సిలు విజ్ఞప్తి కలిగించినంత సంచలనాన్ని మొత్తం లండన్ చరిత్రలోనే మరే ప్రచురణా కలిగించలేదు. ఆదిలో, బడా పత్రికలు, నిర్లక్ష్యం చేసి బొత్తిగా పట్టించుకోక పోవడమనే తమ అభిమానపాత్రమైన పద్ధతిని అవలంబించడం ద్వారా విషయాన్ని హతమార్చాలని ప్రయత్నించాయి, కానైతే కొద్ది రోజుల్లోనే, యీ మారి పద్ధతివల్ల ప్రయోజనం లేదని అవి గ్రహించాయి. "Telegraph,"[174] "Standard,"[167] "Spectator,"[96] "Pall Mall Gazette,"[175] "Times,"[65] ఒక దాని తర్వాత మరొకటి, యీ "అసాధారణమైన పత్రానికి" తమ సంపాదకీయాలను అంకితం చెయ్యాల్సి వచ్చింది. అప్పుడు వాటి పాఠకులు విజ్ఞప్తిలోని వివిధ భాగాలపై దృష్టిని ప్రసరింప చేస్తూ లేఖలు రాశారు. దానిపైన తిరిగి సంపాదకీయాలు, వారాంతంలో వారపత్రికల్లో మరిన్ని వ్యాఖ్యలు వెలువడ్డాయి. ఇంటర్నేషనల్ యూరప్‌లో ఒక గొప్ప శక్తియనీ, దాన్ని పరిగణనలోకి తీసుకోవాల్సిందే గాని, పట్టించుకోకపోవడం ద్వారా దాన్ని రద్దుచెయ్యడం సాధ్యం కాదనీ అన్ని పత్రికలూ ఏకగ్రీవంగా ఒప్పుకోవాల్సి వచ్చింది. అంతే కాదు. విజ్ఞప్తియొక్క ప్రశస్తమైన సాహితీ శైలిని సైతం అవన్నీ గుర్తించాల్సి వచ్చింది. విలియమ్ కాబెట్ శైలి అంతటి శక్తివంతమైన శైలిలో అది రాయబడిందని "Spectator" పేర్కొంది. అంత పటిష్ఠంగా శ్రామికవర్గ దృక్పథం వక్కాణించబడటాన్ని, అంత నిశ్చితంగా పారిస్ కమ్యూన్ నిర్దుష్టత్వం నిరూపితం కావడాన్ని బూర్జువా పత్రికలు దాదాపు తప్పనిసరిగా ఏకగ్రీవంగా ఖండించే తీరుతాయని వేరే చెప్ప నక్కర్లేదు. పారిస్ పోలీసు పత్రికల ద్వారా కల్పించిన ష్టిబెరియడ్స్,[176] పూర్తిగా భిన్నమైన మరో సంఘపు (బకూనినిస్టు అలయన్స్ ఆఫ్ సోషలిస్టు డెమోక్రసీ[95]), సిద్ధాంత పత్రాలకు బాధ్యత — వీటి విషయంలో నేరాన్ని ఇంటర్నేషనల్‌పై మోపాలని జూల్ ఫావ్ర్ ప్రయత్నించాడు — జనరల్ కౌన్సిలు అధికారికంగా ఖండించినా ఇంటర్నేషనల్‌పై ఆపాదించబడింది. చివరకు,

సామాన్యుడు సైతం యీ గొడవతో విసిగిపోయాడు. "Daily News" వెనక్కి తగ్గింది, నిజంగా సముచితంగా సజావుగా వ్యవహరించిన ఒకేఒక పత్రిక "Examiner,"[169] ఇంటర్నేషనల్‌ను గట్టిగా బలపరుస్తూ, వాస్తవ ఘటనలను సవివరంగా పేర్కొంటూ ఒక వ్యాసాన్ని ప్రచురించింది. జనరల్ కౌన్సిల్‌కి చెందిన యిద్దరు ఇంగ్లీషు సభ్యులు, వీరిలో ఒకడు (ఒడ్జర్) చాల కాలం క్రితమే బూర్జువావర్గంతో రాజీపడ్డాడు, రెండో వాడు లండన్ స్కూలుబోర్డుకి ఎన్నికైన నాటి నుండీ, "గౌరవనీయ" వ్యక్తుల అభిప్రాయం పట్ల ఎక్కువ మన్నన పెంచుకున్నట్లు కనిపించే లుక్రాఫ్ట్, వార్తాపత్రికల్లోని రభసకు చలించి జనరల్ కౌన్సిలుకు రాజీనామాలు సమర్పించారు. అవి ఏక గ్రీవంగా ఆమోదింపబడ్డాయి. వాళ్ల స్థానాలు మరో యిద్దరు ఇంగ్లీషు కార్మికులతో అప్పుడే భర్తీ చెయ్యబడ్డాయి.* శ్రామికవర్గాన్ని నిర్ణయాత్మక క్షణంలో ద్రోహం చెయ్యడమంటే ఏమిటో వాళ్లు త్వరలోనే గ్రహిస్తారు.

లుయెలిన్ డేవిస్ అనే ఒక ఇంగ్లీషు మతగురువు, విజ్ఞప్తి జూల్ ఫావ్ ముఠాకి వ్యతిరేకంగా దూషణ తిరస్కారాలతో నిండివున్నదని వాపోయి, జనరల్ కౌన్సిలుకి వ్యతిరేకంగా ఫ్రెంచి ప్రభుత్వం కోర్టులో దావా వెయ్యాల్సి వచ్చినా కూడా, ఈ ఆరోపణల్లోని సత్యాసత్యాలను నిరూపించడం అవసరమని కోరాడు. ఆ మరుసటి రోజునే, విజ్ఞప్తికర్తగా, యీ ఆరోపణలకు తనే బాధ్యుడనని అదే పత్రికలో కార్ల్ మార్క్స్ ప్రకటించాడు.** అయితే, ఫ్రెంచి రాయబార కార్యాలయానికి ఆయనకి వ్యతిరేకంగా పరువు నష్టం దావా వెయ్యాల్సిందిగా ఆదేశాలేమీ వచ్చినట్లు లేదు. చివరకు, "Pall Mall Gazette," యిదంతా అనవసరమనీ, ఏ రాజకీయవేత్త వ్యక్తిగత శీలాన్నీ విమర్శ కెప్పుడూ గురిచెయ్యరాదనీ, అతని ప్రజా జీవిత కార్యకలాపాలను మాత్రమే విమర్శించాలనీ ప్రకటించింది. సహజమే కదా మరి, ఇంగ్లీషు రాజకీయవేత్తల వ్యక్తిగత శీలాన్ని బట్టబయలు చెయ్యడమే జరిగితే, ప్రభుమండలి పాలనకీ, బూర్జువా ప్రపంచానికీ అంతిమ విచారణ దినం ఆసన్నమైనట్లే.

1871 జూన్ 30న రచింపబడింది
"Der Volksstaat" అనే వార్తాపత్రిక
1871 జూలై 5వ తేదీ
54వ సంచికలో
ప్రచురింపబడింది

---

* జాన్ రోచ్, ఆల్‌ఫ్రెడ్ టైలర్. — సం.

** 283వ పేజీ చూడండి. — సం.

# "The World" విలేకరితో మార్క్స్ గోష్ఠి రికార్డు[177]

(కొంత భాగం)

లండన్, జూలై 3

...నేరుగా నా వ్యవహారంలోకి వెళ్లాను. ప్రపంచం ఇంటర్నేషనల్‌ని గురించి అజ్ఞానాంధకారంలో ఉన్నట్లు కనిపిస్తున్నదని నేను చెప్పాను. దాన్ని విశేషంగా ద్వేషిస్తున్నారు, కానైతే, తాము దేన్ని ద్వేషిస్తున్నారన్న సంగతిని స్పష్టంగా పేర్కొనలేక పోతున్నారు. తమ పక్కవాళ్లకన్న ఇంటర్నేషనల్ రహస్యంలోకి మరింత లోతుగా పొడుచుకు చూశామని చెప్పిన కొందరు, అది తమకొక ద్విముఖ మూర్తి మాదిరిగా కనిపించిందనీ, అందులో ఒకటి చిత్తశుద్ధి కలిగిన శ్రమజీవి ముఖంలా చిరునవ్వుతో ఉన్నదనీ, రెండవది ఖూనీకోరు కుట్రదారు ముఖంలా కనుబొమలు ముడిచి వికృతంగా ఉన్నదనీ చెప్పారు. ఆయన [మార్క్స్]ను ఆ సిద్ధాంత రహస్యంపై కాంతి ప్రసరింప చెయ్యగోరాను.

మేము అతనంటే అంతగా భయపడినందుకేమో ఆ ప్రొఫెసరు బిగ్గరగా నవ్వాడు, తర్వాత లోలోపల నవ్వుకుంటున్నట్లు కనిపించాడు.

ఆయన బాగా మెరుగైన హెస్స్ బ్రైట్‌మన్ యాసలో[178] ప్రారంభించాడు: "విప్పాల్సిన రహస్యమైన బ్రహ్మముడి ఏమీ లేదండయ్యా. మా అసోసియేషన్[16] బహిరంగమైనది, దాని కార్యకలాపాలకు సంబంధించిన సమగ్రమైన రిపోర్టులు ప్రచురింపబడతాయి, చదవాలన్న ఆసక్తి కలిగిన వారందరికీ అవి లభ్యమవుతాయి, ఈ వాస్తవాన్ని సదా త్రోసిపుచ్చేవారి మానవ మౌఢ్యమే తప్ప యిందులో మరే రహస్యమూ లేదు. ఓ పెన్నీ పెడితే మీకు మా నిబంధనావళి దొరుకుతుంది. ఓ షిల్లింగు వెచ్చించి మా

పుస్తకాలు కొని చదివితే మమ్మల్ని గురించి మాకెంత తెలుసో మీరూ దాదాపుగా అంత తెలుసుకో గలుగుతారు."

ఆర్. — దాదాపుగా — ఔను, అంతే కావచ్చు; కానైతే, నాకు తెలియని ఆ కొంచెంలోనే అతి ముఖ్యమైన మినహాయింపంతా యిమిడి వుండవచ్చు కదా? మీతో కుండ బద్దలుకొట్టినట్లు నిర్మొగమాటంగా చెప్పాలంటే, బయట నుండి చూసే సాక్షి మాత్రునిగా నాకు తోచినది చెప్పాలంటే, మీ సంఘానికి సంబంధించి సాధారణమైన యీ తక్కువ అంచనా వెనక జనసమూహపు మూఢ ద్వేషం ఉందనుకోవాలా? మీరు చెప్పినదంతా విన్నాక కూడా, ఇంటర్నేషనల్ అంటే ఏమిటని అడగడం సంగతమేనను కుంటాను?

డా॥మా. — దానిలో వున్నవారి వంకనే చూడాల్సి వుంటుంది — వారు కార్మికులు.

ఆర్. — ఔననుకోండి, కాని, సైనికుడే తనను నడిపించే ప్రభుత్వానికి భాష్యకారుడు కానక్కర్లేదు కదా. మీ సభ్యుల్లో కొందరిని నే నెరుగుదును. వాళ్లు కుట్రదారుల మాదిరి మనుషులు కారన్న సంగతి నేను విశ్వసించ గలను. పైగా, ఓ పదిలక్షల మందికి తెలిసిన రహస్యం, రహస్యంగానే ఉండ బోదు. కానైతే, సాహసికమైన ఓ ముఠా చేతుల్లో వీళ్లు కేవలం సాధనాలు మాత్రమే అయితే? మరో మాట కూడా చేరుస్తున్నందుకు మీరు నన్ను క్షమించాలి, అది నైతికపరమైన జంకుగొంకులు అంత మరీ ఎక్కువగా లేని ముఠా అయితే?

డా॥మా. — అలా అని రుజావు చేసేందుకు ఆధారమేమీ లేదు.

ఆర్. — గత పారిస్ తిరుగుబాటు సంగతేమిటి?

డా॥మా. — మొదటి సంగతి, అసలు అటువంటి కుట్ర అంటూ ఏదైనా ఉందేమో రుజావు చెయ్యమని కోరుతున్నాను. ఆ క్షణంలో వున్న పరిస్థితుల న్యాయబద్ధమైన పర్యవసానం కానిదేమైనా జరిగిందేమో రుజావుచేయండి. లేక, ఒక వేళ కుట్ర జరిగిందనే ఒప్పుకున్నాకూడా, అందులో ఇంటర్నేషనల్ అసోసియేషన్ భాగస్వామ్యానికి సంబంధించిన రుజావు ఏమిటి?

ఆర్. — కమ్యూన్ కార్యనిర్వాహక సంస్థలో అసోసియేషన్‌కు సంబంధించిన యింతమంది సభ్యులున్నారు కదా.

డా॥మా. — అలా అయితే అది ఫ్రీమసన్స్[120] కుట్ర కూడాను. ఎందుకంటే కమ్యూన్ కార్యకలాపాలలో వాళ్ల భాగస్వామ్యం కూడా తక్కువేమీ కాదు కదా. నిజానికి, పోపు, మొత్తం తిరుగుబాటును వాళ్ల కాతాకి జమకట్టినా కూడా నేను ఆశ్చర్యపడను. కాని, మరో విధంగా ఆలోచించి చూడండి. పారిస్‌లో తిరుగుబాటు పారిస్ కార్మికులచేత చెయ్యబడింది. వాళ్లలో మిక్కిలి సమర్థులు తప్పని సరిగా ఆ తిరుగుబాటుకి నాయకులూ, నిర్వాహకులూ అయ్యుంటారు కదా. కాని కార్మికులలో మిక్కిలి సమర్థులు ఇంటర్నేషనల్ అసోసియేషన్ సభ్యులు కూడా అవడం తటస్థించింది. అయినా కూడా అసోసియేషన్‌గా అది వాళ్ల చర్యలకు ఏవిధంగానూ బాధ్యురాలు కాదు.

ఆర్. — ప్రపంచానికి మాత్రం యిందుకు భిన్నంగా కనిపిస్తుంది. లండన్ నుంచి రహస్యాదేశాలొస్తున్నాయనీ, చివరకు డబ్బుసంచులు కూడా వస్తున్నాయనీ జనం అనుకుంటున్నారు. అసోసియేషన్ కార్యకలాపాల బహిరంగత్వ మనుకోబడేది అన్ని రహస్య సంబంధాలనూ పూర్తిగా త్రోసివేసిందని గట్టిగా చెప్పగలరా?

డా॥మా. — తన కార్యకలాపాలను రహస్య, బహిరంగ సాధనాలు రెండిటి ద్వారా కొనసాగించని ఏ సంస్థ అయినా ఎప్పుడేనా ఏర్పడిందా? కాని మత విశ్వాసాలకూ, నైతిక నియమాలకూ సంబంధించిన పెత్తనానికీ, కుతంత్రాలకూ కేంద్రమైన ఏ పోపు మత పీఠంనుంచో వచ్చే ఉత్తర్వులను గురించి మాట్లాడినట్లు, లండన్ నుంచి రహస్య ఆదేశాలు వస్తున్నాయంటూ మాట్లాడటం, ఇంటర్నేషనల్ స్వభావాన్ని గురించి పూర్తిగా తప్పు అర్థం చేసుకోవడం తప్ప మరేమీ కాదు.

1871 జూలై 18 నాటి
"The World" వార్తాపత్రికలోను,
1871 ఆగస్టు 12 నాటి
"Woodhull and Claflin's
Weekly" 13/65 సంచికలోను
ప్రచురింపబడింది

కార్ల్ మార్క్స్

# పారిస్‌లోని అమెరికా రాయబారి మిస్టర్ వాష్‌బర్న్[179]

## ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్స్ అసోసియేషన్‌యొక్క అమెరికా శాఖల న్యూయార్కు కేంద్ర కమిటీకి

సిటిజన్స్, — ఫ్రెంచి అంతర్యుద్ధ కాలంలో, అమెరికా రాయబారి మిస్టర్ వాష్‌బర్న్‌యొక్క ప్రవర్తనకు సంబంధించిన రుజువును బహిరంగంగా మీకు తెలియజెయ్యడం తన విధిగా అసోసియేషన్ జనరల్ కౌన్సిలు పరిగణిస్తోంది.

## I

ఈ దిగువ ప్రకటన, పారిస్‌లో పదిహేడేళ్లు నివసించి, అంతర్యుద్ధ కాలంలో లండన్ "Daily Telegraph"[174]కీ, "New-York Herald"[180]కీ విలేకరిగా పనిచేసిన మిస్టర్ రాబర్ట్ రీడ్ అనే స్కాట్ జాతీయుడు చేసినది. ఈ సందర్భంగా, "Daily Telegraph" వెర్సేల్స్ ప్రభుత్వ ప్రయోజనాల దృష్ట్యా, తనకు మిస్టర్ రీడ్ పంపిన క్లుప్తమైన టెలిగ్రాఫ్ వార్తలను సైతం వక్రీకరించింది.

ఇప్పుడు ఇంగ్లండులో వున్న మిస్టర్ రీడ్, తన ప్రకటనను ధృవీకరిస్తూ affidavit * యివ్వడానికి సిద్ధంగా వున్నాడు.

> "సాధారణ ప్రమాద హెచ్చరిక గంట ధ్వని ఫిరంగి మోతలతో కలసి రాత్రి అంతా కొనసాగింది. నిద్రపోవడం అసాధ్యమే అయింది. యూరప్, అమెరికాల ప్రతినిధులు ఎక్కడున్నట్లు అనుకున్నాను. అమాయక ప్రజల రక్తపాతం మధ్య వాళ్ళ రాజీ సంప్రతింపుల కోసం ఎటువంటి ప్రయత్నమూ చెయ్యకుండా వుండటం ఎలా సాధ్యం అనుకున్నాను. ఆ ఆలోచనను యింకెంత మాత్రమూ భరించలేక, మిస్టర్ వాష్‌బర్న్ పట్టణంలోనే ఉన్నాడని తెలుసు

* న్యాయాధిపతి ఎదుట సంతకం పెట్టి యిచ్చే ధృవీకరణ. — సం.

కొని, వెంటనే వెళ్ళి ఆయన్ని చూడాలని నిర్ణయించుకున్నాను. ఇది జరిగినది ఏప్రిల్ 17న అనుకుంటాను; లార్డ్ లయన్స్‌కి నేను అదే రోజున లేఖ రాశాను, కాగా, దాన్ని బట్టి సరైన తేదీని ధృవపరచుకో వచ్చు. మిస్టర్ వాష్‌బర్న్ నివాసానికి వెళ్ళే దోవలో, ఎలిసే పార్కు దాటేటప్పుడు, క్షతగాత్రులతోను, మరణాసన్నులతోను నిండివున్న అనేక యాంబ్యులెన్సు వాన్లు నాకు ఎదురయ్యాయి. ఆర్క్ డి ట్రయంఫ్* చుట్టూ ఫిరంగి గుళ్ళు ప్రేలాయి. మిస్టర్ త్యేర్ పాతబడిన వాళ్ళ సుదీర్ఘ జాబితాకు పలువురు అమాయక ప్రాణులు చేరిపోయారు.

“షైయో రోడ్డు నంబరు 95కి చేరుకొని, కాపలా వాడిని అమెరికా రాయబారి బస కోసం వాకబు చేశాను. అతను రెండవ అంతస్తు చూపించాడు. పారిస్‌లో, ఎవరైనా ప్రత్యేకించి ఏ సోపానం పైన ఏ అంతస్తులో నివసిస్తున్నారన్నది అతని సంపదకీ, అతని సామాజిక అంతస్తుకీ ఒక సూచిక — అదొక రకమైన సాంఘిక బరామీటరు. ఈ భవంతి మొదటి అంతస్తులోని వీధి ఎదుటి భాగంలో ఒక మార్క్విస్,** అయిదవ అంతస్తులోని వెనక వాటాలో సామాన్యుడైన ఓ మెకానిక్కూ నివసించడం మనం చూస్తాం, — వారిని విడదీసే మెట్లు వారిద్దరికీ మధ్య గల సాంఘిక అగాధానికి ప్రాతినిధ్యం వహిస్తాయి. నేను మెట్లెక్కుతూండగా ఎర్ర ఇజార్లూ, సిల్కు స్టాకింగులూ ధరించిన లావుపాటి నౌకర్లు ఎదురు కాకపోవడంతో ‘ఓహో, ఈ అమెరికన్లు తమ డబ్బుని సద్వినియోగం చేస్తారు — మనమేమో తగల బెడతాం’ అనుకున్నాను.

“సెక్రటరీ గదిలో కెళ్ళి, మిస్టర్ వాష్‌బర్న్ ఎక్కడున్నారని వాకబు చేశాను — మీరాయన్ని సముఖంలో కలుసుకోవాలనుకుంటున్నారా? ఆఁ. — నా పేరున్న చీటి లోపలి కెళ్ళిన మీదట, నన్నాయన సముఖానికి తీసుకెళ్ళాడు. ఆయన ఓ చేతుల కుర్చీలో బద్ధకంగా వాలి, వార్తా పత్రిక చదువుతున్నాడు. నేనాయన లేస్తాడని ఆశించాను; కాని ఆయన పత్రిక ముందు పెట్టుకొని కూర్చునే వున్నాడు, సాధారణంగా జనం ఎంతో మర్యాదగా మన్ననగా ఉండే దేశంలో యిది శుద్ధ మొరటు ప్రవర్తన తప్ప వేరేమీ కాదు.

“మనం ఒప్పందం కుదర్చడానికి కృషిచెయ్యక పోవడమంటే, మాన

* విజయ చిహ్నంగా నిర్మింపబడిన కమాను. — సం.

** ప్రభువు. — సం.

వత్వ కర్తవ్యానికి మనం ద్రోహంచేస్తున్నట్లేనని మిస్టర్ వాష్‌బర్న్‌కి నేను చెప్పాను. ఆ ప్రయత్నంలో విజయం పొందినా, పొందక పోయినా, ప్రయత్నించడం మాత్రం సర్వథా మన విధి; ప్రష్యన్లు సరిగా అప్పుడు వెర్సేల్స్‌ని నిశ్చితమైన అంగీకారానికి రావాల్సిందిగా ఒత్తిడి చేస్తున్నారు కనుక, సరిగా ఆ తరుణం మరింత అనుకూలంగా కనిపిస్తున్నదని చెప్పాను. అమెరికా ఇంగ్లండుల ఉమ్మడి పలుకుబడి శాంతికి అనుకూలంగా పరిస్థితిని మారుస్తుందని చెప్పాను.

"మిస్టర్ వాష్‌బర్న్ అన్నాడు, 'పారిస్‌లోని జనం తిరుగుబాటుదార్లు. వాళ్ల ఆయుధాలు కింద పెట్టనివ్వండి.' నేషనల్ గార్డులకి తమ ఆయుధాలు కలిగివుండే చట్టబద్ధమైన హక్కుందని, నేను జవాబిచ్చాను; అయితే, అది కాదు సమస్య. మానవత్వానికే తీవ్రాఘాతం తగిలినప్పుడు, జోక్యం చేసుకునే హక్కు నాగరిక ప్రపంచానికుంటుంది. ఆ మేరకు లార్డ్ లయన్స్‌తో సహకరించాల్సిందిగా మిమ్మల్ని అర్థిస్తున్నాను. — మిస్టర్ వాష్‌బర్న్: వెర్సేల్స్‌లో ఉన్నారే వీళ్ల ఎవళ్ల మాటా వినిపించుకోరు.' — 'వాళ్ల తిరస్కరిస్తే, నైతిక బాధ్యత వాళ్లమీదే ఉంటుంది.' — మిస్టర్ వాష్‌బర్న్: 'నాకు అలా అనిపించడం లేదు. ఈ విషయంలో నేనేమీ చెయ్యలేను. మీరు లార్డ్ లయన్స్‌ను చూస్తే మంచిది.'

"మా ఇంటర్వ్యూ అలా ముగిసింది. నిరాశా నిస్పృహలతో నేను మిస్టర్ వాష్‌బర్న్‌ని విడిచివెళ్లాను. ప్రజాస్వామిక రిపబ్లిక్ ప్రతినిధిలో మనం ఆశించే సౌభ్రాతృత్వ భావాలేమీ లేకపోగా నాకాయన ఒక మొరటు తలబిరుసు మనిషిగా కనిపించాడు. లార్డు కౌలీ ఫ్రాన్సులో మన ప్రతినిధిగా ఉండగా, రెండు సందర్భాల్లో ఆయనను ఇంటర్వ్యూ చేసే గౌరవం నాకు లభించింది. నిష్కపటమూ, సౌజన్యపూరితమైన ఆయన ధోరణి, అమెరికన్ రాయబారియొక్క బిర్రబిగుసుకు పోయి, అతిశయంతో కూడిన రాజస ధోరణికి పూర్తి భిన్నంగా ఉంది.

"మానవత్వ పరిరక్షణ దృష్ట్యా, ఇంగ్లండు రాజీ కుదర్చడానికి హృదయపూర్వకమైన కృషి చేసి తీరాలని లార్డ్ లయన్స్‌కి కూడా నేను విజ్ఞప్తి చేశాను. క్లమార్ స్టేషన్, ములెన్ సాకేలలో జరిగిన ఊచకోతలవంటి ఘోరాల సంగతి, నెయ్‌ల్లిలో జరిగిన ఘాతుకాల సంగతి చెప్పనే అక్కర్లేదు, యిటువంటి ఘాతుకాల విషయంలో బ్రిటిష్ ప్రభుత్వం చూస్తూ ఉదాసీనంగా ఊరుకో జాలదనీ, మానవత్వాన్ని ప్రేమించే ప్రతి ఒక్కని శాపాలకూ

గురికాకుండా ఉండాలంటే బ్రిటిష్ ప్రభుత్వం రాజీ కుదిర్చే ప్రయత్నం చేసి తీరాలని నేను విజ్ఞప్తి చేశాను. లార్డు లయన్స్ తన కార్యదర్శి మిస్టర్ ఎడ్వర్డు మాలెట్ ద్వారా నోటి మాటగా నాకు జవాబు చెప్పాడు, నా లేఖను ప్రభుత్వానికి పంపానని, ఆ అంశంపై నేను మరే కాగితమైనా యిస్తే దాన్ని కూడా యిష్టపూర్వకంగా ప్రభుత్వానికి పంపుతాననీ చెప్పాడు. ఒక తరుణంలో, ఒప్పందానికి పరిస్థితులు అత్యంత అనుకూలంగా ఉన్నాయి. మా ప్రభుత్వమే కనక తన పలుకుబడిని అందుకు అనుకూలంగా వినియోగించి ఉన్నట్లయితే, ప్రపంచానికి యీ పారిస్ జనవధ తప్పిపోయి వుండేది. ఏదేమైనప్పటికీ, బ్రిటిష్ ప్రభుత్వం తన విధ్యుక్త ధర్మ నిర్వహణలో విఫలమైందంటే, ఆ పొరపాటుకు బాధ్యత మాత్రం లార్డు లయన్స్‌ది కాదు.

"సరే, మిస్టర్ వాష్‌బర్న్ సంగతికి తిరిగివద్దాం. మే 24, బుధవారం మధ్యాహ్నం, నేను కపూసిన్స్ వీధి గుండా వెళ్తూండగా నా పేరెవరో పిలవడం విని వెనక్కి తిరిగాను. పలువురు అమెరికన్ల మధ్య మూతలేని బండిలో మిస్టర్ వాష్‌బర్న్ కూర్చొని ఉండగా, ఆయన ప్రక్కనే డాక్టర్ హోస్పర్ట్ నిలబడివున్నాడు. మామూలు అభివాద ప్రత్యభివాదాలయ్యాక, నేను డాక్టర్ హోస్పర్ట్‌తో సంభాషణలోకి దిగాను. అంతలోనే సంభాషణ సాధారణ విషయాలపైకి – చుట్టూ కనిపించే భయానక దృశ్యాలపైకి – మళ్లింది; అంతలోనే నా వంక తిరిగి, తాను చెప్పున్నది నిజం అని విశ్వసించిన మనిషి లాగ మిస్టర్ వాష్‌బర్న్ – '<u>కమ్యూన్‌కి చెందిన యావన్మందీ, దాని పట్ల సానుభూతి చూపేవాళ్లూ, కాల్చివెయ్యబడతారు</u>' అన్నాడు. ఖర్మ! <u>సానుభూతి</u> కలిగివున్న నేరానికి వాళ్లు ముసలివాళ్లనీ, యువకులనీ చంపిపారేస్తున్నారన్న సంగతి నాకు తెలుసు, కానైతే యీ విషయాన్ని అర్ధాధికారికంగా మిస్టర్ వాష్‌బర్న్ నుండి వింటానని మాత్రం నే ననుకోలేదు; అయితేనేం, ఇక్కడ సరిగా క్రూరమైన యీ వాక్యాన్ని <u>పల్లిస్తున్నప్పుడే</u>, ఆర్చిబిషప్‌ని కాపాడటానికి మాత్రం ఆయనకి బోలెడంత వ్యవధి ఉంది.[181]

## II

"ప్రష్యన్ల తరవున, వెర్సేల్స్ వారికీ, కమ్యూనార్డులకీ మధ్య, ఈ క్రింది షరతులపై ఐక్యం చేసుకొనే ప్రతిపాదనతో, మే 24న, మిస్టర్ వాష్‌బర్న్ కార్యదర్శి, 11వ జిల్లా మెయిరీలో జరుగుతున్న కమ్యూన్ సమావేశానికి వచ్చాడు: –

" 'యుద్ధ చర్యల విరమణ.

" 'ఒక వంక కమ్యూన్, మరో వంక జాతీయ అసెంబ్లీ తిరిగి ఎన్నుకోబడాలి.

" 'వెర్సేల్స్ సేనలు పారిస్‌ని విడిచిపోవాలి, దుర్గాల లోపలా, చుట్టూ తమ నెలవులేర్పాటు చేసుకోవాలి.

" 'నేషనల్ గార్డు పారిస్‌ను పరిరక్షిస్తూ ఉండాలి.

" 'కమ్యూన్ సైన్యంలో పనిచేస్తున్న, లేక పనిచేసిన వాళ్లపై శిక్ష అమలు జరపబడరాదు.'

"కమ్యూన్, ఒక అసాధారణ సమావేశంలో, యీ ప్రతిపాదనలకు, రాజ్యాంగసభ ఎన్నికకు సన్నద్ధం కావడానికి ఫ్రాన్సుకు రెండు మాసాల గడువివ్వాలన్న షరతుపై, ఆమోదం తెలిపింది.

"అమెరికన్ రాయబార కార్యాలయ కార్యదర్శితో రెండవ సమావేశం జరిగింది. మే 25 నాటి తన ఉదయపు సమావేశంలో కమ్యూన్, వెర్మొరేల్, డెలెక్లూజ్, అర్నాల్డులతో బాటు, అయిదుగురు పౌరులను విన్సెన్‌కు సర్వాధికారాలివ్వబడిన రాయబారులుగా పంపేందుకు తీర్మానించింది. మిస్టర్ వాష్‌బర్న్ కార్యదర్శి యిచ్చిన సమాచారం మేరకు, అప్పుడక్కడొక ప్రష్యన్ ప్రతినిధి వేచి వుంటాడు. అయితే ఆ ప్రతినిధివర్గం, విన్సెన్ గేటు వద్ద కావలా డ్యూటీలో వున్న నేషనల్ గార్డులచేత ముందుకెళ్లకుండా నివారింపబడింది. తత్పర్యవసానంగా అదే అమెరికన్ కార్యదర్శితో జరిగిన మరో సమావేశంలో, సిటిజన్ అర్నాల్డుకి, నిరాటంక, నిరపాయ ప్రయాణానికి సంబంధించిన అనుమతి పత్రం యివ్వబడిన మీదట, ఆయన మే 26వ సెయింట్ డెనీకి వెళ్లాడు, అక్కడ ఆయన్ని—ప్రష్యన్లు లోనికి రానివ్వ లేదు.

"ఈ అమెరికన్ జోక్యం ఫలితం (ప్రష్యన్లు తమ తాటస్థ్యాన్ని పునరుద్ఘాటించారనీ, యుద్ధ కక్షిదారుల మధ్య జోక్యం చేసుకోవాలని భావిస్తున్నారన్న విశ్వాసాన్ని కల్పించింది) ఏమిటంటే, అత్యంత కీలకమైన తరుణంలో, రక్షణను రెండు రోజుల పాటు స్తంభింప చెయ్యడం మాత్రమే. ఈ సంప్రతింపుల విషయాన్ని రహస్యంగా ఉంచాలని ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా కూడా, త్వరలోనే అవి నేషనల్ గార్డులకు తెలిసిపోయాయి. వాళ్లప్పుడు, ప్రష్యన్ తాటస్థ్యంలో పూర్తి విశ్వాసంతో, ప్రష్యన్ సైనిక శ్రేణుల దిశగా, ఖైదీలుగా పట్టుబడి పోయేందుకు పరుగెత్తుకెళ్లారు. వారు చూపిన యీ విశ్వాసం, తమ కావలా సైనికులచేత పలాయితులలో కొందరివి

కార్పించి చంపించడం ద్వారా, లొంగిపోయిన వారిని వెర్సేల్స్ ప్రభుత్వానికి అప్పగించడం ద్వారా, ఎలా దుర్వినియోగం చెయ్యబడిందో తెలిసిన సంగతే.

"అంతర్యుద్ధం సాగుతున్నంత కాలమూ కూడా, మిస్టర్ వాష్‌బర్న్, తన కార్యదర్శి ద్వారా, కమ్యూన్ పట్ల తన కెంతటి ప్రగాఢమైన సానుభూతి వున్నదో విధివిరామాల్లేకుండా తెలియజేస్తూనే వున్నాడు, కానైతే రాయబారి పదవి మాత్రమే తానీ విషయాన్ని బహిరంగంగా వ్యక్తీకరించడానికి ఆటంకంగా ఉన్నట్లు, వెర్సేల్స్ ప్రభుత్వం పట్ల తనకు విరసన భావమున్నట్లు తెలియ జేస్తూ వచ్చాడు."

ఈ IIవ ప్రకటనను పారిస్ కమ్యూన్ సభ్యుడొకడు* చేశాడు. మిస్టర్ రీడ్ మాదిరిగానే, అవసరమైతే ఈయన కూడా affidavit ద్వారా దీన్ని ధృవీకరిస్తాడు.

మిస్టర్ వాష్‌బర్న్ ప్రవర్తనను పూర్తిగా అర్థంచేసుకోవాలంటే, మిస్టర్ రీడ్‌యొక్క, పారిస్ కమ్యూన్ సభ్యునియొక్క ప్రకటనలను కలిపి ఒకటిగా చదవాలి, ఒకే పథకానికి బొమ్మాబొరుసులుగా చూడాలి. మిస్టర్ వాష్‌బర్న్ ఒకవంక మిస్టర్ రీడ్‌తో, కమ్యూనార్డులు "తిరుగుబాటుదారులు" అనీ, వాళ్లకి శాస్తి జరగాల్సిందేననీ అంటాడు. మరోవంక కమ్యూన్‌తో, కమ్యూన్ లక్ష్యం పట్ల తనకి సానుభూతి వుందనీ, వెర్సేల్స్ ప్రభుత్వమంటే తనకి ఏహ్య భావముందనీ చెప్తాడు. అదే మే 24వ తేదీననే, డాక్టర్ హాప్సార్ట్ సమక్షంలో పలువురు అమెరికన్ల ఎదుట, మిస్టర్ రీడ్‌తో, కమ్యూనార్డులే కాదు, కేవలం వాళ్ల సానుభూతిపరులు సైతం తిరుగులేని మరణశిక్షకు గురవుతారని చెప్పాడు. మరోవంక, తన కార్యదర్శి ద్వారా, కమ్యూన్‌కి, దాని సభ్యులే కాకుండా, కమ్యూన్ సైన్యంలోని ప్రతి వ్యక్తీ కూడా కాపాడబడతాడని తెలియజేశాడు.

ప్రియమైన సిటిజన్స్, ఈ వాస్తవాలను అమెరికన్ కార్మికవర్గం ముందుంచాల్సింది గాను, అమెరికన్ రిపబ్లిక్‌కి మిస్టర్ వాష్‌బర్న్ తగిన ప్రతినిధి అవునా కాదా అన్న విషయాన్ని నిర్ణయించమని దానికి విజ్ఞప్తి చెయ్యాల్సిందిగాను మేం మిమ్మల్నిప్పుడు కోరుతున్నాం.

ఆఫీసు – 256, హై హాల్‌బోర్న్,
లండన్, డబ్లియు. సి.,
1871 జూలై 11

1871 జూలై 13 ప్రాంతంలో
కరపత్రంగాను,
1871 జూలై – సెప్టెంబరు
మాసాల్లో అనేక ఇంటర్నేషనల్
పత్రికల్లోను ప్రచురింపబడింది

---

* ఆగస్ట్ సెరయ్యే. – సం.

# ఫ్రెడరిక్ ఎంగెల్స్

## "The Times" సంపాదకునికి[182]

మహాశయా,

వెర్సేల్స్‌లో కమ్యూనిస్టు ఖైదీల విచారణను పదేపదే వాయిదా వెయ్యడంపై "T mes" పత్రిక వ్యాఖ్యలు, నిస్సందేహంగా అసలైన అంశాన్ని బయటపెట్టి ఫ్రెంచి ప్రజల అభిప్రాయాన్ని వ్యక్తీకరించాయి. ఈ వ్యాఖ్యలకు జవాబుగా "Journa Officiel"[183] వెల్లడించిన కుపిత ధోరణి, అవి వాస్తవమనేందుకు అనేక రుజువుల్లో ఒకటి మాత్రమే. "Times"లోని వ్యాసం పర్యవసానంగా పారిస్ పత్రికలకు అనేక బహిరంగలేఖలు గుప్పింపబడ్డాయి. ఈ పరిస్థితుల్లో ఈ బహిరంగలేఖలు ప్రచురింపబడే అవకాశం లేదు. ఒక ఫ్రెంచి జాతీయుని లేఖ ఒకటి యిప్పుడు నాముందుంది. ఆయన అధికార పదవినిబట్టి, తను రాస్తున్న వాస్తవాల సంగతి ఆయనకు బాగా తెలిసే అవకాశముంది, అంతర్యం తెలియరాని యీ ఆలస్యానికి వెనకనున్న కారణాలకు సంబంధించిన ఆయన నిరూపక సాక్ష్యానికి కొంత విలువ వుండే తీరుతుంది. ఈ లేఖలోని కొన్ని భాగాలివిగో:

> "మూడవ కోర్టు మార్షల్ విచారణలు ఎప్పుడు ప్రారంభమవుతాయో ఎవడికీ తెలియదు. Commissa re de la Républ que (పబ్లిక్ ప్రాసిక్యూటర్) కెప్టెన్ గ్రిమాల్, మరొకరిచేత, మరింత విశ్వాసపాత్రుని చేత పర్యవేక్షింపబడటమే యిందుకు కారణంలాగ కనిపిస్తోంది. చిట్టచివరి క్షణంలో, కోర్టులో చదవాల్సి వుండిన ఆయన సాధారణ నివేదికను తిరగేసిన మీదట, ఆయనకి ఏ కొంచెమో రిపబ్లికన్ వాసన వున్నట్లూ, ఉత్తరాది సైన్యం నగైరాల్లో, ఫెడేర్స్ వగైరాల క్రింద పనిచేసినట్లూ అనుమానం తగిలినట్లుంది. అంతే, యింకేముంది వెంటనే మరో ఆఫీసరు ఆయన ఆఫీసుకొచ్చి ఇదిగో నా ఉద్యోగ నియామక పత్రం, మీ స్థానంలో నేనొచ్చాను

అన్నాడు. పాపం ఆ కెప్టెను ఎంతగా విభ్రాంతి చెందాడంటే, దాదాపుగా ఆయనకి మతిభ్రమించినంత పనైంది....

"త్యేర్‌కి ప్రతిదీ తను స్వయంగా చెయ్యాలన్న అతిశయమొకటి వుంది. అన్ని సహేతుక నియమాలకూ విరుద్ధంగా, juges d'instructions* అందరినీ తన గదిలో సమావేశం కావలసిందిగా ఆదేశించేదాకా ఈ గీర వెళ్లింది. అంతేకాదు. కోర్టులోకి అనుమతింపబడాల్సిన జనం ఎవరై ఉండాలన్న అంశాన్ని నియమితం చెయ్యడానికి సైతం అతను పూనుకొన్నాడు. సెయింట్ ఇలేర్ ద్వారా ప్రవేశానుమతి టిక్కెట్లను తనే స్వయంగా పంచేందుకు సైతం అతను తయారయ్యాడు....

"ఈలోగా సతొరీలోని ఖైదీలు ఈగలు చచ్చినట్లు చస్తున్నారు — ఈ మరుగుజ్జు రాజకీయ వేత్త న్యాయం కన్న నిర్దాక్షిణ్య మృత్యువు శీఘ్రతరంగా పనిచేసింది.... వెర్సేల్స్ అరలరల ఖైదులో ఒక్క ఫ్రెంచి మాట కూడా రాని ఒక పొడుగాటి వ్యక్తి వున్నాడు, అతగాడు ఐరిష్ జాతీయుడనుకున్నారు. అతనీ యిబ్బందిలో ఎలా చిక్కుకున్నాడో యిప్పటికీ ఒక నిగూఢ రహస్యమే. ఖైదీల్లో... పేరుగల అత్యంత నిజాయితీపరుడైన వ్యక్తి ఒకడున్నాడు.... అతను తన జైలుఖానాలో యిప్పటికప్పుడే రెండు నెలలుగా ఉన్నాడు, అయితేనేం యింతవరకు అతనిపై విచారణ జరగలేదు. ఇది అప్రతిష్ఠాకరమైన విషయం."

ఇట్లు,
తమ విధేయుడు,
జస్టీషియా

లండన్, 1871 ఆగస్టు 7

మొదట రష్యన్లో "మార్క్స్ ఎంగెల్సుల రచనలు" (మొదటి ముద్రణ) సంపుటి XIII, రెండవ భాగం, 1940లో ప్రచురింపబడింది

* దర్యాప్తు చేసేవాళ్ళు. — సం.

# కార్ల్ మార్క్స్

## "La Vérité"[140] వార్తాపత్రికా సంపాదకునికి

ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్స్ అసోసియేషన్
256, హై హాల్‌బోర్న్, లండన్, డబ్లియు. సి.
ఆగస్టు 30, 1871

సంపాదక మహాశయా,

కనిపించిన జమీందారీ భవంతులు అన్నింటినీ తగలబెట్టమనీ గట్టిగా చెప్పే ఒక ప్రణాళిక కర్తృత్వాన్ని ఇంటర్నేషనల్‌కి రెనో ఆపాదించిన సంగతిని ఈనాటి "Daily News"[91]లో చదివిన మీదట, ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్స్ అసోసియేషన్ జనరల్ కౌన్సిలు ప్రధాన కార్యదర్శి అయిన జాన్ హేల్స్, అస్సీగారి డిఫెన్సు లాయరైన ఎల్. బిగో‌కి యీ క్రింది టెలిగ్రాం పంపాడు:

> "ఇంటర్నేషనల్‌కి ఆపాదింపబడిన దహనకాండకు పిలుపు, శుద్ధ దగా. ఇంగ్లీషు మేజిస్ట్రేటు ముందు ఆ మేరకు, అఫిడవిట్‌ను దాఖలు చెయ్యడానికి మేము సంసిద్ధంగా ఉన్నాం."

ఈ సందర్భంలో నేనిప్పుడు, గౌరవనీయమైన మీ పత్రిక ద్వారా, ఫ్రెంచి ప్రభుత్వ సేనలు పారిస్‌లో ప్రవేశించిన నాటి నుండి, ఇంటర్నేషనల్ తరఫున పారిస్‌లో ముద్రింపబడిన ప్రణాళికలన్నీ, యీ అమాంబాపతు ప్రణాళికలన్నీ కూడా, ఒక్కగానొక్క మినహాయింపు కూడా లేకుండా ప్రతి ఒక్కటీ కూడా ఫోర్జరీయేనని ఫ్రెంచి జనసామాన్యానికి హెచ్చరిక చేస్తున్నాను.

నేనీ ప్రకటనను నా ప్రమాణ పూర్తిగా చెయ్యడమే కాకుండా, ఏ ఇంగ్లీషు మేజిస్ట్రేటు ముందైనా ఆ మేరకు అఫిడవిట్ దాఖలు చెయ్యడానికి కూడా సంసిద్ధుడనై వున్నాను.

నీచమైన ఈ అభూతకల్పన కేవలం పోలీసులు చేసినదైనా కాదనీ, "బి" అనబడే ఒకానొక పెద్దమనిషి చెయ్యి దీనిలో ఉందనీ చెప్పేందుకు నాకు గట్టి ఆధారాలున్నాయి. ఈ వ్యక్తికి పారిస్ పత్రికల్లో ఒకదానితో సంబంధమున్నది. ఆ పత్రికలు ఎలాంటి వంటే,

"Standard"[167] (ఒక టోరీ పత్రిక) యిటీవలి తన సంచిక ఒకదానిలో "పడువు కూటి పత్రికలు" అని వర్ణించినవవి.

గౌరవాభివందనాలతో,

కార్ల్ మార్క్స్

"Le Soir" వార్తాపత్రిక 1871 సెప్టెంబరు 3వ తేదీ, 862వ సంచికలోను, తదితర బూర్జువా పత్రికల్లోను, అంతే కాకుండా వార్తాపత్రికలు "L'Internationale" 1871 సెప్టెంబరు 10వ తేదీ 139వ సంచికలోను, "Der Volksstaat" 1871, సెప్టెంబరు 13వ తేదీ, 74వ సంచికలోను ప్రచురింపబడింది

# ఫ్రెడరిక్ ఎంగెల్స్

# కార్మికవర్గ రాజకీయ కార్యాచరణపై ఉపన్యాసం[184]

(కొంత భాగం)

1871 సెప్టెంబరు 21న లండన్‌లో జరిగిన ఇంటర్నేషనల్ యొక్క మహాసభలో ఉపన్యాసపు సొంత రికార్డు

రాజకీయ కార్యాచరణ నుండి పూర్తి సన్యాసం అసంభవం. అలా సన్యసించాలని చెప్పే పత్రికలు నిత్యం రాజకీయాల్లో పాల్గొంటూనే ఉన్నాయి. అయితే, ఎవరైనా ఆ పని ఎలా చేస్తాడు, ఏరకమైన రాజకీయాల్లో అతను నిమగ్నుడవుతాడన్నదే సమస్యల్లా. పోతే, మిగిలిన మనకి సన్యాసం అసాధ్యం. కార్మికవర్గ పార్టీ పలు దేశాల్లో యిప్పటికే రాజకీయ పార్టీగా పని చేస్తోంది, కాగా, రాజకీయ సన్యాసాన్ని బోధించడం ద్వారా దాన్ని నాశనం చెయ్యడం మన పని కాదు. జీవితానుభవం, ప్రస్తుతమున్న ప్రభుత్వాల రాజకీయ పీడనా, వాళ్ళకి నచ్చినా నచ్చక పోయినా, అది రాజకీయ గమ్యాల కోసమైనా లేక సాంఘిక గమ్యాలకోసమైనా, కార్మికులను రాజకీయాల్లో నిమగ్నమయ్యేలా చేస్తాయి. వాళ్ళకి రాజకీయ సన్యాసాన్ని బోధించడమంటే వాళ్ళని బూర్జువా రాజకీయ పరిష్వంగంలోకి నెట్టడం మాత్రమే అవుతుంది. రాజకీయ కార్యాచరణను ప్రముఖంగా ముందుకు తెచ్చిన పారిస్ కమ్యూన్ మర్నాటి ఉదయం మంచి యిక రాజకీయ సన్యాసమన్నది పూర్తిగా అసంభవమే.

"కమ్యూనిస్టు ఇంటర్నేషనల్"
పత్రిక 1934, 29వ సంచికలో
పూర్తిగా మొదట ప్రచురింపబడింది

# జర్మనీ బ్రిటన్లలో ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్స్ అసోసియేషన్ పరిస్థితిపై మార్క్స్ ఉపన్యాసపు రికార్డు[185]

(కొంత భాగం)

1871 సెప్టెంబరు 22న లండన్‌లో జరిగిన
ఇంటర్నేషనల్ సభయొక్క
మినిట్స్ నుండి

కమ్యూన్ ఉన్న కాలంలో, జర్మన్ కార్మికులు తమ సమావేశాల్లోనూ, తమ వార్తాపత్రికల ద్వారానూ పారిస్‌లోని విప్లవవాదుల పట్ల తమ సంఘీభావాన్ని పునరుద్ఘాటిస్తూ వచ్చారు. కమ్యూన్ కూలిపోయినప్పుడు బ్రెస్లౌలో వాళ్ళొక సభ జరిపారు, ప్రష్యన్ పోలీసులు దాన్ని చెదరగొట్ట ప్రయత్నించి విఫలురయ్యారు. ఆ సభలోనూ, జర్మనీలోని వివిధ పట్టణాల్లో జరిగిన యితర సభల్లోనూ, వాళ్ళు పారిస్ కమ్యూన్ పట్ల తమ హర్షామోదాలు వెల్లడించారు. చివరకి, విల్‌హెల్మ్ చక్రవర్తీ, అతగాని సైన్యమూ విజయ గర్వాతిరేకంతో బెర్లిన్‌లో ప్రవేశించిన సందర్భంగా, ప్రజలా విజేతలకు "పారిస్ కమ్యూన్ వర్ధిల్లాలి!" అన్న నినాదాలతో ఎదురెళ్ళారు.

మొదట రష్యన్ భాషలో
"మొదటి ఇంటర్నేషనల్‌యొక్క
లండన్ మహాసభ"
అన్న పుస్తకంలో 1936లో
ప్రచురింపబడింది

# కార్ల్ మార్క్స్

## ఇంటర్నేషనల్ ఏడవ వార్షికోత్సవంపై చేసిన ఉపన్యాసం[186]

(కొంత భాగం)

1871 సెప్టెంబరు 25న లండన్‌లో జరిగిన
వార్షికోత్సవ సభలో చేసిన ఉపన్యాసం.
విలేకరి చేసిన రికార్డు

కమ్యూనే చిట్టచివరి ఉద్యమం, ఇంతవరకు జరిగిన ఉద్యమాలన్నింటిలోకీ అది మిక్కిలి మహత్తరమైనది. కార్మికవర్గ రాజకీయాధికార ఆక్రమణే కమ్యూన్, అందులో రెండో అభిప్రాయానికే తావులేదు. కమ్యూన్‌ని గురించి ఎంతో అపోహ వుంది. కమ్యూన్ వర్గపాలనకు సంబంధించిన ఒక నూతన రూపాన్ని నెలకొల్ప లేకపోయింది. శ్రమ సాధనాలన్నింటినీ ఉత్పాదకునికి బదిలీ చేసి, తద్వారా శరీర సౌష్ఠవం కలిగిన ప్రతి ఒక్కడినీ తన జీవిక కోసం విధిగా పని చేసేలా చేసి, తద్వారా ప్రస్తుతం అమల్లో వున్న పీడన పరిస్థితులను రూపుమాపి నప్పుడే, వర్గపాలనకూ, పీడనకూ గల ఏకైక ప్రాతిపదిక తొలగింపబడుతుంది. కానైతే అటువంటి మార్పు సాధింపబడేందుకు ముందు శ్రామికవర్గ నియంతృత్వం అవసరమవుతుంది, దానికి మొట్టమొదటి షరతు శ్రామికవర్గ సైన్యం. యుద్ధభూమిలో తమను తాము విముక్తం చేసుకొనే హక్కును కార్మికవర్గం సాధించు కోవాలి. రాబోయే పోరాటం కోసం కార్మికవర్గ శక్తులను సంఘటితం చెయ్యడం, సమకూర్చడమే ఇంటర్నేషనల్ కర్తవ్యం.

"The World"లో
1871 అక్టోబరు 15న
ప్రచురించబడింది

# కార్ల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఎంగెల్స్

## ఇంటర్నేషనల్‌లో కల్పిత చీలికలు[187]

(కొంత భాగం)

పారిస్ కమ్యూన్ పతనానంతరం, జనరల్ కౌన్సిలు చేసిన తొలి చర్య, "ఫ్రాన్సులో అంతర్యుద్ధం"* పై తన విజ్ఞప్తిని ప్రచురించడమే. అందులో అది కమ్యూన్ చర్యల న్నింటినీ బాహాటంగా బలపరచింది. ఈ క్షణంలో అవే చర్యలు పరాజితులైన పారిస్ వాసులపై బూర్జువావర్గమూ, పత్రికలూ, యూరప్‌లోని అన్ని ప్రభుత్వాలూ అత్యంత నీచమైన అభాండాలు వెయ్యడానికి సాకుగా ఉపయోగపడ్డాయి. కార్మికవర్గంలోనే యింకా కొందరు తమ లక్ష్యం పరాజితమైందన్న సంగతిని గ్రహించడంలో విఫలమయ్యారు. కౌన్సిలు సభ్యుల్లోనే యిద్దరు, సిటిజన్సు ఓడ్జర్, లక్రాఫ్ట్‌లు విజ్ఞప్తికి పూర్తిగా తమ సమర్థనను నిరాకరిస్తూ రాజీనామా చెయ్యడం కూడా మిగిలినవాటితోబాటు దానికి ఈ వాస్తవాన్ని రుజువుచేసింది. పారిస్ ఘటనల పట్ల కార్మికవర్గం మధ్య అభిప్రాయాల ఏకీకరణ అన్ని నాగరిక దేశాల్లోనూ విజ్ఞప్తి ప్రచురణ జరిగిన నాటి నుండి ప్రారంభ మైందని చెప్పవచ్చు.

మరోవంక, ఇంటర్నేషనల్‌కి[16] బూర్జువా పత్రికలు, ప్రత్యేకించి ప్రముఖ ఇంగ్లీషు వార్తాపత్రికలు, మిక్కిలి శక్తివంతమైన ప్రచార సాధనాలుగా పనికొచ్చాయి. వాటన్నింటినీ వివాదంలోకి బలవంతాన ఈడ్చినది విజ్ఞప్తే, జనరల్ కౌన్సిలు దానిని తన జవాబుల ద్వారా కొనసాగించింది.

కమ్యూన్ నుండి పలువురు కాందిశీకులు లండను చేరుకోవడంతో, జనరల్ కౌన్సిలే సహాయ కమిటీగా ఏర్పడి, తన మామూలు విధులు నిర్వహించడంతోబాటు, అలా ఎనిమిది మాసాలకు పైగా పనిచెయ్యాల్సి వచ్చింది.[188] పరాజితులైన కమ్యూనార్డులకు బూర్జువా వర్గం సహాయం చెయ్యదని వేరే చెప్పనక్కర్లేదు. కార్మికవర్గానికి సంబంధించినంతవరకు,

---

* 53–114వ పేజీలు చూడండి. – సం.

సహాయార్థం విజ్ఞప్తులు క్లిష్టమైన తరుణంలో వచ్చాయి. స్విట్జర్లండ్, బెల్జియంలకు కాందిశీకుల బృందాలు యింతకు ముందే చేరుకున్నాయి. వాటిని వాళ్ళక్కడ పోషించ నైనా పోషించాలి, లేకుంటే లండనుకైనా పంపాలి. జర్మనీ, ఆస్ట్రియా, స్పెయిన్లలో ప్రోగుచెయ్యబడిన విరాళాలు స్విట్జర్లండుకు పంపబడ్డాయి. ఇంగ్లండులో, 9 గంటల పనిదినం కోసం జరిగిన తీవ్రమైన పోరాటం — దీనికి సంబంధించిన నిర్ణయాత్మక పోరాటం న్యూకాస్ల్లో జరిగింది[189] — కార్మికుల వ్యక్తిగత విరాళాలను, ట్రేడ్యూనియన్లు కేటాయించిన నిధులనూ కూడా ఖాళీచేసింది, పైగా, నిబంధనావళి మేరకు ఆ నిధులను లేబరు తగాదాల సందర్భంగా మాత్రమే వినియోగించాల్సి వుంటుంది. ఈలోగా, శ్రద్ధగా శ్రమించి పని చెయ్యడం ద్వారాను, బయటకు జాబులు పంపడం ద్వారాను కౌన్సిలు, కొంచెంకొంచెమే, సొమ్ము కూడబెట్టి, దాన్ని వారం వారం కాందిశీకులకు పంచిపెట్టింది. దాని విజ్ఞప్తికి అమెరికన్ కార్మికులు మరింత ఉదారబుద్ధితో ప్రతిస్పందించారు. భయభీత బూర్జువావర్గం ఇంటర్నేషనల్ కోట్లాది ధనాన్ని తన ఖజానాపెట్టెలలో రాసులు పోసిందని నమ్మింది. ఆ కోట్ల ధనాన్ని ఇంటర్నేషనల్ వినియోగించుకోలేకపోవడం దురదృష్టకర విషయమే!

1817 మే అనంతరం, కమ్యూన్ కాందిశీకుల్లో కొందరు కౌన్సిల్లోకి చేరాల్సిందిగా ఆహ్వానింపబడ్డారు, యుద్ధ ఫలితంగా, దానిలో ఫ్రెంచి ప్రాతినిధ్యం బొత్తిగా లేక పోవడంతో యిది అవసరమైంది. కొత్త సభ్యుల్లో కొందరు పాత ఇంటర్నేషనల్ సభ్యులు, విప్లవ శక్తికి పేరొందిన కొందరు వ్యక్తులు వున్నారు. వారి ఎన్నిక పారిస్ కమ్యూన్కి గౌరవ నివాళి అర్పించడమే.

1872 జనవరి మధ్యకీ మార్చి 5కీ మధ్య రచింపబడింది. 1872లో జినీవాలో చిన్న పుస్తకంగా (ఫ్రెంచిలో) ప్రచురింపబడింది

## కార్ల్ మార్క్స్

# పారిస్ కమ్యూన్ వార్షికోత్సవ సందర్భంలో జరిగిన సభ తీర్మానాలు[190]

### [I]

"గత మార్చి 18వ తేదీ వార్షికోత్సవ సందర్భంలో జరిపిన యీ సభ, 1871 మార్చి 18వ ప్రారంభింపబడిన మహత్తర ఉద్యమాన్ని, మానవజాతిని వర్గ సమాజంనుండి శాశ్వతంగా విముక్తం చేసే మహత్తర సామాజిక విప్లవ ఉషోదయంగా ప్రకటిస్తోంది."

### [II]

"కార్మికవర్గం పట్ల గల ద్వేషం కారణంగా, యూరప్ అంతటికీ విస్తరింప చెయ్యబడిన బూర్జువావర్గాల అశక్తదురాగతాలు, పాత సమాజానికి, అది — రాజరిక లేక రిపబ్లిక్ — ఏ రూపంలో ఉన్నా కూడా, వినాశాన్ని ఖాయం చేశాయి అని ప్రకటిస్తోంది."

### [III]

"ఇంటర్నేషనల్‌కి వ్యతిరేకంగా ప్రభుత్వాలన్నీ జరిపే ఉమ్మడి యుద్ధమూ, వెర్సైల్స్ హంతకులు, అలాగే వారి ప్రష్యన్ విజేతల బీభత్సకాండా వాళ్ల విజయాల బోలుతనాన్నీ, త్యేర్, విల్‌హెల్మ్‌ల సంయుక్త బలగాలచేత అణచివెయ్యబడిన తన వీరోచిత అగ్రగామి దళం వెనుక సమీకృతమవుతున్న యావత్ప్రపంచ శ్రామికవర్గ దాడి సైన్య అస్తిత్వాన్నీ తెలియజేస్తున్నాయని భావిస్తోంది."

1872 మార్చి 13–18ల మధ్య
రచింపబడి, 1872 మార్చి 24వ
తేదీన "La Liberté" 12వ
సంచికలోను, 1872 మార్చి 30వ
"The International Herald"
3వ సంచికలోను ప్రచురింపబడింది

# కార్ల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఎంగెల్స్

## 1872లో వెలువడిన "కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక"యొక్క జర్మన్ కూర్పుకు పీఠిక[191]

(కొంత భాగం)

గత పాతికేళ్ల కాలంలోనూ పరిస్థితులు ఎంత ఎక్కువగా మారినప్పటికీ, ఈ "ప్రణాళిక"లో చెప్పిన సాధారణ సూత్రాలు, మొత్తంమీద, ఎన్నటిలాగే యీనాడు కూడా సరైనవే. అక్కడక్కడ కొన్ని సవరణలు చేయనచ్చునేమో, అంతే. "ప్రణాళికే" పేర్కొన్నట్లు, ఆచరణలో ఈ సూత్రాల అన్వయం, అన్ని చోట్లా అన్ని కాలాల్లో, ఆనాడున్న చారిత్రక పరిస్థితులపైన ఆధారపడి వుంటుంది. ఆ కారణంగానే, IIవ ప్రకరణం చివర ప్రతిపాదింపబడిన విప్లవాత్మక చర్యల్లో వేటినీ ప్రత్యేకించి వక్కాణించ డమన్నది జరగలేదు. ఆ భాగం, యీనాడైతే అనేక సందర్భాలలో, వేరే విధంగా రచింప బడి వుండేది. గత పాతికేళ్ల కాలంలో ఆధునిక పరిశ్రమ వేసిన బ్రహ్మాండమైన ముంద డుగు దృష్ట్యా, దానితోబాటే మెరుగైన విస్తృతమైన కార్మికవర్గ పార్టీ నిర్మాణం దృష్ట్యా, మొదట ఫిబ్రవరి విప్లవంలోను, అటు తర్వాత అంతకన్న ఎక్కువగా, ఎక్క డైతే శ్రామికవర్గం మొట్టమొదటి సారిగా రెండు పూర్తి నెలలకాలం రాజకీయాధికారాన్ని హస్తగతం చేసుకుందో ఆ పారిస్ కమ్యూనులోను సాధించిన ప్రత్యక్షానుభవం దృష్ట్యా ఈ కార్యక్రమంలోని కొన్ని వివరాలు పాతపడ్డాయి. కమ్యూన్ ప్రత్యేకించి ఒక అంశాన్ని నిరూపించింది, అదేమిటంటే, "కార్మికవర్గం, తయారై సిద్ధంగా వున్న రాజ్య యంత్రాంగాన్ని కేవలం యిలా పట్టుకొని, అలా తన సొంత ప్రయోజనాల కోసం వాడుకో జాలదు." ("ఫ్రాన్సులో అంతర్యుద్ధం, ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్స్ అసోసియేషన్ జనరల్ కౌన్సిలు విజ్ఞప్తి,"* లండన్, ట్రూలవ్, 1871, 15వ పేజి చూడండి. అక్కడ యీ అంశం మరింత వివరింపబడింది.)

కార్ల్ మార్క్స్
ఫ్రెడరిక్ ఎంగెల్స్

లండన్, 1872 జూన్ 24
"Das kommunistische Manifest.
Neue Ausgabe mit einem Vorwort
der Verfasser," Leipzig, 1872
అనే పుస్తకంలో ప్రచురింపబడింది

---

* 53–114వ పేజీలు చూడండి. — సం.

# కార్ల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఎంగెల్స్

## పారిస్ కమ్యూన్ వార్షికోత్సవ సందర్భంగా 1881 మార్చి 21న జరిగిన స్లావోనిక్ సమావేశాధ్యకునికి

సిటిజన్,

మీ సమావేశానికి హాజరు కాలేకపోతున్నామని తెలిపేందుకు మిక్కిలి విచారిస్తున్నాం.

"వ్యవస్థ" సంరక్షకుల ఘాతుక ఊచకోతకు గురై పారిస్ కమ్యూన్ కూలి పోయినప్పుడు, పట్టుమని పదేళ్ళైనా తిరగక ముందే, ఎక్కడో దూరాన వున్న పీటర్స్ బుర్గ్‌లో జరగబోయే ఘటన,[192] బహుశా సుదీర్ఘమైన తీవ్రమైన పోరాటాల తర్వాతనే కావచ్చు, చిట్టచివరకు తప్పనిసరిగా రష్యన్ కమ్యూన్ ఏర్పాటుకు దారితీస్తుందన్న సంగతిని విజేతలు కొంచెమైనా ఊహించనే లేదు.

పారిస్‌ని ముట్టడించడం ద్వారా పాలక బూర్జువావర్గం ప్రజలను సాయుధం చేసేటట్లు నిర్బంధించి, తద్వారా కమ్యూన్‌ని సంసిద్ధం చేసిన ప్రష్యా రాజు* — అదే ప్రష్యా రాజు పదేళ్ల తర్వాత, తన సొంత రాజధానిలోనే సోషలిస్టులచేత ముట్టడింప బడతాడనీ, తన రాజధాని బెర్లిన్‌లో ముట్టడి స్థితి[193] ప్రకటించడం ద్వారా మాత్రమే తన సింహాసనాన్ని నిలుపుకోగలుగుతాడనీ వాళ్ళు ఊహించనే లేదు.

మరోవంక, యూరప్ ఖండ ప్రభుత్వాలు, తాము పెట్టిన హింసల ద్వారా కమ్యూన్ కూలిపోయిన తర్వాత, ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్స్ అసోసియేషన్‌ని, అది తన లాంఛన ప్రాయమైన కార్యకలాపాలను, బాహ్య సంఘాన్ని కొనసాగించుకో నివ్వకుండా చేశాయి. శాసనాల ద్వారా, ప్రత్యేక చట్టాల ద్వారా మహత్తరమైన అంతర్జాతీయ కార్మికోద్యమాన్ని అణచివెయ్యగలమని విశ్వసించిన యీ ప్రభుత్వాలు — మరో పదేళ్ల తర్వాత, అదే అంతర్జాతీయ కార్మికోద్యమం, ముందెన్నటికన్న మరింత శక్తివంతమైన, ఒక్క యూరప్‌కి చెందిన కార్మికవర్గాన్నే కాకుండా అమెరికాకు చెందిన కార్మికవర్గాన్ని సైతం పాదువు

* మొదటి విల్‌హెల్మ్. — సం.

కుంటుందనీ; ఉమ్మడి శత్రువుకి వ్యతిరేకంగా ఉమ్మడి ప్రయోజనాల కోసం జరిపే ఉమ్మడి పోరాటం కార్మికులను మరో కొత్త, మరింత స్వచ్ఛంద ఇంటర్నేషనల్‌లో జత కూరుస్తుందనీ, అంతకంతకు ఎక్కువగా అది సంఘానికి సంబంధించిన అన్ని బాహ్య రూపాలనూ అధిగమిస్తుందన్న సంగతిని పాపం వాళ్ళు ఊహించనే లేదు.

ఆవిధంగా, పాత ప్రపంచానికి చెందిన ప్రభుత్వాలు, రూపుమాసిపోయిందని విశ్వసించిన కమ్యూన్, సజీవంగా వుంది. అది ముందెన్నటికన్న యీనాడు మరింత బలీయంగా వుంది. మేము సైతం, "కమ్యూన్ వర్ధిల్లాలి!" అని గళమెత్తి నినదించడంలో మీతో కలుస్తున్నాం.

1881 మార్చి 21వ రచింపబడింది

1933 నవంబరు 7వ తేదీ
"ప్రావ్ద" వార్తాపత్రిక 308వ
సంచికలో మొదటిసారిగా
రష్యన్‌లో ప్రచురింపబడింది

# ఫ్రెడరిక్ ఎంగెల్స్

## పారిస్ కమ్యూన్ వార్షికోత్సవంపై[194]

ఈరోజు రాత్రి ప్రపంచ కార్మికులు, మీతోబాటు, అదే సమయంలో, శ్రామిక వర్గాభివృద్ధి క్రమంలో మిక్కిలి మహిమాన్వితము, అత్యంత విషాదకరము అయిన దశయొక్క వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్నారు. తన చరిత్ర ఉల్లేఖనం ప్రారంభమైనదాదిగా 1871లో, మొట్టమొదటి సారి, కార్మికవర్గం ఒక పెద్ద రాజధానిలో రాజకీయాధికారాన్ని తన చేతుల్లోకి తీసుకుంది. చివరికది స్వప్నంగా ముగిసింది. ఒక వంక పూర్వపు ఫ్రెంచి సామ్రాజ్యపు కిరాయి సైనికులకూ, మరో వంక ప్రష్యన్లకూ మధ్య చిక్కి, కమ్యూన్ త్వరలోనే, ముందెన్నడూ కనివిని ఎరుగని, మరువజాలని మారణ కాండలో చటుక్కున నులిమివెయ్యబడింది. విజయం సాధించిన అభివృద్ధి నిరోధక శక్తులకు పట్టపగ్గాలేక పోయాయి; సోషలిజం రక్తపు మడుగులో ముంచి వెయ్య బడిందా, శ్రామికవర్గం గతి శాశ్వత బానిసత్వమేనా అనిపించింది.

ఆ ఓటమి దరిమిలా పదిహేనేళ్ళ గడిచాయి. ఈ కాలమంతట్లోనూ కూడా, అన్ని దేశాల్లోని, భూస్వాముల, పెట్టుబడిదారుల ఊడిగంలో వున్న ప్రభుత్వాధికారం, కార్మికులు తిరగబడేందుకు చేసిన చివరి ప్రయత్నాలన్నింటినీ తుదముట్టించడానికి అవలంబించని పద్ధతులంటూ ఏమీ మిగలకుండా పోయాయి. అయితే అవి సాధించిందేమిటి?

మీ చుట్టూ కలియ చూడండి. విప్లవ కార్మికవర్గ సోషలిజానికి ముందెప్పటికన్న యిప్పుడు విజయం పొందే అవకాశం అధికంగా కనిపిస్తోంది. ఈనాడు అదొక శక్తిగా తయారై, ప్రభుత్వాలన్నింటినీ – బిస్మార్క్ును లాగే ఫ్రెంచి రాడికల్సునీ, సకల రష్యా జారును లాగే అమెరికా చట్టా వ్యాపార మార్కెట్ ప్రభువులనూ – గజగజ కంపింప చేస్తోంది.

అయితే అంతమాత్రమే కాదు.

మనం ఒకానొక దశను చేరుకున్నాం. ఇప్పుడిక్కడ, మన ప్రత్యర్థులందరూ, వాళ్ళేమి చేసినా కూడా, తమకి తెలియకుండానే, మనకి అనుకూలంగా పనిచేసే దశ యిది.

ఇంటర్నేషనల్‌ని[16] అంతమొందించాలని వాళ్ళు ఆశించారు. ఈనాడు, శ్రామికుల అంతర్జాతీయ సమైక్యతా, వివిధ దేశాల విప్లవ కార్మికుల సౌభ్రాతృత్వమూ కమ్యూన్ ముందునాటికన్న, ఓ వెయ్యి రెట్లు ఎక్కువ బలంగా, ఎక్కువ సమగ్రంగా ఉన్నాయి. ఇంటర్నేషనల్‌కి ఈనాడు సంఘమంటూ ఒకటి, ఆ మాటకి గల సంకుచితార్థంలో యికనేంతమాత్రమూ అవసరం లేదు; యూరప్, అమెరికాల కార్మికుల సద్యోజనితమూ, హృదయపూర్వకమూ అయిన సహకారం ద్వారా అది జీవిస్తుంది, విస్తరిస్తుంది.

జర్మనీలో బిస్మార్కు, కార్మికవర్గోద్యమాన్ని అణచివేసేందుకుగాను, ప్రతి సాధనాన్నీ, పరమ నీచమైన వాటితోబాటు ఉపయోగించాడు. ఫలితమేమిటయ్యా అంటే, కమ్యూన్‌కి ముందు అతను నలుగురు సోషలిస్టు డిప్యూటీలను ఎదుర్కొంటే, అతని హింసాత్మక చర్యలు 25 మంది ప్రతినిధుల ఎన్నికకు దారితీశాయి. మహా ఘనత వహించిన యీ ఛాన్సలర్‌ను చూసి, ఒకవేళ డబ్బు చెల్లించినా కూడా యింతకన్న మంచి విప్లవ ప్రచారం చేసివుండడంటూ జర్మన్ కార్మికులు ఫక్కున నవ్వుకుంటున్నారు.

ఫ్రాన్సులో ఓటర్ల జాబితా ఎన్నికల పద్ధతి మీపై రుద్దబడింది.[195] ఈ ఘనమైన బూర్జువా పద్ధతి, పెట్టుబడికి అనుకూలంగా మాట్లాడే లాయర్లను, పత్రికారచయితలను, తదితర రాజకీయ దుస్సాహసికులను మాత్రమే యెన్నుకోవాలనే ఖచ్చితమైన ఉద్దేశంతో సృష్టించబడింది. ధనికులు సృష్టించిన యీ పద్ధతి నుండి బూర్జువావర్గం సాధించుకున్న దేమిటి? ఫ్రెంచి పార్లమెంటులోపల ఒక విప్లవ సోషలిస్టు కార్మిక పార్టీని సృష్టించింది. రంగంపైన దాని సాక్షాత్కారమే బూర్జువా పార్టీలన్నింటి సభ్యులనూ గందరగోళంలో ముంచెత్తడానికి సరిపోయింది.

ఇప్పుడు మనకున్నది యిదీ. ప్రతి ఒక్క ఘటనా మన మంచికే పరిణమిస్తోంది. శ్రామికవర్గ ప్రగతిని బాగా కుంటుపరచడానికి ఉద్దేశింపబడిన చర్యలు కేవలం దాని విజయవంతమైన పురోగతిని త్వరితం చేసేందుకు మాత్రమే తోడ్పడుతున్నాయి. శత్రువే మన కోసం పోరాడుతున్నాడు, నిజానికి పోరాడకగత్యంతరంలేని స్థితిలో పడుతున్నాడు. ఆ దిశగా అది ఎంత మంచి చేసిందంటే, ఈనాడు, 1886 మార్చి 18న, అసంఖ్యాక కార్మికుల హృదయాంతరాళాల నుండి – కాలిఫోర్నియా, అవెరాన్‌లకు చెందిన గని కార్మికుల నుండి, సైబీరియాకు చెందిన బందీ గనికార్మికుల దాకా – ఏకగ్రీవంగా యీ క్రింది మహత్తర నినాదం వెలువడుతోంది:

"కమ్యూన్ వర్ధిల్లాలి! కార్మికుల అంతర్జాతీయైక్యత వర్ధిల్లాలి!"

1886 మార్చి 15న రచింపబడింది

"Le Socialiste" వార్తాపత్రిక
1886 మార్చి 27వ తేదీ,
31వ సంచికలో ప్రచురింపబడింది

ఫ్రెడరిక్ ఎంగెల్స్

# పారిస్ కమ్యూన్ 21వ వార్షికోత్సవ సందర్భంగా ఫ్రెంచి కార్మికులకు సందేశం

లండన్, మార్చి 17, 1892

సిటిజన్స్, సోదరసోదరీమణులారా!

పారిస్ ప్రజలు, ఏక కాలంలో వెర్సైల్స్‌పై ఎగిరే ఫ్రెంచి త్రివర్ణ పతాకానికీ, ప్రష్యన్లు ఆక్రమించుకున్న దుర్గాలపై ఎగిరే మూడు రంగుల జర్మన్ పతాకానికీ సవాలుగా ఎర్ర జెండాను ఎత్తి ఈ నాటికి సరిగా 21 ఏళ్లైంది.

పారిస్ శ్రామికవర్గం ఎక్కిన ఎత్తుకి చిహ్నం అయిన ఈ ఎర్ర జెండా, విజేతలూ విజితులూ కూడా కనిపించనంతటి ఎత్తున ఉంది.

ప్రధానంగా కమ్యూన్‌యొక్క అంతర్జాతీయ స్వభావమే దానికా చారిత్రక మహత్వాన్ని సంతరించిపెట్టింది. బూర్జువా జాతీయ దురహంకార చిహ్నాలన్నింటికీ అదొక ప్రస్ఫుటమైన సవాలు. ఆ విషయంలో ఏ దేశాల శ్రామికవర్గానికీ ఎటువంటి సందేహాలూ లేవు. బూర్జువావర్గాన్ని తమ జూలై 14నో, లేక సెప్టెంబరు 22నో[196] జరుపుకోనివ్వండి. మార్చి 18 ప్రతి చోటా సదా శ్రామికవర్గ పర్వదినంగా జరుపుకోబడుతుంది. అందుకనే నికృష్ట బూర్జువావర్గం కమ్యూన్ సమాధిపై నీచమైన అభాండాలు వేరుస్తోంది. ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్స్ అసోసియేషన్ మాత్రమే మొదట నుంచి చివరి దాకా, పారిస్ తిరుగుబాటుదారులతోనూ, ఆటుపిమ్మట పరాజితులైన శ్రామికులతోనూ తన అభేదాన్ని ప్రకటించ సాహసించినది కూడా అందుకనే. కమ్యూన్ కూలిపోయినప్పుడు, ఇంటర్నేషనల్[16] నిలిచియుండ లేకపోయిన మాట కూడా నిజమే. ''కమ్యూనార్డులను హతమార్చండి!'' అన్న నినాదాలతో యూరప్ అంతటా అది అణచివెయ్యబడింది.

మాంమార్టర్ కొండపై ఫిరంగులు పునరాక్రమింపబడి యీనాటికి 21 ఏళ్లయింది. 1871లో జన్మించిన శిశువులు యీనాడు వయోజనులయ్యారు, పాలకవర్గ

మందబుద్ధి కారణంగా వాళ్ళ సైనికులై, ఆయుధ ప్రయోగశిక్షణ కరపబడుతున్నారు, రైఫిళ్లనుచేత ధరించి సంఘటితులై, తమను తాము పరిరక్షించుకొనే కళ కరపబడుతున్నారు. అంతమైందని చెప్పబడే కమ్యూనూ, శాశ్వతంగా నిర్మూలింపబడిందని విశ్వసింపబడిన ఇంటర్నేషనలూ మనతో వున్నాయి. అవి సజీవంగా వున్నాయి. 1871 నాటికన్న యిరవై రెట్లు బలవత్తరంగా ఉన్నాయి. వాటిలోని వందలు వేలయ్యారు, ఈనాడు వేలకు బదులు పదుల లక్షలమంది మన పిలుపుకి ప్రతిస్పందిస్తున్నారు. అంతర్జాతీయ శ్రామికవర్గ సమైక్యతను మొదటి ఇంటర్నేషనల్ కేవలం మానసికంగా మాత్రమే దర్శించగలిగింది, దానికోసం సన్నాహం మాత్రమే చెయ్యగలిగింది. అటువంటిది ఈనాడు అదొక వాస్తవం. అంతే కాకుండా, 1871లో కమ్యూన్‌కి చెందిన పారిస్ చుట్టూగల దుర్గాలను పట్టుకున్న ప్రష్యన్ సైనికుల పుత్రులీవాడు, లక్షల సంఖ్యలో, పారిస్ కమ్యూనార్డ్ల పుత్రుల సరసన భుజం భుజం కలిపి, కార్మికవర్గపు సంపూర్ణ, అంతిమ విముక్తి కోసం ప్రథమ శ్రేణుల్లో పోరాడుతున్నారు.

కమ్యూన్ వర్ధిల్లాలి!

అంతర్జాతీయ సాంఘిక విప్లవం వర్ధిల్లాలి!

ఫ్రెడ్. ఎంగెల్స్

"Le Socialiste"
వార్తాపత్రిక
1892 మార్చి 26వ తేదీ
79వ సంచికలో
ప్రచురింపబడింది

ఫ్రెడరిక్ ఎంగెల్స్

# పారిస్ కమ్యూన్ 23వ వార్షికోత్సవ సందర్భంగా ఫ్రెంచి వర్కర్స్ పార్టీ జాతీయ సమితికి[197]

లండన్, మార్చి 18, 1894

ఏదైతే శ్రామికవర్గ విజయాన్ని సుసాధ్యం చేస్తుందో, వర్గ వైరుధ్యాలను, జాతుల మధ్య పోరాటాన్ని సమసింపచేస్తుందో, నాగరిక దేశాల్లోకి శాంతి సంతోషాలను కొనివస్తుందో అటువంటి అంతర్జాతీయ మార్చి 18 శుభ ఆగమనానికై మీతోబాటు మధువు సేవిస్తున్నాను.

ఎంగెల్స్

1894, మార్చి 25వ తేదీ
"Le Socialiste" 183వ
సంచికలో ప్రచురింపబడింది

# మూడవ భాగం

# లేఖలు

# బోర్డోలోని

# పాల్ లఫార్గ్‌కి మార్క్స్

లండన్, మార్చి 23, 1871

ప్రియమైన పాల్,

మార్చి 14వ తేదీనాటి "Paris-Journal"లోని రెచ్చగొట్టే కట్టుకథలను గూర్చి (బహుశా వీటిని గురించి నీకు తెలిసే వుంటుంది) "1871, మార్చి 18 నాటి "Courrier de l'Europe"లో (ఈ ఫ్రెంచి పత్రిక లండన్‌లో ప్రచురింపబడింది) ప్రచురింపబడిన పెర్రయ్యే ప్రకటనను యిందులో నీకు పంపుతున్నాను.[198]

ఈ క్రింది ప్రకటన 1871 మార్చి 22వ తేదీనాటి "Times"[65]లో "ఇంటర్నేషనల్ అసోసియేషన్"[16] అనే శీర్షికతో ప్రచురింపబడింది:

"మన పారిస్ విలేకరి లేఖ వొకదాన్ని మనం మార్చి 16వ ప్రచురించాం. దానిలోని యీ క్రింది ప్రకటనను ఖండించాల్సిందిగా కార్ల్ మార్క్స్ రాశాడు, ఆ అంశం

> " 'పారిస్‌లోని తన ముఖ్య అనుచరుల్లో ఒకనికి, కార్ల్ మార్క్స్ లేఖ రాశాడు. అందులో ఆయన, ఆ నగరంలోని ఆ సంఘ సభ్యులు తీసుకున్న వైఖరి తనకు సంతృప్తికరంగా లేదనీ, రాజకీయాల్లో వేలుపెట్టడం ద్వారా వాళ్ళ అసోసియేషన్ నిబంధనావళిని ఉల్లంఘిస్తున్నారనీ, కార్మికులను సంఘటితులను చేసేందుకు బదులు విఘటితులను చేస్తున్నారు వగైరా అంశాలు పేర్కొన్నాడు.'

"ఈ ప్రకటన మార్చి 14వ తేదీ "Paris-Journal"[155] నుండి గ్రహించబడిందనడం స్పష్టమంటాడు కార్ల్ మార్క్స్. అందులోనే ఆ కల్పిత లేఖను పూర్తిగా ప్రచురిస్తామన్న హామీ కూడా ఉంది. మార్చి 19 నాటి "Paris-Journal"లో లండన్, 1871, ఫిబ్రవరి 28వ తేదీ గల లేఖ, ఆయన సంతకం కలిగివుందన్న

అభి(పాయం కలిగించే విధంగా, (ప్రచురింపబడింది. ఆ లేఖ ఆది నుంచి అంతం దాకా సిగ్మమాలి చేసిన ఫోర్జరీ అని మార్క్స్ (ప్రకటించాడు"

పారిస్‌కి చెందిన ఆ క్షుద్ర అభివృద్ధినిరోధక ప(త్రికల రెండవ కపటపు ఎత్తుగడ సంగతికి వద్దాం పారిస్ ఇంటర్నేషనల్‌చేత జర్మన్ ఇంటర్నేషనల్ బహిష్కరణ అంటూ మిథ్యా వార్త మనకి అందజెయ్యబడినప్పుడు పారిస్‌లోని 'సోదరులు, మిత్రులకు మేము జాబు రాశాం. యీ కట్టుకథ పారిస్ రొచ్చుగుంట ప(త్రికల అభూత కల్పన తప్ప మరేమీ కాదని వాళ్ళు జవాబిచ్చారు. ఈలోగా యీ అసత్య వార్త లండన్ ప(త్రికల్లో కార్చిచ్చులా వ్యాపించింది. వాళ్ళా సంతోషకర సంఘటనపై సుదీర్ఘమైన సంపాదకీయాలు రాసి ఇంటర్నేషనల్ విచ్ఛిన్నమైపోయిందనీ, పారిస్ కార్మికులు సరిదిద్దరాని వ(క్రమార్గం పట్టారనీ రుజువు చెయ్యాలని తంటాలుపడ్డారు.

ఈ రోజు "T mes" (1871 మార్చి 23)లో ఈ (క్రింది జనరల్ కౌన్సిల్ (ప్రకటన వెలువడింది:

'పారిస్‌లో జర్మన్ వ్యతిరేక లీగు

"Tımes" సంపాదకునికి

"మహాశయా,

ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్స్ అసోసియేషన్‌కి చెందిన పారిస్ సభ్యులు, జర్మన్లందరినీ మన అసోసియేషన్ నుంచి బహిష్కరించాలని (ప్రకటించడంలో, జర్మన్ వ్యతిరేక లీగ్ అనబడే దానితో స్వరం కలిపే దాకా వెళ్ళారన్న వార్త ఒకటి ఇంగ్లీషు ప(త్రికల్లో (ప్రచారమైంది.

'ఈ (ప్రకటన సత్యానికి పరమ విరుద్ధమైనది. పారిస్‌లోని మన అసోసియేషన్ ఫెడరల్ కౌన్సిలుగాని, ఆ కౌన్సిలు (ప్రాతినిధ్యం వహించే పారిస్ శాఖలేవి గాని, అటువంటి తీర్మానం దేన్నీ ఎన్నడూ చేసియుండలేదు. జర్మన్ వ్యతిరేక లీగ్ అనబడేది అసలంటూ అది అస్తిత్వంలో వుంటే, ఆమేరకు, (ప్రత్యేకించి (ప్రభు, బూర్జువావర్గాల కృషి మా(త్రమే, అది జాకీ క్లబ్బు[199]చేత (ప్రారంభింపబడింది. అకాడమీ, స్టాక్ ఎక్స్‌చేంజ్, కొందరు బ్యాంకర్లు, పరి(శ్రమల యజమానులు మొదలైన వాళ్ళు చేరడం ద్వారా అది నిలబెట్టబడింది. దానితో కార్మికవర్గానికి ఎటువంటి సంబంధమూ ఎంత మా(త్రమూ లేదు.

"ఈ అభాండాల లక్ష్యమేమిటో విస్పష్టమే. గత యుద్ధారంభానికి కొంచెం ముందు, దుస్సంఘటనలన్నింటికీ కూడా మొత్తంమీద ఇంటర్నేషనల్‌ని బాధ్యురాలిని చేసే వారు. అదే యిప్పుడు తిరిగి పునరావృతం చెయ్యబడుతోంది. జూరిచ్‌లో జర్మన్లపై యిటీవలి దౌర్జన్య[200] సృష్టికై దానిపై స్విస్, (ప్రష్యన్ ప(త్రిక [illegible] "Courrıer de Lyon," "Le Courr er de la G ronde,"[201] "L [illegible]" వగైరా



పెర్‌లషేజ్ శ్మశానంవద్ద వెర్సైల్స్‌వాళ్లతో కమ్యూనార్డుల చివరి ఘర్షణ

ఫ్రెంచి పత్రికలు జెనీవా, బెర్న్‌లలో ప్రష్యన్ రాయబారి అధ్యక్షతన ఇంటర్నేషనల్ సభ్యుల రహస్య సమావేశాలు కొన్ని జరిగాయనీ, ఆ సమావేశాల్లో లియోన్‌ను సమైక్యమైన ప్రష్యన్లకూ, ఇంటర్నేషనల్ సభ్యులకూ, ఉమ్మడి దోపిడి కోసం అప్పగించేందుకని ఒక పథకం తయారు చెయ్యబడిందనీ చెప్తున్నాయి.

"ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్స్ అసోసియేషన్ జనరల్ కౌన్సిలు తరఫున

జె. జి. ఎక్కారియుస్
ప్రధాన కార్యదర్శి"

లండన్, మార్చి 22

## లైప్జిగ్‌లోని

# విల్‌హెల్మ్ లీబ్‌క్నెఖ్ట్‌కి మార్క్స్

[లండన్], ఏప్రిల్ 6, 1871

...పారిస్ వాసులు పరాజయం పొందినట్లు కనిపిస్తోంది. అది వాళ్ల తప్పిదమే. అయితే, వాస్తవానికి ఆ తప్పిదానికి వాళ్ల అతి నిజాయితీయే మూలకారణం. కేంద్ర కమిటీ, తదుపరి కమ్యూనూ, శత్రు బలగాలను కేంద్రీకరించడానికి ఆ కిలాడీ కురూప రాక్షసి త్యేర్‌కు వ్యవధి కల్పించారు; వాళ్లు చేసిన మొదటి తెలివితక్కువ పని తాము అంతర్యుద్ధాన్ని మొదలుపెట్టరాదనుకోవడం – పారిస్‌ని బలవంతంగా నిరాయుధం చేసేందుకు జరిపిన ప్రయత్నం ద్వారా త్యేర్ అప్పటికే అంతర్యుద్ధాన్ని ప్రారంభించ లేదన్నట్లు, ప్రష్యన్లతో యుద్ధమో, శాంతో అన్న సమస్యను తేల్చడానికై సమావేశ పరచబడిన జాతీయ అసెంబ్లీ వెన్వెంటనే రిపబ్లిక్‌పై ప్రకటించినది యుద్ధం కాద న్నట్లు! రెండోది, అధికారాన్ని తాము అక్రమంగా చేజిక్కించుకున్నామన్న అప్రథ తమపైకి రాకుండా చూసుకోవాలన్న ఆదుర్దాతో, కమ్యూన్ ఎన్నికలు జరిపించడం, వాటి నిర్వహణ వగైరాల కోసం మరింత సమయం వెచ్చించడం ద్వారా వాళ్లు విలువైన క్షణాలను పోగొట్టుకున్నారు. (అలా కాకుండా వాళ్లు, పారిస్‌లో అభివృద్ధి నిరోధకుల ఓటమి (వెండొమ్ చౌకు సంఘర్షణ) తర్వాత,* వెన్వెంటనే వెర్సేల్స్‌పైకి పురోగమించి ఉండాల్సింది.)

---

* 71–72 పేజీలు చూడండి. – సం.

పారిస్‌లోని ఆంతరిక సంఘటనలను గురించి పత్రికల్లో వస్తున్న చెత్త వార్తలన్నింటిలోనూ నువ్వు ఒక్క మాటను కూడా నమ్మరాదు. అవన్నీ శుద్ధ అబద్ధాలూ, పచ్చి మోసమే. విషపూరిత బూర్జువా పత్రికల కిరాయి రచయితల నీచత్వం యిప్పుడు ప్రదర్శితమైనంత అధికంగా మరెన్నడూ కాలేదు.

సమైక్య జర్మన్ చక్రవర్తి,* సమైక్య సామ్రాజ్యమూ, బెర్లిన్‌లోని సమైక్య పార్లమెంటూ బాహ్య ప్రపంచపు దృష్టిలో *అసలు అస్తిత్వంలో ఉన్నట్లే లేదు.* పారిస్‌లో కదిలే ప్రతి గాలి అలా మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది....

# హన్నోవర్‌లోని
# లుడ్విగ్ కూగెల్‌మన్‌కి మార్క్స్

లండన్, ఏప్రిల్ 12, 1871

...నా "బ్రూమేర్ పద్దెనిమిదవ తేదీ"[3] చివరి ప్రకరణం నువ్వు చూసినట్లయితే, ఫ్రెంచి విప్లవపు రాబోయే ప్రయత్నం, పూర్వం మాదిరిగా నిరంకుశాధికార – సైనిక యంత్రాన్ని ఒక చేతి నుండి మరొక చేతికి మార్చడంగా కాకుండా, దాన్ని *నాశనం* చెయ్యడంగా ఉంటుందనీ, యూరప్ ఖండంలో జరగబోయే ప్రతి ఒక్క నిజమైన ప్రజా విప్లవానికీ యిది ముందు షరతుగా ఉంటుందనీ నేను ప్రకటించిన సంగతి నువ్వు గమనిస్తావు. పారిస్‌లోని మన వీరోచిత పార్టీ కామ్రేడ్లు చేస్తున్నది సరిగా యిదే. ఈ పారిస్ వాసుల్లో పూర్వ స్థితికి కోలుకోగల యీ లక్షణం ఎంత అనన్య సామాన్యమైనది! వీరిలో ఎంతటి చారిత్రక చొరవ, ఎంతటి త్యాగపటిమ! బాహ్య శత్రువు వలన కన్న ఎక్కువగా ఆంతరిక ద్రోహం కారణంగా దాపురించిన ఆరు మాసాల ఆకలి వినాశాల తదుపరి, ప్రష్యన్ బయనెట్ల క్రింద అసలు ఫ్రాన్సుకీ జర్మనీకీ మధ్య యుద్ధమే ఎన్నడూ జరగలేదన్నట్లు, శత్రువిప్పటికీ పారిస్ ముఖద్వారాల దగ్గరే లేడన్నట్లు వాళ్ళు శిరమెత్తి తిరగబడ్డారు! ఇటువంటి గొప్పతనానికి చరిత్రలోనే సాటి లేదు! వాళ్ళు ఓడిపోవడమే కనక సంభవిస్తే అందుకు వాళ్ళ "సౌజన్యమే" కారణం. మొదట వినువా, ఆటు తర్వాత పారిస్ నేషనల్ గార్డులోని అభివృద్ధి నిరోధక విభాగమూ తిరోగమించిన తర్వాత వాళ్ళు వెన్వెంటనే వెర్సేల్స్‌పైన దాడి చేసియుండాల్సింది. వ్యాయా

* మొదటి విల్‌హెల్మ్. – సం.

వ్యాయామాలకు సంబంధించిన మానసిక గుంజాటనతో వాళ్ళు తమ అవకాశాన్ని చేజార్చు కున్నారు. ఆ కిలాడీ కురూప రాక్షసి త్యేర్, పారిస్‌ని నిరాయుధం చేసేందుకు జరిపిన ప్రయత్నం ద్వారా అప్పటికే అంతర్యుద్ధాన్ని ప్రారంభించలేదన్నట్లు, వాళ్ళు తామే అంతర్యుద్ధాన్ని మొదలుపెట్ట రాదనుకున్నారు! రెండవ పొరపాటు: కేంద్ర కమిటీ, కమ్యూన్‌కి చోటిచ్చేందుకు గాను, మరీ తొందరపడి తన అధికారాన్ని విడిచిపెట్టింది. ఈ సందర్భంగా కూడా ఆ "నిజాయితీతో కూడిన" సదసత్సంశయమే కారణం! ఏది ఏమైనప్పటికీ, పారిస్‌లోని ప్రస్తుత తిరుగుబాటు — దాన్ని పాత సమాజానికి చెందిన తోడేళ్ళు, పందులు, పుచ్చు కుక్కలు అణచివేసినా కూడా — పారిస్‌లో జూన్ తిరుగుబాటు తదుపరి మన పార్టీ సాధించిన అత్యంత మహత్తర కార్యం. స్వర్గాన్ని ముట్టడిస్తున్న ఈ పారిస్ వాసులను, జర్మన్-ప్రష్యన్ పవిత్ర రోమన్ సామ్రాజ్యానికి — సైనిక నిలయాలు, మతం, పుట్టగొడుగుల్లా పెరిగే అభివృద్ధి నిరోధక ప్రభుగణం, వీటన్నింటికీ మించి అల్పబుద్ధుల పిశాచగణ సమవాకారమైన సామ్రాజ్యమనే స్వర్గపు బానిసలతో పోల్చిచూడండి....

## హన్నోవర్‌లోని

# లుడ్విగ్ కూగెల్‌మన్‌కి మార్క్స్

[లండన్], ఏప్రిల్ 17, 1871

...1849 జూన్ 13 మాదిరి పెటీబూర్జువా ప్రదర్శనలు[202] వగైరాలను, పారిస్‌లో ప్రస్తుతం జరుగుతున్న పోరాటంతో నువ్వెలా పోల్చగలవో నాకు బొత్తిగా అగ్రాహ్యంగా వుంది.

పొరపాట్లేవీ అనుకూలాంశాల షరతు పైననే పోరాటం జరపబడాలన్నట్లయితే ప్రపంచ చరిత్ర సృష్టి అప్పుడిక నిజంగానే చాలా తేలిక. మరోవంక "యాదృచ్ఛిక ఘటనల" పాత్ర అంటూ అసలు లేకనేపోతే, ప్రపంచ చరిత్ర పరమ నిగూఢ స్వభావం కలిగినదే అయ్యుంటుంది. ఈ యాదృచ్ఛిక ఘటనలు సహజంగానే సాధారణాభివృద్ధి క్రమంలో భాగంగా ఉండి, యితర యాదృచ్ఛిక ఘటనలచేత సమతూకం చేయ బడుతూ వుంటాయి. అయితే, ఉద్యమానికి తొట్టతొలుత నాయకత్వం వహించే వారి స్వభావం లాంటి "యాదృచ్ఛిక ఘటనల" పైన, త్వరణ జాప్యాలు చాలా అధికంగా ఆధారపడతాయి.

ఈమారు యీ నిశ్చిత అననుకూల "యాదృచ్ఛికత"కి కారణాన్ని ఫ్రెంచి సమాజపు సాధారణ పరిస్థితుల్లో కాకుండా, ఫ్రాన్సులో ప్రష్యన్ల ఉనికిలోనూ, సరిగా పారిస్ ప్రాంగణంలో వారి మోహరింపులోనూ వెతకాల్సి వుంటుంది. ఈ విషయం పారిస్ వాసులకు బాగా తెలుసు. అయితే దీన్ని గురించి, వెర్సేల్స్‌కి చెందిన బూర్జువా అధములకు కూడా బాగా తెలుసు. సరిగా అందుకనే వాళ్ళు, పోరాటాన్ని చేబట్టడమూ, లేకపోతే ఏ పోరాటమూ లేకుండా లొంగిపోవడమూ అన్న ప్రత్యామ్నాయాలను పారిస్ వాసుల ముందు పెట్టారు. రెండవ సందర్భంలో కార్మికవర్గంలో వచ్చియుండే నిరాశా నిస్పృహలు పలువురు నాయకుల మృతికన్న పెద్ద దురదృష్టమై యుండేది. పారిస్‌లోని పోరాటంతో, పెట్టుబడిదారీ వర్గానికీ, దాని రాజ్యానికీ వ్యతిరేకంగా కార్మికవర్గం చేసే పోరాటం ఓ కొత్త దశలో ప్రవేశించింది. తక్షణ ఫలితం ఏమైనప్పటికీ, ప్రపంచ ప్రాముఖ్యం కలిగిన ఓ వినూత్న విభిన్న మార్గం లభించింది.

సెలవ్!

కె. ఎమ్.

## పారిస్‌లోని

# లియో ఫ్రాంకెల్‌కి మార్క్స్[203]

[చిత్తు ప్రతి]

[లండన్, ఏప్రిల్ 26 ప్రాంతంలో, 1871]

ప్రియమైన సిటిజన్!

సెర్రయ్యేకి వ్యతిరేకంగా సిటిజన్ ఎఫ్. పియా వ్యాపింప చేస్తున్న నీచమైన అభాండాలను, తన తరఫున, అత్యంత అసందిగ్ధంగా ఖండించాల్సిందిగా జనరల్ కౌన్సిల్ నాకు అధికార మిచ్చింది. పియా కోపాతిశయానికి మూలకారణం ఒక్కటే: ఇంటర్నేషనల్ పట్ల అతని ద్వేషం. లండన్‌లోని ఫ్రెంచి శాఖ అనబడే దాని ద్వారా (యిది జనరల్ కౌన్సిలుచేత బహిష్కరింపబడింది, దీనిలో పోలీసు ఏజెంట్లు, మాజీ రాజ రక్షక భటులు, దళారీలు దూరారు) ప్రపంచం ముందు, మన అసోసియేషన్‌కి తానొక రహస్య నాయకుడన్నట్లు నటించేందుకు ప్రయత్నించాడు (దీనికి అతను చెందడు), లండనులో తన అవకతవక ప్రసంగాలకు, పారిస్‌లో తన పరువు తక్కువ అసభ్యపు పనులకు మనల్ని బాధ్యులను చెయ్య ప్రయత్నించాడు. అన్నట్లు, పీటిని, సిటిజన్ ట్రిడాన్ బ్రసెల్స్‌లో

ఉన్నప్పుడే ఎండగట్టాడు. అందుకనే జనరల్ కౌన్సిలు యీ నికృష్ట కుట్రదారుని బహిరంగంగా త్యజించాల్సి వచ్చింది. డుపాన్, సెర్రయ్యేలంటే అతని కందుకనే అంత మంట. పారిస్‌లో పియా వ్యాపింపచేస్తున్న అభాండాలకు గాను, పియాయొక్క యీ యిచ్చకాలమారి నీచ తైనాతీలను ఇంగ్లీషు కోర్టు ముందు కీడుస్తానని సెర్రయ్యే బెదిరించినప్పుడు, ఫ్రెంచి శాఖయే వాళ్లని త్యజించి, అభాండాల ప్రచారకులుగా వాళ్లను ఖండించింది.

సెర్రయ్యే రాజకీయ జీవితంపై అభాండాలు వేసే అవకాశం లేదు కనక, అతని వ్యక్తిగత జీవితంపై దాడి జరిగింది. పియా వ్యక్తిగత జీవితం సెర్రయ్యే వ్యక్తిగత జీవితమంత పరిశుద్ధమైనదే అయితే, అతగాడు, యిక్కడ లండన్‌లో రక్తంతో తప్ప శాశనంకాని ఘోరావమానాలకు తలొగ్గాల్సి వచ్చేదే కాదు....

కొద్ది రోజుల్లో జనరల్ కౌన్సిలు కమ్యూన్‌పై ఒక విజ్ఞప్తి జారీ చెయ్యబోతోంది.* ఈ ప్రణాళిక ప్రచురణను యింతదాకా వాయిదా వేస్తూ వచ్చింది — పారిస్ శాఖ నుండి ఖచ్చితమైన సమాచారం కోసం ఏరోజుకారోజు ఎదురు చూస్తూ ఉండింది. ప్రయోజనం లేకపోయింది! ఒక్క మాట కూడా రాలేదు! ఇంగ్లీషు కార్మికులు కమ్యూన్‌కి సంబంధించిన వివరణ కోసం ఆత్రుతగా ఎదురు చూస్తూవుండిన కారణంగా కౌన్సిలు యికనెంత మాత్రమూ వేచియుండజాలదు.

ఈలోగా, సమయం వృథా చెయ్యబడలేదు. మహత్తరమైన యీ పారిస్ విప్లవ నిజస్వభావం, యూరప్ ఖండంలోని, అమెరికాలోని శాఖలకు వివిధ కార్యదర్శుల లేఖల ద్వారా, ఎక్కడెక్కడవున్న కార్మికులకూ వివరించబడింది.

ఒక సిటిజన్ నా కొక లేఖ రాశాడు, మీకు తెలిసిన ఆ పత్రాల విషయంలో నన్నొచ్చి కలుసుకున్నాడు. పారిస్‌లో వాళ్లు చేసిన పొరపాటేమిటంటే, కార్యకలాపాలు సజావుగా జరిగేందుకు అవసరమైన పత్రాలు అప్పగించడంలో విఫలం కావడమే. మీకిప్పుడు మూడు శాతం సెక్యూరిటీలు అవసరం. అవి ధారాళంగా చలామణీ అవుతాయి. వాటిని ఉన్న ధరకు అమ్మడం సాధ్యం. ఆ సిటిజన్ మీ కింకేమైనా వివరణలు అవసరమైతే యిస్తాడు. ఆయనకి నిరభ్యంతరంగా నిర్భయంగా ఆ పత్రాన్ని అప్పగించవచ్చు.

---

* "ఫ్రాన్సులో అంతర్యుద్ధం." — సం.

పారిస్‌లోని

# లియో ఫ్రాంకెల్, లూయీ ఎజేన్ వార్లెన్‌లకు మార్క్స్

[చిత్తు ప్రతి]

[లండన్], మే 13, 1871

ప్రియమైన సిటిజన్స్ ఫ్రాంకెల్, వార్లెన్,

ఈ లేఖ తెచ్చిన వ్యక్తి*ని నేను కలుసుకున్నాను.

వెర్సేల్స్ దుర్మార్గుల పరువు తీసే పత్రాలను సురక్షితంగా ఒక చోట భద్రపరచడం ప్రయోజనకరం కాదూ? ఈ రకమైన ముందు జాగ్రత్త వల్ల నష్టమేమీ ఉండదు.

గత మునిసిపల్ ఎన్నికల్లో ఇంటర్నేషనల్ సభ్యులు నలుగురు ఎన్నికైనట్లు బోర్డో నుంచి నాకెవరో జాబు రాశారు.[204] రాష్ట్రాలు అట్టుడికినట్లుడకటం ఆరంభమైంది. దురదృష్టవశాత్తూ అక్కడి కార్యాచరణ కేవలం స్థానికం, "శాంతియుతం"గా వుంది.

మీ లక్ష్యాన్ని బలపరుస్తూ, ప్రపంచంలో మాకు శాఖలున్న మూల మూలలకీ, నేను వందలాది లేఖలు రాశాను. పోతే, కార్మికవర్గం, ఆది నుంచీ కూడా కమ్యూన్ పక్షాననే ఉంది.

ఇంగ్లండులోని బూర్జువా పత్రికలు సైతం తమ పూర్వపు రౌద్రాన్ని విడిచిపెట్టాయి. వాటిలో అడపాదడపా అనుకూలమైన కొన్ని వ్యాఖ్యలను చొప్పించడంలో నేను విజయం సాధించాను.

కమ్యూన్ అల్పవిషయాలలోను, వ్యక్తిగత కలహాలలోను ఎక్కువ సమయం వృథా చేస్తున్నట్లు నాకు అనిపిస్తోంది. కార్మికులది కాకుండా యితర ప్రభావాలున్నట్లు స్పష్టం. మీరే కనక వృథా అయిన కాలాన్ని కూడదీసుకోగలిగితే యిదేదీ కూడా లెక్కలోకి రాదు.

పారిస్ వెలుపల, ఇంగ్లండులో గాని, మరో చోటగాని, మీరు చెయ్యదలుచుకున్నదేదైనా మీరు శీఘ్రంగా చెయ్యడం, అత్యంత అవసరం. శాంతి ఒప్పందం జరిగిపోయి (మే 26), తద్వారా తమ జెండార్మీలతో పారిస్‌ను నింపేదాకా, ప్రష్యన్లు కోటలను వెర్సేల్స్ ప్రభుత్వానికి అప్పగించరు. మీకు తెలిసినదే కదా, త్యేర్ ముఠా, పుయ్యే-కర్టే

---

* అతను ఎయ్‌లో అయి ఉండాలి. — సం.

కుదుర్చుకొచ్చిన ఒప్పందం ద్వారా, తమకు పెద్ద కమిషన్ దక్కేలా ఏర్పాటు చేసుకున్నారు* కనుక, బిస్మార్క్ జర్మన్ బ్యాంకర్ల నుండి తమకివ్వ జూపిన సహాయాన్ని స్వీకరించడానికి వాళ్ళు తిరస్కరించారు. వాళ్ళే కనక దాన్ని ఆమోదించివుంటే, వాళ్ళు తమ కమిషన్‌ను పోగొట్టుకొని వుండేవారు. వాళ్ల ఒడంబడిక అమలుకు ప్రాథమిక షరతు పారిస్ ఆక్రమణ కాబట్టి, పారిస్ ఆక్రమణ పూర్తయ్యే దాకా మొదటి చెల్లింపును వాయిదా వెయ్యాల్సిందిగా వాళ్ళు బిస్మార్క్‌ను అభ్యర్థించారు. బిస్మార్క్ యీ షరతుకు ఆమోదించాడు. ప్రష్యాయే యీ సొమ్ము విషయంలో చాలా తొందర అవసరంలో ఉంది కాబట్టి, వెర్సేల్స్ ప్రభుత్వం పారిస్‌ను సత్వరమే ఆక్రమించుకొనేందుకు అవసరమైన ప్రతి సౌకర్యాన్నీ కల్పిస్తుంది. కనుక, తస్మాత్ జాగ్రత!

## లండన్‌లోని

# ఎడ్వర్డ్ స్పెన్సర్ బీజ్‌లీకి మార్క్స్

[లండన్], జూన్ 12, 1871

1, మెయిట్ లాండ్ పార్క్ రోడ్డు, ఎన్. డబ్ల్యు.

...నా స్నేహితురాలొకామె నాలుగైదు రోజుల్లో పారిస్‌కి వెళ్తుంది. ఇప్పటికీ పారిస్‌లో రహస్యంగా జీవిస్తున్న కమ్యూన్ సభ్యులు కొందరి కోసం నేనామెకు రెగ్యులర్ పాస్‌పోర్టులిస్తున్నాను. మీకుగాని, మీ మిత్రుల్లో ఎవరికిగాని అక్కడేమైనా పనులుంటే దయచేసి నాకు రాయండి.

నా రచనలను గురించీ, కమ్యూన్‌కీ నాకూ గల సంబంధాలను గురించీ రొచ్చు గుంట పత్రికలు ఏరోజుకారోజు ప్రచురిస్తున్న అర్థరహితమైన కట్టు కథలు నాకు తృప్తినిస్తున్నాయి; అవి నాకు ఏ రోజుకారోజు పారిస్ నుండి అందుతున్నాయి. నికరమైన పత్రాలను స్వాధీనం చేసుకోవడంలో వెర్సేల్స్ పోలీసులకు బ్రహ్మప్రళయమవుతోందన్న దానికిది తార్కాణం. కమ్యూన్‌తో నా సంబంధాలు ఏటిపాడుగునా పారిస్‌కీ లండన్‌కీ మధ్య తిరుగుతూ వుండే ఒక జర్మన్ వర్తకుని** ద్వారా కొనసాగింపబడుతున్నాయి. రెండు విషయాలు మినహాయించి మిగతావన్నీ నోటి మాటగా పరిష్కారమయ్యాయి.

---

* 64వ పేజి చూడండి. — సం.

** అతను ఎయ్‌లౌ అయి ఉండాలి. — సం.

మొదటిది, అదే వర్తకుని ద్వారా కమ్యూన్ సభ్యులకు, లండన్ స్టాక్ ఎక్స్చేంజిలో కొన్ని సెక్యూరిటీలను తామెలా విక్రయించగలమన్న వాళ్ల ప్రశ్నకు జవాబుగా, నేనొక జాబు పంపాను.*

రెండవది, విపత్తుకి పది రోజుల ముందు, మే 11న, అదే మార్గాన, బిస్మార్క్కీ, ఫావ్రేకీ ఫ్రాంక్ఫుర్ట్లో జరిగిన రహస్య ఒప్పందం[145] గురించిన వివరాలన్నింటినీ, నేను వాళ్ళకి పంపాను.

నాకీ సమాచారం బిస్మార్క్కి కుడిభుజంవంటి వ్యక్తి దగ్గర్నుంచి లభించింది — ఈ వ్యక్తి** పూర్వం (1848 నుండి 1853 వరకు), నేను నాయకత్వం వహించిన ఒక రహస్య సంఘానికి చెందినవాడు. జర్మనీ నుంచి, జర్మనీని గురించి తను నాకు పంపిన రిపోర్టులన్నీ నాదగ్గర యింకా వున్నాయన్న సంగతి యీ వ్యక్తికి తెలుసు. నా సౌజన్యం పైన అతను ఆధారపడివున్నాడు. అందుకనే తన సత్సంకల్ప ప్రదర్శన కోసం అతనిలా తంటాలుపడుతూ వున్నాడు. ఈ సంవత్సరమే కనక నేను హన్నోవర్లో డా. కూగెల్మన్ దగ్గరకి మళ్లీ వెళ్తే నన్ను అరెస్టు చేయించాలని బిస్మార్క్ నిర్ణయించుకున్నట్లు నన్ను హెచ్చరించినది యితగాడే.

కమ్యూనే కనక నా హెచ్చరికలను పాటించివుంటే! మాంమార్టర్ కొండ ఉత్తర దిశన ప్రష్యన్లున్న పార్శ్వాన్ని బలపరచుకొమ్మని నేను కమ్యూన్ సభ్యులకు సలహా యిచ్చాను, అలా చేసుకునేందుకు వాళ్లకిప్పటికీ సమయం మించి పోలేదు; లేకుంటే బోనులో చిక్కుకుంటారని నేను ముందే వాళ్లకి తెలియజేశాను. నేను వాళ్ల కోసం పియా, గ్రుస్సె, వేసిన్యేలను తూర్పారబట్టాను. జాతీయ రక్షణ ప్రభుత్వ సభ్యుల లొసుగులకు సంబంధించిన పత్రాలన్నింటినీ వెన్వెంటనే లండన్కి పంపమని నేను డిమాండ్ చేశాను, ఈవిధంగా కమ్యూన్ శత్రువుల ఆటవికత్వం కొంతమేరకు నిరోధింపబడవచ్చుననీ, ఆవిధంగా వెర్సేల్స్వాళ్ల పథకాన్ని కనీసం పాక్షికంగానైనా భగ్నం చెయ్యవచ్చుననీ నేను ఆశించాను.

ఈ పత్రాలే కనక వెర్సేల్స్ వాళ్లకి దొరుకుతే వాళ్ళు కల్పిత పత్రాలను ప్రచురించి వుండేవాళ్లు కారు.

ఇంటర్నేషనల్ "విజ్ఞప్తి"*** బుధవారానికి ముందు ప్రచురింపబడదు.**** అది

---

* 326–327వ పేజీలు చూడండి. — సం.

** యోహన్ మికెల్. — సం.

*** "ఫ్రాన్సులో అంతర్యుద్ధం." — సం.

**** ఆ విజ్ఞప్తి 1871 జూన్ 13, మంగళవారంనాడు ప్రచురింపబడింది. — సం.

వెలువడిన వెంటనే మీకొక కాపీ పంపుతాను. నాలుగైదు ఫారాలకు సరిపడే విషయాంశం రెండు ఫారాల్లోకి కుదింపబడింది. అందుకనే అన్ని దిద్దుబాట్లూ, సవరణలూ, అచ్చు తప్పులూను. అందుకనే ఆలస్యం కూడా....

## లైప్జిగ్‌లోని

## విల్‌హెల్మ్ లీబ్‌క్నెఖ్ట్‌కి ఎంగెల్స్

లండన్, జూన్ 22, 1871

...ఈ తుది పెను సంక్షోభంలో జర్మన్ కార్మికులు ఘనంగా, మిగిలిన అందరికన్న మిన్నగా, వ్యవహరించారు. వారికి బేబెల్ బహు సమర్థంగా ప్రాతినిధ్యం వహించాడు. కమ్యూన్‌పై ఆయన చేసిన ప్రసంగం ఇంగ్లీషు పత్రికలన్నింటిలోనూ విస్తృతంగా ప్రచురింపబడి, యిక్కడ పెద్ద ప్రభావాన్ని కలిగించింది....[205]

## న్యూయార్కులోని

## ఫ్రెడెరిక్ బోల్టెకి మార్క్స్

బ్రైటన్, ఆగస్టు 25, 1871

...కమ్యూనార్డు కాందిశీకుల సహాయానికై జనరల్ కౌన్సిలు విజ్ఞప్తి మీకు వచ్చే వారం అందుతుంది.[206] వారిలో ఎక్కువమంది (80 నుండి 90 మంది దాకా) లండన్‌లో వున్నారు. ఇప్పటి దాకా వారిని జనరల్ కౌన్సిలే బతికించుకుంది, కాని, రోజురోజుకీ వచ్చే కాందిశీకుల సంఖ్య పెరిగి పోతుండగా, గత పక్షం కాలంలో మా నిధులు బాగా తరిగిపోవడంతో వాళ్ల పరిస్థితి అత్యంత బాధాకరంగా తయారైంది. న్యూయార్కులో సాధ్యమైనదంతా చేస్తారని ఆశిస్తాము. జర్మనీలో పార్టీ నిధులన్నీ పోలీసుల హింసలకు గురైన వారికే యిప్పటికీ ఖర్చయిపోతున్నాయి. ఆస్ట్రియాలోనూ అదే జరుగుతోంది, స్పెయిన్‌లోనూ, ఇటలీలోనూ అంతే జరుగుతోంది.[207] స్విట్జర్లండులో, అక్కడి కాందిశీకులు కొద్దిమందే అయినా వాళ్లని పోషించడమే కాకుండా, సెయింట్

గలేన్ లాకౌటు కారణంగా, ఇంటర్నేషనల్ సభ్యులకు కూడా అది సహాయం చెయ్యాల్సి వస్తోంది.[208] పోతే చివరకు, బెల్జియంలో సైతం కొద్దిమంది కాందిశీకులున్నారు, దీనికితోడు లండన్‌కు తరలి వెళ్లేవాళ్లకు బెల్జియన్లు సహాయపడాల్సి వుంది.

ఈ పరిస్థితులన్నింటి దృష్ట్యా, లండన్‌లో వున్న అధిక సంఖ్యాక కాందిశీకుల కోసం నిధులన్నీ యింతదాకా కేవలం ఇంగ్లండులోనే సేకరింపబడ్డాయి.

జనరల్ కౌన్సిలు యిప్పుడీ క్రింది కమ్యూన్ సభ్యులను: సెరయ్యే, వైయాన్, థేయిస్, లోంగె, ఫ్రాంకెల్; యీ క్రింది కమ్యూన్ ఉద్యోగులు: డెలయే, రోషా, బాస్టెలికా, షలేన్‌లను చేర్చుకుంది.

## బార్మెన్‌లోని

## ఎలిజబెత్ ఎంగెల్సుకి ఎంగెల్స్

లండన్, అక్టోబరు 21, 1871

ప్రియమైన అమ్మకి,

నేనింత కాలంగా నీకు జవాబు రాయక పోవడానికి, నా రాజకీయ కార్యకలాపాలను గురించి పోయిన సారి నువ్వు చేసిన వ్యాఖ్యానాలకు నీ మనస్సుకు కష్టం తోచకుండా జవాబివ్వడమెలాగన్న ఆలోచనే కారణం. కాని, నేను "Kölnische Zeitung"[209] లోని సిగ్గుమాలిన అబద్ధాలను మళ్లీ మళ్లీ చదివినప్పుడు, ప్రత్యేకించి ఆ నీచుడు వాహెన్‌హుసెన్ రాసిన నికృష్టమైన ఆ చెత్త చదివిన తర్వాత, యుద్ధ కాలంలో మొత్తం ఫ్రెంచి పత్రికలన్నింటిలోనూ అసత్యాలు తప్ప వేరేమీ చూడనివాళ్లే యీవాడు పోలీసు కట్టుకథ ప్రతి ఒక్క దాన్నీ యిల్లెక్కి అరిచిచెప్పడం చూసిన తర్వాత, అత్యంత అవినీతి కరమైన పారిస్ చెత్త పత్రిక కమ్యూన్‌కి వ్యతిరేకంగా ప్రకటించే ప్రతి అభాండాన్నీ పరమ సత్యమని ప్రకటించడం చూశాక, జవాబు రాయడానికి బొత్తిగా అనువుగా లేని మానసికావస్థలో పడిపోయాను. ఓ కొద్దిమంది హామీ బందీలు ప్రష్యన్ పద్ధతిలో కాల్చివెయ్యబడినప్పుడు, కొద్ది రాజభవనాలు ప్రష్యన్ పద్ధతిలో తగలబెట్టబడినప్పుడు (మిగిలినవన్నీ శుద్ధ అబద్ధాలే) పెద్ద గగ్గోలు బయల్దేరింది, కాని, 40,000 మంది పురుషులు, స్త్రీలు, బాలబాలికలను నిరాయుధం చేసి, వెర్సైలియన్లు యాంత్రికంగా ఊచకోత కోసినప్పుడు ఎవ్వడూ నోరు విప్పిన పాపాన పోలేదు!...

## కార్లో టెర్జాగికి ఎంగెల్స్

[రెండో పాఠం]

(చిత్తు ప్రతి)

లండన్, జనవరి 14–[15], 1872,
256, హై హాల్‌బోర్న్

...కేంద్రీకరణాధికారాల లోపమే పారిస్ కమ్యూన్ జీవితానికి గండమైంది. మీరు విజయం సాధించిన **తరువాత ఈ** అధికారం వగైరాలతో మీ యిష్టం వచ్చినట్లు చేసుకోగలరు. కాని పోరాటం కోసం మన శక్తులన్నింటినీ ఓ గుప్పెట్లోకి కేంద్రీకరించడం, మనం దాడిచేసే కేంద్ర బిందువు దగ్గర సాంద్రీకరించడం అవసరం. పరిస్థితులేమైనప్పటికీ కూడా, అధికార, కేంద్రీకరణలు ఖండనార్హమైన రెండు అంశాలన్నట్లు మాట్లాడటం విన్నప్పుడు, ఈ మాట అనేవాళ్లకు విప్లవం అంటే ఏమిటన్న అవగాహనైనా లేక పోయివుండాలి, లేకుంటే వాళ్లు నామ్‌కే వస్తే విప్లవవాదులైనా అయ్యుండాలి అనిపిస్తూ వుంటుంది నాకు....

### హోబొకెన్‌లోని
## ఫ్రీడిహ్ అడాల్ఫ్ సోర్గెకి ఎంగెల్స్

లండన్, సెప్టెంబరు 12–[17], 1874

...మీ రాజీనామాతో[210] పాత ఇంటర్నేషనల్[16] మూతపడి ముగిసిపోయింది. అదీ మంచిదే. అది రెండవ సామ్రాజ్య కాలానికి చెందినది. యూరప్ అంతటా అప్పుడు సాగిన నిర్బంధం కారణంగా, అప్పుడే పునర్జాగృతమవుతున్న కార్మికోద్యమం ఆంతరంగిక వాగ్వివాదాలూ దూషణ తిరస్కారాలూ దూరంగా ఉంచి ఐక్యంగా ఉండాల్సి వచ్చింది. శ్రామికవర్గ ఉమ్మడి అంతర్జాతీయ ప్రయోజనాలు ముందుకు రాగలిగిన తరుణమది. జర్మనీ, స్పెయిన్, ఇటలీ, డెన్మార్కులు అప్పుడే ఉద్యమంలోకి వచ్చాయి, లేక, వస్తున్నాయి.

నిజానికి 1864లో ఉద్యమ సైద్ధాంతిక స్వభావమింకా, యూరప్‌లో అన్ని చోట్లా, అంటే ప్రజానీకంలో బాగా అస్పష్టంగా ఉంది. జర్మన్ కమ్యూనిజం అప్పటికింకా కార్మిక పార్టీగా రూపుదాల్చలేదు. ప్రూడనిజమింకా తన ప్రత్యేక కీలు గుర్రాలు పుచ్చుకొని తప్పటడుగులు వెయ్యలేనంత బలహీనంగా వుంది. బకూనిన్ అర్థం పర్థంలేని కొత్త తొక్కుపలుకులు యింకా అతని బుర్రలోకే రాలేదు. ఇంగ్లీషు ట్రేడ్‌యూనియన్ల నాయకులు సైతం, నిబంధనావళి అవతారికలో పొందుపరచబడిన కార్యక్రమం ఉద్యమంలోకి తమ ప్రవేశానికి ప్రాతిపదిక కల్పించినట్లు భావించారు. మొదటి మహా విజయంతో వివిధ మతాల మధ్య ఏర్పడిన అమాయికమైన సాహచర్యం విచ్ఛిన్నంకాక తప్పలేదు. ఆ విజయమే కమ్యూన్. దాన్ని రూపొందించేందుకు ఇంటర్నేషనల్ తన చిటికెన వ్రేలును సైతం కదపక పోయినా, మేధాపరంగా అది నిస్సందేహంగా ఇంటర్నేషనల్ బిడ్డయే. కమ్యూన్‌కి బాధ్యత ఇంటర్నేషనల్‌కి ఆపాదింపబడటం ఒక విధంగా పూర్తిగా సరైనదే. కమ్యూన్ ధర్మమా అని, యూరప్‌లో ఇంటర్నేషనల్ ఎప్పుడైతే ఒక నైతిక శక్తిగా తయారైందో, అప్పుడు వెంటనే కీచులాట ప్రారంభమైంది. ప్రతి ధోరణీ విజయాన్ని తన స్వంతం కోసం వినియోగించుకోవాలని చూసింది. తప్పనిసరి అయిన విచ్ఛిత్తి ప్రారంభమైంది....

## హేగ్‌లోని

# ఎఫ్. డొమెలా-న్యూవెన్‌హెయ్‌స్‌కు మార్క్స్

లండన్, ఫిబ్రవరి 22, 1881

41, మెయిట్‌లాండ్ పార్క్ రోడ్డు, ఎన్. డబ్ల్యు.

...బహుశా మీరు పారిస్ కమ్యూన్ సంగతి పేర్కొనవచ్చు; కాని, అసాధారణమైన పరిస్థితుల్లో యిది కేవలం ఒక నగరం చేసిన తిరుగుబాటు అనడమే తప్ప, కమ్యూన్‌లో అధికాంశం ఏవిధంగానూ సోషలిస్టు కాదు, కాజాలదు కూడా. ఏదేమైనా, రవ్వంత లోకజ్ఞానం వున్నా కూడా అది వెర్సైల్స్‌తో యావన్మంది ప్రజలకూ ఉపయోగకరమైన రాజీ ఒప్పందం చేసుకొని ఉండేది — అప్పట్లో సాధ్యమైనది అదొక్కటి మాత్రమే. ఫ్రాన్సు బ్యాంకు నొక్కదాన్ని వశంచేసుకొని ఉంటే, వెర్సైల్స్ వాళ్ళు భయభీతులై యుండేవారు, వళ్ల డంబాలు బంద్దై వుండేవి వగైరా వగైరా....

# ప్లౌయన్-డ్రెస్డెన్‌లోని

# ఔగుస్ట్ బేబెల్‌కు ఎంగెల్స్

లండన్, అక్టోబరు 29, 1884

...ఫ్రాన్సులో, మన పార్టీకి యిదొక కొత్త ఊపునిచ్చేందుకు దారితీస్తుందని నేను భావిస్తున్నాను. అక్కడ, ప్రజలింకా కమ్యూన్ పరాజయ పర్యవసానాల నుండి కోలు కోలేదు. ఫ్రెంచి శ్రామికవర్గాన్ని వెనక్కి నెట్టివేసినంత గట్టిగానూ యూరప్‌ని అది ప్రభావితం చేసింది. మూడు మాసాలపాటు, అందునా పారిస్‌లో, అధికారాన్ని వహించి, ప్రపంచాన్ని తల్లక్రిందులు చెయ్యకుండా, సొంత అసమర్థతవల్ల కూలిపోవడమంటే (ఏక పక్షంగా కమ్యూన్‌కీ రోజున యివ్వబడుతున్న భాష్యమిదే) — పార్టీ నిలబడజాల దన్న సంగతి రుజువవుతోంది కదా? సాధారణంగా యీమాట అంటున్నది, పాత, ప్రత్యేకించి ఫ్రెంచి సోషలిజానికి కమ్యూన్ సమాధి అనీ, అదే సమయంలో, ఫ్రాన్సుకి కొత్తదైన, అంతర్జాతీయ కమ్యూనిజానికి కమ్యూన్ ఊయలవంటిదన్న సంగతిని గుర్తించని వాళ్లే....

# వివరణలు

# పేర్ల సూచి

# వివరణలు

1 ఇంటర్నేషనల్ జనరల్ కౌన్సిలు విజ్ఞప్తి "ఫ్రాన్సులో అంతర్యుద్ధం" శాస్త్రీయ కమ్యూనిజానికి సంబంధించిన అతి ముఖ్యమైన రచనల్లో ఒకటి. పారిస్ కమ్యూన్ అనుభవం ఆధారంగా వర్గ పోరాటం, రాజ్యం, విప్లవం, శ్రామికవర్గ నియంతృత్వం అనే మార్క్సిస్టు మూల సూత్రీకరణలను అది మరింతగా అభివృద్ధి చేసింది.

మార్క్సు పారిస్ కమ్యూన్ తొలి రోజుల నుంచీ, దాని కార్యకలాపాలకు సంబంధించిన యావత్తు సమాచారాన్నీ—ఫ్రెంచి, ఇంగ్లీషు, జర్మన్ పత్రికల నుండి సమాచారాన్ని, పారిస్ నుండి లేఖలు, వగైరాలనూ—సేకరించడం, అధ్యయనం చెయ్యడం పనిగా పెట్టుకున్నాడు. 1871 ఏప్రిల్ 18న జరిగిన జనరల్ కౌన్సిలు సమావేశంలో, ఫ్రాన్సులోని పోరాటపు సాధారణ ధోరణిపై ఇంటర్నేషనల్ సభ్యులందరికీ ఒక ప్రత్యేక విజ్ఞప్తిని విడుదల చెయ్యాలని ఆయన ప్రతిపాదించాడు. ఆ విజ్ఞప్తి ముసాయిదాను తయారుచెయ్యాల్సిందిగా ఆయన్నే సమావేశం కోరింది. ఆయన ఆ పనికి ఏప్రిల్ 18 తర్వాత పూనుకొని, మే మాసమంతా దానిపై కృషి చేశాడు. "ఫ్రాన్సులో అంతర్యుద్ధం"యొక్క మొదటి, రెండవ చిత్తు పాఠాలను ఆయన తన రచనకు ముసాయిదా పాఠాంతరాలుగా రచించాడు (115–256వ పేజీలు, 97వ వివరణ చూడండి), ఆటు తర్వాత ఆయన తన చివరి పాఠాన్ని రచిస్తూ పోయాడు. 1871 మే 30వ, పారిస్‌లోని చివరి బారికేడ్ (కొట్టగడ) కూలిపోయిన రెండు రోజుల తర్వాత, మార్క్సు చదివి వినిపించిన "ఫ్రాన్సులో అంతర్యుద్ధం" చివరి పాఠాన్ని జనరల్ కౌన్సిలు ఏకగ్రీవంగా ఆమోదించింది.

"ఫ్రాన్సులో అంతర్యుద్ధం" లండన్‌లో మొట్టమొదటి సారిగా 1871 జూన్ 13న, ఇంగ్లీషులో ప్రచురింపబడింది. అది త్వరలోనే అమ్ముడుపోవడంతో రెండవ ఇంగ్లీషు ముద్రణ, కార్మికుల కోసం అంతకన్న చౌకధరకు, వెలువరచ బడింది. రెండవ ముద్రణలో మార్క్స్, మొదటి ముద్రణలో దొర్లిన అచ్చు తప్పులను సరిదిద్ది, "వ్యాఖ్యలు" విభాగానికి మరొక వత్రం జతచేశాడు. 1871 ఆగస్టులో మూడవ ఇంగ్లీషు ముద్రణ వెలువరచబడింది, అంతకు ముందరి ముద్రణల్లో కనుగొనబడిన పొరపాట్లను దానిలో మార్క్స్ సరిదిద్దాడు.

1871, 1872 సంవత్సరాల్లో "ఫ్రాన్సులో అంతర్యుద్ధం" ఫ్రెంచి, జర్మన్, రష్యన్, ఇటాలియన్, స్పానిష్, డచ్ భాషల్లోకి అనువదింపబడింది, వివిధ యూరపియన్ దేశాల్లోను, అమెరికాలోను పత్రికల్లోను, వేరే ముద్రణలు గాను ప్రచురింపబడింది.

ఎంగెల్సు చేసిన జర్మన్ అనువాదం, జర్మన్ సోషల్-డెమోక్రటిక్ వర్కర్స్ పార్టీ (ఐసెనాఖర్‌ల) కేంద్ర పత్రిక అయిన "Der Volksstaat"లో 1871 జూన్, జూలై మాసాల్లోను, స్విట్జర్లెండులోని ఇంటర్నేషనల్ జర్మన్ శాఖల పత్రిక అయిన "Der Vorbote"లో సంక్షిప్త పాఠంగా 1871 ఆగస్టు–అక్టోబరు మాసాల్లోను, అంతే కాకుండా, లైప్జిగ్‌లో ప్రత్యేకమైన ఒక చిన్న పుస్తకంగాను ప్రచురింపబడింది. అనువాదక్రమంలో ఎంగెల్సు మూలపాఠంలో కొద్దిపాటి నామమాత్రపు మార్పులు చేశాడు. పారిస్ కమ్యూన్ అయిదవ వార్షికోత్సవ సందర్భంగా 1876లో, కొన్ని భాగాలకు మరింత ఖచ్చితత్వాన్ని కల్పించి, ఓ కొత్త జర్మన్ ముద్రణను వెలువరచారు.

1891లో పారిస్ కమ్యూన్ 20వ వార్షికోత్సవ సందర్భంగా "ఫ్రాన్సులో అంతర్యుద్ధం" జర్మన్ ముద్రణను తయారు చేసే సందర్భంగా, ఎంగెల్సు తన అనువాద పాఠాన్ని మరోమారు పరిమాపి, దాని కొక ఉపోద్ఘాతాన్ని రచించాడు (23–37వ పేజీలు చూడండి). ఈ ముద్రణలో ఆయన, మార్క్స్ రచించిన, ఫ్రెంచి-ప్రష్యన్ యుద్ధంపై ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్స్ అసోసియేషన్ జనరల్ కౌన్సిలుయొక్క మొదటి, రెండవ విజ్ఞప్తులను చేర్చాడు (38–43, 44–52వ పేజీలు చూడండి), అటుదరిమిలా వివిధ భాషల్లో ప్రచురింపబడిన "ఫ్రాన్సులో అంతర్యుద్ధం" వివిధ ముద్రణల్లో సాధారణంగా యివి చేర్చబడుతూ వచ్చాయి.

ఫ్రెంచి భాషలో "ఫ్రాన్సులో అంతర్యుద్ధం," బ్రసెల్స్‌లోని ఇంటర్నేషనల్ బెల్జియన్ శాఖలకు చెందిన "L'Internationale" అనే వార్తాపత్రికలో, 1871 జూలై నుండి సెప్టెంబరు వరకు ప్రచురింపబడింది. బ్రసెల్స్‌లో

1872లో, ఒక ప్రత్యేక ఫ్రెంచి ముద్రణ వెలువడింది. ఈ అనువాదాన్ని మార్క్స్ పరిచూసి, ప్రూఫుల్లో పలు మార్పులు చేశాడు, పలు భాగాలను తిరిగి అనువదించాడు.

తదుపరి వరుసగా వెలువడిన పలు అచ్చు ముద్రణలకూ, సైక్లో పునర్ముద్రణలకూ మూలమైన "ఫ్రాన్సులో అంతర్యుద్ధ"పు తొలి రష్యన్ ముద్రణ జూరిహ్‌లో 1871లో వెలువడింది. 1905లో వి. ఐ. లెనిన్ సంపాదకత్వంలో "ఫ్రాన్సులో అంతర్యుద్ధం" రష్యన్ భాషలో వెలువడింది. ఈ అనువాదం 1891 నాటి జర్మన్ ముద్రణనుండి చెయ్యబడింది ("బురెవేస్త్నిక్" ప్రచురణాలయం, ఒదేస్స).– 21, 53.

2 పారిస్ కమ్యూన్ 20వ వార్షికోత్సవ సందర్భంగా 1891లో జర్మనీ సోషల్-డెమోక్రటిక్ పార్టీ ప్రచురించిన మార్క్స్ రచన ముద్రణకు ఎంగెల్సు యీ ఉపోద్ఘాతాన్ని రాశాడు. పారిస్ కమ్యూన్ సంపాదించిన అనుభవంయొక్క చారిత్రక ప్రాముఖ్యాన్నీ, దానికి సంబంధించి "ఫ్రాన్సులో అంతర్యుద్ధం"లో మార్క్స్ చేసిన సాధారణ సైద్ధాంతిక సూత్రీకరణ ప్రాముఖ్యాన్నీ ఆయన పేర్కొని, పారిస్ కమ్యూన్ చరిత్రపై, ప్రత్యేకించి దాని బ్లాంకీస్టు, ప్రూడనిస్టు సభ్యుల కార్యకలాపాలను గురించి ఎంగెల్సు అదనపు సమాచారాన్నిచ్చాడు. – 23.

3 "లూయీ బోనపార్ట్ బ్రూమేర్ పద్దెనిమిదవ తేదీ." బ్రూమేర్ పద్దెనిమిదవ తేదీ: 18వ శతాబ్దాంతంలో (ఫ్రెంచి బూర్జువా విప్లవపు పంచాంగం ప్రకారం 1799 నవంబరు 9వ తేదీ) రాజకీయ కుట్ర జరిగిన దినం అది. ఆ కుట్ర చేసిన మొదటి నెపోలియన్ బోనపార్ట్ సైనిక నియంతృత్వం స్థాపించాడు. ఆ తేదీని "లూయీ బోనపార్ట్ బ్రూమేర్ పద్దెనిమిదవ తేదీ" పేర, మార్క్స్ తన రచనకు శీర్షికగా పరిగ్రహించాడు. మార్క్స్, తన యీ రచనలో మూడవ నెపోలియన్ బోనపార్ట్ (మొదటి నెపోలియన్ మేనల్లుడు) 1851లో చేసిన రాజకీయ కుట్రను పరిశీలించాడు. దానిని మార్క్స్ 1851 డిసెంబరుకీ 1852 మార్చికీ మధ్య రచించాడు. ఫ్రాన్సులో 1848–51 విప్లవ ఘటనలను అందులో ఆయన విశ్లేషించి, చారిత్రక భౌతికవాదం, వర్గపోరాట, శ్రామికవర్గ విప్లవ సిద్ధాంతం, శ్రామికవర్గ నియంతృత్వ సిద్ధాంతాలకు సంబంధించిన మౌలిక సిద్ధాంత సూత్రీకరణలను మరింతగా అభివృద్ధి చేశాడు. ఈ రచనలో మార్క్స్ మొదటి సారిగా, విజయం సాధించిన శ్రామికవర్గం బూర్జువా రాజ్యయంత్రాంగాన్ని తుత్తునియలు చెయ్యాలన్న భావాన్ని ప్రతిపాదించాడు. ఈ అభిప్రాయాన్నే ఆయన తర్వాత "ఫ్రాన్సులో అంతర్యుద్ధం"లో విస్తరించి వివరించాడు. – 23, 322.

4 ఇది 1813–14లో నెపోలియన్ పాలనకి వ్యతిరేకంగా జరిగిన జర్మన్ ప్రజల జాతీయ విముక్తి యుద్ధానికి ప్రస్తావన. – 23, 43.

5 ప్రజావక్తలు (డెమగోగ్‌లు) – నెపోలియన్ ఫ్రాన్సుతో యుద్ధాల తదుపరి దశలో, జర్మన్ రాష్ట్రాల్లోని అభివృద్ధినిరోధక వ్యవస్థలను వ్యతిరేకించి, జర్మనీని ఐక్య పరచాలని డిమాండ్ చేస్తూ రాజకీయ ప్రదర్శనలను జరిపిన ప్రతిపక్ష ఉద్యమ సభ్యులకు జర్మనీలోని అభివృద్ధి నిరోధక వర్గాలు పెట్టిన పేరు. ఈ ఉద్యమం మేధావుల్లోను, విద్యార్థుల్లోను, ప్రత్యేకించి విద్యార్థుల తాలింఖానాల్లోను వ్యాపించింది. "ప్రజావక్తలు" (డెమగోగ్‌లు) అభివృద్ధి నిరోధక అధికారులచేత హింసింపబడ్డారు. – 23.

6 సోషలిస్టు వ్యతిరేక చట్టం (సోషలిస్టులకు వ్యతిరేకంగా అసాధారణ చట్టం) జర్మనీలో 1878 అక్టోబరు 21న ప్రవేశపెట్టబడింది. అది అన్ని సోషల్-డెమొక్రటిక్ పార్టీ సంస్థలనూ, శ్రామిక ప్రజా సంస్థలనూ, కార్మికవర్గ పత్రికలనూ నిషేధించింది. సోషలిస్టు సాహిత్యాన్ని జప్తు చేసింది. సోషల్-డెమొక్రట్లు నిర్బంధచర్యలకు గురి అయ్యారు. కార్మికవర్గోద్యమ ఒత్తిడి కారణంగా, ఆ చట్టం 1890 అక్టోబరు 1న రద్దుచెయ్యబడింది. – 24.

7 బెల్‌విల్ – ఆ పేరుగల కొండప్రాంతంలో వున్న పారిస్‌లోని కార్మిక పేట. 1871 మేలో జరిగిన వీధి పోరాటమప్పుడు అక్కడే కమ్యూన్ తుది ప్రతిఘటనకు పూనుకొంది. – 24.

8 1848 జూన్ 23–26 తేదీల మధ్య పారిస్ శ్రామికవర్గం చేసిన వీరోచితమైన తిరుగుబాటుకు ప్రస్తావన యిది. ఆ తిరుగుబాటు ఫ్రెంచి బూర్జువావర్గం చేత క్రూరంగా అణచివెయ్యబడింది. చరిత్రలోనే శ్రామికవర్గానికీ బూర్జువావర్గానికీ మధ్య జరిగిన తొట్ట తొలి మహా అంతర్యుద్ధమది. జూన్ తిరుగుబాటు ఓటమి యూరపియన్ దేశాల్లో విప్లవ ప్రతీఘాత ఎదురుదాడికి సంకేతంగా పనిచేసింది. – 26, 51, 60, 85, 125, 260, 265.

9 ఆర్లియనిస్టులు – ఆర్లియన్స్ ప్రభువుల వత్తాసుదార్లు, బూర్బన్ రాజవంశానికి చెందిన యువతరం. 1830 నాటి జూలై విప్లవానంతరం అధికారంలో ఉన్న వీళ్ళ 1848 నాటి విప్లవంచేత కూలద్రొయ్యబడ్డారు. ఫైనాన్స్ ప్రభుమండలి యొక్క, బడా బూర్జువావర్గంయొక్క ప్రయోజనాలకు వీళ్ళు ప్రాతినిధ్యం వహించారు.

లెజిటిమిస్టులు – 1792లో ఫ్రాన్సులో కూలద్రొయ్యబడిన బూర్బన్ రాజవంశ వత్తాసుదారుల యీ పార్టీ, బడా భూస్వామ్య ప్రభువుల, ఉన్నత

మతాధికారుల ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించింది. రాజవంశం రెండవ మారు కూలద్రోయ్యబడిన తర్వాత అది 1830లో ఒక పార్టీగా రూపొందింది. రెండవ సామ్రాజ్యం (1852–70) క్రింద, ప్రజల నుండి తోడ్పాటును పొందడంలో విఫలమైన లెజిటిమిస్టులు, విమర్శనాత్మకమైన చిన్న పుస్తకాల ప్రచురణకు పరిమితులై, 1871లో మాత్రమే కార్యాచరణకు ఉత్తేజితులయ్యారు. అప్పుడు వాళ్ళు పారిస్ కమ్యూన్‌కు వ్యతిరేకంగా సాధారణ విప్లవ ప్రతిఘాత దాడిలో చేతులు కలిపారు.

బోనపార్టిస్టులు – మొదటి (1804–14), రెండవ (1852–70) సామ్రాజ్యాల పతనానంతరం ఫ్రాన్సులో బోనపార్ట్ రాజవంశ పునరుద్ధరణ వర్తాను దార్లు. – 26, 50, 63, 98, 144, 151, 220.

10 1848 డిసెంబరు 10 నుండి ఫ్రెంచి రిపబ్లిక్ అధ్యక్షుడుగా ఉన్న లూయీ బోనపార్ట్ ఫ్రాన్సులో 1851 డిసెంబరు 2న చేసిన కుట్రకు ప్రస్తావన యిది. ఆ రోజున, దేశపు అత్యున్నత సంస్థలు – శాసనసభా, ప్రభుత్వ సలహా సమితి – చెదర గొట్టబడ్డాయి, పలువురు డిప్యూటీలు అరెస్టు చెయ్యబడ్డారు. 32 డిపార్టుమెంటుల్లో (రాష్ట్రాల్లో) మార్షల్ లా (సైనిక శాసనం) ప్రకటింపబడింది. సోషలిస్టు, రిపబ్లికన్ నాయకులు దేశబహిష్కృతు లొనర్చబడ్డారు. సకలాధికారాన్నీ అధ్య క్షుని చేతిలో కేంద్రీకరింపచేస్తూ, 1852 జనవరి 14న ఒక కొత్త రాజ్యాంగ చట్టం ఆమోదింపబడింది. 1852 డిసెంబరు 2న లూయీ బోనపార్ట్ మూడవ నెపోలియన్ పేర ఫ్రాన్సుకు చక్రవర్తిగా ప్రకటింపబడ్డాడు. – 26, 39, 51, 73, 77, 147.

11 ప్రష్యా విజయంతో ముగిసిన 1866 నాటి ఆస్ట్రియా-ప్రష్యా యుద్ధం ఈ రెండు రాజ్యాలకూ మధ్య చిరకాలంగా ఉన్న వైరాన్ని పరిష్కరించి, పూర్వ నిర్ణయం మేరకు ప్రష్యా పెత్తనం క్రింద జర్మనీ ఏకీకరణను సాధించింది. ప్రష్యా ఇటలీతో మైత్రి నెరపగా, పలు జర్మన్ రాష్ట్రాలు ఆస్ట్రియా పక్షం వహించాయి. ప్రాగ్ శాంతి ఒడంబడిక క్రింద, ష్లెస్విగ్, హోల్‌స్టైన్‌లనే ఉత్తర జర్మన్ డచీల (సంస్థానాల) పై తనకు గల హక్కును ఆస్ట్రియా విడిచిపెట్టి, ప్రష్యాకు కట్టపెట్టింది. దానికొక చిన్న మొత్తం నష్టపరిహారం చెల్లించడానికి సిద్ధపడింది. వెనిస్ ప్రాంతాన్ని ఇటలీ రాజ్యానికి అప్పగించింది. వెనక 1815లో వియన్నా కాంగ్రెస్‌చేత ఏర్పాటు చెయ్యబడిన 30 కన్న ఎక్కువ జర్మన్ రాష్ట్రాలను ఐక్యపరచిన జర్మన్ సమాఖ్య రద్దుచెయ్యబడింది. దాని స్థానంలో, ఆస్ట్రియా భాగస్వామ్యం లేకుండా, ప్రష్యా నాయకత్వంలో ఉత్తర జర్మన్ సమాఖ్య (కాన్

ఫెడరేషన్) ఏర్పడింది. హన్నోవర్ రాజ్యాన్నీ, హెస్సెన్-కాస్సెల్ ఎలెక్టొరేట్‌నీ, నాస్సౌ గ్రాండ్ డచీనీ, ఫ్రాంక్‌ఫుర్ట్-అమ్-మెయిన్ స్వేచ్ఛా నగరాన్నీ కూడా ప్రష్యా కలిపేసుకుంది. – 27.

12 ఫ్రెంచి-ప్రష్యన్ యుద్ధంలో కీలకమైన ఒక పోరాటం 1870 సెప్టెంబరు 1, 2 తేదీల్లో సెడాన్ దగ్గర జరిగింది. అది ఫ్రెంచివారి ఘోర పరాజయంతో ముగిసింది. 1870 సెప్టెంబరు 2న ఫ్రెంచి సైన్యాధికారులు సంతకం పెట్టిన లొంగుబాటు నిబంధన మేరకు సాక్షాత్తూ మూడవ నెపోలియన్‌తో సహా 80,000 మంది సైనికులు, ఆఫీసర్లు, జనరల్సూ లొంగిపోయారు. 1870 సెప్టెంబరు 5 నుండి 1871 మార్చి 19 వరకు, చక్రవర్తి, ప్రష్యన్ రాజుల భవనమైన విల్‌హెల్మ్స్‌హోయెలో నిర్బంధింపబడ్డాడు. సెడాన్ ఘోరపరాజయం రెండవ సామ్రాజ్య పతనాన్ని త్వరితపరచి, 1870 సెప్టెంబరు 4న ఫ్రాన్సులో రిపబ్లిక్ ప్రకటనకు దారితీసింది. – 27, 44, 61, 169.

13 ప్రష్యన్ యుంకర్లు – ప్రష్యన్ బడా భూస్వాములు. – 28.

14 1871 ఫిబ్రవరి 26న, వెర్సేల్స్‌లో, ఒక వంక త్యేర్, జూల్ ఫ్రావ్‌లూ మరో వంక బిస్మార్క్ సంతకాలు పెట్టిన, ఫ్రాన్సుకీ జర్మనీకీ మధ్య తాత్కాలిక శాంతి సంధికి ప్రస్తావన యిది. దీని మేరకు ఫ్రాన్సు ఆల్సేస్, తూర్పు లొరైన్‌లను జర్మనీకి దత్తంచేసింది, 500 కోట్ల ఫ్రాంకుల నష్టపరిహారాన్ని చెల్లించింది; ఆ నష్టపరిహారం చెల్లింపబడేదాకా ఫ్రెంచి భూభాగంలో ఒక ప్రాంతాన్ని జర్మన్ సేనలు ఆక్రమించుకొనే ఉన్నాయి. అంతిమ శాంతి సంధిపై ఫ్రాంక్‌ఫుర్ట్-అమ్-మెయిన్‌లో 1871 మే 10న సంతకాలు జరిగాయి. – 28, 135, 142.

15 మార్షల్ బాసెన్ నాయకత్వాన ఒక ఫ్రెంచి సైన్యం, ముట్టడింపబడిన మెట్స్ నగరంలో 1870 అక్టోబరులో జర్మన్లకు లొంగిపోయింది. సెడాన్‌లో ఖైదీలుగా పట్టుకోబడిన సైనికులతోబాటు యీ ఫ్రెంచి సైనికులు దరిమిలా పారిస్ కమ్యూన్‌ని అణచివెయ్యడానికీ, దానిలో పాల్గొన్నవారిని ఊచకోత కొయ్యడానికీ వినియోగింపబడ్డారు. – 31, 61.

16 ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్స్ అసోసియేషన్ (మొదటి ఇంటర్నేషనల్) – శ్రామిక వర్గంయొక్క తొలి అంతర్జాతీయ ప్రజా సంఘం, దీనికి మార్క్స్ ఎంగెల్సులు నాయకత్వం వహించారు (1864–76). అది, శాస్త్రీయ సోషలిస్టు భావాలను ప్రముఖ పెట్టుబడిదారీ దేశాల అగ్రగామి కార్మికుల అందుబాటులోకి తీసుకెళ్ళి,

"పెట్టుబడిపై విప్లవ దాడికై సన్నద్ధులు కావడానికి గాను కార్మికుల అంతర్జాతీయ సంస్థకు పునాది వేసింది (వి ఐ. లెనిన్, Co ected Works, సంపుటి 29, పేజి 306). – 33, 112, 264, 265, 289, 305, 312, 313, 319.

17 "Idée genéra e de la Revo ut on au X X s ec e" ( 19వ శతాబ్దంలోని విప్లవానికి సంబంధించిన సాధారణ భావం") పారిస్, 1851 అన్న ప్రూడన్ పుస్తకానికి ప్రస్తావన యిది – 34.

18 పాసిబిలిస్టులు ('సాధ్యతావాదులు ) – ఫ్రెంచి సోషలిస్టు ఉద్యమంలో యిదొక అవకాశవాద ధోరణి, దీనికి పి. బ్రుస్, బి మలోన్ తదితరులూ నాయకత్వం వహించారు. ఫ్రెంచి కార్మిక పార్టీలో 1882లో వీళ్ళు చీలిక తీసుకొచ్చారు 'సాధ్యమైన" దాని (poss b e) కోసం మాత్రమే కృషిచెయ్యడమన్న సంస్కరణవాద సూత్రం మేరకు వీళ్ళు పని చేశారు. అందుకనే వాళ్ళకాపేరు వచ్చింది – 34.

19 ఎంగెల్సు రచించిన యీ వ్యాసం జర్మన్ సోషల్-డెమొక్రటిక్ సైద్ధాంతిక పత్రిక "D e Neue Zeit"లో "ఫ్రాన్సులో అంతర్యుద్ధం గూర్చి" అనే పేరుతో, మొదట ప్రచురింపబడినప్పుడు, సంపాదకులు మూలంలో యీ క్రింది మార్పు చేశారు చిట్టచివరి పేరాలోని, "సోషల్-డెమొక్రటిక్ అల్పబుద్ధి" అనే పదబంధం "జర్మన్ అల్పబుద్ధి"గా మార్చబడింది అకారణంగా చిత్తమొచ్చినట్లు చెయ్యబడిన ఈ మార్పు పట్ల ఎంగెల్సు తన అసమ్మతిని తెలియజేశాడు, కానైతే ఒకే మారు వివిధ భాషల్లో వెలువడే తన రచనల ముద్రణలన్నింటినీ చదివి సరిదిద్దే బెడదను నివారించేందుకు గాను ప్రత్యేక ముద్రణలో కూడా ఆ పదాలను అలాగే ఉండనిచ్చేశాడు. మూలపాఠం ఇక్కడ పునరుద్ధరింపబడింది – 37.

20 "ఫ్రెంచి-ప్రష్యన్ యుద్ధంపై ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్స్ అసోసియేషన్ జనరల్ కౌన్సిలు మొదటి విజ్ఞప్తి" మార్క్సు చేత 1870 జూలై 19–23 తేదీల మధ్య రచింపబడింది. 1870 జూలై 19న, యుద్ధం ప్రారంభమైన రోజున, యుద్ధంపై ఒక విజ్ఞప్తి ముసాయిదాను తయారు చెయ్యాల్సిందిగా జనరల్ కౌన్సిలు మార్క్సును కోరింది. అది, జనరల్ కౌన్సిలు స్టాండింగ్ కమిటీ (స్థాయీసమితి) చేత జూలై 23న ఆమోదింపబడింది. అటు తర్వాత 1870 జూలై 26న కౌన్సిలు చేత ఏకగ్రీవంగా ఆమోదింపబడింది. ఆ విజ్ఞప్తి మొట్టమొదట లండన్‌లో ఇంగ్లీషులో, 1870 జూలై 28 తేదీన, "The Pall Mall

Gazette" 1702వ సంచికలో ప్రచురింపబడింది. మరి కొద్ది రోజుల తర్వాత 1000 ప్రతుల్లో చిన్న పుస్తకంగా ప్రచురింపబడింది. అది, వివిధ రాష్ట్రాలకు చెందిన ఇంగ్లీషు పత్రికల్లో కూడా పూర్తిగా గాని, భాగాలుగా గాని పునర్ముద్రింపబడింది.

మొదటి ముద్రణ త్వరలోనే అమ్ముడైపోయింది, గిరాకీ అలాగే కొనసాగు తూండటంతో అదనపు కాపీలు ముద్రించాలని 1870 ఆగస్టు 2న జనరల్ కౌన్సిలు నిశ్చయించింది. 1870 సెప్టెంబరులో, జనరల్ కౌన్సిలు ఫ్రెంచి-ప్రష్యన్ యుద్ధంపై రెండవ విజ్ఞప్తితోబాటు అది ఇంగ్లీషులో పునర్ముద్రింప బడింది. ఈ ముద్రణలో తొలి ముద్రణలోని వివిధ అచ్చుతప్పులను మార్క్సు సరిదిద్దాడు.

ఆగస్టు 9న, మొదటి విజ్ఞప్తిని జర్మన్, ఫ్రెంచి భాషల్లోకి అనువదిం చేందుకూ, ప్రజల్లోకి పంపేందుకూ జనరల్ కౌన్సిలు ఒక కమిటీని నియమిం చింది. జర్మన్ భాషలో అది మొదట, లైప్జిగ్‌లోని "Der Volksstaat" పత్రికలో, 1870 ఆగస్టు 7న ప్రచురింపబడింది, ఈ అనువాదం విల్‌హెల్మ్ లీబ్‌క్నెఖ్ట్ చేశాడు. జర్మన్ అనువాదం తన చేతికి వచ్చినప్పుడు, మార్క్సు అనువాద పాఠాన్ని విశేషంగా సరిచెయ్యడంతోబాటు, దాదాపుగా దానిలో సగభాగాన్ని తిరిగి అనువదించాడు. ఈ కొత్త జర్మన్ అనువాదంలో విజ్ఞప్తి జినీవాలో "Der Vorbote" పత్రికలో 1870 ఆగస్టులో ప్రచురింపబడటంతోబాటు ప్రత్యేకమైన చిన్న పుస్తకంగా కూడా ప్రచురింపబడింది. పారిస్ కమ్యూన్ 20వ వార్షికోత్సవ సందర్భంగా 1891లో, జనరల్ కౌన్సిలు మొదటి, రెండవ విజ్ఞప్తులను "ఫ్రాన్సులో అంతర్యుద్ధం"యొక్క జర్మన్ ముద్రణలో ఏంగెల్సు ప్రచు రించాడు, దాన్ని బెర్లిన్‌లో సోషల్-డెమోక్రటిక్ పత్రిక "Vorwärts" ప్రచు రించింది. ఈ ముద్రణకి మొదటి, రెండవ విజ్ఞప్తుల అనువాదాన్ని కూడా ఆయన పర్యవేక్షించాడు.

ఫ్రెంచి భాషలో, యీ విజ్ఞప్తి 1870 ఆగస్టులో, ఇంటర్నేషనల్‌కి చెందిన రొమాన్సు ఫెడరేషన్ పత్రిక అయిన స్విస్ వార్తాపత్రిక "L'Égalité" లోను, అసోసియేషన్‌కి చెందిన బెల్జియన్ పత్రికలు అయిన "L'Internationale," "Le Mirabeau"లలోను ప్రచురింపబడింది. జనరల్ కౌన్సిలు కమిటీ చేసిన ఫ్రెంచి అనువాదం చిన్న పుస్తకంగా కూడా ప్రచురింపబడింది.

రష్యన్ భాషలో మొదటి విజ్ఞప్తి మొట్టమొదట, ఇంటర్నేషనల్‌కి చెందిన రష్యన్ శాఖ పత్రిక అయిన "నరోద్నాయె ద్యేలొ" ("ప్రజా ధ్యేయం")లో, జినీవాలో 1870 ఆగస్టు సెప్టెంబర్లలో ప్రచురింపబడింది. 1905లో, మొదటి,

రెండవ విజ్ఞప్తులు "ఫ్రాన్సులో అంతర్యుద్ధం" ముద్రణలో చేర్చబడ్డాయి. 1891 నాటి జర్మన్ ముద్రణ నుండి ఈ అనువాదం చేయబడింది. దీన్ని లెనిన్ సరి చూశాడు (వివరణ 1 చూడండి). దరిమిలా "ఫ్రాన్సులో అంతర్యుద్ధం" ప్రధాన పాఠం తోబాటు, రష్యన్లో యీ విజ్ఞప్తుల పలు ముద్రణలు వెలువడ్డాయి. —38.

21 ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్స్ అసోసియేషన్ ప్రారంభక విధాన వివరణ పత్రం

అసోసియేషన్ (వివరణ 16 చూడండి) సంస్థాపన జరిగిన కొద్ది కాలానికి, 1864 అక్టోబరులో మార్క్సు దీన్ని రచించాడు. అసోసియేషన్ తొలి విధాన వివరణ పత్రం యిదే. అందులో పెట్టుబడిదారీ సమాజంలో శ్రామికవర్గ పరిస్థితికి సంబంధించిన క్లుప్తమైన చిత్రణ యివ్వబడింది, పోరాటంలో (అంతర్జాతీయ సంబంధాల రంగంతోబాటు) దాని కర్తవ్యాలు, లక్ష్యాలు ప్రజలకు సుబోధకమైన పద్ధతిలో సూత్రీకరించబడ్డాయి. 1864 నవంబరు 1న, ఇంటర్నేషనల్ తొలి కార్యనిర్వాహక సంస్థ అయిన తాత్కాలిక కమిటీచేత ఆ విధాన వివరణ పత్రం ఏకగ్రీవంగా ఆమోదించబడింది. —38.

22 జనాభాలో విస్తృత విభాగాలలో అసంతృప్తిని పెంచుతూ సడలిపోయిన రెండవ సామ్రాజ్యాన్ని పటిష్ఠం చేసుకొనే ప్రయత్నంలో మూడవ నెపోలియన్ ప్రభుత్వం 1870 మేలో జనవాక్యసేకరణ (ప్లెబిసైట్) జరిపింది. ఓటింగుకి పెట్టబడిన అంశాలు సకల ప్రజాతంత్ర సంస్కరణలకు కూడా వ్యతిరేకంగా ముందుకొస్తే గాని రెండవ సామ్రాజ్య విధానం పట్ల అసమ్మతి తెలపడం సాధ్యం కాని పద్ధతిలో రూపొందించబడ్డాయి. పైకి భేషుగ్గా కనిపించే కుతంత్రమే అయిన ప్పటికీ, జనవాక్యసేకరణ ప్రభుత్వం పట్ల ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తిని వెల్లడిచేసింది.

జనవాక్యసేకరణ సన్నాహాల క్రమంలో, ప్రభుత్వం కార్మికోద్యమానికి వ్యతిరేకంగా ప్రతీకార చర్యలను ముమ్మరంచేసింది, కార్మిక సంస్థలపై విస్తృతమైన దుష్ప్రచారం చేసింది. వాటి లక్ష్యలను వక్రీకరించి, "కమ్యూనిస్టు ప్రమాదం" బూచి చూపి మధ్యతరగతులను బెదరకొట్టేందుకు ప్రయత్నించింది.

జనవాక్యసేకరణ విషయంలో బోనపార్టిస్టు కుతంత్రాన్ని బహిర్గతం చేస్తూ, ఓటింగును బహిష్కరించాల్సిందిగా కార్మికులకు విజ్ఞప్తి చేస్తూ ఇంటర్నేషనల్‌కు చెందిన పారిస్ ఫెడరేషనూ, వర్కింగ్‌మెన్స్ సొసైటీల పారిస్ సమాఖ్యా ఒక ప్రకటన విడుదల చేశాయి. సరిగా జనవాక్యసేకరణకు ముందు, మూడవ నెపోలియన్‌ను హత్యచేసేందుకు కుట్ర చేశారన్న కల్పిత నేరారోపణపై, పారిస్ ఫెడ

రేషన్ సభ్యులు పోలీసులచేత అరెస్టు చెయ్యబడ్డారు. ఈ నేరారోపణనే ప్రభుత్వం, ఫ్రాన్సులోని వివిధ పట్టణాల్లోని ఇంటర్నేషనల్ సభ్యులను వేధించేందుకూ, హింసించేందుకూ విస్తృతమైన ఉద్యమం ప్రారంభించేందుకు వినియోగించుకుంది. 1870 జూన్ 22కీ – జూలై 5కీ మధ్య జరిగిన పారిస్ ఫెడరేషన్ సభ్యుల విచారణ, కుట్రకు సంబంధించిన ఆరోపణలు కల్పితమైనవన్న సంగతిని పూర్తిగా రుజువు చేసింది, అయితే, ఫ్రాన్సులోని పలువురు ఇంటర్నేషనల్ సభ్యులు మాత్రం, కేవలం ఆ సంఘానికి చెందినందుకు గాను, ఖైదు చెయ్యబడ్డారు.

ఫ్రాన్సులో ఇంటర్నేషనల్‌ను వేధించడం పట్ల కార్మికవర్గంలో బ్రహ్మాండమైన నిరసనలు చెలరేగాయి. – 38.

23 1870 జూలై 19న ఫ్రెంచి-ప్రష్యన్ యుద్ధం ప్రారంభమైంది. – 39.

24 "Le Réveil" ("ప్రబోధం") – 1868 జూలై నుండి 1871 జనవరి వరకు ప్రచురింపబడిన యీ వామపక్ష రిపబ్లికన్ల ఫ్రెంచి పత్రిక, మొదట వార పత్రికగా, 1869 మే నుండి దినపత్రికగా వెలువడింది. 1870 అక్టోబరు నుండి యిది జాతీయ రక్షణ ప్రభుత్వాన్ని వ్యతిరేకించింది.

"La Marseillaise" – ఇదొక ఫ్రెంచి దినపత్రిక. వామపక్ష రిపబ్లికన్ల యీ పత్రిక 1869 డిసెంబరు నుండి 1870 సెప్టెంబరు దాకా ప్రచురింపబడింది. ఇంటర్నేషనల్ కార్యకలాపాలకూ, కార్మికవర్గోద్యమానికీ సంబంధించిన సమాచారాన్ని అది ప్రచురించింది. – 39, 40.

25 డిసెంబరు 10 సంఘానికి ప్రస్తావన యిది (1848 డిసెంబరు 10న ఫ్రెంచి రిపబ్లిక్ అధ్యక్షుడుగా దాని పోషకుడైన లూయీ బోనపార్ట్ ఎన్నిక స్మృత్యర్థం యీ పేరు దాని కొచ్చింది). 1849లో నెలకొల్పబడిన యీ రహస్య బోనపార్టిస్టు సంఘంలో ప్రధానంగా వర్గ భ్రష్టులైన శక్తులు, రాజకీయ దుస్సాహసికులు, సైనిక కుట్ర సభ్యులు, మొదలైన వాళ్ళున్నారు. 1850 నవంబరులో అది పేరుకి రద్దుచెయ్యబడింది, కాని, నిజానికి దాని సభ్యులు బోనపార్టిస్టు ప్రచారాన్ని కొనసాగిస్తూ వచ్చారు, అధికారాన్ని హస్తగతం చేసుకొనేందుకై 1851 డిసెంబరు 2 నాటి కుట్రలో చురుకైన పాత్ర వహించారు. మార్క్సు తన "లూయీ బోనపార్ట్ బ్రూమేర్ పద్దెనిమిదవ తేదీ"లో యీ సంఘానికి సంబంధించిన విపులమైన స్వభావ చిత్రణనిచ్చాడు.

1870 జూలై 15న బోనపార్టిస్టులు, పోలీసుల సహాయంతో, లూయీ

బోనపార్ట్ దండయాత్ర పథకాలకు తోడ్పాటుగా జాతీయ దురహంకార ప్రదర్శన ఒకటి నిర్వహించారు — 40.

26 సడోవా యుద్ధం బొహీమియాలో 1866 జూలై 3న జరిగింది దీనిలో ఒక వంక ఆస్ట్రియన్, సాక్సన్ సేనలూ, మరో వంక ప్రష్యన్ సేనలూ పాల్గొన్నాయి 1866 నాటి ఆస్ట్రియా యుద్ధ పర్యవసానాన్ని నిర్ణయించిన యుద్ధమిది. ఈ యుద్ధం ఆస్ట్రియాపై ప్రష్యా విజయంతో ముగిసింది (11వ వివరణ చూడండి). చరిత్రలో దీనికే క్యోనిగ్‌గ్రేట్స్ (యిప్పుడు గ్రాడెట్స్-కార్లోవ్) యుద్ధమని మరో పేరు. — 41.

27 'ఫ్రెంచి-ప్రష్యన్ యుద్ధంపై ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్స్ అసోసియేషన్ జనరల్ కౌన్సిలు రెండవ విజ్ఞప్తి''ని మార్క్సు 1870 సెప్టెంబరు 6–9 తేదీల మధ్య రచించాడు.

రెండవ సామ్రాజ్యం కూలిపోయిన తదుపరి రూపొందిన కొత్త పరిస్థితిని, యుద్ధంలో ప్రారంభమైన కొత్త దశను పరిశీలించిన మీదట, ఇంటర్నేషనల్ జనరల్ కౌన్సిలు 1870 సెప్టెంబరు 6న ఫ్రెంచి ప్రష్యన్ యుద్ధంపై రెండవ విజ్ఞప్తిని ప్రచురించాలని నిర్ణయించి, అందుకోసం ఒక ప్రత్యేక కమిటీని నియమించింది అందులో మార్క్సు ఒక సభ్యుడు.

ఆ విజ్ఞప్తి రచనలో మార్క్సు, ప్రష్యన్ సైనిక ముఠా, యుంకర్లూ, బూర్జువావర్గమూ, ఫ్రెంచి భూభాగాన్ని ఆక్రమించుకోవడాన్ని సైనిక వ్యూహ ప్రయోజనాల దృష్ట్యా సమర్థించే ప్రయత్నాన్ని బహిర్గతంచేస్తూ ఎంగెల్సు పంపిన సమాచారాన్ని ఉపయోగించుకున్నాడు. ఆ విజ్ఞప్తి 1870 సెప్టెంబరు 9న జరిగిన జనరల్ కౌన్సిలు ప్రత్యేక సమావేశంలో ఏకగ్రీవంగా ఆమోదింప బడింది, అన్ని బూర్జువా లండన్ పత్రికలకూ ప్రచురణార్థం పంపబడింది, దాదాపుగా అవన్నీ కూడా దాన్ని గుర్తించక పూర్తిగా దాటవేశాయి. సెప్టెంబరు 11 – 13 తేదీల్లో అది ఇంగ్లీషులో కరపత్రంగా ప్రచురింపబడింది. మొదటి, రెండవ విజ్ఞప్తులతో కూడిన ఓ కొత్త ముద్రణ సెప్టెంబరు చివర వెలువడింది. దానిలో కొన్ని సవరణలు చేయబడ్డాయి.

రెండవ విజ్ఞప్తి జర్మన్ భాషలోకి మార్క్సుచేత అనువదింపబడింది. ఆయన దానికి, జర్మన్ కార్మికులను దృష్టిలో పెట్టుకొని, పలు వాక్యాలను చేర్చాడు, కొన్ని భాగాలను తొలగించాడు. ఈ అనువాదం 1870 సెప్టెంబరు 21న "Der Volksstaat" వార్తాపత్రికలోను, 1870 అక్టోబరు — నవంబరు మాసాల్లో

"Der Vorbote" పత్రికలోనూ, జినీవాలో కరపత్రంగా కూడా ప్రచురింపబడింది. 1891లో ఎంగెల్సు రెండవ విజ్ఞప్తిని "ఫ్రాన్సులో అంతర్యుద్ధం" జర్మన్ ముద్రణలో ప్రచురించాడు, ఈ ముద్రణకు అనువాదాన్ని సరిచూశాడు

ఫ్రెంచి భాషలో రెండవ విజ్ఞప్తి 1870 అక్టోబరులో "L'Internationale" వార్తాపత్రికలోను, సంక్షిప్త పాఠం "L'Égalité" వార్తాపత్రికలోనూ ప్రచురింపబడింది.

రష్యన్ భాషలో రెండవ విజ్ఞప్తి మొదట 1905లో 'ఫ్రాన్సులో అంతర్యుద్ధం" ముద్రణలో ప్రచురింపబడింది. 1891 నాటి జర్మన్ ముద్రణ నుండి చెయ్యబడిన యీ అనువాదాన్ని వి. ఐ. లెనిన్ సరిచూశాడు. — 44.

28 జర్మనీ 1806 ఆగస్టు దాకా, 10వ శతాబ్దంలో నెలకొల్పబడిన జర్మన్ జాతి యొక్క పవిత్ర రోమన్ సామ్రాజ్యం అనబడే దానిలో ఒక భాగంగా ఉంటూ వచ్చింది చక్రవర్తియొక్క అత్యున్నతాధికారాన్ని గుర్తిస్తూ ఫ్యూడల్ సంస్థానాల, స్వేచ్ఛా నగరాల సమ్మేళనంగా ఉంటూ వచ్చింది. — 46.

29 1618లో బ్రాండెన్‌బుర్గ్ ఎలెక్టొరేటు ప్రష్యన్ డచీ (తూర్పు ప్రష్యా)తో కలిపెయ్యబడింది 16వ శతాబ్ద తొలి భాగంలో ట్యుటోనిక్ భూభాగాల నుండి ఏర్పరచబడిన యీ ప్రాంతం పోలెండు దేశానికి సామంత రాజ్యంగా ఉంటూ వచ్చింది ప్రష్యా డ్యూక్ హోదాలో, బ్రాండెన్‌బుర్గ్ ఎలెక్టార్ 1657 దాకా పోలండుకి సామంతుడుగా ఉంటూ వచ్చాడు. ఆ సంవత్సరం పోలెండు స్వీడెనుతో యుద్ధంలో చిక్కుకోవడాన్ని అదనుగా వినియోగించుకొని, తన ప్రష్యన్ రాజ్యభాగాలపై తన సార్వభౌమాధికారపు గుర్తింపును అతను సంపాదించుకున్నాడు. — 46.

30 1807 జూలై 7–9 తేదీల్లో, నెపోలియన్ ఫ్రాన్సుకీ, యుద్ధంలో ఓటమికి గురైన, నాల్గవ ఫ్రెంచి వ్యతిరేక కలయిక సభ్యదేశాలైన రష్యా ప్రష్యాలకీ మధ్య టిల్సిట్ శాంతి సంధిపై సంతకాలు జరిగాయి. ఈ శాంతి షరతులు ప్రష్యాకి చాలా భారప్రాయమయ్యాయి, అది తన భూప్రాంతంలో గణనీయమైన భాగాన్ని పోగొట్టుకుంది రష్యాకి భూప్రాంతాలేవీ నష్టం కాలేదు కాని, యూరప్‌లో ఫ్రాన్సు బలవత్తర స్థానాన్ని అది గుర్తించాల్సి వచ్చింది, పైగా ఇంగ్లండు పై యూరప్ ఖండపు దిగ్బంధం అనబడే దానిలో పాల్గొనాల్సి వచ్చింది. మొదటి నెపోలియన్ చేత ఆదేశింపబడిన యీ కొల్లగొట్టే టిల్సిట్ శాంతి సంధి, జర్మనీ జనాభాలో విపరీతమైన అసంతృప్తిని రేకెత్తించి, తద్వారా నెపోలియన్ పెత్తనానికి

వ్యతిరేకంగా 1813లో ప్రారంభమైన విముక్తి ఉద్యమానికి భూమికను తయారు చేసింది. – 48, 143.

31 ట్యుటాన్లు – పురాతన తెగలు, ఇవి జర్మన్ కుదురు నుంచి వచ్చినట్లు తలచబడుతోంది. సాధారణంగా జర్మన్లకు ఈ పేరు ఒక్కొక్క సారి వాడబడుతూ వుంటుంది. జర్మన్ జాతీయవాదులు యీ పదాన్ని వాడటం పట్ల మార్క్సు యీ సందర్భంగా వ్యంగ్యాన్ని స్ఫురింపచేశాడు. – 48.

32 1865 అక్టోబరులో బియ్యారిట్స్‌లో జరిగిన సమావేశంలో, మూడవ నెపోలియన్ చేత బిస్మార్కు ప్రష్యా ఇటలీల మధ్య పొత్తుకీ, ప్రష్యా చేత ఆస్ట్రియాకు వ్యతిరేకంగా యుద్ధానికీ అంగీకరింపచేశాడు; దీనికి అంగీకరించడంలో, ప్రష్యా ఓడి పోయే పక్షంలో, యీ సంఘర్షణలో తనకు లాభసాటిగా తను జోక్యం చేసుకోవచ్చునని మూడవ నెపోలియన్ ఆశించాడు.

1870–71 నాటి ఫ్రెంచి ప్రష్యన్ యుద్ధారంభంలో, బెర్లిన్‌లో బిస్మార్కుతో తను జరిపిన సంప్రతింపుల క్రమంలో జారిస్టు విదేశాంగ మంత్రి గోర్చకోవ్, యుద్ధంలో ప్రష్యాకి అనుకూలంగా రష్యా తాటస్థ్యం వహిస్తుందనీ, ఆస్ట్రియాపై దౌత్యపరమైన ఒత్తిడి చేస్తుందనీ ప్రకటించాడు; పోతే తనకు సంబంధించినంతవరకు, తూర్పు దేశాల్లో జారిస్టు రష్యా అవలంబించే విధానానికి అవరోధం కలిగించనని ప్రష్యన్ ప్రభుత్వం హామీ యిచ్చింది. – 49.

33 ఉత్తర జర్మన్ యూనియన్ – ఆస్ట్రియా ప్రష్యా యుద్ధంలో తన విజయానంతరం (11వ వివరణ చూడండి), 1867లో, ప్రష్యా అధినాయకత్వాన నెలకొల్పబడిన ఫెడరల్ జర్మన్ రాజ్యం. దానిలో 19 జర్మన్ రాజ్యాలూ, మూడు స్వేచ్ఛా నగరాలూ (లాంఛనప్రాయంగా స్వయంపాలనాధికారం కలవిగా గుర్తింపబడినవి) ఉన్నాయి. దాని నిర్మాణం ప్రష్యాకు ప్రముఖ స్థానాన్ని నికరం చేసింది: ప్రష్యన్ రాజు యూనియన్‌కు అధ్యక్షుడుగాను, ఫెడరల్ సాయుధ బలగాల కమాండర్-ఇన్-చీఫ్‌గాను ప్రకటింపబడ్డాడు. విదేశాంగ విధాన నిర్దేశకత్వాన్ని కూడా అతనే వహించాడు. సార్వజనిక ఓటింగు ద్వారా ఎన్నుకోబడిన ఫెడరల్ రైహ్‌స్టాగ్ శాసనాధికారాలు విశేషంగా కుంచింపబడ్డాయి: అది ఆమోదించిన చట్టాలు అభివృద్ధి నిరోధక ఫెడరల్ కౌన్సిలు ఆమోదించిన తర్వాత, అధ్యక్షుని ధృవీకరణ తర్వాత మాత్రమే అమల్లోకి వచ్చాయి. ఇంతకు ముందు దాని బయట వున్న బవేరియా, బాడెన్, వూర్టెంబెర్గ్, హెస్సెన్-డార్మ్‌ష్టాడ్‌లు 1870లో యూని

యన్‌లో సంలీనం చెయ్యబడ్డాయి జర్మన్ సామ్రాజ్యం ఏర్పాటుతో 1871 జనవరిలో అది రద్దు చెయ్యబడింది. —49.

34 నెపోలియన్ పాలన కూలిపోయిన తర్వాత జర్మనీలో ఫ్యూడల్ అభివృద్ధి నిరోధక శక్తులు సాధించిన విజయానికి ప్రస్తావన యిది.

మొదటి నెపోలియన్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన విముక్తి యుద్ధంలో తదితర యూరపియన్ జాతులతో బాటు జర్మన్ ప్రజల్లోని విస్తృత విభాగాలు పాల్గొన్నాయి ఆ యుద్ధ ఫలితాలు, అభివృద్ధి నిరోధక ప్రభువర్గంపై ఆధార పడిన యూరప్‌లోని ఫ్యూడల్ నిరంకుశ రాజ్యాల పాలకులచేత వినియోగించుకో బడ్డాయి. ఆస్ట్రియా, ప్రష్యా, జారిస్టు రష్యాలు కేంద్రకంగా కలిగిన హోలీ అలయన్స్ అనబడే విప్లవ ప్రతిఘాత రాజ్యాధిపతుల కూటమి యూరపియన్ జాతుల భవితవ్యాలను పాలించ సాగింది జర్మనీలో ఫ్యూడల్ విచ్ఛిత్తి అలాగే మిగి లింది, జర్మన్ రాజ్యాల్లో ఫ్యూడల్ నిరంకుశ వ్యవస్థ స్థిరపరచబడింది, ప్రభు వర్గ ప్రత్యేక సౌకర్యాలన్నీ అలాగే అట్టేపెట్టబడ్డాయి, రైతులపై అర్ధ ఫ్యూడల్ దోపిడీ మరింత ఉధృతం చెయ్యబడింది. —50

35 మూడవ నెపోలియన్ నివాసమైన పారిస్‌లోని తుయిలెరీ రాజభవనానికి ప్రస్తా వన యిది. —50.

36 1870 సెప్టెంబరు 4న నెలకొల్పబడిన ఫ్రెంచి రిపబ్లిక్‌ను గుర్తించాలనీ దానికి దౌత్యపరమైన తోడ్పాటు నివ్వాలనీ ఇంగ్లీషు కార్మికులు జరిపిన ఉద్యమా నికిది ప్రస్తావన. లండన్, బర్మింగ్‌హాం, న్యూకాస్ల్‌లలోనూ, తదితర నగరాల్లోనూ సెప్టెంబరు 5 నుండి బహిరంగసభలూ, ప్రదర్శనలూ జరిగాయి, వీటిలో ట్రేడ్ యూనియన్లు ప్రముఖ పాత్ర వహించాయి. బహిరంగ సభలలోనూ, ప్రదర్శన లలోనూ పాల్గొన్నవాళ్ళు ఫ్రెంచి ప్రజలపట్ల సానుభూతిని ప్రకటించి, ఫ్రెంచి రిపబ్లిక్‌ను ఇంగ్లీషు ప్రభుత్వం వెంటనే గుర్తించాలని తమ తీర్మానాలలోనూ అర్జీలలోనూ డిమాండు చేశారు.

ఈ ఉద్యమాన్ని సంఘటితపరచడంలో ఇంటర్నేషనల్ జనరల్ కౌన్సిల్ ప్రత్యక్ష పాత్ర వహించింది. — 51.

37 ఉత్తరాది పారిశ్రామిక రాష్ట్రాలకూ దక్షిణాదికి చెందిన తిరుగుబాటు చేసిన బానిస యాజమాన్య రాష్ట్రాలకూ మధ్య జరిగిన <u>అమెరికా అంతర్యుద్ధం</u> (1861–65)కు ప్రస్తావన యిది. ఇంగ్లీషు పాలకవర్గాలు బానిస యజమానులైన ప్లాంటర్లకు తోడ్పాటునిచ్చాయి, వాళ్ల పక్షాన పోరాడాలని సంకల్పించాయి. అయితే, ఇంగ్లీషు

కార్మికవర్గం ఇంగ్లీషు బూర్జువావర్గ విధానాన్ని వ్యతిరేకించింది, అమెరికాలోని యుద్ధంలో తమ దేశపు సాయుధ జోక్యాన్ని నివారించింది. – 52, 142,

38 "Journal Officiel," "Journal Officiel de la République Française" ("ఫ్రెంచి రిపబ్లిక్‌యొక్క అధికారిక పత్రిక") కిది కుప్తీకరణ. 1871 మార్చి 20 నుండి మే 24 దాకా పారిస్ కమ్యూన్ అధికారిక పత్రికగా యిది ప్రచురింపబడింది. ఈ పత్రిక ఫ్రెంచి రిపబ్లిక్ ప్రభుత్వపు అధికారిక పత్రిక అనే పేరును నిలుపుకొని, 1870 సెప్టెంబరు 5 నుండి పారిస్‌లో ప్రచురింపబడింది (పారిస్ కమ్యూన్ కాలంలో, త్యేర్ ప్రభుత్వ వార్తా పత్రిక ఒకటి, యిదే పేరుతో వెర్సేల్స్‌లో ప్రచురింపబడింది). మార్చి 30వ తేదీ సంచిక, "Journal Officiel de la Commune de Paris" ("పారిస్ కమ్యూన్ అధికారిక పత్రిక") పేర వెలువడింది. – 55, 163, 213.

39 1871 జనవరి 28న, బిస్మార్కూ, జాతీయ రక్షణ ప్రభుత్వ ప్రతినిధి అయిన ఫావ్ర్ యుద్ధ విరమణకు, పారిస్ లొంగుబాటుకు సంబంధించిన ఒక కన్వెన్షనుపైన సంతకాలు చేశారు. ఫ్రాన్సు జాతీయ ప్రయోజనాలకు ద్రోహం చేసే అప్రతిష్ఠాకరమైన ఒప్పంద మిది. ఈ కన్వెన్షనుపై సంతకం పెట్టినప్పుడు, ప్రష్యన్లు పెట్టిన అవమానకరమైన షరతులను ఫావ్ర్ ఆమోదించాడు. పక్షం రోజుల్లోగా 20 కోట్ల ఫ్రాంకుల నష్టపరిహారం చెల్లించాలి, పారిస్ దుర్గాల్లో ఎక్కువ భాగం ప్రష్యన్లకు కట్టబెట్టాలి, పారిస్ సైన్యానికి చెందిన ఫిరంగి శకటాలనూ, మందుగుండు సామగ్రీ అప్పగించాలి.

Capitulards (లొంగుబాటుదారులు) – 1870–71 ముట్టడి కాలంలో పారిస్ లొంగుబాటుకు అనుకూల్యం చూపిన వారికివ్వబడిన తృణీకార పూర్వకమైన పేరు. దరిమిలా యీ పదం అన్ని రకాల లొంగుబాటుదార్లను వర్ణించడానికి ఫ్రెంచి భాషలో వాడుకుంటున్నారు. – 55, 116, 221.

40 "L'Étendard" ("పతాకం") – ఈ ఫ్రెంచి బోనపార్టిస్టు పత్రిక పారిస్‌లో 1866 నుండి 1868 దాకా ప్రచురింపబడింది. దానికి ఆర్థిక వనరులను కల్పించేందుకు గాను అవలంబింపబడిన దగాకోరు పనులు బయటపడినమీదట అది మూసివెయ్యబడింది. – 56, 163.

41 Société Générale du Crédit Mobilier – 1852లో నెలకొల్పబడిన ఒక పెద్ద ఫ్రెంచి బ్యాంకు. అదే స్థాపించిన జాయింట్ స్టాక్ కంపెనీలు జారీచేసిన సెక్యూరిటీలలో చట్టా వ్యాపారం ద్వారానే ప్రధానంగా దాని లాభాలు వచ్చేవి.

Crédit Mobilierకి రెండవ సామ్రాజ్యపు ప్రభుత్వ వర్గాలతో సన్నిహిత సంబంధాలుండేవి. అది 1867లో దివాళాతీసి, 1871లో మూసివెయ్యబడింది. "The New-York Daily Tribune"లో ప్రచురింపబడిన తన వ్యాసాలనేకం ద్వారా, మార్క్స్, Crédit Mobilier నిజ స్వభావాన్ని బహిర్గతం చేశాడు. – 57, 118, 187, 214.

42 "L'Électeur libre" ("స్వేచ్ఛాయుతమైన ఓటరు") – ఒక వారపత్రిక (ఫ్రెంచి-ప్రష్యన్ యుద్ధం నాటి నుండి ఒక దినపత్రిక), మితవాద రిపబ్లికన్ల పత్రిక, పారిస్‌లో 1868 నుండి 1871 వరకు ప్రచురింపబడింది; 1870–71ల్లోను జాతీయ రక్షణ ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వ శాఖతో యిది సంబంధం కలిగివుంది. – 57, 118, 215.

43 1831 ఫిబ్రవరి 14, 15 తేదీల్లో పారిస్‌లో జరిగిన లెజిటిమిస్టు వ్యతిరేక, క్లెరికల్ (మత) వ్యతిరేక కార్యాచరణలకు ప్రస్తావన యిది. రాష్ట్రాల్లో కూడా ఈ కార్యాచరణలు ప్రతిధ్వనించాయి. డ్యూక్ డి బెర్రీ అంత్యక్రియల సందర్భంగా జరిగిన లెజిటిమిస్టు (9వ వివరణ చూడండి) ప్రదర్శనకు నిరసనగా జనసమూహం సెయింట్ జెర్మేన్ లఆక్సెరోయ్ చర్చినీ, లెజిటిమిస్టు అభిమానిగా పేరుపడిన ఆర్చిబిషప్ క్వేలెన్ భవనాన్నీ నాశనం చేసింది. తనకు ప్రతికూల లెజిటిమిస్టు పార్టీని దెబ్బతియ్యాలని కృషిచేస్తున్న ఆర్లియనిస్టు ప్రభుత్వం జనసమూహాన్ని ఆపేందుకు ఏమీ చెయ్యలేదు; చర్చిపైనా, ఆర్చిబిషప్ భవనంపైనా దాడి జరిగి నప్పుడు అక్కడే వున్న త్యేర్, జనసమూహాన్ని ఆటంకపరచవద్దని నేషనల్ గార్డులకి విజ్ఞప్తి చేశాడు.

1832లో, ఆనాటి హోమ్‌మంత్రి అయిన త్యేర్ ఆజ్ఞ మేరకు, ఫ్రెంచి సింహాసనానికి వారసుడిని తనేనని చెప్పుకొనే లెజిటిమిస్టు కౌంట్ షంబోర్ తల్లి డచెస్ డి బెర్రీ అరెస్టు చెయ్యబడి, అవమానకరమైన వైద్య పరీక్షకు గురిచెయ్య బడింది. అలా చెయ్యడంలో ఉద్దేశం ఆమె గుప్త వివాహం సంగతిని బహిర్గతం చెయ్యడం, రాజకీయంగా ఆమె పరువు తియ్యడమే. – 58.

44 జూలై రాజరిక పాలనకు వ్యతిరేకంగా 1834 ఏప్రిల్ 13–14 తేదీల్లో, రహస్య రిపబ్లికన్ సంస్థ అయిన "మానవ హక్కుల సొసైటీ" (Société des droits de l'homme) నాయకత్వం క్రింద పారిస్‌లో జరిగిన ప్రజా తిరుగుబాటును అణచివెయ్యడంలో (అప్పట్లో హోంమంత్రి అయిన) త్యేర్ దగుల్బాజీ పాత్రకు ప్రస్తావన యిది. ఈ తిరుగుబాటును అణచివేసే క్రమంలో సైన్యం అనేక ఘాతుకాలు జరిపింది, ట్రాన్స్‌నొనెన్ రోడ్డులోని ఒక యింట్లో నివసిస్తున్న వాళ్ల ఊచకోత అటువంటి వాటిలో ఒకటి. ఆ తిరుగుబాటు కాలంలోనూ, ఆ

తర్వాతా డెమోక్రట్లకు వ్యతిరేకంగా కఠినమైన ప్రతీకార చర్యల వెనకనున్న మూలవిరాట్టు త్యేరే.

<u>సెప్టెంబరు చట్టాలు</u> – ఫ్రెంచి ప్రభుత్వం 1835 సెప్టెంబరులో జారీచేసిన అభివృద్ధి నిరోధక చట్టాలు. జూరీ పద్ధతి విచారణకు అవి పరిమితులు విధించాయి. పెద్ద మొత్తాల్లో ధరావతులు కట్టాలనడంతోబాటు పత్రికలపై కఠినమైన నిర్బంధాలు ప్రవేశపెట్టాయి. ఆస్తికీ, అమల్లో వున్న రాజ్య వ్యవస్థకీ వ్యతిరేకతపై జైలు శిక్షలమా, పెద్దపెద్ద జరిమానాలమా విధించాయి. –58, 127, 137, 217.

45 1841 జనవరిలో, త్యేర్ ప్రతినిధుల సభలో పారిస్ చుట్టూ దుర్గనిర్మాణం జరపాలన్న పథకాన్ని ప్రతిపాదించాడు. నగర రక్షణను పటిష్ఠం చేసేందుకేనని వర్ణింపబడినా, యీ ప్రతిపాదన ప్రజా ఉద్యమమేదైనా వస్తే దాన్ని అణచడానికి సన్నాహంగానే ఉద్దేశింపబడిందని విప్లవ ప్రజాతంత్ర శక్తులు భావించాయి. సరిగా ఆ ఉద్దేశంతోనే కార్మికవర్గ పేటల దగ్గర పారిస్‌కి తూర్పునా, ఈశాన్య దిక్కునా ప్రత్యేకించి బలిష్ఠమైన పలు దుర్గాల నిర్మాణం సంకల్పింపబడిందన్న విషయం పరిగణనలోకి తీసుకోబడింది. – 58.

46 1848 జనవరిలో, నేపుల్సు రాజా రెండవ ఫెర్డినాండ్ (అదే సంవత్సరం ఆకురాలు కాలంలో మెస్సీనాపై తను చేసిన ఆటవిక బొంబార్డుమెంటు కారణంగా దరిమిలా "బాంబు రాజా" అన్న వ్యంగ్య నామం సంపాదించుకున్న రెండవ ఫెర్డినాండ్) సేనలు, 1848–49 సంవత్సరాల్లో ఇటాలియన్ రాజ్యాల్లో బూర్జువా విప్లవాన్ని జ్వలింపచేసిన ప్రజా తిరుగుబాటును అణచి వేసేందుకుగాను పాలెర్మోపై ఫిరంగి గుళ్ల వర్షం కురిపించాయి. – 58, 138, 229.

47 1849 ఏప్రిల్‌లో ఆస్ట్రియా, నేపుల్సులతో కలిసి, ఫ్రెంచి బూర్జువా ప్రభుత్వం, రోమన్ రిపబ్లిక్‌కు వ్యతిరేకంగా జోక్యంచేసుకుంది. రోమన్ రిపబ్లిక్‌ను అణచి వెయ్యడం, పోపు లౌకికాధికారాన్ని పునస్థాపించడమే యీ దాడి ఉద్దేశం. సాయుధ జోక్యం, రోమ్ ముట్టడి, ఫ్రెంచి సేనలచేత రోమ్‌పై భయంకరమైన బొంబార్డుమెంటు – వీటి ఫలితంగా, వీరోచితమైన ప్రతిఘటన సాగించినప్పటికీ, రోమన్ రిపబ్లిక్ కూలిపోయింది. ఫ్రెంచి సేనలు రోమ్‌ను ఆక్రమించుకున్నాయి. – 59, 71, 219, 229.

48 <u>పార్టీ ఆఫ్ ఆర్డర్</u> – బడా మితవాద బూర్జువావర్గ పార్టీ. ఫ్రాన్సులోని రెండు రాజరిక బృందాలు – లెజిటిమిస్టులు, ఆర్లియనిస్టుల (9వ వివరణ చూడండి) కలయిక ఫలితంగా యిది 1848లో ఆవిర్భవించింది. 1849 నుండి 1851

డిసెంబరు 2న జరిగిన రాజకీయ కుట్ర దాకా, రెండవ సామ్రాజ్యపు శాసనసభలో నాయకత్వ స్థానంలో ఉంది. పార్టీ ఆఫ్ ఆర్డర్ అనుసరించే ప్రజావ్యతిరేక విధాన వైఫల్యాన్ని, లూయీ బోనపార్ట్ ముఠా రెండవ సామ్రాజ్య పాలనను నెలకొల్పడానికి వినియోగించుకుంది. – 60, 106, 235.

49 1840 జూలై 15న బ్రిటన్, రష్యా, ప్రష్యా, ఆస్ట్రియా, టర్కీలు ఫ్రాన్సును మినహాయించి, ఫ్రాన్సు బలపరచే ఈజిప్టు పాలకుడు మహమ్మద్ అలీకి వ్యతిరేకంగా టర్కిష్ సుల్తానుకి సహాయం చేసే ఒక కన్వెన్షను (ఒడంబడిక) పై లండన్‌లో సంతకాలు పెట్టాయి. దీని మూలంగా ఫ్రాన్సుకీ యూరపియన్ రాజ్య కలయికకూ మధ్య యుద్ధప్రమాదం ఏర్పడింది కాని, లూయీ ఫిలిప్ రాజు యుద్ధం చేసే సాహసానికి పూనుకోక మహమ్మద్ అలీకి సహాయాన్ని విరమించుకున్నాడు. – 61.

50 "Chambre introuvable" ("అపూర్వమైన సభ") –1815–16లో (బూర్బన్ పునరుద్ధరణ తొలి సంవత్సరాలు) ప్రతినిధుల సభ, అత్యంత అభివృద్ధి విరోధకులతో యిది నిండివుంది. – 63, 89, 164, 222.

51 "భూస్వాముల సభ" ("రూరల్స్ అసెంబ్లీ") – 1871 నాటి జాతీయ అసెంబ్లీ కిది వ్యంగ్యనామం. దీనిలో ఎక్కువభాగం గ్రామీణ నియోజక వర్గాల నుంచి ఎన్నుకోబడిన రాష్ట్రీయ భూస్వాములు, పౌర ఉద్యోగులు, కూపస్ క్లినర్లు, వ్యాపారస్తులవంటి అభివృద్ధి నిరోధక రాజరికవాదులున్నారు. –63.

52 1871 మార్చి 10న, బకాయిపడిన బిల్లులపై జాతీయ అసెంబ్లీ ఒక చట్టాన్ని ఆమోదించింది. దాని మేరకు రుణం తీసుకున్న నాటి నుండి ఏడు నెలల వ్యవధి ఇవ్వబడింది. 1870 ఆగస్టు 13 నుంచి నవంబరు 12 వరకు చెయ్యబడిన రుణాల చెల్లింపులకు యిది వర్తిస్తుంది. నవంబరు 12 దరిమిలా చెయ్యబడిన రుణాలకు యిది వర్తించదు. దీని అర్థం, అధిక సంఖ్యాక రుణగ్రస్తులకు యీ చట్టం దాదాపుగా వాయిదా ఏమీ యివ్వలేదు. కార్మికవర్గానికీ, జనాభాలోని ధనహీన విభాగాలకూ యిది పెద్ద దెబ్బ అన్నమాట. పలువురు చిన్న పరిశ్రమదారుల, వ్యాపారుల దివాళాకు కూడా యిది కారణమైంది. – 64.

53 డిసెంబ్రిసూర్ (décembriseur) – 1851 డిసెంబరు 2 నాటి బోనపార్టిస్టు రాజకీయ కుట్రలో పాల్గొన్నవాడు, కుట్ర ధోరణి కార్యాచరణను బలపరచిన వాడు. ఈ కుట్రతో వినువాకి ప్రత్యక్ష సంబంధముంది, ఫ్రాన్సులోని ఒక డిపార్టుమెంటులో రిపబ్లికన్ తిరుగుబాటు ప్రారంభించేందుకు జరిగిన ప్రయత్నాలను అణచివేసేందుకు అతను సేనలను పంపాడు. – 65, 120, 223.

54 త్యేర్ ప్రభుత్వం సేకరించ తలపెట్టిన అంతరంగిక రుణంలోంచి, స్వయంగా త్యేర్‌కీ, యితర మంత్రులకీ "కమిషన్" రూపంలో 30 కోట్ల ఫ్రాంకులకుపైగా ముట్టబోతున్నట్లు పత్రికా వార్తలు వెల్లడించాయి. ఈ రుణం విషయంలో సంప్రతింపులు జరుపుతున్న ఆర్థికవర్గాలు పారిస్‌లో విప్లవాన్ని త్వరితంగా అణచి వెయ్యాలని డిమాండు చేస్తున్నట్లు త్యేర్ తర్వాత అంగీకరించాడు. వెర్సైల్స్ సేనలు పారిస్ కమ్యూన్‌ని అణచివేసిన తర్వాత 1870 జూన్ 20న యీ రుణానికి సంబంధించిన చట్టం ఆమోదింపబడింది. – 65.

55 కయ్యేన – ఫ్రెంచి గయానా (దక్షిణ అమెరికా)లోని ఒక పట్టణం, రాజకీయ ఖైదీలనూ, దేశబహిష్కృతులనూ ఉంచే స్థలం. – 67.

56 "Le National" ("జాతీయ పత్రిక") – 1830 నుండి 1851 వరకు పారిస్‌లో ప్రచురింపబడిన ఒక ఫ్రెంచి దినపత్రిక, మోడరేట్ బూర్జువా రిపబ్లికన్ల అధికార పత్రిక. – 69, 112, 125, 226.

57 1848 ఫిబ్రవరి 22–24 తేదీల మధ్య పారిస్‌లో జరిగిన తిరుగుబాటుకు ప్రస్తావన యిది. లూయీ ఫిలిప్ జూలై రాజరిక పాలనను యిది కూలద్రోసి, ఫ్రాన్సులో రెండవ రిపబ్లిక్‌ను ప్రారంభించింది. – 69, 76.

58 1870 అక్టోబరు 31న, మెట్స్ వద్ద లొంగుబాటుకు, లెబుర్జే వద్ద పరాజయానికి, జాతీయ రక్షణ ప్రభుత్వం తరఫున ప్రష్యన్లతో త్యేర్ ప్రారంభించిన సంప్రదింపులకు సంబంధించిన వార్తలు వెలువడిన మీదట, పారిస్ కార్మికులూ, నేషనల్ గార్డులోని విప్లవాత్మక విభాగమూ ఒక తిరుగుబాటును లేవదీసి నగర పాలక కార్యాలయంలో పట్టుకున్నారు, బ్లాంకీ నాయకత్వాన ప్రజా భద్రతా కమిటీ అనే విప్లవాధికార సాధనాన్నొకదాన్ని నెలకొల్పారు. కార్మికుల నుండి ఒత్తిడి కారణంగా, జాతీయ రక్షణ ప్రభుత్వం రాజీనామా చేస్తాననీ, కమ్యూన్‌కి నవంబరు 1న ఎన్నికలు నిర్వహిస్తాననీ వాగ్దానం చెయ్యాల్సి వచ్చింది. కానైతే, పారిస్‌లోని విప్లవ శక్తుల ఒదులొదులు నిర్మాణమూ, తిరుగుబాటును నడిపిన బ్లాంకీస్టులకూ పెటీబూర్జువా జాకొబిన్ డెమోక్రట్లకూ మధ్య విభేదాలూ – వీటి ఫలితంగా, రాజీనామా చేస్తానన్న తన వాగ్దానాన్ని ప్రభుత్వం భగ్నంచేసి, నేషనల్ గార్డుకు చెందిన విధేయ దళాలను నగర పాలక కార్యాలయంపైకి ఎగతోలి తన అధికారాన్ని పునరుద్ధరించుకుంది. – 69.

59 బ్రెటన్లు – బ్రెటన్ మొబైల్ గార్డు (హోమ్ గార్డు) – పారిస్‌లోని విప్లవోద్యమాన్ని అణచివేసేందుకు ట్రొషూ దీన్ని సాయుధ పోలీసు దళంగా ఉపయోగించాడు.

కార్సికన్లు — రెండవ సామ్రాజ్యం క్రింద సాయుధ పోలీసు దళంలో వీళ్లే ఎక్కువ. — 69, 126, 210.

60 1871 జనవరి 22న, బ్లాంకిస్టులు, పారిస్ శ్రామికవర్గంచేతా, నేషనల్ గార్డుచేతా విప్లవ కార్యాచరణ ప్రారంభింపచేశారు. జాతీయ రక్షణ ప్రభుత్వాన్ని పడగొట్టాలనీ, కమ్యూన్‌ని నెలకొల్పాలనీ డిమాండు చేస్తూ, వాళ్ళు ప్రదర్శన జరిపారు. జాతీయ రక్షణ ప్రభుత్వ ఆజ్ఞల మేరకు, నగర పాలక కార్యాలయానికి కాపలాగా వున్న బ్రెటన్ మొబైల్ గార్డు ప్రదర్శకులంపైన కాల్పులు జరిపింది. ప్రదర్శనలో పాల్గొన్నవారు అరెస్టు చెయ్యబడ్డారు, పారిస్‌లోని క్లబ్బులన్నీ మూసివెయ్యబడ్డాయి, బహిరంగసభలు నిషేధింపబడ్డాయి, పలు వార్తాపత్రికలు నిషేధింపబడ్డాయి. విప్లవోద్యమం దౌర్జన్యకాండ ద్వారా ఎప్పుడైతే అణచివెయ్యబడిందో, ప్రభుత్వం అప్పుడిక పారిస్ లొంగుబాటుకు సన్నాహాలు సాగించింది. — 70.

61 sommations — చెదిరిపొమ్మని ఆజ్ఞ. ప్రదర్శనలనూ, సభలనూ, సమావేశాలనూ చెదరగొట్టేందుకు అధికారులు వాడే హెచ్చరిక. 1715 నాటి ఇంగ్లీషు చట్టాన్ని పోలిన 1831 నాటి ఫ్రెంచి చట్టమిది. దాని ప్రకారం, ఆ ఆజ్ఞ మూడుమార్లు పునరుచ్ఛరింపబడినా చెదిరిపోవ నిరాకరించినట్లయితే, ఆ గుంపును చెదరగొట్టేందుకు బలప్రయోగం చేసే హక్కు అధికారులకు దఖలు పడుతుంది. — 71, 207.

62 అక్టోబరు 31 నాటి ఘటనం సందర్భంగా (58వ వివరణ చూడండి), జాతీయ రక్షణ ప్రభుత్వ సభ్యులు నగర పాలక కార్యాలయంలో నిర్బంధింపబడినప్పుడు, వాళ్లను కాల్చెయ్యాలని తిరుగుబాటుదార్లలో ఒకరు డిమాండు చేసినప్పుడు, వాళ్లను కాల్చెయ్యకుండా ఫ్లొరెన్సు నివారించాడు. — 73, 127.

63 వోల్టేర్ "కాండిడ్," 22వ ప్రకరణం. — 73.

64 ఇక్కడ ప్రస్తావించబడిన హామీ బందీలపై ఉత్తరువు కమ్యూన్‌చేత 1871 ఏప్రిల్ 5న ఆమోదింపబడింది (అలా ఆమోదింపబడిన తేదీని మార్క్సు ఇంగ్లీషు పత్రికా వార్తలననుసరించి యిచ్చాడు). ఈ ఉత్తరువు మేరకు, వెర్సేల్స్‌తో సంబంధాలు కొనసాగిస్తున్నారని ఆరోపింపబడిన వ్యక్తులందరూ, ఆ ఆరోపణలు నిజమని రుజువైనట్లయితే, హామీ బందీలుగా ప్రకటింపబడతారు. దీనిద్వారా, వెర్సేల్స్ వాళ్లు కమ్యూనార్డులను కాల్చివెయ్యకుండా నివారించేందుకు కమ్యూన్ ప్రయత్నించింది. — 73.

65 "The Times" – 1785 నుండి లండన్‌లో ప్రచురింపబడుతున్న ప్రముఖ కన్సర్వేటివ్ వార్తాపత్రిక. – 74, 157, 287, 319.

66 investiture – మధ్యయుగాల్లో ఫ్యూడల్ ప్రభువు తన దానునికి భూమిని బదలాయించడం, లేక మతాధికారి నియామకం క్రమానుగత అధికార నిచ్చెనలో అధికులపై పూర్తిగా ఆధారపడిన వ్యక్తులను నియమించే పద్ధతిని తెలియజేసే పదం. – 81.

67 జిరోండిస్టులు – 18వ శతాబ్దాంతంలో జరిగిన ఫ్రెంచి బూర్జువా విప్లవంలో, బడా వాణిజ్య పారిశ్రామిక బూర్జువావర్గానికీ, విప్లవ సంవత్సరాల్లో పైకొచ్చిన భూస్వామ్య బూర్జువావర్గానికీ చెందిన పార్టీ యిది. జిరోండ రాష్ట్రం నుంచి దీనికీ పేరు వచ్చింది. శాసన సభలోనూ, కాన్వెంటులోనూ యీ పార్టీకి చెందిన పలువురు నాయకులు దీనికి ప్రాతినిధ్యం వహించారు. జిరోండిస్టులు జాకొబిన్ ప్రభుత్వాన్నీ, దానికి మద్దతు నిచ్చిన విప్లవ ప్రజానీకాన్నీ వ్యతిరేకించారు, రాష్ట్రాలకు స్వయం ప్రతిపత్తినీ, సమాఖ్యనూ కోరారు. – 81.

68 "Kladderadatsch" – 1848 నుండి బెర్లిన్‌లో ప్రచురింపబడిన సచిత్ర వ్యంగ్య వారపత్రిక.

"Punch" – "Punch, or the London Charivari"కి సంగ్రహ నామం. 1841 నుండి లండన్‌లో ప్రచురింపబడే ఇంగ్లీషు బూర్జువా లిబరల్ హాస్య వార్తాపత్రిక. – 82.

69 అన్ని ప్రామిసరీ నోట్లపైనా మూడేళ్ల వాయిదా ప్రకటిస్తూనూ, వాటిపై వడ్డీని రద్దుచేస్తూనూ 1871 ఏప్రిల్ 16న పారిస్ కమ్యూన్ జారీచేసిన శాసనానికి ప్రస్తావన యిది. – 85.

70 1848 విప్లవం కారణంగా ఏర్పడిన మాంద్యం మూలంగా తాము దివాలా తీశామని రుజువుచెయ్యగలిగిన రుణగ్రస్తులకు వాయిదా సౌకర్యం కల్పించే (concordats à l'amiable)ను 1848 ఆగస్టు 22న రాజ్యాంగసభ తిరస్కరించింది. దానికిది ప్రస్తావన. పెటీబూర్జువా వర్గంలోని ఓ పెద్ద విభాగం నాశనానికిది దారితీసి, బడా బూర్జువా రుణదాతల పిడికిళ్లలోకి వాళ్లని నెట్టింది. – 85,186.

71 frères ignorantins ("అజ్ఞాన సోదరులు") – 1680లో రైమ్స్‌లో ఏర్పడిన ఒకానొక మత శాఖ. దీని సభ్యులు పేదల బిడ్డలకు విద్యగరపడానికై తమ జీవితాలను అంకితం చేశారు. వాళ్ల స్కూళ్లలో శిక్షణ ప్రధానంగా మత

పరమైనదిగా ఉండేది, మిగిలిన పాఠ్యాంశాల్లో జ్ఞానం అతిస్వల్పంగా ఉండేది. బూర్జువా ఫ్రాన్సులో ప్రాథమిక విద్యయొక్క హీన స్థాయినీ, మత స్వభావాన్నీ సూచించేందుకు మార్క్సు యీ పదాన్ని వాడాడు. – 85.

72 రాష్ట్రాల రిపబ్లికన్ యూనియన్ (Alliance republicaine des Départements) – ఫ్రాన్సులో వివిధ రాష్ట్రాల నుండి వచ్చి పారిస్‌లో నివసిస్తున్న పెటీబూర్జువా విభాగాల ప్రతినిధులతో కూడిన ఒక రాజకీయ సంస్థ యిది. ఇది పారిస్ కమ్యూన్ పక్షం వహించింది, వెర్సేల్స్ ప్రభుత్వానికీ, రాజరిక జాతీయ అసెంబ్లీకీ వ్యతిరేకంగా పోరాటానికి పిలుపిచ్చింది, అన్ని రాష్ట్రాలలోనూ కమ్యూన్‌కి తోడ్పాటివ్వ వలసిందిగా విజ్ఞప్తి చేసింది. – 85.

73 ఫ్రెంచి బూర్జువా విప్లవ కాలంలో మాజీ ప్రవాసుల నుండి జప్తుచెయ్యబడిన భూస్వాముల ఎస్టేట్లకు నష్టపరిహారం చెల్లించడానికి అధికారం కల్పిస్తూ 1825 ఏప్రిల్ 27న అభివృద్ధి నిరోధక పదవ ఛార్లెస్ ప్రభుత్వం చేసిన శాసనానికి ప్రస్తావన యిది. ఈ సొమ్ములో ఎక్కువ భాగం అత్యున్నత రాజాస్థానికులకు, బడా భూస్వాములకే దక్కింది. – 85, 182.

74 మొదటి నెపోలియన్ విజయాల సంస్మరణార్థం పారిస్‌లోని వెండోమ్ చౌకులో 1806–10 సంవత్సరాల్లో నిర్మింపబడిన విజయస్తంభం. పారిస్ కమ్యూన్ నిర్ణయం మేరకు అది 1871 మే 16న తొలగించబడింది. – 88.

75 పిక్‌పున్ సన్యాసినుల మఠం సోదా చేసి నన్స్ (క్రైస్తవ సన్యాసినులు) ఏళ్ల తరబడిగా నిర్బంధింపబడిన సందర్భాలనూ, హింసా సాధనాలనూ సైతం బయట పెట్టారు. సెయింట్ లారెంట్ చర్చిలో రహస్య శ్మశానస్థలి కనుగొనబడింది. ఖూనీలు జరిగినట్లు దీనివల్ల రుజువైంది. ఈ వాస్తవాలను "Mot d'Ordre" అనే వార్తాపత్రిక 1871 మే 5న వెలుగులోకి తెచ్చింది, "Les crimes des congrégations religieuses" అనే పేర వెలువడిన పుస్తకం కూడా యీ రహస్యాలను వెల్లడించింది. – 89.

76 అబ్సెంటీస్టులు ("absent" పదం నుంచి వచ్చిన పేరు) – బడా భూస్వాములు. వీళ్లు తమ ఎస్టేట్లలో నివసించరు, అవి ఏజెంట్ల ద్వారా నిర్వహింపబడతాయి. లేక మధ్య దళారీలకు కౌలు కివ్వబడతాయి, వాళ్లు సన్నకారు కౌలుదార్లకు కఠినమైన షరతులపై తిరిగి కౌలుకిస్తారు. – 90.

77 తమను తాము జాతీయ అసెంబ్లీగా ప్రకటించుకున్న మూడంతస్తుల స్టేట్స్ జనరల్ వరుసవారీ సమావేశాన్ని భగ్నంచేసేందుకు పదహారవ లూయీ ప్రభుత్వం చేసిన ప్రయత్నాన్ని నిరసించి మూడవ అంతస్తు (బూర్జువావర్గం)కి చెందిన ప్రతినిధులు 1789 జూన్ 20న, వెర్సేల్స్‌లోని జె డి పోమ్ హాలులో సమావేశమైన, రాజ్యాంగం రూపొందింపబడే దాకా వెళ్లిపోరాదని ప్రమాణం చేశారు. 18వ శతాబ్దాంతంలో ఫ్రెంచి బూర్జువా విప్లవానికి నాంది ప్రస్తావనగా తోడ్పడిన ఘటనల్లో యిదొకటి. – 91, 188.

78 francs-fileurs – పారిస్ ముట్టడి కాలంలో అక్కడి నుంచి పలాయనం చిత్తగించిన ఆ నగర బూర్జువాలకు యివ్వబడిన ఎగతాళి పేరు. ప్రష్యన్లకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో క్రియాశీల పాత్ర వహించిన ఫ్రెంచి పార్టిజాన్లు francs-fireurs అనే పదానికిది శ్లేష. – 92, 103, 141, 247.

79 కోబ్లెంజ్ – జర్మనీలో ఒక నగరం. 18వ శతాబ్దాంతంలో ఫ్రెంచి బూర్జువా విప్లవ కాలంలో ప్రభువర్గ, రాజరికవాద ప్రవాసులకిది కేంద్రం. అక్కడ విప్లవ ఫ్రాన్సుకు వ్యతిరేకంగా జోక్యానికి సన్నాహం జరుగుతూ వచ్చింది. ఒక నాటి పదహారవ లూయీ ప్రభుత్వ మంత్రి, పచ్చి అభివృద్ధి నిరోధకుడూ అయిన డికలోన్ నాయకత్వాన గల ప్రవాస ప్రభుత్వానికది కేంద్ర స్థానం. ఈ ప్రభుత్వానికి ఫ్యూడల్ నిరంకుశాధికార రాజ్యాల మద్దతు వుంది. – 93, 141, 247.

80 షువాన్లు – బ్రెటన్‌లో రిక్రూట్ చెయ్యబడిన వెర్సేల్స్ సైనిక దళానికి కమ్యూనార్డులు పెట్టిన పేరిది. ఈ దళంలోని వాళ్లు రాజరిక భావం కలిగిన వాళ్లు. 18వ శతాబ్దాంతంలో ఫ్రెంచి బూర్జువా విప్లవ కాలంలో ఆ ప్రాంతంలో విప్లవ ప్రతిఘాత తిరుగుబాటులో పాల్గొన్న వాళ్లతో కొన్ని విషయాల్లో గల పోలికను బట్టి కమ్యూనార్డులు పెట్టిన పేరిది.

పోపుకి చెందిన జువావ్‌లు – పోపు రక్షక దళం. జువావ్‌ల లాగ సంఘటితమై, శిక్షితమైన ఫ్రెంచి లైట్ ఇన్‌ఫెంట్రీ (కాల్బలం). ఫ్రెంచి ప్రభువర్గంలోని యువకులతో కూడిన దళమిది. 1870 సెప్టెంబరులో పోపు లౌకిక అధికారం రద్దుచెయ్యబడినప్పుడు, వాళ్లు ఫ్రాన్సుకు పంపబడ్డారు. వాళ్లక్కడ ఫ్రెంచి-ప్రష్యన్ యుద్ధంలో పాల్గొన్నారు. యుద్ధానంతరం యీ రెజిమెంటు పారిస్ కమ్యూన్‌ని అణచడానికి తోడ్పడింది. – 94, 134, 210, 248.

81 పారిస్ కమ్యూన్ సంస్థాపనకు దారితీసిన, మార్చి 18 నాటి పారిస్ శ్రామికవర్గ విప్లవ ప్రభావం క్రింద లియోన్, మార్సేల్స్‌లోను, తదితర ఫ్రెంచి నగరాల్లోను

విప్లవ ప్రజా కార్యాచరణ ముమ్మరం చెయ్యబడింది. మార్చి 22న లియోన్‌లోని నగర పాలక కార్యాలయాన్ని నేషనల్ గార్డులూ, శ్రమజీవులూ ఆక్రమించుకున్నారు. పారిస్ నుండి ఒక ప్రతినిధివర్గం వచ్చినమీదట, లయోన్‌లో మార్చి 26న ఒక కమ్యూన్ ప్రకటించబడింది. కానైతే ఎన్నికల సన్నాహాల కోసం ఏర్పాటు చెయ్యబడిన తాత్కాలిక కమిటీ, తనవద్ద కేవలం ఒక చిన్న సైనిక బలగమే ఉన్న కారణంగానూ, ప్రజలతోనూ, నేషనల్ గార్డుతోనూ తనకు తగినంత సంబంధం లేని కారణంగానూ తన అధికారాన్ని పరిత్యజించింది. ఏప్రిల్ 30న, లయోన్ శ్రామిక ప్రజలు కొత్తగా కార్యాచరణకు పూనుకొన్నప్పుడు, సైన్యంచేతా, పోలీసులచేతా అది క్రూరంగా అణచివెయ్యబడింది.

మార్సేల్స్‌లో తిరుగుబాటు జనం నగర పాలక కార్యాలయాన్ని ఆక్రమించుకొని, ప్రిఫెక్టును అరెస్టు చేశారు. నగరంలో ఆ రాష్ట్రానికి సంబంధించిన కమిటీ ఒకటి ఏర్పాటు చెయ్యబడింది. ఏప్రిల్ 5న కమ్యూన్ ఎన్నికలు జరగాలని నిర్ణయించబడింది. మార్సేల్స్‌లో విప్లవోద్యమాన్ని, ప్రభుత్వ సేనలు నగరంపై ఫిరంగి కాల్పులు జరిపి, ఏప్రిల్ 4న అణచివేశాయి. – 96.

82 ఈ క్రింది చట్టాలకు ప్రస్తావన యిది: (అ) “పత్రికలు చేసిన నేరాలకు గాను వాటిని ప్రాసిక్యూట్ చేసే చట్టం.” పత్రికలపై పాత అభివృద్ధి నిరోధక చట్టాల (1819, 1849)లోని అంశాలనిది తిరిగి ప్రవేశపెట్టింది; అధికారులకు వ్యతిరేకంగాను, అలాగే డిస్మిస్ చెయ్యబడిన రెండవ సామ్రాజ్యానికి చెందిన అధికారులను తిరిగి పదవిలో ప్రతిష్ఠించడానికి వ్యతిరేకంగాను ప్రచురించిన ప్రకటనలకుగాను పత్రికలను మూసివెయ్యడంతో బాటు, యీ చట్టం కఠినమైన పెనాల్టీలు విధించడానికి వీలు కల్పించింది; (ఆ) కమ్యూన్ జప్తుచేసిన ఆస్తిని తిరిగియిచ్చే క్రమానికీ, దాన్ని జప్తుచెయ్యడాన్ని క్రిమినల్ నేరంగా పరిగణించి జరిమానాలను విధించేందుకూ సంబంధించిన ప్రత్యేక చట్టం. – 97.

83 1857 నాటి మిలిటరీ కోడ్‌లోని నిబంధనలతో పోల్చినప్పుడు, కోర్టు మార్షల్ క్రమాన్ని మరింత తగ్గించే యీ చట్టాన్ని జాతీయ అసెంబ్లీలో డుఫోర్ ప్రవేశపెట్టాడు. ఏవిధమైన ప్రాథమిక విచారణా జరపకుండా, తమ చిత్తం వచ్చినట్లు, సేనాధిపతీ, యుద్ధ మంత్రీ క్రిమినల్ వ్యవహారం నడిపే హక్కుని యీ చట్టం ధ్రువీకరిస్తుంది. అటువంటి సందర్భాల్లో, అప్పీలు పరిశీలన, తీర్పు అమలులతో బాటు ఆ కేసు 48 గంటల్లోగా పరిష్కరింపబడాలి. – 97.

84 బ్రిటన్ ఫ్రాన్సుల మధ్య 1860 జనవరి 23న సంతకాలు జరిగిన వాణిజ్య ఒప్పందానికి ప్రస్తావన యిది. దీని మేరకు విదేశీ సరకుల దిగుమతిని నిరోధించే

తన టారిఫ్ విధానాన్ని ఫ్రాన్సు వదులుకొని, దాని స్థానంలో, సరకుల విలువలో 30 శాతానికి మించని సుంకాలను ప్రవేశపెట్టింది. ఫలితంగా దేశీ మార్కెట్లలో నిశితమైన పోటీ తీవ్రతరమైంది. బ్రిటన్ నుంచి వచ్చిన సరకులతో దేశీ మార్కెట్లు ముంచెత్తబడ్డాయి. దానితో ఫ్రెంచి పరిశ్రమల యజమానుల్లో అసంతృప్తి చెలరేగింది. – 98, 121.

85 క్రీస్తు పూర్వం 1వ శతాబ్దంలో బానిస యాజమాన్య వ్యవస్థ కలిగిన రోమన్ రిపబ్లిక్‌ను ఆవహించిన సంక్షోభపు వివిధ దశలలో పురాతన రోమ్‌లో సాగిన దౌర్జన్య స్వైరవిహారం, దారుణమైన పగసాధింపు చర్యలకు ప్రస్తావన యిది.

<u>సుల్లా నియంతృత్వం</u> (క్రీ॥పూ॥ 82 – 79).

<u>మొదటి, రెండవ మూర్తిత్రయం</u> (క్రీ॥పూ॥ 60 – 53, 43 – 36) – రోమన్ జనరల్సు: పాంపే, సీజర్, క్రాసస్ – మొదటి మూర్తిత్రయం; ఆక్టేవియన్, ఆంటనీ, లెపిడస్ – రెండవ మూర్తిత్రయం వివిధ దశల్లో సాగించిన నియంతృత్వం. – 101.

86 <u>“Journal de Paris”</u> (“పారిస్ పత్రిక”) – 1867 నుండి ప్రచురింపబడిన ఒక రాజరిక-ఆర్లియనిస్టు వారపత్రిక. – 102.

87 1814 ఆగస్టులో, బ్రిటన్ అమెరికాల మధ్య యుద్ధ క్రమంలో, బ్రిటిష్ సేనలు వాషింగ్టన్‌ను పట్టుకొని కాపిటల్‌ను (కాంగ్రెస్ సమావేశమయ్యే భవనాన్ని), వైట్ హౌసును, తదితర భవనాలను తగలబెట్టాయి.

1860 అక్టోబరులో, చైనాకు వ్యతిరేకంగా బ్రిటన్ ఫ్రాన్సులు చేసిన దురాక్రమణశీల వలస యుద్ధంలో ఆంగ్ల – ఫ్రెంచి సేనలు, చైనా శిల్ప కళలకు కాణాచి అయిన పెకింగ్ సమీపంలోని వేసవి భవనాన్ని కొల్లగొట్టి తగలబెట్టారు. – 104.

88 1812 ఆకురాలుకాలంలో, రష్యన్ ప్రజల దేశభక్తి యుద్ధంలో, మాస్కో నగరవాసులు, మొదటి నెపోలియన్ ఫ్రెంచి సైన్యపు ఆక్రమణలోవున్న నగరంలోని విస్తృత విభాగాన్ని, వారికి శీతకాలంలో తలదాచుకొనేందుకు యిళ్ళూ, ఆహార నిల్వలూ లేకుండా చేసేందుకుగాను, తగలబెట్టారు. – 105.

89 పురాతన రోమ్ నగరంలోని <u>ప్రిటోరియన్సు</u> సైన్యాధిపతికో, చక్రవర్తికో అంగరక్షకులు; రోమన్ సామ్రాజ్యం క్రింద ప్రిటోరియన్లు నిరంతరాయంగా జరిగే ఆంతరంగిక అల్లర్లలో పాల్గొంటూ, తరచుగా తమ సొంత మనుషులను అధికారంలో ప్రతిష్ఠిస్తూండేవారు. కిరాయి సైనిక ముఠాలకూ వాళ్ళు చేసే దుర్మార్గాలకూ, విశృంఖల చర్యలకూ ఆ పేరు చిహ్నప్రాయమైంది. – 106.

90 1849 జనవరి, ఫిబ్రవరి మాసాల్లో ఎన్నుకోబడిన ప్రష్యన్ అసెంబ్లీకి, ఫ్రెంచి అసెంబ్లీతో దాన్ని పోల్చి (50వ వివరణ చూడండి), మార్క్సు "chambre introuvable" అని పేరుపెట్టాడు. అది రెండు సభలతో కూడి వుంది: ప్రత్యేక సౌకర్యాలు కలిగి, ప్రభువర్గానికి చెందిన "పెద్దల సభ" ఒకటి, రెండవ సభకి జరిగే రెండు అంచెల ఎన్నికలో "స్వతంత్ర ప్రష్యన్ల"నబడే వాళ్ళు మాత్రమే పాల్గొన్నా, తద్వారా యుంకర్ల, నిరంకుశాధికార్ల, మితవాద బూర్జువా శక్తుల ప్రాబల్యం స్థిరంగా ఉండేలా చూశారు. రెండవ సభకి ఎన్నుకోబడిన బిస్మార్కు, దాని అత్యంత మితవాద యుంకర్ గ్రూపుకి నాయకుడు. — 107, 280.

91 "The Daily News" ("రోజువారీ వార్తలు") — ఇంగ్లీషు లిబరల్ వార్తా పత్రిక, పారిశ్రామిక బూర్జువావర్గపు అధికార పత్రిక, 1846 నుండి 1930 వరకు లండన్‌లో ప్రచురింపబడింది. — 111, 151, 167, 285, 300.

92 "Le Temps" ("కాలం") — ఫ్రెంచి కన్సర్వేటివ్ దినపత్రిక, బడా బూర్జువా వర్గ అధికార పత్రిక, పారిస్‌లో 1861 నుండి 1943 వరకు ప్రచురింప బడింది. — 111.

93 "The Evening Standard" ("సాయంకాల పతాకం" — "The Standard" సాయంకాలపు ఎడిషన్, 1857 నుండి 1905 దాకా యిది లండన్‌లో ప్రచురింప బడింది. — 112.

94 1871 జూన్ 6 నాటి జూల్ ఫ్రావ్ సర్క్యులరుపై మొదటి ఇంటర్నేషనల్ జనరల్ కౌన్సిలు జారీ చేసిన ప్రకటన, ఇది మార్క్సు ఎంగెల్సులచేత రచింప బడింది, "ఫ్రాన్సులో అంతర్యుద్ధం" రెండవ, మూడవ ఇంగ్లీషు ముద్రణల్లోను, 1871, 1876, 1891 జర్మన్ ముద్రణల్లోను యిది చేర్చబడింది. ఇది విడిగా కూడా పలు పత్రికల్లో ప్రచురింపబడింది. — 112.

95 మార్క్సు రచించిన "ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్స్ అసోసియేషనూ, సోషలిస్టు డెమోక్రసీయొక్క అలయన్సూ" అనే సర్క్యులర్ లెటర్‌కు ప్రస్తావన యిది.

సోషలిస్టు-డెమోక్రసీయొక్క అలయన్స్ — జినీవాలో 1868లో బకూనిన్‌చేత స్థాపించబడిన సంఘం. వర్గాలను సమానం చెయ్యాలనీ, రాజ్యాన్ని రద్దుచెయ్యాలనీ యిది కోరింది. అది కార్మికవర్గ రాజకీయ పోరాటావసరాన్ని తిరస్కరించింది. దాని పెటీబూర్జువా అరాజకవాద కార్యక్రమానికి ఇటలీ, స్విట్జర్లండ్, స్పెయిన్ మొదలైన దేశాల్లోని అంత బాగా పారిశ్రామికం కాని ప్రాంతాల్లో మద్దతు లభించింది.

1869లో, ఇంటర్నేషనల్‌లో చేర్చుకొమ్మని అలయన్సు జనరల్ కౌన్సిలుకు దరఖాస్తు పెట్టుకుంది. అలయన్సు కనుక ప్రత్యేక సంఘంగా తన అస్తిత్వాన్ని రద్దుచేసుకుంటే, దాని విభాగాలను చేర్చుకోవడానికి జనరల్ కౌన్సిలు అంగీకరించింది. అయితే, ఆచరణలో మాత్రం, అలయన్సు సభ్యులు ఇంటర్నేషనల్‌లో జేరిన తర్వాత సైతం ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్స్ అసోసియేషన్‌లో తమ రహస్య సంఘాన్ని నిలుపుకున్నారు. జనరల్ కౌన్సిలుకు వ్యతిరేకంగా వాళ్ళు సాగించిన పోరాటానికి బకూనిన్ నాయకత్వం వహించాడు. పారిస్ కమ్యూన్ అణచివెయ్య బడిన తర్వాత యీ పోరాటం తీవ్రతరం చెయ్యబడింది, అప్పుడు బకూనినూ, అతని మద్దతుదార్లూ శ్రామికవర్గ నియంతృత్వ భావానికీ, ప్రజాస్వామ్యకరణ సూత్రాల ప్రాతిపదికపై ఏర్పడే కార్మికవర్గపు స్వతంత్ర రాజకీయ పార్టీ ఏర్పాటుకీ వ్యతిరేకంగా ప్రత్యేకించి మనిశితమైన అభ్యంతరాలతో ముందు కొచ్చారు. హేగ్‌లో 1872 సెప్టెంబరులో జరిగిన మొదటి ఇంటర్నేషనల్ మహాసభ అత్యధిక మెజారిటీతో, అలయన్సు నాయకులను — బకూనిన్, గిల్యోంలను — ఇంటర్నేషనల్ నుండి బహిష్కరించాలని తీర్మానించింది. — 113.

96 "The Spectator" — ("సాక్షి") — లండన్‌లో 1828 నుండి ప్రచురింప బడుతున్న ఒక ఇంగ్లీషు లిబరల్ వారపత్రిక. — 114, 282, 287.

97 "ఫ్రాన్సులో అంతర్యుద్ధం" సంక్షిప్త పాఠాలు — ఈ రచనకు ముందు 1871 ఏప్రిల్, మే మాసాల్లో మార్క్సు రాసిన వేర్వేరు స్కెచ్‌లు.

మార్క్సు ఎంగెల్సుల జీవిత కాలంలో యివి ప్రచురింపబడలేదు, వారి మరణానంతరం చాలా కాలం తర్వాతగాని యివి ప్రచురింపబడలేదు. మొదటి, రెండవ సంక్షిప్త పాఠాల పూర్తిపాఠం సోవియట్ యూనియన్‌లో మొట్టమొదటి సారి 1934లో ఇంగ్లీషు (మూలం)లో ప్రచురింపబడింది, రష్యన్ అనువాదం మార్క్సు — ఎంగెల్సు ఆర్కైవ్స్ (పురాతన పత్ర భాండారం)లో IIIవ సంపుటి (VIII)గా ప్రచురింపబడింది. సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ కింద మార్క్సిజం — లెనినిజం ఇన్‌స్టిట్యూట్ చేత యిది ప్రచురింప బడింది. — 115.

98 బుజెన్‌వాల్ యుద్ధం (మాంత్రేట్ లేక మాం-వలెర్యేన్ యుద్ధమని కూడా దీన్ని పిలుస్తారు). పారిస్ ముట్టడి ప్రారంభమైన నాలుగు నెలల తర్వాత, 1871 జనవరి 19న ఈ యుద్ధం జరిగింది. ముట్టడింపబడిన పారిస్ చేసిన తుది ఎదురుదాడి యిది. నేషనల్ గార్డుకి మిగిలివున్న బలాన్ని క్షీణింపజేసి, దాన్ని

నిరుత్సాహపరచడానికి ట్రొషూ యీ దాడి ప్రయత్నాన్ని ముమ్మరం చేయించాడు. పారిస్ రక్షణను కొనసాగించడం బొత్తిగా వృధా అని జనాభామా, సైన్యాన్నీ నమ్మింపచెయ్యడమే ట్రొషూ చేసిన యీ ప్రయత్నం అంతర్యం. ఈ ఎదురుదాడికి తగినంతగా సన్నాహం జరగలేదు. దాడి చేసే సేనల దాడులమధ్య సమన్వయం లేదు. అవసరమైన ఆహార, ఆయుధ నిల్వలు సమకూర్చబడలేదు. ఫ్రెంచి సైని కులు ధైర్యసాహసాలు ప్రదర్శించినప్పటికీ, ఎదురుదాడి ప్రతిచోటా తిప్పికొట్ట బడింది. – 115.

99 1870 అక్టోబరు 5న, నేషనల్ గార్డుకి చెందిన కార్మికుల దళాలు పారిస్‌లోని నగర పాలక కార్యాలయం ముందు, గుస్టావ్ ఫ్లోరెన్సు నాయకత్వాన, ఒక ప్రదర్శన జరిపాయి. జాతీయ రక్షణ ప్రభుత్వం కమ్యూన్‌కి ఎన్నికలు జరపాలనీ, రిపబ్లిక్‌ను సుదృఢం చేసేందుకు చర్యలు తీసుకోవాలనీ, దాడిదారుకి వ్యతిరేకంగా కృతనిశ్చయంతో పోరాటం కొనసాగించాలనీ డిమాండ్ చేసేందుకు యీ ప్రదర్శన జరిగింది. ప్రభుత్వం యీ డిమాండ్లను తిరస్కరించింది. ఆజ్ఞలేనిదే నేషనల్ గార్డు సమావేశాలు జరపడాన్నీ, సాయుధ ప్రదర్శనలనూ ప్రభుత్వం నిషేధించింది.

1870 అక్టోబరు 31 నాటి తిరుగుబాటుపై 58వ వివరణ చూడండి. – 116.

100 1850 మే 31 నాటి చట్టం మేరకు, కొత్త ఎన్నికల యోగ్యతలను ప్రవేశపెట్టడానికి సంబంధించిన ప్రస్తావన యిది. ఫ్రెంచి రిపబ్లిక్ శాసన సభ ఆమోదించిన యీ ప్రతిపాదనను త్యేర్ నాయకత్వాన గల పార్టీ ఆఫ్ ఆర్డర్ ప్రవేశపెట్టింది. 1850 మార్చి, ఏప్రిల్ మాసాల్లో జరిగిన ఉప ఎన్నికల్లో డెమోక్రట్లూ, సోషలిస్టులూ సాధించిన విజయాలతో కంగుతిన్న పార్టీ ఆఫ్ ఆర్డర్ యీ కొత్త ఎన్నికల చట్టాన్ని ప్రవేశపెట్టింది. పట్టణవాస, గ్రామీణ కార్మికులకూ, పేద రైతాంగానికీ వ్యతి రేకంగా ఉద్దేశించబడిన ఈ కొత్త చట్టం మూడేళ్ల వాసయోగ్యతను ప్రవేశ పెట్టింది. ఎన్నికలలో పాల్గొనడానికి హక్కు వ్యక్తిగత పన్నులు చెల్లించిన వ్యక్తు లకు మాత్రమే వుండింది. తత్ఫలితంగా, ఓటు చెయ్యడానికి యోగ్యత కలిగిన వ్యక్తుల సంఖ్య దాదాపు 30 లక్షల దాకా తగ్గిపోయింది.

అటు తర్వాత కొద్ది కాలానికే, రిపబ్లిక్ అధ్యక్షుడు లూయీ బోనపార్ట్‌కు ఖజానా ఆ ఏడాదికి చెల్లించే జీతాన్ని 6 లక్షల నుండి 30 లక్షల ఫ్రాంకులకు శాసన సభ పెంచింది. – 121.

101 బ్రిటిష్ మిల్లు యజమానులతో పోటీ చెయ్యగలిగేందుకుగాను, కూలి కార్మికుల వేతనాలను తగ్గించేందుకు వార్మండీ మిల్లు యజమానులు చేసిన ప్రయత్నాలు

1868 చివరా, 1869 మొదట్లోనూ సాట్విల్-లె-రువాన్‌లో ఓ పెద్ద సమ్మెకు దారితీశాయి. సహాయార్థమై సమ్మెదారులు చేసిన విజ్ఞప్తి మేరకు ఇంటర్నేషనల్ జనరల్ కౌన్సిలు ట్రేడ్‌యూనియన్ల ద్వారా లండన్‌లోను, ఫ్రాన్సులోను నిధుల సేకరణకై ఏర్పాట్లు జరిపింది. సమ్మె ఓడింపబడింది, కాని, నార్మండీ జౌళి పరిశ్రమలోని కార్మికుల ఐక్యతనూ, వ్యవస్థీకరణమూ పెంపొందించడానికి అది తోడ్పడింది. రువాన్, ఎల్‌బ్యోఫ్, డర్నెటాల్‌లలోనూ, తదితర పట్టణాల్లోనూ ట్రేడ్‌యూనియన్ల ప్రాదుర్భావానికి అది దారితీసింది. బ్రిటిష్, ఫ్రెంచి కార్మికుల మధ్య సౌభ్రాతృత్వ పూర్వకమైన పొత్తును కూడా అది పటిష్ఠపరచింది. – 121.

102 "Le Rappel" ("విజ్ఞప్తి") – విక్టర్ హ్యూగో, ఆ్రని రోష్‌ఫోర్‌లచేత స్థాపింపబడి, 1869 నుండి 1928 దాకా ప్రచురింపబడిన ఒక వామపక్ష రిపబ్లికన్ దినపత్రిక. అది రెండవ సామ్రాజ్యాన్ని నిశితంగా విమర్శించింది, పారిస్ కమ్యూన్‌ని బలపరుస్తూ ముందుకొచ్చింది. – 122.

103 బ్లాంకీ, బర్బేస్‌ల నాయకత్వాన గల రహస్య సంఘమైన రుతు సమితి 1839 మే 12న చేసిన విప్లవ కార్యాచరణకు ప్రస్తావన యిది. ప్రజల మద్దతులేని యీ కార్యాచరణ కుట్ర స్వభావం కలిగి, సైన్యంచేతా, నేషనల్ గార్డుచేతా అణచివెయ్యబడింది. – 123.

104 ఇది రాత పొరపాటు: కవేన్యాక్ ప్రభుత్వంలో 1848 అక్టోబరు 13న దుఫోర్ ఆంతరంగిక శాఖమంత్రి, విన్యేన్ పబ్లిక్ వర్క్స్ మంత్రి అయ్యారు. 1849 జూన్ 2న, దుఫోర్ ఒడిలాన్ బ్యరో మంత్రి వర్గంలో మంత్రి అయ్యాడు. –123.

105 పువాట్యే రోడ్డు కమిటీకి ప్రస్తావన యిది – పార్టీ ఆఫ్ ఆర్డర్ (48వ వివరణ చూడండి) అనబడే దాని పాలక సంస్థ యిది. ఈ కమిటీలో త్యేర్ నాయకత్వాన ఆర్లియనిస్టులదే పెత్తనం. – 123.

106 1847 నాటి "లిబరల్ యూనియన్"ని గురించి మాట్లాడేటప్పుడు, 1846 ఎన్నికల తర్వాత రూపొందిన ఫ్రెంచి ప్రతినిధుల సభలోని "ప్రొగ్రెసివ్ కన్సర్వేటివ్స్" బృందాన్ని మార్క్స్ ప్రస్తావిస్తున్నాడు. వాళ్ల నాయకుల్లో ఆర్లియనిస్టులైన జిరర్దేన్, టొక్విల్, దుఫోర్‌లున్నారు. ఈ "ప్రొగ్రెసివ్ కన్సర్వేటివ్"లు గిజో ప్రభుత్వం నుండి బడా పారిశ్రామిక బూర్జువావర్గ ప్రయోజనాలను కాపాడే అనేక ఆర్థిక సంస్కరణలను, జూలై రాజరికాన్ని పటిష్ఠం చేసేందుకుగాను ఓటింగు హక్కును మరికొంత విస్తృతం చెయ్యాలనీ డిమాండు చేశారు. గిజోకి

వ్యతిరేకంగా వాళ్ళు చేసిన దాడుల్లో, అతని మంత్రుల అవినీతికర కృత్యాలను బహిర్గతం చెయ్యడంపై వాళ్ళు కేంద్రీకరించారు.

"లిబరల్ యూనియన్" బూర్జువా రిపబ్లికన్లు, ఆర్లియనిస్టులు, లెజిటిమిస్టుల్లో ఒక భాగం కలిసి ఏర్పడిన కలయిక యిది. 1863లో శాసనసభకు జరిగిన ఎన్నికల్లో రెండవ సామ్రాజ్యానికి ఉమ్మడి వ్యతిరేకత ప్రాతిపదికపైన ఏర్పడిందిది. 1863 మిశ్రమ సంఘటనలోని పార్టీల మధ్య ఏర్పడిన విభేదాల కారణంగా, 1869 ఎన్నికల ప్రచార సందర్భంగా "లిబరల్ యూనియన్"ను పునరుద్ధరించే ప్రయత్నం విఫలమైంది. 1869లో, మోడరేట్ బూర్జువా రిపబ్లికన్లు (జూల్ ఫ్రావ్, జూల్ సిమొన్ మొదలైన వాళ్ళు) రాజరికవాదులతో పొత్తును అభిమానించారు. ఆర్లియనిస్టు దుఫార్ అభ్యర్థిత్వాన్ని బలపరిచారు. అయితే అతను ఎన్నిక కాలేదు. — 124.

107 అంటే, 1851 డిసెంబరు 2 నాటి బోనపార్టిస్టు రాజకీయ కుట్ర పద్ధతి కార్యాచరణ ద్వారా అన్న మాట. — 127.

108 పదిహేను మంది కమిషన్ — విప్లవ పారిస్‌పై పోరాటం జరిపేందుకై త్యేర్ ప్రభుత్వానికి సహాయం చేసేందుకుగాను, 1871 మార్చి 20న జాతీయ అసెంబ్లీ నియమించిన కమిషన్ యిది. దానిలో ప్రధానంగా రాజరికవాదులూ, త్యేర్‌ని బలపరచే బూర్జువా రిపబ్లికన్లూ ఉన్నారు. ఆ కమిషన్, కమ్యూన్‌పై పోరాటం జరిపేందుకుగాను వలంటీరు దళాలను ఏర్పాటు చెయ్యాల్సిందిగా రాష్ట్రాలకు విజ్ఞప్తి చేసింది, కానైతే యీ విజ్ఞప్తికి తోడ్పాటు లభించలేదు. కమ్యూన్ ఓటమి తదుపరి, యీ కమిషన్ పని చెయ్యడం మానివేసింది.

"భూస్వాముల సభ" — 51వ వివరణ చూడండి. — 130.

109 "ఫ్రాన్సులో అంతర్యుద్ధం"లో, వెర్సేల్స్ జాతీయ అసెంబ్లీలో రాజరికవాదుల కుతంత్రాలకు సంబంధించిన ఉదాహరణలివ్వాలని మార్క్స్ ఉద్దేశించాడన్నది స్పష్టం. ఆనాటి పత్రికల నుండి ఆయన యిచ్చిన ఖండికలలో ఆర్లియన్స్ వంశ సభ్యులు, డ్యూక్ డి ఓమాలె, అతని సోదరుడైన ప్రిన్స్ జొయిన్‌విల్ వెర్సేల్స్‌లో చేసే కుట్రలను గురించీ, బూర్బన్ ఆర్లియన్స్ వంశాల విలీనం గురించీ, ఫ్రెంచి సింహాసనంపై డ్యూక్ డి ఓమాలెని ప్రతిష్ఠింప చేసే పథకాలను గురించీ పత్రికల్లో వచ్చిన పుకార్లు వున్నాయి. — 131.

110 Chouannerie — షువాన్లు జరిపిన తిరుగుబాటు; 80వ వివరణ చూడండి. వెండేన్లు — షువాన్లకు మరో పేరు. — 134.

111 "మునిసిపల్సు" లేక మునిసిపల్ గార్డు (1871 నుండి రిపబ్లికన్ గార్డు) – పారిస్‌లోని సైనికపద్ధతిలో సంఘటితం చేయబడిన పదాతి, ఆశ్విక పోలీసు దళం. విప్లవోద్యమానికి వ్యతిరేకంగా పోరాడేందుకుగాను 1830లో జూలై రాజరిక ప్రభుత్వంచేత ఏర్పాటుచెయ్యబడింది; 1871లో యిది, విప్లవ ప్రతిఘాత వెర్సేల్స్ సైన్యానికి మెరుపు దాడి దళంగా వినియోగపడింది. – 134.

112 రష్యా, బ్రిటన్, ఆస్ట్రియా, ప్రష్యా, టర్కీలు 1840లో కుదుర్చుకున్న లండన్ కన్వెన్షను మేరకు, ఈజిప్టుకి చెందిన పాషా మహమ్మద్ అలీకి (49వ వివరణ చూడండి) వ్యతిరేకంగా టర్కిష్ సుల్తాను సహాయానికి ఏర్పాటు జరిగిన ఫలితంగా, మహమ్మద్ అలీని బలపరుస్తున్న ఫ్రాన్సు, విదేశ రాజకీయాలలో ఏకాకి అయ్యే ప్రమాదాన్నీ, యూరపియన్ రాజ్యాలు ఫ్రెంచి వ్యతిరేక కూటమిగా ఏర్పడే ప్రమాదాన్నీ ఎదుర్కోవాల్సి వచ్చింది. మహమ్మద్ అలీకి తమ సహాయాన్ని విరమించుకోవడమనే మూల్యం చెల్లించి (మధ్య ప్రాచ్యంలో ఫ్రెంచి విధానానికిది పెద్ద ఓటమి), శాంతి కాలంలో విదేశీ యుద్ధ నౌకలకు నల్ల సముద్ర జలసంధుల మూసివేత అంశంపై 1841లో లండన్‌లో జరిగిన కన్వెన్షనులో ఫ్రాన్సు భాగస్వామ్యాన్ని ఫ్రెంచి ప్రభుత్వం సంపాదించుకుంది. రష్యా, బ్రిటన్, ఫ్రాన్సు, ఆస్ట్రియా, ప్రష్యాలు ఒక వంకా, టర్కీ మరో వంకా ఆ కన్వెన్షనుపై 1841 జూలై 13న సంతకాలు పెట్టాయి.

"ఫ్రాన్సులో అంతర్యుద్ధం" మూడవ ఇంగ్లీషు ముద్రణలో, మార్క్సు, యీ లండన్ కన్వెన్షన్లలో మొదటి దాన్ని (1840 నాటిదాన్ని) దౌత్య రంగంలో ఫ్రాన్సు ఓటమికి ఒక ఉదాహరణగా పేర్కొన్నాడు. – 135, 216.

113 "La Situation" ("సన్నివేశం") – బోనపార్టిస్టు దినపత్రిక. ఇది లండన్‌లో ఫ్రెంచి భాషలో 1870 సెప్టెంబరు నుండి 1871 ఆగస్టు 2 వరకు, జాతీయ రక్షణ ప్రభుత్వానికీ, థ్యేర్ ప్రభుత్వానికీ ప్రతిపక్షంగా వుండింది. – 137.

114 నెపోలియన్ యుద్ధాల తదనంతరం, యూరప్‌లో రూపొందిన పరిస్థితిని ధృవపరచే దౌత్యపరమైన పత్రాల నిక్కడ మార్క్సు పేర్కొన్నాడు.

వియన్నా సంధులు – వియన్నా కాంగ్రెస్ (1814 – 15) వర్యం పర్యవసానంగా, నెపోలియన్ యుద్ధాల్లో భాగస్వామ్య దేశాల మధ్య, 1815 మే, జూన్ మాసాల్లో వియన్నాలో కుదుర్చుకోబడిన సంధులు. జాతుల ఐక్యతా, స్వాతంత్ర్య ప్రయోజనాలకు భిన్నంగా, లెజిటిమిస్టు రాజరికాలను పునరుద్ధరించేందుకు గాను అవి యూరప్ పటాన్ని మార్చివేశాయి.

1814లో నెపోలియన్ స్వామ్రాజ్య పతనానంతరం, కొద్ది కాలం అతను తిరిగి ప్రభుత్వం చలాయించిన మీదట 1815లో రెండవ మారు అతని స్వామ్రాజ్య పతనానంతరం, ఆరవ, ఏడవ ఫ్రెంచి వ్యతిరేక కూటాల సభ్యదేశాలైన బ్రిటన్, ఆస్ట్రియా, ప్రష్యా, రష్యాలతో ఫ్రాన్సు రెండు శాంతి సంధులు చేసుకోవలసి వచ్చింది.

1814 మే 30 నాటి పారిస్ శాంతి సంధి మేరకు, రిపబ్లిక్ క్రింద, స్వామ్రాజ్యం క్రిందా ఉండగా తను ఆక్రమించుకున్న భూభాగాల్లో దాదాపు అన్నింటినీ ఫ్రాన్సు కోల్పోయి, 1792 జనవరి 1 నాటి సరిహద్దులకు, తన ఉత్తర, తూర్పు, ఆగ్నేయ సరిహద్దులవెంట చిన్న ప్రాంతాలు కొద్ది వాటిని మినహాయించి, కుంచింపబడింది.

1815 నవంబరు 20 నాటి పారిస్ శాంతి సంధి మేరకు, 1814 నాటి పారిస్ సంధి తనకు వదిలిన, తన ఉత్తర, తూర్పు, ఆగ్నేయ సరిహద్దుల వెంబడి కీలకమైన ప్రాంతాలను ఫ్రాన్సు కోల్పోయింది. పునరుద్ధరింపబడిన బూర్బన్ రాజరిక పాలనకు మద్దతు నిచ్చేందుకు గాను, ఫ్రాన్సు ఈశాన్య సరిహద్దులో గల దుర్గాలలో 1,50,000 మంది సైనికులతో కూడిన మిత్ర సైన్యం ఉంచ బడింది. ఆ సైన్యం 1818 చివరిదాకా అక్కడే ఉండిపోయింది. – 143.

115 నెపోలియన్ ఫ్రాన్సుకు వ్యతిరేకంగా 1806లో జరిగిన యుద్ధంలో ఓటమి తరువాత, 1807 – 11లో ప్రష్యాలో చెయ్యబడిన శుష్క బూర్జువా సంస్కరణలకు ప్రస్తావన యిది. ఫ్యూడల్ దాస్యపు ప్రష్యన్ రాజ్యపు సాంఘిక, రాజకీయ వ్యవస్థ పూర్తిగా కుళ్లిపోయిందన్న సంగతిని యిది బహిర్గతం చేసింది. రైతులైతే వ్యక్తిగత దాస్యం నుంచి విడుదల చెయ్యబడ్డారు కాని, పాత ఫ్యూడల్ సేవలన్నింటినీ వాళ్లు చెయ్యకతప్పు లేదు, ప్రభువు అనుమతితో మాత్రమే వాళ్లకు విమోచనం లభించేది. ప్రష్యాలో పరిమిత స్థానిక స్వపరిపాలన ప్రవేశపెట్టబడింది, సైన్యమూ, కేంద్ర పాలనా సంస్థలూ పునర్వ్యవస్థీకరింపబడ్డాయి. – 143.

116 సెవస్తొపోల్ వీరోచిత ప్రతిఘటన, రష్యన్ సైన్యంచేత టర్కిష్ దుర్గమైన కార్స్ ఆక్రమణ, బాల్టిక్ సముద్రంపై మిత్ర దేశాల పరాజయాలు – వీటి కారణంగా పారిస్ శాంతి మహాసభ (1856 ఫిబ్రవరి, మార్చి)లో రష్యన్ దౌత్య వ్యవహర్తలు బ్రిటన్, ఆస్ట్రియా, ఫ్రాన్సుల మధ్యగల వైరుధ్యాలను వినియోగించుకొని, క్రైమియన్ యుద్ధంలో రష్యా ఓటమి తరువాత, చాలా సులభతరమైన శాంతి షరతులను సాధించుకోగలిగారు: టర్కీకి ఇవ్వాల్సిన ప్రాంతీయ రాయితీలు విశేషంగా తగ్గింపబడ్డాయి. రష్యా కాకసస్‌లో తన ప్రాంతాలనూ, అజోవ్ సముద్రంలో తన

నౌకా దళాన్ని, దుర్గాలనూ ఉట్టే పెట్టుకొనే హక్కునూ నిలుపుకొంది. మహా సభ, మొల్దావియా, వలాహియాలపై ఆస్ట్రియా ఆక్రమణను తుదముట్టించాలని నిర్ణయించింది, దీనితో బాల్కన్ దేశాల్లో ఆస్ట్రియా విస్తరణ అత్యంత కష్ట తరమైంది.

క్రైమియన్ యుద్ధంలో రష్యా పరాజయానంతరం జారిస్టు ప్రభుత్వం అమలు జరిపిన సంస్కరణలు అంటే మార్క్స్ దృష్టిలో వున్నవి రష్యాలో ఫ్యూడల్ భూదాస్యాన్ని రద్దు చేసిన 1861 సంస్కరణ, స్థానిక పరిపాలనకు సంబంధించిన సంస్కరణలు (1864 నాటి జేమ్‌స్త్వొ సంస్కరణ, 1870 నాటి మునిసిపల్ పరిపాలనకు సంబంధించిన సంస్కరణ) 1864లో కొత్త న్యాయశాస్త్ర నిబంధనలను ప్రవేశపెట్టడం, ఆర్థిక వ్యవస్థ సంస్కరణ. ఇవన్నీ కూడి బూర్జువా రాజరికంగా మారే పథంలో రష్యాను ఒక అడుగు ముందుకు తీసుకెళ్లాయి. – 143.

117 "జీతభత్యాల్లేని మహోద్యోగులు" – బ్రిటన్‌లో తమ సేవలకు ప్రతిఫలం చెల్లించ బడని మేజిస్ట్రేట్ల కివ్వబడిన వ్యంగ్య నామం. – 149.

118 "Le Mot d'Ordre" ("సంకేత పదం") – ఒక వామపక్ష రిపబ్లికన్ దినపత్రిక. ఆంరీ రోష్‌ఫోర్ సంపాదకత్వం క్రింద 1871 ఫిబ్రవరి 3 నుండి పారిస్‌లో ప్రచురించ బడింది. పారిస్ గవర్నరు ఆజ్ఞ మేరకు మార్చి 11న దాని ప్రచురణ ఆపివెయ్య బడింది, పారిస్ కమ్యూను క్రింద పునరుద్ధరింపబడి, 1871 మే 20 దాకా కొనసాగింది. వెర్సైల్స్ ప్రభుత్వాన్ని, జాతీయ అసెంబ్లీలోని రాజరిక మెజారిటీని అది నిశితంగా విమర్శించింది, కానైతే అది పూర్తిగా కమ్యూన్ పక్షం వహించలేదు. పారిస్‌లోని విప్లవ ప్రతిఘాత శక్తులను అణచడానికి సంకల్పింపబడిన చర్యలకు అది వ్యతిరేకం కావడమే యిందుక్కారణం.

"La Liberté" ("స్వేచ్ఛ") – సాయంత్రం పూట వెలువడే కన్సర్వేటివ్ వార్తాపత్రిక. బడా బూర్జువావర్గపు అధికార పత్రిక, 1865 నుండి 1944 దాకా పారిస్‌లో ప్రచురింపబడింది. – 150.

119 "The New-York Daily Tribune"–1841 నుండి 1924 దాకా ప్రచురించ బడిన అమెరికన్ వార్తాపత్రిక. 1850 దశకం మధ్య దాకా, అది అమెరికన్ విగ్గులలోని వామపక్షానికి చెందిన అధికార పత్రిక, ఆటు తర్వాత అది రిపబ్లికన్ పార్టీ అధికార పత్రిక. 1851 ఆగస్టు నుండి 1862 మార్చి దాకా అది మార్క్స్ రచనలు ప్రచురించింది. మార్క్స్ కోర్కె మేరకు ఎంగెల్సు ఆ

పత్రికకు పలు వ్యాసాలు రాశాడు. యూరప్‌లో అభివృద్ధి నిరోధక దశలో - అప్పట్లో ప్రగతిశీలం కలిగి విస్తృతంగా పఠింపబడుతున్న ఆ పత్రికను ఖచ్చితమైన వాస్తవాల ప్రాతిపదికపై పెట్టుబడిదారీ సమాజపు చెడుగులను బహిర్గతం చెయ్యడానికి మార్క్స్ ఎంగెల్సులు విస్తృతంగా వినియోగించుకున్నారు. అమెరికాలో అంతర్యుద్ధ కాలంలో (37వ వివరణ చూడండి), మార్క్స్ ఆ పత్రికకు తన రచనలను పంపడం మానివేశాడు. దానికిగల అనేక కారణాల్లో ప్రధానమైనది, బానిస యజమానులతో బేరం కుదుర్చుకోవాలని కోరే వ్యక్తులు దాని సంపాదక వర్గంలో హెచ్చుమంది కావడం, ఆ పత్రిక తన ప్రగతిశీల వైఖరికి స్వస్తి చెప్పడం. దరిమిలా, ఆ పత్రిక మరింత మితవాద ధోరణికి మళ్లింది. – 151.

120 పారిస్ హక్కుల రిపబ్లికన్ యూనియన్ లీగు (Ligue de l'Union republicaine pour les droits de Paris) – 1871 ఏప్రిల్ ప్రారంభంలో పారిస్‌లో ఆవిర్భవించిన ఒక బూర్జువా సంఘం. అంతర్యుద్ధాన్ని నిలుపు చెయ్యడానికి తోడ్పడాలని అది ప్రయత్నించింది. రిపబ్లిక్‌ను, పారిస్ మునిసిపల్ స్వేచ్ఛను గుర్తించే ప్రాతిపదికపై, వెర్సేల్స్‌కీ పారిస్‌కీ మధ్య ఒక ఒప్పందం కుదుర్చుకుంటే కమ్యూన్ శాంతియుతంగా తొలగడానికి దారితీస్తుందని అది ఆశించింది.

ఫ్రీమసన్స్ – "స్వేచ్ఛాయుత తాపీ మేస్త్రు"లు (ఫ్రెంచి భాషలో ఫ్రీమసన్స్) అని పిలువబడే మతనైతిక సంఘాల సభ్యులు. ఈ సంఘాలు 17వ శతాబ్ది అంతంలోనూ 18వ శతాబ్ది ప్రారంభంలోనూ బ్రిటన్‌లో ఏర్పడిన తరువాత, కొన్ని దేశాలలో, రహస్య యూనిట్ల రూపంలో వ్యాపించాయి. వీటి కార్యకలాపాలు నిగూఢమైన పూజాపునస్కారాలతో రహస్యమైన విధులతో, తంతులతో కూడివుండేవి. 19వ శతాబ్దిలో ఫ్రాన్సులో ఫ్రీమసన్స్ ఉద్యమం నిర్దిష్ట రాజకీయ వైఖరిని సంతరించుకొని, బడా మధ్య రకం బూర్జువావర్గ ప్రయోజనాలను వ్యక్తం చేసింది. 19వ శతాబ్ది అంతంలో అది రాడికల్ బూర్జువా మేధావివర్గాల, చిన్న తరహా బూర్జువాల ఉద్యమంగా తయారైంది.

ఫ్రీమసన్ల ప్రదర్శన – 1871 ఏప్రిల్ 29వ జరిగిన పారిస్ ఫ్రీమసన్ల ఊరేగింపు. వెర్సేల్స్ ప్రభుత్వం తన సైనిక చర్యలను నిలుపు చేసేలా ఒత్తిడి తెచ్చేందుకు గాను వాళ్ళు నగర దుర్గాలకు ప్రదర్శనగా తరలి వెళ్లారు. రిపబ్లికన్ సన్నకారు, మధ్య తరహా బూర్జువావర్గపు సానుభూతిని సంపాదించేందు కోసం రాజకీయ అభిప్రాయాలను వ్యక్తీకరించే ఫ్రీమసన్లతో ఏప్రిల్ 26, 29 తేదీల్లో, నగర పాలక కార్యాలయంలో కమ్యూన్ ఒక సమావేశాన్ని ఏర్పాటుచేసింది. యుద్ధ విరమణకై తాము చేసిన ప్రతిపాదనలను త్యేర్ నిరాకరించడంతో ఆ సమావేశాల్లో,

ఫ్రీమసన్లు, కమ్యూన్‌కి తమ మద్దతును ప్రకటించారు. కమ్యూన్ ప్రతినిధివర్గం కూడా పాల్గొన్న పైన పేర్కొనబడిన ఊరేగింపు, ఏప్రిల్ 29 సమావేశానంతరం జరిగింది. — 152, 153, 246, 291.

121 "Moniteur des communes" ("కమ్యూన్ల సమాచార పత్రిక") — ఒక ఫ్రెంచి ప్రభుత్వ పత్రికకు ప్రస్తావన యిది, పారిస్ కమ్యూన్ కాలంలో, త్యేర్ ప్రభుత్వపు "Journal Officiel"కు సాయంకాల అనుబంధంగా వెర్సేల్స్‌లో యిది ప్రచురించబడింది. — 153, 194.

122 ఇన్‌క్విజిషన్ — కేథలిక్ చర్చికి చెందిన విచారణ సంస్థ. అది 13వ శతాబ్ది అంతంలో, ఫ్యూడల్ చర్చికి, సైద్ధాంతిక సూత్రాలకు, ఫ్యూడల్ పెత్తనాలకు వ్యతిరేకులైన వారిపై పోరాడేందుకు ఏర్పరచబడింది. ఇన్‌క్విజిషన్ విచారణలు రహస్యంగా జరిగేవి, విచారణలో వున్న వారు అతి క్రూరమైన చిత్రహింసలకు గురిచెయ్యబడేవారు. ఈ సంస్థ తీర్పు రద్దుచేసే అవకాశం లేదు. తరచుగా బహిరంగంగా సజీవదహన శిక్ష విధించబడేది. — 153.

123 1871లో లిమోజ్‌లో ప్రచురించబడిన "La Défense républicaine" అనే ఫ్రెంచి రిపబ్లికన్ వార్తాపత్రికకు ప్రస్తావన యిది. — 154.

124 "Le Vengeur" ("పగసాధింపుదారు") — ఒక వామపక్ష రిపబ్లికన్ దినపత్రిక. 1871 ఫిబ్రవరి 3 నుండి పారిస్‌లో యిది ప్రచురించబడింది; పారిస్ గవర్నరు ఆజ్ఞ మేరకు మార్చి 11న యిది మూసివెయ్యబడింది. పారిస్ కమ్యూన్ క్రింద ప్రచురణ తిరిగి ప్రారంభమై, 1871 మే 24 దాకా కొనసాగింది. ఈ వార్తాపత్రిక కమ్యూన్‌కి మద్దతు విచ్చింది, దాని అధికార పత్రాలను ప్రచురించింది, దాని అధికార సమావేశాల వార్తలు ప్రచురించింది. — 154.

125 1858 ఫిబ్రవరి 19న శాసన సభచేత ఆమోదించబడిన అనుమానితులకు సంబంధించిన చట్టానికి ప్రస్తావన యిది. ఫ్రాన్సులోని వివిధ భాగాలకూ, అల్జీరియాకూ మనుషులను ప్రవాసం పంపడానికీ, లేక ఫ్రెంచి భూభాగం నుండి, రెండవ సామ్రాజ్య పాలన పట్ల శత్రు ధోరణి కలిగిన వాళ్లని అనుమానించబడిన వ్యక్తులందరినీ దేశబహిష్కృతులను చేసేందుకూ ప్రభుత్వానికీ, చక్రవర్తికీ అంతులేని అధికారాలను ఈ చట్టం కట్టబెట్టింది. — 154.

126 అసెంబ్లీ సభ్యుడు గ్రెప్పో ద్వారా జాతీయ అసెంబ్లీకి అందచెయ్యబడిన లియోన్ మునిసిపల్ కౌన్సిలు విజ్ఞాపన అంతర్యుద్ధం అంతం కావాలనీ, వెర్సేల్స్ పారిస్‌ం

మధ్య శాంతి ఏర్పడాలనీ డిమాండ్ చేసింది. జాతీయ అసెంబ్లీకి కమ్యూన్‌కీ మధ్య విధుల విషయంలో ఖచ్చితమైన విభజన జరగాలనీ, కమ్యూన్ కార్యకలాపాలు మునిసిపల్ వ్యవహారాలకు పరిమితం కావాలనీ కూడా అది ప్రతిపాదించింది. –154.

127 సామ్రాజ్య పాలనలో, అధికారుల తీవ్రమైన ఒత్తిడి క్రింద, 1865లో ఎన్నుకోబడిన మునిసిపల్ కౌన్సిళ్లకు ప్రస్తావన యిది. – 155.

128 నగరాల సమాఖ్య (పూర్తి పేరు: "రిపబ్లికన్ నగరాల దేశభక్తియుత సమాఖ్య") – పారిస్ కమ్యూన్ అణచివెయ్యబడిన తర్వాత రాజరిక పునరుద్ధరణ జరుగుతుందేమోనని భయపడిన బూర్జువా రిపబ్లికన్లు 1871 ఏప్రిల్ – మే మాసాల్లో ఏర్పాటు చెయ్యాలని ప్రయత్నించిన సంఘం. దాని తాత్కాలిక కమిటీ, పారిస్ హక్కుల రిపబ్లికన్ యూనియన్ లీగు (120వ వివరణ చూడండి) క్రియాశీల భాగస్వామ్యంతో, అంతర్యుద్ధాన్ని ఆపువెయ్యడంలో తోడ్పడటానికీ, రిపబ్లిక్‌ను సంఘటితం చెయ్యడానికీ, అంతే కాకుండా లీగుకు నిర్మాణపరమైన స్వరూపాన్ని కల్పించడానికీగాను 1871 మే 9న బోర్డోలో నగర మునిసిపల్ మహాసభకు ఏర్పాట్లు చేసింది. ఈ మహాసభను వెర్సైల్స్ ప్రభుత్వం నిషేధించింది, తాత్కాలిక కమిటీ త్వరలోనే రద్దు చెయ్యబడింది.

వార్తాపత్రిక "Le Rappel," 1871 మే 6న, జరపబోయే నగరాల సమాఖ్య మహాసభ కార్యక్రమాన్ని ప్రకటించింది. – 156.

129 సెడాన్‌లో ఘోర పరాజయానికీ, పారిస్‌లో 1870 సెప్టెంబరు 4 నాటి విప్లవానికీ సంబంధించిన వార్తలందిన తదుపరి, పలు ఫ్రెంచి నగరాల్లో కార్మికుల విప్లవ కార్యాచరణ ప్రారంభమైంది. వాటిలో కొన్నింటిలో – లియోన్, మార్సెల్స్, టులూజులలో ప్రజాధికార సంస్థలు – కమ్యూన్లు – నెలకొల్పబడ్డాయి. కానైతే, తర్వాత యివి జాతీయ రక్షణ ప్రభుత్వంచేత క్రూరంగా అణచివెయ్యబడ్డాయి. స్వల్పకాలమే మనినప్పటికీ రాష్ట్రీయ కమ్యూన్లు, ప్రత్యేకించి లియోన్‌లోని కమ్యూన్, అనేక ముఖ్యమైన విప్లవ చర్యలను సాధించడంలో (పోలీసు, నిరంకుశాధికార యంత్రాంగాన్ని తొలగించడం, రాజకీయ ఖైదీలను విడుదల చెయ్యడం, లౌకిక విద్యను ప్రవేశపెట్టడం, పెద్ద ఆస్తిపరులపై పన్నులు విధించడం, చిల్లరమల్లరగా తాకట్టు పెట్టబడిన వస్తువులను ఉచితంగా తిరిగి యివ్వడం, మొదలైనవి) విజయవంత మయ్యాయి. – 168, 223.

130 1870 అక్టోబరు 31 నాటి విప్లవ ఘటనల కారణంగా సడలిపోయిన తన పరిస్థితిని పటిష్ఠపరచుకొనేందుకు జాతీయ రక్షణ ప్రభుత్వం, తనకు తోడ్పాటు

అనే అంశంపై 1870 నవంబరు 3న జనవాక్య సేకరణ జరిపింది. పారిస్ జనాభాలో గణనీయమైన విభాగం ప్రభుత్వ విధానానికి వ్యతిరేకంగా ఓటు చేసినప్పటికీ, ముట్టడి స్థితి వున్న కారణంగా, జనాభాపై ఒత్తిడి తేవడం ద్వారాను, ఆడంబర ప్రచారోద్యమం నిర్వహించడం ద్వారాను, మెజారిటీ సంపాదించుకోవడంలో అది విజయవంత మైంది. – 168.

131 రెస్టొరేషన్ – ఫ్రాన్సు చరిత్రలో 1814 – 30 మధ్య కాలం. అప్పుడు అధికారం పునరుద్ధరింపబడిన బూర్బన్ రాజవంశం చేతుల్లో వుంది. (బూర్బన్ రాజవంశం 1792 నాటి బూర్జువా విప్లవంచేత కూలదోయబడింది.)

మళ్లీ బూర్బన్ రాజవంశం 1830 నాటి జూలై విప్లవంచేత కూలదోయ బడింది. లూయీ ఫిలిప్ ఆర్లియన్ రాజుగా ప్రకటింపబడ్డాడు.

**జూలై రాజరికం అనబడే కాలంలో** (1830 – 48) అధికారం ఫైనాన్స్ ప్రభుమండలి చేతిలో వుంది. – 173.

132 నష్టపరిహార చెల్లింపు విషయంలో నేషనల్ గార్డు కేంద్ర కమిటీ వైఖరిని ప్రతి బింబిస్తూ **"Journal Officiel de la Rèpublique Française" లోని** వ్యాస సారాంశాన్ని మార్క్స్ యీ వాక్యంలో యిచ్చారు. – 181.

133 రెండవ రిపబ్లిక్‌కి చెందిన తాత్కాలిక ప్రభుత్వం 1848 మార్చి 16న ఒక ఫ్రాంకు ప్రత్యక్ష పన్నుపై విధించిన 45 సెంటీముల అదనపు పన్నుకు ప్రస్తావన. దీని పూర్తి భారం రైతాంగంపై పడింది. ఇది విశేషమైన అసంతృప్తిని రేకె త్తించింది. బడా భూస్వాములూ, కేథలిక్ మతబోధకులూ దీన్ని డెమోక్రట్లకూ, పారిస్ కార్మికులకూ వ్యతిరేకంగా ప్రచారోద్యమానికి ఉపయోగించుకొని, విప్లవ ప్రతీఘాతానికి రైతాంగాన్ని నిలవ బలగంగా మార్చడానికి ప్రయత్నించారు. – 182.

134 ఇది, "గ్రాష్ట్రం రిపబ్లికన్ యూనియన్"కు ప్రస్తావన అయ్యుండాలి. (72వ వివరణ చూడండి.) – 185.

135 ఫ్రాన్సులో 1851 డిసెంబరు 2న రాజకీయ కుట్రతో ముగిసిన రెండవ రిపబ్లిక్ (10వ వివరణ చూడండి) కాలానికీ, మరుసటి సంవత్సరం మూడవ నెపోలియన్‌ని చక్రవర్తిగా ప్రకటించడానికీ ప్రస్తావన యిది. – 188.

136 పారిస్ శ్రామికుల పాజిటివిస్టుల సంఘానికి ప్రస్తావన యిది. దీని కార్యక్రమంలో బూర్జువా తత్వవేత్త అగూస్ట్ కోంట్ ధోరణి సూత్రాలు అనేకం యిమిడి వున్నాయి. 1870 మొదట్లో, ఆ సంఘానికిగల కార్మికవర్గ స్వరూపం దృష్ట్యా, జనరల్

కౌన్సిలు ఇంటర్నేషనల్‌లో దాన్నొక శాఖగా చేర్చుకుంది; అయితే అదే సమయంలో, దాని కార్యక్రమాన్ని తీవ్రంగా విమర్శించింది. – 189.

137 ఫలాన్‌స్టేర్లు – ఫ్రెంచి ఊహాజనిత సోషలిస్టు అయిన చార్లెస్ ఫోరియర్ మహా కల్పిత భవనాలు. వాటిలో ఉత్పత్తి, వినిమయ సంఘాల సభ్యులు ఆదర్శప్రాయమైన సోషలిస్టు సమాజంలో జీవిస్తారు.

ఇకేరియా – ఇటియేన్ కాబె అనే ఊహాజనిత సోషలిస్టు రచించిన సాంఘిక తాత్విక నవల "ఇకేరియాకు ప్రయాణం"కు ప్రస్తావన యిది. ఆ నవలలో ఊహా కల్పిత కమ్యూనిస్టు దేశం చిత్రింపబడింది. – 190.

138 "ఫ్రెంచి ప్రజలకు" అనే పేరుతో పారిస్ కమ్యూన్ 1871 ఏప్రిల్ 19న ఒక ప్రణాళికను విడుదలచేసింది. అది, 1871 ఏప్రిల్ 20వ తేదీ, "Journal Officiel de la République Française" 110వ సంచికలో ప్రచురింపబడింది. ఇది ఆ ప్రణాళిక నుండి ఉదహరింపబడిన భాగం. – 195.

139 మొదటి నెపోలియన్ సామ్రాజ్య పాలనను కూలద్రోసి, లెజిటిమిస్టు బూర్బన్ రాజరికాన్ని పునరుద్ధరించేందుకు గాను, బ్రిటన్, ఆస్ట్రియా, ప్రష్యా, రష్యాల నాయకత్వాన, ఆరవ, ఏడవ ఫ్రెంచి వ్యతిరేక కూటాలకు చెందిన సేనలు 1814, 1815 సంవత్సరాల్లో ఫ్రాన్సుపై చేసిన దండయాత్రకు ప్రస్తావన యిది. –196, 223.

140 "La Vérité" ("సత్యం") – రిపబ్లికన్ బూర్జువా రాడికల్ దినపత్రిక, 1870 అక్టోబరు నుండి 1871 సెప్టెంబరు 3 వరకు యిది పారిస్‌లో ప్రచురింపబడింది. మొదట్లో యిది కమ్యూన్‌ని బలపరచింది, తర్వాత అది చేపట్టిన సాంఘిక చర్యలను వ్యతిరేకించింది. – 198, 300.

141 "రిపబ్లిక్ పరిరక్షకుల అసోసియేషన్" – రిపబ్లిక్ కోసం పోరాడేందుకై 1871 ఫిబ్రవరిలో పారిస్‌లో నెలకొల్పబడిన ఒక బూర్జువా ప్రజాస్వామిక సంఘం. అది కమ్యూన్‌ని బలపరచింది, వెర్సేల్స్ ప్రభుత్వ విధానాన్ని విరసించింది. – 201.

142 1793 నాటి రాజ్యాంగం – ఫ్రెంచి బూర్జువా విప్లవ కాలంలో, జాకొబిన్ల విప్లవ నియంతృత్వ దశలో కన్వెంట్‌చేత ఆమోదింపబడిన ఫ్రెంచి రిపబ్లిక్ రాజ్యాంగం. 18, 19 శతాబ్దాల బూర్జువా రాజ్యాంగాలన్నింట్లోనూ అత్యంత ప్రజాస్వామికమైనదిది. – 206.

143 19వ శతాబ్ది మధ్యకాలంలో కాలిఫోర్నియా, ఆస్ట్రేలియా దేశాల్లో బంగారం కనిపెట్టబడటంతో, దాని ప్రభావం అంతర్జాతీయ వ్యాపారాభివృద్ధిపై పడింది. దానికి ప్రస్తావన యిది. – 237.

144 ఫ్రెంచి రాజు పద్నాల్గవ లూయీకి ఆపాదించబడిన సుప్రసిద్ధ వాక్యానికి వ్యంగ్యాత్మక ప్రస్తావన యిది. "రాజ్యమంటే నేనే" అన్న ఆ వాక్యం నిరంకుశాధికారానికి నిర్వచనమైంది. – 241.

145 ఫ్రాంక్‌ఫుర్ట్ శాంతి ఒప్పందం – 1871 మే 10న కుదుర్చుకోబడిన యీ ఒప్పందం ఫ్రాన్సు జర్మనీల మధ్య శాంతికి సంబంధించిన తుది షరతులను నిర్వచించింది. 1871 ఫిబ్రవరి 26వ తేదీనాటి తాత్కాలిక శాంతి ఒప్పందం (14వ వివరణ చూడండి) నిర్దేశించినట్లు, జర్మనీకి ఆల్సేస్, తూర్పు లొరైన్‌లను దత్తం చెయ్యడాన్నిది ధృవీకరించింది. ఫ్రాంక్‌ఫుర్ట్ ఒప్పందానికనుగుణంగా జర్మన్ సేనలు ఫ్రెంచి భూభాగాన్ని ఆక్రమించుకునేందుకోసం ఫ్రాన్సుచేత నష్టపరిహారాల చెల్లింపు షరతులు భారతరమయ్యాయి. పారిస్ కమ్యూన్‌ని అణచి వెయ్యడంలో వెర్సేల్స్ ప్రభుత్వానికి బిస్మార్కు చేసే సహాయానికిది మూల్యం. ఫ్రాంక్‌ఫుర్ట్ శాంతి ఒప్పందం ఫ్రాన్సును దోచుకున్నది కాబట్టి, ఫ్రాన్సు జర్మనీల మధ్య భవిష్యత్తులో సాయుధ ఘర్షణను అది తప్పని సరిచేసింది. – 247, 328.

146 మునిసిపల్ కౌన్సిళ్ల అధికారాలకు తీవ్రమైన కోత పెట్టిన 1831 నాటి మునిసిపల్ నిర్మాణంపై చట్టానికీ, మునిసిపల్ కౌన్సిళ్లు ఒక దానితో మరొకటి సంబంధాలు పెట్టుకోకుండా నిషేధించే 1855 నాటి మునిసిపల్ నిర్మాణంపై చట్టానికీ ప్రస్తావన యిది అయి ఉండాలి.

బోర్డోలో మునిసిపల్ ప్రతినిధుల సమావేశమొక దాన్ని ఏర్పాటుచేసే పథకానికి సంబంధించి 128వ వివరణ చూడండి. – 249, 272.

147 జాతీయ రక్షణ ప్రభుత్వంపై 1871 జనవరి 17వ జనరల్ కౌన్సిలు సమావేశంలో మార్క్సు చేసిన యీ ఉపన్యాసం లండన్‌లో జనవరి 10న సెయింట్ జేమ్స్ హాలులో యీ ప్రభుత్వాన్నీ, దాని విదేశాంగ మంత్రి జూల్ ఫావ్రేనీ ప్రశంసిస్తూ, ఓడ్జర్ చేసిన ప్రసంగానికి వ్యతిరేకంగా ఉద్దేశించబడింది. నల్ల సముద్రాన్ని తటస్థ ప్రాంతం చేసే విషయంలో 1856 నాటి పారిస్ ఒప్పందపు షరతులను సవరించడానికై జరగబోయే అంతర్జాతీయ కాన్ఫరెన్సు సందర్భంగా ఫావ్రే లండన్‌కు వస్తాడని తలచబడింది. జాతీయ రక్షణ ప్రభుత్వాన్ని పొగడుతూ ఓడ్జర్ ప్రవేశపెట్టిన తీర్మానం, ఫ్రెంచి ప్రష్యన్ యుద్ధంపై జనరల్

కౌన్సిలు రెండవ విజ్ఞప్తిలో ఆ ప్రభుత్వం పట్ల యివ్వబడిన వర్గ అంచనాలూ విభేదించాయి. ఓడ్జర్ ప్రసంగంపై మార్క్స్ విమర్శ సందర్భంగా, ఇంటర్నే షనల్ సభ్యులు బహిరంగసభలోనూ, సమావేశాల్లోనూ, సూత్రబద్ధమైన వైఖరి తీసుకోవాల్సిన అవశ్యకతను గురించి జనరల్ కౌన్సిలు చర్చ జరిపింది. – 259.

148 పారిస్‌లో విప్లవ క్లబ్బులు 1848 మే 15న ఏర్పాటుచేసిన ప్రజా ప్రదర్శనకు ప్రస్తావన యిది. దానిలో 1,50,000 మంది, ప్రధానంగా కార్మికులు పాల్గొన్నారు. ఆ రోజున పోలిష్ సమస్యను చర్చించాల్సి వున్న రాజ్యాంగసభకు నడిచివెళ్లి హాల్లోకి చొచ్చుకు వెళ్లారు. స్వాతంత్ర్య పోరాటం సాగిస్తున్న పోలండుకి సైనిక సహాయాన్ని అందచెయ్యాలనీ, నిరుద్యోగ పేదతనాలపై పోరాడేందుకై కృతనిశ్చయంతో కూడిన చర్యలు చేపట్టాలనీ డిమాండ్ చేశారు. ఆ డిమాండ్లు ఎప్పుడైతే తిరస్కరింపబడ్డాయో, అప్పుడు ప్రదర్శకులు రాజ్యాంగసభ రద్దయినట్లు ప్రకటించి, విప్లవ ప్రభుత్వాన్ని నెలకొల్పారు. ఆ ప్రదర్శనను సేనలూ, నేషనల్ గార్డుకి చెందిన బూర్జువా దళాలూ చెదరగొట్టాయి. – 259.

149 రాజీనామా చేసిన తాత్కాలిక ప్రభుత్వం స్థానంలో, 1848 మే 10న, రాజ్యాంగసభ నెలకొల్పిన ఎగ్జిక్యూటివ్ కమిటీకి – ఫ్రెంచి రిపబ్లిక్ ప్రభుత్వం – ప్రస్తావన యిది. 1848 జూన్ 24 దాకా అది అధికారంలో కొనసాగింది, అటు తర్వాత కవేన్యాక్ తన నియంతృత్వాన్ని నెలకొల్పాడు. – 260.

150 1848 ఆగస్టు 9, 11 తేదీల్లో రాజ్యాంగసభ ఆమోదించిన అభివృద్ధినిరోధక పత్రికా చట్టాలు ఇవి పెద్ద మొత్తాల్లో డిపాజిట్లు కట్టాలని నిర్దేశించడంతో, ప్రగతిశీల, కార్మికవర్గ పత్రికలను తప్పనిసరిగా మూసివేసుకోవాల్సి వచ్చింది. ప్రభుత్వానికీ, అప్పుడున్న పాలనకీ, ప్రైవేటు ఆస్తికీ వ్యతిరేకంగా ప్రచురింపబడే ప్రచురణలకు కఠినమైన శిక్షలను (ఖైదు శిక్ష, జరిమానాలు) కూడా అవి నిర్దేశించాయి. – 260.

151 జనరల్ కౌన్సిలుకి, క్రమబద్ధంగా పారిస్‌లో 1871 మార్చి 18 నాటి శ్రామిక వర్గ విప్లవంపైన, కమ్యూనార్డుల వీరోచిత పోరాటంపైన, పారిస్ కమ్యూన్ కార్యకలాపాలపైనా మార్క్స్ ఎంగెల్సులు పలు ఉపన్యాసాలూ, రిపోర్టులూ యిచ్చారు. అలా వారిచ్చిన ఉపన్యాసాలు, రిపోర్టుల పరంపరలో, 1871 మార్చి 18న పారిస్‌లో జరిగిన శ్రామికవర్గ విప్లవంపై వారిచ్చిన రిపోర్టు మొదటిది. జనరల్ కౌన్సిలు సమావేశపు మినిట్సులో, ఎంగెల్సు ఉపన్యాసం మార్చి 14న

యివ్వబడినట్లు మొదట తప్పుగా పేర్కొనబడింది. మార్క్స్ ఆ మినిట్సును చదివినప్పుడు తేదీని మార్చి 21గా సరిదిద్దాడు. – 261.

152 ఫిబ్రవరి 8న ఎన్నుకోబడిన జాతీయ అసెంబ్లీయొక్క అత్యంత అభివృద్ధి నిరోధక స్వరూప స్వభావాల ప్రస్తావన యిది. ఇది బోర్డోలో 1871 ఫిబ్రవరి 12న ప్రారంభింపబడింది (51వ వివరణ చూడండి). – 261.

153 మార్క్స్ యిటువంటి లేఖనే "The Daily News" (91వ వివరణ చూడండి)కి కూడా పంపాడు, దాన్నది 1871 ఏప్రిల్ 6న ప్రచురించింది. – 263.

154 "Le Gaulois" – కన్సర్వేటివ్ రాజరిక దినపత్రిక, బడా బూర్జువా వర్గంయొక్క, ప్రభువర్గంయొక్క అధికార పత్రిక, పారిస్‌లో 1867 నుండి 1929 వరకు ప్రచురింపబడింది. – 263.

155 **"Le Figaro"** – పారిస్‌లో 1826 నుండి ప్రచురింపబడిన కన్సర్వేటివ్ ఫ్రెంచి వార్తాపత్రిక. దానికి రెండవ సామ్రాజ్య ప్రభుత్వంతో సంబంధం వుంది.

"Paris-Journal" – పోలీసులతో సంబంధం కలిగిన అభివృద్ధి నిరోధక దినపత్రిక, పారిస్‌లో 1868 నుండి 1874 దాకా ప్రచురింపబడింది. ఇది రెండవ సామ్రాజ్య విధానాన్ని బలపరచింది, అది కూలిపోయిన తర్వాత జాతీయ రక్షణ ప్రభుత్వాన్నీ, త్యేర్ ప్రభుత్వాన్నీ బలపరచింది. ఇంటర్నేషనల్ పైనా, పారిస్ కమ్యూను పైనా నీచమైన అభాండాలను యిది వ్యాపింప చేసి, కమ్యూనార్డులపై హింసా ప్రయోగం జరపాల్సిందిగా యిది విజ్ఞప్తి చేసింది. – 263, 277, 282, 319.

156 1871 మార్చి 26 నాటి కమ్యూన్ ఎన్నికలకు ప్రస్తావన యిది. పారిస్‌లో ప్రజా తిరుగుబాటు విజయం దరిమిలా, 1871 మార్చి 18 నుండి 28 దాకా అధికారం నేషనల్ గార్డు కేంద్ర కమిటీ చేతుల్లో ఉంది, అటుతర్వాత తన అధికారాలను అది కమ్యూన్‌కి అప్పగించింది. – 265.

157 జాతీయ అసెంబ్లీలో 1871 ఏప్రిల్ 10న ఫాన్ చేసిన ఉపన్యాసానికి సంబంధించిన వ్యాఖ్యకు ప్రస్తావన యిది. అందులో అతను, పారిస్ కమ్యూన్‌ను అణచివెయ్యడానికి గాను వెర్సేల్స్ ప్రభుత్వం బిస్మార్క్‌తో పొత్తు కుదుర్చుకుందన్న ఆరోపణలను తిరస్కరించాడు. అతను పటిలంగా బిస్మార్క్ యివ్వజూపిన సహాయాన్ని ప్రభుత్వం తిరస్కరించిందని కూడా బుకాయించాడు. కార్మిక వర్గోద్యమాన్ని అణచి వేసేందుకై ఫ్రెంచి విప్లవ ప్రతీఘాత బూర్జువావర్గం విదేశీ శత్రువుతో చేసుకున్న ద్రోహ పూరితమైన బేరాన్ని, తాము చేసిన పలు ప్రసంగాల్లోను, తాము రచించిన పలు

వ్యాసాల్లోను, ప్రత్యేకించి మార్క్సు రచించిన "ఫ్రాన్సులో అంతర్యుద్ధం"లోను మార్క్సు ఎంగెల్సులు బహిర్గతం చేశారు. — 265.

158 పారిస్ రెండవ డిస్ట్రిక్టునుండి, 1871 ఏప్రిల్ 16న జరిగిన ఉప ఎన్నికలో, కమ్యూన్‌కి సెరయ్యే ఎన్నుకోబడ్డాడు. మరో అభ్యర్థి జనరల్ కౌన్సిలు సభ్యుడైన ఎజేన్ డుపాన్. కానైతే ఇంగ్లండునుండి రాజాలనందున అతను ఎన్నికకు నిలబడలేకపోయాడు. ఈ ఎన్నికలో, జీన్ ఎమ్. ఎ. డుపాన్ 17వ డిస్ట్రిక్టు నుండి కమ్యూన్‌కి ఎన్నుకోబడ్డాడు. — 267.

159 జనరల్ కౌన్సిలు కోరిక మేరకు, ఏప్రిల్ 26 ప్రాంతంలో, పారిస్‌లో వున్న లియో ఫ్రాంకెల్‌కి మార్క్సు ఒక జాబు రాశాడు (326 – 327వ పేజీలు చూడండి). అందులో ఆయన ఫ్రెంచి పెటీబూర్జువా రాడికల్ ఫేలిక్స్ పియా సెరయ్యేని గురించి వ్యాపింపచేస్తున్న అభాండాలను బహిర్గతం చేశాడు. — 267.

160 1871 ఫిబ్రవరిలో పారిస్ కార్మికుల ప్రతినిధిగా జాతీయ అసెంబ్లీకి డిప్యూటీగా ఎన్నుకోబడిన టొలేన్ నిజానికి పారిస్‌లోని విప్లవానికి వ్యతిరేకంగా వెర్సేల్స్ పోరాడుతున్నప్పటికీ, పారిస్ కమ్యూన్ ప్రకటింపబడిన తర్వాత కూడా వెర్సేల్స్ అసెంబ్లీలో ఉండిపోయాడు, ఆ అభివృద్ధి నిరోధక సంస్థలో కార్మికుల ప్రతినిధులు తెగతెంపులు చేసుకోవాలన్న కమ్యూన్ డిమాండును పాలించడానికి నిరాకరించాడు. మితవాద ప్రూడనిస్టులు బహిరంగంగా విప్లవ ప్రతీఘాత పక్షానికి మారారన్నదే టొలేన్ ద్రోహానికి అర్థం. ఇంటర్నేషనల్‌కు చెందిన పారిస్ శాఖల ఫెడరల్ కౌన్సిలు, అప్పుడు, ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్స్ అసోసియేషన్ నుంచి కార్మికవర్గ ఆశయానికి ద్రోహిగా పరిగణించి, టొలేన్‌ని బహిష్కరిస్తూ ఒక తీర్మానం ప్యాస్ చేసింది. ఇంటర్నేషనల్‌కి చెందిన శాఖలలో ఒక దానికి చెందిన అధికార పత్రిక "La Révolution Politique et sociale" 1871 లో ఏప్రిల్ 16న ఆ తీర్మానాన్ని ప్రచురించింది.

ఆ తీర్మానాన్ని అందుకునేందుకు ముందే, జనరల్ కౌన్సిలు, బూర్జువావర్గ పక్షానికి టొలేన్ ఫిరాయింపుకి సంబంధించి లండన్ పత్రికల్లో వచ్చిన వార్తల ఆధారంగా, ఏప్రిల్ 18 నాటి తన సమావేశంలో టొలేన్ ద్రోహ ప్రవర్తనని గురించి ప్రాథమిక చర్చ జరిపి, దాన్ని గురించి బహిరంగంగా నిందారోపణ చెయ్యాలని నిర్ణయించింది. ఏప్రిల్ 25న తీర్మానం అందుకున్న తర్వాత, జనరల్ కౌన్సిలు టొలేన్ వ్యవహార పరిశీలనను తిరిగి కొనసాగించి, ఇంటర్నేషనల్ నుండి అతన్ని బహిష్కరిస్తూ ఒక తీర్మానాన్ని ఆమోదించింది. — 270.

161 ఇంటర్నేషనల్ జనరల్ కౌన్సిలుయొక్క స్థాయీ కమిటీకి లేక సబ్‌కమిటీకి ప్రస్తావన యిది. ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్స్ అసోసియేషన్ తొలి దశలో 1864లో, దాని కార్యక్రమాన్నీ నిబంధనలనూ రూపొందించడానికి ఏర్పాటు చెయ్యబడిన ఒక కమిషన్ నుండి యిది అభివృద్ధి చెందింది. స్థాయీ కమిటీ, వివిధ దేశాలకు సంబంధించిన ఉత్తరప్రత్యుత్తరాలు జరిపే కార్యదర్శులతోను, జనరల్ కౌన్సిలు ప్రధాన కార్యదర్శితోను, ఒక కోశాధికారితోను కూడి వుంది. నిబంధనావళిలో అవకాశం కల్పించబడని యీ కమిటీ, కార్యనిర్వాహక వర్గ స్వభావం కలిగివుంది. మార్క్స్ దర్శకత్వంలో యీ కమిటీ, ఇంటర్నేషనల్ కార్యకలాపాల దైనందిన మార్గదర్శకత్వ విస్తృత బాధ్యతలను నిర్వహిస్తూండేది, దాని పత్రాలను తయారుచేసి, జనరల్ కౌన్సిలుకి సమర్పిస్తూండేది. — 271.

162 జనరల్ కౌన్సిల్లో 1871 మే 23న మార్క్స్ యిచ్చిన యీ ఉపన్యాసం, వెర్సైల్స్ ప్రభుత్వాన్ని బహిర్గతం చేసే చర్చను ప్రారంభించి, కమ్యూనార్డులను ఆటవికంగా ఊచకోతకోసేందుకు త్యేర్ చేస్తున్న సన్నాహం పట్ల నిరసనను వ్యక్తంచేసింది. ఈ సమస్యపై తన ఉపన్యాసంలో (మినిట్స్‌లో దీన్ని గూర్చి చాలా క్లుప్తంగా రికార్డు చెయ్యబడింది), పారిస్ కమ్యూన్ సభ్యులను క్షమిస్తానని వాగ్దానం చేసిన త్యేర్ ద్రోహాన్ని ఎంగెల్సు పేర్కొన్నాడు. వెర్సైల్స్ ప్రభుత్వ బర్బర కృత్యాలను నివారించేందుకై బ్రిటన్‌లో తీసుకోగల చర్యలను పరిశీలించేందుకుగాను ఒక కమిషన్‌ను ఏర్పాటు చెయ్యాలని, ఈ సమావేశంలో తీర్మానించబడింది. — 273.

163 ఫెనియన్ భ్రాతృత్వం (Fenian Brotherhood) — ఐరిష్ విప్లవ భ్రాతృత్వం — 1850 దశకం చివరి సంవత్సరాల్లో, అమెరికాలోని ఐరిష్ ప్రవాసుల్లో తలెత్తిన ఒక రహస్య సంఘం. ఇది తర్వాత ఐర్లండులో కూడా ఏర్పడింది. దాని సభ్యులు ఐర్లండ్ స్వాతంత్ర్యం కోసం, ఐరిష్ రిపబ్లిక్ స్థాపన కోసం పోరాడారు. ఆ సంఘం ఐరిష్ రైతాంగ ప్రయోజనాలకు బాహ్యాత్మక వ్యక్తీకరణ నిచ్చింది. సాంఘిక రీత్యా, దీనిలో ప్రధానంగా పట్టణవాస పెటీబూర్జువావర్గానికి చెందినవాళ్ళూ, మధ్యతరగతి మేధావులూ వున్నారు. మార్క్స్ ఎంగెల్సులు ఫెనియన్ ఉద్యమానికి సంబంధించిన లోట్లను పదేపదే వొక్కిచెప్పారు, వాళ్ళ కుట్రదారీ ఎత్తుగడలనూ, ఒంటెత్తు బూర్జువా జాతీయవాద పొరపాట్లనూ విమర్శించారు. కానైతే, వాళ్ళ విప్లవ స్వభావాన్ని విశేషంగా అభినందించారు, ఆ ఉద్యమాన్ని ప్రజా సామూహిక కార్యాచరణ వంకకు, ఇంగ్లీషు కార్మికవర్గంతో సంయుక్త కృషి వైపు మళ్ళించేందుకూ ప్రయత్నించారు.

కర్బొనారీ (Carbonari) – ఇటలీలో 19వ శతాబ్దపు మొదటి ముప్పది మూడేళ్ళలోనూ, ఫ్రాన్సులో 1820 దశకంలోనూ చురుకుగా పనిచేసిన రహస్య కుట్రదారీ సంఘం

మరియాన (Marianne) – ఫ్రాన్సులోని ఒక రహస్య రిపబ్లికన్ సంఘం పేరు ఇది 1850లో ఆవిర్భవించింది; రెండవ సామ్రాజ్యం క్రింద, నెపోలియన్‌కి వ్యతిరేకంగా పోరాడటమే దాని ఆశయంగా ఉంది – 275.

164 "The Contemporary Review" (సమకాలిక సమీక్ష") – ఒక ఇంగ్లీషు బూర్జువా-లిబరల్ మాసపత్రిక లండన్‌లో 1866 నుండి ప్రచురింపబడింది మార్క్స్ చేత ప్రస్తావింపబడిన మజ్జీనీ వ్యాసం 1871 జూన్ సంచికలో వెలువడింది. – 276.

165 పారిస్ కమ్యూన్ ఇంటర్నేషనల్‌పై అభాండాలతో కూడిన దాడి చేస్తూను విప్లవ కార్మికోద్యమాన్ని అణచివెయ్యడంలో లూయీ బోనపార్ట్ 'యోగ్యతలను ఆకాశానికెత్తుతూను "The Times" పత్రిక జూన్ 19న సంపాదకీయం ప్రచురించిన తదుపరి మార్క్స్ యీ ప్రకటనను రచించాడు.

"The Times" ఆ ప్రకటనను ప్రచురించ నిరాకరించింది ఈ పత్రానికి సంబంధించిన మార్క్స్ చిత్తుప్రతిలో ఎంగెల్సు కొన్ని సంపాదకీయ మార్పులు చేశాడు – 277.

166 ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్స్ అసోసియేషన్ జనరల్ కౌన్సిలు శాశ్వత అధ్యక్ష పదవి, 1867 సెప్టెంబరు 24న కౌన్సిలు నిర్ణయం మేరకు, రద్దు చెయ్యబడింది – 278.

167 మార్క్స్ లేఖ చిత్తుప్రతి చివరి పేరాలో ఎంగెల్సు చేసిన సంపాదకీయ మార్పులు కొన్ని ఉన్నాయి. "The Standard" యీ లేఖను ప్రచురించ లేదు.

"The Standard" – 1827లో లండన్‌లో స్థాపించబడిన ఒక కన్సర్వేటివ్ వార్తాపత్రిక. – 279, 287, 301.

168 "The Daily News" పత్రికలో 1871 జూన్ 20న జార్జ్ హోలియోక్ అనే ఇంగ్లీషు సంస్కరణవాది లేఖ ఒకటి ప్రచురింపబడింది. ఆ లేఖను దృష్టిలో పెట్టుకొని జనరల్ కౌన్సిల్ విడుదలచేసిన యీ ప్రకటనను ఎంగెల్సు రూపొందించాడు "ఫ్రాన్సులో అంతర్యుద్ధం" అన్న విజ్ఞప్తిపై బురద చల్లాలనీ, తద్వారా బ్రిటిష్ కార్మికులపై దాని ప్రభావాన్ని తగ్గించాలనీ హోలియోక్ ప్రయత్నించాడు, దాని

రచయితలకు బ్రిటిష్ కార్మికవర్గోద్యమంతో సంబంధం లేదని గట్టిగా వాదించాడు. ఒడ్జర్, ల్యుక్రాఫ్ట్‌లను దృష్టిలో పెట్టుకొని, బ్రిటిష్ ట్రేడ్‌యూనియనిస్టు నాయకులకు హోలియోక్ నివాళులర్పించాడు, చట్ట విరుద్ధంగా వాళ్ల పేర్లు విజ్ఞప్తి చివర చేర్చబడ్డాయని ఆరోపించాడు. నిజానికిది, విజ్ఞప్తికి వ్యతిరేకంగా బయటపడి మాట్లాడాల్సిందిగా వాళ్లను ఎగసన త్రొయ్యడమే తప్ప వేరుకాదు. మార్క్స్ అభిమతం మేరకు, జనరల్ కౌన్సిలు తరపున విడుదల చెయ్యబడిన యీ ప్రకటన, "ఫ్రాన్సులో అంతర్యుద్ధం" రచించినది మార్క్సేనని పేర్కొంది. ఈ ప్రకటనను, జనరల్ కౌన్సిల్ 1871 జూన్ 20న ఆమోదించింది. – 280.

169 అభివృద్ధి నిరోధక ఫ్రెంచి పత్రికల నుండి ఇంటర్నేషనల్ ప్రణాళికలనబడేవాటిని (ఫ్రెంచి పోలీసులచేత యివి కల్పించబడ్డాయి) ఇంగ్లీషు వార్తా పత్రికలు పునర్ముద్రించినప్పుడు, వాటికి సంబంధించి, మార్క్స్ ప్రతిపాదన మేరకు, ఎంగెల్సు ఈ లేఖను రాశాడు. ఈ కట్టు కథలను ఖండిస్తూ పత్రికలకు రాయాలన్న మార్క్స్ ప్రతిపాదనను జనరల్ కౌన్సిలు 1871 జూన్ 20న ఆమోదించింది. అయితే, ఆ రెండు పత్రికల్లోనూ ఏ ఒక్కటీ కూడా యీ లేఖను ప్రచురించలేదు.

"The Examiner" – లండన్‌లో 1808 నుండి 1881 దాకా ప్రచురింపబడిన ఒక బూర్జువా లిబరల్ వారపత్రిక. – 282, 288.

170 "The Daily News"లో 1871 జూన్ 26న, ఇంగ్లీషు బిషప్ ఉయెలిన్ డేవిస్, ట్రేడ్‌యూనియనిస్టు బెంజమిన్ ల్యుక్రాఫ్ట్ జార్జ్ హోలియోక్‌లు, జూన్ 21 నాటి జనరల్ కౌన్సిలు ప్రకటనమీద, "ఫ్రాన్సులో అంతర్యుద్ధం"పై మరిన్ని అభాండాలతో కూడిన లేఖలు రాయగా, వాటిపైన మార్క్స్ యీ లేఖ రాశాడు. ల్యుక్రాఫ్ట్, తన లేఖలో "ఫ్రాన్సులో అంతర్యుద్ధం"లోని సూత్రీకరణల పట్ల తన పూర్తి అసంగీకారాన్ని వ్యక్తంచేసి, జనరల్ కౌన్సిలు నుండి తను ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించాడు. బూర్జువా పత్రికల బండారాన్ని బట్టబయలు చేసే మార్క్స్ లేఖలోని రెండవ భాగాన్ని ఆ పత్రిక ప్రకటించ నిరాకరించడంతో, ఆ లేఖను "The Eastern Post"కి పంపడం, దానిలో అది 1871 జూలై 1న ప్రకటింపబడటం జరిగింది. దానితోబాటు, 1871 జూన్ 27 నాటి జనరల్ కౌన్సిల్ సమావేశపు వార్తను (దానిలో, తన లేఖ విషయంలో "The Daily News" ఏకపక్ష వైఖరిని మార్క్స్ పేర్కొన్నాడు) కూడా ఆ పత్రిక ప్రచురించింది. ఆ లేఖా భాగమొకటి 1871 జూన్ 27న "The Pall Mall Gazette"లో కూడా ప్రచురింపబడింది. – 283.

171 డేవిడ్ ఉర్క్యుహార్ట్ అనే ఒక ఇంగ్లీషు కన్సర్వేటివ్ రాజకీయ వేత్త 1830, 1840 దశకాల్లో, పామర్‌స్టన్ విదేశాంగ విధానాన్ని బహిర్గతం చేస్తూ ప్రచురించిన వ్యాసాలకు, పత్రాలకు ప్రస్తావన యిది. దౌత్య పత్రాల సంపుటి "The Portfolio"లోనూ, వివిధ పత్రికల్లోనూ యివి వెలువడ్డాయి. పాలక వర్గాల దౌత్యనీతిని బహిర్గతం చెయ్యడానికి విరామ మెరుగని ఉద్యమం సాగించిన మార్క్స్ 1853లో "లార్డ్ పామర్‌స్టన్" పేర ఉర్క్యుహార్ట్ వరసగా రాసి ప్రచురించిన ఆరోపణపూర్వకమైన వ్యాసాలలోని పత్రాలను కూడా, మిగిలిన ఆధారాలతోబాటు, వాడుకున్నాడు. అయితే అదే సమయంలో, ఉర్క్యుహార్ట్ అభివృద్ధి నిరోధక అభిప్రాయాలు మార్క్స్ నిశితంగా విమర్శించాడు. — 284.

172 1871 జూన్ 26న "The Daily News"లో ప్రచురింపబడిన హోలియోక్, ల్రుకాఫ్ట్‌ల లేఖలకు సంబంధించి ఎంగెల్సు రాసిన జనరల్ కౌన్సిలు ప్రకటనకు ప్రస్తావన యిది. ఈ ప్రకటన, జనరల్ కౌన్సిలుచేత 1871 జూన్ 27న ఆమోదింపబడింది. "ఫ్రాన్సులో అంతర్యుద్ధం" అనే జనరల్ కౌన్సిలు విజ్ఞప్తిని తిరస్కరించిన ట్రేడ్‌యూనియనిస్టులు ల్రుకాఫ్ట్, ఓడ్జర్‌లను జనరల్ కౌన్సిలు ఏక్రీవంగా అభిశంసించింది. జనరల్ కౌన్సిలు నుండి తాము రాజీనామా చేస్తున్నామంటూ వాళ్ళు చేసిన ప్రకటన దృష్ట్యా, వాళ్ళను ఇంటర్నేషనల్ నుండి బహిష్కరిస్తూ జనరల్ కౌన్సిలు ఒక తీర్మానాన్ని ఆమోదించింది. — 285.

173 ఎంగెల్సు వ్యాఖ్య "Der Volksstaat" వార్తాపత్రికలో, ఏ శీర్షికా లేకుండ ప్రచురింపబడింది. సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ నిర్వహణలో మార్క్సిజం లెనినిజం ఇన్‌స్టిట్యూట్‌చేత యిది పద్దయ్ చెయ్యబడింది. — 287.

174 "The Daily Telegraph" — ఇదొక లిబరల్ పత్రిక. 1880 దశకంనుండి కన్సర్వేటివ్ ఇంగ్లీషు వార్తాపత్రిక. 1855 నుండి 1937 వరకు ఆ పేరుతో లండన్ నుండి ప్రచురింపబడిన ఆ పత్రిక, 1937లో "The Morning Post"లో తన సంలీనం నాటినుండి, "The Daily Telegraph and Morning Post" అనే పేరుతో వెలువడింది. — 287, 292.

175 "The Pall Mall Gazette" — 1865 నుండి 1920 వరకు ప్రచురింపబడిన ఒక లండన్ దినపత్రిక. 1860, 1870 దశకాల్లో కన్సర్వేటివ్ పక్షపాతం వహించింది. 1870 లోను, 1871 లోను యిది మార్క్స్ ఎంగెల్సుల రచనల కొన్నింటిని ప్రచురించింది. కాని 1871 జూన్ చివర యీ పత్రిక ఇంటర్నేష

నల్‌కీ, పారిస్ కమ్యూన్‌కీ వ్యతిరేకంగా బూర్జువా పత్రికలు సాగించిన ప్రచారోద్యమంతో గొంతు కలిపింది. తత్ఫలితంగా మార్క్సు ఎంగెల్సులు ఆ పత్రికకు తమ రచనలు పంపటం మానేశారు. – 287.

176 పారిస్ కమ్యూన్‌పైనా, ఇంటర్నేషనల్‌పైనా అభాండాలు వేసేందుకుగాను పారిస్ పోలీసు పత్రికలు కల్పించిన వ్యాసాలకు, ఫోర్జరీ "పత్రాల"కు ప్రస్తావన యిది. కమ్యూనిస్టు లీగ్ సభ్యులపై కలోన్‌లో జరిగిన రెచ్చగొట్టే విచారణను (1852) ఏర్పాటుచేసిన ప్రముఖ ఆర్గనైజరు ష్టీబెర్ నాయకత్వాన ప్రష్యన్ పోలీసులు విప్లవోద్యమానికి వ్యతిరేకంగా – ఉపయోగించిన ఫోర్జరీల వంటివే యివి. – 287.

177 ఈ ఇంటర్వ్యూను న్యూయార్కు వార్తాపత్రిక "The World" లండన్ విలేకరి ఆర్. లాండర్ రికార్డు చేశాడు. దాన్ని ఆ పత్రిక 1871 జూలై 18న ప్రచురించింది. అది "Woodhull and Claflin's Weekly"లో 1871 ఆగస్టు 12న పునర్ముద్రింపబడింది. ఆ వ్యాసాంతంలో లాండర్, తను ఆ ఇంటర్వ్యూను తన జ్ఞాపకం నుండి రికార్డు చేసినట్లు పేర్కొన్నాడు. – 289.

178 అమెరికన్ రచయిత చార్లెస్ గాడ్‌ఫ్రీ లెలండ్ (1824 – 1903) తన హాస్య భరితమైన "హాన్స్ బ్రైట్‌మన్ గీతాలు" అనే రచనలో వాడిన అసాధారణమైన ఆంగ్లో-జర్మన్ మాండలిక యాసకు ప్రస్తావన యిది. – 289.

179 ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్స్ అసోసియేషన్‌యొక్క శాఖల న్యూయార్క్ కేంద్ర కమిటీకి జనరల్ కౌన్సిలు విజ్ఞప్తి రూపంలో మార్క్సు రచించిన "పారిస్‌లోని అమెరికా రాయబారి మిస్టర్ వాష్‌బర్న్"లో యింగ్లీషు పత్రిక అయిన "The Daily Telegraph" పారిస్ విలేకరి రాబర్ట్ రీడ్ రాసిన లేఖా (భాగం I), పారిస్ కమ్యూన్ సభ్యుడూ, జనరల్ కౌన్సిలు సభ్యుడూ అయిన సెరయ్యే పంపిన రిపోర్టు (భాగం II) ఉపయోగించుకోబడ్డాయి. పారిస్ నుండి ఇంగ్లండుకి తిరిగి వచ్చాక, రీడ్ మార్క్సుతోనూ, జనరల్ కౌన్సిలుతోనూ సంబంధం పెట్టుకున్నాడు. పారిస్‌లో తన మకాం కాలంలో పారిస్ కమ్యూన్ పట్ల సానుభూతిని పెంచుకున్న రీడ్, మార్క్సు, జనరల్ కౌన్సిలూ పారిస్ కమ్యూన్‌ను బలపరుస్తూ విడుదల చేసే ప్రకటనలో తన పేరు కలిపాడు. కమ్యూన్‌ని కూల్రదోసేందుకు వాష్‌బర్న్ జరుపుతున్న కుట్రదారీ కార్యకలాపాల సమస్యపై జూలై 7న చర్చ జరిపిన మీదట, జనరల్ కౌన్సిల్ స్థాయీ కమిటీ మార్క్సు పఠించిన విజ్ఞప్తిని

ఆమోదించింది. జూలై 11న జనరల్ కౌన్సిలుచేత ఆ విజ్ఞప్తి ఏకగ్రీవంగా ఆమోదింపబడింది, మొట్టమొదట లండన్‌లో ప్రత్యేకమైన పుస్తకంగా ప్రచురింపబడింది. ఇంటర్నేషనల్ శాఖల న్యూయార్కు కేంద్ర కమిటీ విజ్ఞప్తి పాఠాన్ని పొంది విస్తృతంగా పఠింపబడే న్యూయార్కు బూర్జువా వార్తాపత్రిక "The Sun"లో 1871 ఆగస్టు 1న దాని ప్రచురణను సాధించింది కమ్యూన్ నిజ సారాంశాన్ని వివరిస్తూనూ, వాష్‌బర్న్‌ను సమాజంపై పరభాగ్యోప జీవుల్లా బ్రతికే ఒక బడా కుటుంబ ప్రతినిధిగా అభివర్ణిస్తూనూ ముందొక ఉపోద్ఘాతంతోబాటు అది ప్రచురింపబడింది. బూర్జువా పత్రికలలో వెలువడుతున్న అవినీతికర వార్తలను నమ్మవద్దనీ, కార్మికవర్గ శత్రువుల నుండి అవి వస్తున్నవనీ న్యూయార్కు కమిటీ కార్మికులకు విజ్ఞప్తి చేసింది.

1871 వేసవి, ఆకురాలు కాలాల్లో, యీ విజ్ఞప్తి కూడా యూరప్, అమెరికాల్లోని కార్మికవర్గ పత్రికల్లో పదేపదే ప్రచురింపబడింది వాష్‌బర్న్ చర్యలు బహిర్గతం కాకుండా చూసేందుకుగాను, యీ విజ్ఞప్తి ఫ్రాన్సులో ప్రచురింపబడకుండా త్యేర్ ప్రభుత్వం తన ఏజెంట్ల ద్వారా చర్యలు తీసుకుంది – 292

180 "The New-York Herald" – అమెరికన్ దినపత్రిక, రిపబ్లికన్ పార్టీ అధికార పత్రిక, ఇది న్యూయార్కులో 1835 నుండి 1924 వరకు ప్రచురింపబడింది. – 292.

181 త్యేర్ ప్రభుత్వాన్ని ప్రాభావితం చేసి కమ్యూనార్డుల కాల్చివేతను ప్రతిఘటించేందుకుగాను తదితర హామీ బందీలతోబాటు తను అరెస్టు చేసిన ఆర్చిబిషప్ దార్బువాను, వెర్సేల్స్ అధికారులు జైల్లో నిర్బంధించిన బ్లాంకికి బదులుగా పరటా చెయ్యమన్న పారిస్ కమ్యూన్ ప్రతిపాదనను దానిచేత ఆమోదింప చెయ్యడానికి వాష్‌బర్న్ ప్రత్యక్ష నిరాకరణకు ప్రస్తావన యిది. ఆర్చిబిషప్ కాల్చివెయ్యబడిన అనంతరం వెర్సేల్స్ అధికారుల దౌర్జన్యకాండను నిలుపు చేసేందుకుగాను గత్యంతరం లేక కమ్యూన్ తీసుకున్న యీ చర్యను ఆధారం చేసుకొని, వాష్‌బర్న్ పారిస్ కమ్యూనుపై అభాండాలు వేస్తూ వ్యాసాలు ప్రచురించాడు, ఉపన్యాసా లిచ్చాడు. – 295

182 ఎంగెల్సు రాసిన యీ లేఖకి ముందు మార్క్సు దీన్ని గురించి వివరిస్తూ ఒక లేఖ రాశాడు, అది యిక్కడ ప్రచురింపబడ లేదు. "The Times" యీ రెండు పత్రాల్లో ఏ ఒక్క దాన్నీ ప్రచురించ లేదు. – 298.

183 ఫ్రెంచి ప్రభుత్వపు అధికార పత్రికకు ప్రస్తావన యిది. – 298.



పారిస్‌లోని పేర్‌లషేజ్ శ్మశానంలో కమ్యూన్ యోధులకు స్మారక చిహ్నం

184 మొదటి ఇంటర్నేషనల్ లండన్ మహాసభ, పారిస్ కమ్యూన్ ఓటమి దరిమిలా, ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్స్ అసోసియేషన్ సభ్యులపై తీవ్రమైన దమన చర్యలు జరపబడుతున్న వాతావరణంలో, 1871 సెప్టెంబరు 17 నుండి 23 వరకు జరిగింది. అది పెద్ద మహాసభ ఏమీ కాదు, రహస్యంగా జరిగింది. శ్రామికవర్గ పార్టీ సంస్థాపనకై మార్క్స్ ఎంగెల్సులు జరుపుతున్న పోరాటంలో ముఖ్యమైన ఒక ఘట్టాన్ని అది సూచిస్తుంది. అంతర్జాతీయ కార్మికవర్గోద్యమానికి కీలక సూత్రంగా, స్వతంత్ర శ్రామికవర్గ పార్టీ ఆవశ్యకతను సూత్రీకరించే "కార్మిక వర్గ రాజకీయ కార్యాచరణ" అన్న ఒక తీర్మానాన్ని ఆ మహాసభ ఆమోదించింది. అది చేసిన అనేక యితర తీర్మానాలు శ్రామికవర్గ పార్టీకి సంబంధించిన అత్యంత ముఖ్యమైన ఎత్తుగడలకూ, నిర్మాణానికీ సంబంధించిన సూత్రాలను రూపొందించి, ఒంటెత్తు పోకడనూ, సంస్కరణవాదాన్నీ తీవ్రంగా దెబ్బతీశాయి. బకూనినిజంకి వ్యతిరేకంగా మార్క్స్ ఎంగెల్సులూ, వారిని బలపరచేవారూ సాగించిన రాజీలేని పోరాటమే ఆ మహాసభ కీలకాంశం. అరాజకత్వ అవకాశవాదంపై శ్రామికవర్గ పార్టీ సూత్రాల విజయంలో యీ మహాసభ ఒక ముఖ్యమైన పాత్ర వహించింది. – 302.

185 జర్మనీకి జనరల్ కౌన్సిలు ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపే కార్యదర్శిగా మార్క్స్ యిచ్చిన క్లుప్తమైన రిపోర్టిది. – 303.

186 ఇంటర్నేషనల్ ఏడవ వార్షికోత్సవ సందర్భంగా జరిగిన ఒక ప్రత్యేక సభలో మార్క్స్ యిచ్చిన ఉపన్యాసమిది. ఈ సభకు జనరల్ కౌన్సిలు సభ్యులూ, పారిస్ కమ్యూనులో పాల్గొన్నవారూ, మార్క్స్ ఎంగెల్సుల అనుచరులూ హాజరయ్యారు. – 304.

187 "ఇంటర్నేషనల్‌లో కల్పిత చీలికలు" – ఇది, ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్స్ అసోసియేషన్ జనరల్ కౌన్సిలుయొక్క సభ్యులకు మాత్రమే పరిమితమైన ఒక సర్క్యులరు. మార్క్స్ ఎంగెల్సులు 1872 జనవరి మధ్యకీ మార్చి మొదలుకీ మధ్యకాలంలో దీన్ని రచించారు. ఇంటర్నేషనల్‌ను చీల్చాలనీ, దాని నాయకత్వాన్ని హస్తగతం చేసుకోవాలనీ ప్రయత్నిస్తున్న బకూనినిస్టులకు వ్యతిరేకంగా మార్క్స్ ఎంగెల్సులు చేసిన పోరాటంలో ముఖ్యమైన ఒక దశ దీనితో పూర్తి అయింది. అన్ని దేశాల శ్రామికవర్గం ముందూ, అరాజకవాదుల నిజాశయాలనూ, కార్మికవర్గానికి శత్రువులైన వ్యక్తులతో వాళ్ల సంబంధాలనూ, కార్మికవర్గోద్యమానికి ప్రతికూలమైన ఒక బృందంగా బకూనిన్‌యొక్క "సోషలిస్టు-డెమోక్రసీయొక్క అలయన్స్" (95వ వివరణ చూడండి) కార్యకలాపాలనూ అది బహిర్గతం చేసింది. – 305.

188 వెర్సైల్స్ ప్రభుత్వ ప్రాసిక్యూషను నుండి పారిపోయివచ్చిన కమ్యూనార్డులు లండన్

చేరుకున్న దృష్ట్యా, 1871 జూన్ నుండి జనరల్ కౌన్సిలు నిధులు వసూలు చెయ్యడంలోను, పంపిణీ చెయ్యడంలోను, కమ్యూన్ కాందిశీకులకు వృత్తి ఉద్యోగ కల్పనలోను నిమగ్నమైంది. ఈ కార్యకలాపాలను మార్క్సు నిర్వహించాడు. కాందిశీకుల సహాయార్థమై జూలైలో జనరల్ కౌన్సిలు ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. దానిలో మిగిలిన కౌన్సిలు సభ్యులతో బాటు మార్క్సు ఎంగెల్సు ఉన్నారు. – 305.

189 1850 దశకం చివరి నుండి, 9 గంటల పనిదినమన్నది, ఇంగ్లీషు కార్మికుల ప్రధానమైన డిమాండ్లలో ఒకటిగా ఉంది. 1871 మేలో, న్యూకాస్ల్‌లోని బిల్డింగ్, ఇంజనీరింగు పరిశ్రమ కార్మికులు పెద్ద సమ్మె చేశారు. 9 గంటల పనిదినం కొరకు పోరాటపు లీగు దానికి నాయకత్వం వహించింది. ట్రేడ్‌యూనియనేతర కార్మికులను సైతం లీగు సమ్మెలో పాల్గొన చెయ్యడంతో, సమ్మె తారస్థాయిని అందుకుంది. సమ్మె విచ్ఛిన్నకులను బ్రిటన్‌కి దిగుమతి చెయ్యడాన్ని విరోధించ డంలో తోడ్పడాల్సిందిగా ఇంటర్నేషనల్ జనరల్ కౌన్సిలుకి లీగు విజ్ఞప్తి చేసింది. ఈ సందర్భంగా, న్యూకాస్ల్‌లో జరుగుతున్న పోరాట ప్రాముఖ్యాన్ని కార్మికులకు తెలియచెప్పడానికి గాను, జనరల్ కౌన్సిలు తన సభ్యుల్లో యిద్దరిని యూరప్ ఖండానికి పంపింది. ఇంటర్నేషనల్ చేసిన తీవ్ర కృషి మూలంగా, సమ్మె విచ్ఛిన్నకుల దిగుమతి ప్రయత్నం భగ్నం చెయ్యబడింది, 1871 అక్టోబరులో న్యూకాస్ల్‌లోని సమ్మె కార్మికులకు అనుకూలంగా విజయవంతంగా ముగిసింది. –306.

190 1872 ఫిబ్రవరి 20న, పారిస్ కమ్యూన్ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా, లండన్‌లో బహిరంగ సభ జరపాలని జనరల్ కౌన్సిలు తీర్మానించింది. దాని సన్నా హాల కోసం ఓ ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చెయ్యబడింది. మార్క్సు ఒక వక్తగా నియమింపబడ్డాడు. అయితే, ఆ హాలు యజమాని, సమావేశం కోసం దాన్నివ్వ నిరాకరించడంతో ఆ బహిరంగ సభ జరగలేదు. అయినా కూడా, ఇంటర్నేషనల్ సభ్యులూ, పూర్వపు కమ్యూనార్డులూ, తొలి శ్రామికవర్గ విప్లవ వార్షికోత్సవాన్ని జరుపుకొనేందు కోసం మార్చి 18న సమావేశమయ్యారు. కమ్యూనార్డుల థేయిస్, కమెలీన్‌లూ, జనరల్ కౌన్సిల్ సభ్యుల్లో ఒకడైన మిల్నెరూ చేసిన ప్రతి పాదన మేరకు, ఆ సమావేశం, యిక్కడ పేర్కొనబడిన మూడు తీర్మానాలను ఆమోదించింది. వార్తాపత్రికల్లో ప్రకటింపబడినవే కాకుండా, వీటి పాఠం, మార్క్సు కుమార్తె జెన్నీ కాపీ చేసిన వ్రాతప్రతి రూపంలో కూడా వుంది. దాన్ని రచయిత సరిచూశాడు. – 307.

191 "కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక" జర్మన్ కూర్పు, మార్క్సు ఎంగెల్సుల పీఠికతో,

పాఠంలో కొన్ని చిన్న సరిదిద్దుబాట్లతో, జర్మన్ సోషల్-డెమోక్రటిక్ కార్మిక పార్టీ కేంద్ర పత్రిక అయిన "Der Volksstaat" చొరవతో వెలువరింపబడింది. 1883, 1890ల నాటి తదుపరి ముద్రణల్లాగే 1872 నాటి ముద్రణ "కమ్యూనిస్టు ప్రణాళిక" శీర్షికతో వెలువడింది. — 308.

192 1881 మార్చి 1న, చక్రవర్తి రెండవ అలెగ్జాండర్ సెయింట్ పీటర్స్‌బుర్గ్‌లో హత్య చెయ్యబడ్డాడు. "నరోద్నయ వోల్య" ("ప్రజా స్వేచ్ఛ") అనే రహస్య విప్లవ సంఘం కార్యనిర్వాహకవర్గం విధించిన తీర్పు మేరకు యీ రాజకీయ హత్య జరిగింది. — 309.

193 1878లో ఆమోదింపబడిన సోషలిస్టు వ్యతిరేక చట్టానికి (6వ వివరణ చూడండి) ప్రస్తావన యిది. 1880 వసంతకాలంలో యిది మరో అయిదేళ్ల పాటు పొడిగింపబడింది. — 309.

194 పారిస్ కమ్యూన్ 15వ వార్షికోత్సవ సందర్భంగా, తమతో బహిరంగ సంఘీభావాన్ని వ్యక్తం చెయ్యాల్సిందన్న ఫ్రెంచి సోషలిస్టుల కోర్కె మేరకు ఈ లేఖను ఎంగెల్సు రాశాడు. — 311.

195 1885 దాకా, ఫ్రాన్సులో "చిన్న నియోజకవర్గాల" ఎన్నికల పద్ధతి అమల్లో వుంది. దాని మేరకు ప్రతి ఒక నియోజకవర్గం నుండీ ప్రతినిధుల సభకు ఒక డిప్యూటీ ఎన్నుకోబడుతూ వచ్చాడు. 1885 జూన్‌లో, మోడరేట్ బూర్జువా రిపబ్లికన్ల చొరవ మేరకు, డిపార్టుమెంట్ ఓటర్ల జాబితా ప్రకారం జరిగే ఎన్నికల పద్ధతి అమల్లోకి వచ్చింది. 1889 దాకా అమల్లో వున్న యీ పద్ధతి, చిన్న నియోజకవర్గాలను పెద్ద వాటిగా కలిపింది, అటువంటి పెద్ద నియోజకవర్గం ప్రతి ఒక్కటీ డిపార్టుమెంటును పోలి వుంది. దీనిలో, ఓటింగు ఓటర్ల జాబితా మేరకు జరుగుతుంది. వివిధ పార్టీల నుండి అభ్యర్థులుంటారు. అయితే, ఆయా డిపార్టుమెంట్లలో పోటీ చేసే మొత్తం అభ్యర్థులకు ఓటర్లు తమ ఓట్లను వెయ్యాలన్న నిబంధన ఒకటి వుంది. 70,000 జనాభాకి ఒక్కొక్క డిప్యూటీ చొప్పున ఎన్నుకోబడతాడు. మొదటి విడతలో, పోలైన మొత్తం ఓట్లన్నింటిలోనూ ఖచ్చితమైన మెజారిటీ వస్తేనే ఒక అభ్యర్థి డిప్యూటీగా ఎన్నుకోబడినట్లు పరిగణింపబడతాడు. రెండవ విడతలో, సామాన్య మెజారిటీ వచ్చినా అభ్యర్థి ఎన్నికైనట్లు పరిగణింపబడతాడు. — 312.

196 1789, జూలై 14 — బస్టీల్ జైలును పారిస్ ప్రజలు పట్టుకున్న రోజు, 18వ శతాబ్దాంతపు ఫ్రెంచి బూర్జువా విప్లవారంభం.

1792, సెప్టెంబరు 22 – 1792 సెప్టెంబరు 21న ప్రకటించబడిన ఫ్రెంచి రిపబ్లిక్ మొట్టమొదటి రోజు. 1793లో ఆమోదించబడిన విప్లవ కాలెండరులో అది మొదటి తేదీ. – 313.

197 ఫ్రెంచి వర్కర్స్ పార్టీ – జూల్ గెడ్, పాల్ లఫార్గ్‌ల నాయకత్వాన, 1879లో స్థాపించబడిన తొలి ఫ్రెంచి మార్క్సిస్టు పార్టీ. 1880 దశకంలోను, 1890 దశకం ప్రథమార్ధ భాగంలోనూ యీ పార్టీ కార్యక్రమం క్రమంగా మార్క్స్ ఎంగెల్సులచేత ప్రభావితం చెయ్యబడుతూ వచ్చింది. 1880లో మార్క్స్ పార్టీ కార్యక్రమానికి అవతారిక రచించాడు.

పార్టీ పాసిబిలిస్టుల (18వ వివరణ చూడండి) నుంచి వేరుపడి, పారిశ్రామిక ప్రాంతాల్లో తన పునాదిని నెలకొల్పుకొని, ఫ్రెంచి శ్రామికవర్గంపై తన పలుకుబడిని బలపరచుకొంది. అది మార్క్సిస్టు భావాలను వ్యాపింపచేసింది, సంస్కరణవాదాన్నీ, రాజీతత్వాన్నీ వ్యతిరేకించింది, అంతర్జాతీయ కార్మికవర్గోద్యమ ఐక్యత కోసమూ, ఫ్రెంచి బూర్జువావర్గపు వలస విధానానికి వ్యతిరేకంగానూ పోరాడింది. కానైతే యీ పార్టీ 1890 దశకంలో రకరకాల ఒంటెత్తువాద, పిడివాద పొరపాట్లు చేసింది. 1900వ సంవత్సరంలో అది, రివల్యూషనరీ సోషలిస్టు యూనియన్‌ను స్థాపించడంలో మిగిలిన విప్లవ గ్రూపులతో కలిసింది. ఈ యూనియనే దరిమిలా ఫ్రాన్స్ సోషలిస్టు పార్టీగా పరివర్తన చెందింది. – 315.

198 అభివృద్ధి నిరోధక ఫ్రెంచి "Paris-Journal" ("పారిస్ పత్రిక") 1871 మార్చి 14న, "Le Grand Chef de L'International" ("ఇంటర్నేషనల్ అధిపతి") అనే పేర ఒక వ్యాసం ప్రచురించింది. ఇంటర్నేషనల్‌కు చెందిన ఫ్రెంచి, జర్మన్ సభ్యుల మధ్యగల విభేదాలను వెల్లడిస్తూ సెక్రయ్యేకి మార్క్స్ రాసిన లేఖ ఒకటి తనదగ్గర ఉన్నట్లు అది బుకాయించింది. ఆ కల్పిత లేఖను అది మార్చి 19న ప్రచురించింది. ఈ అభాండాలను "The Times"తో బాటు లండన్ పత్రికలు అందుకున్నాయి. 1871 మార్చి 21న జరిగిన జనరల్ కౌన్సిలు సమావేశంలో మార్క్స్, మార్క్స్ కోర్కె మేరకు, "The Times"కి ప్రత్యేకించి రాసిన ఒక లేఖలో ఎంగెల్సు ఇంటర్నేషనల్‌కి చెందిన ఫ్రెంచి, జర్మన్ సభ్యుల మధ్య చీలిక సృష్టించడానికి "Paris-Journal" చేస్తున్న ప్రయత్నాన్ని బహిర్గతం చేశారు. దీనికితోడు, మార్క్స్ కోర్కె మేరకు, "Paris-Journal"యొక్క రెచ్చగొట్టే అభూత కల్పనలను బట్టబయలుచేసే మరో లేఖ సెక్రయ్యేచేత రచించబడింది. (మార్క్స్, యీ లేఖకు "Courier

de l'Europe"లో ప్రచురింపబడిన 1871 మార్చి 16 నాటి లేఖ పాఠాన్ని జత చేశాడు.)

ఇంటర్నేషనల్‌కి చెందిన పారిస్ శాఖ నుండి జర్మన్ జాతీయులను బహిష్కరిస్తున్నారని ఆరోపిస్తూ ఫ్రెంచి అభివృద్ధి నిరోధక పత్రికలు ప్రకటించిన రెచ్చగొట్టే మరో అభూత కల్పనను, 1871 మార్చి 21న జరిగిన జనరల్ కౌన్సిలు సమావేశం బహిర్గతం చేసింది. ఇంటర్నేషనల్‌కి చెందిన పారిస్ సభ్యులు చదువుతారన్న ఆశాభావంతో మార్క్స్ యీ పత్రాలను లఫార్గ్‌కి పంపాడు.

"Courier de l'Europe" అర్లియనిస్టు వార్తాపత్రిక, ఇది లండన్‌లో 1840 నుండి 1899 దాకా ప్రచురింపబడింది. – 319.

199 1871 మార్చి మాసం ప్రథమార్ధంలో పారిస్‌లో నెలకొల్పబడిన "ప్రష్యన్ వ్యతిరేక లీగ్" (Ligue anti-prussienne)కు ప్రస్తావన యిది.

జాకీ క్లబ్బు – 1833లో స్థాపింపబడిన ఒక ప్రభువర్గ క్లబ్బు. – 320.

200 ఫ్రెంచి ప్రష్యన్ యుద్ధంలో జర్మనీ విజయోత్సవం జరిపేందుకుగాను, ఆస్తిపర వర్గాలకు చెందిన జర్మన్లు 1871 మార్చిలో జూరిచ్‌లో ఒక సమావేశం జరిపారు. ఆ సమావేశంలో, స్విట్జర్లండులో నిర్బంధింపబడిన ఫ్రెంచి ఆఫీసర్ల బృందమొకదానికీ జర్మన్లకీ మధ్య కొట్లాట జరిగింది. వివిధ దేశాలకు చెందిన కార్మికుల మధ్య అంతర్జాతీయ సంబంధాలను దిగదీసేందుకు గాను అభివృద్ధి నిరోధక పత్రికలు రెచ్చగొట్టే ప్రచారం సాగించి, ఇంటర్నేషనలే యీ ఘటనలు సాగించిందని ఆరోపించాయి. ఇంటర్నేషనల్‌కి చెందిన స్విస్ శాఖ బూర్జువా పత్రికల దుష్ప్రచార బండారాన్ని బహిర్గతం చేస్తూ ఒక ప్రత్యేక ప్రకటనను విడుదల చేసింది. ఇంటర్నేషనల్ సభ్యులకు ఆ కొట్లాటతో ఎటువంటి సంబంధమూ లేదని జూరిచ్‌లోని పలు ట్రేడ్‌యూనియన్లు కూడా అదే విధంగా ప్రకటనలు చేశాయి. –320.

201 "Courier de Lyon" – 1834 నుండి 1939 వరకు ప్రచురింపబడిన ఒక బూర్జువా-రిపబ్లికన్ వార్తాపత్రిక.

"Courier de la Gironde" – బోర్డోలో 1792 నుండి ప్రచురింపబడిన ఒక అభివృద్ధి నిరోధక పత్రిక. – 320.

202 రోమన్ రిపబ్లిక్కుపై ఫ్రెంచి సేనల దాడికి నిరసనగా పారిస్ నేషనల్ గార్డు జరిపిన ప్రదర్శనకు ప్రస్తావన యిది (59వ పేజీ, 47వ వివరణ చూడండి). – 322.

203 జనరల్ కౌన్సిలు ఫ్రెంచి సభ్యులైన సెరయ్యే, డుపాన్‌లను గురించి, పారిస్ కమ్యూన్‌కి వాళ్ల ఎన్నిక సందర్భంగా, పియా, వెసిన్యేల అభూత కల్పనలకు జవాబివ్వాల్సిందిగా 1871 ఏప్రిల్ 25న జనరల్ కౌన్సిల్ ఆదేశించినప్పుడు మార్క్స్ యీ లేఖ చిత్తుప్రతిని రచించాడు. 1871 ఏప్రిల్ ఉప ఎన్నికలో కమ్యూన్ సభ్యుడుగా ఎన్నుకోబడి, ఫ్రాంకెల్ నాయకత్వాన కార్మిక, వాణిజ్య కమిషన్ సభ్యుడుగా నియమింపబడిన పారిస్‌లో జనరల్ కౌన్సిల్ ప్రతినిధి సెరయ్యే పైన ప్రత్యేకించి, అభాండాలు వేసేందుకు పియా ప్రయత్నించాడు. కమ్యూన్‌లో సెరయ్యే పలుకుబడిని తగ్గించే ప్రయత్నంలో, సెరయ్యే రాజకీయ, నైతిక ప్రతిష్ఠపై తూరుపూసేందుకు గాను తప్పుడు పుకార్లను పియా వ్యాపింపచేశాడు. అందుకు సంబంధించిన సమాచార మంతటినీ అధ్యయనం చేసిన మీదట, కార్మిక, వాణిజ్య కమిషన్, యీ అభాండాలను పూర్తిగా తిరస్కరించింది. – 324.

204 బోర్డోలో 1871 ఏప్రిల్‌లో జరిగిన మునిసిపల్ ఎన్నికల్లో, (వీటిలో ప్రజాస్వామిక శక్తులు విజయం సాధించాయి) ఇంటర్నేషనల్ శాఖకి చెందిన నలుగురు అభ్యర్థులు ఎన్నుకోబడ్డారు. వారి ఎన్నికల ప్రణాళిక పారిస్ కమ్యూన్ కార్యక్రమాన్ని పోలివుంది. – 326.

205 1871 మే 25న జర్మన్ రైహ్‌స్టాగ్ (పార్లమెంటు)లో బేబెల్ ప్రసంగ ప్రస్తావన యిది. దానిలో, కమ్యూనార్డులకి వ్యతిరేకంగా బూర్జువా – భూస్వామ్య ప్రతినిధులు వేస్తున్న అభాండాలకీ, చేస్తున్న దాడులకీ వ్యతిరేకంగా కమ్యూనార్డులను అతను గట్టిగా బలపరచాడు. అతను తన ప్రసంగాన్ని యీ క్రింది మాటలతో ముగించాడు: "పారిస్ శ్రామికవర్గ సమీకరణ నినాదమైన 'రాజ ప్రాసాదాలపై సమరం; పేదల గుడిసెలకు శాంతి, లేమికీ, సోమరితనానికీ స్వస్తి!' – అన్నది యావత్తు యూరపియన్ శ్రామికవర్గ సమీకరణ నినాదమవుతుంది." – 329.

206 ఈ విజ్ఞప్తిని మార్క్స్ రచించి, సోర్గెకి పంపాడు. దీని పాఠం లభ్యం కావడం లేదు. – 329.

207 యూరప్‌లోని అభివృద్ధి నిరోధక ప్రభుత్వాలు ఇంటర్నేషనల్‌కు వ్యతిరేకంగా చేపట్టిన యీ క్రింది చర్యలకు ప్రస్తావన యిది. పారిస్ కమ్యూన్ ఓటమి తర్వాత ప్రత్యేకించి యివి ముమ్మరం చెయ్యబడ్డాయి:

1870 సెప్టెంబరు 9న, జర్మనీలో, జర్మన్ సోషల్-డెమోక్రటిక్ వర్కర్స్ పార్టీ కమిటీ సభ్యులైన బ్రాకె, బొన్‌హోర్స్ట్, షీప్ర్, క్యూన్, గ్రాల్లెలు అరెస్టుచెయ్యబడ్డారు; వీరికితోడు ప్రింటరు సీవెర్స్, ఫ్రాన్సుకి వ్యతిరేకంగా

ప్రష్యా చేసే యుద్ధంలో ప్రష్యా నిజలక్ష్యాలను బహిర్గతం చేసే ఒక ప్రణాళికను 1870 సెప్టెంబరు 5న ప్రకటించినందుకుగాను అరెస్టు చెయ్యబడ్డాడు. పలు మాసాల నిర్బంధానంతరం, 1871 నవంబరులో, కమిటీ సభ్యులపై పోలీసులు ప్రజా భద్రతను భగ్నం చేశారంటూ నేరారోపణలు బనాయించి, జైలు శిక్ష విధింపచేశారు.

1870 జూలైలో, ఆస్ట్రియన్ సోషల్-డెమోక్రట్లు ఓబర్‌విండెర్, మోస్ట్, ఎ. షెయీూ తదితరులపైనా, వాళ్ల విప్లవ కార్యకలాపాలనే దేశద్రోహంగా చిత్రించి, దీర్ఘకాల జైలుశిక్షలు విధించారు.

1871 ఆగస్టు 20న, ఇంటర్నేషనల్‌కు చెందిన నేపుల్సు శాఖను పోలీసులు భగ్నం చేశారు.

1871 వసంత, వేసవి కాలాల్లో, స్పానిష్ ప్రభుత్వం, కార్మికవర్గ సంఘాల పైనా, ఇంటర్నేషనల్ శాఖలపైనా దమనకాండ చర్యలు జరిపింది. ఈ సందర్భంగా, స్పానిష్ ఫెడరల్ కౌన్సిల్ సభ్యులు మోర, మొరాగో, లొరేంజోలు లిస్బన్‌కి ప్రవాసులుగా వెళ్లిపోవాల్సి వచ్చింది. – 329.

208 1871 జూన్‌లో, భరింపశక్యం కాని పనిపరిస్థితులపై, సెయింట్ గలెన్ జౌళి మిల్లులలోని ఫినిషింగ్ కార్మికులకూ యజమానులకూ మధ్య తగాదా ప్రారంభమైంది. కార్మికులు తక్కువ పనిగంటలనూ, అధిక వేతనాలనూ డిమాండ్ చేశారు. యజమానులు కార్మికుల ప్రతినిధివర్గాన్ని కలుసుకోడానికి తిరస్కరించారు, ఇంటర్నేషనల్ సభ్యులను బర్తరఫ్ చేశారు. ప్రారంభమైన సమ్మెను ఇంటర్నేషనల్‌కి చెందిన స్విస్ సంఘాలు బలపరచాయి. దానితో కార్మికులు ఆ సమ్మెను 1871 సెప్టెంబరు వరకు కొనసాగించగలిగారు. అధికారుల జోక్యంతో చివరికది రాజీతో ముగిసింది. కార్మికుల డిమాండ్లన్నీ తీర్చబడకపోయినా, శ్రామిక వర్గ సంఘీభావాన్ని సంఘటితం చెయ్యడంలోనూ, సెయింట్ గలెన్‌లో ఇంటర్నేషనల్ సంస్థని విస్తరింపచెయ్యడంలోనూ యీ సమ్మెకు విశేషమైన ప్రాముఖ్యం ఉంది. – 330.

209 "Kölnische Zeitung" ("కొలోన్ వార్తాపత్రిక") – 1802 నుండి కొలోన్‌లో ఆ పేర ప్రచురింపబడిన ఒక జర్మన్ దినపత్రిక, రైన్‌లాండ్ బడా బూర్జువావర్గంయొక్క, నేషనల్ లిబరల్ పార్టీయొక్క అధికార పత్రిక. 1870 దశకంలో అది బిస్మార్కు వాణిగా పరిగణింపబడింది. – 330.

210 1874 ఆగస్టులో, సోర్గె, హేగ్ మహాసభ నిర్ణయం మేరకు 1872లో న్యూయార్కుకి బదిలీ చెయ్యబడిన ఇంటర్నేషనల్ జనరల్ కౌన్సిల్ నుంచి బయటకు వెళ్లాడు. సోర్గె అధికారిక రాజీనామా 1874 సెప్టెంబరులో వచ్చింది. –331.

# పేర్ల సూచి


అఫ్ర్ (Affre), డెనిస్ ఒగూస్ట్ (1793 – 1848) – పారిస్ ఆర్చిబిషప్ (1840 – 48); 1848 జూన్ నాటి పారిస్ తిరుగుబాటులో తిరుగుబాటు కార్మికులచేత ఆయుధాలు క్రిందపెట్టించాలని ప్రయత్నిస్తూండగా, ప్రభుత్వ సేనలచేత కాల్చి వెయ్యబడ్డాడు. – 106, 126, 228.

అలెక్సాండ్రర్, రెండవ (Alexander II) (1818 – 1881) – రష్యన్ చక్రవర్తి (1855-81). – 49.

అలెగ్జాండ్రా (Alexandra) (1844 – 1925) – డెన్మార్కు రాజు తొమ్మిదవ క్రిస్టియన్ కుమార్తె; 1863లో వేల్సు యువరాజు ఎడ్వర్డును పెళ్లిచేసుకుంది; అతడే 1901లో ఏడవ ఎడ్వర్డ్ పేర ఇంగ్లీషు రాజయ్యాడు. – 70, 227.

అస్సీ (Assi), అడొల్ఫ్ అల్ఫాన్స్ (1840 – 1886) – మెకానిక్కు; ఫ్రెంచి కార్మికవర్గోద్యమంలో చురుకుగా పనిచేశాడు; నేషనల్ గార్డు కేంద్ర కమిటీలోను, పారిస్ కమ్యూన్‌లోను సభ్యుడు; కమ్యూన్ అణచివెయ్యబడిన తర్వాత న్యూ కాలెడోనియాకు ప్రవాసం పంపబడ్డాడు. – 264, 278, 300.

అర్నాల్డు (Arnold), జార్జ్ (జననం: 1840) – శిల్పి; నేషనల్ గార్డు కేంద్ర కమిటీ, పారిస్ కమ్యూనుల్లో సభ్యుడు; కమ్యూన్ అణచివెయ్యబడిన తర్వాత న్యూ కాలెడోనియాకు ప్రవాసం పంపబడ్డాడు. – 296.

ఆర్లియన్స్ (Orleans) – ప్రభువులు (డ్యూక్స్), బూర్బన్ రాజవంశానికి చెందిన చిన్న వంశవృక్షం, వీళ్లు 1830 నుండి 1848 వరకు అధికారంలో వున్నారు. – 88.

ఉడినో (Oudinot), నికొలా షర్ల్ విక్టోర్ (1791 – 1863) – ఫ్రెంచి జనరల్, ఆర్లియనిస్టు; 1849లో రోమన్ రిపబ్లిక్కును నాశనం చేసిన సేనలకు నాయకత్వం వహించాడు. – 219.

ఉర్కుహార్ట్ (Urquhart), డేవిడ్ (1805 – 1877) – స్కాటిష్ దౌత్యవ్యవహర్త, అభివృద్ధినిరోధక పత్రికా రచయిత, రాజకీయవేత్త, టర్కిష్ అభిమాని; పామర్స్టన్ యొక్క, విగ్గులయొక్క విదేశాంగ విధానాలకు గట్టి ప్రత్యర్థి. – 284.

ఎంగెల్స్ (Engels), ఎలిజబెత్ ఫ్రాంజిస్కా (1797 – 1873) – ఎఫ్. ఎంగెల్సు తల్లి. – 330.

ఎంగెల్స్ (Engels), ఫ్రెడరిక్ (1820 – 1895). – 23, 91, 261, 265, 271, 280, 283, 298, 299, 308, 309, 311, 313–315, 330, 331, 333.

ఎక్కారియుస్ (Eccarius), యోహాన్ గెయోర్గ్ (1818 – 1889) – అంతర్జాతీయ, జర్మన్ కార్మికవర్గోద్యమంలో ప్రముఖ వ్యక్తి, కార్మికవర్గ పత్రికా రచయిత, వృత్తిరీత్యా టెయిలర్; లండన్‌కి ప్రవాసిగా వెళ్లాడు; న్యాయవరుల లీగు సభ్యుడు, తర్వాత కమ్యూనిస్టు లీగ్ సభ్యుడు; మొదటి ఇంటర్నేషనల్ జనరల్ కౌన్సిలు సభ్యుడు (1864 – 72), కౌన్సిలు ప్రధాన కార్యదర్శి (1867 – 71); అమెరికాకు ఉత్తరప్రత్యుత్తరాలు జరిపే కార్యదర్శి (1870 – 72); అటుతర్వాత బ్రిటిష్ ట్రేడ్‌యూనియన్ల సంస్కరణవాద (రిఫార్మిస్టు) నాయకులతో చేరాడు. – 321.

ఎయ్‌లౌ, ఎన్. (Eilau) – జర్మన్ వర్తకుడు, మార్క్స్‌కీ పారిస్ కమ్యూన్ సభ్యులకీ మధ్య పత్రాలనూ, లేఖలనూ అందజేసి, వార్తావహుడుగా వ్యవహరించాడు. – 326, 327.

ఎస్పార్టేరో (Espartero), బెల్డోమేరో (1793 – 1879) – స్పానిష్ జనరల్, రాజకీయవేత్త, ప్రోగ్రెసిస్టుల నాయకుడు, స్పెయిన్ రీజెంటు (1841 – 43), ప్రభుత్వాధినేత (1854 – 56). – 59, 139, 219.

ఏడ్ (Eudes), ఎమీల్ డెజిరే ఫ్రాంసువా (1843 – 1888) – ఫ్రెంచి విప్లవకారుడు, బ్లాంకీ అనుచరుడు, నేషనల్ గార్డు జనరల్, పారిస్ కమ్యూన్ సభ్యుడు; కమ్యూన్ అణచివెయ్యబడిన తర్వాత స్విట్జర్లండుకీ, ఆ తర్వాత ఇంగ్లండుకీ

ప్రవాసం వెళ్లాడు; 1880 క్షమాదానం క్రింద ఫ్రాన్సుకి తిరిగి వచ్చాక, బ్లాంకీస్టుల సెంట్రల్ రివల్యూషనరీ కమిటీ నిర్వాహకుల్లో ఒకడయ్యాడు. – 31.

ఒరేల్ డి పలడీన్ (Aurelle de Paladinas), లూయీ జాన్ బాటిస్ట్ డి (1804 – 1877) – ఫ్రెంచి జనరల్, క్లెరికల్, ఫ్రెంచి ప్రష్యన్ యుద్ధంలో పాల్గొన్నాడు; 1871 మార్చిలో పారిస్ నేషనల్ గార్డుకి కమాండర్-ఇన్-ఛీఫ్; 1871 నాటి జాతీయ అసెంబ్లీ సభ్యుడు. – 65, 66, 68, 120, 202, 203, 205, 250, 261.

ఒలివ్యే (Ollivier), ఎమిల్ (1825 – 1913) – ఫ్రెంచి రాజకీయవేత్త, మోడరేట్ బూర్జువా రిపబ్లికన్; 1860 దశకం చివరి నుండి బోనపార్టిస్టు; ప్రభుత్వాధినేత (జనవరి – ఆగస్టు 1870). – 129, 233.

ఒడ్జర్ (Odger), జార్జి (1820 – 1877) – బ్రిటిష్ ట్రేడ్‌యూనియన్ల సంస్కరణవాద నాయకుడు; బూట్ల తయారీదారు; మొదటి ఇంటర్నేషనల్ జనరల్ కౌన్సిలు సభ్యుడు (1864 – 71), దాని అధ్యక్షుడు (1864 – 67). ఎన్నికల సంస్కరణోద్యమ కాలంలో బూర్జువావర్గంతో రాజీ కుదుర్చుకున్నాడు; 1871లో పారిస్ కమ్యూన్‌నీ, జనరల్ కౌన్సిలు విజ్ఞప్తి "ఫ్రాన్సులో అంతర్యుద్ధాన్నీ" ఖండించాడు. కౌన్సిలు నుండి ఉపసంహరించుకున్నాడు; కౌన్సిలు అతడిని రెనెగేడ్ (పార్టీద్రోహి)గా నిరసించింది. దరిమిలా ఇంటర్నేషనల్ నాయకులపైనా, కమ్యూనార్డులపైనా అభాండాలతో కూడిన దుష్ప్రచారాన్ని కొనసాగించాడు. – 259, 277, 286, 288, 305.

ఓస్‌మన్ (Haussman), జార్జి ఎజేన్ (1809 – 1891) – ఫ్రెంచి రాజకీయవేత్త, బోనపార్టిస్టు, 1851 డిసెంబరు 2 నాటి రాజకీయ కుట్రలో పాల్గొన్నాడు; సీన్ జిల్లా ప్రిఫెక్టు (1853 – 70); పారిస్ పునర్నిర్మాణ కృషికి దర్శకత్వం వహించాడు. –88, 104, 105.

ఔమాలె (Aumale), అన్రీ ఎజేన్ ఫిలిప్ లూయీ డి అర్లియన్స్ (1822 – 1897) – ఫ్రాన్సు రాజు లూయీ ఫిలిప్ కొడుకు; 1848 ఫిబ్రవరి విప్లవానంతరం ఇంగ్లండుకు పరారీ అయ్యాడు, 1871 నాటి జాతీయ అసెంబ్లీ సభ్యుడు. – 131.

కజన్ మంటొబాన్ (Cousin-Montauban), షార్ల్ గియోమ్ మరీ అపొలినేర్ అంటు

వాన్, కౌంట్ డి పలికావొ (1796 – 1878) – ఫ్రెంచి జనరల్, బోనపార్టిస్టు; మూడవ "నల్లమందు" యుద్ధకాలం (1860)లో చైనాలో ఆంగ్లో-ఫ్రెంచి సైనిక బలగాలకు నాయకత్వం వహించాడు; యుద్ధమంత్రి, ప్రభుత్వాధినేత (ఆగస్టు–సెప్టెంబరు 1870). – 64, 120.

కతెలీనొ (Cathelineau), ఆన్రి డి (1813 – 1891) – ఫ్రెంచి జనరల్, రాజరికవాది; ఫ్రెంచి-ప్రష్యన్ యుద్ధ కాలంలోను, పారిస్ కమ్యూన్‌ని అణచివేసిన కాలంలోను బ్రెటూన్, వెండేలనుండి వచ్చిన వలంటీరు దళానికి కమాండరు. – 134, 241, 244.

కరేల్ (Carrel), అర్మాన్ (1800 – 1836) – ఫ్రెంచి బూర్జువా పత్రికా రచయిత, లిబరల్; "National" పత్రిక స్థాపకుల్లో ఒకడు, దాని సంపాదకుడు. – 137, 140.

కలోన్ (Calonne), షార్ల్ అలెగ్జాండర్ డి (1734 – 1802) – ఫ్రెంచి రాజనీతిజ్ఞుడు, ఆర్థిక శాఖ కంట్రోలర్ జనరల్ (1783 – 87); ఫ్రెంచి బూర్జువా విప్లవ కాలంలో 18వ శతాబ్దం చివర విప్లవ ప్రతీఘాతకులైన రాజరిక ప్రవాసుల నాయకుల్లో ఒకడు. – 93, 141, 247.

కవేన్యాక్ (Cavaignac), లూయీ ఎజేన్ (1802 - 1857) – ఫ్రెంచి జనరల్, రాజనీతిజ్ఞుడు, మోడరేట్ బూర్జువా రిపబ్లికన్; 1830, 1840 దశకాల్లో అల్జీరియా దండయాత్రలో పాల్గొన్నాడు; యుద్ధమంత్రి (మే–జూన్ 1848); పారిస్ కార్మికుల జూన్ తిరుగుబాటును అతి క్రూరంగా అణచివేశాడు; ప్రభుత్వాధినేత (జూన్–డిసెంబరు 1848). – 106, 123, 127, 146, 205, 220, 228.

కాబే (Cabet), ఎటియేన్ (1788 – 1856) – ఫ్రెంచి పత్రికా రచయిత, ఊహాజనిత కమ్యూనిజం ప్రముఖ ప్రతినిధి, "ఇకేరియాకు ప్రయాణం" అనే గ్రంథ రచయిత. – 112.

కాబెట్ (Cobbet), విలియం (1762 – 1835) – బ్రిటిష్ రాజకీయవేత్త, పత్రికా రచయిత, ప్రముఖ పెటీబూర్జువా రాడికల్; బ్రిటిష్ రాజకీయ వ్యవస్థను ప్రజాస్వామికం చెయ్యాలని వాదించాడు. – 284, 287.

కోర్బన్ (Corbon), క్లాడ్ ఆన్‌థిమ్ (1808 – 1891) – ఫ్రెంచి రాజకీయవేత్త, రిపబ్లికన్; రెండవ సామ్రాజ్య పతనానంతరం ఒక పారిస్ డిస్ట్రిక్టుకి మేయర్; 1871 జాతీయ అసెంబ్లీ సభ్యుడు. – 54, 212.

కోంట్ (Comte), ఒగూస్ట్ (1798 – 1857) – ఫ్రెంచి బూర్జువా తత్వవేత్త, సాంఘిక శాస్త్రవేత్త, పాజిటివిజం మూలపురుషుడు. – 189, 197.

క్యోట్లగాన్ (Coëtlogon), లూయీ షార్ల్ ఎమ్మాన్యుయెల్, కౌంట్ (1814 – 1886) – ఫ్రెంచి అధికారి, బోనపార్టిస్టు, 1871 మార్చి 22న పారిస్‌లో విప్లవ ప్రతిఘాత కార్యాచరణ నిర్వాహకుల్లో ఒకడు. – 71, 207, 229.

కౌలీ (Cowley), హెన్రీ రిచర్డ్ ఛార్లెస్ వెల్‌స్లీ, ఎర్ల్ (1804 – 1884) – బ్రిటిష్ దౌత్యవ్యవహర్త, పారిస్‌లో రాయబారి (1852 – 67). – 294.

గంబెట్టా (Gambetta), లియోన్ (1838 – 1882) – ఫ్రెంచి రాజనీతిజ్ఞుడు, బూర్జువా రిపబ్లికన్, జాతీయ రక్షణ ప్రభుత్వ సభ్యుడు (1870 – 71); మంత్రి మండలి అధ్యక్షుడు, విదేశాంగ మంత్రి (1881–82). – 55, 116, 168, 212, 233.

గనేస్కొ (Ganesco), గ్రేగొరి (1830 – 1877) – ఫ్రెంచి పత్రికా రచయిత; రుమేనియన్; రెండవ సామ్రాజ్య కాలంలో బోనపార్టిస్టు, తదుపరి త్యేర్ ప్రభుత్వ మద్దతుదారు. – 87.

గర్న్యే-పాజేస్ (Garnier-Pagès), లూయీ అంటువాన్ (1803 – 1878) – ఫ్రెంచి రాజకీయవేత్త, మోడరేట్ బూర్జువా రిపబ్లికన్, జాతీయ రక్షణ ప్రభుత్వ సభ్యుడు (1870–71). – 156, 157.

గల్యేన్ (Gallien) – వెర్సేల్స్ వాళ్లకు ములెన్ సాకే దుర్గభాగపు రహస్య సంకేత పదాన్ని చేరవేసిన కమ్యూన్ నేషనల్ గార్డు ఆఫీసరు. – 157, 165.

గాలిఫే (Galliffet), గాస్టన్ అలెగ్జాండర్ ఒగూస్ట్, మార్కీస్ డి (1830 – 1909) – ఫ్రెంచి జనరల్, ఫ్రెంచి ప్రష్యన్ యుద్ధంలో పాల్గొన్నాడు, సెడాన్‌లో ఖైదు చెయ్యబడ్డాడు; కమ్యూనుపై పోరాడటానికి విడుదల చెయ్య బడ్డాడు; పారిస్ కమ్యూన్ సంహర్తల్లో ఒకడు; వెర్సేల్స్ సైన్యంలోని అశ్విక దళానికి కమాండరు. – 72, 74, 110, 111, 127, 230.

గిజో (Guizot), ఫ్రాంసువా ప్యేర్ గియోమ్ (1787 – 1874) – ఫ్రెంచి బూర్జువా చరిత్రకారుడు, రాజనీతిజ్ఞుడు; 1840 నుండి 1848లో ఫిబ్రవరి విప్లవం వరకు బడా ఫైనాన్స్ బూర్జువావర్గ ప్రయోజనాలను వ్యక్తంచేసే దేశ, విదేశాంగ విధానం అవలంబించాడు. – 59, 60, 139, 219.

గియో (Guiod), అడోల్ఫ్ సిమోన్ (జననం 1805) – ఫ్రెంచి జనరల్, ఫ్రెంచి-ప్రష్యన్ యుద్ధంలో పాల్గొన్నాడు, 1870–71 పారిస్ ముట్టడి కాలంలో ఫిరంగి దళ ప్రధానాధికారి. – 50, 117, 213.

గొర్చకోవ్, ఎ. యమ్. (Gorchakov) (1798 – 1883) – రష్యన్ రాజనీతిజ్ఞుడు, దౌత్య వ్యవహర్త, విదేశాంగ మంత్రి (1856 – 82). – 49.

గ్రిమాల్ (Grimal) – ఫ్రెంచి ఆఫీసరు, వెర్సేల్స్‌లో జరిగిన కమ్యూనార్డుల విచారణలో పబ్లిక్ ప్రాసిక్యూటరు. – 298.

గ్రుసే (Grousset), పస్కాల్ (1844 – 1909) – ఫ్రెంచి పత్రికా రచయిత, రాజకీయవేత్త, బ్లాంకిస్టు; నేషనల్ గార్డు కేంద్ర కమిటీ సభ్యుడు, పారిస్ కమ్యూన్ సభ్యుడు, విదేశ సంబంధాల కమిటీ అధ్యక్షుడు; కమ్యూన్ అణచివెయ్యబడిన తర్వాత దేశబహిష్కృతుడై న్యూ కాలెడోనియాకు ప్రవాసం పంపబడ్డాడు, అక్కడినుంచి 1874లో పారిపోయాడు; దరిమిలా బూర్జువావర్గ పక్షంలో చేరిపోయాడు. –163, 328.

గ్రెప్పో (Greppo), జాన్ లూయీ (1810 – 1888) – ఫ్రెంచి రాజకీయవేత్త, పెటీబూర్జువా సోషలిస్టు, 1831, 1834 నాటి లియోన్ తిరుగుబాట్లలో పాల్గొన్నాడు; 1870–71లో ఒక పారిస్ డిస్ట్రిక్టుకి మేయరు, 1871 జాతీయ అసెంబ్లీ సభ్యుడు. – 154.

జకేమె (Jacquemet) – ఫ్రెంచి మతగురువు; 1848లో, పారిస్ ఆర్చిబిషప్‌కి వికార్ జనరల్. –106, 127, 228.

జక్లార్ (Jaclard), షార్ల్ విక్టోర్ (1843 – 1900) – ఫ్రెంచి పత్రికా రచయిత, బ్లాంకిస్టు; 1870 దశకం నుంచి మొదటి ఇంటర్నేషనల్ సభ్యుడు; మార్క్స్ అనుచరుడు; నేషనల్ గార్డు కేంద్ర కమిటీ సభ్యుడు; పారిస్ కమ్యూన్ కాలంలో నేషనల్ గార్డుకి చెందిన ఒక లిజియనుకి (దళానికి) కమాండరు; కమ్యూన్ అణచివెయ్యబడిన తర్వాత స్విట్జర్లండుకి, ఆటు తర్వాత రష్యాకి ప్రవాసం వెళ్లాడు. – 205.

జొబేర్ (Joubert), ఇప్పొలిట్ ఫ్రాంసువా, కౌంట్ డి (1798 – 1874) – ఫ్రెంచి రాజకీయవేత్త, రాజరికవాది థ్యేర్ మంత్రివర్గంలో పబ్లిక్ వర్క్స్ మంత్రి (1840), 1871 జాతీయ అసెంబ్లీ సభ్యుడు. – 108, 241, 274.

టమిజ్యే (Tamisier), ఫ్రాంసువా లొరాన్ అల్‌ఫాన్స్ (1809 – 1880) – ఫ్రెంచి జనరల్, రాజకీయవేత్త, రిపబ్లికన్; పారిస్ నేషనల్ గార్డు కమాండరు (సెప్టెంబరు–

నవంబరు 1870); 1871 జాతీయ అసెంబ్లీ సభ్యుడు. -- 69, 126, 169, 227.

టాసిటస్ (Tacitus) (పబ్లియస్ కొర్నేలియస్ టాసిటస్) (55 – 120 ప్రాంతం) – రోమన్ చరిత్రకారుడు. – 102.

టెర్జాగి (Terzaghi), కార్లో (జననం 1845 ప్రాంతం) – ఇటాలియన్ లాయరు, టూరిన్‌లోని "శ్రామికుని విమోచన" అనే వర్కర్స్ సొసైటీ కార్యదర్శి; 1872లో పోలీసు ఏజెంటయ్యాడు. – 331.

టెర్టూల్లియన్ (Tertullian), క్వింట్ సెప్టిమి ఫ్లొరెన్స్ (150 – 222 ప్రాంతం) – క్రిస్టియన్ వేదాంతి, సైన్సుకి గర్భవిరోధి. – 263.

టైఫేర్ (Taillefer) – బోనపార్టిస్టు పత్రిక "L'Étendard" ప్రచురణకు సంబంధించిన కుతంత్రాల్లో పాల్గొన్నాడు. – 56, 163, 214.

టైలర్ (Taylor), అల్‌ఫ్రెడ్ – ఇంగ్లీషు కార్మికుడు; మొదటి ఇంటర్నేషనల్ జనరల్ కౌన్సిలు సభ్యుడు (1871–72). – 288.

టొమా (Thomas), క్లెమాన్ (1809 – 1871) – ఫ్రెంచి రాజకీయవేత్త, జనరల్, మోడరేట్ బూర్జువా రిపబ్లికన్; పారిస్‌లో 1848 జూన్ తిరుగుబాటును అణచివెయ్యడంలో పాల్గొన్నాడు; పారిస్ నేషనల్ గార్డు కమాండరు (నవంబరు 1870 – ఫిబ్రవరి 1871), నగర రక్షణను ఛిన్నాభిన్నం చేశాడు; 1871 మార్చి 18న తిరుగుబాటు సైనికులచేత కాల్చివెయ్యబడ్డాడు. – 68–70, 74, 96, 98, 99, 123, 125, 126, 130, 169, 202, 205, 223, 226, 227, 233.

టొలేన్ (Tolain), అన్రీ లూయీ (1828 – 1897) – ఫ్రెంచి కార్మికుడు, ఎన్‌గ్రేవరు (నగిషీ పనివాడు); మితవాద ప్రూడనిస్టు; మొదటి ఇంటర్నేషనల్ పారిస్ శాఖ నాయకుల్లో ఒకడు; 1871 జాతీయ అసెంబ్లీ సభ్యుడు, పారిస్ కమ్యూన్ కాలంలో వెర్సేల్స్ పక్షంలో చేరిపోయాడు, ఇంటర్నేషనల్ నుంచి బహిష్కరింపబడ్డాడు. – 74, 270, 277, 278.

ట్రిడాన్ (Tridon), ఎడ్మ మరీ గుస్టావ్ (1841 – 1871) – ఫ్రెంచి రాజకీయవేత్త, పత్రికా రచయిత, బ్లాంకిస్టు, మొదటి ఇంటర్నేషనల్ సభ్యుడు; 1871 జాతీయ అసెంబ్లీ సభ్యుడు, దాని నుండి రాజీనామా చేశాడు; పారిస్

కమ్యూన్ సభ్యుడు; కమ్యూన్ అణచివెయ్యబడిన తర్వాత బెల్జియంకి ప్రవాసం వెళ్లాడు. – 205, 325.

ట్రోషూ (Trochu), లూయీ జూల్ (1815 – 1896) – ఫ్రెంచి జనరల్, రాజకీయవేత్త, ఆర్లీయనిస్టు, అల్జీరియాను ఆక్రమించుకోవడంలో పాల్గొన్నాడు (1830 దశకం, 1840 దశకం), క్రైమియన్ యుద్ధంలో (1853–56), ఇటాలియన్ యుద్ధంలో (1859) పాల్గొన్నాడు; జాతీయ రక్షణ ప్రభుత్వ అధ్యక్షుడు; పారిస్ సాయుధ సైన్యాల కమాండర్-ఇన్-ఛీఫ్ (సెప్టెంబరు 1870 –జనవరి 1871), నగర రక్షణను విచ్ఛిన్నం చేశాడు; 1871 జాతీయ అసెంబ్లీ సభ్యుడు. -- 53–55, 62, 67, 69, 70, 115–117, 126, 156, 169, 200, 205, 210–213, 227, 233, 251.

డుక్రో (Ducrot), ఒగూస్ట్ అలెగ్జాండర్ (1817 – 1882) – ఫ్రెంచి జనరల్, ఫ్రెంచి-ప్రష్యన్ యుద్ధంలో పాల్గొన్నాడు; పారిస్ కమ్యూన్ అణచివేత కాలంలో వెర్సేల్స్ సైన్య నిర్మాణంలో పాల్గొన్నాడు; 1871 నాటి జాతీయ అసెంబ్లీ సభ్యుడు, ఆర్లీయనిస్టు. – 200.

డుపాన్ (Dupont), ఎజేన్ (1831 – 1881 ప్రాంతంలో) – ఫ్రెంచి సంగీత పరికరాల తయారీదారు; అంతర్జాతీయ కార్మికవర్గోద్యమంలో ప్రముఖ వ్యక్తి; 1848 జూన్‌లో పారిస్‌లో జరిగిన తిరుగుబాటులో పాల్గొన్నాడు; 1862 నుండి లండనులో నివసించాడు; మొదటి ఇంటర్నేషనల్ జనరల్ కౌన్సిలు సభ్యుడు (నవంబరు 1864–1872); మార్క్స్ పంథాను అనుసరించాడు. –267, 325.

డుఫార్ (Dufaure), జూల్ అర్మాన్ స్టానిస్లాస్ (1798 – 1881) – ఫ్రెంచి అడ్వకేటు, రాజనీతిజ్ఞుడు, ఆర్లీయనిస్టు, పారిస్ కమ్యూన్ కసాయి హంతకుల్లో ఒకడు; పబ్లిక్ వర్క్స్ మంత్రి (1839–40), అంతరంగిక శాఖ మంత్రి (1848, 1849), న్యాయశాఖ మంత్రి (1871–73, 1875–76, 1877–79), మంత్రి మండలి అధ్యక్షుడు (1876, 1877–79).– 64, 72, 95–97, 120, 123, 124, 153–156, 216, 248.

డుయే (Douay), ఫేలిక్స్ (1816 – 1879) – ఫ్రెంచి జనరల్, ఫ్రెంచి-ప్రష్యన్ యుద్ధంలో పాల్గొన్నాడు, సెడాన్‌లో ఖైదుచెయ్యబడ్డాడు; పారిస్ కమ్యూన్ కసాయి హంతకులలో యితనొకడు, వెర్సేల్స్ సైన్యపు 4వ దళం కమాండరు. – 100.

డెగ్రి (Deguerry), గస్పార్ (1797 – 1871) – ఫ్రెంచి మతగురువు, పారిస్

లోని లా మడ్లేన్ చర్చి కూరే; 1871 మేలో కమ్యూన్‌చేత హామీబందీగా కాల్చి వెయ్యబడ్డాడు. – 129, 164.

డెమరే (Desmarest) – ఫ్రెంచి జెండార్మీ (సాయుధ పోలీసు దళం) ఆఫీసరు, గుస్టావ్ ఫ్లోరెన్సును చంపాడు. – 73, 127, 150, 230.

డెలయే (Delahaye), ప్యేర్ లూయీ (జననం 1820) – ఫ్రెంచి ఇంజనీరు; మొదటి ఇంటర్నేషనల్ సభ్యుడు (1864 నుండి); కమ్యూనార్డు; కమ్యూన్ అణచివెయ్యబడిన తర్వాత ఇంగ్లండుకు ప్రవాసిగా వెళ్లాడు; మొదటి ఇంటర్నేషనల్ జనరల్ కౌన్సిలు సభ్యుడు (1871–72). – 330.

డెలెక్లూజ్ (Delescluze), లూయీ షార్ల్ (1809 – 1871) – ఫ్రెంచి రాజకీయవేత్త, పత్రికా రచయిత, పెటీబూర్జువా విప్లవవాది, 1830, 1848 విప్లవాల్లో పాల్గొన్నాడు; 1871 నాటి జాతీయ అసెంబ్లీకి సభ్యుడు; పారిస్ కమ్యూన్ సభ్యుడు, కమ్యూన్‌యొక్క సైనిక ప్రతినిధి; 1871 మేలో పారిస్‌లో జరిగిన వీధి పోరాట క్రమంలో బారికేడ్లపై చంపబడ్డాడు. – 296.

డేవిస్ (Davies), జాన్ లువేలిన్ (1826–1916) – ఇంగ్లీషు బిషప్, వేదాంతి, లిబరల్. – 283, 284, 288.

ద్యుపన్లూ (Dupanloup), ఫేలిక్స్ (1802 – 1878) – ఫ్రెంచి వేదాంతి, రాజకీయవేత్త, కేథలిక్ పార్టీ నాయకుల్లో ఒకడు; ఆర్లియన్స్ బిషప్ (1849 నుండి), 1871 నాటి జాతీయ అసెంబ్లీ సభ్యుడు. – 262.

ద్యువాల్ (Duval), ఎమీల్ విక్తోర్ (1841 – 1871) – ఫ్రెంచి ఇనుము పోత కార్మికుడు; ఫ్రెంచి కార్మికవర్గోద్యమంలో చురుకుగా పనిచేశాడు; మొదటి ఇంటర్నేషనల్ సభ్యుడు; నేషనల్ గార్డు కేంద్ర కమిటీ సభ్యుడు, పారిస్ కమ్యూన్ సభ్యుడు; కమ్యూన్ నేషనల్ గార్డు జనరల్; 1871 ఏప్రిల్ 4న నిర్బంధింపబడి, వెర్సైల్స్ వాళ్లచేత కాల్చివెయ్యబడ్డాడు. – 72, 127, 158, 230, 268.

ద్యూమా (Dumas), అలెగ్జాండర్ (కొడుకు) (1824 – 1895) – ఫ్రెంచి నవలా రచయిత, నాటక కర్త. – 150, 166.

తామర్లేన్ – తైమూర్ చూడండి.

తైమూర్ (తామర్లేన్) (1336 – 1405) – మధ్య ఆసియా సేనాధిపతి, విజేత. – 73, 148, 230.

త్యేర్ (Thiers), అడాల్ఫ్ (1797 – 1877) – ఫ్రెంచి బూర్జువా చరిత్రకారుడు,

రాజనీతిజ్ఞుడు, ఆర్లియనిస్టు, అంతరంగిక శాఖ మంత్రి (1832, 1834), ప్రధానమంత్రి (1836, 1840), ప్రధాన కార్యనిర్వాహకాధికారి (1871); రిపబ్లిక్ అధ్యక్షుడు (1871–73); పారిస్ కమ్యూన్ కసాయి హంతకుల్లో ఒకడు. – 28, 31, 53, 54, 57–68, 70, 72–74, 77, 85, 87–89, 92–101, 104–106, 108, 116, 119, 120, 121, 123, 124, 127–130, 132–143, 147, 148, 150–158, 163, 165, 166, 182, 188, 193, 195, 196, 200, 203–205, 208, 209, 211, 215–221, 223, 224, 228, 230–233, 241, 243–251, 263, 272, 273, 275, 293, 299, 307, 321, 323, 326.

థేయిస్ (Theisz), ఆల్బర్ట్ (1839 – 1880) – ఫ్రెంచి లోహకార్మికుడు, కార్మిక వర్గోద్యమంలో చురుకుగా పనిచేశాడు; ప్రూడనిస్టు; పారిస్ కమ్యూన్ సభ్యుడు; కమ్యూన్ అణచివెయ్యబడిన తర్వాత ఇంగ్లండుకి ప్రవాసం వెళ్లాడు; మొదటి ఇంటర్నేషనల్ జనరల్ కౌన్సిలు సభ్యుడు (1871). – 330.

దార్బువా (Darboy), జార్జిస్ (1813 – 1871) – ఫ్రెంచి వేదాంతి, పారిస్ ఆర్చిబిషప్ (1863 నుండి), కమ్యూనార్డులు 1871 మేలో హామీ బందీగా యితడిని కాల్చివేశారు. – 31, 106, 127, 129, 228.

దొమ్బ్రోవ్‌స్కీ (Dombrowski), యరోస్లావ్ (1836 – 1871) – పోలిష్ విప్లవ ప్రజాస్వామికవాది, 1860 దశకం నాటి పోలిష్ జాతీయ విముక్తి ఉద్యమంలో పాల్గొన్నాడు; పారిస్ కమ్యూన్ జనరల్, 1871 మే మొదట్లో దాని సాయుధ బలగాల కమాండర్-ఇన్-ఛీఫ్ అయ్యాడు, బారికేడ్లపై చంపబడ్డాడు. – 88.

నీరో (Nero) (37 – 68) – రోమన్ చక్రవర్తి (54 – 68). – 141.

నెపోలియన్, మొదటి (Napoleon), బోనపార్ట్ (1769 – 1821) – ఫ్రెంచి చక్రవర్తి (1804 – 14, 1815). – 30, 34, 43, 48, 60, 61, 87, 130, 147, 173, 183, 216, 220, 221, 245, 246.

నెపోలియన్, మూడవ (Napoleon III) (లూయీ నెపోలియన్ బోనపార్ట్) – మొదటి నెపోలియన్ సోదరుని కొడుకు, రెండవ రిపబ్లిక్ అధ్యక్షుడు (1848 – 51), ఫ్రెంచి చక్రవర్తి (1852 – 70). – 27, 40, 41, 44, 45, 49, 55, 60, 61, 67, 76, 77, 81, 86, 88, 91, 97, 117, 121,

124, 133, 134, 136, 144, 147, 156, 162, 163, 169, 178, 183, 211, 213, 214, 217, 222, 227, 233, 252, 260, 261, 265, 272.

న్యూవెన్‌హాయిస్ (Nieuwenhuis), ఫెర్డినాండ్ డొమెలా (1846 – 1919) – డచ్చి కార్మికవర్గోద్యమంలో చురుకుగా పనిచేశాడు, డచ్చి సోషల్-డెమొక్రటిక్ పార్టీ స్థాపకుల్లో ఒకడు; 1888 నుండి పార్లమెంటు సభ్యుడు; 1890 దశకంలో అరాజకవాద వైఖరి చేపట్టాడు. – 332.

పలడీన్ – చూ. ఒరేల్ డి పలడీన్.

పలికావొ – చూ. కజన్ మంటొబాన్.

పామర్‌స్టన్ (Palmerston), హెన్రీ జాన్ టెంపిల్, వైకౌంట్ (1784 – 1865) – బ్రిటిష్ రాజనీతిజ్ఞుడు; రాజకీయ జీవితారంభంలో టోరీ; 1830 దరిమిలా విగ్గుల నాయకుడు; ఆ పార్టీలోని మితవాద శక్తులపై ఆధారపడుతూ వచ్చాడు; విదేశాంగ మంత్రి (1830 – 34, 1835 – 41, 1846 – 51), హోమ్‌శాఖ మంత్రి (1852 – 55), ప్రధానమంత్రి (1855 – 58, 1859 - 65). – 284.

పారిస్ కౌంట్ – చూ. లూయీ ఫిలిప్ ఆల్బర్ట్.

పిక్ (Pic), జూల్ – ఫ్రెంచి పత్రికా రచయిత, బోనపార్టిస్టు, "Étendard" వార్తా పత్రికకు బాధ్యుడైన ప్రచురణకర్త. – 56, 163, 214.

పికార్డ్ (Picard), ఎజేన్ ఆర్థర్ (జననం 1825) – ఫ్రెంచి రాజకీయవేత్త, స్టాక్ బ్రోకర్, మోడరేట్ బూర్జువా రిపబ్లికన్, "L'Electeur libre" వార్తాపత్రిక ప్రధాన సంపాదకుడు; ఎర్నెస్ట్ పికార్డ్ సోదరుడు. – 57, 118, 121, 124, 214, 215.

కాపిర్డ్ (Picard), ఎర్నెస్ట్ (1821 – 1877) – ఫ్రెంచి లాయరు, రాజకీయవేత్త, మోడరేట్ బూర్జువా రిపబ్లికన్, జాతీయ రక్షణ ప్రభుత్వంలో ఆర్థిక మంత్రి (1870 – 71), త్యేర్ ప్రభుత్వంలో హోమ్‌శాఖ మంత్రి (1871); పారిస్ కమ్యూన్ కసాయి హంతకుల్లో ఒకడు. – 56, 57, 65, 72, 108, 117–122, 124, 126, 153, 158, 203, 211, 214, 215.

పియా (Pyat), ఫెలిక్స్ (1810 – 1889) – ఫ్రెంచి పత్రికా రచయిత, నాటక

రచయిత, రాజకీయవేత్త, పెటీబూర్జువా ప్రజాస్వామికవాది; 1848 నాటి విప్లవంలో పాల్గొన్నాడు; స్వతంత్రమైన కార్మిక వర్గోద్యమానికి వ్యతిరేకి; చాల సంవత్సరాల పాటు మార్క్సుపైనా, మొదటి ఇంటర్నేషనల్‌పైనా దుష్ప్రచారం సాగించాడు; 1871 నాటి జాతీయ అసెంబ్లీ సభ్యుడు; పారిస్ కమ్యూన్ సభ్యుడు, కమ్యూన్ అణచివెయ్యబడిన తర్వాత ఇంగ్లండుకి ప్రవాసం వెళ్లాడు. – 262, 267, 324, 325, 328.

పియెత్రీ (Piètri), జోసెఫ్ మరీ (1820 – 1902) – ఫ్రెంచి రాజకీయవేత్త, బోనపార్టిస్టు, పారిస్ పోలీసు ప్రిఫెక్టు (1866 – 1870). – 40, 94, 119, 128, 134, 165, 215, 244.

పుయ్యే-కర్టీ (Pouyer-Quertier), టొమా ఒగుస్టెన్ (1820 – 1891) – ఫ్రెంచి బడా ఫ్యాక్టరీ యజమాని, రాజకీయవేత్త, ప్రొటెక్షనిస్టు (రక్షణ సుంకాల) విధానాన్ని బలపరచేవాడు; ఆర్థిక మంత్రి (1871 – 72), జర్మనీతో ఫ్రాంక్‌ఫుర్ట్‌లో జరిగిన శాంతి సంప్రతింపుల్లో పాల్గొన్నాడు (1871). – 64, 65, 98, 120–122, 126, 216, 326.

పేన్ (Pène), ఆన్రీ డి (1830 – 1888) – ఫ్రెంచి పత్రికా రచయిత, రాజరికవాది, 1871 మార్చి 22న పారిస్‌లో జరిగిన విప్లవ ప్రతిఘాత కార్యాచరణ నిర్వాహకుల్లో ఒకడు. – 71, 207, 229.

ప్రూడన్ (Proudhon), ప్యేర్ జోసెఫ్ (1809 – 1865) – ఫ్రెంచి పత్రికా రచయిత, ఆర్థిక శాస్త్రవేత్త, సాంఘిక శాస్త్రవేత్త, పెటీబూర్జువావర్గ సిద్ధాంత వేత్త, అరాజకవాద స్థాపకుల్లో ఒకడు. – 33, 34.

ప్రొటో (Protot), ఎజేన్ (1839 – 1921) – ఫ్రెంచి లాయరు, వైద్యుడు, పత్రికా రచయిత; మితవాద బ్లాంకీస్టు; పారిస్ కమ్యూన్ సభ్యుడు, న్యాయవిచారణ సంఘ ప్రతినిధి; కమ్యూన్ అణచివెయ్యబడిన తర్వాత స్విట్జర్లండుకి ఆ తర్వాత ఇంగ్లండుకి ప్రవాసం వెళ్లాడు; అటు తర్వాత ఇంటర్నేషనలుకీ, మార్క్సిస్టులకీ వ్యతిరేకి అయ్యాడు. – 162, 268.

ఫల్లూ (Falloux), ఆల్ఫ్రేడ్ (1811 – 1886) – ఫ్రెంచి రాజకీయవేత్త, రచయిత; లెజిటిమిస్టు, క్లెరికల్; విద్యా, మతానుష్ఠాన శాఖ మంత్రి (1848 – 49); 1848లో పారిస్‌లోని తిరుగుబాటు అణచివేత ప్రోత్సాహకర్త. – 222.

ఫావ్ర్ (Favre), జూల్ (1809 – 1880) – ఫ్రెంచి లాయరు, రాజకీయవేత్త, మోడరేట్ బూర్జువా రిపబ్లికన్ల నాయకుడు; 1848లో హోమ్‌మంత్రిత్వశాఖ

ప్రధాన కార్యదర్శి, తర్వాత ఉప విదేశాంగమంత్రి; జాతీయ రక్షణ ప్రభుత్వంలోను, త్యేర్ ప్రభుత్వంలోను (1870 – 71) విదేశాంగ మంత్రిగా పారిస్ లొంగుబాటు విషయంపైనా, జర్మనీతో శాంతి అంశంపైనా సంప్రతింపులు జరిపాడు; పారిస్ కమ్యూన్ కసాయి హంతకుడు. – 39, 54–56, 61, 65, 69, 72, 90, 98, 99, 112–121, 131, 132, 137, 140, 143, 153, 156, 157, 163, 169, 171, 200, 204–206, 211–214, 226, 227, 259, 260, 265, 273, 283, 287, 288, 328.

ఫెర్డినాండ్, రెండవ (Ferdinand) (1810 – 1859) – నేపుల్స్ రాజు (1830–59); 1848 మెస్సీనాపై బాంబార్డు జరిపిన కారణంగా బాంబు రాజు అన్న వ్యంగ్య నామం సంపాదించుకున్నాడు. – 58, 59, 138, 218.

ఫెర్రీ (Ferry), జూల్ (1832 – 1893) – ఫ్రెంచి లాయరు, రాజకీయవేత్త, మోడరేట్ బూర్జువా రిపబ్లికన్ల నాయకుల్లో ఒకడు, జాతీయ రక్షణ ప్రభుత్వ సభ్యుడు, పారిస్ మేయరు (1870 – 71), 1871 నాటి జాతీయ అసెంబ్లీ సభ్యుడు; మంత్రి మండలి అధ్యక్షుడు (1880 – 81, 1883 – 85). – 57, 116, 118, 122, 204, 214, 215.

ఫోగ్ట్ (Vogt), కార్ల్ (1817 – 1895) – జర్మన్ నాచురలిస్టు (ప్రకృతిశాస్త్ర అధ్యయనవేత్త), అపభ్రంశ భౌతికవాది; పెటీబూర్జువా ప్రజాస్వామికవాది; 1848 – 49లో ఫ్రాంక్‌ఫుర్ట్ జాతీయ అసెంబ్లీ సభ్యుడు, దాని వామపక్షానికి చెందినవాడు; 1849 జూన్‌లో అయిదుగురు సామ్రాజ్య రీజెంట్లలో ఒకడు; 1849లో జర్మనీని విడిచిపెట్టాడు; 1850 దశకంలోను, 1860 దశకంలోను లూయీ బోనపార్ట్‌కి జీతంపై ఏజెంటుగా పని చేశాడు, శ్రామికవర్గ విప్లవవాదులకు వ్యతిరేకంగా అభాండాలతో కూడిన దుష్ప్రచారంలో చురుకుగా పాల్గొన్నాడు. – 56.

ఫ్రాంకెల్ (Frankel), లెయో (1844 – 1896) – నగల పనివాడు; హంగేరియన్, అంతర్జాతీయ కార్మికవర్గోద్యమంలో ప్రముఖుడు; పారిస్ కమ్యూన్ సభ్యుడు, లేబర్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్‌కి (కార్మిక, నమోదు సంఘానికి) నాయకత్వం వహించాడు; మొదటి ఇంటర్నేషనల్ జనరల్ కౌన్సిల్ సభ్యుడు (1871 – 72); హంగరీ జనరల్ వర్కర్స్ పార్టీ సంస్థాపకుల్లో ఒకడు; మార్క్స్ ఎంగెల్సుల సహచరుడు. – 88, 163, 193, 324, 326, 330.

ఫ్రాంసువా (François) – ఫ్రెంచి నేషనల్ గార్డు సభ్యుడు, కమ్యూనార్డు, పారిస్‌లో 1871 మార్చి 22న జరిగిన విప్లవ ప్రతిఘాత దాడిలో చంపబడ్డాడు. – 207.

ఫ్రెడెరిక్, రెండవ (Friedrich II) (1712 – 1786) – ప్రష్యా రాజు (1740-86). –114.

ఫ్లోకోన్ (Flocon), ఫెర్డినాండ్ (1800 – 1866) – ఫ్రెంచి రాజకీయవేత్త, పబ్లిసిస్టు, పెటీబూర్జువా ప్రజాస్వామికవాది, "La Réforme" అనే వార్తా పత్రిక సంపాదకుల్లో ఒకడు, తాత్కాలిక ప్రభుత్వ సభ్యుడు (1848). – 259.

ఫ్లోరెన్సు (Flourens), గుస్టావ్ (1838 – 1871) – ఫ్రెంచి విప్లవకారుడు, నాచురలిస్టు (ప్రకృతిశాస్త్ర అధ్యయనవేత్త), బ్లాంకీ అనుచరుడు; 1870 అక్టోబరు 31న, 1871, జనవరి 22న, పారిస్‌లో జరిగిన తిరుగుబాట్ల నాయకుడు; పారిస్ కమ్యూన్ సభ్యుడు, వెర్సేల్స్‌వారిచేత 1871 ఏప్రిల్‌లో పాశవికంగా హత్యచెయ్యబడ్డాడు. – 64, 69, 73, 127,158,168, 227,230,268.

బకూనిన్, ఎమ్. ఎ. (Bakunin) (1814 – 1876) – రష్యన్ విప్లవవాది, పత్రికా రచయిత, అరాజకవాద సిద్ధాంత కర్త, జర్మనీలో 1848 – 49 విప్లవంలో పాల్గొన్నాడు; మొదటి ఇంటర్నేషనల్‌లో మార్క్సిజానికి గర్భశత్రువులా వ్యవహరించాడు; హేగ్ మహాసభ (1872)లో, తన విచ్ఛిన్న కార్యకలాపాలకు గాను ఇంటర్నేషనల్ నుండి బహిష్కరింపబడ్డాడు. – 287, 332.

బర్తెలెమీ సెయింట్-ఇలేర్ (Barthèlemy, Saint-Hilaire), జూల్ (1805 – 1895) – ఫ్రెంచి తత్వవేత్త, రాజనీతిజ్ఞుడు, మోడరేట్ బూర్జువా రిపబ్లికన్; 1871 నాటి జాతీయ అసెంబ్లీ సభ్యుడు, త్యేర్ ఆఫీసు మేనేజరు (1871 – 73); విదేశాంగ మంత్రి (1880 – 81). – 299.

బాస్టెలికా (Bastelica), ఆంద్రే (1845 – 1884) – ఫ్రెంచి ప్రెస్ కార్మికుడు; ఫ్రెంచి, స్పానిష్ కార్మికవర్గోద్యమంలో చురుకుగా పనిచేశాడు; మొదటి ఇంటర్నేషనల్ సభ్యుడు; బకూనినిస్టు; 1870 అక్టోబరు నవంబరు మాసాల్లో మార్సేల్స్‌లోని విప్లవ కార్యాచరణల్లో పాల్గొన్నాడు; మొదటి ఇంటర్నేషనల్ జనరల్ కౌన్సిల్ సభ్యుడు (1871). – 330.

బిగో (Bigot), లియోన్ (1826 – 1872) – ఫ్రెంచి లాయరు, పత్రికా రచయిత, వామపక్ష రిపబ్లికన్; కమ్యూన్ అణచివెయ్యబడిన తర్వాత వెర్సేల్స్‌లో కమ్యూనార్డుల తరఫున డిఫెన్సు లాయరుగా పనిచేశాడు. – 300.

బిస్మార్కు (Bismark), ఒట్టో (1815 – 1898) – ప్రష్యా, జర్మనీ రాజనీతిజ్ఞుడు, దౌత్య నిపుణుడు; ప్రష్యన్ బడా భూస్వాముల ప్రయోజనాలను బలపరచాడు; సెయింట్ పీటర్స్‌బుర్గులో (1859 – 62), పారిస్‌లో (1862) రాయబారి; ప్రష్యా మంత్రి – అధ్యక్షుడు (1862 – 71), జర్మన్ సామ్రాజ్య ఛాన్సెలర్ (1871 – 90); విప్లవ ప్రతిఘాత సాధనాల ద్వారా జర్మనీ ఏకీకరణను అమలు చేశాడు; కార్మికవర్గోద్యమానికి శత్రువు, సోషలిస్టు వ్యతిరేక చట్టపు కర్త (1878). – 23, 27, 41, 49, 55, 57, 61, 63, 65, 66, 82, 90, 94, 98, 99, 107, 108, 113, 116, 123, 131, 133, 134, 142, 143, 154, 171, 193, 197, 213, 221, 231, 242, 244, 248, 250, 251, 265, 273, 311, 312, 327, 328.

బీజ్‌లి (Beesly), ఎడ్వర్డ్ స్పెన్సర్ (1831 – 1915) – ఇంగ్లీషు చరిత్రకారుడు, రాజకీయవేత్త, బూర్జువా రాడికల్, పాజిటివిస్టు, లండన్‌లోని యూనివర్సిటీలో చరిత్ర ప్రొఫెసరు; ఇంగ్లీషు పత్రికల్లో పారిస్ కమ్యూన్‌ని బలపరచాడు. – 277, 327.

బుయి (Bouls), కసిమీర్ (1843 – 1916 ప్రాంతం) – ఫ్రెంచి పత్రికా రచయిత, బ్లాంకీస్టు; నేషనల్ గార్డు కేంద్ర కమిటీ, పారిస్ కమ్యూన్‌ల సభ్యుడు; జాతీయ రక్షణ ప్రభుత్వ కార్యకలాపాల దర్యాప్తు కమిషన్ అధ్యక్షుడు; కమ్యూన్ అణచివెయ్యబడిన తర్వాత దేశ బహిష్కృతుడై న్యూ కాలెడోనియాకి ప్రవాసం పంపబడ్డాడు. – 166.

బూర్బన్ (Bourbons) – ఫ్రెంచి రాజవంశం (1589 – 1792, 1814 – 15; 1815 – 30). – 143, 145, 242.

బెర్జెరే (Bergeret), జూల్ (1839 – 1905) – నేషనల్ గార్డు కేంద్ర కమిటీ, పారిస్ కమ్యూన్ సభ్యుడు, నేషనల్ గార్డు జనరల్; కమ్యూన్ అణచివెయ్యబడిన తర్వాత ఇంగ్లండుకు, అటు తర్వాత అమెరికాకు ప్రవాసం వెళ్ళాడు. – 71, 205, 207.

బెర్యే (Berryer), ప్యేర్ అంటువాన్ – ఫ్రెంచి న్యాయవాది, రాజకీయవేత్త, లెజిటిమిస్టు. – 222.

బెర్రి (Berry), మెరీ కరోలీనా, డచెస్ డి (1798 – 1870) – ఫ్రెంచి సింహాసనానికి వారసునిగా ప్రకటించుకున్న లెజిటిమిస్టు కౌంట్ షంబోర్ తల్లి, 1832లో

లూయీ ఫిలిప్‌ను పదవీచ్యుతుని చేసేందుకు వెండేలో తిరుగుబాటును రెచ్చగొట్ట డానికి ప్రయత్నించింది. – 58, 137, 196, 217.

బెలే (Beslay), షార్ల్ (1795 – 1878) – ఫ్రెంచి వ్యాపారి, సాహిత్యవేత్త, రాజకీయవేత్త; మొదటి ఇంటర్నేషనల్ సభ్యుడు; ప్రూదనిస్టు; పారిస్ కమ్యూన్ లోనూ, దాని నిధుల కమిషన్‌లోనూ సభ్యుడు; బ్యాంక్ ఆఫ్ ఫ్రాన్స్‌కి ప్రతినిధిగా, దాని ఆంతరంగిక వ్యవహారాల్లో జోక్యం చేసుకోరాదన్న, దాన్ని జాతీయం చేసుకోరాదన్న విధానాన్ని అనుసరించాడు, కమ్యూన్ అణచివెయ్యబడిన తర్వాత స్విట్జర్లండుకి ప్రవాసం వెళ్లాడు. – 136.

బేబెల్ (Bebel), ఔగుస్ట్ (1840 – 1913) – జర్మన్, అంతర్జాతీయ కార్మికో ద్యమంలో ప్రముఖ వ్యక్తి; వృత్తిరీత్యా టర్నరు; 1867 నుంచి జర్మన్ కార్మిక సంఘాల యూనియన్ అధ్యక్షుడు; మొదటి ఇంటర్నేషనల్ సభ్యుడు; రైహ్‌స్టాగ్‌కి (1867 నుండి) డిప్యూటీ; జర్మన్ సోషల్-డెమోక్రసీ సంస్థాపకుల్లోను, నాయకుల్లోను ఒకడు, లాసాలియన్లకు వ్యతిరేకంగా పోరాడాడు; ఫ్రెంచి ప్రష్యన్ యుద్ధ కాలంలో శ్రామికవర్గ అంతర్జాతీయతా వైఖరిని అవలంబించాడు; పారిస్ కమ్యూన్‌ని బలపరచాడు; మార్క్సు ఎంగెల్సుల మిత్రుడు, సహచరుడు; రెండవ ఇంటర్నేషనల్లో చురుకుగా పనిచేశాడు. 1890 దశకంలోను, 20వ శతాబ్దం మొదట్లోను రిఫార్మిజం, రివిజనిజంలను వ్యతిరేకించాడు, అయితే ఆ క్రమంలో, ముఖ్యంగా తన కార్యకలాపాల చివరి దశలో, అనేక సెంట్రిస్టు పొరపాట్లు చేశాడు. – 329, 333.

బోనపార్ట్ – చూ. నెపోలియన్, మొదటి.

బోనపార్ట్, లూయీ – చూ. నెపోలియన్, మూడవ.

బోల్టె (Bolte), ఫ్రెడెరిక్ – అమెరికన్ లేబరు ఉద్యమంలో ప్రముఖ వ్యక్తి; సిగార్ కార్మికుడు; జర్మన్; మొదటి ఇంటర్నేషనల్ (1872)కి చెందిన ఉత్తర అమెరికన్ శాఖ ఫెడరల్ కౌన్సిలు కార్యదర్శి, "Arbeiter-Zeitung" సంపాదకవర్గ సభ్యుడు; మొదటి ఇంటర్నేషనల్ హేగ్ మహాసభచేత ఎన్నుకోబడిన జనరల్ కౌన్సిలు సభ్యుడు (1872 – 74); "Arbeiter-Zeitung" తప్పుడు విధానం అనుసరించిన దృష్ట్యా 1874లో ఇంటర్నేషనల్ నుండి బహిష్కరింపబడ్డాడు. – 329.

బ్రునేల్ (Brunel), అంటువాన్ మగ్నుయర్ (జననం 1830) – ఫ్రెంచి ఆఫీసరు, బ్లాంకీస్టు, నేషనల్ గార్డు కేంద్ర కమిటీ, పారిస్ కమ్యూన్‌ల సభ్యుడు; 1871 మేలో వెర్సేల్స్‌వారిచేత ప్రమాదకరంగా గాయపరచబడ్డాడు; కమ్యూన్ అణచి వెయ్యబడిన తర్వాత ఇంగ్లండుకు ప్రవాసం వెళ్ళాడు. – 111.

బ్లాంక్ (Blanc), లూయీ (1811 – 1882) – ఫ్రెంచి పెటీబూర్జువా సోషలిస్టు, చరిత్రకారుడు; 1848లో తాత్కాలిక ప్రభుత్వంలో సభ్యుడు, లక్సెంబర్గ్ కమిషన్ అధ్యక్షుడు; బూర్జువావర్గంతో రాజీపడే విధానాన్ని అనుసరించాడు; 1871 నాటి జాతీయ అసెంబ్లీ సభ్యుడు, పారిస్ కమ్యూన్‌కి వ్యతిరేకంగా బహిరంగంగా వాదించాడు. – 188, 196, 259, 276.

బ్లాంకీ (Blanqui), లూయీ ఒగూస్ట్ (1805 – 1881) – ఫ్రెంచి విప్లవకారుడు, ఉటోపియన్ (ఊహాజనిత) కమ్యూనిస్టు; పలు రహస్య సంస్థల, కుట్రల నిర్వాహకుడు; 1830, 1848 విప్లవాల్లో చురుకుగా పాల్గొన్నాడు; ఫ్రెంచి శ్రామిక వర్గోద్యమ ప్రముఖ నాయకుడు; 1870 అక్టోబరు 31 నాటి పారిస్ తిరుగుబాటు నాయకుల్లో ఒకడు; పారిస్ కమ్యూన్ కాలంలో జైల్లో నిర్బంధింపబడ్డాడు. – 31, 33, 64, 69, 106, 158, 166, 168, 227, 264.

బ్లాంషే (Blanchet), స్టానిస్లా (అసలు పేరు పురీల్) (జననం 1833) – మాజీ సన్యాసి, వ్యాపారి, పోలీసు ఏజెంటు; పారిస్‌పై జర్మన్ ముట్టడి కాలంలో నేషనల్ గార్డులో పనిచేశాడు; పారిస్ కమ్యూన్ సభ్యుడుగా ఎన్నుకోబడ్డాడు; 1871 మేలో రహస్యం బయటుపడటంతో అరెస్టు చెయ్యబడ్డాడు; కమ్యూన్ అణచి వెయ్యబడిన తర్వాత స్విట్జర్లండుకి ప్రవాసం వెళ్ళాడు. – 90.

మజ్జీనీ (Mazzini), జూసెప్పె (1805 – 1872) – ఇటాలియన్ విప్లవవాది, బూర్జువా ప్రజాస్వామికవాది, ఇటాలియన్ జాతీయ విముక్తి ఉద్యమ నాయకుల్లో ఒకడు; 1849లో రోమన్ రిపబ్లిక్ తాత్కాలిక ప్రభుత్వ అధిపతి; 1850లో లండన్‌లో యూరపియన్ సోషల్-డెమోక్రసీ కేంద్ర కమిటీ నిర్వాహకుల్లో ఒకడు; 1864లో మొదటి ఇంటర్నేషనల్ సంస్థాపింపబడుతున్నప్పుడు దాన్ని తన ప్రభావం క్రిందికి తెచ్చుకోవాలని ప్రయత్నించాడు; 1871లో పారిస్ కమ్యూన్‌కీ, మొదటి ఇంటర్నేషనల్ జనరల్ కౌన్సిలుకీ వ్యతిరేకంగా బహిరంగంగా వాదించాడు. – 276.

మర్కోవ్‌స్కీ (Markovsky) – ఫ్రాన్సులో రష్యన్ జారిస్టు ప్రభుత్వపు ఏజెంటు; 1871లో త్యేర్ సర్వీసులో ఉన్నాడు. –87.

మల్‌జార్నాల్ (Maljournal) (జననం సుమారు 1843) – నేషనల్ గార్డు ఆఫీసరు, మొదటి ఇంటర్నేషనల్ సభ్యుడు, నేషనల్ గార్డు కేంద్ర కమిటీ సభ్యుడు, కమ్యూనార్డు. – 71, 207.

మాంటెస్‌క్యూ (Montesquieu), షార్ల్ లూయీ (1689 – 1755) – ప్రముఖ ఫ్రెంచి సాంఘిక శాస్త్రవేత్త, ఆర్థికవేత్త, రచయిత; 18వ శతాబ్దపు వికాస వైతాళికులలో ఒకడు. రాజ్యాంగబద్ధ రాజరిక సిద్ధాంతవేత్త. – 81, 201, 206.

మాన్ (Magne), ఆల్ఫ్రేడ్ – ఫ్రెంచి అధికారి, ప్యేర్ మాన్ కొడుకు, లువార్‌లో పన్నుల కలెక్టర్ జనరల్. – 122, 206.

మాన్ (Magne), ప్యేర్ (1806 – 1879) – ఫ్రెంచి రాజనీతిజ్ఞుడు, బోనపార్టిస్టు, ఆర్థిక మంత్రి (1855 – 60, 1867 – 69, 1870, 1873 – 74).– 122.

మార్క్స్ (Marx), కార్ల్ (1818 – 1883). – 23, 24, 34, 118, 215, 259, 264, 265, 267, 271, 273, 275, 280, 283, 284, 288–292, 300, 301, 308, 319, 321–324, 326, 327, 329, 332.

మాలెట్ (Malet), ఎడ్వర్డ్ (1837 – 1908) – బ్రిటిష్ దౌత్యవ్యవహర్త, పారిస్ రాయబారి కార్యాలయంలో కార్యదర్శి (1867—71). – 295.

మికెల్ (Miquel), యోహన్ (1829 – 1901) – జర్మన్ రాజకీయవేత్త, ఆర్థిక వ్యవహార నిపుణుడు; 1840 దశకంలో కమ్యూనిస్టు లీగ్ సభ్యుడు; దరిమిలా నేషనల్-లిబరల్, రైహ్‌స్టాగ్ (జర్మన్ పార్లమెంటు) సభ్యుడు. –328.

మిరాబో (Mirabeau), ఒనోరే గబ్రియేల్ (1749 – 1791) – 18వ శతాబ్దాంతంలో ఫ్రెంచి బూర్జువా విప్లవంలో ప్రముఖ వ్యక్తి; బడా బూర్జువావర్గంయొక్క, బూర్జువా జీవిత పద్ధతిని అవలంబించిన ప్రభువర్గంయొక్క ప్రయోజనాలను వ్యక్తంచేశాడు. – 53.

మిల్టన్ (Milton), జాన్ (1608 – 1674) – ఇంగ్లీషు మహా కవి, పత్రికా రచయిత, 17వ శతాబ్దం నాటి ఇంగ్లీషు బూర్జువా విప్లవంలో పాల్గొన్నాడు. – 179.

మిల్యేర్ (Millière), జాన్ బాటీస్ట్ (1817 – 1871) – ఫ్రెంచి పత్రికా రచయిత, వామపక్ష ప్రూడనిస్టు; 1871 నాటి జాతీయ అసెంబ్లీ సభ్యుడు, త్యేర్‌ను విమర్శించి, పారిస్ కమ్యూన్‌ని బలపరిచాడు; 1871 మేలో వెర్సేల్స్ వారిచేత కాల్చివెయ్యబడ్డాడు. – 56, 113, 117, 210, 214, 275, 278.

మిల్లర్ (Miller), జోసెఫ్ (జో) (1684 – 1738) – సుప్రసిద్ధ ఇంగ్లీషు హాస్యనటుడు. – 56, 118, 215.

మెక్ మహన్ (MacMahon), మెరీ ఎడ్మె ప్యాట్రిస్ మొరిస్ (1808 – 1893) – ఫ్రెంచి అభివృద్ధినిరోధక సైనిక వ్యక్తి, రాజకీయవేత్త, మార్షల్, బోనపార్టిస్టు; ఫ్రెంచి-ప్రష్యన్ యుద్ధంలో పాల్గొన్నాడు; పారిస్ కమ్యూన్ కసాయి హంతకుల్లో ఒకడు, వెర్సేల్స్ సైన్యం కమాండర్-ఇన్-చీఫ్; మూడవ రిపబ్లిక్ అధ్యక్షుడు (1873 – 79). – 100, 106, 151, 246.

మొలినే (Molinet), వైకౌంట్ డి (మరణం 1871) – ఫ్రెంచి ప్రభువర్గానికి చెందినవాడు, పారిస్‌లో 1871 మార్చి 22న జరిగిన విప్లవ ప్రతీఘాత దాడిలో చంపివెయ్యబడ్డాడు. – 208.

మోటెర్స్‌హేడ్ (Mottershead) థామస్ జి. – ఇంగ్లీషు నేతపనివాడు; మొదటి ఇంటర్నేషనల్ జనరల్ కౌన్సిలు సభ్యుడు (1869 – 72); జనరల్ కౌన్సిల్లోను, బ్రిటిష్ ఫెడరల్ కౌన్సిల్లోను మార్క్సు పంథాను సంస్కరణవాద దృక్పథం నుంచి వ్యతిరేకించాడు. – 267.

రీడ్ (Reid), రాబర్ట్ – బ్రిటిష్ పత్రికా రచయిత, ఫ్రాన్సులో బ్రిటిష్, అమెరికన్ పత్రికలకు విలేకరి (1871), పారిస్ కమ్యూన్ పట్ల సానుభూతి చూపాడు. – 292, 297.

రెనో (Renaut) – ఫ్రెంచి లాయరు, పారిస్ కమ్యూన్ సభ్యుడు రస్తూల్ తరపున 1871లో వెర్సేల్స్ కోర్టులో వాదించాడు. – 300.

రైట్లింజర్ (Reitlinger) – జూల్ ఫ్రావ్ మిత్రుడూ, అంతరంగిక కార్యదర్శీ. – 113.

రొబినే (Robinet), జాన్ ఫ్రాంసువా ఎజేన్ (1825 – 1899) – ఫ్రెంచి వైద్యుడు, చరిత్రకారుడు; పాజిటివిస్టు, రిపబ్లికన్; 1848 నాటి విప్లవంలో పాల్గొన్నాడు; 1870 – 71లో పారిస్ ముట్టడి కాలంలో పారిస్‌లోని ఒక డిస్ట్రిక్టుకి మేయరు;

పారిస్ హక్కుల రిపబ్లికన్ యూనియన్ లీగు సభ్యుడు; కమ్యూన్‌కీ వెర్సైల్స్‌కీ మధ్య రాజీ ఒప్పందం జరగాలని కోరాడు. – 109.

రొషె (Rochat), షార్ల్ – ఫ్రెంచి కార్మికోద్యమంలో ప్రముఖ వ్యక్తి; మొదటి ఇంటర్నేషనల్‌యొక్క పారిస్ ఫెడరల్ కౌన్సిలు సభ్యుడు; కమ్యూనార్డు; మొదటి ఇంటర్నేషనల్ జనరల్ కౌన్సిలు సభ్యుడు. – 330.

రోచ్ (Roach), జాన్ – బ్రిటిష్ కార్మికోద్యమంలో చురుకుగా పనిచేశాడు, మొదటి ఇంటర్నేషనల్ జనరల్ కౌన్సిలు సభ్యుడు (1871 – 72), బ్రిటిష్ ఫెడరల్ కౌన్సిల్ ఉత్తరప్రత్యుత్తరాలు జరిపే కార్యదర్శి (1872), అక్కడ అతను సంస్కరణవాద గ్రూపుకి చెందిన వాడు; మొదటి ఇంటర్నేషనల్ హేగ్ మహాసభ తీర్మానాలను వ్యతిరేకించాడు. – 288.

రోష్-లంబేర్ (Roche-Lambert) – ఫ్రెంచి ఉద్యోగి, పుయ్యే-కర్త్యే అల్లుడు; 1871 లువార్‌లో పన్నుల కలెక్టర్ జనరల్‌గా నియమింపబడ్డాడు. – 122.

లుక్రాఫ్ట్ (Lucraft), బెంజమిన్ (1809 – 1897) – బ్రిటిష్ ఫర్నిచర్ తయారీదారు; బ్రిటిష్ ట్రేడ్‌యూనియన్ల సంస్కరణవాద నాయకుల్లో ఒకడు; మొదటి ఇంటర్నేషనల్ జనరల్ కౌన్సిలు సభ్యుడు (1864 – 71); 1871లో పారిస్ కమ్యూన్‌నీ, "ఫ్రాన్సులో అంతర్యుద్ధం" అనే జనరల్ కౌన్సిలు విజ్ఞప్తినీ ఖండించాడు; సిద్ధాంత పరిత్యాగానికి గాను జనరల్ కౌన్సిలుచేత ఖండింపబడ్డాడు, దాని నుండి అతను ఉపసంహరించుకున్నాడు. – 285, 286, 305.

లక్రెటేల్ (Lacretelle), షార్ల్ (1822 – 1891) – ఫ్రెంచి జనరల్, ఫ్రెంచి-ప్రష్యన్ యుద్ధంలో పాల్గొన్నాడు; పారిస్ కమ్యూన్ కసాయి హంతకుల్లో ఒకడు, వెర్సైల్స్ సైన్యంలో ఒక డివిజనుకి కమాండరు. – 157.

లఫిట్ (Laffitte), జాక్ (1767 – 1844) – పెద్ద ఫ్రెంచి బ్యాంకరు, రాజకీయవాది, ఆర్లియనిస్టు, ఫైనాన్సు బూర్జువావర్గ ప్రతినిధి, ప్రధాన మంత్రి (1830 – 31). – 58, 137.

లఫోన్ (Lafont) – ఫ్రెంచి అధికారి, 1871లో జైళ్ల ఇన్‌స్పెక్టర్ జనరల్. –166.

లమెనే (Lamennais), ఫెలిసిటే (1782 – 1854) – ఫ్రెంచి మతబోధకుడు, పత్రికా రచయిత, క్రిస్టియన్ సోషలిజం సిద్ధాంత కర్త. – 201.

లయన్స్ (Lyons), రిచర్డ్ బిక్కెర్టన్ పెమెల్, ఎర్ల్ (1817 – 1887) – బ్రిటిష్

దౌత్య వ్యవహర్త, వాషింగ్టన్‌లో బ్రిటిష్ ప్రభుత్వ ప్రతినిధి (1858 – 65), కాన్‌స్టాంటినోపుల్‌లోను (1865 – 67), పారిస్‌లోను (1867 – 87) రాయబారి. – 294, 295.

లరోష్‌జక్లేన్ (Larochejacquelein), అంరీ ఒగూస్ట్ జార్జ్, మార్క్విస్ (1805 – 1867) – ఫ్రెంచి రాజకీయవేత్త, లెజిటిమిస్టు పార్టీ నాయకుల్లో ఒకడు; తర్వాత రెండవ సామ్రాజ్య సెనేటరు. – 222.

లాఫార్గ్ (Lafargue), పాల్ (1842 – 1911) – అంతర్జాతీయ కార్మికోద్యమంలో ప్రముఖ వ్యక్తి, మార్క్సిజం ప్రచారకుల్లో ప్రముఖుడు; మొదటి ఇంటర్నేషనల్ జనరల్ కౌన్సిలు సభ్యుడు; ఫ్రాన్సులో (1869 – 70), స్పెయిన్, పోర్చుగలులలో (1871 – 72) ఇంటర్నేషనల్ శాఖలను ఏర్పాటు చెయ్యడంలో తోడ్పడ్డాడు; ఫ్రాన్సులో వర్కర్స్ పార్టీ స్థాపకుల్లో ఒకడు; మార్క్స్ ఎంగెల్సుల శిష్యుడు, సహచరుడు. – 267, 319.

లింకన్ (Lincoln), ఏబ్రహామ్ (1809 – 1865) – ప్రముఖ అమెరికన్ రాజనీతిజ్ఞుడు, రిపబ్లికన్ పార్టీ సంస్థాపకుల్లో ఒకడు, అమెరికా అధ్యక్షుడు (1861 – 65); అమెరికా అంతర్యుద్ధ కాలంలో జనసామాన్యం ఒత్తిడి కారణంగా, విప్లవాత్మక యుద్ధపద్ధతుల పరివర్తనకు దారితీసిన పలు బూర్జువా ప్రజాస్వామిక సంస్కరణలను అమలుజరిపాడు; 1865 ఏప్రిల్లో బానిస యజమానుల ఏజెంటుచేత హత్యచెయ్యబడ్డాడు. – 142, 150, 245.

లిట్రే (Littrè), ఎమీల్ (1801 – 1881) – ఫ్రెంచి బూర్జువా తత్వవేత్త, నిఘంటుకారుడు, రాజకీయవేత్త. – 205.

లీబ్‌క్నెఖ్ట్ (Liebknecht), విల్‌హెల్మ్ (1826 – 1900) – జర్మన్, అంతర్జాతీయ కార్మికోద్యమంలో ప్రముఖ వ్యక్తి, 1848 – 49 విప్లవంలో పాల్గొన్నాడు; కమ్యూనిస్టు లీగ్ సభ్యుడు; మొదటి ఇంటర్నేషనల్ సభ్యుడు; జర్మన్ కార్మికోద్యమంలో లాసాలియనిజంకి వ్యతిరేకంగానూ, ఇంటర్నేషనల్ సూత్రాల కోసమూ పోరాడాడు; 1867 నుండి రైహ్‌స్టాగ్ సభ్యుడు; జర్మన్ సోషల్-డెమోక్రసీ స్థాపకుల్లోను, నాయకుల్లోను ఒకడు; "Der Volksstaat" (1869 – 76) వార్తాపత్రిక సంపాదకుడు; కొన్ని సమస్యల పట్ల రాజీ వైఖరి వహించాడు; ఫ్రెంచి-ప్రష్యన్ యుద్ధ కాలంలోను, పారిస్ కమ్యూన్ కాలంలోను ప్రష్యన్ బడా భూస్వాముల, బూర్జువావర్గంయొక్క దురాక్రమణ పథకాలను గట్టిగా ఖండించాడు;

పారిస్ కమ్యూన్‌ను బలపరచాడు; మార్క్సు ఎంగెల్సుల మిత్రుడు, సహచరుడు. – 321, 329.

లూయీ ఫిలిప్ (Louis Philippe) (1773 – 1850) – ఫ్రాన్సు రాజు (1830 – 48). – 58, 60, 61, 69, 81, 96, 97, 121, 123, 132, 136–139, 144, 145, 157, 217, 219, 221, 226, 241.

లూయీ ఫిలిప్ (Louis Philippe), ఆల్బర్ట్, డ్యూక్ ఆఫ్ ఆర్లియన్స్, పారిస్ కౌంట్ (1838 – 1894) – ఫ్రెంచి రాజు లూయీ ఫిలిప్ మనుమడు, ఫ్రెంచి సింహాసనానికి వారసత్వ అభ్యర్థి. – 243.

లూయీ, పధ్నాల్గవ (Louis XIV) (1638 – 1715) – ఫ్రాన్సు రాజు (1643 – 1715). – 119, 241.

లూయీ, పదహారవ (Louis XVI) (1754 – 1793) – ఫ్రాన్సు రాజు (1774 – 92), 18వ శతాబ్దాంతంలో ఫ్రెంచి బూర్జువా విప్లవ కాలంలో శిరచ్ఛేదం చెయ్యబడ్డాడు. – 30, 164.

లూయీ, పద్దెనిమిదవ (Louis XVIII) (1755 – 1824) – ఫ్రాన్సు రాజు (1814 – 15, 1815 – 24). – 196.

లూయీ నెపోలియన్ – చూ. నెపోలియన్, మూడవ.

లూయీ బోనపార్ట్ – చూ. నెపోలియన్, మూడవ.

లెకాంట్ (Lecomte), క్లాడ్ మర్టిన్ (1817 – 1871) – ఫ్రెంచి జనరల్, ఫ్రెంచి-ప్రష్యన్ యుద్ధంలో పాల్గొన్నాడు; త్యేర్ ప్రభుత్వం నేషనల్ గార్డు ఫిరంగులను పట్టుకోవడంలో విఫలమైన తర్వాత, తిరుగుబాటు సైనికులచేత 1871 మార్చి 18వ కాల్చివెయ్యబడ్డాడు. – 68–70, 74, 96, 98, 99, 123, 125, 202, 223, 226, 227, 233.

లెద్ర్యూ-రోలిన్ (Ledru-Rollin), అలెగ్జాండర్ ఒగూస్త్ (1807 – 1874) – ఫ్రెంచి పత్రికా రచయిత, రాజకీయవేత్త, పెటీబూర్జువా డెమోక్రట్ల నాయకుల్లో ఒకడు; "La Réforme" పత్రిక సంపాదకుడు; తాత్కాలిక ప్రభుత్వ సభ్యుడు (1848), రాజ్యాంగ సభ,శాసన సభలకు ప్రతినిధి, అక్కడ అతను మహీధరం (Montagne) పార్టీకి నాయకత్వం వహించాడు; 1849 జూన్ 13 నాటి ప్రదర్శనా

నంతరం ఇంగ్లండుకి ప్రవాసం వెళ్లాడు, అతను 1870 మొదటి దాకా అక్కడ నివసించాడు; 1871 నాటి జాతీయ అసెంబ్లీ సభ్యుడు, జర్మనీ శాంతి ఒప్పందం చేసుకున్నందుకు నిరసనగా రాజీనామా చేశాడు. – 259.

లెఫ్లో (Le Flô), అడొల్ఫ్ ఎమ్మనుయేల్ షార్ల్ (1804 – 1887) – ఫ్రెంచి జనరల్, రాజకీయవేత్త, దౌత్య వ్యవహర్త, రాజరికవాది; జాతీయ రక్షణ ప్రభుత్వంలోను, త్యేర్ మంత్రివర్గంలోను యుద్ధమంత్రి (1870 – 71), 1871 నాటి జాతీయ అసెంబ్లీ సభ్యుడు; సెయింట్ పీటర్స్‌బుర్గ్‌లో రాయబారి (1848 – 49, 1871 – 79). – 70, 74, 130, 227.

లెమ్మేత్ర్ (Lemaitre), అంటువాన్ లూయీ ప్రాస్పేర్ (మారు పేరు – ఫ్రెడరిక్ లెమ్మేత్ర్) (1800 – 1876) – ఫ్రెంచి నటుడు, నాటక రచయిత, 19వ శతాబ్దపు ఫ్రెంచి నాటక రంగంలో ప్రగతిశీల రొమాంటిసిజంకి ప్రతినిధి, సవిమర్శక వాస్తవికత (critical realism) జనకుడు; రొబేర్ మకేర్ అనే దుష్ట పాత్ర స్రష్టగా ప్రసిద్ధి చెందాడు, జూలై రాచరికం క్రింద పాలక ఫైనాన్స్ ప్రభువర్గం పైన యిది వ్యంగ్య చిత్రణ. – 121.

లెరూ (Leroux), ప్యేర్ (1797 – 1871) – ఫ్రెంచి పెటీబూర్జువా పబ్లిసిస్టు, ఊహాజనిత సోషలిస్టు, క్రిస్టియన్ సోషలిజానికి ప్రతినిధి; ఇంగ్లండులో ప్రవాసి (1851 – 52). – 276.

లోంగె (Longuet), షార్ల్ (1830 – 1903) – ఫ్రెంచి పత్రికా రచయిత; ఫ్రెంచి కార్మికోద్యమ నాయకుల్లో ఒకడు, ప్రూడనిస్టు; మొదటి ఇంటర్నేషనల్ జనరల్ కౌన్సిలు సభ్యుడు (1866 – 67, 1871 – 72); పారిస్ కమ్యూన్ రక్షణలో పాల్గొన్నాడు (1870 – 71); పారిస్ కమ్యూన్ అణచివెయ్యబడిన తర్వాత ఇంగ్లండుకి ప్రవాసం వెళ్లాడు; దరిమిలా ఫ్రాన్సు వర్కర్స్ పార్టీలోని ఒక అవకాశవాద ధోరణి అయిన పాసిబిలిస్టులలో చేరాడు. – 330.

వలంటేన్ (Valentin), లూయీ ఎర్నెస్ట్ – ఫ్రెంచి జనరల్, బోనపార్టిస్టు, 1871 మార్చి 18న తిరుగుబాటుకి సరిగా ముందు తాత్కాలిక పోలీసు ప్రిఫెక్టు. – 65, 66, 94, 120, 134, 153, 165, 205, 210, 244, 250, 261.

వలేన్ (Wahlin) – నేషనల్ గార్డు సభ్యుడు, కమ్యూనార్డు, 1871 మార్చి 22న పారిస్‌లో జరిగిన విప్లవ ప్రతీఘాత దాడిలో చంపబడ్డాడు. – 207.

వ్రషేన్ (Vacheron), లూయీ — ఫ్రెంచి లాయరు; మయ్యేన్‌లో ప్రొక్యురేటర్ జనరల్ (1871). — 124.

వార్లెన్ (Varlin), యూయీ ఎజేన్ (1839 – 1781) — ఫ్రెంచి కార్మికోద్యమంలో ప్రముఖ వ్యక్తి; వృత్తిరీత్యా బుక్‌బైండరు; వామపక్ష ప్రూడనిస్టు; ఫ్రాన్సులోని మొదటి ఇంటర్నేషనల్ శాఖ నాయకుల్లో ఒకడు; నేషనల్ గార్డు కేంద్ర కమిటీ సభ్యుడు; పారిస్ కమ్యూన్ సభ్యుడు; 1871 మే 28న వెర్సేల్స్ వారిచేత కాల్చివెయ్యబడ్డాడు. — 205, 326.

వాహెన్‌హుసెన్ (Wachenhusen), హాన్స్ (1823 – 1898) — జర్మన్ బూర్జువా పత్రికా రచయిత, రచయిత. — 330.

వినువా (Vinoy), జోసెఫ్ (1800 – 1880) — ఫ్రెంచి జనరల్, బోనపార్టిస్టు, 1851 డిసెంబరు 2 నాటి రాజకీయ కుట్రలో పాల్గొన్నాడు; ఫ్రెంచి-ప్రష్యన్ యుద్ధంలో పాల్గొన్నాడు; 1871 జనవరి 22 నుండి పారిస్ గవర్నరు; పారిస్ కమ్యూన్ కసాయి హంతకుల్లో ఒకడు; వెర్సేల్స్ రిజర్వు సైన్యం కమాండరు. — 65, 66, 68, 70, 73, 120, 127, 158, 205, 225, 227, 228 230, 250, 262, 322.

విల్‌హెల్మ్, మొదటి (Wilhelm I) (1797 – 1888) — ప్రష్యా రాజు (1861–88), జర్మన్ చక్రవర్తి (1871 – 88). — 45, 99, 211, 303, 307, 309, 322.

వివ్యేన్ (Vivien), అలెగ్జాండర్ ఫ్రాంసువా (1799 – 1854) — ఫ్రెంచి లాయరు, రాజకీయవేత్త, ఆర్లియనిస్టు; కవేన్యాక్ ప్రభుత్వంలో న్యాయశాఖ మంత్రి (1840), పబ్లిక్ వర్క్స్ శాఖ మంత్రి (1848). — 123.

వెర్మొరేల్ (Vermorel), ఒగూస్ట్ (1841 – 1871) — ఫ్రెంచి పత్రికా రచయిత, ప్రూడనిస్టు, పారిస్ కమ్యూను సభ్యుడు; 1871 మేలో పారిస్‌లో జరిగిన వీధి పోరాటంలో ప్రమాదకరమైన గాయాలకు గురయ్యాడు, ఖైదు చెయ్యబడ్డాడు; నిర్బంధంలో మరణించాడు. — 296.

వెసిన్యే (Vésinier), ప్యేర్ (1826 – 1902) — ఫ్రెంచి పెటీబూర్జువా పత్రికా రచయిత, పారిస్ కమ్యూన్ సభ్యుడు; కమ్యూన్ అణచివెయ్యబడిన తర్వాత ఇంగ్లండుకి ప్రవాసం వెళ్లాడు; మార్క్స్‌నీ, మొదటి ఇంటర్నేషనల్ జనరల్ కౌన్సిలునూ వ్యతిరేకించాడు. — 267, 328.

వెస్టన్ (Weston), జాన్ – బ్రిటిష్ కార్మికోద్యమంలో ప్రముఖుడు; వడ్రంగి, అటు తర్వాత వ్యాపారి; ఓవెనిస్టు; మొదటి ఇంటర్నేషనల్ జనరల్ కౌన్సిలు సభ్యుడు (1864 – 72). – 285.

వేల్స్ (Wales), ప్రిన్స్ – చూ. అలెగ్జాండ్రా.

వాష్‌బర్న్ (Washburne), ఎలిహూ బెంజమిన్ (1816 – 1887) – అమెరికన్ రాజకీయవేత్త, దౌత్యవ్యవహర్త, రిపబ్లికన్ పార్టీ సభ్యుడు; పారిస్‌లో రాయబారి (1869 – 77), పారిస్ కమ్యూన్‌కి వ్యతిరేకంగా కూలద్రోసే, రెచ్చగొట్టే విధానం అవలంబించాడు. – 292–97.

వైయాన్ (Vaillant), ఎడువార్డ్ (1840 – 1915) – ఫ్రెంచి సోషలిస్టు, బ్లాంకిస్టు, పారిస్ కమ్యూన్ సభ్యుడు; మొదటి ఇంటర్నేషనల్ కౌన్సిల్ సభ్యుడు (1871 – 72); ఫ్రాన్సు సోషలిస్టు పార్టీ స్థాపకుల్లో ఒకడు, దరిమిలా సంస్కరణ వాది (రిఫార్మిస్టు) అయ్యాడు. – 33, 205, 330.

వోల్టేర్ (Voltaire), ఫ్రాంసువా మరీ (అసలు పేరు అరుయే) (1694 – 1778) – ఫ్రెంచి ఆస్తికవాద తత్వవేత్త (deist), వ్యంగ్య రచయిత, చరిత్రకారుడు; 18వ శతాబ్దపు బూర్జువా వికాస వైతాళికుడు, నిరంకుశ రాజరికానికీ, రోమన్ కేథలిక్ మతసూత్రాలకీ వ్యతిరేకంగా పోరాడాడు. – 73, 85, 145.

వ్రుబ్లేవ్‌స్కీ (Wroblewski), వాలెరీ (1836 – 1908) – పోలిష్ విప్లవ ప్రజా స్వామికవాది, 1863 – 64 నాటి పోలిష్ తిరుగుబాటు నాయకుల్లో ఒకడు; పారిస్ కమ్యూన్ జనరల్; మొదటి ఇంటర్నేషనల్ జనరల్ కౌన్సిలు సభ్యుడు, పోలెండుకి ఉత్తరప్రత్యుత్తరాలు జరిపే కార్యదర్శి (1871 – 72); హేగ్ మహాసభకి ప్రతినిధి (1872); బకూనినిస్టులకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో చురుకైన పాత్ర వహించాడు. – 88.

షంగర్నీ (Changarnier), నీకొలస్ అన్‌థెయొడుల్ (1793 – 1877) – ఫ్రెంచి జనరల్, బూర్జువా రాజకీయవేత్త, రాజరికవాది; 1848 జూన్ తిరుగుబాటు తదుపరి దుర్గరక్షక దళాలకు, పారిస్ నేషనల్ గార్డుకూ కమాండరు; 1849 జూన్ 13న పారిస్‌లో జరిగిన ఒక ప్రదర్శనను చెదరగొట్టడంలో పాల్గొన్నాడు; 1851 డిసెంబరు 2 నాటి రాజకీయ కుట్ర తర్వాత అరెస్టు చెయ్యబడి దేశ బహిష్కృతుడయ్యాడు; 1859లో ఫ్రాన్సుకు తిరిగివచ్చాడు; ఫ్రెంచి ప్రష్యన్ యుద్ధంలో పాల్గొన్నాడు; 1871 నాటి జాతీయ అసెంబ్లీ సభ్యుడు. –72, 139, 208, 229.

షంజీ (Chanzy), అంటువాన్ ఆల్ఫ్రేడ్ ఎజేన్ (1823 – 1883) – ఫ్రెంచి జనరల్, ఫ్రెంచి-ప్రష్యన్ యుద్ధంలో పాల్గొన్నాడు; 1871 నాటి జాతీయ అసెంబ్లీ సభ్యుడు. – 131, 166.

షంబోర్ (Chambord), ఆన్రీ షార్ల్, కౌంట్ డి (1820 – 1883) – బూర్బన్ పెద్ద వంశవృక్ష ప్రతినిధి, పదవ ఛార్లెస్ మనుమడు; 1830 జూలై విప్లవ విజయానంతరం విదేశాలకు పారిపోయాడు; ఐదవ హెన్రీ పేర ఫ్రెంచి సింహాసన వారసత్వం తనదని వాదించాడు. – 243.

షరేట్ డి లా కొంట్రీ (Charette de la Contrie), అథనాసి, బేరన్ డి (1832 – 1911) – ఫ్రెంచి జనరల్, రాయలిస్టు, ఫ్రెంచి-ప్రష్యన్ యుద్ధంలో పోపు జువావ్‌ల (పోపు కాల్బలం) కమాండరు, తరువాత పశ్చిమం నుండి వచ్చిన వలంటీరు దళం కమాండరు. – 134, 209, 242, 244.

షలేన్ (Chalain), లూయీ డెనీ (జననం 1845) – ఫ్రెంచి టర్నరు; ఫ్రెంచి కార్మికోద్యమంలో చురుకుగా పని చేశాడు; పారిస్ కమ్యూన్ సభ్యుడు, ప్రజా భద్రత, లేబర్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ సభ్యుడు; కమ్యూన్ అణచివెయ్యబడ్డాక ఇంగ్లండుకు ప్రవాసం వెళ్లాడు; అటు తర్వాత అరాజకవాదులతో కలిశాడు. – 330.

షెఫేర్ (Sheffer) – ఫ్రెంచి నేషనల్ గార్డుకి చెందిన సైనికుడు, కమ్యూనార్డు. – 74, 150, 165, 232.

షెరిడన్ (Sheridan), ఫిలిప్ హెన్రీ (1831 – 1888) – అమెరికన్ జనరల్, అమెరికన్ అంతర్యుద్ధం (1861 – 65)లో ఉత్తరాది పక్షాన పాల్గొన్నాడు; ఫ్రెంచి-ప్రష్యన్ యుద్ధకాలంలో, జర్మన్ హెడ్ క్వార్టర్సులో పర్యవేక్షకుడు, అమెరికన్ సైన్యపు కమాండర్-ఇన్-ఛీఫ్ (1884 – 88). – 208.

షల్‌షే (Schölcher), విక్టర్ (1804 – 1893) – ఫ్రెంచి రాజకీయవేత్త, పత్రికా రచయిత, వామపక్ష రిపబ్లికన్; ఫ్రెంచి-ప్రష్యన్ యుద్ధ కాలంలోను, పారిస్ కమ్యూన్ కాలంలోను పారిస్ నేషనల్ గార్డుకి చెందిన ఒక ఫిరంగిదళానికి నాయకత్వం వహించాడు; 1871 నాటి నేషనల్ అసెంబ్లీ సభ్యుడు; త్యేర్ ప్రభుత్వం ముందు కమ్యూన్‌ని లొంగిపోయేలా చెయ్యడంలో విఫలుడయ్యాడు. – 188, 203.

సెస్సే (Saisset), జాన్ (1810 – 1879) – ఫ్రెంచి అడ్మిరల్, రాజకీయ వేత్త, రాజరికవాది; ఫ్రెంచి-ప్రష్యన్ యుద్ధంలో పాల్గొన్నాడు; పారిస్ నేషనల్

గార్డు కమాండరు (మార్చి 20 – 25, 1871), మార్చి 18 నాటి శ్రామిక వర్గ విప్లవాన్ని అణచివేసేందుకు గాను పారిస్‌లోని అభివృద్ధినిరోధక శక్తులను ఐక్యం చెయ్యడానికి తను చేసిన ప్రయత్నాల్లో విఫలుడయ్యాడు; 1871 నాటి జాతీయ అసెంబ్లీ సభ్యుడు. – 72, 131, 141, 188, 208, 209, 229, 241, 247.

సిమొన్ (Simon), జూల్ (1814 – 1896) – ఫ్రెంచి రాజనీతిజ్ఞుడు, భావవాద తత్వవేత్త, మోడరేట్ బూర్జువా రిపబ్లికన్, జాతీయ రక్షణ ప్రభుత్వ సభ్యుడు, ఆ ప్రభుత్వంలోను, త్యేర్ ప్రభుత్వంలోను విద్యాశాఖ మంత్రి (1870 – 73), 1871 నాటి నేషనల్ అసెంబ్లీ సభ్యుడు, పారిస్ కమ్యూన్‌కి వ్యతిరేకంగా పోరాటాన్ని రెచ్చగొట్టినవాళ్లలో ఒకడు, మంత్రిమండలి అధ్యక్షుడు (1876 – 77). – 65, 120, 157.

సుల్లా (Sulla), లూసియుస్ కొర్నేలియుస్ (క్రీ. పూ. 138 – 78) – రోమన్ సేనాధిపతి, రాజనీతిజ్ఞుడు, కాన్సల్ (క్రీ. పూ. 88), డిక్టేటర్ (పురాతన కాలంలో రోమ్ నగరంలో సెనేట్‌చేత నియమించబడిన అత్యున్నతాధికారి) (క్రీ. పూ. 82 – 79). – 62, 101.

సుసాన్ (Susane), లూయీ (1810 – 1876) – ఫ్రెంచి సేనాధిపతి, చాలా సంవత్సరాలపాటు యుద్ధ మంత్రిత్వ శాఖలో శతఘ్నిశాఖ ప్రధానాధికారి; ఫ్రెంచి సైన్య చరిత్రపై పలు రచనలు చేశాడు. – 55, 117, 213.

సెయింట్-ఇలేర్ – చూ. బర్తెలెమీ సెయింట్-ఇలేర్ జూల్.

సెర్రయ్యే (Serraillier), ఒగూస్ట్ (జననం 1840) – ఫ్రెంచి, అంతర్జాతీయ కార్మికోద్యమంలో ప్రముఖుడు; లాస్ట్ (బూట్ల నమూనా తయారీదారు; మొదటి ఇంటర్నేషనల్ జనరల్ కౌన్సిలు సభ్యుడు (1869 – 72); రెండవ సామ్రాజ్య పతనానంతరం, 1870 సెప్టెంబరులో, జనరల్ కౌన్సిలు ప్రతినిధిగా పారిస్‌కి పంపబడ్డాడు; పారిస్ కమ్యూన్ సభ్యుడు; మార్క్స్ పంథాను బలపరచాడు. – 261, 267, 297, 319, 324, 325, 330.

సోర్గె (Sorge), ఫ్రీడ్రిఖ్ అడోల్ఫ్ (1828 – 1906) – అంతర్జాతీయ, అమెరికన్ కార్మిక, సోషలిస్టు ఉద్యమంలో ప్రముఖ వ్యక్తి; జర్మనీలో 1848 నాటి విప్లవంలో పాల్గొన్నాడు; 1852లో అమెరికాకు ప్రవాసం వెళ్లాడు; మొదటి ఇంటర్నేష

నల్‌కి చెందిన అమెరికన్ శాఖల ఆర్గనైజరు; మార్క్సిజాన్ని చురుకుగా ప్రచారం చేశాడు; మార్క్సు ఎంగెల్సుల మిత్రుడు, సహచరుడు. – 331.

హక్స్లే (Huxley), థామస్ హెన్రీ (1825 – 1895) – ఇంగ్లీషు జీవశాస్త్రజ్ఞుడు, ఛార్లెస్ డార్విన్‌కి సన్నిహిత సహచరుడు, అతని సిద్ధాంతానికి వ్యాఖ్యాత; అస్థిర భౌతికవాది. – 84, 178.

హెండర్సన్ (Henderson), ఎడ్మండ్ య్యూమన్స్ వాల్కాట్ (1821 – 1896) – ఇంగ్లీషు ఆఫీసరు, లండన్ పోలీసు శాఖాధిపతి (1869 – 86). – 275.

హెక్కరెన్ (Heeckeren), జార్జ్ షార్ల్ దంతేస్, బేరన్ డి (1812 – 1895) – ఫ్రెంచి రాజకీయవేత్త, రాయలిస్టు; రష్యన్ సైన్యంలో ఆఫీసరు (1834 – 37); 1848 నుండి బోనపార్టిస్టు, రెండవ సామ్రాజ్యపు సెనేటరు, 1871 మార్చి 22న, పారిస్‌లో విప్లవ ప్రతిఘాత దాడిని నిర్వహించినవాళ్లలో ఒకడు. – 71, 207, 229.

హెన్రీ, ఐదవ – చూ. షంబోర్ ఆన్రీ షార్ల్.

హెర్వే (Hervé), ఎద్వార్డ్ (1835 – 1899) – ఫ్రెంచి పత్రికా రచయిత, "Journal de Paris" పత్రిక సంస్థాపకుల్లో ఒకడు, దాని ప్రధాన సంపాదకుడు; రెండవ సామ్రాజ్య పతనానంతరం ఆర్లియనిస్టు. – 102.

హేల్స్ (Hales), జాన్ (జననం 1839) – ఇంగ్లీషు నేతపనివాడు; ట్రేడ్‌యూనియన్ ఉద్యమ నాయకుడు; మొదటి ఇంటర్నేషనల్ జనరల్ కౌన్సిలు సభ్యుడు (1866 – 72), దాని కార్యదర్శి; 1872 నుండి బ్రిటిష్ ఫెడరల్ కౌన్సిల్‌లోని సంస్కరణవాద పక్షానికి నాయకుడు; మొదటి ఇంటర్నేషనల్‌కి చెందిన ఇంగ్లండులోని శాఖల నాయకత్వాన్ని వశంచేసుకొనే ఉద్దేశంతో మార్క్సుకీ, ఆయన అనుచరులకీ వ్యతిరేకంగా పోరాటం సాగించాడు. – 114, 281, 283, 286, 300.

హోలియోక్ (Holyoake), జార్జ్ జాకబ్ (1817 – 1906) – ఇంగ్లీషు పబ్లిసిస్టు, సంస్కరణవాది (రిఫార్మిస్టు); 1830, 1840 దశకాల్లో ఓవెనిస్టులతోను, చార్టిస్టులతోను చేరాడు, ఆటు తర్వాత సహకారోద్యమంలో ప్రముఖ వ్యక్తి అయ్యాడు. – 280, 281, 283, 285.

హోహెన్‌జోలెర్న్లు (Hohenzollerns) – బ్రాండెన్‌బుర్గ్ ఎలెక్టార్ల రాజ వంశం (1415 – 1701), ప్రష్యన్ రాజులు (1701 – 1918), జర్మన్ చక్రవర్తులు (1871 – 1918). – 41, 89.

2240

## పాఠకులకు మనవి

ఈ పుస్తకం అనువాదాన్ని గూర్చి, కూర్పును గూర్చి మీ అభిప్రాయాలను "ప్రగతి" ప్రచురణాలయానికి తెలుపండి.

మీ అభిప్రాయాలను ఈ కింది చిరునామాకు పంపండి:

Progress Publishers
17, Zubovsky Boulevard,
Moscow, USSR

మా ప్రచురణలు దొరికే చోట్లు:

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
చంద్రం బిల్డింగ్స్
విజయవాడ – 520004

విశాలాంధ్ర బుక్ హౌస్
ఏలూరు రోడ్డు
విజయవాడ – 520002

విశాలాంధ్ర బుక్ హౌస్
సుల్తాన్ బజారు
హైదరాబాదు – 500001

విశాలాంధ్ర బుక్ హౌస్
రైల్వే ఫీడర్స్ రోడ్డు
అనంతపురం – 515001

విశాలాంధ్ర బుక్ హౌస్
బజారు వీధి
తిరుపతి – 517501

విశాలాంధ్ర బుక్ హౌస్
సూపర్ బజారు ఎదుట
మెయిన్ రోడ్డు
విశాఖపట్నం — 530002

విశాలాంధ్ర బుక్ హౌస్
జె. పి. యన్. రోడ్డు
మండీ బజారు
వరంగల్ — 506002

విశాలాంధ్ర బుక్ హౌస్
మెయిన్ రోడ్డు
అరండల్ పేట
గుంటూరు — 522002

2240

